
రామాయణం

# రామాయణాంతర్గత సుందరకాండ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

“దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం” అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. “నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది” అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీమద్వాల్మీకి రామాయణాంతర్గత

# సుందరకాండము

బ్రహ్మశ్రీ చదలువాడ సుందరరామశాస్త్రిగారి
ఆంధ్ర తాత్పర్య సహితము

ప్రకాశకులు
వావిళ్ల రామస్వామిశాస్త్రులు & సన్స్
26, రామానుజ అయ్యర్ వీధి, చెన్నై - 600 021
బ్రాంచి: 8, హస్తినాపురం (దక్షిణం) నాగార్జున సాగర్ రోడ్డు
వైశాలీ నగర్ పోష్టు, హైదరాబాదు - 500 079

(సర్వహక్కులు ప్రకాశకులవి)

శ్రీరస్తు

# శ్రీమత్సున్దరకాణ్డపఠనశ్రవణాదిఫలమ్

బ్రహ్మాణ్డే—తతో రావణనీతాయాస్సీతాయాశ్శత్రుకర్శనః,
ఇతి శ్లోకం సమాకర్ణ్య కార్యసిద్ధిం లభేన్నరః.
సుందరాదిమసర్గస్థహనూమద్విక్రమాదికం,
శ్రుత్వాపస్మారకుష్ఠాదిభూతభేతాళనాశనమ్.
స నిర్జిత్య పురీం శ్రేష్ఠామితి శ్లోకాదిమాక్షరం,
శ్రుత్వా బంధాద్విముక్తస్సన్ బ్రహ్మభూయాయ కల్పతే.
సీతాసందర్శనం శ్రుత్వా వీతశోకో భవిష్యతి,
శ్రుత్వా తు త్రిజటాస్వప్నం దుస్స్వప్నో నశ్యతి ధ్రువమ్.
శ్రీరామముద్రికాదానం యే శృణ్వంత్యాదరేణ తు,
నిర్జిత్య శత్రూన్ సంగ్రామే స్థితం రాజ్యం వ్రజంతి తే.
ధన్యా దేవాస్సగంధర్వాస్సిద్ధా ఇత్యత్ర చాదిమం,
శ్రుత్వా చతుర్దశం వర్ణ మసంగో వాయువచ్చరేత్.
హనూమద్గ్రహణం శ్రుత్వా బంధాన్ముచ్యేత మానవః,
లంకాదాహాద్యనుశ్రుత్వా తాపత్రయహతిర్భవేత్.
మంగళాభిముఖీత్యస్మిన్ శ్లోకే యత్ప్రథమాక్షరం,
తద్గాయత్ర్యాః పంచదశం శ్రుత్వా మద్రూపభాగ్భవేత్.
శ్రుత్వా తు పంచమం కాండం హనూమద్విజయాంకితం,
ఆంజనేయప్రసాదేన బ్రహ్మలోకం స గచ్ఛతి.
కాండస్య సుందరాఖ్యస్య శ్రవణాత్పఠనాదపి,
మాం ప్రాప్నుయాజ్జగద్ధేతుం నాత్ర సందేహ ఇష్యతే.

శ్రీః

## పారాయణాదీనాం ప్రత్యేకం శ్రీమద్రామాయణపారాయణకర్తౄణాం

## కర్తవ్యపూజావిధానమ్

ఆచమ్య, ప్రాణానాయమ్య, మమోపాత్త...శుభే శోభనే ముహూర్తే అస్యాం శుభతిథౌ శ్రీసీతాలక్ష్మణభరతశత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్ర దేవతాప్రీత్యర్థం యావచ్ఛక్తి ధ్యానావాహనాదిషోడశోపచారపూజాం కరిష్యే. ఆదౌ నిర్విఘ్నేన పరిసమాప్త్యర్థం గణాధిపతిపూజాం కరిష్యే తదంగత్వేన కలశపూజాం కరిష్యే కలశపూజాం గణపతిపూజాం చ కృత్వా, వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామంటపే మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితం, అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్, తతశ్శ్రీమత్షోడశోపచారైః శ్రీరామధ్యానావాహనాది నైవేద్యాంతపూజా విధేయా. శ్రీసీతారామచంద్ర దేవతాభ్యాం నమః.

## శ్రీమత్సున్దరకాణ్డమహామంత్రానుష్ఠానక్రమః

అస్య శ్రీసుందరకాండమహామంత్రస్య వాల్మీకి ఋషిః, ఆంజనేయో దేవతా. రామదూతాయ కపయ ఇతిబీజం, నమో వాతాత్మజాయ ఇతి శక్తిః, సముద్రతారకాయ ఇతి కీలకం,

సర్వానిష్టనివారణార్థే సర్వాభీష్టసిద్ధ్యర్థే స్తవరకాష్ఠపారాయణే జపే వినియోగః ఉదధిక్రమిణే తుభ్యం నమో రాక్షస మర్దినే, అంగుష్ఠాభ్యాం నమః. ఛాయాగ్రహవినాశాయ సుర సామారకాయ చ, తర్జనీభ్యాం నమః మైనాకదర్శినే తుభ్యం మైనాకగిరిమానినే, మధ్యమాభ్యాం నమః. ఆకాశగామినే దేవమానినే సర్వదాయినే, అనామికాభ్యాం నమః. వాయు పుత్రాయ ధీరాయ లజ్కాదర్పాపహారిణే, కనిష్ఠికాభ్యాం నమః. అక్షహన్త్రే నమస్తుభ్యం పుచ్ఛవహ్ని ప్రదీపినే, కరతల కరపృష్ఠాభ్యాం నమః. ఉదధి...మర్దినే, హృదయాయ నమః. ఛాయా...కాయ చ, శిరసే స్వాహా. మైనాక...మానినే శిఖాయై వౌషట్. ఆకాశ...యినే, కవచాయ హుం. వాయు పుత్రాయ...హారిణే, నేత్రత్రయాయ వౌషట్. అక్షహన్త్రే ...పినే, అస్త్రాయ ఫట్. అష్టమంత్రిసుతానాం చ గర్వభఙ్గ కృతే నమః. భూర్భువ స్సువరోమితి దిగ్బన్ధః.

ధ్యానం—

సర్వానిష్టనివారకం శుభకరం పింగాక్షమక్షాపహం
సీతాన్వేషణతత్పరం కపివరం కోటీన్దుసూర్యప్రభం,
లంకాద్వీపభయఙ్కరం సకలదం సుగ్రీవసమ్మానినం
దేవేంద్రాదిసమస్తదేవవినుతం కాకుత్థ్సదూతం భజే.
బుద్ధిర్బలం యశో ధైర్యం నిర్భయత్వమరోగతా,
అజాడ్యం వాక్పటుత్వం చ హనూమత్స్మరణాద్భవేత్.

# శ్రీవైష్ణవానాం

# శ్రీమద్రామాయణపఠనోపక్రమానుసంధేయక్రమః.

ప్రథమతః 'శ్రీశైలేశ. శ్రీమాన్వేంకటే'త్యాదిస్వస్వసంప్రదాయనిర్వాహకాచార్యానుసంధానం, తతః 'లక్ష్మీనాథే'త్యారభ్య 'ప్రణతోఽస్మి నిత్య' మిత్యంతం, అనంతరం, శ్రీశైలపూర్ణవిషయం'పితా మహస్యే'తి శ్లోకమారభ్య శ్రీభాష్యకారప్రభృతిస్వాచార్యపర్యంతవిషయాస్సాంప్రదాయికశ్లోకాఅనుసంధేయాః యద్వా శ్రీధరాదిస్వాచార్యపర్యంతాః ప్రతివ్యక్తి శ్లోకా అనుసంధేయాః తతః—

కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరం,
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.
వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః,
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాంగతిమ్ ?
యః పిబన్ సతతం రామచరితామృతసాగరం,
అతృప్తస్తం మునిం వందే ప్రాచేతసమకల్మషమ్.
గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసం,
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్.
అంజనానందనం వీరం జానకీశోకనాశనం,
కపీశమక్షహంతారం వందే లంకాభయంకరమ్.
మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం, వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి.

ఉల్లంఘ్య సిన్ధోస్సలిలం సలీలం యశ్శోకవహ్నిం జనకాత్మ
జాయాః, ఆదాయ తేనైవ దదాహ లంకాం నమామి తం ప్రాం
జలిరాంజనేయమ్.
ఆంజనేయమతిపాటలాననం కాంచనాద్రికమనీయవిగ్రహం,
పారిజాతతరుమూలవాసినం భావయామి పవమాననందనమ్.
యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలిం,
బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్.
వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా.
తదుపగతసమాససంధియోగం సమమధురోపనతార్థవాక్యబద్ధం,
రఘువరచరితం మునిప్రణీతం దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్.
శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపం,
ఆజానుబాహుమరవిందదళాయతాక్షం
రామం నిశాచరవినాశకరం నమామి.
వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యేపుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితం,
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరమ్
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్,
తతో యథాశక్తి శ్రీకోశోపరి భగవదారాధనం కర్తవ్యమ్.

---

## పారాయణసమాపనక్రమః

ఏవ మేతత్పురావృత్త మాఖ్యానం భద్రమస్తు వః,
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్.

లాభ_స్తేషాం జయ_స్తేషాం కుత_స్తేషాం పరాభవః,
యేషా మిందీవరశ్యామో హృదయే సుప్రతిష్ఠితః.
కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ,
దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః.
కావేరీ వర్ధతాం కాలేఽకాలే వర్షతు వాసవః,
శ్రీరంగనాథో జయతు శ్రీరంగశ్రీశ్చ వర్ధతామ్.
స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః, గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తు నిత్యం లోకాస్సమస్తా స్సుఖినో భవంతు.
మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే,
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్.
వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే,
పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్.
విశ్వామిత్రాంతరంగాయ మిథిలానగరీపతేః,
భాగ్యానాం పరిపాకాయ భవ్యరూపాయ మంగళమ్.
పితృభక్తాయ సతతం భ్రాతృభిస్సహ సీతయా,
నందితాఖిలలోకాయ రామభద్రాయ మంగళమ్.
త్యక్తసాకేతవాసాయ చిత్రకూటవిహారిణే,
సేవ్యాయ సర్వయమినాం ధీరోదారాయ మంగళమ్.
సౌమిత్రిణా చ జానక్యా చాపబాణాసిధారిణే,
సంసేవ్యాయ సదా భక్త్యా స్వామినే మమ మంగళమ్.
దండకారణ్యవాసాయ ఖండితామరశత్రవే,
గృధ్రరాజాయ భక్తాయ ముక్తిదాయాస్తు మంగళమ్.

పావకం శబరీదత్తఫలమూలాభిలాషిణే,
సౌలభ్యపరిపూర్ణాయ సత్త్వోద్రిక్తాయ మంగళమ్.
హనుమత్సమవేతాయ హరీశాభీష్టదాయినే,
వాలిప్రమథనాయాస్తు మహాధీరాయ మంగళమ్.
శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘితసింధవే,
జితరాక్షసరాజాయ రణధీరాయ మంగళమ్.
ఆసాద్య నగరీం దివ్యామభిషిక్తాయ సీతయా,
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్.
మంగళాశాసనపరైర్మదాచార్యపురోగమైః,
సర్వైశ్చ పూర్వైరాచార్యైస్సత్కృతాయాస్తు మంగళమ్.
తతః పితామహస్యైతాన్యారభ్య స్వాచార్యాంతాన్ శ్లోకా అను సంధేయాః.

---

## శ్రీస్మార్తమాధ్వాదీనాం శ్రీమద్రామాయణ పఠనోపక్రమానుసంధేయక్రమః

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం,
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వవిఘ్నోపశాంతయే.
వాగీశాద్యాస్సుమనసస్సర్వార్థానాముపక్రమే,
యం నత్వా కృతకృత్యాస్స్యుస్తం నమామి గజాననమ్.
తతః శ్రీమచ్ఛంకరాచార్యాదిగురుపరంపరాఽనుసంధేయా,
దోర్భిర్యుక్తా చతుర్భిస్స్ఫటికమణిమయీమక్షమాలాందధానా
హస్తేనైకేన పద్మం సితమపి చ శుకం పుస్తకం చాపరేణ,

భాసా కుందేందుశంఖస్ఫటికమణినిభా భాసమానాఽసమానా
సా మే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా.
కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం,
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.
వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః,
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్?
యః పిబన్ సతతం రామచరితామృతసాగరం,
అతృప్తస్తం మునిం వందే ప్రాచేతసమకల్మషమ్.
గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసం,
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్.
అంజనానందనం వీరం జానకీశోకనాశనం, ।
కపీశమక్షహంతారం వందే లంకాభయంకరమ్.
ఉల్లంఘ్య సింధోస్సలిలం సలీలం యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః, ఆదాయ తేనైవ దదాహ లంకాం నమామి తం ప్రాంజలి రాంజనేయమ్.
ఆంజనేయమతిపాటలాననం కాంచనాద్రికమనీయవిగ్రహం,
పారిజాతతరుమూలవాసినం భావయామి పవమాననందనమ్.
యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలిం,
బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్.
మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం, వాతాత్మజం వానరయూథముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి.

యః కర్ణాంజలిసంపుటైరహరహస్సమ్యక్పిబత్యాదరా
ద్వాల్మీకేర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు,

జన్మవ్యాధిజరావిపత్తిమరణైరత్యన్తసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్విష్ణోః పదం శాశ్వతమ్.
తదుపగతసమాససంధియోగంసమమధురోపనతార్థవాక్యబద్ధం,
రఘువరచరితం మునిప్రణీతం దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్.
వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ,
పునాతి భువనం పుణ్యా రామాయణమహానదీ.
శ్లోకసారసమాకీర్ణం సర్గకల్లోలసంకులం,
కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్.
వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా.
వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యేపుష్పక మాసనే మణిమయే వీరాసనే సుస్థితం,
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్.
వామే భూమిసుతా పురశ్చ హనుమాన్పశ్చాత్సుమిత్రాసుత
శ్శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయోర్వాయ్వాదికోణేషు చ,
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబవా
న్మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్.
నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకా
త్మజాయై, నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు
చంద్రార్కమరుద్గణేభ్యః.
తతః శ్రీకోశోపరి శ్రీరామావాహనాదినైవేద్యాంతపూజా
విధేయా. పారాయణావసానే చ పునః పూజా కర్తవ్యా.

## పారాయణసమాపనసమయానుసంధేయక్రమః

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః,
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకా స్సమస్తాః సుఖినో భవంతు.
కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ,
దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః.
అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః,
అధనా స్సధనా స్సంతు జీవంతు శరదాం శతమ్.
చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరం,
ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్.
శృణ్వన్రామాయణం భక్త్యా యః పాదం పదమేవ వా,
స యాతి బ్రహ్మణస్స్థానం బ్రహ్మణా పూజ్యతే సదా.
రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః.
యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే,
వృత్రనాశే సమభవ త్తత్తే భవతు మంగళమ్.
యన్మంగళం సుపర్ణస్య వినతాఽకల్పయత్పురా,
అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్.
మంగళం కోసలేంద్రాయ మహనీయగుణా(బ్ధయే)త్మనే,

[illegible]
అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్
అదితి ర్మంగళం ప్రాదా త్తత్తే భవతు మంగళమ్.
త్రీన్విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమితతేజసః,
యదాసీన్మంగళం రామ తత్తే భవతు మంగళమ్.
ఋతవ స్సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే,
మంగళాని మహాబాహో దిశంతు తవ సర్వదా.
కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాఽఽత్మనా వా ప్రకృతేస్స్వభావాత్,
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి.

# శ్రీగాయత్రీరామాయణమ్

తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరం,
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్. ౧
స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః,
ఋషిభిః పూజితస్సమ్యగ్యథేంద్రో విజయీ పురా. ౨
విశ్వామిత్రస్స ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితం,
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్. ౩
తుష్టావాస్య తదా వంశం ప్రవిశ్య స విశాంపతేః,
శయనీయం నరేంద్రస్య తదాసాద్య వ్యతిష్ఠత. ౪
వనవాసం హి సంఖ్యాయ వాసాంస్యాభరణాని చ,
భర్తారమనుగచ్ఛంత్యై సీతాయై శ్వశురో దదౌ. ౫
రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులం,
రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణామ్. ౬
నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుం,
ఉటజే రామమాసీనం జటావల్కలధారిణమ్. ౭
యది బుద్ధిః కృతా ద్రష్టుమగస్త్యం తం మహామునిం,
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహాయశాః. ౮
భరతస్యార్యపుత్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో,
మృగరూపమిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి. ౯
గచ్ఛ శీఘ్రమితో రామ సుగ్రీవం తం మహాబలం,

వయస్యం తం కురు క్షిప్రమితో గత్వాఽద్య రాఘవ. ౧౦
దేశకాలౌ ప్రతీక్షస్వ క్షమమాణః ప్రియాప్రియే,
సుఖదుఃఖసహః కాలే సుగ్రీవవశగో భవ. ౧౧
వంద్యాస్తే తు తపస్సిద్ధా స్తపసా వీతకల్మషాః,
ప్రష్టవ్యాశ్చాపి సీతాయాః ప్రవృత్తిం వినయాన్వితైః. ౧౨
స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీం,
విక్రమేణ మహాతేజా హనుమాన్ మారుతాత్మజః. ౧౩
ధన్యా దేవాస్సగంధర్వాస్సిద్ధాశ్చ పరమర్షయః,
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్. ౧౪
మంగళాభిముఖీ తస్య సా తదాసీన్మహాకపేః,
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్. ౧౫
హితం మహార్థం మృదుపూర్వసంహితం
వ్యతీతకాలాయతి సంప్రతిక్షమం,
నిశమ్య తద్వాక్య ముపస్థితజ్వరః
ప్రసంగవా నుత్తరమేతదబ్రవీత్. ౧౬
ధర్మాత్మా రక్షసాం శ్రేష్ఠస్సంప్రాప్తోఽయం విభీషణః,
లంకైశ్వర్యం ధ్రువం శ్రీమానయం ప్రాప్నోత్యకంటకమ్. ౧౭
యో వజ్రపాతాశనిసన్నిపాతా
న్న చుక్షుభే నాపి చచాల రాజా,
స రామబాణాభిహతో భృశార్త
శ్చచాల చాపం చ ముమోచ వీరః. ౧౮
యస్య విక్రమమాసాద్య రాక్షసా నిధనం గతాః,
తం మన్యే రాఘవం వీరం నారాయణమనామయమ్. ౧౯

గతే [illegible] [illegible]వాహినీం,
[illegible]తాః పరమాస్త్రీణా గాంధ[illegible] మహాత్మనా. ౨౦
ప్రణమ్య దేవతాభ్యశ్చ బ్రాహ్మణేభ్యశ్చ మైథిలీ,
బద్ధాంజలిపుటా చేద మువాచాగ్నిసమీపతః. ౨౧
చలనాత్పర్వతేంద్రస్య గణా దేవాశ్చ కంపితాః,
చచాల. పార్వతీ చాపి తదాశ్లిష్టా మహేశ్వరమ్. ౨౨
దారాః పుత్రాః పురం రాష్ట్రం భోగాచ్ఛాదనభాజనం,
సర్వమేవావిభక్తం నో భవిష్యతి హరీశ్వర. ౨౩
యామేవ రాత్రిం శత్రుఘ్నః పర్ణశాలాం సమావిశత్,
తామేవ రాత్రిం సీతాఽపి ప్రసూతా దారకద్వయమ్. ౨౪
ఇదం రామాయణం కృత్స్నం గాయత్రీబీజసంయుతం,
త్రిసంధ్యం యః పఠేన్నిత్యం సర్వపాపైః ప్రముచ్యతే. ౨౫

గాయత్రీరామాయణం సంపూర్ణమ్.

---

# సున్దర కాణ్డము

## దేవతాప్రార్థనా

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం,
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వవిఘ్నోపశాన్తయే.
రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే,
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః.

---

## వాల్మీకిప్రార్థనా

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం,
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్.
వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః,
శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్.

---

## ఆంజనేయప్రార్థనా

అంజనానందనం వీరం జానకీశోకనాశనం,
కపీశమక్షహంతారం వందే లంకాభయంకరమ్.
గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసం,
రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్.
మనోజవం మారుతతుల్యవేగం
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం,
వాతాత్మజం వానరయూథముఖ్యం
శ్రీరామదూతం శిరసా నమామి.

---

# శ్రీ రామాయణ ప్రశంసా

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా.

శ్రీమద్భ్రిష్టా తదేవ బీజమమలం యస్యాఙ్కురశ్చిన్మయః
కాండైస్సప్తభిరన్వితోఽతివితతో ఋష్యాలవాలోదితః,
పత్త్రైస్తత్త్వసహస్రకైస్సువిలసచ్ఛాఖాశతైః పంచభిః
స్వాత్మప్రాప్తిఫలప్రదో విజయతే రామాయణస్వస్తరుః.

యః కర్ణాంజలిసంపుటైరహరహస్సమ్యక్పిబత్యాదరా
ద్వాల్మీకేర్వదనారవిందగలితం రామాయణాఖ్యం మధు,
జన్మవ్యాధిజరావిపత్తిమరణైరత్యంతసోపద్రవం
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్విష్ణోః పదం శాశ్వతమ్.

వాల్మీకిగిరిసంభూతా రామాంభోనిధిసంగతా,
శ్రీమద్రామాయణీ గంగా పునాతు భువనత్రయమ్.

చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరం,
ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్.

శ్రీరస్తు

# శ్రీమద్రామాయణే—సున్దరకాణ్డే

## ప్రథమస్సర్గః.

---

తతో రావణనీతాయాస్సీతాయాశ్శత్రుకర్శనః,
ఇయేష పద మన్వేష్టుం చారణాచరితే పథి. ౧

దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః,
సముదగ్రశిరోగ్రీవో గవాంపతి రివాబభౌ. ౨

అథ వైడూర్యవర్ణేషు శాద్వలేషు మహాబలః,
ధీరస్సలిలకల్పేషు విచచార యథాసుఖమ్. ౩

ద్విజాన్విత్రాసయన్ ధీమానురసా పాదపాన్ హరన్,
మృగాంశ్చ సుబహూన్నిఘ్నన్ ప్రవృద్ధ ఇవ కేసరీ. ౪

నీలలోహితమాంజిష్ఠపత్రవర్ణైస్సితాసితైః,
స్వభావవిహితైశ్చిత్రైర్ధాతుభిస్సమలంకృతమ్. ౫
కామరూపిభిరావిష్ట మభీక్ష్ణం సపరిచ్ఛదైః,

శ్రీరస్తు

# సుందరకాండ తాత్పర్యము

## ప్రథమసర్గము

---

తాత్పర్యము. ఇట్లు జాంబవంతుఁడు పురికొల్పినపిదప శత్రువుల రూపు మాపఁజాలు హనుమంతుఁడు శ్రీరామముద్రికను గైకొని రావణుఁడు సీతం గొనిపోయి యుంచియున్నస్థలంబును వెదకుటకై యాకాశంబునంబోవ నిచ్ఛయించెను. ౧

ఎవ్వరికినిం జేయ నశక్యమయిన సముద్రలంఘనమును ఎదురులేనట్లుగాఁ జేయఁగోరి యున్నతంబులగు తలయును మెడయును గలిగి యొప్పుచుండు నాహనుమంతుఁడు ఆఁబోతెద్దుం బోలి ప్రకాశించెను. ౨

అంత గొప్పబలంబును ధైర్యంబును గల హనుమంతుఁడు మరకత మణులవన్నెగలిగి జలంబువలె చల్లగానుండు లేఁతపచ్చికభూములందు సుఖంబుగా సంచరించెను. ౩

బుద్ధిమంతుండగు హనుమంతుఁడు పక్షుల వెఱపించుచు ఱొమ్మున వృక్షంబులఁ ద్రోయుచు పెక్కుమృగంబులఁ జంపుచు బలిసిన సింహంబుఁ బోలి సంచరించెను. ౪

ఆమహేంద్రపర్వతము క్రిందిభాగము నల్లనివియు తెల్లనివియుఁ బసుపువన్నెగలవియు నాకువన్నెగలవియుఁ దెలుపు నలుపుఁజేరిన వన్నెగల వియుఁ జిత్రంబులును స్వతస్సిద్ధంబులు నయిన మణిసిల మున్నగు గైరికధాతువులచే నలంకరింపఁబడి కామరూపులును అలంకరించికొనియుండువారలు నగు

యక్షకిన్నరగంధర్వై ర్దేవకల్పై శ్చ పన్నగైః. ౬

స తస్య గిరివర్యస్య తలే నాగవరాయుతే,
తిష్ఠన్ కపివర స్తత్ర హ్రదే నాగ ఇవాబభౌ. ౭

స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే,
భూతేభ్యశ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్.. ౮
అంజలిం ప్రాఙ్ము(ఖః) ఖం కృత్వా పవనాయాత్మ యోనయే,
తతో హి వవృధే గంతుం దక్షిణో దక్షిణాం దిశమ్. ౯

ప్లవంగప్రవరై ర్దృష్టః ప్లవనే కృతనిశ్చయః,
వవృధే రామవృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు. ౧౦

నిష్ప్రమాణశరీరస్సన్ లిలంఘయిషురర్ణవం,
(ప్రగృహ్య బలవాన్ బాహూ లఙ్కామభిముఖః స్థితః)
బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్. ౧౧
స చచాలాచలశ్చాపి ముహూర్తం కపిపీడితః,
తరూణాం పుష్పితాగ్రాణాం సర్వం పుష్పమశాతయత్. ౧౨

తేన పాదపముక్తేన పుష్పౌఘేణ సుగంధినా,
సర్వతస్సంవృతశ్శైలో బభౌ పుష్పమయో యథా. ౧౩
తేన చోత్తమవీర్యేణ పీడ్యమానస్స పర్వతః,
సలిలం సంప్రసుస్రావ మదం మత్త ఇవ ద్విపః. ౧౪

యక్షులచేతను కిన్నరులచేతను గంధర్వులచేతను దేవతలంబోలు సర్పంబుల
చేతను ఒప్పుచుండెను. ౫-౬

వానరశ్రేష్ఠుఁడగు నాహనుమంతుఁడు శ్రేష్ఠంబులగు యేనుఁగులతోఁ
గూడియుండు నామహేంద్రపర్వతము క్రిందిభాగమునందుండి కొలంకు
నందలి యేనుఁగుంబోలి ప్రకాశించెను. ౭

ఆ హనుమంతుండు సూర్యునకు దేవేంద్రునకు వాయువునకు బ్రహ్మ
దేవునకు భూతంబులకు చేతులుమొగిడ్చి నమస్కరించి పోవందలంచెను. ౮

సమర్థుండగు హనుమంతుండు తూర్పుమొగంబుగాఁ దిరిగి తన తండ్రి
యయిన వాయువునకుఁ జేతులుమోడ్చి నమస్కరించి యంత దక్షిణపుదిక్కు
నకుఁ బోవుటకై దేహంబు పెంచెను. ౯

ఆ హనుమంతుండు వానరులలో మేటియగువారలు చూచుచుండఁగా
సముద్రముదాఁట నిశ్చయించి రామునకు మేలుగల్గుటకై పర్వకాలములందు
సముద్రముంబోలెఁ బెరిగెను. ౧౦

ఆ హనుమంతుండు అట్లు కొలతలేనట్లు దేహముఁ బెంచి సముద్రము
దాఁటఁగోరి (లంక కెదురుగా నిలచి బాహువు లప్పళించి) యామహేంద్ర
పర్వతంబును చేతులనుం గాళ్లను మర్దించెను. ౧౧

ఆ మహేంద్రపర్వతము 'కదలనిది' అని పేరొందఁబడినదైనను హను
మంతుఁడు పీడింపఁగా రెండుగడియలకాలము కదలుచుండెను. అట్లు చలిం
చుటంజేసి పుష్పించియుండు వృక్షంబుల పూవులన్నియుం రాలినవి. ౧౨

ఆ మహేంద్రపర్వతము వృక్షంబులనుండి రాలిపడిన మంచివాసనగల
పూలనంతటం గప్పఁబడి పూలకొండయనందగి యొప్పుచుండెను. ౧౩

ఎప్పుడును దనంతనే సెలయేఱులవలన జలంబులు విడుచుచుండు
నామహేంద్రపర్వతంబు మహాబలుండగు హనుమంతునిచేఁ బీడింపఁబడి
మదంబునంజేసి తనంతనె మదజలంబు విడుచుచుండు మదపుటేనుంగు మావటి
వానిచేఁ గొట్టఁబడి యినుమిడిగా మదజలము విడుచునట్లు మఱియుం హెచ్చుగాఁ
జలంబు విడిచెను. ౧౪

పీడ్యమానస్తు బలినా మహేంద్రస్తేన పర్వతః,
రీతీ ర్నిర్వర్తయామాస కాంచనాంజనరాజతీః. ౧౫

ముమోచ చ శిలాశ్శైలో విశాలాస్సమనశ్శిలాః,
మధ్యమేనార్చిషా జుష్టో ధూమరాజీరివానలః. ౧౬

గిరిణా పీడ్యమానేన పీడ్యమానాని సర్వతః,
గుహావిష్టాని భూతాని వినేదుర్వికృతైస్స్వరైః. ౧౭

స మహాసత్త్వసన్నాద శ్శైలపీడానిమిత్తజః,
పృథివీం పూరయామాస దిశశ్చోపవనాని చ. ౧౮

శిరోభిః పృథుభిస్సర్పా వ్యక్తస్వస్తికలక్షణైః,
వమంతః పావకం ఘోరం దదంశుర్దశనైశ్శిలాః. ౧౯

తాస్తదా సవిషైర్దష్టాః కుపితైస్తైర్మహాశిలాః,
జజ్వలుః పావకోద్దీప్తా బిభిదుశ్చ సహస్రధా. ౨౦
యాని చౌషధజాలాని తస్మిన్ జాతాని పర్వతే,
విషఘ్నాన్యపి నాగానాం న శేకుశ్శమితుం విషమ్. ౨౧

[అపరే తు మహాకాయా వమన్తోఽగ్నిం స్వతేజసా,
కన్దరేభ్యో వినిష్పేతుః కపిపాదనిపీడితాః.

మహేంద్రపర్వతంబు నట్లు బలవంతుండగు హనుమంతుండు పీడింపఁగా బంగారుజాళ్లు నీలంపుజాళ్లు వెండిజాళ్లు బగులుటంజేసి వానిరేఖ లగపడెను. ౧౫

కాళి, కరాళి, విస్ఫులింగిని, ధూమ్రవర్ణ, విశ్వరుచి, లోహిత, మనోజవ యను పేరుగల సప్తజ్వాలలలో నగ్నినడుమనుండి వెలుంగు 'ధూమ్రవర్ణ' యను జ్వాలతోఁగూడిన నిప్పునుండి పొగలపట్టుకులు బయలువెడలునట్లు హనుమంతునిచేఁ బీడింపఁబడిన యామహేంద్రపర్వతమునుండి పొగవలె నల్లనివైన మణిశిలలం గలిగియుండు గొప్పజాళ్లు వెడలెను. ౧౬

మహేంద్రపర్వతమునందలి గుహాలందున్న భూతంబులు హనుమంతుండాపర్వతంబును మర్దింపఁగా నవి దైన్యంబునంజేసి వికృతంబగు స్వరంబున నేడ్చినవి. ౧౭

ఇట్లు మహేంద్రపర్వతంబు మర్దించుటచేఁ గలిగిన యాగొప్ప భూతంబుల రోదనధ్వని భూమియందును దిక్కులును సమీపమున నుండు తోఁటలును నిండి వినంబడినది. ౧౮

హనుమంతుఁ డామహేంద్రపర్వతంబును బీడించుటంజేసి యాపర్వతమునందుండు సర్పంబులు నలుఁగుడువడి పడగలమీఁద పంపైన మొనలుగల యర్ధచంద్రాకారపు నల్లనిరేఖలుగల గొప్పతలలతో వెలికివచ్చి కోపంబున నా కొండజాళ్లం గఱచినవి. ౧౯

అప్పు డాగొప్పజాళ్లు కుపితంబులయిన యా విషసర్పంబులచేఁ గఱవఁబడి నిప్పు దగిలి మండుచు వేయి తునకలుగాఁ బగిలినవి. ౨౦

ఆ మహేంద్రపర్వతమునందుఁ బుట్టిన యౌషధంబులసమూహంబులు విషముల హరించునవి యయ్యును అప్పు డాసర్పంబుల విషంబు నడంపఁజాలవయ్యె. శ్లో॥ శ్రీరాముఖం

[ఇట్లు ఆంజనేయుని త్రొక్కుడుచే [illegible] దేహములతో మెఱయుచు మఱికొన్ని చిలువలు [illegible]నచు

గిరేరాక్రమమాణస్య తరవ స్తరుణాఙ్కురాః,
ముముచుః పుష్పవర్షాణి వ్యక్తముత్పలగన్ధినః.
గైరికాఞ్జనసంజుష్టా హరితాలసమావృతాః,
వ్యదీర్యన్త గిరేస్తస్య శిలాస్తా స్సమనశ్శిలాః.
సచన్దనారుణ స్తామ్ర శ్చిత్రః కాననధాతుభిః,
క్షీప్తః శిఖనిభై ర్దీప్తై ర్దీప్తగైరికధాతుభిః.]
భిద్యతేఽయం గిరిర్భూతైరితి మత్వా తపస్వినః,
త్రస్తా విద్యాధరా స్తస్మాదుత్పేతుస్త్రీగణైస్సహ. ౨౨
పానభూమిగతం హిత్వా హైమమాసవభాజనం,
పాత్రాణి చ మహార్హాణి కరకాంశ్చ హిరణ్మయాన్. ౨౩
లేహ్యానుచ్చావచాన్భక్ష్యాన్ మాంసాని వివిధాని చ,
ఆర్షభాణి చ చర్మాణి ఖడ్గాంశ్చ కనకత్సరూన్. ౨౪

కృతకంఠగుణాః క్షీబా రక్తమాల్యానులేపనాః,
రక్తాక్షాః పుష్కరాక్షాశ్చ గగనం ప్రతిపేదిరే. ౨౫

హారనూపురకేయూరపారిహార్యధరాః స్త్రియః,
విస్మితాస్సస్మితా స్తస్థురాకాశే రమణైస్సహ. ౨౬

దర్శయంతో మహావిద్యాం విద్యాధరమహర్షయః,
సహితా స్తస్థురాకాశే వీక్షాంచక్రుశ్చ పర్వతమ్. ౨౭

శుశ్రువుశ్చ తదా శబ్దమృషీణాం భావితాత్మనాం,

బయలుదేఱినవి. ఆతని పాదపీడచేఁ గాసింబడి వృక్షములన్నియుఁ బూవులు దుల్లినవి. రసాంజనసౌవీరములు హారిదళము మణిసిల మొదలగు ధాతువులతోడి రాళ్లు పట్టునఁ బగిలెను. అప్పు డాకొండ రక్తచందనముచే నెఱ్ఱనై గైరికధాతువులచే దీపములు పెట్టినట్లు మిగుల నందముగా వెలిఁగెను.]

ఈపర్వతంబు దీనికి సంబంధించిన పృథివ్యప్తేజోవాయ్వాకాశంబులతోఁగూడ నిప్పుడు పగులునట్లున్నది. అని తలంచి అచ్ఛోటనుండు బుధు లాపర్వతంబు విడిచి యాకాశంబుఁ బొందిరి. విద్యాధరులును భయంబునఁ దమస్త్రీలం గూడి పానభూమియం దున్నబంగారు సారాయిపాత్రములను గొప్పవిలువగలపాత్రంబులను బంగారుతోఁ జేసిన గిండివంటి పాత్రంబులను తేనెమొదలగు లేహ్యంబులను నానావిధంబు లగుపిండివంటలను వివిధంబులగు మాంసంబులను ఎద్దుచర్మముతోఁ జేసినడాలువాలును బంగారుపిడుల ఖడ్గంబులను విడిచి యాపర్వతంబుననుండి పైకెగిరిరి. ౨౨-౨౩-౨౪

కంఠంబునఁ బూలదండలు ధరించి శిరంబున నెఱ్ఱనిపుష్పమాలికల నలంకరించుకొని దేహంబున నెఱ్ఱనిగంధంబు నలఁదికొని సారాయి మదంబునం జేసి యెఱ్ఱగానుండు తామరపూలం బోలుకండ్లతో నుండు నావిద్యాధరులందఱు నాకాశంబుఁ జేరిరి. ౨౫

హారంబులు నందెలు బాహుపురులుఁ గంకణంబులును ధరించి యొప్పుచుండువిద్యాధరస్త్రీలు ఆపర్వతం బట్లు పగులుట కాశ్చర్యపడి చిఱునగవు సేయుచు రమణులతోఁగూడి యాకాశంబునం దుండిరి. ౨౬

విద్యాధరులలో శ్రేష్ఠు లగువారందఱు నొకటిగాఁగూడి నిరాధారంబుగ నాకాశంబునం దుండుట మొదలగు నణిమాదిసిద్ధులం జూపుచు నాకాశంబునందుండి పర్వతంబుఁ జూచుచుండిరి. ౨౭

అప్పు డా విద్యాధరులు స్వచ్ఛంబగు నాకాశంబునఁ బరమాత్మ

చారణానాం చ సిద్ధానాం స్థితానాం విమలేఽంబరే. ౨౮

ఏష పర్వతసంకాశో హనుమాన్మారుతాత్మజః,
తితీర్షతి మహావేగస్సముద్రం మకరాలయమ్. ౨౯

రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరం,
సముద్రస్య పరం పారం దుష్ప్రాపం ప్రాప్తుమిచ్ఛతి. ౩౦

ఇతి విద్యాధరాశ్శ్రుత్వా వచస్తేషాం మహాత్మనాం,
తమప్రమేయం దదృశుః పర్వతే వానరర్షభమ్. ౩౧

దుధువే చ స రోమాణి చకంపే చాచలోపమః,
ననాద సుమహానాదం సుమహానివ తోయదః. ౩౨

ఆనుపూర్వ్యేణ వృత్తం చ లాంగూలం లోమభిశ్చితం,
ఉత్పతిష్యన్ విచిక్షేప పక్షిరాజ ఇవోరగమ్. ౩౩

తస్య లాంగూలమావిద్ధమాత్తవేగస్య పృష్ఠతః,
దదృశే గరుడేనేవ హ్రియమాణో మహోరగః. ౩౪

బాహూ సంస్తంభయామాస మహాపరిఘసన్నిభౌ,
ససాద చ కపిః కట్యాం చరణౌ సంచుకోచ చ. ౩౫

సంహృత్య చ భుజౌ శ్రీమాన్ తథైవ చ శిరోధరాం,
తేజస్సత్త్వం తథా వీర్యమావివేశ స వీర్యవాన్. ౩౬

ధ్యానంబు సేయుచుండు ఋషులును చారణులును సిద్ధులును బలుకుకొను మాటలను వినిరి. ౨౮

కొండంతటిదేహంబు గలవాఁడు నధికంబగు వేగముగలవాఁడు వాయుదేవుని కుమారుండు నగు నీహనుమంతుండు ఎచ్చుగా మొసళ్లు గలిగి భయంకరంబుగ నుండు సముద్రమును దాఁటఁ గోరుచున్నాఁడు. ౨౯

హనుమంతుఁడు రామునికొఱకు అట్లు రామకార్యంబునం దభిమానించియుండు వానరులకొఱకును ఎవ్వరికినిఁ జేయ నలవిగానిపనిం జేయఁబూని ఎట్టివారికినిఁ బోవ నశక్యమయిన సముద్రంబు నవ్వలిగట్టునకుఁ బోవఁదలంచియున్నాఁడు. అని ఋషులు మున్నగువారలు చెప్పుకొనఁగా విద్యాధరులు వినిరి. ౩౦

విద్యాధరు లిట్లు మహాత్ములగు నాఋషులు మొదలయినవారిమాటలను విని మహేంద్రపర్వతంబునఁ గొలతకురాని దేహరీతితోఁ గ్రాలుచుండు హనుమంతునిం జూచిరి.

కొండంతటి మేనుగల యాహనుమంతుఁడు ఉత్సాహంబున వెండ్రుకలు విదిర్చెను. అట్టిట్టు కదలెను. గొప్పమేఘంబువలె మహాధ్వని కల్గునట్లుగా నటించెను. ౩౨

ఆ హనుమంతుఁడు ఎగురఁబోవువాఁడై అఁదోకగానుండి వెండ్రుకలతో నిండియుండు తనతోఁకను గరుత్మంతుఁడు సర్పమును విదుర్చునట్లు విదిర్చెను. ౩౩

వేగవంతుఁ డగునాహనుమంతుని వెనుకతట్టు వంకరగా వ్రేలాడుచుండు వాలంబు గరుడుఁడు గొప్పసర్పంబును గాళ్లఁ దన్నుకొనిపోఁగా నది యతని వెనుకను వేలాడునట్లు కన్పట్టినది. ౩౪

ఆ హనుమంతుఁడు గొప్పయినుపగుదియలఁబోలు తనబాహువుల స్తంభించి యూపిరినూర్ధ్వముఖంబుగా బిగియఁబట్టి నడుము సన్నముగాఁ జేసి పాదంబులు ముడుచుకొని సముద్రంబు దాఁట నుద్యుక్తుం డయ్యెను. ౩౫

అందఱికన్న నధికుండును బరాక్రమశాలియు నయిన యాహనుమంతుఁడు భుజంబులను మెడను బిగియఁబట్టి తన కున్న తేజంబు బలంబు వీర్యంబు నంతయుం బూనెను. ౩౬

మార్గమాలోకయన్ దూరాదూర్ధ్వం ప్రణిహితేక్షణః,
రురోధ హృదయే ప్రాణానాకాశ మవలోకయన్. ౩౭

పద్భ్యాం దృఢమవస్థానం కృత్వా స కపికుంజరః,
నికుంచ్య కర్ణౌ హనుమానుత్పతిష్య న్మహాబలః. ౩౮

వానరా న్వానరశ్రేష్ఠ ఇదం వచనమబ్రవీత్,
యథా రాఘవనిర్ముక్త శ్శరశ్శ్వసనవిక్రమః. ౩౯

గచ్ఛేత్తద్వద్గమిష్యామి లంకాం రావణపాలితాం
న హి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్. ౪౦
అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయం,
యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యామ్యకృతశ్రమః. ౪౧
బద్ధ్వా రాక్షసరాజానమానయిష్యామి రావణం,
సర్వథా కృతకార్యోఽహమేష్యామి సహ సీతయా. ౪౨

ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణాం.
ఏవముక్త్వా తు హనుమాన్వానరా న్వానరోత్తమః. ౪౩

ఉత్పపాతాథ వేగేన వేగవానవిచారయన్,
సుపర్ణమివ చాత్మానం మేనే స కపికుంజరః. ౪౪
సముత్పతతి తస్మిం స్తు వేగాత్తే నగరోహిణః,
సంహృత్య విటపాన్ సర్వాన్ సముత్పేతుస్సమంతతః. ౪౫
సమత్తకోయష్టిమకాన్ పాదపాన్ పుష్పశాలినః,
ఉద్వహన్నూరువేగేన జగామ విమలేఽంబరే. ౪౬

ఆ హనుమంతుండు దూరముగా మార్గంబుఁ జూచుచు ఊర్ధ్వంబుగా దృష్టించి యాకాశంబుఁ జూచుచు ముక్కున నుచ్ఛ్వాసనిశ్శ్వాసంబులను విడియఁబట్టెను. ౩౭

వానరశ్రేష్ఠుండు గొప్పబలంబుగలవాఁడు నగుహనుమంతుఁడు కాళ్లను దృఢంబుగా నూనుకొని చెవులు ముడుచుకొని యెగురఁబోవువాఁడై తన సమీపంబుననున్న జాంబవంతుఁడు మొదలగువానరులం జూచి యిట్లని చెప్పెను.

రాముఁడు విడిచినబాణం బెట్లు వాయువేగంబునఁ బోవునో అట్లతి వేగంబున నేను ఎచ్చటను ఎంతమాత్రమును జాగుసేయక యప్రతిహతంబుగా రావణునిచేఁ బాలింపఁబడుచుండు లంకకుఁ బోయెదను. ౩౯

నేను లంకాపురియందు సీతంజూడనేని యీవేగంబుతోడనే స్వర్గంబునకుం బోయెదను. ౪౦

స్వర్గంబునందును సీత నా కగపడదేని యంత నలసటనొందక మరల లంకకుఁబోయి రాక్షసులకుఁ బ్రభుఁడగు రావణునిబంధించి యిచ్చుటకిఁ దెచ్చెదను.

నే నేవిధంబుననైనను కృతార్థుండనై సీతఁ గొనివచ్చెదను. కాదేని రావణునితోఁగూడ లంకఁ బెల్లగించి యిచ్చుటకిఁ దెచ్చెదను. అని హనుమంతుఁడు జాంబవంతుఁడు మున్నగువారలతోఁ జెప్పెను. ౪౨

అంత నా వానరశ్రేష్ఠుఁ డయిన హనుమంతుఁ డట్లు జాంబవంతుండు మున్నగువానరులఁ జూచి పలికి మిగుల వేగంబుగలవాఁడు కావున నెంతమాత్రమును సంశయముంచక వేగంబున నాకాశంబున కెగిరెను. ౪౩

వానరులలో మేటియయిన యాహనుమంతుఁడు 'తాను గరుత్మంతుఁడు బోలె నాకాశంబునం బోవ సమర్థుం' డని అప్పుడు తలంచెను. ౪౪

ఆహనుమంతుఁ డెగురఁగానే యతనివేగమువలన నాపర్వతంబునందలి వృక్షంబులన్నియుఁ దమకొమ్మలతోఁగూడ నంతటను బైకెగిరినవి. ౪౫

ఆహనుమంతుండు మదించిన చీమఁగొక్కెరలంగల్గి పుష్పంబులతో నొప్పుచుండువృక్షంబులఁ దనతొడలవేగంబున నెగఁబట్టి యీడ్చికొని యాకాశంబునఁ బోయెను. ౪౬

ఊరువేగోద్ధతా వృక్షా ముహూర్తం కపిమన్వయుః,
ప్రస్థితం దీర్ఘమధ్వానం స్వబంధుమివ బాంధవాః. ౪౭

తమూరువేగోన్మథితాస్సాలాశ్చాన్యే నగోత్తమాః,
అనుజగ్ముర్హనూమంతం సైన్యా ఇవ మహీపతిమ్. ౪౮

సుపుష్పితాగ్రైర్బహుభిః పాదపైరన్వితః కపిః,
హనుమాన్పర్వతాకారో బభూవాద్భుతదర్శనః. ౪౯

సారవంతోఽథ యే వృక్షా న్యమజ్జన్ లవణాంభసి,
భయాదివ మహేంద్రస్య పర్వతా వరుణాలయే. ౫౦
స నానాకుసుమైః కీర్ణః కపిస్సాంకురకోరకైః,
శుశుభే మేఘసంకాశః ఖద్యోతైరివ పర్వతః. ౫౧

విముక్తాస్తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః,
అవశీర్యంత సలిలే నివృత్తాస్సుహృదో యథా. ౫౨

లఘుత్వేనోపపన్నం తద్విచిత్రం సాగరేఽపతత్,
ద్రుమాణాం వివిధం పుష్పం కపివాయుసమీరితమ్. ౫౩

తారాశతమివాకాశం ప్రబభౌ స మహార్ణవః,

ఇట్లూరువేగంబున నెగిరినవృక్షంబులు బంధువులు చాలదూరము ప్రోదలంచిన తమ బాంధవజనముల సాగనంపునట్లు కొంచెముసేపు హనుమంతుని వెంబడించినవి. ౪౭

మద్దిచెట్లును మఱియు నితరములైన గొప్పవృక్షంబులును హనుమంతునియూరువేగంబునం బైకెగరి సైనికులు రాజునుంబోలె నాహనుమంతుని వెంబడించినవి. ౪౮

పర్వతంబువంటి దేహంబుగల యా హనుమంతుఁడు చక్కఁగాఁ బూచియుండు పెక్కువృక్షంబులనడుమనుండి చూచినవారల కాశ్చర్యంబు గలిగించెను. ౪౯

అంత దేవేంద్రునిభయంబునఁ బర్వతంబులు సముద్రంబునఁ బడునట్లు అందు బరువుగల వృక్షంబులు సముద్రంబునంబడి మునింగినవి. ౫౦

ఆకాశంబున గొప్పశరీరముతోఁ బోవుటంజేసి మేఘంబువలెఁ గనుపట్టుచుండు నాహనుమంతుని దేహంబంతయుం జెట్లని మొలకలును, మొగ్గలును, బుష్పంబులును వ్యాపింపఁగా నతఁడు రాత్రియందు మిణుంగుఱుఁ బుఱుగులతో నొప్పుచుండు పర్వతంబువోలెఁ బ్రకాశించెను. ౫౧

హనుమంతుండు క్రమముగా దూరముపోవుటచే నతనివేగముతోడి సంబంధము ఆవృక్షంబులకు వదలుటంజేసి యవి పుష్పంబుల విడిచి (పుష్పంబులు చెట్లకన్నఁ దేలికయయినవి కావున నవి యాకాశంబునందే మఱికొంతసేపుండినవి.) 'ఓదకాంతాత్స్నిగ్ధో బంధు మనువ్రజేత్' (నీటి సమీపమువఱకు స్నేహితుండు తన బంధువును వెంబడింపవలయును.) అని చెప్పంబడిన రీతిని పయనంబైపోవు బంధువును వెంబడించి నీటిసమీపంబున మరలు స్నేహితులువలె మరలి సముద్రజలంబులందుఁ బడినవి. ౫౨

ఆవృక్షంబుల నానావిధంబులగు పుష్పంబులు హనుమంతుని వేగంబునం గలిగినగాలిచే నెగయఁగొట్టఁబడి తేలికయగుటంజేసి చాలదూర మతని వెంబడించి యాశ్చర్యంబుగ సముద్రంబునం బడినవి. ౫౩

అట్టు రాలిన పుష్పంబులతోఁ గూడిన సముద్రంబు నక్షత్రంబులం గలిగిన యాకాశమువలె నొప్పుచుండెను.

పుష్పౌఘేణానుబద్ధేన నానావర్ణేన వానరః. ౫౪
బభౌ మేఘ ఇవాకాశే విద్యుద్గణవిభూషితః,

తస్య వేగసమాధూతైః పుష్పైస్తోయమదృశ్యత. ౫౫
తారాభిరభిరామాభి రుదితాభి రివాంబరం,

తస్యాంబరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ. ౫౬
పర్వతాగ్రాద్వినిష్క్రాంతౌ పంచాస్యావివ పన్నగౌ,

పిబన్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్. ౫౭
పిపాసురివ చాకాశం దదృశే స మహాకపిః,

తస్య విద్యుత్ప్రభాకారే వాయుమార్గానుసారిణః. ౫౮
నయనే విప్రకాశేతే పర్వతస్థావివానలౌ,

పింగే పింగాక్షముఖ్యస్య బృహతీ పరిమండలే. ౫౯
చక్షుషీ సంప్రకాశేతే చంద్రసూర్యావివోదితౌ,

ముఖం నాసికయా తస్య తామ్రయా తామ్రమాబభౌ. ౬౦
సంధ్యయా సమభిస్పృష్టం యథా తత్సూర్యమండలం,
లాంగూలం చ సమావిద్ధం ప్లవమానస్య శోభతే. ౬౧
అంబరే వాయుపుత్రస్య శక్రధ్వజ ఇవోచ్ఛ్రితః,

లాంగూలచక్రేణ మహాన్ శుక్లదంష్ట్రోఽనిలాత్మజః. ౬౨
వ్యరోచత మహాప్రాజ్ఞః పరివేషీవ భాస్కరః,

ఆకాశమునందు హనుమంతుండు ఇంకను విడువక తనదేహంబు నంటి యుండు విచిత్రంబులయిన పుష్పంబులతోఁ గూడి మెఱపులతోఁగూడిన మేఘంబుఁబోలె నొప్పుచుండెను. ౫౪

ఆ హనుమంతుని వేగంబున నెగురఁగొట్టఁబడి రాలినపుష్పంబులతోఁ గూడిన సముద్రజలంబు సుందరంబులగు నక్షత్రంబులతోఁ గూడిన యాకాశంబువలె నగపడెను. ౫౫

ఆకాశమునం జాపఁబడి గొప్పవయిన వ్రేళ్లుగలవియగు పర్వతాకారుఁడయిన యాహనుమంతుని బాహువులు పర్వతశిఖరంబునుండి బయలు వెడలినట్టి యయిదుతలలపాములంబోలె నగపడినవి. ౫౬

ఆ హనుమంతుండు సముద్రంబునకు దగ్గఱగాఁ బోవునపుడు అలలతోఁగూడ సముద్రమును ద్రాగునో యనందగి యొప్పెను. అట్లు దూరముగాఁ బోవునపుడు ఆకాశమును మ్రింగునట్లు చూపట్టెను. ౫౭

ఆకాశంబునం బోవుచున్న పర్వతాకారుండగు నా హనుమంతుని మెఱపులుంబోలె మెఱయు నేత్రములురెండును పర్వతంబుపైనున్న రెండగ్నిహోత్రంబులవలె నుండినవి. ౫౮

వానరశ్రేష్ఠుండగు నా హనుమంతుని పింగళంబులై యంతటను గుండ్రములుగానుండు పెద్దకండ్లు రెండును ఏకకాలంబున నుదయించిన చంద్రసూర్యు లనందగి యొప్పుచుండినవి. ౫౯

ఆహనుమంతుని యొఱ్ఱనిముఖంబు ఎఱ్ఱనిముక్కుఁగలిగి సంధ్యాకాలంబున సంధ్యారాగంబుతోఁగూడిన సూర్యమండలంబువోలెఁ బ్రకాశించెను. ౬౦

ఆకాశంబునందు ఎగిరిపోవుచున్న హనుమంతుని యున్నతముగా నిలచియుండు వాలంబు పూజార్థంబుగా నెత్తఁబడియుండు నింద్రధ్వజంబువలె నగపడినది. ౬౧

తెల్లనికోఱలు గలిగి గొప్పదేహంబుతోనుండు మహాపండితుండగు నాహనుమంతుండు చక్రమువలె గుండ్రముగానుండు తోఁక గలిగియుండు నపుడు పరివేషంబునొందిన సూర్యునివలె నొప్పుచుండెను. ౬౨

స్ఫిగ్దేశేనాభితామ్రేణ రరాజ స మహాకపిః. ౬౩
మహతా దారితేనేవ గిరిర్గైరికధాతునా,

తస్య వానరసింహస్య ప్లవమానస్య సాగరమ్. ౬౪
కక్షాంతరగతో వాయుర్జీమూత ఇవ గర్జతి,
ఖే యథా నిపతంత్యుల్కా హ్యుత్తరాంతాద్వినిస్సృతా. ౬౫
దృశ్యతే సానుబంధా చ తథా స కపికుంజరః,

పతత్పతంగసంకాశో వ్యాయతశ్శుశుభే కపిః. ౬౬
ప్రవృద్ధ ఇవ మాతంగః కక్ష్యయా బధ్యమానయా,

ఉపరిష్టాచ్ఛరీరేణ ఛాయయా చావగాఢయా. ౬౭
సాగరే మారుతావిష్టా నౌరివాసీత్తదా కపిః,

యం యం దేశం సముద్రస్య జగామ స మహాకపిః. ౬౮
స స తస్యోరువేగేన సోన్మాద ఇవ లక్ష్యతే,

సాగరస్యోర్మిజాలానామురసా శైలవర్ష్మణామ్. ౬౯
అభిఘ్నంస్తు మహావేగః పుప్లువే స మహాకపిః,

కపివాతశ్చ బలవాన్ మేఘవాతశ్చ నిస్సృతః. ౭౦
సాగరం భీమనిర్ఘోషం కంపయామాసతుర్భృశం,

ఆ హనుమంతుఁడు అంతటను ఎఱ్ఱగానుండు గొప్పపిఱుఁదులుగలిగి యుండుటంజేసి రెండుబ్రద్దలుగాఁ జేయఁబడిన గొప్పధాతుశిలం గలిగియుండు పర్వతంబువలెఁ బ్రకాశించెను. ౬౩

ఇట్లు సముద్రమును దాఁటుచున్న యాహనుమంతుని చంకలనడుమం గలిగినగాలి మేఘంబు గర్జించునట్లు ధ్వనించుచుండెను. ౬౪

ఆకాశమునందు ఉత్తరపుదిక్కునుండి దక్షిణపుమొగముగాఁ దోఁక తోఁగూడిన తోఁకచుక్క యాదేశంబునకుఁ బీడను సూచించుచుఁ బడునట్లు ఆహనుమంతుండు తోఁకతోఁగూడి, దక్షిణపుదిక్కు మొగముగా రావణునకుఁ గీడుదెచ్చుటకై పోవుచుండెను. ౬౫

సూర్యునితో సమానంబుగా నాకాశంబునం బోవుచున్న దీర్ఘదేహం డగునాహనుమంతుండు నడుమున మోకుతోఁ గట్టగా దీర్ఘముగా దేహముఁ బెంచిన యేనుంగువలె నుండెను. ౬౬

అప్పుడు హనుమంతునిదేహం బాకాశంబునను దానినీడ సముద్రంబునను రెండు నేకాకారంబుగాఁ జూపట్టుటంజేసి సముద్రంబునఁ గ్రింది భాగంబు మునింగియుఁ, బైభాగం బాకాశంబు నావరించియు నుండఁగా వాయువశంబునం బోవుచున్నయోడవలె నాహనుమంతుఁడు కనుపట్టెను. ౬౭

ఆహనుమంతుఁడు సముద్రమునందు ఏప్రదేశములకుఁ బోయెనో ఆ ప్రదేశములన్నియుం నతని యూరువేగంబునఁ దిరుగుడుపడి నురుఁగువిడుచుచుఁ బైకెగురుచున్న జలంబుగలిగి చిత్తభ్రమంబు నొందిన ట్లగపడినవి. ౬౮

ఆహనుమంతుండు సముద్రమును దాఁటుచుండఁగా సముద్రమునందలి గొప్పయలలు అతని విశాలంబగు ఱొమ్మునం గల్గినవాయువువలన నిసుమడిగాఁ గదలినవి. ౬౯

అప్పుడు హనుమంతుం డెగిరిపోవుటవలనం గలిగినవాయువు మేఘము వచ్చుటకై కొట్టునుత్తరపుగాలియును బలవంతంబులగు నీరెండువాయువులునుం గూడి సముద్రమును అధికమయినధ్వని గలుగునట్లుగాఁ గలిగించినవి. "దక్షిణపు దిక్కునుగూర్చిపోవు హనుమంతునకు శుభసూచకంబుగా ననుకూలమయిన

వికర్షన్నూర్మిజాలాని బృహంతి లవణాంభసి. ౭౧
పుప్లువే కపిశార్దూలో వికిరన్నివ రోదసీ,

మేరుమందరసంకాశానుద్గతాన్ స మహార్ణవే. ౭౨
అతిక్రామ న్మహావేగ స్తరంగాన్ గణయన్నివ,

తస్య వేగసముద్ధూతం జలం సజలదం తదా. ౭౩
అంబరస్థం విబభ్రాజ శారదాభ్రమివాతతం,

తిమినక్రఝషాః కూర్మా దృశ్యంతే వివృతా స్తదా. ౭౪
వస్త్రాపకర్షణేనేవ శరీరాణి శరీరిణాం,

ప్లవమానం సమీక్ష్యాథ భుజంగాస్సాగరాలయాః. ౭౫
వ్యోమ్ని తం కపిశార్దూలం సుపర్ణ ఇతి మేనిరే,

దశయోజనవి స్తీర్ణా త్రింశద్యోజనమాయతా. ౭౬
ఛాయా వానరసింహస్య జలే చారుతరాఽభవత్,

శ్వేతాభ్రఘనరాజీవ వాయుపుత్రానుగామినీ. ౭౭
తస్య సా శుశుభే ఛాయా వితతా లవణాంభసి,

శుశుభే స మహాతేజా మహాకాయో మహాకపిః. ౭౮
వాయుమార్గే నిరాలంబే పక్షవానివ పర్వతః,

యుత్తరపుగాలికొట్టునట్లు వర్ణించుట యతనికి జయంబును సూచించుచున్నది."

వానరశ్రేష్ఠుండగు హనుమంతుఁడు సముద్రము దాఁటునపు డావేగంబునకు సముద్రమునందలి యలలు అతఁడు వాని నీడ్చుకొనిపోవునట్లు అతని వెనుకొనిపోఁగా హనుమంతుఁడు భూమియు నాకాశమును విభాగింపఁదలంపుగొని యావరించుకొనియుండు సముద్రమునందలియలల నీడ్చుకొనిపోవునట్లు అగపడెను. ౨౧

మహావేగుం డగు నాహనుమంతుండు సముద్రమునం దనవేగంబుచే లేచిన మేరుమందరపర్వతంబులకు సరివచ్చుతరంగంబులు లెక్కపెట్టువాఁడువలె దాఁటెను. ౨౨

అప్పు డాహనుమంతునియూరు వేగంబునఁ బైకిలేచి యాకాశంబు నొంది యచ్చటనుండు మేఘంబులతోఁ గలసి స్వచ్ఛంబుగానుండు సముద్ర జలంబు ఆకాశంబునం గ్రమ్ముకొనిన తెల్లనిశరత్కాలమేఘమువలెఁ బ్రకాశించినది. ౨౩

అప్పుడు సముద్రంబునందు హనుమంతునివేగంబున నీళ్లన్నియుఁ బైకెగురుటం జేసి పెద్దచేఁపలును, చిన్నచేఁపలును, మొసళ్లును, తాఁబేళ్లును వస్త్రంబును విడిచిన మనుష్యుల యవయవంబులుంబోలె నగపడినవి. ౨౪

అంత సముద్రమున నున్నసర్పంబులు ఆకాశంబున నెగసి పోవుచున్న వానరశ్రేష్ఠుం డగుహనుమంతునిం జూచి గరుత్మంతుం డని తలంచి భయంపడినవి. ౨౫

సముద్రమునందు వానరశ్రేష్ఠుం డగుహనుమంతుని మైనీడ పదియోజనముల వెడల్పును ముప్పదియోజనముల నిడుపునుం గలదియై యతిసుందరంబుగాఁ గనుపట్టినది. ౨౬

హనుమంతుని వెంబడించుచు సముద్రమునందు వెడల్పుగా వ్యాపించియుండు నాహనుమంతునినీడ దట్టంబుగాఁ గూడుకొనిన నిర్మలములయిన మేఘంబులపంక్తివలెఁ బ్రకాశించెను. ౨౭

ఎంతమాత్రము నాధారములేనియాకాశంబునం బోవుచున్న మహాతేజుండును, గొప్పశరీరంబుగలవాఁడునగు నాహనుమంతుండు ఱెక్కలు

యేనాసౌ యాతి బలవాన్ వేగేన కపికుంజరః. ౭౯
తేన మార్గేణ సహసా ద్రోణీకృత ఇవార్ణవః,

ఆపాతే పక్షిసంఘానాం పక్షిరాజ ఇవ వ్రజన్. ౮౦
హనుమాన్మేఘజాలాని ప్రకర్షన్ మారుతో యథా,
పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ. ౮౧
కపినాకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే,
ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునఃపునః. ౮౨
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే,

ప్లవమానం తు తం దృష్ట్వా ప్లవంగం త్వరితం తదా. ౮౩
వవర్షుః పుష్పవర్షాణి దేవగంధర్వదానవాః,
తతాప న హి తం సూర్యః ప్లవంతం వానరోత్తమమ్. ౮౪
సిషేవే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే,

ఋషయస్తుష్టువుశ్చైనం ప్లవమానం విహాయసా. ౮౫
జగుశ్చ దేవగంధర్వాః ప్రశంసంతో మహౌజసం,
నాగాశ్చ తుష్టువుర్యక్షా రక్షాంసి విబుధాః ఖగాః. ౮౬
ప్రేక్ష్య సర్వే కపివరం సహసా విగతక్లమం,

తస్మిన్ ప్లవగశార్దూలే ప్లవమానే హనూమతి. ౮౭

గలిగిన పర్వతంబుంబోలె నొప్పుచుండెను. ౭౮

హనుమంతుఁడు వాయువుంబోలె వేగంబున నేమార్గముఁబట్టిపోయెనో ఆమార్గమందలి సముద్రంబు ఆక్షణంబుననే వేగవశంబున నీళ్లు ముందు కుబ్బుటం జేసి తొట్టిగాఁ జేయఁబడినట్లు చూపట్టినది. ౭౯

హనుమంతుఁడు వాయువుంబోలె వేగంబున మేఘంబుల నాకర్షించుచు నాకాశమార్గమునందు గరుత్మంతుఁడు పోవునట్లు లీలగాఁ బోవుచుండెను. ౮౦

హనుమంతుఁ డీడ్చుకొనిపోవుచున్న తెలుపు ఎఱుపు నలుపు పసుపు వన్నెలంగల గొప్ప మేఘంబులు చూచువారి కాశ్చర్యంబు గల్గించుచుండినవి.

ఆహనుమంతుండు దారినడుమ మేఘంబులు దగులునప్పుడు వానిలో మఱుఁగుపడుచు మరల నా మేఘంబులు గడచినపిమ్మట వెలికివచ్చుచు మేఘంబులచే మూయఁబడి మరలబయలుపడుచుండు చంద్రుండుబోలె నగపడుచుండెను.

అప్పుడు త్వరితంబుగా సముద్రంబు దాఁటుచున్న హనుమంతునిఁజూచి దేవతలును, గంధర్వులును, దానవులును బూలవానలం గురిపించిరి. ౮౩

అప్పుడు సీతను వెదకుట యనెడురామకార్యంబు సిద్ధించుకొఱకై సూర్యుండు సముద్రంబు దాఁటుచున్న హనుమంతునిపై వేఁడిమిచూపఁడయ్యె. వాయువును హనుమంతుండు తనపుత్రుఁడయ్యుఁ రామకార్యంబం దుద్యోగించియుండుటం జేసి పూజ్యుండని తలంచి యారామకార్యంబు సిద్ధించుటకై యతని సేవించెను. ౮౪

ఇట్లు ఆకాశమార్గంబునఁబోవుచున్న హనుమంతుని ఋషులునుం బొగడిరి. దేవతలు, గంధర్వులు అతనిపరాక్రమంబును బ్రశంసించుచుఁ బాడిరి. ౮౫

సర్పంబులును, యక్షులును, దిక్పాలుఁడగు నిర్ఋతికిసంబంధించినరాక్షసులును, పక్షులును, దేవతలును అందఱును శ్రమంబు నొందక యాకాశంబునం బోవుచున్నహనుమంతునింజూచి సంతోషంబు పట్టలేక యాక్షణంబ ప్రస్తుతించిరి. ౮౬

వానరశ్రేష్ఠుండగు నాహనుమంతుండు సముద్రంబు దాఁటుచుండఁగా

ఇక్ష్వాకుకులమానార్థీ చింతయామాస సాగరః,

సాహాయ్యం వానరేంద్రస్య యది నాహం హనూమతః. ౮౮
కరిష్యామి భవిష్యామి సర్వవాచ్యో వివక్షతాం,
అహమిక్ష్వాకునాథేన సగరేణ వివర్ధితః. ౮౯
ఇక్ష్వాకుసచివశ్చాయం నావసీదితుమర్హతి,

తథా మయా విధాతవ్యం విశ్రమేత యథా కపిః. ౯౦
శేషం చ మయి విశ్రాంత స్సుఖేనాతిపతిష్యతి.

ఇతి కృత్వా మతిం సాధ్వీం సముద్రశ్ఛన్నమంభసి. ౯౧
హిరణ్యనాభం మైనాకమువాచ గిరిసత్తమం,
త్వమిహాసురసంఘానాం పాతాళతలవాసినామ్. ౯౨
దేవరాజ్ఞా గిరిశ్రేష్ఠ పరిఘస్సన్నివేశితః,
త్వమేషాం జాతవీర్యాణాం పునరేవోత్పతిష్యతామ్. ౯౩
పాతాలస్యాప్రమేయస్య ద్వారమావృత్య తిష్ఠసి,

తిర్యగూర్ధ్వమధశ్చైవ శక్తిస్తే శైల వర్ధితుమ్. ౯౪
తస్మాత్సంచోదయామి త్వా ముత్తిష్ఠ గిరిసత్తమ,
స ఏష కపిశార్దూలస్త్వా ముపర్యేతి వీర్యవాన్. ౯౫
హనూమాన్ రామకార్యార్థం భీమకర్మా ఖమాప్లుతః,

అస్య సాహ్యం మయా కార్యమిక్ష్వాకుకులవర్తినః. ౯౬
మమ హీక్ష్వాకవః పూజ్యాః పరం పూజ్యతమాస్తవ,

సముద్రుండు మున్నిక్ష్వాకువంశంబునం బుట్టిన సగరునిచే వృద్ధిం బొందినవాఁడు గావున ఇక్ష్వాకువంశము సమ్మానము నొందవలె నని కోరి యిట్లని యాలోచించెను. ౧౭

నే నిప్పుడు వానరశ్రేష్ఠుం డగుహనుమంతునకుఁ దోడ్పడనేని నోరు గలవార లందఱు నన్ను అన్నివిధంబులను నిందింతురు. ౧౮

ఇక్ష్వాకుకులమునందుఁ బెంపువహించిన సగరుఁడు నన్ను వృద్ధిబొందునట్లు చేసెను. ఈహనుమంతుండు ఇక్ష్వాకుకులంబునఁబుట్టినరామునకుఁ దోడ్పడినవాఁడు. కావున నితండు శ్రమపడకుండునట్లు సేయవలయును. ౧౯

కావున హనుమంతుఁ డలసట దీర్చుకొనుట కవకాశము కల్గునట్లు నేను జేయవలయును. ఇతండు నావలన నాఱటంబొంది తర్వాత మిగతదానిఁ గూడ నాయాసంబులేక దాఁటిపోవును. ౨౦

సముద్రుం డట్లు మంచియాలోచనచేసి నీటిలోమునిఁగియున్న పర్వతశ్రేష్ఠుఁడును స్వర్ణమయుండునగు మైనాకముం జూచి యిట్లని చెప్పెను. ౨౧

పర్వతశ్రేష్ఠుండ వగుమైనాకమా! దేవేంద్రుఁడు నిన్నుచటఁ బాతాళము నందున్న యసురులు పైకి రాకుండుటకై గడియమ్రానుగా నుంచెను. ౨౨

ఈయసురులు మరలఁ బరాక్రమంబునొంది పైకివచ్చుటకు యత్నింపఁగా నీవు అప్రమేయంబగు పాతాళము దారి నావరించుకొని వారిని పైకి రానీయకున్నావు. ౨౩

పర్వతశ్రేష్ఠుండ వగుమైనాకమా! నీకు అడ్డముగాను, మీఁదుగాను క్రిందుగాను పెరుగుటకు శక్తికలదు. కాన నీవిప్పుడు పైకి లేవవలయును. ౨౪

వానరశ్రేష్ఠుండును బరాక్రమశాలియుం నగునట్టి యీహనుమంతుఁడు రామకార్యార్థంబుగా భయంకరం బగుకార్యంబు సేయువాఁడై యాకాశమునం దెగిరి నీపైఁగాఁ బోవుచున్నాఁడు. ౨౫

ఇతం డిక్ష్వాకువంశమున సేవసేయువాఁ డగుటం జేసి యితనికి నేను సాహాయ్యంబు సేయవలయును. నాకు ఇక్ష్వాకువంశస్థులు వృద్ధిగలిగించుటం

కురు సాచివ్యమస్మాకం న నః కార్యమతిక్రమేత్. ౯౭
కర్తవ్యమకృతం కార్యం సతాం మన్యుముదీరయేత్,
సలిలాదూర్ధ్వముత్తిష్ఠ తిష్ఠత్వేష కపిస్త్వయి. ౯౮
అస్మాకమతిథిశ్చైవ పూజ్యశ్చ ప్లవతాం వరః,
చామీకరమహానాభ దేవగంధర్వసేవిత. ౯౯
హనుమాంస్త్వయి విశ్రాంతస్తతశ్శేషం గమిష్యతి,

స ఏష కపిశార్దూలస్త్వాముపర్యేతి వీర్యవాన్.
కాకుత్థస్యానృశంస్యం చ మైథిల్యాశ్చ వివాసనమ్. ౧౦౦

శ్రమం చ ప్లవగేంద్రస్య సమీక్ష్యోత్థాతుమర్హసి,
హిరణ్యనాభో మైనాకో నిశమ్య లవణాంభసః. ౧౦౧
ఉత్పపాత జలాత్తూర్ణం మహాద్రుమలతాయుతః,
స సాగరజలం భిత్త్వా బభూవాభ్యుత్థితస్తదా. ౧౦౨
యథా జలధరం భిత్త్వా దీప్తరశ్మిర్దివాకరః,
స మహాత్మా ముహూర్తేన సర్వతస్సలిలావృతః. ౧౦౩
దర్శయామాస శృంగాణి సాగరేణ నియోజితః,
శాతకుంభమయైశ్శృంగైస్సకిన్నరమహోరగైః. ౧౦౪
ఆదిత్యోదయసంకాశైరాలిఖద్భిరివాంబరం,
తప్తజాంబూనదైశ్శృంగైః పర్వతస్య సముత్థితైః. ౧౦౫
ఆకాశం శస్త్రసంకాశ మభవత్కాంచనప్రభం,

జేసి పూజ్యులని నీకును దెలియును. వారిచే వృద్ధిఁబొందిన నాయందు సుఖంబుగ నున్నావు. కావున నీకును వారు మిక్కిలియుఁ బూజ్యులు. ౯౬

మాకార్యము మీఱిపోవుటకు మునుపే మాకు సాహాయ్యము చేయుము. అట్లుచేయవలసిన కార్యమును జేయవేని పెద్దలకుఁ గోపము గలుగును. ౯౭

నీవు నీటినుండి పైకి లెమ్ము. మనకతిథియుఁ బూజనీయుండును ఎగురువారిలో శ్రేష్ఠుండు నగు హనుమంతుండు నీశిఖరములపై విశ్రమించుఁగాక. ౯౮

నీవు దేవతలచేతను, గంధర్వులచేతను సేవింపఁబడినవాఁడవు, బంగారుశిఖరంబులు గలవాఁడవు, హనుమంతుఁడు నీశిఖరములపై విశ్రమించి పిదప మిగిలినదారిని సుఖంబుగాఁ గడపఁగలఁడు. ౯౯

రాముని మంచిస్వభావమును సీత రావణునిచేఁ జిక్కుటను హనుమంతుఁడు సేయుఁ శ్రమంబును జూచి యుక్తమని తలంతువేని పైకిలెమ్ము అని సముద్రుండు మైనాకపర్వతమునకుఁ జెప్పెను. ౧౦౦

గొప్పవృక్షములును దీఁగెలును గలిగి బంగారుశిఖరములతోఁ గూడియున్న మైనాకపర్వతంబు సముద్రునిమాట విని నీళ్లనుండి శీఘ్రముగాఁ బైకి లేచెను. ౧౦౧

అప్పుడు సూర్యుఁడు మబ్బును భేదించికొని బయలువెడలునట్టు ఆ మైనాకము సముద్రజలమును భేదించికొని పైకిలేచెను. ౧౦౨

నీటిలో మునిఁగియుండిన మహాత్ముండగు నామైనాకుండు సముద్రుని యాజ్ఞనొంది కిన్నరులతోను గొప్పసర్పంబులతోను గూడి సూర్యోదయంబులచాడ్పున వెలుంగుచు నాకాశంబు నొరయుచున్నట్టుగా నత్యున్నతంబులైయుండు తన బంగారుశిఖరంబులఁ జూపెను. ౧౦౩-౧౦౪

అట్లు ఆమైనాకుని కరఁగింపఁబడిన స్వచ్ఛమైన బంగారుశిఖరములు పైకి లేవఁగానే వానికాంతులచే నినుమువలె నల్లగానుండు నాకాశంబును బంగారుకాంతి గలదయ్యె. ౧౦౫

జాతరూపమయైశ్శృఙ్గైర్భ్రాజమానైస్స్వయంప్రభైః. ౧౦౬
ఆదిత్యశతసంకాశ స్సోఽభవ ద్గిరిస త్తమః,
తముత్థితమసంగేన హనూమానగ్రత స్థ్సితమ్. ౧౦౭
మధ్యే లవణతోయస్య విఘ్నోఽయమితి నిశ్చితః,

స తముచ్ఛ్రితమత్యర్థం మహావేగో మహాకపిః. ౧౦౮
ఉరసా పాతయామాస జీమూతమివ మారుతః,

స తథా పాతిత స్తేన కపినా పర్వతో త్తమః. ౧౦౯
బుద్ధ్వా తస్య కపేర్వేగం జహర్ష చ ననంద చ,
తమాకాశగతం వీర మాకాశే సముపస్థితః. ౧౧౦
ప్రీతో హృష్టమనా వాక్యమబ్రవీత్పర్వతః కపిం,
మానుషం ధారయన్ రూప మాత్మనశ్శిఖరే స్థితః, ౧౧౧
దుష్కరం కృతవాన్కర్మ త్వమిదం వానరో త్తమ,
నిపత్య మమ శృంగేషు విశ్రమస్వ యథాసుఖమ్. ౧౧౨

రాఘవస్య కులే జాతై రుదధిః పరివర్ధితః,
స త్వాం రామహితే యు క్తం ప్రత్యర్చయతి సాగరః. ౧౧౩

కృతే చ ప్రతిక ర్తవ్య మేష ధర్మస్సనాతనః,
సోఽయం త్వత్ప్రతికారార్థీ త్వ త్తస్సమ్మానమర్హతి. ౧౧౪

స్వర్ణమయంబులై యితరాపేక్షలేక తమంతనే కాంతిగలిగి ప్రకాశించుచున్నట్టి శిఖరంబు లనేకంబులు గలిగియుండుటం జేసి పర్వతశ్రేష్ఠుండగు నామైనాకుండు నూఱుగురు సూర్యులుం బోలెం బ్రకాశించెను. ౧౦౭

హనుమంతుఁడు అట్టె లేచి తనముందటం జూపట్టిన యామైనాకునిం జూచి ఇట్టిపర్వత మిప్పు డడ్డపడుట కెంతమాత్రమును గారణంబు గానరాదు. కావున నది నాకు సముద్రమధ్యంబున విఘ్నము సేయవచ్చినది అని నిశ్చయించెను. ౧౦౮

మహావేగుఁడగు నాహనుమంతుఁడు మిక్కిలియు నున్నతంబయిన యామైనాకపర్వతమును తనఱొమ్ముచేత వాయుదేవుండు మేఘమును బాఱద్రోలునట్లు అనాయాసంబుగాఁ బడఁద్రోసెను. ౧౦౯

పర్వతశ్రేష్ఠుఁడగు నామైనాకుండు అట్లు తన్ను హనుమంతుఁడు పడఁద్రోయఁగా నతనివేగంబు తెలిసికొని చాల సంతసించి పులకాంకితుం డయ్యెను.

అంత మైనాకుండు సుఖంబు నొంది సంతసించి మనుష్యరూపము ధరించి తనశిఖరంబుపైనుండి యాకాశంబునం దున్నపరాక్రమశాలియగు హనుమంతునిం జూచి యిట్లని చెప్పెను. ౧౧౦-౧౧౧

వానరశ్రేష్ఠుండ వగుహనుమంతుఁడా! నీ వెవ్వరికినిం జేయనలవిగాని యీసముద్రలంఘనముఁ జేయుచున్నవాఁడవైనను ఎంతమాత్ర మలసట నొందక నావంటి గొప్పపర్వతమును ఱొమ్మున నవలీలగాఁబడఁద్రోచినాఁడవు; నా శిఖరంబులందుండి సుఖంబుగా విశ్రమింపుము. ౧౧౨

పూర్వము రాముని వంశంబునఁ బుట్టిన సగరునిచేతను అతనికొడుకుల చేతను సముద్రుండు చాల నభివృద్ధినొందెను. నీవు వారివంశంబునందుఁ బుట్టిన రామునకు మేలుసేయఁ గడంగినాఁడవు. కావున సముద్రుఁడు నీకుఁ బూజచేసి యందువలన సగరవంశస్థులకుఁ బ్రతిపూజ చేసినవాఁడు గాఁగోరుచున్నాఁడు. ౧౧౩

ఒకడు తన కుపకారము సేయఁగా నతనికిఁ దాను బ్రత్యుపకారము సేయవలెను. ఇది శాశ్వతంబగు ధర్మము. కావున సగరునివలన వృద్ధినొందిన యీ సముద్రుండు సగరవంశమునఁ బుట్టినరాముని సహాయుఁడవైన నీకుఁ

త్వన్నిమిత్తమనేనాహం బహుమానాత్ప్రచోదితః,
తిష్ఠ త్వం కపిశార్దూల మయి విశ్రమ్య గమ్యతామ్. ౧౧౪
యోజనానాం శతం చాపి కపిరేష సమాప్లుతః,
తవ సానుషు విశ్రాన్తశ్శేషం ప్రక్రమతామితి. ౧౧౫
తదిదం గంధవత్స్వాదు కందమూలఫలం బహు,
తదాస్వాద్య హరిశ్రేష్ఠ విశ్రాంతోఽనుగమిష్యసి. ౧౧౬
అస్మాకమపి సంబంధః కపిముఖ్య త్వయాఽస్తి వై,
ప్రఖ్యాత స్త్రిషు లోకేషు మహాగుణపరిగ్రహః. ౧౧౭

వేగవంతః ప్లవంతో యే ప్లవగా మారుతాత్మజ,
తేషాం ముఖ్యతమం మన్యే త్వామహం కపికుంజర. ౧౧౮

అతిథిః కిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా,
ధర్మం జిజ్ఞాసమానేన కిం పునస్త్వాదృశో మహాన్. ౧౨౦

త్వం హి దేవవరిష్ఠస్య మారుతస్య మహాత్మనః,
పుత్రస్తస్యైవ వేగేన సదృశః కపికుంజర. ౧౨౧

పూజితే త్వయి ధర్మజ్ఞ పూజాం ప్రాప్నోతి మారుతః,
తస్మాత్త్వం పూజనీయో మే శృణు చాప్యత్ర కారణమ్. ౧౨౨

బూజయొనర్చి యందువలన సగరునకుఁ బ్రత్యుపకారము చేసినవాఁడు కాఁ దలంచుచున్నాఁడు. నీవు దీని నంగీకరింపవలయును. ౧౧౬

ఈ హనుమంతుండు నూఱామడ లోకవెట్టున నెగుర నారంభించి యున్నాఁడు. ఇతండు నీనెత్తమునందుఁ గొంతసేపు విశ్రమించి మిగతదారి దాఁటునట్లు సేయుము. అని నీకొఱకు కీసముద్రుండు గౌరవంబున ననుం బ్రేరేపించెను. కావున నీవు నిలిచి నాయందుండి యలసట దీర్చుకొని పొమ్ము.

కావున మంచివాసనయును మాధుర్యమునుం గల యీకందమూలంబులను ఫలంబులను ఆరగించి యలసటఁ దీర్చుకొని యావిమ్మటం బొమ్ము. ౧౧౭

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీతోడిసంబంధము నీ కాతిథ్య మియ్యవలయు ననునది మాకునుం గలదు. నీ వంటిసద్గుణములు గలవారిం బూజించుట ముల్లోకంబులందును ఆదరణీయంబై యున్నది. ౧౧౮

వానరశ్రేష్ఠుండవు వాయుపుత్త్రుండవు, నగుహనుమంతుఁడా! వానరులలో నెవ్వరు వేగము గలిగి యెగురనేర్చియున్నారో వారిలో నందఱికన్నను నీవు శ్రేష్ఠుండ వని తలంచుచున్నాను. ౧౧౯

తాను బండితుండయినను తనయొద్దకు వచ్చునతిథి మూఢుండైనను అతనివలనం దన కేమాత్రంబును బ్రయోజనంబు లేకున్నను అతనికిం దాను బూజసేయవలయుననుట శాస్త్రసిద్ధంబుగదా! అట్టుండ పండితుండై ధర్మంబు లెఱుంగుటకై పెద్దలసహవాసంబు గోరు నావంటివానికి నీవంటి సమస్తధర్మంబుల నెఱింగినవాఁడు దొరకెనేని యతం డట్టి యతిథిని బూజింపవలయునని చెప్పనేల? ౧౨౦

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! ఇదిగాక నీవు దేవతలలో మేటి యయిన మహాత్ముండు నగువాయుదేవునకుఁ బుత్త్రుఁడవు. వేగంబున నతనికి సరివచ్చువాఁడవు. ౧౨౧

ధర్మంబుల నెఱింగినవాఁడవైనహనుమంతుఁడా! నేను నిన్నుఁబూజింతునేని నీతండ్రియగు వాయుదేవునిం బూజించినవాఁడ నగుదును. నేను

పూర్వం కృతయుగే తాత పర్వతాః పక్షిణోఽభవన్,
తే హి జగ్ముర్దిశస్సర్వా గరుడానిలవేగినః. ౧౨౩

తత స్తేషు ప్రయాతేషు దేవసంఘాస్సహర్షిభిః,
భూతాని చ భయం జగ్ము స్తేషాం పతనశంకయా. ౧౨౪

తతః క్రుద్ధస్సహస్రాక్షః పర్వతానాం శతక్రతుః,
పక్షాంశ్చిచ్ఛేద వజ్రేణ తత్ర తత్ర సహస్రశః. ౧౨౫

స మాముపాగతః క్రుద్ధో వజ్రముద్యమ్య దేవరాట్,
తతోఽహం సహసా క్షిప్తశ్శ్వసనేన మహాత్మనా. ౧౨౬

అస్మిన్లవణతోయే చ ప్రక్షిప్తః ప్లవగోత్తమ,
గుప్తపక్షసమగ్రశ్చ తవ పిత్రాఽభిరక్షితః. ౧౨౭

తతోఽహం మానయామి త్వాం మాన్యోహి మమ మారుతః,
త్వయా మే హ్యేష సంబంధః కపిముఖ్య మహాగుణః. ౧౨౮

అస్మిన్నేవం గతే కార్యే సాగరస్య మమైవ చ,
ప్రీతిం ప్రీతమనాః కర్తుం త్వమర్హసి మహాకపే. ౧౨౯
శ్రమం మోక్షయ పూజాం చ గృహాణ కపిసత్తమ,
ప్రీతిం చ బహుమన్యస్వ ప్రీతోఽస్మి తవ దర్శనాత్. ౧౩౦

వాయుదేవునకుఁ బూజచేయవలసినవాఁడను గావున నిన్నవశ్యము బూజచేయవలసినవాఁడ నగుచున్నాను. నేను వాయువును బూజింపవలసినందులకుఁ గారణంబు సెప్పెదను వినుము. ౧౨౨

మును కృతయుగంబునందుఁ బర్వతంబులకు ఱెక్కలుండినవి. అప్పుడాపర్వతంబులు గరుడుండును వాయువునుంబోలె వేగంబు గలిగి యెల్లదిక్కులనుం దిరుగుచుండినవి. ౧౨౩

అంత నాపర్వతంబు లట్లు సంచరించుచుండఁగా నవి క్రిందఁబడునేమో యని తలంచి దేవతలును, భూతంబులును, ఋషులును భయంబు నొందిరి. ౧౨౪

అంత నట్లు పర్వతంబులు విడువక తిరుగుచుండుటను దేవతలు మున్నగువారలు భయంబు నొందుటనుం జూచి దేవేంద్రుండు కోపించి యచ్చటచ్చట వేనవేలుగాఁ బర్వతంబుల ఱెక్కలను వజ్రాయుధంబున ఖండించెను. ౧౨౫

ఆదేవేంద్రుండు కోపంబున వజ్రాయుధంబు నెత్తికొని నాయొద్దకు వచ్చెను. అప్పుడు మహాత్ముం డగు వాయుదేవుండు శీఘ్రంబున నన్ను దూరముగా నెట్టుకొనిపోయెను. ౧౨౬

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీతండ్రియగు వాయుదేవుండు నన్ను సముద్రమునందుఁ బడఁ ద్రోసి నాఱెక్కలు పోకుండునట్లు గాపాడెను. ౧౨౭

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! అందువలన నాకు వాయుదేవుండు పూజనీయుం డగుటంజేసి యతనిం బూజించినవాఁడ నగుటకై యతని పుత్రుండవైన నిన్నుఁ బూజించెదను. నీతండ్రి నన్ను రక్షించెను. నన్ను రక్షించినవాని పుత్రుండవు నీవు కనుక నాకు నీతో సంబంధమున్నది గదా! ౧౨౮

హనుమంతుఁడా! ఇట్లు నడచియుండుటంజేసి నీవు సంతోషంబున నేనును సముద్రుండును జేయు నాతిథ్యము నంగీకరింపవలయును. ౧౨౯

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీ విచ్చోట నలసటఁ దీర్చుకొని మేము చేయు పూజను గ్రహించి మాకు నీయందుఁ గలిగియుండు ప్రేమను

ఏవముక్తః కపిశ్రేష్ఠస్తం నగోత్తమమబ్రవీత్,
ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యురేషోఽపనీయతామ్. ౧౩౧

త్వరతే కార్యకాలో మే అహశ్చాప్యతివర్తతే,
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్యమిహాంతరే. ౧౩౨

ఇత్యుక్త్వా పాణినా శైలమాలభ్య హరిపుంగవః,
జగామాకాశమావిశ్య వీర్యవాన్ ప్రహసన్నివ. ౧౩౩

స పర్వతసముద్రాభ్యాం బహుమానాదవేక్షితః,
పూజితశ్చోపపన్నాభి రాశీర్భి రనిలాత్మజః. ౧౩౪

అథోర్ధ్వం దూరముత్ప్లుత్య హిత్వా శైలమహార్ణవౌ,
పితుః పంథానమాస్థాయ జగామ విమలేఽంబరే. ౧౩౫

భూయశ్చోర్ధ్వ(ం) గతిం ప్రాప్య గిరిం తమవలోకయన్,
వాయుసూనుర్నిరాలంబే జగామ విమలేఽంబరే. ౧౩౬

బును బహుమానింపుము. నిన్ను జూచుటంజేసి నాకుఁ జాల సంతోషంబు కల్గినది. అని మైనాకుండు హనుమంతునితోఁ జెప్పెను. ౧౩౦

వానరశ్రేష్ఠుండగు హనుమంతుం డిట్లు మైనాకుడు చెప్పినమాట విని పర్వతశ్రేష్ఠుండగు నమ్మైనాకుం జూచి యిట్లని చెప్పెను.

నేను సంతసించినాఁడను. ఇట్టిమాటలచేతనే యాతిథ్యంబు చేసినట్లే యగుచున్నది. నేను మీరు సేయుపూజం బ్రతిగ్రహింపలేదని కోపంబు నొందవలదు. ౧౩౧

నా కిది చాల పనివేళగ నున్నది. ఎంతమాత్రమును ఇప్పుడు జాగు సేయంటొప్పదు. లంకకుఁ బ్రొద్దుండఁగానే చేరవలయును. ఇప్పుడు ప్రొద్దు మీఱిపోవుచున్నది. ఇదిగాక రాముని బాణంబుపోవునట్లుగా నెచ్చటను నిలువక యప్రతిహతంబుగాఁబోయెద నని వానరులముందటం బ్రతిజ్ఞ చేసినాను. కావున సముద్రమధ్యమున నేను నిలువరాదు అని హనుమంతుండు మైనాకమునకుఁ జెప్పెను. ౧౩౨

పరాక్రమశాలియగు హనుమంతుం డీప్రకారముగఁ జెప్పి మైనాకుని తన హస్తంబుచే స్పృశించి మరల నాకాశంబునొంది నిర్విఘ్నంబుగాఁ దన ప్రతిజ్ఞచొప్పునఁ బ్రయాణంబు జరుగుటంజేసి ప్రసన్నముఖుండై పోయెను. ౧౩౩

మైనాకుండును, సముద్రుండును వాయుపుత్రుండైన హనుమంతుని గౌరవంబుతోఁ జూచి నీకుఁ గార్యసిద్ధి యగుఁగాక యని యాశీర్వదించి పూజించిరి. ౧౩౪

అంత నాహనుమంతుండు మైనాకుని సముద్రుని విడిచి యూర్ధ్వమున దూరముగాఁ బోయి వాయుమార్గంబైన యాకాశమార్గంబునం బోయెను. ౧౩౫

వాయుదేవునికొమారుం డగుహనుమంతుండు అట్లింకను పైకెగిరి ఆ మైనాకపర్వతంబును చూచుచు నెంతమాత్రము నాధారములేని యాకాశమార్గంబునం బోవుచుండెను. ౧౩౬

తద్ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరం,
ప్రశశంసుస్సురాస్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః. ౧౩౬

దేవతాశ్చాభవన్ హృష్టాస్తత్రస్థాస్తస్య కర్మణా,
కాంచనస్య సునాభస్య సహస్రాక్షశ్చ వాసవః. ౧౩౭

ఉవాచ వచనం ధీమాన్ పరితోషాత్సగద్గదం,
సునాభం పర్వతశ్రేష్ఠం స్వయమేవ శచీపతిః. ౧౩౮

హిరణ్యనాభ! శైలేంద్ర! పరితుష్టోఽస్మి తే భృశం,
అభయం తే ప్రయచ్ఛామి తిష్ఠ సౌమ్య! యథాసుఖమ్. ౧౪౦

సాహ్యం కృతం తే సుమహద్విక్రాంతస్య హనూమతః,
క్రమతో యోజనశతం నిర్భయస్య భయే సతి. ౧౪౧

రామస్యైవ హి దూత్యేన యాతి దాశరథేర్హరిః,
సత్క్రియాం కుర్వతా తస్య తోషితోఽస్మి దృఢం త్వయా.

తతః ప్రహర్షమగమ ద్విపులం పర్వతోత్తమః,
దేవతానాం పతిం దృష్ట్వా పరితుష్టం శతక్రతుమ్. ౧౪౩
స వై దత్తవర శ్శైలో బభూవావస్థిత స్తదా,

ఇట్లు హనుమంతుండు మైనాకపర్వతమునందు విశ్రమింప నొప్పుకొనకపోవుటంజూచి యది యెవ్వరికిని జేయ నలవిగాని దగుటంజేసి దేవతలును, సిద్ధులును, మహర్షులును హనుమంతునిం బొగడిరి. ౧౩౭

అచ్ఛోట నుండిన దేవతలు స్వర్ణమయుఁడును మంచుశిఖరములు గలవాఁడు నగు నామైనాకుండు హనుమంతునకు సాహాయ్యము సేయ యత్నించుటంజూచి చాల సంతసించిరి. దేవేంద్రుండును మైనాకుండు చేసిన కార్యమునకుఁ జాల సంతసించెను. ౧౩౮

దేవేంద్రుండు బుద్ధిమంతుండుగావున 'రామకార్యార్థముగాఁ బ్రయాణపడు నీహనుమంతునకు సాహాయ్యము సేయంబూనిన యీమైనాకమును మన్నింతునేని యితరులును అట్లు సాహాయ్యము సేయంజూతురు' అని యాలోచించి తానే పర్వతశ్రేష్ఠుండగు నామైనాకునింజూచి సంతోషంబునం జేసి దగ్గుత్తికతోఁగూడిన యెలుంగున నిట్లని చెప్పెను. ౧౩౯

పర్వతశ్రేష్ఠుండవు, సౌమ్యుండవు నగుమైనాకుఁడా! నీవు చేసిన కార్యమునకు నేను జాల సంతసించితిని. నీ కభయం బొసంగెదను. నీ వింక నావలని భయంబు విడిచి సుఖంబుగా నుండుము. ౧౪౦

హనుమంతుండు పరాక్రమించి నిర్భయుండై నూఱుయోజనంబుల సముద్రమును దాఁటుచున్నాఁడు. అతివిశాలంబగు సముద్రంబున నితని కేమి కష్టము సంభవించెనో యని మేము భయంపడుచుండఁగా నట్టి హనుమంతునకు నీవు గొప్పసాహాయ్యము చేసినాఁడవు. ౧౪౧

హనుమంతుండు దశరథునికొడుకైన రామునికైయే గదా రాయబారమును వహించి పోవుచున్నాఁడు. కావున నట్టి హనుమంతునకు నీవు తోడ్పడుటంజేసి నాకుఁ జాల సంతోషంబు చేసినవాఁడ వైతివి అని యింద్రుండు మైనాకునితోఁ జెప్పెను. ౧౪౨

అంతఁ బర్వతశ్రేష్ఠుండగు మైనాకుండు తనముందట సంతోషంబుతో నున్న దేవేంద్రుఁ జూచి యధికముగా సంతసించెను. ౧౪౩

అప్పుడు ఆమైనాకుఁడు వరంబునొంది స్వస్థంబుగా నుండెను.

హనుమాంశ్చ ముహూర్తేన వ్యతిచక్రామ సాగరమ్. ౧౪౪

తతో దేవా స్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః,
[తం ప్రయాన్తం సముద్వీక్ష్య హ్యాకాశే మారుతాత్మజమ్,]
అబ్రువన్ సూర్యసంకాశాం సురసాం నాగమాతరమ్. ౧౪౫
అయం వాతాత్మజశ్శ్రీమాన్ ప్లవతే సాగరోపరి,
హనుమాన్నామ తస్య త్వం ముహూర్తం విఘ్నమాచర.
రాక్షసం రూపమాస్థాయ సుఘోరం పర్వతోపమం,
దంష్ట్రాకరాళం పింగాక్షం వక్త్రం కృత్వా నభస్సమమ్. ౧౪౬

బలమిచ్ఛామహే జ్ఞాతుం భూయశ్చాస్య పరాక్రమం,
త్వాం విజేష్యత్యుపాయేన విషాదం వా గమిష్యతి. ౧౪౭

ఏవముక్తా తు సా దేవీ దైవతైరభిసత్కృతా,
సముద్రమధ్యే సురసా బిభ్రతీ రాక్షసం వపుః. ౧౪౯
వికృతం చ విరూపం చ సర్వస్య చ భయావహం,
ప్లవమానం హనూమంతమావృత్యేదమువాచ హ. ౧౫౦
మమ భక్షః ప్రదిష్టస్త్వమీశ్వరైర్వానరర్షభ,
అహం త్వాం భక్షయిష్యామి ప్రవిశేదం మమాననమ్. ౧౫౧

ఏవముక్తస్సురసయా ప్రాంజలిర్వానరర్షభః,
ప్రహృష్టవదనశ్శ్రీమానిదం వచనమబ్రవీత్. ౧౫౨
రామో దాశరథిర్నామ ప్రవిష్టో దండకావనం,
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా. ౧౫౩

హనుమంతుఁడును స్వల్పకాలంబునను మైనాకం బుండు సముద్రప్రదేశమును దాఁటెను. ౧౮౪

అంత దేవతలును, గంధర్వులును, సిద్ధులును, మహర్షులును [అపోవు చున్నకపిని జూచి] సూర్యుడుంబోలె వెలుఁగుచున్న సర్పంబుల తల్లియయిన సురసం జూచి యిట్లని చెప్పిరి. ౧౮౫

శ్రీమంతుఁ డగు నీవాయుపుత్త్రుఁడు హనుమంతుఁ డనువాఁడు సముద్రంబుపై నెగిరిపోవుచున్నాఁడు. నీవు మిక్కిలియు భయంకరంబయిన కొండంతటిరాక్షసరూపంబు దాల్చి పెద్దకోఱలును గోరోచనంపువన్నెగల కండ్లును గలిగి యాకాశంబునకు సరివచ్చుచు భయంకరంబై యుండునోటితోఁ బోయి యాహనుమంతునకుం గొంతకాలంబు విఘ్నము సేయుము. ౧౮౬,౧౮౭

ఇంకను ఈహనుమంతుని బలంబును, పరాక్రమంబును దెలియఁగోరెదము. నిన్నుపాయంబున జయించి పోవునో లేక నిన్నుఁజూచి భయపడి దుఃఖంబునొందునో ఇది మాకుఁ దెలియవలయును. అని దేవతలు మున్నగువారలు సురసకుం జెప్పిరి. ౧౮౮

ఆ సురసాదేవి ఇట్లు దేవతలు చెప్పినమాటలు విని వారలు సేయుం పూజం బ్రతిగ్రహించి సముద్రమధ్యమునందు వికృతంబును, విరూపంబును, ఎట్టివానికిని వెఱపుఁ బుట్టించునదియుం నగు రాక్షసదేహంబు ధరించి దాఁటుచున్న హనుమంతు నడ్డగించి యిట్లని చెప్పెను. ౧౮౯, ౧౯౦

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా ! నా కాహారంబుగా నిన్ను దేవతలొసఁగిరి. నేను నిన్ను భక్షించెదను. ఇదిగో ! నానోటం బ్రవేశింపుము అని సురస హనుమంతునితోఁ జెప్పెను. ౧౯౧

శ్రీమంతుఁడగు హనుమంతుఁడు సురస చెప్పినమాట విని చేతులు మొగిడ్చి సంతోషంబున వెలుఁగు ముఖంబుతో నిట్లని చెప్పెను. ౧౯౨

దశరథపుత్త్రుఁడు రాముఁడనువాఁడు లక్ష్మణుఁడను తమ్మునితోడను, సీత యను భార్యతోడను గూడి దండకారణ్యము ప్రవేశించెను. ౧౯౩

అన్యకార్యవిషక్తస్య బద్ధవైరస్య రాక్షసైః,
తస్య సీతా హృతా భార్యా రావణేన యశస్వినీ. ౧౫౪

తస్యాస్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్,
కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని, ౧౫౫

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణం,
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే. ౧౫౬

ఏవముక్తా హనుమతా సురసా కామరూపిణీ,
అబ్రవీన్నాతివర్తేన్మాం కశ్చిదేష వరో మమ. ౧౫౭

(ప్రక్షిప్తః)

[తం ప్రయాంతం సముద్వీక్ష్య సురసా వాక్యమబ్రవీత్,
బలం జిజ్ఞాసమానా వై నాగమాతా హనూమతః. ౧
ప్రవిశ్య వదనం మేఽద్య గంతవ్యం వానరోత్తమ,
వర ఏషపురా దత్తో మమ ధాత్రేతి సత్వరా. ౨

వ్యాదాయ విపులం వక్త్రం స్థితా సా మారుతేః పురః,
ఏవముక్తస్సురసయా క్రుద్ధో వానరపుంగవః. ౩
అబ్రవీత్కురు వై వక్త్రం యేన మాం విషహిష్యసే,
ఇత్యుక్త్వా సురసా క్రుద్ధా దశయోజనమాయతా. ౪
దశయోజనవిస్తారో బభూవ హనుమాంస్తదా,
తం దృష్ట్వా మేఘసంకాశం దశయోజనమాయతమ్. ౫

ఆరాముఁడు రాక్షసులతోఁ బద్ధవైరంబు గల్గియుండి యొకప్పుడు వేఱు కార్యమునందుఁ దగిలియుండఁగా రావణుం డతని భార్యయయిన పతివ్రతయగు సీతను గొనిపోయెను. ౧౫౪

నేను రామునిపంపున దూతనై యాసీతయొద్దకుఁ బోయెదను. నీవును రాముని రాజ్యంబున నుండుదానవు. రామునకు సాహాయ్యంబు సేయవలయును. ౧౫౫

అట్లుకాదేని సీతను జూచి ఆయాసము లేకయే యెంతగొప్పకార్యము నైనను జేయంగల యట్టిరాముని సందర్శించి నీనోటియొద్దకు వచ్చెదను. ఇది సత్యము. నే నొప్పుకొనుచున్నాను. అని హనుమంతుఁడు సురసకుఁ జెప్పెను.

కామరూపిణి యగు సురస హనుమంతుఁడు చెప్పిన మాటను విని నన్నతిక్రమించి యెవ్వండును బోలేడు ఇట్లు నాకు వరమున్నది. అని హనుమంతునితోఁ జెప్పెను. ౧౫౬

(ప్రక్షిప్తము)

[సర్పంబులకుం దల్లియయిన సురస హనుమంతునిబల మెఱుఁగఁగోరినది కావున నా హనుమంతుఁడు తన్ను విడిచిపోవుటఁ జూచి యిట్లనిచెప్పెను.

వానరశ్రేష్ఠుఁడవగు హనుమంతుఁడా! నీ విప్పుడు నానోటిలోఁ జొచ్చిపోవలసినది. ఇట్లు నానోటిముందట నుండువాఁడు నానోటి నతిక్రమించి పోలేఁడని నాకు మున్ను బ్రహ్మదేవుఁడు వరంబొసంగెను. అనిచెప్పి యాసురస విశాలంబగు తననోరు దెఱచి హనుమంతుని ముందట నిలిచెను. ౧

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు ఇట్లు సురస చెప్పుటను విని కోపించి నన్ను మ్రింగఁ గల్గునట్లుగా నోరు తెఱువుము అని చెప్పెను. ౩

హనుమంతుఁ డప్పు డిట్లు సురసతోఁ జెప్పి క్రుద్ధుండై పదియోజనంబుల నిడుపును బదియోజనంబుల వెడల్పును గల దేహంబు గలవాఁడయ్యెను. ౪

ఇట్లు పదియోజనంబులు నిడుపైనశరీరంబుదాల్చి మేఘంబువలెనున్న యా హనుమంతునిం జూచి సురసయును ఇరువదియామడలు నిడుపయిన నోరు ధరించెను. ౫

చకార సురసా చాస్యం వింశద్యోజనమాయతం,
హనుమాం స్తు తతః క్రుద్ధస్త్రింశద్యోజనమాయతః. ౬
చకార సురసా వక్త్రం చత్వారింశ త్తథోచ్ఛ్రితం,
బభూవ హనుమాన్వీరః పంచాశద్యోజనోచ్ఛ్రితః. ౭

చకార సురసా వక్త్రం షష్టి యోజనమాయతం,
తథైవ హనుమాన్వీరస్స ప్తతీ యోజనోచ్ఛ్రితః. ౮

చకార సురసా వక్త్రమశీతీ యోజనాయతం,
హనుమానచలప్రఖ్యో నవతీ యోజనోచ్ఛ్రితః. ౯

చకార సురసా వక్త్రం శత యోజనమాయతం,]
(ఏతావాన్ ప్రక్షిప్తః)
తద్దృష్ట్వా వ్యాదితం త్వాస్యం వాయుపుత్రస్సుబుద్ధిమాన్.
దీర ఙిహ్వాం సురసయా సుఘోరం నరకోపమం,
సుసంక్షిప్యాత్మనః కాయం బభూవాంగుష్ఠమాత్రకః. ౧౬౮

సోఽభిపత్యాశు తద్వక్త్రం నిష్పత్య చ మహాబలః,
అంతరిక్షే స్థితశ్శ్రీమా నిదం వచనమబ్రవీత్. ౧౬౯

ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తుతే,
గమిష్యే యత్ర వైదేహీ సత్యం చాసీద్వరం తవ. ౧౭౦

అంత హనుమంతుఁడు కోపించి ముప్పదియోజనంబులు నిడుపైన దేహము ధరించెను. ౬

సురసయును అట్లు నలువదియోజనంబుల నిడుపుగల నోరు ధరించెను., పరాక్రమశాలి యగుహనుమంతుఁడు ఏఁబదియోజనంబులు నిడుపైన దేహంబు నొందెను. ౭

సురస యరువదియోజనంబుల నిడుపుగల నోరు ధరించెను. అలాగే పరాక్రమశాలి యగు హనుమంతుఁడును డెబ్బదియోజనంబులనిడుపుగల దేహంబు వహించెను. ౮

సురస యెనుబదియోజనముల నిడుపైన నోరు ధరించెను. హనుమంతుఁడును తొంబదియోజనంబులు నిడుపుగల దేహంబును ధరించి కొండవలె నగపడెను. ౯

అప్పుడు సురస నూఱుయోజనంబులు నిడుపుగా నోరుఁ దెంచెను.]

(ఇంతవఱకు ప్రక్షిప్తము.)

వాయుపుత్రుండగు హనుమంతుఁ డట్లు సురస నూఱు యోజనంబులు నిడుపుగాఁ దెంచి తెఱచియున్న నిడుపైన నాలుక గలిగి భయంకరంబైన నరకంబుఁ బోలియున్ననోరును జూచి బుద్ధిమంతుఁడు కావున "ఇప్పుడు సురసనోరు మిక్కిలి విశాలంబుగా నున్నది. నాదేహంబు చిన్నదగునేని తటాలునఁ జొచ్చి బయలు వెడలందగును" అని యాలోచించి తనదేహంబు నంగుష్ఠంబంతటిదిగాఁ జేసెను. ౧౫౮

శ్రీమంతుఁడగు నాహనుమంతుఁడు గొప్పవేగంబుకలవాఁడు కావున శీఘ్రంబుగా నాసురస నోటిలోపలికిఁ బోయియు మరల వెలుపడియు నాకాశంబునందుండి యాసురసతో నిట్లని చెప్పెను. ౧౫౯

నోటికిం బోతిని గద! దక్షప్రజాపతికిఁ గొమార్తెవయిన సురసా! నీకు నమస్కారము చేసెదను. నీకు "నీవు తలంచితివేని ఎవ్వఁడైనను నీనోటి లోనికిఁ బ్రవేశింపవలయును" అని బ్రహ్మదేవుం డొసంగినవరంబును సత్యం బయ్యెను. ఇఁక నన్ను విడువుము. నేను సీతయున్నచోటికిం బోయెదను. అని

తం దృష్ట్వా వదనాన్ముక్తం చంద్రం రాహుముఖాదివ,
అబ్రవీత్సురసా దేవీ స్వేన రూపేణ వానరమ్. ౧౬౧

అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖం,
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా. ౧౬౨
తత్తృతీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరం,
సాధుసాధ్వితి భూతాని ప్రశశంసు స్తదా హరిమ్. ౧౬౩
స సాగర మనాధృష్య మభ్యేత్య వరుణాలయం,
జగామాకాశ మావిశ్య వేగేన గరుడోపమః. ౧౬౪
సేవితే వారిధారాభిః పతగైశ్చ నిషేవితే,
చరితే కైశికాచార్యై రైరావతనిషేవితే. ౧౬౫
సింహకుంజరశార్దూలపతగోరగవాహనైః,
విమానైస్సంపతద్భిశ్చ విమలైస్సమలంకృతే. ౧౬౬
వజ్రాశనిసమాఘాతైః పావకై రుపశోభితే,
కృతపుణ్యై ర్మహాభాగైస్స్వర్గజిద్భిరలంకృతే. ౧౬౭
వహతా హవ్యమత్యర్థం సేవితే చిత్రభానునా.
గ్రహనక్షత్రచంద్రార్కతారాగణవిభూషితే. ౧౬౮
మహర్షిగణ గంధర్వ నాగయక్షసమాకులే,
వివిక్తే విమలే విశ్వే విశ్వావసునిషేవితే. ౧౬౯
దేవరాజగజాక్రాంతే చంద్రసూర్యపథే శివే,
వితానే జీవలోకస్య వితతే బ్రహ్మనిర్మితే. ౧౭౦
బహుశస్సేవితే వీరై ర్విద్యాధరగణై ర్వరైః,
జగామ వాయుమార్గే తు గరుత్మానివ మారుతిః. ౧౭౧

హనుమంతుండు సురసతోఁ జెప్పెను. ౧౬౦

అట్లు తనముఖంబునుండి వెలువడి రాహుముఖంబుననుండి వెలువడిన చంద్రుంబోలుచున్న యాహనుమంతుం జూచి యాసురస రాక్షసరూపంబు విడిచి నిజరూపంబునొంది యిట్లని చెప్పెను. ౧౬౧

సౌమ్యుండగు హనుమంతుఁడా! నీవు సుఖంబుగాఁ బొమ్ము. నీకుఁ గార్యసిద్ధి యవుఁగాక! మహాత్ముండగు రామునితో సీతం జేర్పుము. ౧౬౨

అట్లు మూఁడవమారు హనుమంతుండు చేసిన మఱియెవ్వరికిని జేయ నలవిగాని సురసనోటినుండి బయలువెడలుటను జూచి భూతంబులు సాధు వాక్యంబుల హనుమంతుని బ్రశంసించినవి. ౧౬౩

అంతవేగంబున గరుత్మంతునకుసాటియగు నాహనుమంతుండు ఎదిరింపఁ గూడని సముద్రంబుమీఁదుగా నాకాశమార్గంబునం బోయెను. ౧౬౪

ఆహనుమంతుండు మేఘంబులువిడుచు వారిధారలచే నొప్పుచుఁ బక్షుల కాటపట్టై తుంబురులు మొదలగు నాచార్యులకు సంచారస్థానంబై వంకరలేక దీర్ఘంబై యొఱ్ఱగానుండు నింద్రధనువునకు స్థానంబై సింహంబు, లేనుంగులు, పెద్దపులులు, పక్షులు, సర్పంబులు వీనిచే నీడ్వఁబడి తిరుగుచుండు స్వచ్ఛంబు లైన విమానంబులచే నలంకృతంబై వజ్రంబునకును బిడుగునకుం బోలె ప్రేటు గల యగ్నులం దేజరిల్లుచు భూలోకంబునం బుణ్యకార్యంబు లాచరించి స్వర్గ లోకంబునొంది మహాభాగులై నక్షత్రరూపంబున వెలుంగుచుండు పుణ్యపురు షులతోఁ గూడి యెల్లప్పుడును దేవతార్థంబుగా భూలోకంబునుండి హవ్యంబు గొనివచ్చుచుండు నగ్నిహోత్రునకు మార్గంబై యంగారకాది గ్రహంబులు నశ్విన్యాది నక్షత్రంబులుఁ జంద్రుఁడు సూర్యుఁడు నితరనక్షత్రంబులునుం గల్గి మహర్షులచేతను, గంధర్వులచేతను, సర్పంబులచేతను, యక్షులచేతను సంపూర్ణంబై - పరిశుద్ధంబులును, స్వచ్ఛంబును, అన్నిటను వ్యాపించియుండు నదియునై గంధర్వరాజగు విశ్వావసువుచే సేవింపఁబడుచు దేవేంద్రుని గజం బగు నైరావతంబునకుఁ గ్రీడాస్థానంబై చంద్రునకును సూర్యునకును దారియై మంగళకరంబై జీవలోకంబునకు బ్రహ్మదేవునిచే నిర్మింపఁబడిన విస్తీర్ణంబగు మేలు కట్టువంటి పరాక్రమశాలులు నుత్తములు నగు విద్యాధరులచే సేవింపఁబడు చుండు నాకాశమార్గంబునందు గరుత్మంతుఁడుంబోలె బోయెను. ౧౬౫-౧౭౦

హనుమాన్మేఘజాలాని ప్రకర్షన్మారుతో యథా,
కాలాగరుసవర్ణాని రక్తపీతసితాని చ.
కపినాకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే,
ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః.
ప్రావృషీన్దురివాభాతి నిష్పతన్ ప్రవిశం స్తదా]
ప్రదృశ్యమానస్సర్వత్ర హనుమాన్మారుతాత్మజః,
భేజేఽమ్బరం నిరాలమ్బం లమ్బపక్ష ఇవాద్రిరాట్. ౧౭౨
ప్లవమానం తు తం దృష్ట్వా సింహికా నామ రాక్షసీ,
మనసా చిన్తయామాస ప్రవృద్ధా కామరూపిణీ. ౧౭౩

అద్య దీర్ఘస్య కాలస్య భవిష్యామ్యహమాశితా,
ఇదం హి మే మహత్సత్త్వం చిరస్య వశమాగతమ్. ౧౭౪

ఇతి సంచిన్త్య మనసా ఛాయామస్య సమాక్షిపత్,
ఛాయాయాం గృహ్యమాణాయాం చిన్తయామాస వానరః.

సమాక్షిప్తోఽస్మి సహసా పఙ్గూకృతపరాక్రమః,
ప్రతిలోమేన వాతేన మహానౌరివ సాగరే. ౧౭౫

తిర్యగూర్ధ్వమధశ్చైవ వీక్షమాణ స్తతః కపిః,
దదర్శ స మహత్సత్త్వముత్థితం లవణాంభసి. ౧౭౬
తద్దృష్ట్వా చిన్తయామాస మారుతిర్వికృతాననం,
కపిరాజేన కథితం (సత్య) సత్త్వమద్భుతదర్శనమ్. ౧౭౭
ఛాయాగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః,

[గమనవేగముచే హనుమంతుఁడు తనతండ్రివలెనే మేఘములను చెదరుపలుచేసెను. ఇట్లాతఁడు చెదరఁగొట్టఁగనే విచ్చిపోయి మేఘములు కొన్ని నల్లఁగా కొన్ని యెఱ్ఱఁగా కొన్ని పచ్చఁగా నుండెను. వేగమునకు తనతోఁ జిక్కి వచ్చెడు మేఘములచే నాతఁడు వర్షాకాలమునాఁటి చంద్రునివలె నుండెను.]

వాయువు కొడుకైన హనుమంతుఁడు అచ్చటచ్చట నిలిచియుండు దేవతలు మొదలగువారు చూచుచుండఁగాఁ జేతులఁ గాళ్లఁ గ్రిందికి ముడుచుకొని యుండుటం జేసి వేలుకాడు ఱెక్కలు గలపర్వతరాజంబుభంగిఁ జూపట్టుచు నాకసంబునం బోయెను. ౧౭౨

అట్లు ఆకాశంబునం బోవుచున్న యాహనుమంతుం జూచి సింహిక యను రాక్షసి యిచ్ఛకువచ్చిన రూపంబు గొనంజాలినది గావున దేహంబును బెంచికొని మనంబున నిట్లని యాలోచించెను. ౧౭౩

బహుకాలముగా నేను భోజనము చేయలేదు. ఇంతకాలమునకు ఈ గొప్పజంతువు నాహారం బడినది. కావున నింక భుజించెదను. అని సింహిక యాలోచించెను. ౧౭౪

సింహిక యిట్లు మనంబున నాలోచించి యాహనుమంతుని మైనీడను బట్టి యాడ్చెను. సింహికచే నట్లు తనమైనీడ యీడ్వఁబడుచుండఁగా హనుమంతుండు ఇట్లని యాలోచించెను. ౧౭౫

నే నిప్పుడు సముద్రమునందు ఎదురుగాలిచే గొప్పయోడ యీడ్వఁబడునట్లు ఎవ్వరిచేతనో నాపరాక్రమము పనికిరాకుండినట్లు ఈడ్వఁబడుచున్నాను. అని హనుమంతుం డాలోచించెను. ౧౭౬

అంత నాహనుమంతుఁడు ఈప్రక్కనాప్రక్కను పైని క్రిందను జూచి సముద్రంబునఁ బైకి లేచియున్న మహాజంతువగు సింహికం జూచెను.

వాయుపుత్రుం డగు హనుమంతుండు వికృతంబగు పెద్దనోరుగల యాసింహికం జూచి యిట్లని యాలోచించెను. ౧౭౭

ఇది ముందు వానరప్రభుండగు సుగ్రీవుండు "దక్షిణసముద్రమునందు మైనీడఁబట్టుకొనఁగలిగి మహాపరాక్రమశాలియయి చూపరుల కాశ్చర్యంబు పుట్టించునట్టి యొకజంతువు కలదు" అని చెప్పిన జంతువే. ఇందు సందేహంబు లేదు అని హనుమంతుం డాలోచించెను. ౧౭౮

స. తాం బుద్ధ్వార్థతత్త్వేన సింహికాం మతిమాన్కపిః. ౧౭౯
వ్యవర్ధత మహాకాయః ప్రావృషీవ వలాహకః,

తస్య సా కాయముద్వీక్ష్య వర్ధమానం మహాకపేః. ౧౮౦
వక్త్రం ప్రసారయామాస పాతాళాంతరసన్నిభం,
ఘనరాజీవ గర్జంతీ వానరం సమభిద్రవత్. ౧౮౧

స దదర్శ తతస్తస్యా వివృతం సుమహన్ముఖం,
కాయమాత్రం చ మేధావీ మర్మాణి చ మహాకపిః. ౧౮౨

స తస్యా వివృతే వక్త్రే వజ్రసంహననః కపిః,
సంక్షిప్య ముహురాత్మానం నిష్పపాత మహాబలః. ౧౮౩

ఆస్యే తస్యా నిమజ్జంతం దదృశుస్సిద్ధచారణాః,
గ్రస్యమానం యథా చంద్రం పూర్ణం పర్వణి రాహుణా. ౧౮౪

తతస్తస్యా నఖైస్తీక్ష్ణైర్మర్మాణ్యుత్కృత్య వానరః,
ఉత్పపాతాథ వేగేన మనస్సంపాతవిక్రమః. ౧౮౫

తాం తు దృష్ట్వా(ష్ట్యా) చ ధృత్యా చ దాక్షిణ్యేన నిపాత్య చ,
స కపిప్రవరో వేగాద్వవృధే పునరాత్మవాన్. ౧౮౬

హృతహృతాస్సా హనుమతా పపాత విధురాంభసి,
[స్వయంభువైవ హనుమాన్ సృష్టస్తస్యా నిపాతనే]
**తాం హతాం వానరేణాశు పతితాం వీక్ష్య సింహికామ్.** ౧౮౭

ఆ హనుమంతుండు బుద్ధిమంతుండు కావున నాసింహికను దానికార్యంబుచేఁ దత్త్వంబుగా నెఱింగి వర్షాకాలమందు మేఘంబు వృద్ధిఁబొందునట్లు మేను బెంచెను. ౧౭౯

ఆ సింహిక హనుమంతుండు దేహముం బెంచుటఁ జూచి తననోటిని పాతాళమునకు సరియగునట్లుగా విచ్చెను. ౧౮౦

ఆ సింహిక మేఘపంక్తియుంబోలె గర్జించుచు హనుమంతుం దఱిమి పట్టుకొనఁ బోయెను. ౧౮౧

ఆ హనుమంతుండు తెఱవఁబడి తనదేహము మ్రింగుటకుం జాలి యుండు నాసింహిక గొప్పనోరును జూచి బుద్ధిమంతుండు గావున దాని జీవస్థానంబులనుం గనిపెట్టెను. ౧౮౨

మహాబలుండును వజ్రముంబోలె నతికఠినమయిన దేహంబుగలవాఁడు నగు హనుమంతుఁడు తనదేహంబును మిక్కిలియుఁ జిన్నదిగాఁ జేసికొని తెలివియుండు నా సింహికవక్త్రంబు జొచ్చెను. ౧౮౩

హనుమంతుఁ డాసింహికవక్త్రంబు చొచ్చునప్పుడు పూర్ణిమయందు రాహువుచే గ్రహింపఁబడుచుండు నిండు చంద్రుఁడుంబోలె సిద్ధచారణులు మున్నగు చూపరులకుఁ జూపట్టెను. ౧౮౪

అంత హనుమంతుండు మనంబునకుంబోలె వేగంబు గలిగి కఱకు గోళ్లచే నాసింహికమర్మంబులఁ జీలిచి యది నోరు మూయుంటకు మున్నే వేగంబున నా నోటినుండి వెడలెను. ౧౮౫

వానరశ్రేష్ఠుండగు నాహనుమంతుండు సూక్ష్మంబు కనిపెట్టి ధైర్యంబునను సామర్థ్యంబునను ఆసింహికం బడఁద్రోసి బుద్ధిమంతుండు కావున వేగంబున మరల దేహంబుఁ బెంచికొనెను. ౧౮౬

అట్లు హనుమంతుఁడు సింహికగుండె నలియఁగొట్టఁగా నది స్మృతి దప్పి నీటంబడినది. (దానిచావు ఆంజనేయునిచేతిలో నున్నదని దేవుఁడే నిర్ణయించెను.)

అట్లు హనుమంతునిచే జంపఁబడి నీటంబడియున్న సింహికం జూచి

భూతాన్యాకాశచారీణి తమూచుః ప్లవగోత్తమం,

భీమమద్య కృతం కర్మ మహత్సత్త్వం త్వయా హతమ్. ౧౮౮
సాధయార్థ మభిప్రేత మరిష్టం ప్లవతాంవర,
యస్యత్వేతాని చత్వారి వానరేంద్ర యథా తవ. ౧౮౯
ధృతిర్దృష్టిర్మతిర్దాక్ష్యం స్వకర్మసు న సీదతి,

స తైస్సంభావితః పూజ్యః ప్రతిపన్నప్రయోజనః. ౧౯౦
జగామాకాశ మావిశ్య పన్నగాశనవత్కపిః,

ప్రాప్తభూయిష్ఠపారస్తు సర్వతః ప్రతిలోకయన్. ౧౯౧
యోజనానాం శతస్యాంతే వనరాజిం దదర్శ సః,

దదర్శ చ పతన్నేవ వివిధద్రుమభూషితమ్. ౧౯౨
ద్వీపం శాఖామృగశ్రేష్ఠో మలయోపవనాని చ,

సాగరం సాగరానూపం సాగరానూపజాన్ద్రుమాన్. ౧౯౩
సాగరస్య చ పత్నీనాం ముఖాన్యపి విలోకయన్,
సమహామేఘసంకాశం సమీక్ష్యాత్మానమాత్మవాన్. ౧౯౪
నిరుంధంత మివాకాశం చకార మతిమాన్మతిం,
కాయవృద్ధిం ప్రవేగం చ మమ దృష్ట్వైవ రాక్షసాః. ౧౯౫
మయి కౌతూహలం కుర్యురితి మేనే మహాకపిః,
తతశ్శరీరం సంక్షిప్య తన్మహీధరసన్నిభమ్. ౧౯౬
పునః ప్రకృతిమాపేదే వీతమోహ ఇవాత్మవాన్,

యాకాశంబునందు సంచరించు భూతంబులు సంతోషమున వానరశ్రేష్ఠుండగు హనుమంతుం జూచి యిట్లని చెప్పినవి. ౧౮౭

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీవలె నెట్టి కష్టంబులందైన వెంక్కపోవని ధైర్యమును సూక్ష్మదృష్టియుఁ దత్త్వనిశ్చయశక్తియుఁ బనులయందు నేర్పునుం గలవాఁడు తన కార్యములను నెఱవేర్చుకొనుటలో శ్రమమునొందఁడు. ఈమహాసత్త్వంబును నీవు చూపితివి. నీ విప్పుడు వినువారలకుంగూడ వెఱపుఁ బుట్టించు కార్యము గావించితివి. ఇంక నీకోరిన కార్యంబు సాధించుకొనుము. నీకు మంగళం బగుఁగాక. అని యా భూతంబులు హనుమంతునితోఁ జెప్పినవి. ౧౮౮, ౧౮౯

పూజనీయుండగు నాహనుమంతుండు ఆ భూతంబులచేఁ బూజింపంబడి ప్రకృతంబగు సింహికావధరూపంబయిన కార్యసిద్ధి నొంది యాకాశ మార్గంబున గరుత్మంతుఁడుంబోలెఁ బోయెను. ౧౯౦

ఆ హనుమంతుఁడు అవ్వలి సముద్రతీరముదగ్గఱకు వెళ్లి యంతటం గలయఁజూచుచుండఁగా నూఱామడల కవ్వల నడవులగుంపొకటి యతని కగపడెను. ౧౯౧

వానరశ్రేష్ఠుండగు హనుమంతుండు ఆకాశంబునం బోవుచునే నానావిధవృక్షంబుల నొప్పుచున్న లంకాద్వీపంబును మలయపర్వతమునందలి వనంబులనుం జూచెను. ౧౯౨

ధైర్యవంతుండగు హనుమంతుండు సముద్రతీరమును సముద్రతీరమునందలి వృక్షంబులను నదులు సముద్రంబునం గలియు స్థానంబులనుం జూచుచు తన దేహంబు మహామేఘంబుంబోలి యాకాశము నడ్డగించునట్లుండుటం గని బుద్ధిమంతుండు కావున నిట్లని యాలోచించెను. ౧౯౩, ౧౯౪

“రాక్షసులు నాదేహ మిట్లు పెరిఁగియుండుటను నా వేగంబునుం జూచిరేని యాశ్చర్యంబు నొంది నన్నుం జూచి హాహాకారంబులు సేయుదురు. అంతఁ గార్యభంగంబగును.” అని యాలోచించెను. ౧౯౫

అంత హనుమంతుఁడు పర్వతాకారంబగు నాదేహంబు చిన్నదిగాఁ జేసి శరీరియగు జీవుం డజ్ఞానంబు వీడి తనవాస్తవరూపంబగు పరబ్రహ్మంబ యగునట్లు తన మునుపటిరూపంబు గైకొనెను. ౧౯౬

తద్రూపమతిసంక్షిప్య హనుమాన్ప్రకృతౌ స్థితః. ౧౯౭
త్రీన్క్రమానివ విక్రమ్య బలివీర్యహరో హరిః,

స చారునానావిధరూపధారీ
పరం సమాసాద్య సముద్రతీరం,
పరైరశక్యః ప్రతిపన్నరూప
స్సమీక్షితాత్మా సమవేక్షితార్థః. ౧౯౮

తతస్స లంబస్య గిరేస్సమృద్ధే
విచిత్రకూటే నిపపాత కూటే,
సకేతకోద్దాలకనాళికేరే
మహాద్రికూటప్రతిమో మహాత్మా. ౧౯౯
తతస్తు సంప్రాప్య సముద్రతీరం
సమీక్ష్య లంకాం గిరివర్యమూర్ధ్ని,
కపిస్తు తస్మిన్ నిపపాత పర్వతే
విధూయ రూపం వ్యథయన్మృగద్విజాన్. ౨౦౦

స సాగరం దానవపన్నగాయుతం
బలేన విక్రమ్య మహోర్మిమాలినం,
నిపత్య తీరే చ మహోదధేస్తదా
దదర్శ లంకామమరావతీమివ. ౨౦౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ప్రథమస్సర్గః.

హనుమంతుండు పర్వతాకారంబగు రూపంబును మిగులఁ జిన్నదిగాఁ జేసికొని త్రివిక్రమావతారంబున మూఁడడుగు లుంచి బలిచక్రవర్తి పరాక్రమంబు హరించిన విష్ణుదేవుండు మరలఁ బూర్వపు వామనరూపంబునొందినట్లు తన పూర్వరూపంబు నొందెను. ౧౮౭

ఆహనుమంతుండు అద్భుతాకారంబులకుం దగినట్లు సుందరంబుగా నానావిధరూపంబులు ధరించుచు సింహిక మున్నగుశత్రువులకు లోఁబడక యవ్వలి సముద్రతీరంబుఁ జేరి మిక్కిలి గొప్పదిగానుండు తనదేహంబుఁ జూచుకొని 'ఇంక నింతటి దేహంబుతో నుండరాదు. ఉండినచో రాక్షసులు నన్నుం జూచి యాశ్చర్యపడి కలకలంబు సేయుదురు. దానం జేసి కార్యభంగం బగు' నని యాలోచించి తన యెప్పటిరూపంబుఁ దాల్చెను. (పిల్లియంతటి రూపంబు దాల్చెను అని కొందఱు.) ౧౯౮

అంత గొప్పకొండశిఖరంబునకుఁబోలె స్థైర్యంబుగలవాఁడును మిక్కిలియుం బుద్ధిమంతుండునగు హనుమంతుండు అన్నిటనుసమృద్ధంబై నానావిధంబులగు నవాంతరశిఖరంబులు గలిగి మొగలిపొదలతోడను విరిగిచెట్లతోడను నారికేళవృక్షంబులతోడను గూడియున్న యాలంబపర్వతశిఖరంబునందు వ్రాలెను.

అంత నాహనుమంతుండు సముద్రతీరంబునొద్దకుఁ బోయి త్రికూటపర్వతశిఖరంబునందున్న లంకం జూచుచుఁ దనదేహమును విదిర్చికొని జంతులును బక్షులును భయంపడునట్లు సేయుచు నాలంబపర్వతముపై వ్రాలెను.

ఆ హనుమంతుండు బలంబున దానవులతోను సర్పంబులతోను నిండి గొప్పయలలు గలిగియున్న సముద్రంబు దాఁటి తీరంబున వ్రాలి యమరావతిం బోలియున్న లంకాపురిం జూచెను. ౨౦౧

ఇది మొదటిసర్గము.

## ద్వితీయస్సర్గః

స సాగరమనాధృష్యమతిక్రమ్య మహాబలః,
త్రికూటశిఖరే లఙ్కాం స్థితాం స్వస్థో దదర్శహ. ౧

తతః పాదపముక్తేన పుష్పవర్షేణ వీర్యవాన్,
అభివృష్టః స్థితస్తత్ర బభౌ పుష్పమయో యథా. ౨

యోజనానాం శతం శ్రీమాం స్తీర్త్వాఽప్యుత్తమవిక్రమః,
అనిశ్శ్వసన్కపి స్తత్ర న గ్లాని మధిగచ్ఛతి. 3

శతాన్యహం యోజనానాం క్రమేయం సుబహూన్యపి,
కిం పునస్సాగరస్యాన్తం సఙ్ఖ్యాతం శతయోజనమ్. ౪

స తు వీర్యవతాం శ్రేష్ఠః ప్లవతామపి చోత్తమః,
జగామ వేగవాన్ లఙ్కాం లఙ్ఘయిత్వా మహోదధిమ్. ౫

శాద్వలాని చ నీలాని గన్ధవన్తి వనాని చ,
గండవంతి చ మధ్యేన జగామ నగవంతి చ. ౬

శైలాంశ్చ తరుసంఛన్నాన్ వనరాజీశ్చ పుష్పితాః,
అభిచక్రామ తేజస్వీ హనుమాన్ ప్లవగర్షభః. ౭

స తస్మిన్నచలే తిష్ఠన్ వనాన్యుపవనాని చ,

# రెండవ సర్గము

మహాబలుండగు నా హనుమంతుండు ఎవ్వరికినిం గాలుపెట్ట నలవి గాని సముద్రంబు దాఁటి యంత స్వస్థుండై త్రికూటశిరంబుననున్న లంకా పురిం జూచెను. ౧

అంతఁ బరాక్రమశాలియగు నా హనుమంతుండు ఆపర్వతమునందలి వృక్షంబులనుండి యెడతెగక రాలినపూలచేఁ గప్పఁబడుటం జేసి పువ్వుల కోఁతి యనందగి యొప్పెను. ౨

హనుమంతుం డట్లు నూఱుయోజనంబుల సముద్రంబు దాఁటినవాఁ డయ్యును అందఱికన్న నధికుండును మహాపరాక్రమశాలియుఁ గావున నిట్టూర్పునైనను విడువనివాఁడై యెంతమాత్రము నలసటను బొందఁడయ్యె. ౩

"నేను పెక్కు నూఱామడల దూరమునైనను దాఁటంగలను. అట్టి నేను నూఱామడలుగల యీసముద్రము దాఁటితిని. ఏమి యాశ్చర్యము!" అని హనుమంతుఁడు తలంచెను. ౪

వానరు లనేకు లున్నను ఎవ్వరును సాహసింపకుండఁగా నా హను మంతుండు మాత్రము పరాక్రమవంతులలో శ్రేష్ఠుండు నెగురువారిలో నుత్తముఁడు వేగవంతుఁడు గావున మహాసముద్రంబును దాఁటి లంకఁ జేరం గలిగెను. ౫

ఆ హనుమంతుఁడు నల్లని లేఁతపచ్చికభూములను మంచివాసన గలిగి పెద్దఱాళ్లను జిన్నకొండలును గలిగియుండు నడవులను మధ్యమార్గంబునఁ జూచుచుఁ బోయెను. ౬

మహాపరాక్రమశాలియు వానరశ్రేష్ఠుఁడు నగు హనుమంతుఁడు దట్టముగా వృక్షంబులు గలిగిన పర్వతశిఖరంబులను జక్కఁగాఁ జూచియుండు నడవులను దాఁటిపోయెను. ౭

ఆ హనుమంతుఁ డా లంబపర్వతంబునందుండి యడవులను లంకా పట్టణమునకుఁ జేరిన యుద్యానవనంబులను జూచెను.

స నగాగ్రే చ తాం లంకాం దదర్శ పవనాత్మజః. ౮

సరళాన్ కర్ణికారాంశ్చ ఖర్జూరాంశ్చ సుపుష్పితాన్,
ప్రియాళాన్ ముచుళిందాంశ్చ కుటజాన్ కేతకానపి. ౯
ప్రియంగూన్ గంధపూర్ణాంశ్చ నీపాన్ సప్తచ్ఛదాంస్తథా,
అసనాన్ కోవిదారాంశ్చ కరవీరాంశ్చ పుష్పితాన్. ౧౦
పుష్పభారనిబద్ధాంశ్చ తథా ముకుళితానపి,
పాదపాన్ విహగాకీర్ణాన్ పవనాధూతమస్తకాన్. ౧౧
హంసకారండవాకీర్ణా వాపీః పద్మోత్పలాయుతాః,
ఆక్రీడాన్ వివిధాన్ రమ్యాన్ వివిధాంశ్చ జలాశయాన్. ౧౨
సంతతాన్ వివిధైర్వృక్షైస్సర్వర్తుఫలపుష్పితైః,
ఉద్యానాని చ రమ్యాణి దదర్శ కపికుంజరః. ౧౩

సమాసాద్య చ లక్ష్మీవాన్ లంకాం రావణపాలితాం,
పరిఖాభి స్సపద్మాభిస్సోత్పలాభిరలంకృతామ్. ౧౪
సీతాపహరణార్థేన రావణేన సురక్షితాం,
సమంతాద్విచరద్భిశ్చ రాక్షసై రుగ్రధన్విభిః. ౧౫
కాంచనేనావృతాం రమ్యాం ప్రాకారేణ మహాపురీం,
గృహైశ్చ గ్రహసంకాశై శ్శారదాంబుదసన్నిభైః. ౧౬
పాండురాభిః ప్రతోళీభిరుచ్చాభిరభిసంవృతాం,
అట్టాలకశతాకీర్ణాం పతాకాధ్వజమాలినీమ్. ౧౭
తోరణైః కాంచనైర్దివ్యైర్లతాపఙ్క్తివిచిత్రితైః,
దదర్శ హనుమాన్ లంకాం దివి దేవపురీం యథా. ౧౮

వాయుదేవునికుమారుం డగుహనుమంతుఁడు ఆలంబపర్వతమునుం దుండి త్రికూటపర్వతము శిఖరమందున్న లంకాపట్టణమును జూచెను. ౧

వానరశ్రేష్ఠుం డగుహనుమంతుఁడు ఆలంబపర్వతంబునందుండి లంకాపురిచుట్టునుండు సరళంబులుఁ గొండగోఁగులుఁ జక్కఁగాఁ బూచియున్న ఖర్జూరంబులు, మోరటులు, జంబీరంబులుఁ, గొండమల్లెలు, మొగలులు, మంచివాసన గలవిప్పలు, మంకెనలు, నేడాకులయరంటులు, వేఁగిసలుఁ, గాంచనములుఁ, బుష్పితంబు లగు గన్నేరులు మొదలగువృక్షంబులును, మఱియుఁ జక్కఁగాఁ బూచియున్నందునఁ జాలబరువునఁ జేసి వంగినవియు, నట్లు మొగ్గలు విడిచియుండినవియుఁ, బక్షులచే నాశ్రయింపఁబడి గాలికిం గదలు కొమ్మలు గలవియు నగువృక్షంబులును, హంసలుఁ గారండవంబులు మొదలగుపక్షులచే మనోహరంబులై కమలంబులుఁ గలువలుం గలిగి యొప్పుచుండునడబావులను, నానావిధంబు లగుసుందరంబులయిన పౌరజనోద్యానంబులను, సమస్తఋతువులం గలుగుఫలంబులును, బుష్పంబులునుం గల నానావిధంబు లగువృక్షంబులచే నొప్పుచుండు పలుదెఱంగులయినకోనేఱులును మఱియు మనోహరంబు లగురాజోద్యానంబులను జూచెను. ౯-౧౩

విజయసూచకం బగుకాంతి నొందియుండు హనుమంతుండు అట్లు రావణునిచేఁ బాలింపఁబడు లంకాపురిం జేరి కమలంబులను గలువలనుం బోలుచు నగర్తలచేఁ జుట్టఁబడి సీత నపహరించి యుండుటం జేసి యుద్ధంబునకు రాముండు వచ్చుననుశంకవలన రావణునిచేతను భయంకరంబులగు ధనువులు ధరించి యంతటనుం దిరుగుచుఁ గాచుచుండు రాక్షసులచేతను ఎవ్వరును లోనికిం జొరకుండునట్లు చక్కఁగా రక్షింపఁబడుచుఁ గాంచనమయం బగు ప్రాకారంబులచే నావృతంబై రమణీయంబై తెల్లగా నత్యున్నతంబు లయియుంటం జేసి శరత్కాలంబునందలి మేఘంబులను, జంద్రశుక్రాదిగ్రహంబులనుం బోలు గృహంబుల నొప్పుచుండు వీథులం బూర్ణంబై లెక్కలేనికోట బురుజులు గలిగి సాధారణములగు రాజకీయంబులగుధ్వజంబులనుం బోలుచుచు హిరణ్మయంబులై దివ్యంబులై తీఁగెలఁబోలురేఖలం జిత్రితంబులై యుండు

గిరిమూర్ధ్ని స్థితాం లంకాం పాణ్డురైర్భవనైశ్శుభైః,
దదర్శ స కపిశ్శ్రేష్ఠః పురమాకాశగం యథా. ౧౯

పాలితాం రాక్షసేంద్రేణ నిర్మితాం విశ్వకర్మణా,
ప్లవమానామివాకాశే దదర్శ హనుమాన్పురీమ్. ౨౦

వప్రప్రాకారజఘనాం విపులామ్బునవామ్బరాం,
శతఘ్నీ శూలకేశాన్తా మట్టాలకవతంసకామ్. ౨౧
మనసేవ కృతాం లఙ్కాం నిర్మితాం విశ్వకర్మణా,

ద్వారముత్తరమాసాద్య చిన్తయామాస వానరః. ౨౨

కైలాసశిఖరప్రఖ్యా మాలిఖన్తీమివామ్బరం,
డీయమానామివాకాశముచ్ఛ్రితైర్భవనోత్తమైః. ౨౩
సమ్పూర్ణాం రాక్షసైర్ఘోరైర్నాగైర్భోగవతీమివ,
అచిన్త్యాం సుకృతాం స్పష్టాం కుబేరాధ్యుషితాం పురా. ౨౪
దంష్ట్రిభిర్బహుభిశ్శూరైశ్శూలపట్టసపాణిభిః,
రక్షితాం రాక్షసైర్ఘోరైర్గుహామాశీవిషైరివ. ౨౫
తస్యాశ్చ మహతీం గుప్తిం సాగరం చ నిరీక్ష్య సః,
రావణం చ రిపుం ఘోరం చిన్తయామాస వానరః. ౨౬

ద్వారంబుల నలంకృతంబై స్వర్గంబుననుండు నమరావతియుంబోలెఁ జూపట్టు చుండు లంకాపురిం జూచెను. ౧౭-౧౮

వానరశ్రేష్ఠుఁ డగునాహనుమంతుఁడు సున్నము పూసియుండుటఁజేసి తెల్లనివై మంగళకరంబు లైనగృహంబులు కలిగి పొడవైన త్రికూటశిఖరంబునం దుండునది కావున ఆకాశమునందుండు పట్టణం బనందగి యొప్పు చున్న లంకాపట్టణంబుం జూచెను. ౧౯

ఆహనుమంతుండు రాక్షసుల కందఱకుఁ బ్రభు వగు రావణునిచే రక్షింపఁబడుచు విశ్వకర్మచే నిర్మింపఁబడి పర్వతశిఖరంబున నున్నదగుటంజేసి యాకాశంబునం దేలుచుండునట్టు చూపట్టుచున్న లంకాపట్టణంబుఁ జూచెను.

హనుమంతుఁడు కోటకొఱడులును కోటగోడలును జఘనముగాను, సముద్రంబు నూతనవస్త్రంబులను, నాలుగుమూరల నిడివిగల యినుపముండ్ల కఱ్ఱలు శూలంబులును దలవెండ్రుకలుగాను, కోటబురుజులు చెవిమీఁది యలంకారపుష్పంబులుగాను ఒప్పుచుండఁగా సుందరవనితయుంబోలె శోభిల్లుచు వాస్తవంబుగా విశ్వకర్మచేనిర్మింపఁబడినదయ్యు మహానుభావుం డెవ్వఁడో మనంబున సృజించియుండుచు అని యెన్నందగియుండు నాలంకాపురిం జూచెను. ౨౧

హనుమంతుఁడు అట్టు లాలంకాపురి యుత్తరపుదిక్కునందలి ద్వారంబుఁ జేరి యాలోచించెను. ౨౨

ఆహనుమంతుండు తెల్లగా నత్యున్నతంబై యుంటం జేసి కైలాస శిఖరముతోఁ దుల్యమై యున్నతంబులగు మేలయినగృహంబును గలుగుటం జేసి యాకాశంబు నొరయుచున్నదివోలె నాకాశంబున కెగిరిపోవునదివోలెఁ జూపట్టుచు భయంకరులగు రాక్షసులచే సంపూర్ణంబై సర్పంబులచే నిండి యుండు భోగవతీపురియుంబోలెఁ బ్రకాశించుచు మనంబున నెన్నుటకు నలవి గానిదై విశ్వకర్మచేఁ జక్కఁగా నిర్మింపఁబడి యన్నిటను స్పష్టంబయి పూర్వము కుబేరున కునికిపట్టైనదై యిప్పు డాకుబేరునకుంగూడ లోనికిఁ జొరనలవిగానిదై కోఱలుగల్గి శూలంబులఁ బట్టసంబులఁ గేలందాల్చియుండు

ఆగత్యాపీహ హరయో భవిష్యంతి నిరర్థకాః,
న హి యుద్ధేన వై లంకా శక్యా జేతుం సురైరపి. ౨౭

ఇమాంతు విషమాం దుర్గాం లంకాం రావణపాలితాం,
ప్రాప్యాపి స మహాబాహుః కిం కరిష్యతి రాఘవః. ౨౮

అవకాశో న సాంత్వస్య రాక్షసేష్వభిగమ్యతే,
న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే. ౨౯

చతుర్ణామేవహి గతిర్వానరాణాం మహాత్మనాం,
వాలిపుత్రస్య నీలస్య మమ రాజ్ఞశ్చ ధీమతః. ౩౦

యావజ్జానామి వై దేహీం యది జీవతివా నవా,
తత్రైవ చింతయిష్యామి దృష్ట్వా తాం జనకాత్మజామ్. ౩౧

తతస్స చింతయామాస ముహూర్తం కపికుంజరః,
గిరిశృంగే స్థిత స్తస్మిన్ రామస్యాభ్యుదయే రతః. ౩౨

శూరులగు ననేకరాక్షసులచే రక్షితంబై సర్పంబులచే రక్షింపఁబడు గుహాయుం బోలె వెలుపఁ బుట్టింపుచున్న యాలంకాపట్టణంబుఁ జూచి దాని రాక్షసులు రక్షించురీతి నరసి దాఁట నలవిగాని సముద్రముఁదలంచుకొని రావణుని భయంకరుండగు శత్రునిగాఁ దెలిసికొని యిట్లని యాలోచించెను. ౨౩-౨౬

వానరులు దుస్తరంబగు నీసముద్రంబు దాఁటి యిచ్చటికి వచ్చుటయే దుర్లభంబు. ఈలంకను దేవతలుఁగూడ యుద్ధంబున జయింపఁ జాలరుగావున అట్లు రాఁగలిగి వచ్చినను బ్రయోజనంబు లేదు. ౨౭

రాముఁడు మహాబాహుం డయ్యును, సప్తసాలంబులఁ బర్వతంబు భూమి నొక్కబాణంబున విదళించిన మహాపరాక్రమశాలియయ్యును నిచ్చటికి దుస్తరం బగుసముద్రంబు దాఁటి వచ్చుటయే యసాధ్యంబు. అట్లు రాఁగలిగి వచ్చినను అతివిషమంబై లోనికింజొర నశక్యంబై రావణునిచేఁ బాలింపఁబడుచున్న యీలంకయం దేమి సేయఁగలఁడు ? ౨౮

రాక్షసులు అతిక్రూరులు కావున వారలయందు సామోపాయము పనికిరాదు. వారలకు ధనంబు పుష్కలంబుగా నున్నది కావున దానోపాయము నుపయోగింపదు. బలగర్వితులు కావున భేదోపాయంబునను బ్రయోజనంబు లేదు. అతిబలిష్ఠులు కావున యుద్ధంబున కవకాశంబే లేదు. ౨౯

మహాపరాక్రమశాలురగు వానరులలోపల వాలికుమారుఁ డగునంగదుండును, నీలుండును, నేను, బుద్ధిమంతుం డగు వానరరాజైన సుగ్రీవుండును ఈనల్వురు మాత్రంబె సముద్రంబుదాఁటి యిచ్చటికి రాఁగలము. మఱి యెవ్వరికి నలవిగాదు. ౩౦

ఇప్పు డెందుల కీ విచారము ? సీత బ్రతికియున్నదా ? లేదా ? యని తెలిసికొనఁ బోవుచునే యున్నాను. బ్రతికియుండునేని యాసీతం జూచి యప్పుడే యాలోచించెదను. ౩౧

అటుపిమ్మట వానరశ్రేష్ఠుఁ డగుహనుమంతుఁడు ఆ లంబపర్వతశిఖరంబునందుండి రాముని యభ్యుదయంబుఁగోరి మరల నిట్లని చక్కఁగా నాలోచించెను. ౩౨

అనేన రూపేణ మయా న శక్యా రక్షసాం పురీ,
ప్రవేష్టుం రాక్షసైర్గుప్తా క్రూరైర్బలసమన్వితైః. ౩౩

ఉగ్రౌజసో మహావీర్యా బలవంతశ్చ రాక్షసాః,
వంచనీయా మయా సర్వే జానకీం పరిమార్గతా. ౩౪

లక్ష్యాలక్ష్యేణ రూపేణ రాత్రౌ లంకాపురీ మయా,
ప్రవేష్టుం ప్రాప్తకాలం మే కృత్యం సాధయితుం మహత్. ౩౫

తాం పురీం తాదృశీం దృష్ట్వా దురాధర్షాం సురాసురైః,
హనుమాన్ చింతయామాస వినిశ్చిత్య ముహుర్ముహుః. ౩౬

కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజాం,
అదృష్టో రాక్షసేంద్రేణ రావణేన దురాత్మనా. ౩౭

న వినశ్యేత్కథం కార్యం రామస్య విదితాత్మనః,
ఏకామేకశ్చ పశ్యేయం రహితే జనకాత్మజామ్. ౩౮

భూతాశ్చార్థా విపద్యంతే దేశకాలవిరోధితాః,
విక్లబం దూతమాసాద్య తమస్సూర్యోదయే యథా. ౩౯

రాక్షసపట్టణం బగు నీ లంకాపురిని శూరులును బలిష్ఠులు నగు రాక్షసు లంతటను రక్షించుచున్నారు. కావున నేను ఈరూపంబుతోనే దీనిం బ్రవేశింప నలవిగాదు. ౩౩

నేను సీతనువెదకునపుడు భయంకరం బగు నుత్సాహంబు గలవారు మహాపరాక్రమశాలురు బలవంతులు నగురాక్షసుల కెవ్వరికిని గనుపడక వారల నందఱను మోసపుచ్చవలయును. ౩౪

నేను మిక్కిలియుఁ బెద్దరూపముతో లంకం బ్రవేశింతునేని నన్ను రాక్షసులు పట్టుకొందురు. మిక్కిలియుఁ జిన్నరూపముతోఁ బ్రవేశింతునేని లంకాపురియంతయు, గలయం దిరుగుటకు వీలుకాదు. కావున సీతను వెదకుట యనెడు నాదుగొప్పకార్యమును సాధించుకొనుటకై నేను రాత్రియందు మిక్కిలియుఁ జిన్నదియుఁగాని బెద్దదియుఁ గాని శరీరంబు వహించి లంకం బ్రవేశించుట యుక్తము అని హనుమంతుం డాలోచించెను. ౩౫

హనుమంతుండు పైఁ జెప్పఁబడినట్లు చక్కఁగా రక్షింపఁబడి దేవతలకు నసురులకు నెదిరింప నలవిగాకుండు నాలంకాపురిం జూచి సీతను వెదకురీతిని నిశ్చయించియుఁ గార్యంబు నెడు ననుభయంబునం జేసి మాటిమాటికిని నిట్లని యాలోచించెను. ౩౬

రావణుఁ డతిబలవంతులని వినుతికెక్కిన రాక్షసులకందఱకును బ్రభుండు దురాత్ముండును గావున నసుం జూచునేని యూరకుండఁడు. దూతయని వద లఁడు. మఱి పట్టుకొని బంధించి నానాప్రకారంబులఁ గాఱియ పెట్టును! దానంజేసి కార్యభంగంబగు. కాఁబట్టి నే నతని కనులం బడకయే జనకుని కూఁతురగు సీతను వెదకవలయును. దాని కేమి యుపాయంబు? ౩౭

పరమాత్మజ్ఞానియగు రాముని కార్యంబు చెడకుండుట కేమియుపాయంబు? నే నెవ్వరు లేకుండునప్పుడు ఒకఁడుగానే యేకాంతమందు ఒక్కతెగానే యున్నసీతం జూచుట యెట్లు పొసఁగును? ౩౮

ఉపాయంబులచే సిద్ధప్రాయంబుగాఁ జేయఁబడిన కార్యంబులుఁగూడ నాలోచించిచేయం జేతఁగాని వివేకశూన్యుఁడగుదూతచే నడుపఁబడునేని కాలవిరోధంబు నొంది సూర్యోదయకాలంబునం జీఁకట్లు నశించునట్లు నశించును. ౩౯

అర్థానర్థాంతరే బుద్ధిర్నిశ్చితాఽపి న శోభతే,
ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః. ౪౦

న వినశ్యేత్కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్,
లంఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్. ౪౧

మయి దృష్టే తు రక్షోభీ రామస్య విదితాత్మనః,
భవేద్వ్యర్థమిదం కార్యం రావణానర్థ మిచ్ఛతః. ౪౨
న హి శక్యం క్వచిత్స్థాతుమవిజ్ఞాతేన రాక్షసైః,
అపి రాక్షసరూపేణ కిముతాన్యేన కేనచిత్. ౪౩

వాయురప్యత్ర నాజ్ఞాతశ్చరేదితి మతిర్మమ,
న హ్యస్త్యవిదితం కించిద్రాక్షసానాం బలీయసామ్. ౪౪

ఇహాహం యది తిష్ఠామి స్వేన రూపేణ సంవృతః,
వినాశముపయాస్యామి భర్తురర్థశ్చ హీయతే. ౪౫
తదహం స్వేన రూపేణ రజన్యాం హ్రస్వతాం గతః,
లంకామభిపతిష్యామి రాఘవస్యార్థసిద్ధయే. ౪౬
రావణస్య పురీం రాత్రౌ ప్రవిశ్య సుదురాసదాం,
విచిన్వన్ భవనం సర్వం ద్రక్ష్యామి జనకాత్మజామ్. ౪౭

తమకుఁ బాండిత్యము లేకపోయినను దాము పండితులని యహంకరించి యుండు నవివేకులైనదూతలు ఆలోచించి చేయంజేతఁగానివారలై తమ కాజ్ఞాపింపంబడిన కార్యములను జెఱుతురు. కావున రాజును మంత్రులునుం జేరి 'ఇది కార్యము. ఇది యకార్యము." అని యెంత యాలోచించి నిశ్చయించినను, వారినిశ్చయము దూత యవివేకియైనచో నెంతమాత్రమునుపయోగింపదు.

నే నిప్పు డపరాహ్ణకాలంబున నె లంకం బ్రవేశింతునా? పెద్దశరీరంబుతో లంకలోనికిం బోదునా? లేక చిన్నదేహంబు దాల్చి పోదునా? ఎట్లు చేసిన రామకార్యంబు చెడకుండు? నాకును వివేకశూన్యుం డను పేరు రాకుండు? దుస్తరం బగునీసముద్రంబు దాటుట వ్యర్థంబుగాకుండు? ౪౧

నేను రాక్షసుల కగపడుదునేని రావణునికీడుగోరుచుండు పరమాత్మజ్ఞాని యగురామునికార్యంబంతయు నిష్ప్రయోజనంబై నశించును. ౪౨

నేను రాక్షసరూపము ధరించి రాక్షసులలోఁ గలసి ఈలంకలో నే ప్రక్కనున్నను రాక్షసులు ననుం గనుఁగొందురు. అట్లుండఁగా నింక నితరమైన వానరరూపము మొదలగునవి ధరించి వారలకుం దెలియకుండ నిచ్చట నెట్లుండనేర్తు? ౪౩

బలవంతులగు నీరాక్షసులకుఁ దెలియని దేదియుం లేదు. కావున వాయువుగూడ రూపములేనివాఁడయ్యు నీరాక్షసు లెఱుంగకుండ నీలంకం దిరుగలేఁడని నాయభిప్రాయము. ౪౪

నే నిచ్చట నాస్వాభావికంబగురూపముతోఁ గూడియుందునేని నాకుఁ గీడువాటిల్లును. రామునికార్యమును జెడిపోవును. ౪౫

కావున నేను రామునికార్యంబు నెఱవేఱుటకై రాత్రియందు సూక్ష్మంబగురూపము ధరించి నాదైన వానరరూపంబున నే లంకం బ్రవేశించెదను. ౪౬

నేను ఎంతమాత్రమును బ్రవేశింప నలవిగాని రావణునిపట్టణం బగు లంకను రాత్రియందుఁ బ్రవేశించి అన్నియిండ్లనుం గలయ వెదకి సీతం జూచెద నని హనుమంతుం డాలోచించెను. ౪౭

ఇతి సంచింత్య హనుమాన్ సూర్యస్యాస్తమయం కపిః,
ఆచకాంక్షే తదా వీరో వైదేహ్యా దర్శనోత్సుకః. ౪౮
సూర్యే చాస్తం గతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః,
పృషదంశకమాత్రస్సన్ బభూవాద్భుతదర్శనః. ౪౯

ప్రదోషకాలే హనుమాం స్తూర్ణముత్ప్లుత్య వీర్యవాన్,
ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్. ౫౦

ప్రాసాదమాలావితతాం స్తంభైః కాంచనరాజతైః,
శాతకుంభమయైర్జాలైర్గంధర్వనగరోపమామ్. ౫౧
సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీం,
తలైస్స్ఫటికసంకీర్ణైః కార్తస్వరవిభూషితైః. ౫౨

వైడూర్యమణిచిత్రైశ్చ ముక్తాజాలవిభూషితైః,
తలైశ్శుశుభిరే తాని భవనాన్యత్ర రక్షసామ్. ౫౩

కాంచనాని చ చిత్రాణి తోరణాని చ రక్షసాం,
లంకాముద్యోతయామాసుస్సర్వతస్సమలంకృతామ్. ౫౪
అచింత్యామద్భుతాకారాం దృష్ట్వా లంకాం మహాకపిః,
ఆసీద్విషణ్ణో హృష్టశ్చ వైదేహ్యా దర్శనోత్సుకః. ౫౫
స పాండురోద్విద్ధవిమానమాలినీం
మహార్హజాంబూనదజాలతోరణాం,
యశస్వినీం రావణబాహుపాలితాం
క్షపాచరైర్భీమబలైస్సమావృతామ్. ౫౬

పరాక్రమశాలి యగుహనుమంతుం డిట్లాలోచించి సీతంజూడఁ గోరుచు సూర్యాస్తమయంబు నెదురుచూచుచుండె. ౪౮

వాయుదేవుని కుమారుం డగుహనుమంతుండు సూర్యుం డస్తమింపఁ గానే రాత్రియందుఁ దనదేహంబును జిన్నదిగాఁ జేసి, పిల్లియంతటి ప్రమాణంబు నొంది చూపఱ కాశ్చర్యంబుఁ బుట్టించుచుండెను. ౪౯

పరాక్రమశాలి యగుహనుమంతుండు ప్రదోషకాలమునందు శీఘ్రముగాఁ గోఁతులు పరుగులిడునట్లు ఎగిరిఎగిరినడుచుచు సుందరంబై చక్కఁగా నేర్పఱుపఁబడిన రాజమార్గంబులు గలదై యుండు లంకం బ్రవేశించెను. ౫౦

ఆహనుమంతుండు ఎచ్చోటఁజూచినను బ్రాసాదంబులు గలిగి బంగారు స్తంభంబులచేతను వెండిస్తంభంబులచేతను అలంకృతంబై బంగారువికారంబులగుకిటికీలచేఁ బ్రకాశించుచు గంధర్వనగరంబుతో సాటిసేయందగి యేడంతస్తులమేడలు నెనిమిదంతస్తులమేడలును సాధారణంబుగాఁ గలిగి స్ఫటికమణులతో నిర్మింపఁబడిన ప్రదేశంబులను బంగారుచే నలంకరింపఁబడిన భూములను ఒప్పుచుండు లంకాపురిం జూచెను. ౫౧-౫౨

లంకాపురియందుండు రాక్షసులగృహంబులన్నియుం వైడూర్యమణుల నేర్పఱుపఁబడి ముత్తెములచే నలంకరింపఁబడియున్న ప్రదేశంబులచే నెంతయుం నొప్పుచుండినవి. ౫౩

బంగారువికారంబులై పలుజాతులగురంగులుదీర్చియుండు నారాక్షసులబహిర్ద్వారములును అంతటను అలంకరింపఁబడియుండు నాలంకకు మఱింత ప్రకాశము కలుగఁజేసినవి. ౫౪

ఆహనుమంతుండు ఎన్నటికిఁ గూడ నలవిగానిదై చూపరుల కాశ్చర్యంబుఁ బుట్టించునదై తెల్లగా నున్నతములయియుండు నేడంతస్తుల మేడలం బూర్ణంబై మంచిబంగారముతోఁ జేయఁబడినకిటికీల నొప్పుచుండు తోరణంబుల నలంకృతంబై కీర్తిసంపన్నంబై రావణునిచే భుజబలంబునఁ బాలింపఁబడుచు నంతటను వ్యాపించియుండు భయంకరబలు లగురాక్షసులచే రక్షింపఁబడులంకం జూచి "ఆహా! దీని వానరు లెట్లు లోఁగొందురు!" అని దుఃఖం

చంద్రోఽపి సాచివ్యమివాస్య కుర్వ న్
తారాగణైర్మధ్యగతో విరాజన్,
జ్యోత్స్నావితానేన వితత్య లోక
ముత్తిష్ఠతే నైకసహస్రరశ్మిః. ౫౭
శంఖప్రభం క్షీరమృణాళవర్ణ
ముద్గచ్ఛమానం వ్యవభాసమానం,
దదర్శ చంద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీవ హంసమ్. ౫౮

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్వితీయస్సర్గః.

## తృతీయస్సర్గః

స లంబశిఖరే లంబే లంబతోయదసన్నిభే,
సత్త్వమాస్థాయ మేధావీ హనూమాన్మారుతాత్మజః. ౧
నిశి లంకాం మహాసత్త్వో వివేశ కపికుంజరః,
రమ్యకాననతోయాఢ్యాం పురీం రావణపాలితామ్. ౨
శారదాంబుధరప్రఖ్యైర్భవనైరుపశోభితాం,
సాగరోపమనిర్ఘోషాం సాగరానిలసేవితామ్. ౩
సుపుష్టబలసంఘుష్టాం యథైవ విటపావతీం,
చారుతోరణనిర్యూహాం పాండురద్వారతోరణామ్. ౪
భుజగాచరితాం గుప్తాం శుభాం భోగవతీమివ,
తాం స విద్యుద్ఘనాకీర్ణాం జ్యోతిర్మార్గనిషేవితామ్. ౫

బును "సీతంజూడఁగోరువాఁడు కావున సీతం జూడఁగలను గదా!" యని సంతోషంబునుం బొందెను. ౫౫,౫౬

చంద్రుండు పెక్కువేలకిరణంబులు గలిగి చంద్రికచే లోకంబులకుఁ బ్రకాశంబు గలిగించి యీహనుమంతునకు మైనాకసముద్రులంబోలె సాహాయ్యంబు సేయువాఁడు వోలె నక్షత్రంబులనడుమ వెలుంగుచు నుదయించెను.

వానరవీరుం డగునాహనుమంతుండు శంఖంబునకుంబోలెఁ గాంతిగలిగి పాలును దామరతూండ్లునుం బోలెఁ దెల్లనివర్ణంబునం బ్రకాశించుచు నప్పుడ యుదయించుచుఁ గొలఁకునుండి యెగురుచున్న హంసయుంబోలెఁ జూపట్టు చంద్రునిం జూచెను. ౫౮

ఇది రెండవ సర్గము.

## మూడవ సర్గము.

మహాబలశాలియు వానరశ్రేష్ఠుఁడు వాయుదేవునికుమారుఁడు నగుహనుమంతుండు వంగినట్లున్నది కావున వంగియుండు మేఘంబుంబోలెఁ జూపట్టుచున్నయాలంబపర్వత శిఖరంబునం డిట్లు ధైర్య మవలంబించి బుద్ధిమంతుఁడు కావున రాత్రియందు సుందరములగు నడవులు నుదకంబులుం గలిగి యొప్పుచు రావణునిచేఁ బాలింపఁబడుచుండు లంకాపురిం బ్రవేశింపసాగెను. ౧,౨

శరత్కాలంబునందుఁ దెల్లగా నుండు మేఘంబులుంబోలె భాసిల్లుచుండుగృహంబుల విలసిల్లుచు జనుల కలకలంబునం జేసి సముద్రంబునకుం బోలె ధ్వనిగలిగి సముద్రపుగాలిచే సేవింపఁబడుచు బలవంతులగు సైనికులు సేయుసింహనాదంబులు గల్గి కుబేరుని యలకాపురిం బోలుచు ద్వారంబులం గట్టఁబడినసుందరంబులగు మదపుటేనుంగులుఁగల్గి సున్నముపూసియుండుటం జేసి తెల్లఁగానుండు ద్వారంబులును బహిర్ద్వారంబులును గల్గి రాక్షసులచే రక్షింపఁబడి మంగళకరంబై సర్పంబులచే రక్షింపఁబడిన భోగవతియుంబోలెఁ దేజరిల్లుచు నత్యున్నతంబులై మెఱపులతోడంగూడిన మేఘంబులను నక్షత్రంబు

మందమారుతసంచారాం యథేంద్రస్యామరావతీం,
శాతకుంభేన మహతా ప్రాకారేణాభిసంవృతామ్. ౬
కింకిణీజాలఘోషాభిః పతాకాభిరలంకృతాం,
ఆసాద్య సహసా హృష్టః ప్రాకారమభిపేదివాన్. ౭

విస్మయావిష్టహృదయః పురీమాలోక్య సర్వతః,

జాంబూనదమయైర్ద్వారైర్వైడూర్యకృతవేదికైః. ౮
వజ్రస్ఫటికముక్తాభిర్మణికుట్టిమభూషితైః,
తప్తహాటకనిర్యూహై రాజతామలపాండురైః. ౯
వైడూర్యకృతసోపానైస్స్ఫాటికాంతరపాంసుభిః,
చారుసంజవనోపేతైః ఖమివోత్పతితైశ్శుభైః. ౧౦
క్రౌంచబర్హిణసంఘుష్టై రాజహంసనిషేవితైః,
తూర్యాభరణనిర్ఘోషైస్సర్వతః ప్రతినాదితామ్. ౧౧
వస్వౌకసారాప్రతిమాం తాం వీక్ష్య నగరీం తతః,
ఖమివోత్పతితుం కామాం జహర్ష హనుమాన్ కపిః. ౧౨

తాం సమీక్ష్య పురీం రమ్యాం రాక్షసాధిపతేశ్శుభాం,
అనుత్తమామృద్ధియుతాం చింతయామాస వీర్యవాన్. ౧3

లనుం దాఁకుచుండు హర్మ్యంబుల నొప్పుచు రావణభయంబున సెప్పుడును మందంబుగనే వీచుచుండు మారుతంబుచే నలరుచు నింద్రుని యమరావతి కైవడి నతిరమణీయంబై హిరణ్మయంబగు గొప్ప ప్రాకారంబు గల్గి వాయువశంబున ధ్వనించుచుండు చిఱుగంటలు గట్టియుండు టెక్కెంబుల నలంకృతంబై యుండు నా లంకాపురింజొచ్చి హనుమంతుఁడు శీఘ్రంబుగాఁ బ్రాకారంబు సమీపంబునకుం బోయి సంతోషంబు నొందెను. 3-8

హనుమంతుఁడు అలంకాపురినంతటఁ గలయఁజూచి మనంబున నాశ్చర్య పడెను.

అంత నా హనుమంతుఁడు బంగారువికారంబులై వైడూర్యమణులతోఁ జేయఁబడిన తిన్నెలు గలిగి వజ్రములచేతను స్ఫటికమణులచేతను ముత్తెముల చేతను అలంకరింపఁబడి మణులతోఁ గట్టఁబడిన నేలనొప్పుచు మేలైనబంగారముతోఁ జేయఁబడి మనపుటేనుఁగు ప్రతిమలతోఁ గూడి వెండితోఁ గట్టఁబడి స్వచ్ఛంబులై తెల్లగానుండు ప్రదేశంబులు గల్గి వైడూర్యమణులతోఁ జేసిన సోపానంబులును గల్గి స్ఫటికంపుమణులతో నిర్మింపఁబడిన యినుకచేఁ బ్రకాశించుచు సుందరంబులగు చతుశ్శాలాగృహంబులతోఁ గూడి యత్యున్నతంబగుటంజేసి యాకాశంబున కెగిరిపోవునో యని యెన్నందగి మంగళకరంబులై మధురంబుగాఁ గూయుచుండు క్రౌంచంబులును నెమళ్లును రాయంచలునుం గలిగి తేజరిల్లుచుండు ద్వారంబుగలదియై అంతటను వాద్యధ్వనుల నాభరణధ్వానంబులనుం బ్రతినాదితంబై తూర్పుదిక్కునందలి యింద్రుని వస్వౌకసార యను పట్టణంబుంబోలె నతిసుందరంబై యత్యున్నతగృహంబులచే నాకాశంబున కుద్గమించుమాడ్కిం జూపట్టుచున్న యా లంకాపురిం జూచి సంతోషంబు నొందెను. ౧-౧౨

పరాక్రమశాలియగు హనుమంతుండు సుందరమును మంగళకరంబును అన్నిటికన్న శ్రేష్ఠంబును వృద్ధిగలదియును రాక్షసేంద్రుఁడగు రావణునిచేఁ బాలింపఁబడునదియు నగు నాలంకాపురిం జూచి యచ్చెరువంది యిట్లని యాలోచించెను. ౧3

నేయమన్యేన నగరీ శక్యా ధర్షయితుం బలాత్,
రక్షితా రావణబలై రుద్యతాయుధధారిభిః. ౧౪

కుముదాంగదయోర్వాపి సుషేణస్య మహాకపేః,
ప్రసిద్ధేయం భవేద్భూమిర్మైందద్వివిదయోరపి. ౧౫

వివస్వత స్తనూజస్య హరేశ్చ కుశపర్వణః,
ఋక్షస్య కేతుమాలస్య మమ చైవ గతిర్భవేత్. ౧౬

సమీక్ష్య తు మహాబాహూ రాఘవస్య పరాక్రమం,
లక్ష్మణస్య చ విక్రాంత మభవత్ప్రీతిమాన్కపిః. ౧౭

తాం రత్నవసనోపేతాం కోష్ఠాగారావతంసకాం,
యంత్రాగార స్తనీమృద్ధాం ప్రమదామివ భూషితామ్. ౧౮

తాం నష్టమితిరాం దీప్తైర్భాస్వరైశ్చ మహాగ్రహైః,
నగరీం రాక్షసేంద్రస్య స దదర్శ మహాకపిః. ౧౯

అథ సా హరిశార్దూలం ప్రవిశంతం మహాబలం,
నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్. ౨౦
సా తం హరివరం దృష్ట్వా లంకా రావణపాలితా,
స్వయమేవోత్థితా తత్ర వికృతాననదర్శనా. ౨౧

ఈ లంకాపట్టణము ఆయుధములఁ బై కెత్తిపట్టుకొని యంతటనుం దిరుగుచున్న రావణసైన్యంబులచేత రక్షింపఁబడుచున్నది కావున దీని నితరుం డెవ్వఁడును బలంబున నెదిరింపఁజాలఁడు. ౧౪

ఈలంకాపట్టణములోనికిం జొరఁ నలవిగాదని వినుతినొందినదయ్యుఁ గుముదుండు నంగదుండును మహాకపియగు సుషేణుండును మైందుండును ద్వివిదుండును దీని సాధింపఁగలరు. ౧౫

సూర్యునికుమారుఁడగు సుగ్రీవునకును గుశపర్వుండనువానికిని ఋక్షున కును కేతుమాలునకును నాకును ఈలంకాపురి సాధ్యంబగును. అని యాలో చించెను. ౧౬

అంత మహాబాహుండగు నాహనుమంతుఁడు రామునిపరాక్రమంబును లక్ష్మణుని పరాక్రమంబునుఁ దలంచుకొని రామలక్ష్మణు లనాయాసంబున నీ లంకాపురిని సాధింపఁజాలుదురు అని చింతించి సంతోషంబు నొందెను. ౧౭

హనుమంతుఁడు నానావిధంబులగు మణులకాంతులు వస్త్రంబుగతి నుండఁగా ఉన్నతములయిన సామగ్రులుండెడుకొట్లు చెవిమీఁది యలంకార కుసుమంబు కాంతివహింప యంత్రగృహంబులు బలిసిన స్తనంబుల కైవడిఁ భాసిల్లఁ జక్కఁగా నలంకరింపఁబడి యౌవనంబుతో నలరుచుండు యువ తియుంబోలె నొప్పుచున్న యా లంకాపురిం జూచెను. ౧౮

ఆ హనుమంతుఁడు రత్నంబులు గల్గుటం జేసి వాని కాంతులం బ్రకా శింపఁజేయఁబడి సున్నము పూసియుండుటం జేసి ప్రకాశించుచున్న గొప్ప గృహంబుల కాంతివలనం జీఁకటిలో లేక తేజరిల్లుచు రాక్షసరాజగు రావణు నిచేఁ బాలింపఁబడుచుండు నా లంకాపురిం జూచెను. ౧౯

అంత లంకాపురిం బ్రవేశించుచున్న మహాబలుండును వానరశ్రేష్ఠుం డును వాయుకుమారుండునగు హనుమంతుని లంక తనరూపంబుతోఁ జూచెను..

రావణునిచేఁ బాలింపఁబడుచుండు నాలంకాపురి ప్రవేశించుచున్న వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుంజూచి యాహనుమంతుం డున్నచోటనే వికృ తంబులగు నోరును కండ్లునుం గలదియై తానే యతనిముందట నగపడినది.

పురస్తాత్కపివర్యస్య వాయుసూనోరతిష్ఠత,

ముంచమానా మహానాద మబ్రవీత్పవనాత్మజమ్. ౨౨

క_స్త్వం కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ,
కథయస్వేహ య_త్త_త్త్వం యావత్ప్రాణా ధరంతి తే. ౨3

న శక్యం ఖల్వియం లంకా ప్రవేష్టుం వానర త్వయా,
రక్షితా రావణబలై రభిగుప్తా సమంతతః. ౨౪

అథ తామబ్రవీద్వీరో హనుమానగ్రతస్స్థితాం,

కథయిష్యామి తే త_త్త్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి. ౨౫

కా త్వం విరూపనయనా పురద్వారేఽవతిష్ఠసి,
కిమర్థం చాపి మాం రుద్ధ్వా నిర్భ_ర్త్సయసి దారుణా. ౨౬

హనుమద్వచనం శ్రుత్వా లంకా సా కామరూపిణీ,
ఉవాచ వచనం క్రుద్ధా పరుషం పవనాత్మజమ్. ౨౭

అహం రాక్షసరాజస్య రావణస్య మహాత్మనః,
ఆజ్ఞాప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీమిమామ్. ౨౮

న శక్యా మామవజ్ఞాయ ప్రవేష్టుం నగరీ త్వయా,
అద్య ప్రాణైః పరిత్య_క్తః స్వప్స్యసే నిహతో మయా. ౨౯

అహం హి నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ,
సర్వతః పరిరక్షామి హ్యేత_త్తే కథితం మయా. 30

ఆలంక వానరశ్రేష్ఠుండును వాయుదేవునికుమారుండు నగు హనుమంతుని ముందట నుండెను.

ఆలంక గొప్పధ్వని గలుగునట్లు లఱచుచు వాయుదేవుని కుమారుం డగు హనుమంతుం జూచి యిట్లని చెప్పెను. ౨౨

హనుమంతుఁడా! నీవెవ్వఁడవు? ఏమిపనిగా నిచ్చటికి వచ్చినాఁడవు? నేను నీప్రాణంబులం గొనుటకుముందే యథార్థముగాఁ జెప్పుము. ౨౩

హనుమంతుఁడా! నీవు కోఁతివి. అన్నిప్రక్కలను గోటచే దుష్ప్రవేశంబై రావణుని సైన్యంబులచే నెవ్వరు లోనికిం జొరకుండునట్లు రక్షింపఁబడుచుండు నీలంకం బ్రవేశింప నీకలవిగాదు అని హనుమంతునితోఁ జెప్పెను.

అంతఁ బరాక్రమశాలియగు హనుమంతుఁడు తనముందట నిలిచియుండు నాలంకం జూచి యిట్లని చెప్పెను.

నీవు నన్ను దేని నడుగుచున్నావో దాని నీకు యథార్థముగాఁ జెప్పెదను. ౨౪

వికృతంబు లగుకండ్లు గలిగియున్నావు. నీవెవ్వతెవు? ఎందుల కీపట్టణపు వాఁకిలి నావరించియున్నావు? నన్నేల భయంకరముగా బెదరించుచున్నావు? అని హనుమంతుఁడు లంకతోఁ జెప్పెను. ౨౫

ఇచ్చకు వచ్చినరూపంబు దాల్పఁజాలిన యాలంక హనుమంతుఁడు చెప్పినమాట విని కోపంబునొంది వాయుదేవునికుమారుఁ డగుహనుమంతుని జూచి పరుషంబుగా నిట్లని చెప్పెను. ౨౬

నేను మహాపరాక్రమశాలియగు రాక్షసుల కందఱకుఁ బ్రభుఁడయిన రావణుని కింకరిని. నన్నెదిరింప నేరికి నలవిగాదు. రావణుని పనుపునం జేసి నేను ఈలంకాపట్టణమును రక్షించుచున్నాను. ౨౭

నన్ను జయించి యీలంకాపట్టణంబు జొచ్చుటకు నీ కలవికాదు. నీ విప్పుడు నాచేఁగొట్టఁబడి ప్రాణంబులవిడిచి దీర్ఘనిద్రఁ జెందఁగలవు. ౨౮

హనుమంతుఁడా! పట్టణరూపంబుగాఁ దోచుచుండులంకనే నేను. నాకు నేనే యీపట్టణంబునంతయుం రక్షించుకొనుచున్నాను. ఇది నాసమాచారము

లంకాయా వచనం శ్రుత్వా హనుమాన్మారుతాత్మజః,
యత్నవాన్ స హరిశ్రేష్ఠః స్థితశ్శైల ఇవాపరః. 30

స తాం స్త్రీరూపవికృతాం దృష్ట్వా వానరపుంగవః,
ఆబభాషేఽథ మేధావీ సత్త్వవాన్ ప్లవగర్షభః. 32

ద్రక్ష్యామి నగరీం లంకాం సాట్టప్రాకారతోరణాం,
నిర్విశఙ్కమిమం లోకం పశ్యన్త్యాస్తవ సాంప్రతం,
ఇత్యర్థమిహ సంప్రాప్తః పరం కౌతూహలం హి మే. 33

వనాన్యుపవనానీహ లంకాయాః కాననాని చ,
సర్వతో గృహముఖ్యాని ద్రష్టుమాగమనం హి మే. 34

తస్య తద్వచనం శ్రుత్వా లంకా సా కామరూపిణీ,
భూయ ఏవ పునర్వాక్యం బభాషే పరుషాక్షరమ్. 35
మామనిర్జిత్య దుర్బుద్ధే రాక్షసేశ్వరపాలితాం,
న శక్యమద్య తే ద్రష్టుం పురీయం వానరాధమ. 36

తతస్స కపిశార్దూలస్తాముఖాచ నిశాచరీం,

దృష్ట్వా పురీమిమాం భద్రే పునర్యాస్యే యథాగతమ్. 37

తతః కృత్వా మహానాదం సా వై లంకా భయావహాం,

నీకుఁ జెప్పితిని. ఇంక నీవృత్తాంతంబుఁ జెప్పుము. అని లంక హనుమంతునితోఁ
జెప్పెను. ౩౦

వానరశ్రేష్ఠుండును వాయుదేవునికుమారుండు నగు నాహనుమంతుఁడు
లంక చెప్పినమాటను విని యుద్ధమునకు సన్నద్ధుఁడై కొండవపర్వతంబుకరణి
సుస్థిరుండై యుండెను. ౩౧

బలవంతుఁడును బుద్ధిమంతుఁడు నగు నాహనుమంతుండు వికృతంబగు
స్త్రీరూపంబు ధరించి తనముందట నిలిచియుండు నాలంకం జూచి యిట్లని
చెప్పెను. ౩౨

కోటబురుజులుఁ బ్రాకారంబులు బహిర్ద్వారంబులుఁ గలిగి రమ్యంబై
యుండు నీలంకాపట్టణమును నీయెదుటనే యిప్పుడు నిర్భయముగాఁ జూడ
వచ్చితిని. ఇందుకొఱకే నే నిటకు వచ్చినాఁడను. నాకు లంకం జూడవలెనని
చాల గోర్కెయున్నది. ౩౩

లంకాపట్టణమునందుండువనంబుల నుపవనంబుల నరణ్యంబులఁ బెద్ద
పెద్దమేడల నింక నితరచిత్రంబులనుం జూచుటకై నే నిటకు వచ్చినాను. అని
హనుమంతుఁడు లంకతోఁ జెప్పెను. ౩౪

ఇచ్ఛకువచ్చిన రూపంబు ధరింపఁజాలిన యాలంక యాహనుమంతుండు
చెప్పినమాటను విని మరల మిక్కిలియుఁ బరుషంబుగా నిట్లని చెప్పెను. ౩౫

దుర్బుద్ధిగల వానరాధముఁడ వగుహనుమంతుఁడా! ఇప్పుడు నీవు నన్ను
జయింపక రాక్షసేశ్వరుం డగురావణునిచే రక్షింపఁబడు నీ లంకాపట్టణముం
జూడఁజాలవు అని లంక హనుమంతునితోఁ జెప్పెను. ౩౬

అంత వానరశ్రేష్ఠుఁ డగుహనుమంతుఁడు రాక్షసస్త్రీరూపము ధరించి
యుండు నాలంకాపురిం జూచి యిట్లని చెప్పెను.

మంగళస్వరూపమగులంకా! నే నీలంకాపట్టణమంతయుఁ జూచి మరల
వచ్చినట్లు పోయెదను. మఱేమియుఁ జేయుటలేదు అని హనుమంతుఁడు
లంకతోఁ జెప్పెను. ౩౭

అంత నాలంక వినువారలకు భయంబుగల్గునట్లు గట్టిగా నఱచి వేగంబు

తలేన వానరశ్రేష్ఠం తాడయామాస వేగితా. 3౮
తతస్స కపిశార్దూలో లంకయా తాడితో భృశం,
ననాద సుమహానాదం వీర్యవాన్ పవనాత్మజః. 3౯

తతస్సంవర్తయామాస వామహస్తస్య సోఽంగులీః,

ముష్టినాఽభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః. ౪౦
స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధస్స్వయం కృతః,
సా తు తేన ప్రహారేణ విహ్వలాంగీ నిశాచరీ. ౪౧
పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా,

తతస్తు హనుమాన్ ప్రాజ్ఞస్తాం దృష్ట్వా వినిపాతితామ్. ౪౨
కృపాం చకార తేజస్వీ మన్యమానః స్త్రియం తు తాం,

తతో వై భృశసంవిగ్నా లంకా సా గద్గదాక్షరమ్. ౪3

ఉవాచాగర్వితం వాక్యం హనూమతం ప్లవంగమం,
ప్రసీద సుమహాబాహో త్రాయస్వ హరిసత్తమ. ౪౪
సమయే సౌమ్య తిష్ఠంతి సత్త్వవంతో మహాబలాః,

అహం తు నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ. ౪౫

నిర్జితాహం త్వయా వీర విక్రమేణ మహాబల,

వహించువానరశ్రేష్ఠుండగు హనుమంతునిఁ జూచిన వ్రేళ్లుగల యా చేతం గొట్టెను.

అంత వానరశ్రేష్ఠుండును బరాక్రమశాలియును వాయుదేవునికుమారుండును నగు హనుమంతుండు లంకచే గట్టిగాఁ గొట్టఁబడినవాఁడై గొప్ప ధ్వని గలుగునట్లు అఱచెను. ౩౯

అంత హనుమంతుండు మిక్కిలియుఁ గోపంబునొంది యెడమచేతి వ్రేళ్ల మడిచి ముష్టి యలవరించుకొని దానిచే నాలంకం గొట్టెను. ౪౦

ఆ హనుమంతుండు "లంక స్త్రీజాతి చంపరాదు" అని తలంచి అధిక కోపంబు సేయఁడయ్యెను.

రాక్షసస్త్రీరూపంబు దాల్చియుండు నాలంకయు నాహనుమంతుండు కొట్టినదెబ్బకు అవయవంబులన్నియు విలవిలంబోవఁగా బాధవలన వికారంబు నొందిననోరును కండ్లునుం గలిగి నేలంబడెను. ౪౧

అంత హనుమంతుండు తనదెబ్బకు నేలంబడియుండు లంకంజూ పండితుండు కావున "ఇది స్త్రీ దీని జంపుట యయుక్తంబుగా" దనియుఁ, బరాక్రమశాలి కావున "ఆఁడుదానిం జంపుట వీరధర్మంబుగా" దనియుఁ దలంచి దయగలవాఁడయ్యెను. ౪౨

అంత నాలంక మిక్కిలియు భయంబునొంది హనుమంతుం జూచి గర్వంబు విడిచి డగ్గుత్తికతో సవినయంబుగ నిట్లని చెప్పెను. ౪౩

హనుమంతుఁడా! నీవు మహాబాహుఁడవు, మహాపరాక్రమశాలివి. నేను నీపరాక్రమంబునకుఁ జాలనిదానను, ప్రసన్నుండవు కమ్ము. నీవు వానరశ్రేష్ఠుండవు. నేను రాక్షసస్త్రీలలో నధమను. నన్ను రక్షింపుము. నీవు స్వభావంబున సౌమ్యుండవు. ధైర్యశాలులు మహాబలులు నగువారలు స్త్రీలం జంపఁగూడదను నియమంబు వదలరు. కావున ననుం జంపకుము. ౪౪

వానరుండవగు హనుమంతుఁడా! ఇప్పుడు పట్టణస్వరూపంబున నగపడుచుండు లంకనే నేను. ౪౫

నీవు పరాక్రమశాలివి. మహాబలుండవు. నీవు నన్నుఁ బరాక్రమంబున జయించినావు.

ఇదం తు తథ్యం శృణు వై బ్రువంత్యా మే హరీశ్వర. ౪౬
స్వయంభువా పురా దత్తం వరదానం యథా మమ,
యదా త్వాం వానరః కశ్చిద్విక్రమాద్వశమానయేత్. ౪౭
తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయమాగతం,

స హి మే సమయస్సౌమ్య ప్రాప్తోఽద్య తవ దర్శనాత్. ౪౮
స్వయంభువిహితస్సత్యో న తస్యాస్తి వ్యతిక్రమః,

సీతానిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః. ౪౯
రక్షసాం చైవ సర్వేషాం వినాశస్సముపాగతః,
తత్ప్రవిశ్య హరిశ్రేష్ఠ పురీం రావణపాలితామ్. ౫౦
విధత్స్వ సర్వకార్యాణి యాని యానీహ వాంఛసి,

ప్రవిశ్య శాపోపహతాం హరీశ్వరః
శుభాం పురీం రాక్షసముఖ్యపాలితాం,
యదృచ్ఛయా త్వం జనకాత్మజాం సతీం
విమార్గ సర్వత్ర గతో యథాసుఖమ్. ౫౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - తృతీయస్సర్గః.

## చతుర్థస్సర్గః

స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీం,
విక్రమేణ మహాతేజా హనూమాన్కపిసత్తమః. ౧
ద్వారేణ స మహాబాహుః ప్రాకారమభిపుప్లువే,
[నిశి లఙ్కాం మహాసత్త్వో వివేశ కపికుఞ్జరః]

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నాకు మున్ను బ్రహ్మదేవుఁ డొసంగిన వరంబువిధమును చెప్పెదను. ఇది యథార్థము! ఈమాటను వినుము.

ఎప్పుడు వానరుఁడొకఁడు వచ్చి నిన్నుఁ బరాక్రమంబున జయించునో అప్పుడు రాక్షసులకు భయంబు వచ్చినదని నీవు తెలిసికొనుము. అని బ్రహ్మ దేవుండు నాతోఁ జెప్పెను. ౪౭

సౌమ్యుండవగు హనుమంతుఁడా! నీవు వచ్చుటంజేసి నా కా సంకేత కాలము ప్రాప్తించినది. అది బ్రహ్మదేవునిచేఁ జేయఁబడినది. సత్యంబు దానికిఁ దిరుగుపా టుండదు. ౪౮

సీత నపహరించుటంజేసి దురాత్ముఁడయిన రాక్షసరాజగు రావణునకు రాక్షసుల కందఱకును జేటు రాఁబోవుచున్నది. ౪౯

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! అందువలన రావణునిచేఁ బాలింపఁబడుచున్న యీ లంకాపట్టణంబును యథేచ్ఛంబుగాఁ బ్రవేశించి నీవు కోరుకార్యంబుల నన్నింటిని జేసికొనుము. ౫౦

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! అట్లు నందికేశ్వరుని శాపంబునం జేసి దుర్బలంబైన రావణునిచేఁ బాలింపఁబడినదియును మంగళకరంబునగు నీలంకాపట్టణంబును నీవు స్వేచ్ఛం బ్రవేశించి సుఖముగా నడ్డులేక కావలసిన చోట్లకుం బోయి పతివ్రతయగు సీతను వెదకుము. అని లంక హనుమంతు నితోఁ జెప్పెను. ౫౧

ఇది మూఁడవసర్గము.

## నాల్గవసర్గము

మహాపరాక్రమశాలియును వానరశ్రేష్ఠుండును నగు నాహనుమంతుఁడు ఉత్తమపట్టణస్వరూపమై కామరూపిణియయి యుండు నాలంకం బరా క్రమంబున లోఁగొని "గ్రామం వా నగరం వాపి పత్తనం వా పరస్యహి, విశేషా త్సమయే సౌమ్య న ద్వారేణ విశేన్నృప" = "రాజా! శత్రువుని గ్రామంబు గానీ నగరంబుగానీ ద్వారంబుచేఁ బ్రవేశింపఁగూడదు. విశేషించి శత్రువును

ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజహితంకరః. ౨
చక్రేఽథ పాదం సవ్యం చ శత్రూణాం స తు మూర్ధని,

ప్రవిష్టస్సత్త్వసంపన్నో నిశాయాం మారుతాత్మజః. 3
స మహాపథమాస్థాయ ముక్తాపుష్పవిరాజితం,
[సేవితాం రాక్షసైర్భీమైర్బలిభిశ్శస్త్రపాణిభిః]
తతస్తు తాం పురీం లంకాం రమ్యామభియయౌ కపిః. ४

హసితోత్కృష్టనినదైస్తూర్యఘోషపురస్సరైః,
వజ్రాంకుశనికాశైశ్చ వజ్రజాలవిభూషితైః. ౫
గృహమేధైః పురీ రమ్యా బభాసే ద్యౌరివాంబుదైః,

ప్రజజ్వాల తదా లంకా రక్షోగణగృహైశ్శుభైః. ౬
సితాభ్రసదృశైశ్చిత్రైః పద్మస్వస్తికసంస్థితైః,
వర్ధమానగృహైశ్చాపి సర్వతస్సువిభూషితా. ౭

జయింప నిచ్చఁగొనియుండు సమయంబునం గూడదు." అని శత్రుపట్టణంబును ద్వారంబుదారినిఁ బ్రవేశింపఁగూడ దని చెప్పఁబడి యుండుటంజేసి దాని నెఱింగినవాఁడు కావున ద్వారంబునం బోక రాత్రివేళ కోటప్రాకారము దూఁకి లోపలఁ జొచ్చెను. ౧

ఆహనుమంతుండు వానరరాజగు సుగ్రీవునకు మేలు సేయువాఁడును రావణునకుఁ గీడు సేయఁ గోరువాఁడును గావున "ప్రయాణకాలే చ గృహప్రవేశే వివాహకాలేఽపి చ దక్షిణాంఘ్రిం, కృత్వాగ్రతశ్శత్రుపురప్రవేశే వామం నిదధ్యాత్పురతో నృపాలః." రాజు పయనంబగునపుడును గృహప్రవేశమునందును వివాహం బగునపుడును మొదటఁ గుడికాలుంచవలయును. శత్రుపట్టణమును బ్రవేశించునపుడు మొదట వామపాదంబు నుంచవలయునని బృహస్పతి చెప్పినచొప్పున రావణునకుఁ గీడుగల్గుటకై మొదట వామపాదం బుంచి లంకం బ్రవేశించెను. ౨

బలవంతుఁడును వాయుకుమారుండు నగు నాహనుమంతుఁడు ముత్తెములు జల్లియుండుటంజేసి ప్రకాశించుచున్నదియు బలవంతులై భయంకరులై కత్తులుబట్టుకొని కావలియున్న రాక్షసులచేనిండిన రాజమార్గంబునఁ బోయెను.

అంత నాహనుమంతుండు రమణీయం బగు నాలంకాపట్టణంబులోఁ బోవుచుండెను. ౪

రమణీయమయిన యాలంకాపట్టణము ఎడతెగక మ్రోయుచున్నవాద్యముల ధ్వనులును నవ్వుటవలనం గలిగినధ్వనులును గలిగి యొప్పుచు వజ్రాయుధము నంకుశమునుంబోలె నతికఠినంబులైన వజ్రములచే నలంకరింపఁబడియుండు గృహశ్రేష్ఠంబులతోఁ గూడి మేఘంబులతోఁ గూడిన యాకాశంబుకైవడిఁ బ్రకాశించెను. ౫

అప్పుడు మంగళకరంబులగు రాక్షసులగృహంబులతోను తెల్లని మేఘంబులకు సాటిసేయుందగి చూపరుల కాశ్చర్యంబు గలిగించుచున్న పద్మము ఆస్తికము, వర్ధమానము అను సంస్థానభేదంబులం గట్టఁబడియుండు గృహంబులతోను గూడియున్న యాలంకాపురి యంతటను జక్కఁగా నలంకరింపఁ

తాం చిత్రమాల్యాభరణాం కపిరాజహితంకరః,
రాఘవార్థం చరన్ శ్రీమాన్ దదర్శ చ ననంద చ. ౮

భవనాద్భవనం గచ్ఛన్ దదర్శ పవనాత్మజః,
వివిధాకృతిరూపాణి భవనాని తతస్తతః. ౯

శుశ్రావ మధురం గీతం త్రిస్థానస్వరభూషితం,
స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసామివ. ౧౦

శుశ్రావ కాంచీనినదం నూపురాణాం చ నిస్స్వనం,
సోపాననినదాంశ్చైవ భవనేషు మహాత్మనామ్. ౧౧
ఆస్ఫోటితనినాదాంశ్చ క్ష్వేళితాంశ్చ తతస్తతః,
శుశ్రావ జపతాం తత్ర మంత్రాన్ రక్షోగృహేషు వై. ౧౨

స్వాధ్యాయనిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః,
రావణస్తవసంయుక్తాన్ గర్జతో రాక్షసానపి. ౧౩
రాజమార్గం సమావృత్య స్థితం రక్షోబలం మహత్,
దదర్శ మధ్యమే గుల్మే రావణస్య చరాన్బహూన్. ౧౪

దీక్షితాన్ జటిలాన్ ముండాన్ గోజినాంబరవాససః,
దర్భముష్టిప్రహరణానగ్నికుండాయుధాంస్తథా. ౧౫

బడియుండుటం జేసి ప్రకాశించుచుండెను. ౬,౭

వానరరాజగు సుగ్రీవునకు మేలుసేయు నాహనుమంతుండు స్వామికార్యంబనుకూలించుటం జేసి యధికకాంతి నొందినవాఁడై రామకార్యార్థంబుగాఁ దిరుగుచు విచిత్రవర్ణంబు లగుపువ్వుమాలికలచే నలంకరింపఁబడియుండు నాలంకం జూచి "ఎవరికిని బ్రవేశింపనలవిగాని యీలంకను అనాయాసంబున బ్రవేశించినాఁడను. ఇంత సీతంజూడవచ్చును" అని యెంతయుఁ సంతోషించెను.

వాయుదేవునికుమారుండగు హనుమంతుఁడు ఒకయింటనుండి వేఱొక యింటికిం బోవుచు నంతకంతకు నానావిధంబు లగు నాకారంబులును బలు తెఱంగులైన రంగులునుం గల గృహంబులఁ జూచెను. ౯

అచ్చట హనుమంతుండు స్త్రీలు మద్యంబు ద్రావి మదించి యురశ్శిరంబులనెడు స్థానంబులంబుట్టిన మంద్రమధ్యమతారస్వరంబుల నలంకృతం బగునట్లుగా స్వర్గమందున్న యప్సరసలుం బోలె మధురంబుగాఁ బాడునట్టి గానంబు నాలకించెను. ౧౦

ఆ హనుమంతుండు అంతకంతకు మహాధైర్యశాలు రగురాక్షసులయిండ్లయందు స్త్రీలు నడుచునపుడు గలుగు మొలనూలిధ్వనిని అందెలశబ్దంబును పడికట్టెక్కునపుడు దిరుగునపుడు గలుగుధ్వనులను జేతులుతట్టుటవలనం గలుగు ధ్వనులను భటుల సింహనాదంబులు వినెను. ౧౧

ఆ హనుమంతుండు రాక్షసులగృహంబులలో వేదమంత్రంబులం జపింపుచున్నవారి కంఠధ్వనిని వినెను. ౧౨

ఆ హనుమంతుండు వేదాధ్యయనంబు సేయుచుండు రాక్షసులను గట్టిగా నఱచుచు రావణునిం బొగడుచున్న రాక్షసులనుం జూచెను. ౧౩

ఆ హనుమంతుండు పోవుచుఁ బోవుచు రాజమార్గంబునందు విడిసియున్న గొప్పదియగు రాక్షససైన్యమును ఆసైన్యపు మధ్యభాగంబునందుఁ దిరుగులాడుచుండు రావణుని దూత లనేకులనుం జూచెను. ౧౪

ఆ హనుమంతుండు అంత కంతకుం బోవుచుఁ బోవుచు దీక్షితులను జటాధారులను ముండితశిరస్కులను ఎద్దుతోలు గట్టుకొనినవారలను దిగం

కూటముద్గరపాణీంశ్చ దండాయుధధరానపి,
ఏకాక్షానేకకర్ణాంశ్చ లంబోదరపయోధరాన్. ౧౬
కరాళాన్ భుగ్నవక్త్రాంశ్చ వికటాన్ వామనాం స్తథా,
ధన్వినః ఖడ్గినశ్చైవ శతఘ్నీ ముసలాయుధాన్. ౧౭
పరిఘోత్తమహస్తాంశ్చ విచిత్రకవచోజ్జ్వలాన్,
నాతిస్థూలాన్నాతికృశాన్ నాతిదీర్ఘాతిహ్రస్వకాన్. ౧౮
నాతిగౌరాన్నాతికృష్ణాన్నాతికుబ్జాన్న వామనాన్,
విరూపాన్ బహురూపాంశ్చ సురూపాంశ్చ సువర్చసః. ౧౯

ధ్వజీన్ పతాకినశ్చైవ దదర్శ వివిధాయుధాన్,
శక్తివృక్షాయుధాంశ్చైవ పట్టిపాశనిధారిణః. ౨౦
క్షేపణీపాశహస్తాంశ్చ దదర్శ స మహాకపిః,
స్రగ్విణ స్త్వనులిప్తాంశ్చ వరాభరణభూషితాన్. ౨౧
నానావేషసమాయుక్తాన్ యథా స్వైరగతాన్ బహూన్,
తీక్ష్ణశూలధరాంశ్చైవ వజ్రిణశ్చ మహాబలాన్. ౨౨

శతసాహస్రమవ్యగ్రమారక్షం మధ్యమం కపిః,
రక్షోధిపతినిర్దిష్టం దదర్శాంతఃపురాగ్రతః. ౨౩

బరులను దర్భముష్టిచే ననిష్టము నివారించువారలను అగ్నిహోత్రంబున హోమము గావించి యాభిచారికక్రియలచే శత్రువులఁ జంపువారలను గూటమను నాయుధమును ధరించినవారలను ముద్గరమును ధరించియుండువారలను దండపాణులను అనేకాత్ములను అనేకకర్ణులను వంగుచుండు కడుపుగలవారలను వ్రేలుకాడుచన్నులు గలవారలను వికృతశరీరులను వంకరముఖంబుఁ గలవారలను విషమదేహులను బొట్టివారలను ధనుర్ధరులను ఖడ్గధరులను నాలుగు మూరలు నిడివి గల యినుప ముండ్లకట్టెం బట్టుకొనియుండువారలను ముసలంబె యాయుధంబుగాఁ గొనియుండువారలను బరిఘంబు చేతం గలవారలను బలుదెఱంగులయిన రంగులు దీర్చియుండు కవచంబుల ధరించినవారలను అతిస్థూలులు కానివారలను అతికృశులు కానివారలను మిక్కిలియుఁ బొడవుగానివారలను మిక్కిలియుఁ గుఱుచకానివారలను తెల్లగా నుండనివారలను నలుపుగానివారలను నధికముగా గూను లేనివారలను బొట్టిగాని వారలను వికృతరూపులను అనేకరూపులను మంచిరూపంబుగలవారలను మంచి కాంతి గలవారలను రాజచిహ్నంబులు వ్రాసియుండు ధ్వజంబులు పట్టుకొనియుండు వారలను జిత్రితంబగు టెక్కెంబులు ధరించియుండువారలను నానాయుధ పాణులగువారలను అందఱిని వేర్వేఱఁజూచెను. ౧౮-౧౯

ఆ హనుమంతుండు చిల్లకోలల ధరించినవారలను వృక్షములనే యాయుధముగాఁ గొనినవారలను అడ్డకత్తులం ధరించినవారలను బిడుగుల ధరించిన వారలను ఓడనడపుగడలఁ బాశంబులం బట్టుకొనియుండువారలను పువ్వు మాలికల ధరించినవారలను జందనంబు మేనం బూసికొనియుండువారలను మేలయిన సొమ్ములచే నలంకరింపఁబడియుండువారలను బలుదెఱంగులగు నలంకారంబులు చేసికొని యుండువారలను యథేష్టముగాఁ దిరుగులాడువారలను గట్టి శూలంబుల ధరించినవారలను వజ్రాయుధపాణులను మహాబలులను అనేకులం జూచెను. ౨౦-౨౨

అంత హనుమంతుండు రాక్షసప్రభుఁడగు రావణునియాజ్ఞం జేసి పట్టణంబు, లోపలిభాగంబున నేమఱుపాటు లేక యెచ్చరికలోఁ గావలి

స తదా తద్గృహం దృష్ట్వా మహాహాటకతోరణం,
రాక్షసేంద్రస్య విఖ్యాతమద్రిమూర్ధ్ని ప్రతిష్ఠితమ్. ౨౪
పుండరీకావతంసాభిః పరిఖాభిరలంకృతం,
ప్రాకారావృతమత్యంతం దదర్శ స మహాకపిః. ౨౫

త్రివిష్టపనిభం దివ్యం దివ్యనాదవినాదితం,
వాజిహేషితసంఘుష్టం నాదితం భూషణైస్తథా. ౨౬
రథైర్యానైర్విమానైశ్చ తథా హయగజైశ్శుభైః,
వారణైశ్చ చతుర్దంతైశ్శ్వేతాభ్రనిచయోపమైః. ౨౭
భూషితం రుచిరద్వారం మత్తైశ్చ మృగపక్షిభిః,
రక్షితం సుమహావీర్యైర్యాతుధానైస్సహస్రశః. ౨౮
రాక్షసాధిపతేర్గుప్తమావివేశ మహాకపిః,

స హేమజాంబూనదచక్రవాళం
మహార్హముక్తామణిభూషితాంతం,
పరార్ధ్యకాలాగరుచందనాక్తం
స రావణాంతఃపురమావివేశ. ౨౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుర్థస్సర్గః.

## పఞ్చమస్సర్గః.

తతస్స మధ్యంగతమంశుమంతం
జ్యోత్స్నావితానం మహదుద్వమంతం,
దదర్శ ధీమాన్ దివి భానుమంతం,
గోష్ఠే వృషం మత్తమివ భ్రమంతమ్. ౧

యున్న లక్షసంఖ్యగల మధ్యమ గుల్మమును (సేనాభాగమును) జూచెను. ౫౩

ఆ హనుమంతుండు మధ్యమగుల్మము జూచిన పిదప బంగారుతోఁ గట్టఁబడిన పెద్దబహిర్ద్వారంబు గలిగి పర్వతశిఖరంబునం బ్రతిష్ఠితంబై తెల్ల తామరపూలతో నిండియుండు సగర్తలచేత నలంకృతంబై చుట్టును బ్రాకారంబుచేఁ జుట్టఁబడి యొప్పుచుండు రాక్షసేంద్రుం డగురావణునిగృహంబు జూచెను. ౫౪, ౫౫

హనుమంతుండు స్వర్గంబుతో సమానంబై శ్రేష్ఠంబై యుత్తమంబులగు గానంబులచేఁ బ్రతినాదితంబై గుఱ్ఱంబుల హేషితంబులచే నాదితంబై భూషణధ్వనులు గలిగి రథంబులతో శిబికాదియానంబులతో విమానంబులతో మంగళలక్షణలక్షితంబులగు హయంబులతో గజంబులతోఁ దెల్లని మేఘంబులం బోలు చతుర్దంతగజంబులతోఁగూడి మదించిన మృగపక్షులచే నలంకరింపఁబడి మనోహరంబగు ద్వారంబు గలిగి మహాపరాక్రమశాలురగు రాక్షసులచే రక్షింపఁబడుచున్న రావణుని గృహంబు నెవ్వరికినిం దెలియనట్లుగాఁ బ్రవేశించెను. ౫౬-౬౦

ఆ హనుమంతుండు బంగారపుఁ గట్టడములు గలిగి బంగారువికారమయిన ప్రాకారమునుం గలిగి చివరలయందు మేలయిన ముత్తెపుసరములచే నలంకరింపఁబడి యంతటను మంచికృష్ణాగరుగంధజలము చల్లియుండు రావణుని యంతర్నగరమును బ్రవేశించెను.

ఇది నాల్గవసర్గము.

# అయిదవసర్గము

అంత బుద్ధిమంతుఁ డగు నాహనుమంతుఁడు ఆకాశము నడుమనుండి సర్వప్రదేశంబులను జంద్రికంబఱుపుచు కాంతియుక్తుఁ డై యావులమందయందుఁ దిరుగులాడు తెల్లటియాఁబోతుంబోలెఁ జూపట్టుచున్న చంద్రునిం జూచెను. ౧

లోకస్య పాపాని వినాశయన్తం
మహోదధిం చాపి సమేధయన్తం,
భూతాని సర్వాణి విరాజయన్తం
దదర్శ శీతాంశుమథాభియాన్తమ్, ౨
యా భాతి లక్ష్మీర్భువి మన్దరస్థా
తథా ప్రదోషేషు చ సాగరస్థా,
తథైవ తోయేషు చ పుష్కరస్థా
రరాజ సా చారునిశాకరస్థా. ౩
హంసో యథా రాజతపఞ్జరస్థః
సింహో యథా మన్దరకన్దరస్థః,
వీరో యథా గర్వితకుఞ్జరస్థ
శ్చన్ద్రోఽపి బభ్రాజ తథామ్బరస్థః. ౪

స్థితః కకుద్మానివ తీక్ష్ణశృఙ్గో
మహాచలశ్శ్వేత ఇవోచ్చశృఙ్గః,
హస్తీవ జామ్బూనదబద్ధశృఙ్గో
రరాజ చన్ద్రః పరిపూర్ణశృఙ్గః, ౫
వినష్టశీతామ్బుతుషారపఙ్కో
మహాగ్రహగ్రాహవినష్టపఙ్కః,
ప్రకాశలక్ష్మ్యాశ్రయనిర్మలాఙ్కో
రరాజ చన్ద్రో భగవాన్ శశాఙ్కః. ౬
శిలాతలం ప్రాప్య యథా మృగేన్ద్రో
మహారణం ప్రాప్య యథా గజేన్ద్రః,
రాజ్యం సమాసాద్య యథా నరేన్ద్ర
స్తథా ప్రకాశో విరరాజ చన్ద్రః. ౭

అంత నాహనుమంతుండు చల్లనివాఁడగుటచే లోకులదుఃఖములఁ బోఁగొట్టువాఁడును సముద్రమును వృద్ధిఁబొందించువాఁడును నై పృథివ్యప్తేజోవాయ్వాకాశంబుల నన్నింటిని ప్రకాశింపఁ జేయుచు నాకాశంబునఁ దిరుగుచున్న చంద్రునిం జూచెను. ౨

భూమియందు మందరపర్వతంబున నేకాంతియుండునో, ప్రదోషకాలములయందు సముద్రంబున నేకాంతియుండునో, అట్లు జలంబులందుఁ గమలంబుల నేకాంతియుండునో, ఆట్టికాంతి చంద్రునియం దప్పుడు సుందరంబుగాఁ బ్రకాశించినది. ౩

ఎట్లు స్వభావంబుననే తెల్లగానుండు హంసము వెండిపంజరమునం దుంచఁబడినదై హెచ్చుగాఁ బ్రకాశించునో, ఎట్లు మందరపర్వతగుహాయం దుండు సింహము అధికముగా రాజిల్లునో, ఎట్లు మదపుటేనుఁగుపై గూర్చున్న వీరుఁడు మిక్కిలియుఁ భాసిల్లునో, అట్లు ఆకాశమునందున్న చంద్రుఁడు అధికముగాఁ బ్రకాశించుచుండెను. ౪

కఱకు శృంగంబులు (కొమ్ములు) గల తెల్లనియెద్దుంబోలె ఉన్నతశృంగములు (శిఖరములు) గల తెల్లకొండయుంబోలె బంగారపుగొడుగుగల శృంగముల (దంతముల) తోఁ గూడిన తెల్లయేనుఁగుంబోలె సంపూర్ణశృంగంబుల (కళల) తోఁ గూడిన చంద్రుండు ప్రకాశించెను ౫

భగవంతుఁడును భూచ్ఛాయారూపమయినశశమును ధరించినవాఁడునగు చంద్రుఁడు మంచులేనివాఁడై శుక్రాదిగ్రహంబులఁ బ్రకాశింపనీయక (సూర్యకిరణంబులు) తనయందు నతిక్రమించుటంజేసి యధికకాంతి గలిగి యధికకాంతింజేసి స్వచ్ఛమయియుండు చిహ్నంబు గలిగి ప్రకాశించెను. ౬

సింహ మున్నతం బగుశిలాతలంబున నుండునేని యె ట్లధికముగాఁ బ్రకాశించునో మత్తగజంబు గొప్పయుద్ధంబు సేయునపుడు ఎ ట్లెచ్చుగాఁ బ్రకాశించునో రాజు దొరతనముఁ నొందునేని యెట్లు ప్రకాశించునో చంద్రుఁ డ ట్లధికముగాఁ బ్రకాశించెను. ౭

ప్రకాశచంద్రోదయనష్టదోషః
ప్రవృత్తరక్షఃపిశితాశదోషః,
రామాభిరామేరితచిత్తదోషః
స్వర్గప్రకాశో భగవాన్ ప్రదోషః. ౮

తంత్రీస్వనాః కర్ణసుఖాః ప్రవృత్తాః
స్వపంతి నార్యః పతిభిస్సువృత్తాః,
నక్తంచరాశ్చాపి తథా ప్రవృత్తాః
విహర్తుమత్యద్భుతరౌద్రవృత్తాః. ౯

మత్తప్రమత్తాని సమాకులాని
రథాశ్వభద్రాసనసంకులాని,
వీరశ్రియా చాపి సమాకులాని
దదర్శ ధీమాన్ స కపిః కులాని. ౧౦

పరస్పరం చాధికమాక్షిపంతి
భుజాంశ్చ పీనానధికం క్షిపంతి,
మత్తప్రలాపా నధికం క్షిపంతి
మత్తాని చాన్యోన్యమధిక్షిపంతి. ౧౧

రక్షాంసి వక్షాంసి చ విక్షిపంతి
గాత్రాణి కాంతాసు చ విక్షిపంతి,
రూపాణి చిత్రాణి చ విక్షిపంతి
దృఢాని చాపాని చ విక్షిపంతి. ౧౨

దదర్శ కాంతాశ్చ సమాలభంత్య
స్తథా పరాస్తత్ర పునస్స్వపంత్యః,
సురూపవక్త్రాశ్చ తథాహసంత్యః
క్రుద్ధాః పరాశ్చాపి వినిశ్శ్వసంత్యః. ౧౩

వెలుతురు గలిగించు చంద్రోదయంబునఁ జీఁకటింబోఁగొట్టి రాక్షసులకు మాంసభక్షణము సేయఁదగినకాలమయి కామినులకును గాముకులకును మాన సంబునం గలిగినకోపాదుల మాన్పి స్వర్గంబునంబోలె నానందము గలిగించు ప్రదోషకాలంబు కడచినది. ౮

అంతఁ జెవులకు సుఖంబు గల్గునట్టుగా వీణెలు వాయింప నారంభిం చిరి. పతివ్రత లగుస్త్రీలు తమ భర్తలతోఁగూడి సుఖంబుగా నిదురించిరి. అట్లు రాక్షసులును వెఱఁగును వెఱపులు గలిగించు చర్యలతో విహరింప నారంభించిరి ౯

పరాక్రమశాలియు బుద్ధిమంతుఁడు నగు నా హనుమంతుఁడు మదించి యేమఱుపాటుతోఁ గూడియుండు జనంబులుం గల్గి జనులు నిండియుంటం జేసి యిఱుకై రథములును గుఱ్ఱములును భద్రగజంబులును సింహాసనంబులును మెం డుగాఁ గల్గి సంపదచే నిండియున్న గృహంబులం జూచెను. ౧౦

ఆహనుమంతుండు మదాతిరేకంబునం జేసి యొండొరులం బరిహసించు కొనుచు నొండొరులపై బలిసిన భుజంబుల వేసికొనుచు నర్థము లేకుండునట్లు వదరుచు నోడలు మఱచి యొండొరుల నిందించుకొనుచు వక్షస్థలంబుల విస్తరిల్లం జేయుచు భార్యలపైఁ గాళ్లసేతుల వేయుచుఁ గామరూపులు కావున నానావిధరూపంబుల ధరించుచు దృఢంబులగు ధనువులను మోపెట్టుచు విహ రించుచున్న రాక్షసులం జూచెను. ౧౧, ౧౨

ఆ హనుమంతుఁ డచ్చోటఁ జందనాదివిలేపనంబుల మేన నలందు కొనుచున్న స్త్రీలను నిదురించుచున్న యువతులను నవ్వుచున్న మిక్కిలియు సుందరం బగుముఖంబులు గలవనితలను గోపంబున నిట్టూర్పులు పుచ్చుచుండు కామినులను వేర్వేఱం జూచెను. ౧౩

మహాగజైశ్చాపి తథా నదద్భి
స్సుపూజితైశ్చాపి తథా సుసద్భిః,
రరాజ వీరైశ్చ వినిశ్శ్వసద్భి
ర్హ్రదో భుజంగైరివ నిశ్శ్వసద్భిః. ౧౪

బుద్ధిప్రధానాన్ రుచిరాభిధానాన్
సంశ్రద్దధానాన్ జగతః ప్రధానాన్,
నానావిధానాన్ రుచిరాభిధానాన్
దదర్శ తస్యాం పురి యాతుధానాన్. ౧౫

ననంద దృష్ట్వా స చ తాన్ సురూపాన్
నానాగుణానాత్మగుణానురూపాన్,
విద్యోతమానాన్స తదానురూపాన్
దదర్శ కాంశ్చిచ్చ పునర్విరూపాన్. ౧౬

తతో వరార్హా స్సువిశుద్ధభావా
స్తేషాం స్త్రియస్తత్ర మహానుభావాః,
ప్రియేషు పానేషు చ సక్తభావా
దదర్శ తారా ఇవ సుప్రభావాః. ౧౭

శ్రియా జ్వలంతీస్త్రపయోపగూఢాః
నిశీథకాలే రమణోపగూఢాః,
దదర్శ కాశ్చిత్ప్రమదోపగూఢాః
యథా విహంగాః కుసుమోపగూఢాః. ౧౮

అన్యాః పున ర్హర్మ్యతలోపవిష్టా
స్తత్ర ప్రియాంకేషు సుఖోపవిష్టాః,
భర్తుః ప్రియా ధర్మపరా నివిష్టా
దదర్శ ధీమా న్మదనాభివిష్టాః. ౧౯

ఆ పట్టణము గర్జించుచున్న గొప్ప యేనుంగులును జక్కఁగాఁ బూజింపఁబడిన సత్పురుషులును బ్రతివీరులు లేకుంటం జేసి నిట్టూర్పులు పుచ్చుచున్న వీరులునుఁ గలిగి నిట్టూర్పులు పుచ్చు సర్పంబులతోఁ గూడిన కోసేరువలెఁ బ్రకాశించెను. ౧౪

ఆ హనుమంతుఁడు ఆ లంకాపట్టణమునందు మహా బుద్ధిసంపన్నులును మనోహరంబుగా మాటలాడువారును మతమునందు శ్రద్ధగలవారలును లోకంబులందు ముఖ్యులయినవారును వివిధములయిన యాచారములు గలవారలును మంచిపేరులు గలవారలు నగు రాక్షసులం జూచెను. ౧౫

ఆ హనుమంతుండు మంచిరూపంబు గలిగి వివిధగుణంబులు గలవారలయి తమతమ గుణంబులకుం దగిన వ్యవహారంబులు గల్గియున్న యారాక్షసులం జూచి సంతసించెను. మఱియుఁ దమ యాకారంబులకుఁ దగిన గుణంబులు గలిగి ప్రకాశించుచున్న వికృతరూపులఁ గొందఱం జూచెను. ౧౬

అంత నా హనుమంతుఁడు అచ్చట శ్రేష్ఠములయిన యాభరణములు ధరించి పతుల విషయమయి పరిశుద్ధమయియుండు హృదయంబుగలిగి సుందరంబులగు కటాక్షవిక్షేపాది శృంగారచేష్టల నెఱపుచుఁ బతిభక్తి గలిగి మద్యపానంబునం దాసక్తలై మహాప్రభావంబున నక్షత్రములవలెఁ దేజరిల్లుచున్న యారాక్షసుల భార్యలఁ జూచెను. ౧౭

ఆ హనుమంతుఁడు ఇచ్చట సౌందర్యముచేఁ బ్రకాశించుచు నర్ధరాత్రమునందుఁ బ్రియులచేఁ గౌఁగిలింపఁబడి సిగ్గునొందుచు సంతోషంబునం దేలుచు బుష్పంబులచే నలంకరించికొని యాఁడుపక్షులుంబోలె రాజిల్లుచుండు మఱికొందఱు స్త్రీలం జూచెను. ౧౮

బుద్ధిమంతుండగు నా హనుమంతుండు ఆపట్టణమందు మేడలయందుఁ బ్రియులతొడలపై సుఖంబుగాఁ గూర్చుండి భర్తలకుఁ బ్రియలయి ధర్మపత్నులయి ధర్మమునందు శ్రద్ధగలిగి మన్మథావేశముతోఁ గూడియున్న స్త్రీలను గొందఱం జూచెను. ౧౯

అప్రావృతాః కాంచనరాజివర్ణాః
కాశ్చిత్పరార్ధ్యా స్తపనీయవర్ణాః,
పునశ్చ కాశ్చిచ్ఛశలక్ష్మవర్ణాః
కాంతప్రహీణా రుచిరాంగవర్ణాః. ౨౦

తతః ప్రియాన్ప్రాప్య మనోభిరామాః
సుప్రీతియుక్తాః ప్రసమీక్ష్య రామాః,
గృహేషు హృష్టాః పరమాభిరామాః
హరిప్రవీరస్స దదర్శ రామాః. ౨౧

చంద్రప్రకాశాశ్చ హి వక్త్రమాలాః
వక్రాక్షిపక్ష్మాశ్చ సునేత్రమాలాః,
విభూషణానాం చ దదర్శ మాలాః
శ్శతహ్రదానామివ చారుమాలాః. ౨౨

న త్వేవ సీతాం పరమాభిజాతాం
పథి స్థితే రాజకులే ప్రజాతాం,
లతాం ప్రఫుల్లామివ సాధుజాతాం
దదర్శ తన్వీం మనసాభిజాతామ్. ౨౩

సనాతనే వర్త్మని సన్నివిష్టాం
రామేక్షణాం తాం మదనాభివిష్టాం,
భర్తుర్మనశ్శ్రీమదనుప్రవిష్టాం
స్త్రీభ్యో వరాభ్యశ్చ సదావిశిష్టామ్. ౨౪

ఆ హనుమంతుఁడు భర్తృసంగమంబునం జేసి దిగంబరలై బంగారు రేఖకుంబోలెఁ గాంతిగలవారలగు కొందఱుస్త్రీలను, తప్తకాంచనవర్ణంబు గలిగిన యుత్తమస్త్రీలం గొందఱను, మఱియుం మనోహరం బగు మేని చాయ గలవారయ్యు భర్తృవిరహంబునంజేసి తెల్లఁబాఱి చంద్రుఁడుంబోలెఁ బాండుర కాంతిం దేజరిల్లుచుండు స్త్రీలఁ గొందఱనుం జూచెను. ౨౦

అంత వానరశ్రేష్ఠుం డగు నాహనుమంతుండు తమతమ ప్రియుల యొద్దకుంబోయి రతులందేలి సంతోషంబు నొందియుండు రూపవతులగు పక్షి సారికలను గృహంబులయందుఁ దమతమ భర్తలంగూడి సుఖం బనుభవించుచుండు సౌందర్యవతులయిన పతివ్రతలనుం జూచెను. ౨౧

ఆ హనుమంతుండు రాక్షసస్త్రీలలోఁ గలసి మనుష్యస్త్రీ యున్నదో లేదో యని కనుంగొనుటకై చంద్రునకుంబోలె కాంతిగలిగియుండు నాస్త్రీల ముఖంబులను, వంకరలయిన తెప్పలోని వెంట్రుకలు గలవారికండ్లనుఁ జక్కఁగాఁ బరీక్షించెను. మఱియుం రాముండు చెప్పిన సీతసొమ్ముల యానవాలేమైనఁ గానవచ్చునో యని మెఱుపుసమూహములుంబోలె వెలుంగుచుండు వారల సొమ్ములనుం బరీక్షించి చూచెను. ౨౨

ఆ హనుమంతుం డిట్లు పరీక్షించి చూచినను పరమసౌందర్యవతియై సన్మార్గప్రవృత్తు లగురాజులవంశంబునంబుట్టినదియై కృశాంగియై రావణుండు తన్ను వేదవతీరూపంబున నున్నపుడు బలాత్కారంబునం బట్టుటంజేసి యతనితో "నిన్నుం జంపుటకై మరల నే నవతరింతు" నని చెప్పినచొప్పున స్వసంకల్పంబుననె యయోనిజయయి వెలసి సుందరంబయిన తీఁగెయుంబోలె రాజిల్లుచుండు నాసీతం జూడనేలేదు. ౨౩

అనాదిసిద్ధం బగుపాతివ్రత్యమునందు స్థిరంబుగానుండి రాముం జూడఁ గోరుచు మన్మథావేశము నొంది శ్రీమంతంబగురాముని హృదయంబున ధ్యానింపఁబడుచు నుత్తమస్త్రీలలోపల నుత్తమ యయి భర్తృవిరహంబునఁ బరితపించుచుఁ బ్రతిమాటకును గండ్ల నీళ్లుగార్చుకొనుచు మున్ను రామునితోఁ గూడియున్నవేళ నుత్తమంబైన పతకంబుచేఁ గ్రాలుచుండుకంఠంబు గలిగి

ఉష్ణార్దితాం సానుసృతాస్రకంఠీం
పురా వరార్హోత్తమనిష్కకంఠీం,
సుజాతపక్షామభిరక్తకంఠీం
వనే ప్రనృత్తామివ నీలకంఠీమ్. ౨౭
అవ్యక్తరేఖామివ చంద్రరేఖాం
పాంసుప్రదిగ్ధామివ హేమరేఖాం,
క్షతప్రరూఢామివ బాణరేఖాం
వాయుప్రభిన్నామివ మేఘరేఖామ్. ౨౮
సీతామపశ్యన్మనుజేశ్వరస్య
రామస్య పత్నీం వదతాం వరస్య,
బభూవ దుఃఖాభిహతశ్చిరస్య
ప్లవంగమో మంద ఇవాచిరస్య. ౨౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చమస్సర్గః.

---

## ష ష్ఠ స్స ర్గః.

స నికామం విమానేషు విషణ్ణః కామరూపధృత్,
విచచార పునర్లంకాం లాఘవేన సమన్వితః. ౧

ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనం,
ప్రాకారేణార్కవర్ణేన భాస్వరేణాభిసంవృతమ్. ౨

రక్షితం రాక్షసైర్ఘోరైస్సింహైరివ మహద్వనం,
సమీక్షమాణో భవనం చకాశే కపికుంజరః. ౩

యుండునదై యిప్పుడు కన్నీళ్లె యాభరణంబుగాఁ గలిగిన కంఠంబు గలిగి సుందరంబు లగుచెప్పవెండ్రుకలు గలదై తిన్నగా మాటలాడునదై వనంబున నృత్తంబు సేయుం నెమలియుంబోలె నున్నదై మేఘంబుచే నావరింపఁబడని చంద్రరేఖయుంబోలెఁ బరాగముచేఁ గప్పఁబడియుండు బంగారు కడ్డియుం బోలె స్వభావంబునఁ గాంతి గలదయ్యు సంస్కారంబు లేమింజేసి మాలిన్యంబు నొందిన దేహంబు గలిగి పైనమాత్రము కొంచె మాఱి లోపల బాధగలిగి యుండు బాణంబుచేఁ గలిగిన గాయంబుబోలెఁ బైని సమాధానంబునఁ జేసి గంభీరంబుగా నున్నను అంతర్వేదనచే బాధింపఁబడుచు వాయువుచేఁ బాఱఁ ద్రోలంబడిన మేఘపఙ్క్తికైవడిఁ గృశత్వంబు నొందినదై యుక్తియుక్తం బుగా మాటలాడువారలలో నుత్తముండయిన మనుజేశ్వరుండగు రామునకుం బత్నియైనట్టి సీతను బహుకాలంబు వెదకియుంఁ జూడనేరక హనుమంతుండు మందుండుంబోలె దుఃఖంబు నొందెను. ౧౮—౨౩

ఇది అయిదవసర్గము.

---

# ఆఱవ సర్గము

ఇచ్చను వచ్చినరూపంబు దాల్పంజాలిన యా హనుమంతుండు విమానంబులందు సీత యగపడకుండుటంజేసి మిక్కిలియుం దుఃఖము నొంది యంత మరల వేగంబున లంకలోఁ దిరుగ నారంభించెను. ౧

అంతఁ గాంతిసంపన్నుఁడగు నాహనుమంతుండు సూర్యుండుంబోలె వెలుపువన్నె గలిగి ప్రకాశించుచున్న ప్రాకారంబుచేఁ జుట్టఁబడియుండు రావణుగృహంబునకుం బోయెను. ౨

వానరశ్రేష్ఠుం డగు నా హనుమంతుండు చూపరులకు వెఱపుఁబుట్టించు నట్టి రాక్షసులచే రక్షింపఁబడుచు సింహంబులచే రక్షింపఁబడు మహావనంబు కైవడి దుష్ప్రవేశంబై యొప్పుచుండు నా రావణగృహంబును జక్కఁగాఁ జూచుచు నాశ్చర్యంబు నొందెను. (సంచరించెను.) ౩

రూప్యకోపహితైశ్చిత్రైస్తోరణైర్హేమభూషితైః,
విచిత్రాభిశ్చ కక్ష్యాభిర్ద్వారైశ్చ రుచిరైర్వృతమ్. ౪
గజాస్థితైర్మహామాత్రైశ్శూరైశ్చ విగతశ్రమైః,
ఉపస్థితమసంహార్యైర్హయైస్స్యందనయాయిభిః. ౫
సింహవ్యాఘ్రతనుత్రాణైర్దాంతకాంచనరాజతైః,
ఘోషవద్భిర్విచిత్రైశ్చ సదా విచరితం రథైః. ౬
బహురత్నసమాకీర్ణం పరార్థ్యాసనభాజనం,
మహారథసమావాసం మహారథమహాస్వనమ్. ౭
దృశ్యైశ్చ పరమోదారైస్తైస్తైశ్చ మృగపక్షిభిః,
వివిధైర్బహుసాహస్రైః పరిపూర్ణం సమంతతః. ౮
వినీతైరంతపాలైశ్చ రక్షోభిశ్చ సురక్షితం,
ముఖ్యాభిశ్చ వరస్త్రీభిః పరిపూర్ణం సమంతతః. ౯
ముదితప్రమదారత్నం రాక్షసేంద్రనివేశనం,
వరాభరణసంహ్రాదైస్సముద్రస్వననిస్స్వనమ్. ౧౦
తద్రాజగుణసంపన్నం ముఖ్యైశ్చాగరుచందనైః,
మహాజనైస్సమాకీర్ణం సింహైరివ మహద్వనమ్. ౧౧
భేరీమృదంగాభిరుతం శంఖఘోషవినాదితం,
నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసైస్సదా. ౧౨
సముద్రమివ గంభీరం సముద్రమివ నిస్స్వనం,
మహాత్మనో మహద్వేశ్మ మహారత్నపరిచ్ఛదమ్. ౧౩
మహారత్నసమాకీర్ణం దదర్శ స మహాకపిః,

హనుమంతుండు వెండితోఁ గట్టఁబడి బంగారురేఖలచే నలంకరింపఁబడి నానావిధవర్ణంబులఁ గలిగియుండు తోరణంబుల నానావిధంబులగు తొట్టికట్టులను సుందరంబు లగుద్వారంబుల నలంకృతంబై యేనుంగులపైఁ గూర్చుండినవారై శూరులయి యలసట లేకుండు ప్రధానులచేఁ బాలితంబయి రథంబులకుఁ గట్టఁదగిన యవధ్యంబు లగుగుఱ్ఱంబులతోఁ గూడి దంతమయంబులు రజతమయంబులు స్వర్ణమయంబులు నై సింహచర్మంబుచే వ్యాఘ్రచర్మముచేఁ గవచితంబులయి యిటునటు కార్యవశంబునం దిరుగుచుండు విచిత్రంబగు రథంబులచే గొప్పధ్వని గలిగి యనేకరత్నంబులచే భాసిల్లుచు మేలైన పీఠంబులతో నొప్పుచుఁ బదునొకండువేలమంది విలుకాండ్రతోఁ బోరంజాలునట్టి వీరులకు నివాసస్థానంబై మేలైన రథంబులును నాసనంబులునుం గలిగి సుందరంబులు మిక్కిలియుఁ బెద్దవియుం నానావిధంబులు నగు పెక్కువేలు మృగపక్షులచేఁ బరిపూర్ణంబై యాయుధధారణాదులందుఁ జక్కఁగా నేర్పు గలిగి వెలుపటిభాగంబు రక్షింప నియుక్తులయిన రాక్షసవీరులచే సురక్షితంబై సుందరస్త్రీలతో నిండి మంచిసౌందర్యంబునఁ బ్రకాశించుచు నెల్లప్పుడు సంతోషంబునం బొదలుచుండు వనితలు గలిగి రాక్షసశ్రేష్ఠుల కునికిపట్టయి స్త్రీలుఁ బురుషులు గార్యవశంబునం దిరుగుచుండుటం జేసి ధ్వనించుచుండు మంచిభూషణంబుల ధ్వనులు గల్గుటవలన గొప్పధ్వనిగల సముద్రంబునకు సాటిసేయందగినదై రాజచిహ్నంబు లగు ఛత్రచామరాదులతోఁ గూడి యగరుచందనాదిగంధంబులను వాసితంబై పురుషశ్రేష్ఠులు గల్గుటం జేసి సింహంబులతోఁ గూడిన మహావనంబుం బోలెఁ జూపట్టుచు భేరీధ్వనుల మృదంగశబ్దంబుల శంఖఘోషంబులం బ్రతినాదితంబై యెల్లప్పుడును గంధపుష్పాదుల నలంకరింపఁబడి సర్వకాలంబులందుఁ జేయఁబడు హోమంబుగలదియై (అందఱకు సుఖకరంబై) రాక్షసులచేఁ బూజింపఁబడుచు (రాక్షసులు కావలియుండుటం జేసి దుష్ప్రవేశంబై) గంభీరంబగు సముద్రంబుఁబోలె నున్నదై యొక్కచో రాక్షసులు నిద్రితులగుటంజేసి నిశ్శబ్దం బగుసముద్రంబు కరణి నొప్పుచు గొప్పమణులతోఁ జేయఁబడిన పైకప్పు గలిగి గొప్పమణులతో నిండి గొప్పదియయియుండు మహాపరాక్రమశాలి యగురావణుని

విరాజమానం వపుషా గజాశ్వరథసంకులమ్. ౧౪
లంకాభరణమిత్యేవ సోఽమన్యత మహాకపిః,

చచార హనుమాంస్తత్ర రావణస్య సమీపతః. ౧౫

[సంక్షిప్య చాత్మనః కాయం ప్రవిశ్యానుపలక్షితః,
చిన్తయామాస మనసా ముహూర్తం ధ్యానమాస్థితః.
కపిప్రవీరో హనుమాన్ రాఘవప్రియకామ్యయా,
కీదృశీ బంధనే బద్ధా ముక్త్వా వా స్వైరచారిణీ.
కాశ్చ రక్షన్తి రాక్షస్యః కథంరూపా చ మైథిలీ,
న దృష్టపూర్వా చ మయా వైదేహీ జనకాత్మజా.
ఇఙ్గితైశ్చానుమానైశ్చ మయా జ్ఞేయా భవిష్యతి,
ఏతాం బుద్ధిం తదా కృత్వా హనుమాన్మారుతాత్మజః.
అన్వియేష తదా సీతాం రాఘవప్రియకామ్యయా,
స నికామం విమానేషు నిపతన్ పాదపేషు చ.
విచచార కపిర్లఙ్కాం లఘుప్రక్రమవిక్రమః,]
గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ వానరః,
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః. ౧౬
అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనం,
తతోఽన్యత్పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్. ౧౭

అథ మేఘప్రతీకాశం కుమ్భకర్ణనివేశనం,
విభీషణస్య చ తదా పుప్లువే స మహాకపిః. ౧౮

గృహంబును జూచెను. ౪-౧౩

హనుమంతుండు రూపంబునం బ్రకాశించుచు నేనుంగులును గుఱ్ఱంబులును రథంబులును మెండుగాఁ గలిగి యొప్పుచున్న యా రావణగృహంబుఁ జూచి "ఇది లంకకంతయు భూషణంబనందగియున్నది" అని తలంచెను. ౧౪

హనుమంతుండు ఆ రావణమందిరంబున రావణుని సమీపంబునఁ బొ సీతను వెదకుచు సంచరించెను. ౧౫

[అంత నొరుల కెఱుఁగరానట్లు మేను కుఱుచఁజేసి లోపలదూఱి రామునకు మేలుజేయు నాహనుమంతుఁ డిట్లాలోచించెను. సీత యెట్లున్నదో చెఱఁబెట్టఁబడినదో ఊరక విడువఁబడినదో ఇచ్ఛగొలఁదిఁ దిరుగుచున్నదో ఆమె కెవరు కావలియున్నారో ఆమె యేవిధముగా నుండునో మున్నెవ్వఁడునుఁ జూచియెఱుఁగను. ఇఁక మనోగతులచేతనే ఊహచేతనే ఆమెను గుఱుతింపవలెను. అని తలపోసికొని రామప్రియమునకై సీతను వెదకఁదలఁచి మహోత్సవముతో విమానములమీఁదను మాఁకులమీఁదను గుప్పిగంతులు వైచికొనుచు వెదకసాగెను.]

ఆహనుమంతుండు భయపడక రాక్షసుల ప్రతిగృహంబును ఉద్యానవనంబులను ప్రాసాదంబులనుం బరీక్షించుచు సంచరించెను. ౧౬

అధికమయిన వేగంబుగలవాఁడును బరాక్రమశాలియు నగు హనుమంతుఁడు ప్రహస్తునియింటికిఁబోయి యంత నచ్చటనుండి మహాపార్శ్వునింటికిం బోయెను. ౧౭

అంత నప్పు డాహనుమంతుండు మేఘంబునుంబోలె మిక్కిలి గొప్పదై తలయెత్తి చూడందగియుండు కుంభకర్ణునిగృహంబునకును విభీషణునియింటికినిఁ బోయెను. ౧౮

మహోదరస్య చ గృహం విరూపాక్షస్య చైవ హి,
విద్యుజ్జిహ్వస్య భవనం విద్యున్మాలే స్తథైవ చ. ౧౯
వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజాస్సారణస్య చ ధీమతః. ౨౦
తథా చేన్ద్రజితో వేశ్మ జగామ హరియూథపః,

జంబుమాలేస్సుమాలేశ్చ జగామ హరిసత్తమః. ౨౧

రశ్మికేతోశ్చ భవనం సూర్యకేతో స్తథైవ చ,
వజ్రకాయస్య చ తథా పుప్లువే సమహాకపిః. ౨౨
ధూమ్రాక్షస్య చ సంపాతేర్భవనం మారుతాత్మజః,
విద్యుద్రూపస్య భీమస్య ఘనస్య విఘనస్య చ. ౨౩

శుకనాసస్య వక్రస్య శఠస్య వికటస్య చ,
బ్రహ్మకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః. ౨౪

యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య నాదినః,
విద్యుజ్జిహ్వేన్ద్రజిహ్వానాం తథా హస్తిముఖస్య చ. ౨౫

కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి,

క్రమమాణః క్రమేణైవ హనుమాన్మారుతాత్మజః. ౨౬

ఆహనుమంతుఁడు మహోదరునిగృహంబునకుఁ బోయి పిదప విరూపాక్షునియింటిలోనికిఁ జని యంత విద్యుజ్జిహ్వునిభవనంబున కరిగి యట్లు విద్యున్మాలిగృహంబునకుఁ బోయి యచ్చోటనుండి వజ్రదంష్ట్రుని యింటిలోనికిఁ బోయెను. ౧౯

మహాపరాక్రమశాలియు వానరసమూహంబులఁ బాలించువాఁడు నగు హనుమంతుఁడు శుకునియింటికిని బుద్ధిమంతుఁ డగుసారణునిగృహంబునకును అట్లు ఇంద్రజిత్తు భవనంబునకును బోయెను. ౨౦

వానరశ్రేష్ఠుఁడగు నాహనుమంతుఁడు జంబుమాలియింటికిని సుమాలి గృహంబునకును బోయెను. ౨౧

ఆహనుమంతుఁడు రశ్మికేతువుగృహంబునకును సూర్యకేతుఁ డనువాని యింటికిని వజ్రకాయుఁడను రాక్షసుని భవనంబునకును బోయెను. ౨౨

వాయుదేవుని కుమారుఁ డగుహనుమంతుఁడు ధూమ్రాక్షుని యింటికిని సంపాతిగృహంబునకును భయంకరుఁ డగువిద్యుద్రూపుని భవనంబునకును ఘనుఁడను రాక్షసునియింటిలోనికిని విఘనుండను రాక్షసుని గృహంబునకును బోయెను. ౨౩

ఆ హనుమంతుఁడు శుకనాసుఁ డనురాక్షసునియింటికిని వక్రుఁడను వాని గృహంబునకును వికటుఁడనువాని యాలయంబునకును బ్రహ్మకర్ణుఁడను వాని భవనంబునకును దంష్ట్రుఁడనువాని గృహంబునకును లోమశుఁడనురాక్షసుని యింటికినిఁ బోయెను. ౨౪

ఆహనుమంతుఁడు యుద్ధోన్మత్తునిగృహంబునకును మత్తునిగృహంబునకును ధ్వజగ్రీవునిగృహంబునకును నాది యనువానిగృహంబునకును విద్యుజ్జిహ్వుఁ డనుపేరు గలవారల గృహంబులకును ఇంద్రజిహ్వుఁ డనుపేరు గలవారలగృహంబులకును బోయెను. ౨౫

ఆహనుమంతుండు కరాళునియింటికిని పిశాచుని గృహంబునకును శోణితాక్షుని భవనంబునకును బోయి చూచెను.

అధిక మయినకీర్తిగలవాఁడును వాయుకుమారుండు నగు నాహనుమం

తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
తేషామృద్ధిమతామృద్ధిం దదర్శ స మహాకపిః. ౨౭

సర్వేషాం సమతిక్రమ్య భవనాని సమంతతః,
ఆససాదాథ లక్ష్మీవాన్రాక్షసేంద్రనివేశనమ్. ౨౮

రావణస్యోపశాయిన్యో దదర్శ హరిసత్తమః,
విచరన్హరిశార్దూలో రాక్షసీర్వికృతేక్షణాః. ౨౯

శూలముద్గరహస్తాశ్చ శక్తితోమరధారిణీః,
దదర్శ వివిధాన్ గుల్మాన్ తస్య రక్షఃపతేర్గృహే. ౩౦

రాక్షసాంశ్చ మహాకాయాన్నానాప్రహరణోద్యతాన్,
రక్తాన్ శ్వేతాన్ సితాంశ్చైవ హరీంశ్చాపి మహాజవాన్. ౩౧
కులీనాన్ రూపసంపన్నాన్ గజాన్పరగజారుజాన్,
నిష్ఠితాన్ గజశిక్షాయామైరావతసమాన్యుధి. ౩౨
నిహంతౄన్పరసైన్యానాం గృహే తస్మిన్ దదర్శ సః,
క్షరతశ్చ యథా మేఘాన్ స్రవతశ్చ యథా గిరీన్. ౩౩
మేఘస్తనితనిర్ఘోషాన్ దుర్ధర్షాన్ సమరే పరైః,

సహస్రం వాహినీస్తత్ర జాంబూనదపరిష్కృతాః. ౩౪
హేమజాలపరిచ్ఛన్నాస్తరుణాదిత్యసన్నిభాః,
దదర్శ రాక్షసేంద్రస్య రావణస్య నివేశనే. ౩౫
శిబికా వివిధాకారాస్స కపిర్మారుతాత్మజః,

తుండు ఇట్లు వరుసగా నారాక్షసులయిండ్లకుఁ బోయి యాయాగృహంబులందు అధికమయిన సంపదల నొందియుండు నారాక్షసుల సంపత్తులను జూచెను. ౨౬, ౨౭

కాంతిసంపన్నుఁ డగునాహనుమంతుఁడు అంతటఁ దిరుగుచు నందఱి గృహంబులను జూచి వాని నతిక్రమించి యంత రాక్షసేశ్వరుండగు రావణుని యింటికిఁ బోయెను. ౨౮

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు ఆరావణగృహంబున సంచరించుచు శూలముద్గరంబులఁ జేతులం బట్టుకొని శక్తితోమరంబులను నాయుధంబుల ధరించి యెచ్చరికతో రావణుసమీపమునఁ బరుండియున్న వికృతంబులగు కండ్లుగల స్త్రీలం జూచెను. ౨౯

ఆ హనుమంతుఁడు రాక్షసేశ్వరుం డగు నారావణునింటఁ గావలి యుండు నానావిధసేనలను పలువిధంబులగు నాయుధంబుల నాయితముగాఁ బట్టుకొనియుండు గొప్ప దేహములు గలరాక్షసులను జూచెను. ౩౦

ఆ హనుమంతుఁడు రావణునింటంగట్టఁబడియుండు నధికమైన వేగంబు గల యెఱుపువన్నెగుఱ్ఱంబులను తెలుపువన్నెగుఱ్ఱంబులను మఱియు సత్కులంబులం బుట్టినవియు రూపసంపన్నంబులును శత్రుగజంబులం జంపునవియుఁ జక్కఁగా గజశిక్షనేర్చినవియునై యుద్ధమునం దైరావతంబునకు సాటివచ్చుచు శత్రుసైన్యంబులఁ జంపునవియై గొప్పశరీరంబుగల్గి యత్యున్నతంబులై మద జలంబు కార్చుచుండుటఁ జేసి వర్షించుచున్న మేఘంబులుఁబోలె సెలయేఱులతోఁ గూడిన పర్వతంబు కైవడిఁ జూపట్టుచు మేఘంబువలె గర్జించుచు యుద్ధంబున శత్రువుల కెదిరింప నలవిగానివై యుండు గజంబులను జూచెను. ౩౧—౩౩

ఆ హనుమంతుఁడు రాక్షసేశ్వరుండగు నారావణుగృహంబునం గావలి యుండువారలను జంబూనదియందుఁ బుట్టినబంగారముతోను ఇతరస్థలంబుల జనియించినబంగారముతోను జేయఁబడిన యాభరణంబుల ధరించుకొని మధ్యాహ్నసూర్యులుంబోలెఁ బ్రకాశించుచుండువారలను గాలిబంటుల ననేకులను జూచెను. ౩౪, ౩౫

లతాగృహాణి చిత్రాణి చిత్రశాలాగృహాణి చ. 3౬
క్రీడాగృహాణి చాన్యాని దారుపర్వతకానపి,
కామస్య గృహకం రమ్యం దివాగృహకమేవ చ. 3౭
దదర్శరాక్షసేంద్రస్య రావణస్య నివేశనే,

సమందరగిరిప్రఖ్యం మయూరస్థానసంకులమ్. 3౮
ధ్వజయష్టిభిరాకీర్ణం దదర్శ భవనోత్తమం,
అనేకరత్నసంకీర్ణం నిధిజాలం సమంతతః. 3౯
ధీరనిష్ఠితకర్మాంతం గృహం భూతపతేరివ,

అర్చిర్భిశ్చాపి రత్నానాం తేజసా రావణస్య చ. ౪౦
విరరాజాథ తద్వేశ్మరశ్మిమానివ రశ్మిభిః,

జాంబూనదమయాన్యేవ శయనాన్యాసనాని చ. ౪౧
భాజనాని చ ముఖ్యాని దదర్శ హరియూథపః,

మధ్వాసవకృతక్లేదం మణిభాజనసంకులమ్. ౪౨
మనోరమమసంబాధం కుబేరభవనం యథా,
[చన్దనాగరుధూపైశ్చ దివ్యధూపైస్సుధూపితమ్.
మాల్యదామభిరాకీర్ణం పుష్పభక్తివిరాజితమ్.
దివ్యగంధావసిక్తాభిర్దీపికాభిర్విదీపితం,
లోకపాలాన్ పరిత్యజ్య తచ్ఛ్రియేవ సమావృతమ్,]

వాయుదేవునికుమారుం డగునాహనుమంతుఁడు రాక్షసేశ్వరుం డగు రావణునిభవనంబుఁ దిరుగుచు నానావిధంబు లైనపల్లకీలను జిత్రంబులగు లతాగృహంబులను జిత్తరువులు వ్రాయంబడియుండు గదులులేని (హాల్) యిండ్లను మఱియు నితరములయిన క్రీడాగృహములను క్రీడార్థంబు లగు దారుమయపర్వతములను సుందరములగు రతిగృహములను బగలువినోదంబుగా నివసింపఁ దగినగృహంబులను వరుసగాఁ జూచెను. ౩౬, ౩౭

ఆ హనుమంతుఁడు వానిఁ జూచుచుఁ బోయి మందరపర్వతంబునకు సాటివచ్చునదియు నెమళ్లు నిలుచుట కేర్పఱుపఁబడిన స్థానంబులతో నిండినదియునై యంతటను ధ్వజంబులు కట్టఁబడి పెక్కురత్నంబులు గల్గి నిధు లనేకంబులు గల్గి పండితు లగువారలచే నెంతో ప్రయత్నంబున నిర్మింపఁబడిన (ధైర్యంబును నియమంబును గలిగి కష్టపడిచేసిన తపంబునకు ఫలంబనందగి) భూతనాథుం డగుశివునిగృహంబునకు సాటివచ్చుచున్న యందలి యుత్తమగృహంబును జూచెను. ౩౮, ౩౯

అప్పుడు ఆయుత్తమగృహమునందుఁ బొదిగియున్న మణులకాంతులును రావణుని తేజంబును అంతటం బర్వియుంటం జేసి కిరణంబులు గల సూర్యుఁడువలెఁ బ్రకాశించుచుండినది. ౪౦

వానరసమూహంబులఁ బాలించు నాహనుమంతుఁ డారావణుని యుత్తమభవనంబునఁ బాన్పును పీఠంబులు ముఖ్యంబు లగుపాత్రంబులు నివియన్నియుం బంగారముతోఁ జేయంబడినవిగానే యుండుటఁజూచెను. ౪౧

సారాయిచేఁ దడుపంబడి రత్నమయములైన పాత్రంబు లనేకంబులు గల్గి మనోహరంబై విశాలమై కుబేరునిగృహంబుఁబోలుచు [అగరు చందనాదిధూపములచేతను దివ్యధూపములచేతను సముద్ధూపితమై మాలికలచే నలంకరింపఁబడియున్నదియుఁ బుష్పరచనలచే నలంకరింపఁబడినదియుం సుగంధము గల దీపములచే వెలిఁగింపఁబడినదై లోకపాలుర లక్ష్మి వారిని వీడి దీని నాశ్రయించిన ట్లున్నదియు] స్త్రీలు సంచరించుచుండుటం జేసి అందెలధ్వనులును మొలనూళ్లశబ్దంబును నాదసంపన్నంబు లగుమృదంగంబుల నిన

నూపురాణాం చ ఘోషేణ కాంచీనాం నినదేన చ. ౪౩
మృదంగతలఘోషైశ్చ ఘోషవద్భిర్వినాదితం,
ప్రాసాదసంఘాతయుతం స్త్రీరత్నశతసంకులం,
సువ్యూఢకక్ష్యం హనుమాన్ప్రవివేశ మహాగృహమ్. ౪౪

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షష్ఠస్సర్గః.

---

## సప్తమస్సర్గః

స వేశ్మజాలం బలవాన్ దదర్శ
వ్యాసక్తవైడూర్యసువర్ణజాలం,
యథా మహత్ప్రావృషి మేఘజాలం
విద్యుత్పినద్ధం సవిహంగజాలమ్. ౧

నివేశనానాం వివిధాశ్చ శాలాః
ప్రధానశంఖాయుధచాపశాలాః,
మనోహరాశ్చాపి పునర్విశాలాః
దదర్శ వేశ్మాద్రిషు చంద్రశాలాః. ౨

గృహాణి నానా వసురాజితాని
దేవాసురైశ్చాపి సుపూజితాని,
సర్వైశ్చ దోషైః పరివర్జితాని
కపిర్దదర్శ స్వబలార్జితాని. 3

తాని ప్రయత్నాభిసమాహితాని
మయేన సాక్షాదివ నిర్మితాని,
మహీతలే సర్వగుణోత్తరాణి
దదర్శ లంకాధిపతేర్గృహాణి. ౪

దంబులును గల్గి పెక్కుమేడలతోఁ గూడి యుత్తమరూప లగుస్త్రీలు పెక్కు-వేలు గల్గి మిక్కిలియు విశాలంబులగు తొట్టికట్లతో నొప్పుచున్న యా రావణుని యుత్తమగృహంబును హనుమంతుఁడు ప్రవేశించెను. ౪౨—౪౪

ఇది ఆఱవసర్గము.

## ఏడవ సర్గము

బలవంతుఁ డగునాహనుమంతుఁ డచ్చట వైడూర్యమణులు పొదిగి యున్న బంగారు కిటికీలు గల్గి యాకిటికీలయందు వినోదార్థముగా నుంచఁబడిన పక్షులు గలదై వర్షాకాలంబున మెఱపు లధికంబుగాఁ గల్గి వానకురియఁనని తిరుగుచుండు పక్షులతో నొప్పుచున్న మేఘంబులం బోలెఁ జూపట్టుచుండెడు గదు లనేకంబులఁ జూచెను. ౧

ఆ హనుమంతుఁడు అయ్యాగృహంబులకు సంబంధించిన గదులులేని ప్రదేశంబులను (పలువిధములయిన పనులుచేసియుండు శాలలుగలతొట్టికట్లను) శ్రేష్ఠములైన శంఖములు నితరాయుధంబులు ధనువులు నుంచు గృహంబులను మఱియుఁ బర్వతంబులఁబోలు గృహంబులందుండు (గృహంబులు ప్రాసాదంబులు మొదలగువానియందుండు) మనోహరంబులును సుందరంబులు నగు పై మేడలను జూచెను. ౨

హనుమంతుండు నానావిధంబు లగుమణులచేఁ బ్రకాశించుచున్నదై దేవతలచేతను అసురులచేతను బూజింపఁబడినదై యెంతమాత్రమును దోషంబులేనిదై రావణుండు నిజబలంబునఁ గుబేరుని జయించి సంపాదించినగృహంబులం జూచెను. ౩

ఆ హనుమంతుండు ఎంతో ప్రయత్నంబున నిర్మింపఁబడి విశ్వకర్మచేఁ నిర్మింపఁబడినదయ్యు మయుండు ప్రత్యక్షముగాఁ దానే భూమి కేతెంచి నిర్మించినాఁడో యనఁదగి యొప్పుచు సమస్తగుణంబులును గలుగుటంజేసి భూమండలంబున నన్నిగృహంబులలో శ్రేష్ఠంబులై యుండు లంకానాథుం డగురావణుని గృహంబులఁ జూచెను. ౪

తతో దదర్శోచ్ఛ్రితమేఘరూపం
మనోహరం కాంచనచారురూపం,
రక్షోఽధిపస్యాత్మబలానురూపం
గృహోత్తమం హ్యప్రతిరూపరూపమ్. ౫

మహీతలే స్వర్గమివ ప్రకీర్ణం
శ్రియా జ్వలంతం బహురత్నకీర్ణం,
నానాతరూణాం కుసుమావకీర్ణం
గిరేరివాగ్రం రజసావకీర్ణమ్. ౬

నారీప్రవేకైరివ దీప్యమానం
తటిద్భిరంభోదవదర్చ్యమానం,
హంసప్రవేకైరివ వాహ్యమానం
శ్రియా యుతం ఖే సుకృతాం విమానమ్. ౭

యథా నగాగ్రం బహుధాతుచిత్రం
యథా నభశ్చ గ్రహచంద్రచిత్రం,
దదర్శ యుక్తీకృతమేఘచిత్రం
విమానరత్నం బహురత్నచిత్రమ్. ౮

మహీ కృతా పర్వతరాజిపూర్ణా
శైలాః కృతా వృక్షవితానపూర్ణాః,
వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః
పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్. ౯

కృతాని వేశ్మాని చ పాండురాణి
తథా సుపుష్పాణ్యపి పుష్కరాణి,
పునశ్చ పద్మాని సకేసరాణి
ధన్యాని చిత్రాణి తథా వనాని. ౧౦

అంత సాహానుమంతుఁడు ఉన్నతంబయి మేఘంబుకైవడిఁ బ్రకాశించుచు మనోహారంబయి బంగారముతోఁ జేయఁబడియుండుటంజేసి సుందరంబయి యెచ్చటను సరిలేనిదై మిక్కిలియు బలవంతుఁ డగుకుబేరుని జయించి తన్ను సంపాదింపఁబడినదియు, నతిశ్రేష్ఠంబును గావున రావణుని బలంబున కనురూపంబై యొప్పుచున్న పుష్పకవిమానంబుఁ జూచెను. ౫

దైవయోగంబున భూమికివచ్చినస్వర్గంబనందగి కాంతిచేఁ బ్రకాశించుచు మణిమయంబై నానావిధంబులగు వృక్షంబులపుష్పంబులచే నలంకరింపఁబడి యున్నతంబై యుండుటంజేసి పుష్పంబులు రాలియుండు పర్వతశిఖరంబుం బోలెఁ జూపట్టు నుత్తమసౌందర్యంబుగల స్త్రీలు గలుగుటంజేసి మెఱుపులతోఁ గూడిన మేఘంబు కైవడి వెలుంగుచు నందఱిచేతను పూజింపఁబడుచు హంసలచేత నేమైన మోయఁబడుచున్నదో యని యెన్నందగి పుణ్యవంతులు బహుపుణ్యముల నార్జించిన విమానం బనందగి నానావిధమణులు పొదిగి యుండుటవలన నానావిధధాతువులచేఁ జిత్రవర్ణంబగు పర్వతశిఖరంబుకైవడి శుక్రాది గ్రహంబులును జంద్రుండును గలుగుటవలనఁ జిత్రంబగునాకాశంబు కరణి నింద్రధనువుతోఁ గూడియుండు మేఘంబుభంగి భాసిల్లుచున్న విమాన శ్రేష్ఠం బగు పుష్పకవిమానమును అహానుమంతుండు జూచెను. ౬-౭

ఆపుష్పకవిమానంబునందు పర్వతంబులు కలిగి సుందరం బగునట్లుగా భూమి చిత్రరూపంబున వ్రాయఁబడినవి. మంచిచెట్లతో నొప్పునట్లు పర్వతంబులు వ్రాయఁబడినవి. పుష్పంబులతో నిండియుండునట్లుగా వృక్షంబులు నిర్మింపఁబడినవి. అందులోని పూవులు కింజల్కంబులు ఱేకులును గల్గి రమణీయంబు లగునట్లుగా నిర్మింపఁబడినవి. ౯

ఆ పుష్పకవిమానమునందుఁ దెల్లనిగృహంబులు చిత్తరువున వ్రాయఁబడినవి. సుందరంబులగు పుష్పంబుల నొప్పుచుండు కోనేటులు వ్రాయఁబడినవి. మఱియుఁ గింజల్కంబులతోఁగూడి రమణీయంబులయిన పద్మంబులు వ్రాయఁబడినవి. అట్లు ఉత్తమంబులు నానావిధంబులు గువనంబులు నిర్మింపఁబడినవి. ౧౦

పుష్పాహ్వాయం నామ విరాజమానం
రత్నప్రభాభిశ్చ వివర్ధమానం,
వేశ్మోత్తమానామపి చోచ్చమానం
మహాకపి స్తత్ర మహావిమానమ్. ౧౧

కృతాశ్చ వైడూర్యమయా విహంగాః
రూప్యప్రవాళైశ్చ తథా విహంగాః,
చిత్రాశ్చ నానావసుభిర్భుజంగాః
జాత్యానురూపా స్తురగాశ్శుభాంగాః. ౧౨

ప్రవాళజాంబూనదపుష్పపక్షా
స్సలీలమావర్జితజిహ్మపక్షాః,
కామస్య సాక్షాదివ భాంతి పక్షాః
కృతా విహంగాస్సుముఖాస్సుపక్షాః. ౧౩

నియుజ్యమానా స్తు గజాస్సుహస్తా
స్సకేసరాశ్చోత్పలపత్రహస్తాః,
బభూవ దేవీ చ కృతా సుహస్తా
లక్ష్మీ స్తథా పద్మిని పద్మహస్తా. ౧౪

ఇతీవ తద్గృహమభిగమ్య శోభనం
సవిస్మయో నగమివ చారు శోభనం,
పునశ్చ తత్పరమసుగంధి సుందరం
హిమాత్యయే నగమివ చారుకందరమ్. ౧౫

హనుమంతుఁ డచ్చట నట్లు సర్వగుణసంపన్నంబై మణులకాంతులచేఁ బ్రకాశించుచున్నదై యెందఱు కూర్చున్నను అందఱకుం జాలునట్లు వృద్ధి బొందునదై మిగుల నున్నతంబునగు గృహంబులకన్నను బొడవై పుష్పకం బను పేరుగల్గియుండు విమానశ్రేష్ఠంబును జూచెను. ౧౧

ఆ పుష్పకవిమానమునందు వైడూర్యమణులతోఁ జేయఁబడినపక్షు లుండినవి. మఱియు వెండితోను పగడములతోను జేయఁబడినపక్షు లుండినవి. నానావిధంబుల రత్నంబులతోఁ జేయంబడినవగుటంజేసి నానావిధవర్ణంబులు గలిగిన సర్పంబు లుండినవి. అట్లు నానావిధమణులతోఁ జేయఁబడి సజాతీయంబులగు గుఱ్ఱంబులకు సాటివచ్చుచు శుభలక్షణసంపన్నంబు లగు నవయవంబులతోఁ గూడియున్న గుఱ్ఱంబు లుండినవి. ౧౨

ఆపుష్పకవిమానంబున మంచిముఖంబును సుందరంబులగు ఱెక్కలును గల్గి పవడముతోను బంగారముతోను నిర్మింపఁబడినపుష్పంబుల ఱెక్కలందు గలవై సొగసుగాఁ దమఱెక్కలను వంకరగునట్లు కొంత వంచికొనియుండునట్లు నానావిధమణులతోఁ జేయఁబడినవై యుండు పక్షులు ఆకారంబు వహించి ప్రత్యక్షంబులైన మన్మథుని సహాయంబులో యనందగి చూపరులకు మన్మథోద్రేకంబు గలిగించుచుండినవి. ౧౩

ఆపుష్పకవిమానంబునఁ దామరకొలంకులందు సుందరంబులగు తొండంబులుగల్గి తామరకొలంకున విహారముసేయుటంజేసి దేహాలగ్నంబులగు పద్మకింజల్కంబులు గల్గి కలువఱేకులఁ దొండంబుల ధరించి సేవించుచుండు నేనుఁగులను చిత్తరువున వ్రాయఁబడినవి. అట్లు వానిచే సేవింపఁబడుచుఁ జేతులు గమలంబులు ధరించి సుందరంబులగు హస్తంబులు గల్గియుండు లక్ష్మీదేవియును చిత్తరువున వ్రాయఁబడినది. ౧౪

ఆహనుమంతుఁడు మంగళకరంబై సుందరంబై యట్లు సుందరంబును మంగళకరంబునగు పర్వతముంబోలెఁ జూపట్టుచున్న యారావణునియుత్తమగృహంబు గలయందిరిగి "రావణుఁడుండుస్థలంబు గానలేనైతి ఇంక నెంత పెద్దదిగా నున్నదో" యని యాశ్చర్యపడి, యంత మరల వసంతర్తువునందుఁ జక్కఁగాఁ

తతస్స తాం కపిరభిపత్య పూజితాం
చరన్ పురీం దశముఖబాహుపాలితాం,
అదృశ్య తాం జనకసుతాం సుపూజితాం
సుదుఃఖితః పతిగుణవేగనిర్జితామ్. ౧౬
తత స్తదా బహువిధ భావితాత్మనః
కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః,
అపశ్యతోఽభవదతిదుఃఖితం మన
స్సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః. ౧౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తమస్సర్గః.

## అష్టమస్సర్గః

స తస్య మధ్యే భవనస్య సంస్థితం
మహద్విమానం మణివజ్రచిత్రితం,
ప్రతప్తజాంబూనదజాలకృత్రిమం
దదర్శ వీరః పవనాత్మజః కపిః. ౧
తదప్రమేయాప్రతికారకృత్రిమం
కృతం స్వయం సాధ్వితి విశ్వకర్మణా,
దివం గతం వాయుపథప్రతిష్ఠితం
వ్యరాజతాఽఽదిత్యపథస్య లక్ష్మవత్. ౨

ఖష్పించిరయుండుటంజేసి, మంచివాసనగలిగి సుందరంబులయిన గృహంబులు గలిగిన పర్వతంబుంబోలె సుందరంబై మంచివాసనగలిగియుండు నాగృహంబుఁ జొచ్చి కలయంద్రిమ్మరి "యెంత తిరిగినను ఈగృహంబు తుదముట్టనైతిఁగదా" యని యాశ్చర్యంబు నొందెను. ౧౫

ఆట్లాహనుమంతుఁడు ఖ్యాంబును రావణునిచే భుజబలంబునం బాలింపఁబడునదియు నగునాలంకంజొచ్చి యన్నిచోట్లను దిరిగినను మిక్కిలి పూజ్యురాలును బెనిమిటియగు రామునిగుణాతిశయంబునంజేసి తదధీనయయి యున్నదియు నగు సీత యగపడకున్నందున మిగుల దుఃఖంబునొందెను. ౧౬

అంత నపుడు ఆ హనుమంతుండు తాను వనంబున నానావిధంబులగు నాలోచనలుచేసి మంగళకరంబగు నీతిమార్గం బవలంబించి కద్దుచెదరనీయక యతిజాగ్రత్తతో దూరంబున నున్నవానింగూడఁ జూడంజాలినవాఁడై మహాధైర్యంబు వహించి యెంతో ప్రయత్నంబునఁ దిరిగి లంకయంతయుఁ దిరిగినను సీత కనుపడకుండుటం జేసి మిక్కిలి దుఃఖమునొందెను. ౧౭

ఇది ఏడవసర్గము.

## ఎనిమిదవ సర్గము.

పరాక్రమశాలియు వాయుదేవునికుమారుండునగు నాహనుమంతుండు ఆయుత్తమగృహంబునడుమ స్థాపింపఁబడి వజ్రములు మొదలగు మణులచేఁ జిత్రవర్ణముగాఁ జేయఁబడినదై యుత్తమం బగుబంగారముతోఁజేయఁబడిన కార్యవిశేషంబులు గలదైన గొప్పది యగుపుష్పకవిమానంబుం జూచెను. ౧

విశ్వకర్మచే చాలఁ బ్రయత్నంబునం బ్రశంసాపూర్వకముగా "ఇట్లు చేసియుండు" నని చెప్పనలవిగానంతటిది మఱియెచ్చటను లేనట్లుగా నిర్మింపఁ బడినదై ఆకాశంబున సంచరింపఁజాలినదై యంతరిక్షంబున నే యుంచఁబడినదై యున్న యాపుష్పకవిమానంబు "సూర్యునిమార్గంబునకు గల్గినచిహ్నంబో" యనందగి ప్రకాశించినది. ౨

న తత్ర కించిన్న కృతం ప్రయత్నతో
న తత్ర కించి న్న మహార్హరత్నవత్,
న తే విశేషా నియతాస్సురేష్వపి
న తత్ర కించి న్న మహావిశేషవత్. 3

తపస్సమాధానపరాక్రమార్జితం
మనస్సమాధానవిచారచారిణం,
అనేకసంస్థానవిశేషనిర్మితం
తత స్తత స్తుల్య విశేషదర్శనమ్. ४

మనస్సమాధాయ తు శీఘ్రగామినం
దురావరం మారుతతుల్యగామినం,
మహాత్మనాం పుణ్యకృతాం మహర్ధినాం
యశస్వినామగ్ర్యముదామివాలయమ్. ౫

విశేషమాలంబ్య విశేషసంస్థితం
విచిత్రకూటం బహుకూటమండితం,
మనోఽభిరామం శరదిందునిర్మలం
విచిత్రకూటం శిఖరం గిరేర్యథా. ౬

వహంతి యం కుండలశోభితాననాః
మహాశనా వ్యోమచరా నిశాచరాః,
వివృత్త విధ్వస్త విశాలలోచనాః
మహాజవా భూతగణాస్సహస్రశః. ౭

ఆపుష్పకవిమానంబున దేనిఁ జూచినను బహుప్రయత్నంబున నిర్మింపఁబడినదే కాని వేఱు కాదు. అం దెచ్చటఁ జూచినను జాలవెలగల మణులుపొదిగి యుండినవిగానే యుండెను. అందున్నవిశేషంబులు దేవతల గృహంబులందునుం గానఁబడవు. అందేదియు చూపరులకుఁ జాల నచ్చెరువు పుట్టింపనిది లేదు. ౩

గొప్పతపంబు చేసియుఁ బరాక్రమంబు చూపియుం సంపాదింపఁబడి తనపైఁగూర్చుండువా రెచ్చటికిఁ బోఁదలంతురో యచ్చటికిఁ బోఁగలిగి విమాన గోపురాది సన్నివేశవిశేషంబున నొక్కొకచో నొక్కొకవిధంబుగా నిర్మింపఁబడి అన్ని స్థలంబులయందును సమంబుగా నిర్మాణవిశేషంబు గలిగి చూపరులనేత్రంబులకు వినోదంబుఁ గలిగించుచుండు నాపుష్పకవిమానంబుఁ జూచెను. ౪

స్వామిహృదయంబు గనుంగొనిన మాత్రాన నతివేగంబునం బోవు నదియై యేరికి నడ్డగింపఁగూడనిదై వాయుదేవుండుంబోలె నతివేగంబుగా సంచరించునదియై మహాపరాక్రమశాలురుఁ బుణ్యవంతులు నధికమయిన సంపద గలవారలుఁ గీర్తిసంపన్నులు మహానందము నొందియున్నవారలు నగు నింద్రాదులకు వాసస్థానమయిన స్వర్గముం బోలె నున్న పుష్పకంబును హనుమంతుండు చూచెను. ౫

శ్రేష్ఠంబు లగురత్నంబులు మొదలగువస్తుసమూహంబుఁ గొని శ్రేష్ఠంబయిన సన్నివేశంబున నిర్మింపఁబడి నానావిధంబులు ననేకంబులు నగుశిఖరంబులు గలిగి చూపరుల మనంబునకు సంతోషంబు నెఱపుచు శరత్కాలంబునందలి నిండుచందురుండుంబోలె నిర్మలంబై నానావిధంబులగు వనాంతర శృంగంబులతోఁ గూడిన పర్వతశిఖరంబుభంగి భాసిల్లుచున్న పుష్పకంబును హనుమంతుండు చూచెను. ౬

కుండలంబులతో నొప్పుచున్న ముఖంబులును గొప్పశరీరంబులును గలిగి యాకాశంబునం దిరుగునవివోలె నిర్మింపఁబడిన రాక్షసాకారప్రతిమల చేతను గుండ్రములు వంకరలు వెడల్పులు నగుకండ్లు గలిగి చూపరుల కతివేగంబు గలవివలె నగపడునట్లు చేయఁబడిన వేనవేలు భూతాకారప్రతిమలచే మోయంబడుచున్నట్లు చూపట్టు నాపుష్పకవిమానమును హనుమంతుండు చూచెను. ౭

వసంతపుష్పోత్కర చారుదర్శనం
వసంతమాసాదపి కాంతదర్శనం,
స పుష్పకం తత్ర విమానముత్తమం
దదర్శ తద్వానరవీరసత్తమః. ౫

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - అష్టమస్సర్గః.

---

## నవమస్సర్గః

తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపులమాయతం,
దదర్శ భవనశ్రేష్ఠం హనూమాన్మారుతాత్మజః. ౧

అర్ధయోజనవిస్తీర్ణమాయతం యోజనం హి తత్,
భవనం రాక్షసేంద్రస్య బహుప్రాసాదసంకులమ్. ౨
మార్గమాణస్తు వైదేహీం సీతామాయతలోచనాం,
సర్వతః పరిచక్రామ హనూమానరిసూదనః. ౩

ఉత్తమం రాక్షసావాసం హనుమానవలోకయన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్. ౪
చతుర్విషాణైర్ద్విరదైస్త్రివిషాణైస్తథైవ చ,
పరిక్షిప్తమసంబాధం రక్ష్యమాణముదాయుధైః. ౫

రాక్షసీభిశ్చ పత్నీభీ రావణస్య నివేశనం,
ఆహృతాభిశ్చ విక్రమ్య రాజకన్యాభిరావృతమ్. ౬
తన్నక్రమకరాకీర్ణం తిమింగిలఝషాకులం,
వాయువేగసమాధూతం పన్నగైరివ సాగరమ్. ౭

వానరవీరులలో శ్రేష్ఠుఁడగు నాహనుమంతుఁడు అచ్చట వసంతర్తువునం గల్గు పూవులచే నలంకరింపఁబడియుంటఁజేసి సుందరంబుగాఁ జూపట్టుచు వసంతర్తువుకన్నను అధికంబుగాఁ జూపరులకు వినోదంబు సేయుచు విమానంబులలో నుత్తమంబైయున్న పుష్పకవిమానంబును చూచెను. ౭

ఇది ఎనిమిదవసర్గము.

---

## తొమ్మిదవ సర్గము

వాయుదేవునికుమారుండగు నా హనుమంతుఁడు గృహంబులలో నుత్తమంబగు నారావణుని గృహంబు నడుమను గృహశ్రేష్ఠం బనందగిన పుష్పకవిమానంబుం జూచెను. ౧

రాక్షసేశ్వరుండగు రావణునిగృహంబు లెక్కలేని మేడలు గల్గి అర యామడవెడల్పును అమడనిడుపును గలదై యుండెను. ౨

శత్రువులఁ జంపంజాలిన హనుమంతుఁడు విశాలంబులగు నేత్రంబులు గల విదేహదేశంబునం బుట్టిన సీతను వెదకుచు నాగృహంబు నంతటను గలయం దిరిగె. ౩

అంతఁ గాంతిసంపన్నుండగు హనుమంతుఁడు సీతను వెదకుటకై యన్ని గృహంబులలో నుత్తమంబై రాక్షసుల కునికిపట్టైన నాలుగుదంతంబుల యేనుఁగులును రెండుదంతంబుల యేనుఁగులును మూఁడుదంతంబుల యేనుంగులును జుట్టునుం గలదై యాయుధధారులగు రాక్షసులచే రక్షింపఁబడుచున్న రాక్షసేశ్వరుండగు రావణునిగృహంబుం బ్రవేశించెను. ౪, ౫

ఆ హనుమంతుఁడు రావణునిభార్యలయిన రాక్షసస్త్రీలును రావణుండు పరాక్రమంబునం గొనితెచ్చిన రాజకన్యలును బరుండియున్న "మొసళ్లను మహామత్స్యంబులును తిమింగిలంబులను మత్స్యంబులునుం గల్గి వాయువేగంబునం దూలుచు సర్పంబులతోఁ గూడిన సముద్రంబుంబోలెఁ జూపట్టుచున్న" రావణుని యంతఃపురంబుం జూచెను. ౬, ౭

యా హి వైశ్రవణే లక్ష్మీర్యా చేంద్రే హరివాహనే,
సా రావణగృహే సర్వా నిత్యమేవానపాయినీ. ౮

యా చ రాజ్ఞః కుబేరస్య యమస్య వరుణస్య చ,
తాదృశీ తద్విశిష్టా వా ఋద్ధీ రక్షోగృహేష్విహ. ౯
తస్య హర్మ్యస్య మధ్యస్థం వేశ్మ చాన్యత్సునిర్మితం,
బహునిర్యూహసంకీర్ణం దదర్శ పవనాత్మజః. ౧౦
బ్రహ్మణోఽర్థే కృతం దివ్యం దివి యద్విశ్వకర్మణా,
విమానం పుష్పకం నామ సర్వరత్నవిభూషితమ్. ౧౧

పరేణ తపసా లేభే యత్కుబేరః పితామహాత్,
కుబేరమోజసా జిత్వా లేభే తద్రాక్షసేశ్వరః. ౧౨
ఈహామృగసమాయుక్తైః కార్తస్వరహిరణ్మయైః,
సుకృతై రాచితం స్తంభైః ప్రదీప్తమివ చ శ్రియా. ౧౩
మేరుమందరసంకాశై రుల్లిఖద్భిరివాంబరం,
కూటాగారైశ్శుభాగారైస్సర్వతస్సమలంకృతమ్. ౧౪
జ్వలనార్కప్రతీకాశం సుకృతం విశ్వకర్మణా,
హేమసోపానసంయుక్తం చారుప్రవరవేదికమ్. ౧౫
జాలవాతాయనైర్యుక్తం కాంచనైస్స్ఫాటికైరపి,
ఇంద్రనీల మహానీల మణిప్రవరవేదికమ్. ౧౬
విద్రుమేణ విచిత్రేణ మణిభిశ్చ మహాధనైః,
నిస్తులాభిశ్చ ముక్తాభి స్తలేనాభివిరాజితమ్. ౧౭
చందనేన చ రక్తేన తపనీయనిభేన చ,
సుపుణ్యగంధినా యుక్తమాదిత్యతరుణోపమమ్. ౧౮

కుబేరునకును హరిహయుండగు నింద్రునకును ఏయేసంపదలు గలవో ఆసంపదలన్నియును రావణునింట నెప్పుడును నాశంబులేనివై స్థిరంబులుగా నున్నవి. ౮

కుబేరునకు యమునికి వరుణునకు నెంత సంపదయుండునో ఆలంకలోని రాక్షసులందఱు సంతతిసంపద గలవారలయి యుండిరి. ౯

పూర్వము బ్రహ్మదేవునికొఱకు స్వర్గంబున విశ్వకర్మచే నిర్మింపఁబడినదై సమస్తమణులచే నలంకృతంబై మున్ను కుబేరునిచే గొప్పతపంబు సల్పి బ్రహ్మదేవునివలన బొందఁబడి పెక్కుమదపుటేనుఁగులచే రక్షింపఁబడినదై యారావణుని గృహంబునడుమ మఱియొక్క గృహంబుంబోలెఁ జూపట్టుచున్న పుష్పకవిమానంబునందును వాయుదేవుని కుమారుండగు హనుమంతుఁడు చూచెను. ౧౦, ౧౧

రాక్షసులకందఱకును బ్రభుండగురావణుండు పరాక్రమంబునం గుబేరుని జయించి, తోడేళ్ల ప్రతిమలు కట్టినవై బంగారముతోను వెండితోను సుందరంబుగాఁ జేయఁబడిన స్తంభంబులతోఁ గూడినవై కాంతిచేఁ బ్రకాశించుచు మేరుమందరపర్వతంబులుంబోలె నత్యున్నతంబులై యాకాశంబు నొరయునట్లు చూపట్టుచున్న సుందరంబులగు మేడమీఁది గృహంబు లనేకంబులు గల్గి యొప్పుచుండు నా పుష్పకవిమానంబుఁ దీసికొనెను. ౧౨-౧౪

విశ్వకర్మచే సుందరంబుగా నిర్మింపఁబడి సూర్యాగ్నులుంబోలె వెలుంగుచు బంగారముతోఁ జేసిన మెట్లతోఁగూడి గోడమీఁద నలంకారార్థము పెద్దవిగా స్వస్తికాద్యాకారములుగాఁ జేయఁబడిన జాలంబులను కిటికీలును వాయుసంచారార్థము చేయఁబడిన సాధారణంబులగు కిటికీలును గలిగి పాలలో వేసినంతనే యాపాలనంతయు నల్లగాఁ జేయు నింద్రనీలమణులతోను సింహళద్వీపంబునఁ బుట్టిన మహానీలమణులతోను, జేయఁబడి సుందరంబులయిన తిన్నెలు గల్గి నానావిధంబులగు పగడములును గొప్పవెలగలమణులును ఉత్తమంబులగు ముత్తెంబులును అను వీనితోఁ గట్టఁబడిన కుట్టిమంబుతో నొప్పుచు నెఱ్ఱగానుండునది కావున మంచిబంగారముతో సాటిసేయఁదగిన సుగంధి

కూటాగారైర్వరాకారైర్వివిధైస్సమలంకృతం,
విమానం పుష్పకం దివ్యమారురోహ మహాకపిః. ౧౯

తత్రస్థస్స తదా గంధం పానభక్ష్యాన్నసంభవం,
దివ్యం సమ్మూర్ఛితం జిఘ్రద్రూపవంతమివానిలమ్. ౨౦

స గంధస్తం మహాసత్త్వం బంధుర్బంధుమివోత్తమం,
ఇత ఏహీత్యువాచేవ తత్ర యత్ర స రావణః. ౨౧

తతస్తాం ప్రస్థితశ్శాలాం దదర్శ మహతీం శుభాం,
రావణస్య మనః కాంతాం కాంతామివ వరస్త్రియమ్. ౨౨
మణిసోపానవికృతాం హేమజాలవిభూషితాం,
స్ఫాటికైరావృతతలాం దంతాంతరితరూపికామ్. ౨౩
ముక్తాభిశ్చ ప్రవాళైశ్చ రూప్యచామీకరైరపి,
విభూషితాం మణిస్తంభైస్సుబహుస్తంభభూషితామ్. ౨౪
సమైరృజుభిరత్యుచ్చైస్సమంతాత్సువిభూషితైః,
స్తంభైః పక్షైరివాత్యుచ్చైర్దివం సంప్రస్థితామివ. ౨౫
మహత్యా కుథయా స్తీర్ణాం పృథివీలక్షణాంకయా,
పృథివీమివ విస్తీర్ణాం సరాష్ట్రగృహమాలినీమ్. ౨౬
నాదితాం మత్తవిహగైర్దివ్యగంధాధివాసితాం,
పరార్ధ్యాస్తరణోపేతాం రక్షోధిపనిషేవితామ్. ౨౭

చందనంబు గల్గుటంజేసి వాసనల గుబాళించుచు మధ్యాహ్నసూర్యునిభంగి భాసిల్లుచు సుందరంబుగా నేర్పఱుపఁబడిన నానావిధంబులగు మేడమీఁది గృహంబుచే నలంకరింపఁబడియున్న స్వర్గంబునం బుట్టిన పుష్పకవిమానంబున హనుమంతుం డారోహించెను. ౧౮-౧౯

అప్పు డాహనుమంతుఁ డచ్చటనుండి దివ్యంబై యంతటను వ్యాపించి పరాగబహుళంబై యుండుటంజేసి యాకారము వహించిన వాయువో యనం దగి యొప్పుచున్న మద్యములు పిండివంటలు నన్నంబులు మొదలగువానివలనం గలిగిన సుగంధంబు నాఘ్రాణించుచుండెను. ౨౦

ఆవాసన రావణుం డుండుస్థలంబున నుండు పదార్థంబులవలనం గలిగిన దగుటంజేసి యట్టి యుత్తమంబగు గంధంబు కల్గినచోటనే రావణుం డుండు నని బుద్ధిమంతుండగు హనుమంతుఁ డూహింపఁదగియున్నది. కావున నా గంధంబు బంధువు తనకుఁ గావలసినబంధువునకుఁ జెప్పినట్లు వాయుదేవుఁడు హనుమంతునకు రావణుఁ డుండుస్థలంబును జెప్పిన ట్లుండెను. ౨౧

ఆ హనుమంతుం డట్లు రావణుఁ డుండునట్టిగృహంబునకు బయలు దేఱి గొప్పదై మంగళకరంబై రావణునిహృదయంబునకుఁ బ్రియమైన యుత్తమస్త్రీ యనందగి మణిమయంబులగు పడికట్లు గలిగి బంగారుకిటికీల నలంకృతంబై స్ఫటికమణులతోఁ గట్టఁబడిన కుట్టిమంబు గలిగి యచ్చటచ్చట నడుమ సుందరంబుగా నతికింపఁబడిన దంతపుఁబలకలు గలదై ముత్తెపుఁ గంబంబులఁ బ్రవాళస్తంభంబుల బంగారుస్తంభంబుల మణిమయస్తంభంబుల (యవాంతరస్తంభసంపన్నంబుల) నొప్పుచుఁ గొంచెము కొనను వంగినవై వంకరలుగాక యత్యున్నతంబులై యంతటనుం జక్కఁగా నలంకరింపఁబడి యున్నతంబులగు ఱెక్కలకై వడిఁ దోఁచు స్తంభంబులు గల్గుటంజేసి స్వర్గంబున కుద్గమించునదివోలెఁ జూపట్టుచు సముద్రనదీపర్వతవనాదులగు భూమిలక్షణంబుల నంకితంబగు చిత్రకంబళంబునం గప్పఁబడిన నేల గలదై నానాదేశములతోఁగూడిన భూమండలంబులంబోలె విశాలంబై మదంబున మధురంబుగాఁగూయు పక్షులుగలిగి దివ్యగంధంబునం బరిమళించుచు రాక్షసేశ్వరుం డగు రావణునిచే సేవింపఁబడుచు నగరుధూపంబులు వేసియుండుటంజేసి

ధూమ్రా మగరుధూపేన విమలాం హంసపాండురాం,
చిత్రాం పుష్పోపహారేణ కల్మాషీ మివ సుప్రభామ్. ౨౮
మనస్సంహ్లాదజననీం వర్ణస్యాపి ప్రసాదినీం,
తాం శోకనాశినీం దివ్యాం శ్రియ స్సంజననీ మివ. ౨౯

ఇంద్రియాణీంద్రియార్థైస్తు పంచపంచభి రుత్తమైః,
తర్పయామాస మాతేవ తదా రావణపాలితా. 3౦

స్వర్గోఽయం దేవలోకోఽయ మింద్రస్యేయం పురీ భవేత్,
సిద్ధిర్వేయం పరా హి స్యాదిత్యమన్యత మారుతిః. 3౧

ప్రధ్యాయత ఇవాపశ్యత్ప్రదీప్తాం స్తత్ర కాంచనాన్,
ధూర్తానివ మహాధూర్తై ర్దేవనేన పరాజితాన్. 3౨

దీపానాం చ ప్రకాశేన తేజసా రావణస్య చ,
అర్చిర్భిర్భూషణానాం చ ప్రదీప్తేత్యభ్యమన్యత. 33

యొక్కచో ధూమ్రవర్ణంబై యొక్కచో హంసయునుంబోలె నిర్మలంబయి తెల్లఁగాఁ గనుపట్టుచు నొక్కెడఁ బూలు చల్లఁబడినందునఁ జిత్రవర్ణంబయి కామధేనువుంబోలె నెల్లకోర్కెలం దీర్పఁగలదై కాంతిచే వెలుంగుచుఁ జూపరుల హృదయంబునకు సంతోషంబు నెఱపునదియై సంతోషప్రదంబగుటం జేసి చూపరుల ముఖకాంతిని వృద్ధిబొందించునదై దుఃఖముఁ బోఁగొట్టునదై దివ్యంబై లక్ష్మికిం బుట్టినిలుభంగి భాసిలుచున్న యారావణుఁ డున్నగృహంబుఁ జూచెను. ౨౨-౨౯

రావణునిచేఁ బాలింపఁబడిన యాగృహంబునందు సుస్పర్శంబగు వాయువును నేత్రంబులకు వినోదంబు నెఱపు సుందరంబగురూపంబును చెవులకు నానందంబుం గలిగించు మధురంబగుగానంబులును అతిరుచ్యంబులగు భక్ష్యాదులును మనోహరంబగు గంధంబును గలుగుటంజేసి యాగృహంబు అచ్చటికిఁ బోయిన హనుమంతుని త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణంబులను పంచేంద్రియంబులకును తనయందుండు స్పర్శరూపశబ్దరసగంధవిశేషంబులచేతఁ గన్నతల్లి తనపుత్రుని యింద్రియంబులకుంబోలెఁ దృప్తిఁ గలిగించెను. ౩౦

వాయుదేవునికుమారుండగు హనుమంతుఁడు ఆరావణుని స్థానంబు ఉండు తెఱంగును జూచి యచ్చెరువొంది ఇది స్వర్గంబో! అందును ముఖ్యముగా దేవతలు నివసింపఁదగినస్థానంబో! అందును దేవతలకంటెఱకును ప్రభువైన యింద్రుండు నివసించు నమరావతీపురియో! లేక బ్రహ్మలోకమో! యని తలంచెను. ౩౧

హనుమంతుం డచ్చట నిశ్చలంబుగా నుండుటంజేసి యేమో ధ్యానంబు సేయుచున్నవివోలెఁ జూపట్టుచు నట్లు పెద్దజూదరులచే జూదంబునఁ బరాజయంబునొంది యవమానంబున నిట్టట్టు కదలకుండు జూదరుల చందంబున నందంబుగా నున్న దీపంబులఁ జూచెను. ౩౨

ఆ హనుమంతుఁడు ఆగృహంబున దీపంబుల వెలుతురును రావణుని తేజస్సును సొమ్ముల కాంతులును అంతటను బర్వియుండుటం జూచి యీ యిల్లు మండుచున్నదా యేమి! అని తలంచెను.

తతోఽపశ్యత్కుథాఽఽసీనం నానావర్ణాంబరస్రజం,
సహస్రం వరనారీణాం నానావేషసుభూషితమ్. ౩౪

పరివృత్తేఽర్ధరాత్రే తు పాననిద్రావశంగతం,
క్రీడిత్వోపరతం రాత్రౌ సుష్వాప బలవత్తదా. ౩౫

తత్ప్రసుప్తం విరురుచే నిశ్శబ్దాంతరభూషణం,
నిశ్శబ్దహంసభ్రమరం యథా పద్మవనం మహత్. ౩౬

తాసాం సంవృతదంతాని మీలితాక్షాణి మారుతిః,
అపశ్యత్పద్మగంధీని వదనాని సుయోషితామ్. ౩౭

ప్రబుద్ధానీవ పద్మాని తాసాం భూత్వా క్షపాక్షయే,
పునస్సంవృతపత్త్రాణి రాత్రావివ బభుస్తదా. ౩౮

ఇమాని ముఖపద్మాని నియతం మత్తషట్పదాః,
అంబుజానీవ ఫుల్లాని ప్రార్థయంతి పునఃపునః. ౩౯

ఇతి చామన్యత శ్రీమానుపపత్త్యా మహాకపిః,
మేనే హి గుణతస్తాని సమాని సలిలోద్భవైః. ౪౦

సా తస్య శుశుభే శాలా తాభిస్స్త్రీభిర్విరాజితా,
శారదీవ ప్రసన్నా ద్యౌస్తారాభిరభిశోభితా. ౪౧

అంత నా హనుమంతుం డచ్చట చిత్రకంబళంబుపైఁ బరుండి చిత్రవర్ణంబులగు వస్త్రంబులను బుష్పమాలికలను ధరించి పలుదెఱంగులగు నలంకారంబుల నలంకరింపఁబడియుండు వేయిమంది స్త్రీలను జూచెను. ౩౪

ఆ వేయిమంది స్త్రీలు రాత్రియందు వివిధంబులగు క్రీడలు సల్పి యలసటనొంది యర్ధరాత్ర మతిక్రమింపఁగానే ఇంకను గ్రీడించుటయందుఁ బూర్ణంబుగాఁ దృప్తినొందనివా రయ్యును మద్యంబు ద్రావినందునం గల్గిన కైపునకు లోఁబడి బలాత్కారంబున నప్పుడే నిద్ర జెందిరి. ౩౫

అట్లు నిశ్చలంబుగాఁ బరుండి నిదురించియుండుటంజేసి నిశ్శబ్దములయిన మొలనూలు మొదలగు భూషణంబులు గల యాస్త్రీలసమూహము అట్లు రాత్రియందు నిశ్శబ్దముగా నుండు హంసలును భ్రమరములునుం గల కమలవనంబుచందంబున నందంబుగా నుండినది. ౩౬

వాయుందేవుని కుమారుండగు హనుమంతుఁడు కండ్లుమూసికొని పండ్లు కానరాకుండ పెదవులు మూసికొని నిదురించుచుండు నా స్త్రీలయొక్క కమలంబులుం బోలె సుగంధంబు గలిగిన ముఖంబులం జూచెను. ౩౭

ఆస్త్రీల ముఖంబులు ప్రాతఃకాలంబునుండి వికసితంబులయి యుండి మరల రాత్రియందు ముకుళితంబులయిన కమలంబులంబోలెఁ బ్రకాశించుచుండినవి. ౩౮

వీరిముఖంబులు కమలంబు లుండున ట్లున్నవి కావున మదంబున నొదలు జెలియని భృంగంబులు వికసించిన కమలంబులఁ గోరునట్లు వీరి ముఖంబులను మాటిమాటికిని గోరును. ౩౯

శ్రీమంతుఁడగు నా హనుమంతునకు వారి ముఖంబులు సుగంధాది గుణంబులఁ గమలంబులతో సరివచ్చునని దోఁచెను. కావున పైనఁ జెప్పినట్లు అతండు "తుమ్మెద లీ ముఖంబులను గోరు"నని తలంచెను. ౪౦

ఆ ట్లుత్తమస్త్రీలతోఁ గూడి నిర్మలంబై యున్న యా రావణుని గృహంబు అట్లు నిర్మలంబై నక్షత్రంబులతోఁ గూడిన శరత్కాలమునందలి యాకాశంబు చందంబునఁ బ్రకాశించెను. ౪౧

స చ తాభిః పరివృతశ్శుశుభే రాక్షసాధిపః,
యథా హ్యుడుపతిశ్శ్రీమాంస్తారాభిరభిసంవృతః. ౪౨

యాశ్చ్యవంతేఽంబరాత్తారాః పుణ్యశేషసమావృతాః,
ఇమాస్తాస్సంగతాః కృత్స్నా ఇతి మేనే హరిస్తదా. ౪౩

తారాణామివ సువ్యక్తం మహతీనాం శుభార్చిషాం,
ప్రభావర్ణప్రసాదాశ్చ విరేజుస్తత్ర యోషితామ్. ౪౪

వ్యావృత్త గురుపీనస్రక్ప్రకీర్ణవరభూషణాః,
పానవ్యాయామకాలేషు నిద్రాపహృతచేతసః. ౪౫

వ్యావృత్తతిలకాః కాశ్చిత్కాశ్చిదుద్భ్రాంతనూపురాః,
పార్శ్వే గళితహారాశ్చ కాశ్చిత్పరమయోషితః. ౪౬

ముక్తాహారాఽవృతా శ్చాన్యాః కాశ్చిద్విస్రస్తవాససః,
వ్యావిద్ధరశనాదామాః కిశోర్య ఇవ వాహితాః. ౪౭

సుకుండలధరాశ్చాన్యా విచ్ఛిన్న మృదితస్రజః,
గజేంద్రమృదితాః ఫుల్లా లతా ఇవ మహావనే. ౪౮

చంద్రాంశుకిరణాభాశ్చ హారాః కాసాంచిదుత్కటాః,

రాక్షసేశ్వరుండగు నా రావణుండును ఆ యుత్తమస్త్రీలంగూడి నక్షత్రంబులం గూడిన శ్రీమంతుండగు చంద్రునిచందంబున నందంబుగాఁ బ్రకాశించెను. ౪౨

హనుమంతుం డప్పుడు ఆ స్త్రీలంజూచి "అనుభవింపఁగా మిగిలిన పుణ్యంబుతోఁగూడి యాకాశంబుననుండి భూమిపై నిదివరకుఁ బడిన నక్షత్రంబు లన్నియుం జేరి యీ స్త్రీలరూపంబు వహించినవి కాఁబోలు" అని తలంచెను. ౪౩

అచ్చట స్త్రీల మేనికాంతియును రంగును నైర్మల్యమును గొప్పవియును గాంతిసంపన్నంబులు నగు నక్షత్రంబులకాంతియు రంగును నైర్మల్యంబునుం బోలి ప్రకాశించుచుండినవి. ౪౪

ఆస్త్రీలు చక్కఁగా మద్యముఁ ద్రావి రతిసేయుకాలంబున నిద్రకు లోఁబడుటం జేసి వ్యత్యాసమునొందిన పుష్పమాలికలుగలిగి స్థానములు తప్పిన భూషణములతోఁ గూడి ప్రకాశించుచుండిరి. ౪౫

కొందఱు స్త్రీల నుదుటిబొట్టు మాసియుండినది. కొందఱ కాలి యందెలు స్థానంబు తప్పియుండినవి. మఱికొందఱ కంఠహారంబులు ప్రక్కను జాఱి పడియుండినవి. ౪౬

మఱికొందఱు తెగిపోయి మేనంజుట్టుకొనిన ముత్యపుహారంబులు గలిగియును, గొందఱు వస్త్రము వీడియును ప్రకాశించుచుండిరి. కొందఱు శయనించియుండు స్త్రీలు మొలనులిదారము తెగిపోవుటచే వదులయియుండుటం జేసి యట్లు వదులుచేయఁబడిన కట్టుగలిగి శ్రమనాశనార్థము నేలం బొరలునట్లు చేయంబడుచుండు చిన్న యాఁడుగుఱ్ఱములంబోలె నొప్పుచుండిరి. ౪౭

మంచికుండలంబుల ధరించియుండు మఱికొందఱుస్త్రీలు పుష్పము పుష్పముగాఁదెగి నలిగియుండు పుష్పమాలికలు గలవారయి పరుండియుండుటం జేసి యడవియందు గజశ్రేష్ఠముచే నలుఁగఁద్రొక్కఁబడిన చక్కఁగాఁ బుష్పించిన తీఁగెలుంబోలెఁ జూపట్టుచుండిరి. ౪౮

కొందఱుస్త్రీలు స్తనంబులనడుమ ధరించిన హారంబులు చంద్రుని

హంసా ఇవ బభుస్సుప్తాః స్తనమధ్యేషు యోషితామ్. ౪౯

అపరాసాం చ వైడూర్యాః కాదంబా ఇవ పక్షిణః,
హేమసూత్రాణి చాన్యాసాం చక్రవాకా ఇవాభవన్. ౫౦

హంసకారండవాకీర్ణాశ్చక్రవాకోపశోభితాః,
ఆపగా ఇవ తా రేజుర్జఘనైః పులినైరివ. ౫౧

కింకిణీజాలసంకోశాస్తా హైమవిపులాంబుజాః,
భావగ్రాహా యశస్తీరాస్సుప్తా నద్య ఇవాఽఽబభుః. ౫౨

మృదుష్వంగేషు కాసాంచిత్కుచాగ్రేషు చ సంస్థితాః,
బభూవుర్భూషణానీవ శుభా భూషణరాజయః. ౫౩

అంశుకాంతాశ్చ కాసాంచిన్ముఖమారుతకంపితాః,
ఉపర్యుపరి వక్త్రాణాం వ్యాధూయంతే పునఃపునః. ౫౪

తాః పతాకా ఇవోద్ధూతాః పత్నీనాం రుచిరప్రభాః,
నానావర్ణసువర్ణానాం వక్త్రమూలేషు రేజిరే. ౫౫

వవల్గుశ్చాత్ర కాసాంచిత్కుండలాని శుభార్చిషాం,
ముఖమారుతసంసర్గాన్మందం మందం సుయోషితామ్. ౫౬
శర్కరాఽసవగంధైశ్చ ప్రకృత్యా సురభిస్సుఖః,

కిరణంబులుం బోలెఁ దెల్లనివై పెద్దవిగానుండుటంజేసి యట్లు తెల్లనివై స్త్రీల స్తనములనడుమఁ బరుండి నిదురించుహంసలో యనందగి యొప్పుచుండినవి.

మఱికొందఱుస్త్రీలు స్తనంబుల ధరించిన వైడూర్యమణిహారంబులు స్త్రీల స్తనములనడుమ నిద్రించుచుండు ధూమ్రవర్ణంబులగు ముక్కుఁగొట్టు ఱెక్కలు గల కాదంబంబులను హంస లనం దగియుండినవి. మఱికొందఱు స్త్రీలు ధరించిన హేమసూత్రరూపములయిన హారములు అట్లు స్త్రీల స్తన మధ్యంబునం బరుండినచక్రవాకులో యనందగి యొప్పుచుండినవి. ౧౦

ఆస్త్రీలు విశాలంబులగు జఘనంబులు గలిగి యట్లు పెద్దయిసుకదిన్నెలు గలిగి హంసలుఁ గారండవంబులుఁ జక్రవాకంబులు మున్నగుపక్షులతోఁ గూడి యుండు నదులుంబోలెఁ బ్రకాశించుచుండిరి. ౧౧

నిదురించియున్న యాస్త్రీలు గజ్జెలు మొగ్గలుగాను బంగారుసొమ్ములు కమలంబులుగాను శృంగారచేష్టలు మొసళ్లుగాను దేహకాంతి తీరంబుగాను ఒప్పుచుండఁగా నదులుంబోలెఁ బ్రకాశించిరి. ౧౨

నిద్రించుటకై సొమ్మును దీసియున్న కొందఱుస్త్రీల మెత్తని యవయవంబులందును స్తనంబులందును భూషణము లెడతెగక ధరించుటచే నేర్పడిన గీఱలును వారలకు భూషణంబులుంబోలె నలంకారము నెఱపుచుండినవి. ౧౩

కొందఱ స్త్రీలముఖంబు సమీపముననుండు సూక్ష్మము లగు వస్త్రముల కొనలు వారు విడుచునిట్టూర్పులకుం గదలుచు మాటిమాటికి ముఖంబునైఁ గొట్టుచుండినవి. ౧౪

మనోహరంబులయిన వర్ణంబుల నొప్పుచుండు నావస్త్రాంతంబులు నానావిధంబు లగు మేలయిన మేనిచాయలతోఁ గూడిన యారావణభార్యల ముఖముల సమీపంబున నిట్టూర్పుగాలికిఁ గదలుచు గాలికిఁ గదలు టెక్కెములుంబోలెఁ బ్రకాశించినవి. ౧౫

అచ్చట కాంతిసంపన్నలగు కొందఱు స్త్రీల చెవిపోఁగులు నిట్టూర్పు గాలి దగిలి మెల్లమెల్లగాఁ జలించుచుండినవి. ౧౬

స్వభావంబుననే గంధంబు గలదియుంచు జక్కెరతోఁ జేయఁబడిన

తాసాం వదననిశ్శ్వాసస్సిషేవే రావణం తదా. ౫౭

రావణాననశంకాశ్చ కాశ్చిద్రావణయోషితః,
ముఖాని స్మ సపత్నీనాముపాజిఘ్రన్పునః పునః. ౫౮

అత్యర్థం సక్తమనసో రావణే తా వరస్త్రియః,
అస్వతంత్రాస్సపత్నీనాం ప్రియమేవాఽఽచరంస్తదా. ౫౯

బాహూనుపనిధాయాన్యాః పారిహార్యవిభూషితాన్,
అంశుకాని చ రమ్యాణి ప్రమదాస్తత్ర శిశ్యిరే. ౬౦

అన్యా వక్షసి చాన్యస్యాస్తస్యాః కాశ్చిత్పునర్భుజం,
అపరా త్వంకమన్యస్యాస్తస్యాశ్చాప్యపరా భుజౌ. ౬౧

ఊరుపార్శ్వకటీపృష్ఠమన్యోన్యస్య సమాశ్రితాః,

మద్యము ద్రావుటచే మఱియు మనోహరం బగుగంధంబుతో నొప్పుచున్న దియు నగు నాస్త్రీల నిట్టూర్పుగాలి యప్పుడు రావణునిపైఁ బ్రసరించు చుండుటం జేసి యది యతని సేవించునట్లు చూపట్టుచుండెను. ౧౭

అప్పుడు కొందఱు రావణునిభార్యలు మద్యమదంబునం జేసి రావణుని ముఖంబులని భ్రమించి తమసవతుల ముఖంబులం బలుమాఱు నాఘ్రాణించిరి ౧౮

అట్లు సవతులచే నాఘ్రాణింపఁబడినముఖంబులుగల యాస్త్రీలును సాధారణంబుగా సవతులు తమకు శత్రువు లగుటవలన వారలు తమముఖము నాఘ్రాణింపఁగాఁ గోపంబు నొందవలసినవార లయ్యును రావణునియందు మిగులఁ బ్రీతి మోహంబులు గలవారగుటం జేసి సవతులును రావణునకుఁ బ్రియలు కావున సవతులకుఁ బ్రియంబు సేయుట రావణునకుఁ బ్రియంబగు నని తలంచి స్వాతంత్ర్యంబు వహింపక యాసవతులముఖంబు దాము నాఘ్రాణించి వారలకుఁ బ్రియంబునే యాచరించిరి. ౧౯

(అట్లు సవతులచే నాఘ్రాణింపఁబడిన ముఖంబులు గల యాస్త్రీలు రావణునియందు మిక్కిలియుఁ బ్రీతిమోహంబులు గలవారలును మద్యపానంబున మైమఱచినవారు నగుటం జేసి సవతులు తమ ముఖంబుల నాఘ్రాణించినను దానినిం దెలిసికొనలేక రావణుండే యాఘ్రాణించెనని తలంచి వారల ముఖంబులఁ దాము నాఘ్రాణించి వారలకుఁ బ్రియంబునే యాచరించిరి.)

అచ్చట మఱికొందఱు స్త్రీలు కడియంబుల నలంకరింపఁబడియుండు భుజంబులను రమణీయంబు లగువస్త్రంబులను దలగడగా నుంచుకొని పరుండి యుండిరి. ౨౦

మఱియొక్కతె యింకొక్కతె ఱొమ్ముమీఁదఁ దలయుంచుకొని పరుండి యుండెను. ఆబిడభుజంబుపైఁ దలయుంచుకొని మఱికొందఱు పరుండి యుండిరి. మఱియొక్కస్త్రీ మఱియొకదానితొడపైఁ దలపెట్టుకొని నిద్రించుచుండెను. ఆబిడభుజంబులపై మఱికొందఱు స్త్రీలు తలలుంచుకొని పరుండి యుండిరి. ౨౧

మఱికొందఱుస్త్రీలు ఒండొరుల తొడలను, ప్రక్కలను, మొలలను,

పరస్పరనివిష్టాంగ్యో మదస్నేహవశానుగాః. ౬౨

అన్యోన్యభుజసూత్రేణ స్త్రీమాలా గ్రథితా హి సా,
మాలేవ గ్రథితా సూత్రే శుశుభే మత్తషట్పదా. ౬౩

లతానాం మాధవే మాసి ఫుల్లానాం వాయుసేవనాత్,
అన్యోన్యమాలాగ్రథితం సంసక్తకుసుమోచ్చయమ్. ౬౪
వ్యతివేష్టితసుస్కంధమన్యోన్యభ్రమరాకులం,
ఆసీ ద్వనమివోద్ధూతం స్త్రీవనం రావణస్య తత్, ౬౫

ఉచితేష్వపి సువ్యక్తం న తాసాం యోషితాం తదా,
వివేకశ్శక్య ఆధాతుం భూషణాంగాంబరస్రజామ్. ౬౬

రావణే సుఖసంవిష్టే తాస్త్రియో వివిధప్రభాః,
జ్వలంతః కాంచనా దీపాః ప్రైక్షంతానిమిషా ఇవ. ౬౭

రాజర్షిపితృదైత్యానాం గంధర్వాణాం చ యోషితః,
రాక్షసానాం చ యాః కన్యా స్తస్య కామవశం గతాః. ౬౮
యుద్ధకామేన తాః సర్వా రావణేన హృతాస్త్రియః,

వీఁపున దలగడగాఁ జేసికొని యొండొరులపైఁ జేతులుఁ, గాళ్లు మొదలగు నవయవంబుల వేసికొనుచు మొదట నంత స్నేహంబు లేనివారయ్యును బానమదంబునం జేసి యతిస్నేహంబు గలవారలయి పరుండియుండిరి. ౬౨

దారంబువోలెఁ జూపట్టుచుండు పరస్పరభుజంబులఁ దుమ్మెదలంబోలె వెండ్రుకలు గల తలలుంచుకొని పరుండియుండు నా స్త్రీలసమూహము దారంబునఁ గూర్పంబడి భృంగంబుల నొప్పుచుండు పుష్పమాలికయుం బోలెఁ బ్రకాశించుచుండినది. ౬౩

అచ్చట పరస్పరము మాలికవలెఁ గూడుకొని పుష్పంబులు ధరించి యొండొరులపైఁ జుట్టుకొని వ్యాకులంబు లగు ముంగురులు గలిగి ముఖమారుతంబువలనఁ గదలుచున్న కోకకొంగులు గలిగియుండు నా రావణస్త్రీలసమూహము అట్లు వైశాఖమాసంబున వికసించి మాలికగా నేర్పడి పుష్పించి చెట్టుకొమ్మలమీఁద నల్లుకొని తుమ్మెదలచే వ్యాకులంబై వాయువుచేఁ గదలింపంబడుచున్న లతల వనంబుంబోలె నొప్పుచుండినది. ౬౪, ౬౫

అప్పుడు ఆస్త్రీల సొమ్ములు నవయవంబుల వస్త్రములును బుష్పమాలికలును ఉచితస్థానంబుల నుంచఁబడియుండిన వయ్యును ఆస్త్రీలు మాలాకారముగాఁ బరుండియుండుటం జేసి 'ఇవి వీరివి, యివి మఱియొకరివి' అని విమర్శించి తెలిసికొనఁగూడకుండినవి. ౬౬

రావణుండు మేల్కొనియుండఁగా నాస్త్రీలం జూడ నశక్యము గావున నచ్చట బంగారుస్తంభంబులం దుంచఁబడిన దీపంబులు రావణుండు సుఖనిద్రఁ జెందఁగానే నిశ్చలంబులయి నానావిధకాంతుల నొప్పుచుండు నాస్త్రీలం జూచుచున్నట్లుండెను. ౬౭

రాజర్షులస్త్రీలును పితృదేవతలస్త్రీలును దైత్యవనితలును గంధర్వస్త్రీలు రాక్షసుల కన్నియలును ఆరావణునియందు మన్మథమోహితలై యుండిరి. ౬౮

రావణుండు ఎప్పుడును యుద్ధంబు గోరువాఁడు కావున ఆస్త్రీల నపహరించినచో వారిబంధువులు యుద్ధంబునకు వత్తురని యుద్ధమునందలి యాశం జేసి యాస్త్రీలనందఱ నపహరించినాఁడు. మఱికొందఱుస్త్రీలు యావన

సమదా మదనేనైవ మోహితాః కాశ్చిదాగతాః. ౬౯

న తత్ర కాచిత్ప్రమదా ప్రసహ్య
వీర్యోపపన్నేన గుణేన లబ్ధా,
న చాన్యకామాపి న చాన్యపూర్వా
వినా వరార్హాం జనకాత్మజాం తామ్. ౭౦

న చాకులీనా న చ హీనరూపా
నాదక్షిణా నానుపచారయుక్తా,
భార్యాభవత్తస్య న హీనసత్త్వా
న చాపి కాంతస్య న కామనీయా. ౭౧
బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవధర్మపత్నీ,
ఇమా యథా రాక్షసరాజభార్యాః
సుజాతమస్యేతి హి సాధుబుద్ధేః. ౭౨

పునశ్చ సోఽచింతయదార్తరూపో
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా,
అథాయమస్యాం కృతవాన్ మహాత్మా
లంకేశ్వరః కష్టమనార్యకర్మ. ౭౩
ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - నవమస్సర్గః.

మదంబు గలవారలు మన్మథమోహితలై తమకుఁదామే రావణు నాశ్రయించి నారు. ౧౯

అచ్చట శ్రేష్ఠస్త్రీయయిన సీతదక్క తక్కినప్రతివనితయును పరాక్రమశాలియగు రావణునియందుఁ గలసౌందర్యగుణంబులకు మోహించి వచ్చినదేగాని వానిచే బలాత్కారంబునఁ దేఁబడినది కాదు. అచ్చటనుండువారలందఱును రావణునిమాత్రము మోహించియుండువారుగాని మఱియొక్కనియం దెచ్చటను ఆసక్తిగలవారు కారు. రావణు నాశ్రయించుటకుమున్ను మఱియొక్కఁడు భర్తగల్గి యుండునదియు నచ్చట నెవ్వతెయుం లేదు. ౨౦

ఆరావణునిభార్య లందఱును మంచికులంబునం బుట్టినవారలై మంచి సౌందర్యంబు గలవారలై నేర్పుగలవారలై సమస్తోపచారములతోఁ గూడిన వారలై బలము గలవారలై పెనిమిటికిఁ గోరందగినవారలై యుండిరి. ౨౧

"ఈరావణునిభార్య లెట్లు పెనిమిటిని గూడియున్నారో అట్లు సీతయును రామునితోఁ గూడియుండునట్లు ఆరావణుఁడు సీతను రామునికర్పించునేని వీనికి మంగళంబు గలుగును" అని మంచిబుద్ధిశాలియగు హనుమంతుఁడు తలంచెను. లేక "ఇట్టి గుణవంతురాలయిన సీతను రావణుం డపహరించునట్లు ఆరావణభార్యలనందఱను సుగ్రీవుం డపహరించునేని యప్పటికి సుగ్రీవునకు మంగళంబగును" అని మంచిబుద్ధి గలిగియున్న హనుమంతుఁడు తలంచెను. లేక "రావణుండు ఈభార్యల నపహరించినట్లు రామునిభార్యయైన సీతను గూడ నపహరించెనేని యతని కెంతమాత్రము మంగళంబు గలుగదు" అని మంచిబుద్ధిశాలి యగుహనుమంతుఁడు తలంచెను. లేక "నే నీరావణుని భార్యలనుజూచినట్లు రామునిభార్య యగుసీతనుం జూతునేని యప్పటికి నాజన్మము సఫలం బగును" అని మంచి బుద్ధిశాలి యగుహనుమంతుఁడు తలంచెను. ౨౨

"ఈస్త్రీలకన్నను సీత పాతివ్రత్యాదిగుణంబుల నెంతో యధికురాలు. అట్టి సీతనుగూడ ఈరావణుం డపహరించినాఁడు; ఇట్టిదుష్టకృత్యము చేసినాఁడే అయ్యో!" అని మరల హనుమంతుఁడు దుఃఖంబునం జింతించెను. 23

ఇది తొమ్మిదవసర్గము.

---

## దశమస్సర్గః

తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితం,
అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్. ౧

దాన్తకాంచనచిత్రాంగైర్వైడూర్యైశ్చ వరాసనైః,
మహార్హాస్తరణోపేతైరుపపన్నం మహాధనైః. ౨

తస్య చైకతమే దేశే సోఽగ్ర్యమాలావిభూషితం,
దదర్శ పాండురం ఛత్రం తారాధిపతిసన్నిభమ్. ౩

జాతరూపపరిక్షిప్తం చిత్రభానుసమప్రభం,
అశోకమాలావితతం దదర్శ పరమాసనమ్. ౪
వాలవ్యజనహస్తాభిర్వీజ్యమానం సమన్తతః,
గన్ధైశ్చ వివిధైర్జుష్టం వరధూపేన ధూపితమ్. ౫
పరమాస్తరణాస్తీర్ణమావికాజినసంవృతం,
దామభిర్వరమాల్యానాం సమన్తాదుపశోభితమ్. ౬
తస్మిన్ జీమూతసంకాశం ప్రదీప్తోత్తమకుండలం,
లోహితాక్షం మహాబాహుం మహారజతవాససమ్. ౭
లోహితేనానులిప్తాంగం చన్దనేన సుగన్ధినా,
సన్ధ్యారక్తమివాకాశే తోయదం సతటిద్గణమ్. ౮
వృతమాభరణైర్దివ్యైస్సురూపం కామరూపిణం,
సవృక్షవనగుల్మాఢ్యం ప్రసుప్తమివ మన్దరమ్. ౯
క్రీడిత్వోపరతం రాత్రౌ వరాభరణభూషితం,
ప్రియం రాక్షసకన్యానాం రాక్షసానాం సుఖావహమ్. ౧౦

## పదియవసర్గము

హనుమంతుం డచ్చటఁ గలయఁజూచుచు స్వర్గంబుననుండు దేవేంద్రుని శయనగృహముతో సమానంబై శ్రేష్ఠంబై స్ఫటికమణులతోఁ జేయఁబడి యితర మణులతో నలంకరింపఁబడి కొంతవఱకు దంతముతోను గొంతవఱకుఁ బంగారముతోను మిగతవై దూర్యమణులతోను జేయఁబడియుండుటంజేసి నానా వర్ణంబులు గలవై శ్రేష్ఠములగు కంబళములతోఁ గప్పఁబడి యధికముగా విలువగలిగియుండు పీఠంబులతోఁ గూడియున్న శయనగృహంబును చూచెను. ఆహనుమంతుఁడు ఆశయనంబున శిరోభాగంబునందు మేలయినముత్తెములమాలచే నలంకరింపఁబడినదియుఁ జంద్రుండుంబోలెఁ దెల్లగా నున్నదియు నగు శ్వేతచ్ఛత్రంబుఁ జూచెను. ౩

బంగారముతోఁ జేయఁబడి సూర్యుఁడుంబోలె దేజరిల్లుచు నశోకపుష్పమాలికలచే నలంకరింపఁబడి చామరంబులు చేతులం బట్టుకొనియుండు స్త్రీలచే వీవంబడుచు నానావిధసుగంధంబులు గలిగి సుగంధధూపంబుల సువాశించుచు మేలయిన యాస్తరణంబులు గలిగి పొట్టేటితోలుతోఁ గప్పఁబడి మంచి పుష్పమాలికలచే నలంకరింపఁబడియుండు శ్రేష్ఠమైనశయనంబును చూచెను. ౪-౬

ఆశయనంబునందు మేఘంబునకుఁ బోలె నలుపురంగు గలిగి ప్రకాశమానంబు లగుకుండలంబులు ధరించి యెఱ్ఱనినేత్రంబులు గలిగి మోఁకాలు వఱకు వ్రేలుచుండుచుండుచేతులతో నొప్పుచు బంగారముతో నలంకరింపఁబడిన వస్త్రంబు గట్టుకొని సుగంధి యగునెఱ్ఱనిచందనంబు మేన నలందుకొని యట్లు సంధ్యాకాలంబున నెఱ్ఱఁగా మెఱపులంగూడి యాకాశంబుననుండు మేఘంబుంబోలెఁ జూపట్టుచు శ్రేష్ఠంబులగు నాభరణంబుల నలంకరింపఁబడి సుందరం బగురూపంబు గలవాఁడై కామరూపుండై వృక్షంబులతోఁ గూడిన వనంబులును బొదలునుం గల్గి సముద్రమధ్యనాంతరంబున నిదురించుచున్నట్లు నిశ్చలంబైయున్న మందరపర్వతంబుపోల్కిఁ గనుపట్టుచు రాత్రియందు యథేచ్ఛంబుగ నానావిధక్రీడలు సల్పి నానావిధమద్యంబులు ద్రావి యుపరతుండై యుండువాని రాక్షసులకు సుఖంబునేయు

పీత్వాఽప్యుపరతం చాపి దదర్శ స మహాకపిః,

భాస్వరే శయనే వీరం ప్రసుప్తం రాక్షసాధిపమ్. ౧౧
నిశ్శ్వసంతం యథా నాగం రావణం వానరర్షభః,
ఆసాద్య పరమోద్విగ్నస్సోపాసర్పత్సుభీతవత్. ౧౨

అథాఽఽరోహణమాసాద్య వేదికాఽంతరమాశ్రితః,
సుప్తం రాక్షసశార్దూలం ప్రేక్షతే స్మ మహాకపిః. ౧౩
శుశుభే రాక్షసేంద్రస్య స్వపతశ్శయనోత్తమం,
గంధహస్తిని సంవిష్టే యథా ప్రస్రవణం మహత్. ౧౪

కాంచనాంగదసన్నద్ధౌచ దదర్శ స మహాత్మనః,
విక్షిప్తౌ రాక్షసేంద్రస్య భుజావింద్రధ్వజోపమౌ. ౧౫
ఐరావతవిషాణాగ్రైరాపీడనకృతవ్రణౌ,
వజ్రోల్లిఖితపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ. ౧౬
పీనౌ సమసుజాతాంసౌ సంగతౌ బలసంయుతౌ,
సులక్షణనఖాంగుష్ఠౌ స్వంగులీతలలక్షితౌ. ౧౭
సంహతౌ పరిఘాకారౌ వృత్తౌ కరికరోపమౌ,
విక్షిప్తౌ శయనే శుభ్రే పంచశీర్షావివోరగౌ. ౧౮

శశక్షతజకల్పేన సుశీతేన సుగంధినా,
చందనేన పరార్ధ్యేన స్వనులిప్తౌ స్వలంకృతౌ. ౧౯

వాని రాక్షసకన్యకలకు మనోహరుం డగువాని రావణుని హనుమంతుఁడు చూచెను.

వానరశ్రేష్ఠుండగు నా హనుమంతుఁడు ప్రకాశమానంబగు పాన్పునం బరుండి నిదురించుచు సర్పంబుంబోలె నిట్టూర్పులు పుచ్చుచున్న పరాక్రమ శాలియు రాక్షసేశ్వరుఁడునగు రావణుని దగ్గఱకుఁ బోయి "ఓహో యేమి నా యజ్ఞానంబు ఇంతదగ్గఱకు రావచ్చునా! తెలిసికొన్న నేమి సేయ వచ్చును?" అని చింతించి యతిశీఘ్రంబుగా మిక్కిలి భయంబడినవాఁడుం బోలె కొంతయవ్వలికిఁ దొలఁగెను. ౧౧, ౧౨

అంత నా హనుమంతుఁడు పడికట్ల మార్గముఁజేరి మఱియొక్కపడి కట్టుమీఁదనుండి నిదురించుచున్న రావణునిం జూచుచుండెను. ౧౩

దేనిగంధంబు మూర్కొని యితరగజంబులు భయపడునో యట్టియేనుం గుచే నధిష్ఠింపఁబడిన సెలయూట యెట్లు ఇతరగజంబులు రాకుండుటచే వివిక్త ముగా నుండునో అట్లు రావణుండు నిదురించుచుండఁగా నా శయనంబు భయంబున మఱియెవ్వరు నచ్చటికి రాకుండుటవలన వివిక్తంబుగా నుండినది.

ఆ హనుమంతుఁడు బంగారు బాహుపురులు ధరించుకొనినవై యింద్ర ధ్వజంబులుంబోలెఁ జూడనగుచు మహైరావతంబుతోఁ బోరాడునప్పుడు వానికొమ్ములచేఁ జేయంబడిన గాయంబులతో నొప్పుచు నింద్రుని వజ్రా యుధంబుచే గీఱఁబడిన మూఁపులుగలిగి విష్ణుచక్రంబునకైన గాయంబులం దేజరిల్లుచు బలిసినవై సమంబులగు సుందరంబులగు మూఁపులుగలిగి దేహంబున కనురూపంబులై బలిష్ఠంబులై మంచి లక్షణంబులుగల నఖంబులు నంగుష్ఠం బును వ్రేళ్లు నఱచేయియును గలవై దృఢంబులగు సంధిబంధంబులతోఁ గూడి పరిఘంబులుంబోలెఁ జూపట్టుచు గుండ్రంబులై యేనుఁగు తొండంబు లతో సాటిసేయందగి శుభ్రంబగు శయనంబునఁ బ్రసారితంబులై యైదుతలల పాములుంబోలె నున్న మహాపరాక్రమశాలియగు రావణుని బాహువులం జూచెను. ౧౫-౧౮

ఆ హనుమంతుండు కుందేటినెత్తుటివలె యెఱ్ఱనై చల్లగా మంచివాసన గలిగి శ్రేష్ఠంబైయుండు చందనంబుచేఁ బూయఁబడి చక్కఁగా నలంకరింపఁ

ఉత్తమస్త్రీవిమృదితౌ గంధోత్తమనిషేవితౌ,
యక్ష పన్నగ గంధర్వ దేవ దానవ రావిణౌ. ౨౦
దదర్శ స కపిస్తస్య బాహూ శయనసంస్థితౌ,
మందరస్యాంతరే సుప్తౌ మహాహీ రుషితావివ. ౨౧

తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశశ్శృంగాభ్యామివ మందరః. ౨౨
చూతపున్నాగసురభిర్వకుళోత్తమసంయుతః,
మృష్టాన్నరససంయుక్తః పానగంధపురస్సరః. ౨౩
తస్య రాక్షససింహస్య నిశ్చక్రామ మహా(న్)ముఖాత్,
శయానస్య వినిశ్శ్వాసః పూరయన్నివ తద్గృహమ్. ౨౪

ముక్తామణివిచిత్రేణ కాంచనేన విరాజితం,
మకుటేనాపవృత్తేన కుండలోజ్జ్వలితాననమ్. ౨౫
రక్తచందనదిగ్ధేన తథా హారేణ శోభినా,
పీనాయతవిశాలేన వక్షసాఽభివిరాజితమ్. ౨౬
పాండరేణాపవిద్ధేన క్షౌమేణ క్షతజేక్షణం,
మహార్హేణ సుసంవీతం పీతేనోత్తమవాససా. ౨౭
మాషరాశిప్రతీకాశం నిశ్శ్వసంతం భుజంగవత్,
గాంగే మహతి తోయాంతే ప్రసుప్తమివ కుంజరమ్. ౨౮
చతుర్భిః కాంచనైర్దీపైర్దీప్యమానచతుర్దిశం,
ప్రకాశీకృతసర్వాంగం మేఘం విద్యుద్గణైరివ. ౨౯
పాదమూలగతాశ్చాపి దదర్శ సుమహాత్మనః,
పత్నీస్స ప్రియభార్యస్య తస్య రక్షఃపతేర్గృహే. ౩౦

బడి యుత్తమస్త్రీలచేఁ బిసుకంబడుచు నుత్తమంబులగు వాసనలఁగలిగి యక్షులను నాగులను గంధర్వులను దేవతలను దానవులను యుద్ధంబున రోదనంబు సేయునట్లు గావింపం జాలినవై మందరపర్వతాంతరంబున నిదురించుచుండు కోపంబునొందిన గొప్ప సర్పంబులుం బోలెఁ జూపట్టుచున్న యారావణుని భుజంబులఁ జూచెను. ౧౯—౨౧

కొండంబోని మేనుగల యా రావణుండు బలిసి నిడుపుగానుండు నాభుజంబులంగూడి రెండు శిఖరంబులంగూడిన మందరపర్వతంబుంబోలెఁ బ్రకాశించుచుండెను. ౨౨

అచ్చటఁ బరుండి నిద్రించుచున్న రావణుని పెద్దనోటినుండి మామిడి పొన్న పూలవాసనయుఁ బొగడపూలగంధంబును మృష్టాన్నగంధంబును మద్యగంధంబునుఁ గలిగి యాఘ్రాణంబును బూరించునట్లు చూపట్టుచు నిట్టూర్పులు వెడలుచుండినవి. (ముందు చెప్పఁబడిన "రెండు భుజంబులును" ఇప్పుడు "నోటనుండి" యను యేకవచనంబును రావణుండు కామరూపి యగుటచే స్త్రీ సమ్మోహనంబునకై ధరించిన రూపంబునం గలిగెను.) ౨౩, ౨౪

బంగారముతోఁ జేయఁబడిన ముత్తెములు మణులుఁ బొదుగంబడి యుండుటం జేసి నానావర్ణంబులుఁగలిగి నిద్రావశంబునఁ గొంచెము స్వస్థానంబునందుండి తొలంగియుండు కిరీటంబునం దేజరిల్లుచుఁ గుండలంబుల నొప్పుచున్న ముఖంబుతోఁగూడి దివ్యంబగుహారంబున వెలుంగుచు రక్తచందనాదులచే ననులిప్తంబై బలిసి నిడుపై వెడల్పై యుండు ఱొమ్ముగలిగి తెల్లని పట్టు నుత్తరీయంబు ధరించి నెత్తురుంబోలె నెఱ్ఱనైన కండ్లుగలిగి చాల విలువ గల మేలైన పీతవస్త్రంబు గట్టుకొని సర్పంబుఁబోలె నిట్టూర్పులుపుచ్చుచు మినుపరాశియుంబోలి నల్లని శయనంబునం బరుండి గంగాజలమధ్యంబునం బరుండి నిదురించు నేనుంగుపోల్కిం జూపట్టుచు నాల్గుప్రక్కలను గాంచన స్తంభంబులం దుంచఁబడియుండు నాలుగు దీపంబులతో నొప్పుచు నాభరణంబులం బ్రకాశింపఁ జేయఁబడుచు, నట్లు మెఱపుల సమూహంబులతోఁ గూడిన మేఘంబు కైవడి భాసిల్లుచున్న రావణుని, మహాపరాక్రమశాలియుఁ దనయందుఁ బ్రీతిగలభార్యలు గలవాఁడు నగు నతని పాదమూలంబున నుండు భార్యలను హనుమంతుం డచ్చటఁ జూచెను. ౨౫-౩౦

శశిప్రకాశవదనాశ్చారుకుండలభూషితాః,
అమ్లానమాల్యాభరణా దదర్శ హరియూథపః. ౩౧

నృత్తవాదిత్రకుశలా రాక్షసేంద్రభుజాంకగాః,
వరాభరణధారిణ్యో నిషణ్ణా దదృశే హరిః. ౩౨

వజ్రవైడూర్యగర్భాణి శ్రవణాంతేషు యోషితాం,
దదర్శ తాపనీయాని కుండలాన్యంగదాని చ. ౩౩

తాసాం చంద్రోపమైర్వక్త్రైశ్శుభ్రైర్లలితకుండలైః,
విరరాజ విమానం తన్నభస్తారాగణైరివ. ౩౪

మదవ్యాయామఖిన్నాస్తా రాక్షసేంద్రస్య యోషితః,
తేషు తేష్వవకాశేషు ప్రసుప్తాస్తనుమధ్యమాః. ౩౫
అంగహారైస్తథైవాన్యా కోమలైర్నృత్తశాలినీ,
విన్యస్తశుభసర్వాంగీ ప్రసుప్తా వరవర్ణినీ. ౩౬

కాచిద్వీణాం పరిష్వజ్య ప్రసుప్తా సంప్రకాశతే,
మహానదీప్రకీర్ణేవ నళినీ పోతమాశ్రితా. ౩౭
అన్యా కక్షగతేనైవ మడ్డుకేనాసితేక్షణా,
ప్రసుప్తా భామినీ భాతి బాలపుత్త్రేవ వత్సలా. ౩౮

పటహం చారుసర్వాంగీ పీడ్య శేతే శుభస్తనీ,
చిరస్య రమణం లబ్ధ్వా పరిష్వజ్యేవ భామినీ. ౩౯

హనుమంతుండు చంద్రుండుంబోలె సుందరంబులయినముఖంబుగల వారలై సుందరంబులయినకుండలంబుల నలంకృతలయి అప్పుడుకోసిన పుష్పమాలికలు నాభరణంబులు ధరించియుండు నారావణునిభార్యలం జూచెను. 3౧

హనుమంతుఁ డచ్చటనృత్తములయందును వాద్యములయందును నేర్పుకలిగి రావణునిచే నాలింగనంబునను దొడపైఁ గూర్చుండఁబెట్టుకొనుటవలనను గౌరవింపఁబడుచు మేలయిన యాభరణంబులు ధరించి పరుండియుండు స్త్రీలం జూచెను. 3౨

హనుమంతుం డచ్చట ఆస్త్రీలు చేతులను దలగడగాఁజేసికొని పరుండియున్నవారలు కావున బంగారముతోఁ జేయఁబడి వజ్రవైడూర్యంబులు పొదిగియుండుపోఁగులును జెవులనంటియుండు బాహుపురులనుం జూచెను. 33

ఆవిమానంబు ఆస్త్రీలయొక్క చంద్రసుందరంబులైనముఖంబులను మేలయిన కుండలంబులనుం గూడి నక్షత్రంబులంగూడిన యాకాశంబుఁబోలెఁ బ్రకాశించుచుండినది. 3౪

సూక్ష్మములయిన నడుములుగల యారావణభార్యలు అధికముగా మద్యంబు ద్రావి యలసి యయ్యైప్రదేశమునందుఁ బడి నిదురించిరి. 3౫

మఱియొక యుత్తమవనిత నృత్తమునందు నేర్పుగలది వృత్తమునేయుం గాలంబునందుంబోలె వాసనాబలంబున నవయవవిక్షేపంబులతోఁ గూడిన యవయవంబులంగల్గి నిదురించుచుండినది. 3౬

ఒక్కతె వీణను గౌఁగిలించుకొని నిదురించుచు మహానదియందు తెప్పతోఁగూడిన తామరతీగెయుం బోలెఁ బ్రకాశించుచుండినది. 3౭

నల్లనికండ్లుగల మఱియొకస్త్రీ చంకనున్న గుమ్మెటతోనే నిదురించుచు బిడ్డయందలి ప్రేమగలదియు బిడ్డను జంకనుంచుకొని యున్నదియు నగుస్త్రీవలెఁ బ్రకాశించుచుండినది. 3౮

సర్వాంగసుందరియుం రమణీయంబు లగుస్తనంబులు గలదియు నగు నొక్కస్త్రీ బహుకాలమునకుఁ బొందఁబడిన ప్రియుని గట్టిగాఁ దమిమీఱఁ గౌఁగిలించుకొనునట్లు తప్పెటను గట్టిగాఁబట్టుకొని పరుండియుండినది. 3౯

కాచిద్వంశం పరిష్వజ్య సుప్తా కమలలోచనా,
రహః ప్రియతమం గృహ్య సకామేవ చ కామినీ. ౪౦

విపంచీం పరిగృహ్యాన్యా నియతా నృత్తశాలినీ,
నిద్రావశమనుప్రాప్తా సహాకాంతేన భామినీ. ౪౧

అన్యా కనకసంకాశైర్మృదుపీనైర్మనోరమైః,
మృదంగం పరిపీడ్యాంగైః ప్రసుప్తా మత్తలోచనా. ౪౨

భుజపార్శ్వాంతరస్థేన కక్షగేణ కృశోదరీ,
పణవేన సహానింద్యా సుప్తా మదకృతశ్రమా. ౪౩

డిండిమం పరిగృహ్యాన్యా తథైవాసక్తడిండిమా,
ప్రసుప్తా తరుణం వత్స ముపగూహ్యేవ భామినీ. ౪౪

కాచిదాడంబరం నారీ భుజసంయోగపీడితం,
కృత్వా కమలపత్రాక్షీ ప్రసుప్తా మదమోహితా. ౪౫

కలశీమపవిద్ధ్యాన్యా ప్రసుప్తా భాతి భామినీ,
వసంతే పుష్పశబలా మాలేవ పరిమార్జితా. ౪౬

పాణిభ్యాం చ కుచౌ కాచిత్సువర్ణకలశోపమౌ,
ఉపగూహ్యాబలా సుప్తా నిద్రాబలపరాజితా. ౪౭
అన్యా కమలపత్రాక్షీ పూర్ణేందుసదృశాననా,
అన్యామాలింగ్య సుశ్రోణీం ప్రసుప్తా మదవిహ్వలా. ౪౮

తామరపూవులంబోలు కండ్లుగలయొక్క వనిత కాముకురా లేకాంతంబునం బ్రియునిఁ గాంతుఁడిటుఁ గౌఁగిలించుకొనునట్లు పిల్లంగ్రోవిని గౌఁగిలించుకొని నిదురించినది. ౪౦

నృత్తము సేయునట్టి మఱియొక్క కాంత యేడుతంత్రులుగల వీణను బట్టుకొని నిదురించుచుఁ బ్రియునిం గౌఁగిలించికొని నిదురించుచున్న వనితయుంబోలెఁ జూపట్టుచుండినది. ౪౧

మదంబుతోఁగూడిన చూపులుగలమఱియొకయువతి బంగారమునకుంబోలె రంగుగలిగి మెత్తనివై బలిసి మనోహరంబులైయుండు నవయవంబుల మద్దెలను గట్టిగాఁ గౌఁగిలించుకొని నిదురించుచుండినది. ౪౨

నిందింపఁదగని రూపంబుగలిగిన కృశోదరి యగు నొక్కవనిత మద్యమదంబున నలసి పణవం బనువాద్యంబును బాహువుప్రక్కఁ జంకనుంచుకొని నిదురించుచుండినది. ౪౩

మఱియొక్క కాంత ఒకచేత నొకడిండిమంబును, రెండవచేత మఱియొక డిండిమంబును గౌఁగిలించుకొని పరుండి యౌవనంబుగల ప్రియుని బిడ్డనుం గౌఁగిలించుకొనియుండువనితయుంబోలెఁ గనుపట్టుచుండినది. ౪౪

తామరపూఱేకులంబోలె విశాలసుందరంబులగు నేత్రంబులు గల యొక్కవనిత యాడంబరంబనువాద్యంబును గట్టిగాఁ గౌఁగిలించుకొని మద్యమదంబున మైమఱచి నిదురించినది. ౪౫

మఱియొక్క కాంత నీటితోనిండియుండు కలశమును దనపై బోరగిలం ద్రోసికొని నీటిచేఁ దడుపంబడినదై నిదురించుచు వసంతర్తువునందు వాడకుండుటకై తడుపంబడి యుండుటంజేసి కొంచెము కాంతిదఱిఁగిన పూలుగల పుష్పమాలికయుంబోలెఁ జూపట్టుచుండినది. ౪౬

ఒకానొకయువతి బంగారుకలశంబులం బోలి తన స్తనంబులఁ జేతులం బట్టుకొని నిద్రాపరవశయై పరుండినది. ౪౭

తామరపూఱేకులంబోలె విశాలరమణీయంబులగుకండ్లును నిండుచందురునిబోలు ముఖంబునుం గలయొకవనిత మదంబున మైమఱచి సుందరంబులగు

ఆతోద్యాని విచిత్రాణి పరిష్వజ్య వరస్త్రియః,
నిపీడ్య చ కుచైస్సుప్తాః కామిన్యః కాముకానివ. ౪౯

తాసామేకాంతవిన్యస్తే శయానాం శయనే శుభే,
దదర్శ రూపసంపన్నా మపరాం స కపిస్త్రియమ్. ౫౦

ముక్తామణిసమాయుక్తైర్భూషణైస్సువిభూషితామ్,
విభూషయంతీమివ తత్స్వశ్రియా భవనోత్తమమ్. ౫౧
గౌరీం కనకవర్ణాభామిష్టామంతఃపురేశ్వరీం,
కపిర్మందోదరీం తత్ర శయానాం చారురూపిణీమ్. ౫౨
స తాం దృష్ట్వా మహాబాహుర్భూషితాం మారుతాత్మజః,
తర్కయామాస సీతేతి రూపయౌవనసంపదా. ౫౩
హర్షేణ మహతా యుక్తో ననంద హరియూథపః,
[దృష్టా సీతేతి హృష్టోఽభూద్ధీనశ్చారిత్రదర్శనాత్.]
ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం ననంద చిక్రీడ జగౌ జగామ,
స్తంభానరోహన్నిపపాత భూమౌ నిదర్శయన్ స్వాం ప్రకృతిం
కపీనామ్. ఇతి శ్రీసున్దరకాణ్డే - దశమస్సర్గః.

## ఏకాదశస్సర్గః

అవధూయ చ తాం బుద్ధిం బభూవావస్థిత స్తదా,
జగామ చాపరాం చింతాం సీతాం ప్రతి మహాకపిః. ౧
న రామేణ వియుక్తా సా స్వప్తుమర్హతి భామినీ,
న భోక్తుం నాప్యలంకర్తుం న పాన ముపసేవితుమ్. ౨

పిఱుందులనొప్పు మఱియొక్క కాంతం గౌఁగిలించుకొని నిదురించుచుండి నది. ౪౮

కామినులు తమప్రియులనుంబోలె మఱికొందరు స్త్రీలు నానా విధంబులయిన వాద్యంబులను గౌఁగిలించుకొని స్తనంబులఁ బీడించుచు నిదురించిరి. ౪౯

ఆ స్త్రీలనడుమ నేకాంతంబున నుంచఁబడిన యుత్తమంబగు శయనంబునఁ బరుండి సౌందర్యంబున వెలుంగుచున్న మఱియొకవనితను (మందోదరిని) హనుమంతుఁడు చూచెను. ౫౦

ముత్తెములతోఁ గూడినట్టియు రత్నములు చెక్కంబడినట్టియు భూషణములచే నలంకరింపఁబడినదియుఁ దనశరీరకాంతిచే గృహామంతయుం వెలింగించుచున్నదియుం బంగారువర్ణముగల శరీరకాంతిగలదియుం రావణుని కిష్టురాలును అంతఃపురస్త్రీలలో శ్రేష్ఠురాలును బవ్వళించియున్నదియుం నందకర్త్రియునగు మందోదరిని బలవంతుఁడగు హనుమంతుఁడు గాంచి యౌవనముచేతను జక్కఁదనముచేతను నొప్పినది యగు సీతాదేవి కాఁబోలునని తలంచెను. అట్లు తలంచి వానరోత్తముఁడు మిక్కిలి సంతోషముతోఁ గూడినవాఁడయ్యెను. (అయుఁన్నరీతిగ జూచి ఖేదమును జెందెను.) ౫౧-౫౪

ఇది పదియవసర్గము.

---

## పదునొకండవసర్గము

అట్లు మందోదరిని గాంచి సీత యని తలఁచి సంతోషించిన హనుమంతుఁ డాతలంపు మాని సీతనుగూర్చి మఱియొకచింత గలవాఁడయ్యెను. ౧

సీతాదేవి రాముని బాసి యున్నది గావున నిద్రింపదు, భుజింపదు, అలంకరించుకొనదు, పానముసేయదు, రామునితో సమానుఁడు లేఁడుగాన నితర

నాన్యం నరముపస్థాతుం సురాణామపి చేశ్వరం,
న హి రామసమః కశ్చిద్విద్యతే త్రిదశేష్వపి. ౩

అన్యేయమితి నిశ్చిత్య పానభూమౌ చచార సః,
క్రీడితేనాపరాః క్లాంతా గీతేన చ తథాఽపరాః. ౪
నృత్తేన చాపరాః క్లాంతాః పానవిప్రహతా స్తథా,
మురజేషు మృదంగేషు పీఠికాసు చ సంస్థితాః. ౫
తథాఽఽస్తరణముఖ్యేషు సంవిష్టాశ్చాపరా స్త్రియః,
అంగనానాం సహస్రేణ భూషితేన విభూషణైః. ౬
రూపసల్లాపశీలేన యుక్తగీతార్థభాషిణా,
దేశకాలాభియుక్తేన యుక్తవాక్యాభిధాయినా. ౭
రతాభిరతసంసుప్తం దదర్శ హరియూథపః,
తాసాం మధ్యే మహాబాహుశ్శుశుభే రాక్షసేశ్వరః. ౮

గోష్ఠే మహతి ముఖ్యానాం గవాం మధ్యే యథా వృషః,
స రాక్షసేంద్రశ్శుశుభే తాభిః పరివృతస్స్వయమ్. ౯

కరేణుభిర్యథాఽరణ్యే పరికీర్ణో మహాద్విపః,
సర్వకామైరుపేతాం చ పానభూమిం మహాత్మనః. ౧౦
దదర్శ హరిశార్దూల స్తస్య రక్షఃపతేర్గృహే,
మృగాణాం మహిషాణాం చ వరాహాణాం చ భాగశః. ౧౧
తత్ర న్యస్తాని మాంసాని పానభూమౌ దదర్శ సః,
రౌక్మేషు చ విశాలేషు భాజనేష్వర్ధభక్షితాన్. ౧౨
దదర్శ హరిశార్దూలో మయూరాన్కుక్కుటాం స్తథా,

పురమని దేవేంద్రు నియంతటివాని నైనను బొందుటకు సమ్మతింపదు. కావున నీ నిద్రించుచున్న యింతి సీతకాదని నిశ్చయించుకొని పానభూమియందు (కల్లుద్రావుచోట) హనుమంతుఁడు తిరుగాడుచుండెను. ౨,౩

ఆటలాడుటచే డస్సినవారును పాటలు పాడుటచే నలసినవారును నాట్యముచే బడలినవారును లెస్సఁగఁ బానముచేసి సోలినవారును మురజములు మృదంగములు వాయించుపీఠములం గూరుచున్నవారును మేలగు పానుపులపై నిద్రించుచున్నవారును భూషణములచేత నలంకరింపఁబడినదియు రూప సౌందర్యములను గూర్చి భాషించునదియుం, కాలమునకుందగిన పాటఁబాడి నర్థమును జెప్పుచున్నదియుం స్థలమునకును గాలమునకును దగినట్టి నేర్పుగలదియుఁ దగినమాటలాడుచున్నదియుం నగు స్త్రీలయొక్క సహస్రముతోడ మిక్కిలి భోగేచ్ఛగలిగి పరుండియున్న రావణుని వానరశ్రేష్ఠుండగు హనుమంతుఁడు గనియెను. ౪-౭

ఆ వేయిమంది స్త్రీలకు నడుమనున్న బలవంతుఁడగు రావణాసురుఁడు మందయందుఁ బ్రీతిపాత్రములగు పెక్కుగోవుల నడుమనున్న యాఁబోతువలె నొప్పెను. ౮

ఆ స్త్రీలమండలముచేఁ జుట్టంబడినవాఁడై రాక్షసరాజు చొరఁగూడని గొప్పవనమందుఁ బెక్కుసంఖ్యగల ఆఁడుయేనుఁగులచేఁ గొలువంబడిన మదగజమెట్లుండునో యట్టు లుండెను. ౯

బలవంతుఁడగు నారాక్షసరాజుయొక్క యింట నెవరెవరి కేదేది వలయునో యట్టివాని కెల్లం గలది యగు కల్లుద్రావుచోటును వానరశ్రేష్ఠుఁడు గనుంగొనియెను. ౧౦

జింకలయొక్కయుం దున్నపోతులయొక్కయుఁ బందులయొక్కయుం మాంసము లందందు భాగములచొప్పున నుంచఁబడియున్నవానిని నాకల్లుద్రావుచోట హనుమంతుఁడు గనియెను. ౧౧

బంగారముచేఁ జేయఁబడిన పెద్దపాత్రలయందు సగము సగము భుజింపఁబడి మిగిలియున్న నెమలిమాంసమును కోడిమాంసమును బానము చేయుచోట హనుమంతుఁడు గనియెను. ౧౨

వరాహవార్ధ్రాణసకా౯ దధిసౌవర్చలాయుతాన్. ౧౩
శల్యాన్మృగమయూరాంశ్చ హనుమానన్వవైక్షత,
క్రకరా న్వివిధా న్సిద్ధాం శ్చకోరా నర్ధభక్షితాన్. ౧౪
మహిషానేకశల్యాంశ్చ ఛాగాంశ్చ కృతనిష్ఠితా౯,
లేహ్యానుచ్చావచాన్పేయా౯ భోజ్యాని వివిధాని చ. ౧౫

తథా ఽఽమ్లలవణోత్తంసై ర్వివిధై రాగషాడబైః,
హార నూపుర కేయూరై రపవిద్ధైర్మహాధనైః. ౧౬
పానభాజనవిక్షిప్తైః ఫలైశ్చ వివిధైరపి,
కృతపుష్పోపహారా భూరధికం పుష్యతి శ్రియమ్. ౧౭
తత్ర తత్ర చ విన్యస్తైస్సుశ్లిష్టైశ్శయనాసనైః,
పానభూమిర్వినా వహ్నిం ప్రదీప్తేవోపలక్ష్యతే. ౧౮
బహుప్రకారై ర్వివిధై ర్వరసంస్కారసంస్కృతైః,
మాంసైః కుశలసంపృక్తైః పానభూమిగతైః పృథక్. ౧౯
దివ్యాః ప్రసన్నా వివిధాస్సురాః కృతసురా అపి,
శర్కరాఽఽసవ మాధ్వీక పుష్పాసవ ఫలాసవాః. ౨౦
వాసచూర్ణైశ్చ వివిధైర్మృష్టాస్తైస్తైః పృథక్పృథక్,
సంతతా శుశుభే భూమిర్మాల్యైశ్చ బహుసంస్థితైః. ౨౧
హిరణ్మయైశ్చ వివిధై ర్భాజనై స్స్ఫాటికై రపి,
జాంబూనదమయైశ్చాన్యైః కరకై రభిసంవృతా. ౨౨
రాజతేషు చ కుంభేషు జాంబూనదమయేషు చ,
పానశ్రేష్ఠం తదా భూరి కపి స్తత్ర దదర్శ హ. ౨౩

పెరుఁగుతోడను సౌవర్చలవణముతోడను గూర్చఁబడిన పందిమాంస మును ఖడ్గమృగపునంజుడును ముండ్లపంది జింక నెమలి మొదలగువాని మాంస ములును నానావిధములఁ బక్వముసేయంబడిన కౌక్కురమాంసమును సగము దిని మిగిలియున్న చకోరమాంసమును దున్నపోతుమాంసమును గొఱ్ఱెచేప నంజుడును వండి పాల్లవడ నుంచఁబడియున్నవియు అనేకములగు పచ్చడు లను ద్రాగందగిన వగుచారును పాయసములను బెక్కుతెఱంగుల యన్నములను హనుమంతుఁడు గనియెను. ౧౩-౧౪

తగినంతటి యుప్పుపులుసులతోఁ గూడిన నానావిధములగు పలుచని చిక్కని ద్రవపదార్థములచేతను విడఁదీసి వైచియున్న ఖేలగలదండలు భుజ కీర్తులు నంజులు ననుభూషణములచేతను భుజించు పాత్రలం దుంపఁబడియున్న నానావిధఫలములచేతను బుష్పముల కానుకలచేతను నచ్చోటు మిక్కిలి యందమును జూపెను. ౧౫,౧౬

అందందు నుంపఁబడి సందులు తెలియరాక దట్టముగానున్న మంచ ములచేతను నానావిధములుగాఁ జక్కఁగాఁ బక్వముచేయంబడి వెవ్వేఱుగ కల్లునం దడిసియున్న నానాజంతువులయొక్క మాంసములచేతను పానభూమి యగ్నిలేకయే మండుచున్నదానివలె వెలింగెను. ౧౭,౧౮

దేవసంబంధముగలవియు నిర్మలమైనవియు చక్కెరచేతను దేనెచేతను ఫలములచేతను బుష్పరసముచేతను జేయంబడినవియు నగు కల్లుదినుసులు నానావిధములగు వాసనచూర్ణములతోడఁ గూడ హనుమంతునిచేఁ జూడం బడియెను. మీఁదఁ జెప్పంబడిన యాయావిశేషములచేతను బెక్కువిధముల వింతలైయున్న పుష్పహారములచేతను స్ఫటికములచేతను జేయంబడిన నానా విధపాత్రలచేతను శుద్ధమగుబంగారముచేతనే చేయంబడిన మఱికొన్ని గిండి చెంబులచేతను గ్రమ్మినదియై యాపానభూమి యెడములేక ప్రకాశించెను.

అప్పుడు వెండిపాత్రలయందు బంగారుకలశములయందును నునుపఁ బడియున్న శ్రేష్ఠమగు సారాయి మొదలగు మదద్రవ్యముల నాంజనేయుం డందుఁ గాంచెను. ౨౩

సోఽపశ్యచ్ఛాతకుమ్భాని శిలామణిమయాని చ,
రాజతాని చ పూర్ణాని భాజనాని మహాకపిః. ౨౪
క్వచిదల్పావశేషాణి క్వచిత్పీతాని సర్వశః,
క్వచిన్నైవ ప్రపీతాని పానాని స దదర్శ హ. ౨౫

క్వచిద్భక్ష్యాంశ్చ వివిధాన్ క్వచిత్పానాని భాగశః,
క్వచిదర్ధావశేషాణి పశ్యన్వై విచచార హ. ౨౬
క్వచిత్ప్రభిన్నైః కరకైః క్వచిదాలోళితైర్ఘటైః,
క్వచిత్సంపృక్తమాల్యాని జలాని చ ఫలాని చ. ౨౭
శయనాన్యత్ర నారీణాం శుభ్రాణి బహుధా పునః,
పరస్పరం సమాశ్లిష్య కాశ్చిత్సుప్తా వరాంగనాః. ౨౮
కాశ్చిచ్చ వస్త్రమన్యస్యాస్స్వపంత్యాః పరిధాయ చ,
ఆహృత్య చాబలా సుప్తా నిద్రాబలపరాజితా. ౨౯
తాసాముచ్ఛ్వాసవాతేన వస్త్రం మాల్యం చ గాత్రజం,
నాత్యర్థం స్పందతే చిత్రం ప్రాప్య మందమివానిలమ్. 3౦

చందనస్య చ శీతస్య శీధోర్మధురసస్య చ,
వివిధస్య చ మాల్యస్య ధూపస్య వివిధస్య చ. 3౧
బహుధా మారుతస్తత్ర గంధం వివిధముద్వహన్,
స్నానానాం చందనానాం చ ధూపానాం చైవ మూర్ఛితః. 3౨
ప్రవవౌ సురభిర్గంధో విమానే పుష్పకే తదా,
శ్యామావదాతాస్తత్రాన్యాః కాశ్చిత్కృష్ణా వరాంగనాః. 33
కాశ్చిత్కాంచనవర్ణాంగ్యః ప్రమదా రాక్షసాలయే,

తాసాం నిద్రావశత్వాచ్చ మదనేన విమూర్ఛితమ్. 3౪

ఆ వానరోత్తముఁడు బంగారముచేతను వెండిచేతను రత్నములచేతను జేయంబడినవియగు నిండిన కల్లుకుండలను గాంచెను. ౨౪

కొన్ని విశేషభాగము ద్రావంబడినవియుఁ, బూర్ణముగఁ ద్రావంబడినవి కొన్నియుఁ, గొంచెమేనియుఁ ద్రావకయున్నవి కొన్నియు నగు కల్లుగిన్నెలను వానరుఁడు గనియెను. ౨౫

ఒకచోట నానావిధభక్ష్యములను, ఒకచో వేర్వేఱుగను ఒకయెడ సగము మిగిలియుం నున్నకల్లుపాత్రలను, ఒకప్రక్క బ్రద్దలైయున్న చిన్న చెంబులతోడను, ఒకచక్కి దొరలుచున్న కడవలతోడను గూడి వెదచల్లం బడిన పూదండలు, జలము, ఫలములను, అందున్న స్త్రీలయొక్క శుభ్రము లగుపానుపులను తఱుచుగా నొకరినొకరు కౌఁగలించుకొని నిద్రించుచున్న స్త్రీలను, నిద్దురచే మిక్కిలి యొడలు మఱచి తమప్రక్క నిద్రించుచున్న స్త్రీలయొక్క వస్త్రములను లాగి తమమేనికిం జుట్టుకొని నిద్రించుచున్న పడుచులను గనుంగొనుచు హనుమంతుఁడు సంచరించెను. ౨౬-౨౯

ఆ స్త్రీలయొక్క యొడలియందున్న వస్త్రములును బువ్వములును గూడ వారు విడుచు శ్వాసమను మెల్లనిగాలిని బొంది యానందించుచున్నట్లు కొంచెమేనియుఁ జలింపకున్నవి. ౩౦

ఆ పానభూమియందుఁ జల్లని శ్రీగంధముయొక్కయు, తియ్యనితావి గల కల్లుయొక్కయు, నానావిధములగు పూలదండలయొక్కయు ధూపముల యొక్కయుఁ బెక్కువాసనలను ధరించి వాయుదేవుఁడు వీచెను. స్నానార్హ చందనముల యొక్కయుం ధూపముల యొక్కయుం దట్టమగువాసన పుష్పక విమానమందు వ్యాపించెను. ౩౧,౩౨

అచ్చోటఁ గొందఱు నల్లనిశరీరచ్ఛాయయుం బంగారముంబోలు శరీర కాంతియు కొందఱు నలుపు తెలుపునుగలిగిన మేనిరంగును గలిగి పరుండి యుండిరి. ౩౩

కేవలము నిద్రకు లోఁబడియున్నవా రగుటచే రతిక్రీడలయందు

పద్మినీనాం ప్రసుప్తానాం రూపమాసీద్యథైవ హి,

ఏవం సర్వ మశేషేణ రావణాంతఃపురం కపిః. ౩౫
దదర్శ సుమహాతేజా న దదర్శ చ జానకీం,

నిరీక్షమాణశ్చ తదా తాస్స్త్రియస్స మహాకపిః. ౩౬
పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణం,
ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి. ౩౭
న హి మే పరదారాణాం దృష్టిర్విషయవర్తినీ,
అయం చాత్ర మయా దృష్టః పరదారపరిగ్రహః. ౩౮
తస్య ప్రాదురభూచ్చింతా పునరన్యా మనస్వినః,

నిశ్చితైకాంతచిత్తస్య కార్యనిశ్చయదర్శినః. ౩౯
కామం దృష్టా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః,
న హి మే మనసః కించిద్వైకృత్యముపపద్యతే. ౪౦
మనో హి హేతుస్సర్వేషామింద్రియాణాం ప్రవర్తనే,
శుభాశుభాస్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్. ౪౧
నాన్యత్ర హి మయా శక్యా వైదేహీ పరిమార్గితుం,
స్త్రియో హి స్త్రీషు దృశ్యంతే సదా సంపరిమార్గణే. ౪౨
యస్య సత్త్వస్య యా యోనిస్తస్యాం తత్పరిమార్గ్యతే,
న శక్యా ప్రమదా నష్టా మృగీషు పరిమార్గితుమ్. ౪౩
తదిదం మార్గితం తావచ్ఛుద్ధేన మనసా మయా,
రావణాంతఃపురం సర్వం దృశ్యతే న చ జానకీ. ౪౪
దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ వీర్యవాన్,
అవేక్షమాణో హనుమాన్నైవాపశ్యత జానకీమ్. ౪౫

మిక్కిలి డస్సి నిద్రించుచున్న యాస్త్రీలయొక్క రూపములు తామరతీఁగెల వలె నుండెను. ౩౪

మిక్కిలి దర్పము గలవాఁడగు వానరుఁడు మీఁదఁ జెప్పంబడిన చొప్పున రావణుని యంతఃపురమంతయుఁ గాంచెను గాని సీతను గనంజాలఁ డయ్యెను. ౩౫

ఆ వానరోత్తముఁడా యంతఃపురస్త్రీలను గనుచు ధర్మభంగము గలిగెనుగదా! అని సంశయించి నిద్రించుచున్నవారగు నీపరస్త్రీల యంతఃపురమును జొచ్చి చూచుట నాకు మిక్కిలి యధర్మ మయ్యెను. నాచూపులు పరస్త్రీ లనుభవించు భోగములను శ్రద్ధతోఁ జూచునవి కావు. అట్లుండియు నిందు రావణుఁ డితరులభార్యలను బొందుట నాచేఁ జూడంబడియె అని చింతించెను. ఇంతలో నొంటరిగానుండి యోచించి కార్యమును నిశ్చయించుచున్న యాతనికి మఱియొక యోచనముఁ దోఁచెను. ౩౬-౩౭

రావణునిదయినఁ బాత్రురాండ్రగు నంతఃపురస్త్రీలందఱును నాచేఁ జక్కఁగఁ జూడంబడిరి. కాని వారియెడల నామనస్సు కొంచెమేనియుఁ జలించినది కాదు. సమస్తేంద్రియములయొక్కయుఁ శుభాశుభరూపవ్యాపారములకు మనస్సేకదా హేతువు. అట్టిమనస్సు నాకు స్థిరమైయున్నది. ఇందుఁ గాక సీతను నేను మఱెందు వెదుకవచ్చును. ఆఁడువారాఁడువారి నడుమనే కదా మెలంగుదురు. ఏజంతు వేజాతియందుఁ బుట్టినదో యాజంతువు నాజాతి జంతువులలోనేకదా వెదుకఁదగును. ఆఁడుమానిసి కనంబడనిచో నాఁడుజింకల యందు వెదుకుటచే లభింపదుగదా! అందుచేతనే సీత శుద్ధమగు మనస్సుగల నాచేత సంపూర్ణముగా వెదుకంబడియెను. రావణునియంతఃపురమందలి స్త్రీలందఱు నాచేఁ జూడంబడిరి గాన జానకి గనబడకున్నదిగదా ! ౩౮-౪౪

బలవంతుఁ డగుహనుమంతుండు దేవగంధర్వనాగకన్యలను జూచుచుండియు జానకిని జూడఁడయ్యెను. ౪౫

తామపశ్యన్కపి స్తత్ర పశ్యంశ్చాన్యా వరస్త్రియః,
అపక్రమ్య తదా వీరః ప్రధ్యాతుముపచక్రమే. ౪౬
స భూయస్తు పరం శ్రీమాన్ మారుతిర్యత్నమాస్థితః,
ఆపానభూమిముత్సృజ్య తద్విచేతుం ప్రచక్రమే. ౪౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకాదశస్సర్గః.

---

## ద్వాదశస్సర్గః

స తస్య మధ్యే భవనస్య మారుతి
ర్లతాగృహాంశ్చిత్రగృహాన్నిశాగృహాన్,
జగామ సీతాం ప్రతి దర్శనోత్సుకో
న చైవ తాం పశ్యతి చారుదర్శనామ్. ౧

స చింతయామాస తతో మహాకపిః
ప్రియామపశ్యన్రఘునందనస్య తాం,
ధ్రువం హి సీతా మ్రియతే యథా న మే
విచిన్వతో దర్శనమేతి మైథిలీ. ౨

సా రాక్షసానాం ప్రవరేణ జానకీ
స్వశీలసంరక్షణతత్పరా సతీ,
అనేన నూనం ప్రతి దుష్టకర్మణా
హతా భవే దార్యపథే పరే స్థితా. ౩

విరూపరూపా వికృతా వివర్చసో
మహాననా దీర్ఘవిరూపదర్శనాః,

వీరుండగు హనుమంతుఁడప్పుడచట సీతాదేవిని గానక మఱికొంద ఱుత్తమురాండ్రగు స్త్రీలను గాంచి యచ్చోటు విడిచి చింతింపఁ బూనెను. అతండు సీతను వెదకుట యను దొడ్డయత్నము మరలఁ బూని పానభూమిని వదలి వెదకుట కారంభించెను. ४౯, ४౭

ఇది పదునొకండవసర్గము.

---

## పండ్రెండవసర్గము

ఆహనుమంతుఁడు సీతాదేవినిం గను నుత్సాహముతో నాయింటి నడుమ నున్న తీఁగెలయిండ్లను, చిత్రములు వ్రాయంబడియున్న కూటములను రాత్రులయందుఁ బరుండు నిండ్లను గాంచెను గాని సీతను గనంజాలఁ డయ్యెను. ౧

అటుపై వానరోత్తముఁడు 'శ్రీరామునిప్రాణప్రియ' యగు సీతను వెదకుచున్న నా కామె యెందును కనంబడకున్నది. కావున మృతి నొందినదో చుఱి యెందున్నదో తెలియదయ్యెను. ౨

ఉత్తమమగు సాధుమార్గమున నున్నజానకి రావణుని కోర్కికి లోఁ బడక తనపాతివ్రత్యమును గాపాడుకొనఁదలఁచినది యగుటచే దుర్జనుఁడగు నీతనిచేఁ జంపఁబడియుండును. అట్లగుట సత్యము. కాదేని యెందేని కనం బడదా? 3

హెచ్చుతక్కువ లగునంగములుగలవారును, తేజస్సు లేనివారును, ఇంపు కాని వేషములు ధరించియున్నవారును, కోటవంటి ముఖములుగలవారును

సమీక్ష్య సా రాక్షసరాజయోషితో
భయా ద్వినష్టా జనకేశ్వరాత్మజా. ౪
సీతామదృష్ట్వా హ్యనవాప్య పౌరుషం
విహృత్య కాలం సహ వానరై శ్చిరం,
న మేఽ స్తి సుగ్రీవసమీపగా గతి
స్సుతీక్ష్ణదండో బలవాంశ్చ వానరః. ౫
దృష్టమంతఃపురం సర్వం దృష్టా రావణయోషితః,
న సీతా దృశ్యతే సాధ్వీ వృథా జాతో మమ శ్రమః. ౬
కిం ను మాం వానరాస్సర్వే గతం వక్ష్యంతి సంగతాః,
గత్వా తత్ర త్వయా వీర కిం కృతం తద్వదస్వ నః. ౭
అదృష్ట్వా కిం ప్రవక్ష్యామి తామహం జనకాత్మజాం,
ధ్రువం ప్రాయముపైష్యంతి కాలస్య వ్యతివర్తనే. ౮
కింవా వక్ష్యతి వృద్ధశ్చ జాంబవానంగదశ్చ సః,
గతం పారం సముద్రస్య వానరాశ్చ సమాగతాః. ౯
అనిర్వేదశ్శ్రియో మూలమనిర్వేదః పరం సుఖం,
అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః. ౧౦
కరోతి సఫలం జంతోః కర్మ యత్తత్కరోతి సః,
తస్మాదనిర్వేదకృతం యత్నం చేష్టేఽహముత్తమమ్. ౧౧
భూయస్తావద్విచేష్యామి దేశాన్రావణపాలితాన్,
[భూయస్తత్ర విచేష్యామి న యత్ర విచయః కృతః]
ఆపానశాలా విచితా స్తథా పుష్పగృహాణి చ. ౧౨
చిత్రశాలాశ్చ విచితా భూయః క్రీడాగృహాణి చ,

వికారముగఁ జూచువారును నగు నీరావణుని కాంతలను గాంచి సీత భయముచేతనే ప్రాణములు విడిచియుండును. ౪

భయంకరమైన యాజ్ఞగల బలవంతుఁడగు సుగ్రీవునిమాట మీఱఁగూడనిది. సీతను వెదుకవచ్చి చాలకాల మయ్యెను. ఈవానరులను వెంటనిడికొని యింతకాలము పుచ్చి సీతను జూడకయే సుగ్రీవునికడ కేఁగుటకు నాకు మార్గము లేదు. ౫

రావణుని భార్యలుండు నంతఃపురమునెల్లఁ గంటిని ఆఁడువాండ్ర నందఱఁ గాంచితిని. వ్యర్థముగ శ్రమపడుటమాత్రమే కాని సీత కనంబడదయ్యె. నేను మరలిపోయితినేని వానరులందఱుం గూడి 'ఓవీరుఁడా! వెళ్లితివిగదా; నీవేమి చేసితివి? మాకుఁ దెలియంబలుకుము' అని యడుగుదురు. సీతను గానకయే పోయి వారికి నేనేమి చెప్పుదును? ఇదిమాత్రమే గాక నేను వానరులను వదలి వచ్చి దీర్ఘకాలమయ్యెను గావున నారాక కెదురుచూచి చూచి యిప్పటికందఱు నన్నపానములు మాని చచ్చియుందురు. ననుం గాంచి జాంబవంతుఁడును అంగదుఁడును జాలకనఁగా మాటలాడుమురుగదా! వానరులును డాసి యలత్యము చేయుందురు. దుఃఖపడకుండుట సంపదలకు మూలము. సౌఖ్యమునకు హేతువు. సర్వకార్యములందును వర్తించుటకుఁ గారణము దుఃఖమును జెందక జంతువు లేయేకర్మను జేయునో యాయాకర్మఫలమునిచ్చును గావున నేను చింతకు లోఁబడక కార్యమునకై బాగుగ యత్నించెదను. మున్ను నాచే వెదుకంబడ నట్టియుం రావణునిచే నేలఁబడునట్టియుం దేశములను వెదకెదను. పానశాలలను పుష్పగృహములు మొదలగువానిని వెదకితిని. చిత్రరువులుగలశాలలను క్రీడించు నట్టియిండ్లను రాజగృహములతోఁ జేరినవనములను రాజవీథులను విమానములను లెస్సగ వెదకితిని అని యోచించికొని భూమిలోపలనున్న యిండ్లను చెక్కువాకిండ్లుగలమందిరములను తక్కినయిండ్లతోఁ గలియక దూరముననున్న యిండ్లను వెదకుట కారంభించెను. ౬-౧౪

నిష్కుటాంతరరథ్యాశ్చ విమానాని చ సర్వశః. ౧౩
ఇతి సంచింత్య భూయోఽపి విచేతుముపచక్రమే,
భూమీగృహాంశ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి. ౧౪
ఉత్పతన్నిష్పతంశ్చాపి తిష్ఠన్ గచ్ఛన్పునః పునః,
అపావృణ్వంశ్చ ద్వారాణి కవాటాన్యవఘాటయన్. ౧౫
ప్రవిశన్నిష్పతంశ్చాపి ప్రపతన్నుత్పతన్నపి,
సర్వమప్యవకాశం స విచచార మహాకపిః. ౧౬

చతురంగుళమాత్రోఽపి నావకాశస్స విద్యతే,
రావణాంతఃపురే తస్మిన్ యం కపిర్న జగామ సః. ౧౭
ప్రాకారాంతరరథ్యాశ్చ వేదికాశ్చైత్యసంశ్రయాః,
దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ సర్వం తేనావలోకితమ్. ౧౮
రాక్షస్యో వివిధాకారా విరూపా వికృతాస్తథా,
దృష్టా హనుమతా తత్ర న తు సా జనకాత్మజా. ౧౯

రూపేణాప్రతిమా లోకే వరా విద్యాధరస్త్రియః,
దృష్టా హనుమతా తత్ర న తు రాఘవనందినీ. ౨౦
నాగకన్యా వరారోహాః పూర్ణచంద్రనిభాననాః,
దృష్టా హనుమతా తత్ర న తు సీతా సుమధ్యమా. ౨౧
ప్రమథ్య రాక్షసేంద్రేణ దేవకన్యా బలాద్ధృతాః,
దృష్టా హనుమతా తత్ర న సా జనకనందినీ. ౨౨

సోఽపశ్యంస్తాం మహాబాహుః పశ్యంశ్చాన్యా వరస్త్రియః,
విషసాద ముహుర్ధీమాన్ హనుమాన్మారుతాత్మజః. ౨౩

ఆవానరోత్తముఁ డున్నతస్థలముల కెక్కుచుఁ దగ్గినచోట్లను దిగుచుఁ బలుమా ఱందందు నిలుచుచుఁ బోవుచు వాకిండ్లను మూయుచుఁ దలుపులను దెఱచుచు నాయిండ్లయందుఁ జొచ్చుచు వెలువడుచుఁ బాతాళగృహముల లోనికి దుముకుచు మీఁది కెక్కుచు నిది యది యను నియతి లేక యెల్ల యెడలను సంచరించెను. ౧౫-౧౬

ఆరావణుని యంతఃపురమునఁ దానుఁ జూడనిచోటు బెత్తెడైనను లేకుండునట్లు సీతను హనుమంతుఁ డంతటను వెదకెను. ౧౭

కోటలోపలనుండు త్రోవలును మంటపముల నాశ్రయించి యున్న తిన్నెలును నడబావులును కోనేళ్లును సర్వము నాతనిచేఁ జూడఁబడియెను. ౧౮

నానావిధరూపములు గలవారును వికారాకారములు గలవారును నగురాక్షసస్త్రీలు పెక్కండ్రు కనంబడిరి కాని యందెందును సీతాదేవి కనంబడదయ్యెను. ౧౯

లోకమందుఁ దమకు సాటిలేనిరూపముగలవారగు విద్యాధరస్త్రీలు గూడ జూడఁబడిరి గాని యెచ్చోటను రాఘవుని ప్రియురాలగు జానకి కనంబడదయ్యె. పున్నమచంద్రబింబోలు మోముగల యందకత్తెలగు నాగకన్యకలును గనంబడిరి. సింగము నడుమువంటి నడుము గలది యగుసీత కానరాదయ్యె. యుద్ధమున గెలిచి రావణునిచే బలవంతముగఁ దేఁబడిన దేవకన్యకలును హనుమంతునిచేఁ జూడంబడిరి. జనకుని ముద్దులపట్టియగు సీత యెందును లేదయ్యెను. ౨౦-౨౨

మిక్కిలి బలవంతుఁడగు హనుమంతుఁడు సీతను వెదకియుఁ గానక యందున్న యందకత్తెలగు పెక్కండ్రితరభామలను బలుమాఱు గాంచుచు మిక్కిలి ఖిన్నుఁడయ్యెను. ౨౩

ఉద్యోగం వానరేంద్రాణాం ప్లవనం సాగరస్య చ,
వ్యర్థం వీక్ష్యానిలసుతశ్చింతాం పునరుపాగమత్. ౨౪

అవతీర్య విమానాచ్చ హనుమాన్మారుతాత్మజః,
చింతాముపజగామాథ శోకోపహతచేతనః. ౨౫

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్వాదశస్సర్గః.

---

## త్రయోదశస్సర్గః

విమానాత్తు సుసంక్రమ్య ప్రాకారం హరియూథపః,
హనుమాన్వేగవానాసీ ద్యథా విద్యుద్ఘనాంతరే. ౧

సంపరిక్రమ్య హనుమా న్రావణస్య నివేశనాత్,
అదృష్ట్వా జానకీం సీతామబ్రవీద్వచనం కపిః. ౨

భూయిష్ఠం లోళితా లంకా రామస్య చరతా ప్రియం,
న హి పశ్యామి వైదేహీం సీతాం సర్వాంగశోభనామ్. 3

పల్వలాని తటాకాని సరాంసి సరితస్తథా,
నద్యోఽనూపవనాంతాశ్చ దుర్గాశ్చ ధరణీధరాః. ౪

లోళితా వసుధా సర్వా న తు పశ్యామి జానకీం,
ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే. ౫

ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తామహం,
కిం ను సీతాఽథ వైదేహీ మైథిలీ జనకాత్మజా. ౬

ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణం,

వాయుపుత్త్రుఁడు వానరోత్తములు చేసిన యత్నమును దాను సము
ద్రముం దాఁటుటయు వ్యర్థమయ్యె నని తలంచి మరల ఖిన్నుఁ డయ్యెను. ౨౪

వాయుపుత్త్రుండగు (బలవంతుఁడైన) హనుమంతుఁడు విమానమునుండి
దిగి శోకముచేఁ గొట్టంబడిన మనస్సుగలవాఁడై చింతనొందెను. ౨౫

ఇది పండ్రెండవసర్గము.

---

## పదుమూఁడవ సర్గము

వేగవంతుఁ డగు నావానరోత్తముండు విమానమునుండి ప్రాకారము
దాఁటి మేఘమునడుమనున్న మెఱపువలె నుండెను. ౧

సీతను గనుంగొనఁజాలకయే రావణుని నివేశమునుండి కదలి హను
మంతుఁ డిట్లనుకొనియెను ౨

శ్రీరామునకు హితము సేయుచున్న నాచేత నీలంక చక్కఁగా వెదుకం
బడియెను. ప్రతియవయవమందును సౌందర్యము గలదియగు సీతను జూడ
నేరనైతిని. ౩

నీటిపడియలును జెఱువులును దొఱువులును వాగులును నదులును నీటి
పట్టకడనుండు వనములందును జొఱఁగూడని కొండలును ఇంతయేల ! భూమి
యంతయుం వెదుకంబడియెను. జానకి నెందును గాననైతిని. ౪

సంపాతి యనుపక్షిచేత రావణునియింట నున్నదని చెప్పంబడిన సీత
నిం దెచ్చోటను గనఁజాలకున్నాఁడను గదా ! ౫

అందఱవలె మానుషదేహమువలనఁ బుట్టక నాఁగేటిచాలునఁ బుట్టినదియుం
విదేహరాజునకుఁ గూఁతురైనదియు మిథిలాధిపునకుఁ బుత్త్రికయైనదియుం
అధ్యాత్మవేత్తయగుజనకునకుఁ బ్రియపుత్త్రికయైనదియుం నగురామునిభార్య
కామవికారము జెందినదై దుర్జనుఁడగురావణునకు లోఁబడునా ! ౬

క్షిప్రముత్పతతో మన్యే సీతామాదాయ రక్షసః. ౭
బిభ్యతో రామబాణానామంతరా పతితా భవేత్,
అథవా హ్రియమాణాయాః పథి సిద్ధనిషేవితే. ౮
మన్యే పతితమార్యాయా హృదయం ప్రేక్ష్య సాగరం,
రావణస్యోరువేగేన భుజాభ్యాం పీడితేన చ. ౯
తయా మన్యే విశాలాక్ష్యా త్యక్తం జీవితమార్యయా,

ఉపర్యుపరి వా నూనం సాగరం క్రమత స్తదా. ౧౦
వివేష్టమానా పతితా సముద్రే జనకాత్మజా,
అహో క్షుద్రేణ వాఽనేన రక్షంతీ శీలమాత్మనః. ౧౧
అబంధుర్భక్షితా సీతా రావణేన తపస్వినీ,

అథవా రాక్షసేంద్రస్య పత్నీభిరసితేక్షణా. ౧౨
అదుష్టా దుష్టభావాభిర్భక్షితా సా భవిష్యతి,
సంపూర్ణచంద్రప్రతిమం పద్మపత్రనిభేక్షణమ్. ౧౩
రామస్య ధ్యాయతీ వక్త్రం పంచత్వం కృపణా గతా,
హా రామ లక్ష్మణేత్యేవం హాఽయోధ్యే చేతి మైథిలీ. ౧౪
విలప్య బహు వైదేహీ న్యస్తదేహా భవిష్యతి,
అథవా నిహితా మన్యే రావణస్య నివేశనే. ౧౫
నూనం లాలప్యతే సీతా పంజరస్థేవ శారికా,
జనకస్య సుతా సీతా రామపత్నీ సుమధ్యమా. ౧౬
కథముత్పలపత్త్రాక్షీ రావణస్య వశం వ్రజేత్,
వినష్టా వా ప్రణష్టా వా మృతా వా జనకాత్మజా. ౧౭
రామస్య ప్రియభార్యస్య న నివేదయితుం క్షమం,
నివేద్యమానే దోషస్స్యాద్దోష స్స్యా దనివేదనే. ౧౮

సీతను గ్రహించి రామబాణములకు భయపడుచు వేగముగ రావణుఁడు వచ్చుచుండఁగా మార్గమధ్యమున సీత పడినదై యుండును అని తలంచెదను. ౭

అట్లుకాక సిద్ధులు తిరుగాడునట్టి యాకాశమార్గమునఁ దేఁబడుచుండిన సీతాదేవియొక్క మనస్సు సముద్రముంగాంచి భీతిల్లుటచే నందుఁ బడియుండు నేమో యని తలంచెదను. ౮

సీతను దెచ్చునపుడు రావణుఁడు వచ్చు మిక్కుటమగు వేగముచేతను వానిభుజములచే నలుపంబడుటచేతను విశాలమగు కన్నులుగల యాసీతచేఁ బ్రాణములు విడువంబడియె నని యెంచెదను. ౯

విమానమునుండి సముద్రపునీటిని దాఁటుచో జనకపుత్త్రిక యగుసీత సత్యముగా సముద్రమునఁ బడియుండును. ౧౦

సాధువై తోడ్పా టెందునుం గలుగక చుట్టములకు దూరమై తన పతివ్రతాధర్మమును గాపాడుచున్నసీత యల్పుఁడగు నీరావణునిచేఁ దినంబడి యేని యుండును. ౧౧

అట్లుకాకున్నను సాధురాలును నల్లనికన్నులు గలదియు నగుసీత దుష్ట స్వభావము గల రావణునిభార్యలచే భక్షింపఁబడియేనియు నుండును. పున్నమ చంద్రునింబోలునదియుఁ దామరఱేకులవంటికన్నులుగలదియును నగుసీతాదేవి ప్రాణసఖుఁడగు శ్రీరాముని మోమును ధ్యానముసేయుచు దీనురాలై ప్రాణ ముల విడిచియుండును. 'హా! రామా లక్ష్మణా అయోధ్యా' అని పెక్కుతెఱం గుల (పరమవిరక్తుఁడగు జనకుని పుత్త్రికయయ్యు) నిట్లు శ్రీరామునియందలి స్నేహముచే దుఃఖించుచుఁ బ్రాణములు విడిచియుండునేమో! అట్లు గానిచో రావణునియింటనే యునుపంబడి (పంజరమందు నుంపఁబడియున్న యాఁడు గోరువంకవలె) మిక్కిలి దుఃఖించుచున్నది యని తలంచెదను. ౧౨-౧౫

వివేకియగు జనకునకుఁ గూఁతురును మనుష్యగర్భమునఁ బుట్టనిదియు శ్రీరామునకు భార్యయైనదియు సాటిలేనియందముగలదియు గుణాగుణముల యోచింపఁగలదియు నగు నిల్లాలు కేవల మృగప్రాయుఁడగురావణునకు లోఁ బడునా? అట్లుండదు గావున సీత పాతాళగృహము మొదలగుచోటులం దునుపంబడి కానరాకపోయెనని యుండును. అచ్చటనుండి తెచ్చునపుడు సముద్ర మునం బడియేని యుండును. శ్రీరామునిం దలఁచితలఁచి ప్రాణములను విడచి

కథం ను ఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతి మే,
అస్మిన్నేవం గతే కార్యే ప్రాప్తకాలం క్షమం చ కిమ్. ౧౯
భవేదితి మతం భూయో హనుమాన్ప్రవిచారయత్,

యది సీతామదృష్ట్వాఽహం వానరేంద్రపురీమితః. ౨౦
గమిష్యామి తతః కో మే పురుషార్థో భవిష్యతి,
మమేదం లంఘనం వ్యర్థం సాగరస్య భవిష్యతి. ౨౧
ప్రవేశశ్చైవ లంకాయాం రాక్షసానాం చ దర్శనం,
కిం మాం వక్ష్యతి సుగ్రీవో హరయో వా సమాగతాః. ౨౨
కిష్కింధాం సమనుప్రాప్తం తౌ వా దశరథాత్మజౌ,
గత్వా తు యది కాకుత్స్థం వక్ష్యామి పరమప్రియమ్. ౨3
న దృష్టేతి మయా సీతా తతస్త్యక్ష్యతి జీవితం,
పరుషం దారుణం క్రూరం తీక్ష్ణమింద్రియతాపనమ్. ౨౪
సీతానిమిత్తం దుర్వాక్యం శ్రుత్వా స న భవిష్యతి,
తం తు కృచ్ఛ్రగతం దృష్ట్వా పంచత్వగతమానసమ్. ౨౫
భృశానురక్తో మేధావీ న భవిష్యతి లక్ష్మణః,
వినష్టౌ భ్రాతరౌ శ్రుత్వా భరతోఽపి మరిష్యతి. ౨౬
భరతం చ మృతం దృష్ట్వా శత్రుఘ్నో న భవిష్యతి,
పుత్త్రాన్మృతాన్సమీక్ష్యాథ న భవిష్యంతి మాతరః. ౨౭
కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ న సంశయః,
కృతజ్ఞస్సత్యసంధశ్చ సుగ్రీవః ప్లవగాధిపః. ౨౮
రామం తథాగతం దృష్ట్వా తతస్త్యక్ష్యతి జీవితం,
దుర్మనా వ్యథితా దీనా నిరానందా తపస్వినీ. ౨౯

యేని యుండును. కావున నీమాటలు (భార్యయందుఁ బ్రాణము నుంచియున్న వాఁడగు) శ్రీరామున కేమని చెప్పుదును. శ్రీరామున కీవిషయముం దెలుపుటచే నాకు దోషము గలుగును. తెలుపకున్నను దోషమే. ఎట్లు చేయుదును? ఎటు పోయినను విరోధముగానున్నది. ఇట్లున్నదికావున కాఁగలయది కాకమానదు. అని హనుమంతుఁడు మఱిమఱి యోచించుచుండెను. ౧౬-౧౯

నేను సీతను జూడకయే యిచ్చటనుండి కిష్కింధ కేఁగితినేని నాకుఁ బ్రయోజన మేమికలదు? నూఱామడల నిడివిగల యీసముద్రమును దాఁటుటయు లంకలోఁ బ్రవేశించుటయు రాక్షసులను గాంచుటయును వ్యర్థమగును గదా! నావెంటవచ్చిన వానరు లేమి తలంతురు. సుగ్రీవుఁడు నన్ను నిందింపకుండునా? కిష్కింధయందు నారాక కెదురుచూచుచున్న దశరథపుత్రులు కటకటంబడి నన్నుం దిట్టకుందురా? వ్యర్థుఁడనై కిష్కింధ కేఁగి 'సీత గనంబడలే' దని రామునకుం జెప్పితినేని వెంటనే యతఁడు ప్రాణములను విడుచును. కఠినమైనదియు, భయంకరమైనదియుఁ, గ్రూరమైనదియు, నోర్వరానిదియు, నింద్రియముల నుడికించునదియు నగు నీచెడుమాటను (సీత గనంబడలేదనుట) విని రాముఁడు జీవించియుండఁగలఁడా! ౨౦-౨౪

అట్లు కటకటంబడి శ్రీరాముఁడు ప్రాణములు విడిచినచో నాతనియందుఁ దనప్రాణముల నుంచియున్నవాఁడగు లక్ష్మణుఁడు నిలువఁజాలక తానును దేహమును త్యజించును. ఈయుద్దఱిమాటను వినినతోడనే భరతుండు నచ్చును. భరతుని చావుఁగని శత్రుఘ్నుఁడు జీవించియుండఁడు. ఇట్లు పుత్రులు నలువురును జెగిన పిమ్మట వీరి తల్లులగు కౌసల్యా సుమిత్రా కైకలు నిమిషమేని బ్రతుకఁజాలరు. ౨౫-౨౭

అట్లు శ్రీరాముఁడు తెగుటను గాంచి ఉపకారము మఱువనివాఁడును సత్యవ్రతము గలవాఁడును వానరులకు రాజును నగుసుగ్రీవుఁడు తన బ్రతుకును జాలించును. అంతటఁ బీడింపఁబడిన మనస్సుగలదియు దిక్కుమాలినదియు సంతోషములేనిదియు పతివ్రతయు నగు రుమ సుగ్రీవునితోడనే దేహమును

పీడితా భర్తృశోకేన రుమా త్యక్ష్యతి జీవితం,
వాలిజేన తు దుఃఖేన పీడితా శోకకర్శితా. ౩౦
పంచత్వం చ గతే రాజ్ఞి తారాఽపి న భవిష్యతి,
మాతాపిత్రోర్వినాశేన సుగ్రీవవ్యసనేన చ. ౩౧
కుమారోఽప్యంగదః కస్మాద్ధారయిష్యతి జీవితం,
భర్తృజేన తు దుఃఖేన హ్యభిభూతా వనౌకసః. ౩౨
శిరాంస్యభిహనిష్యంతి తలైర్ముష్టిభిరేవ చ,
సాంత్వేనానుప్రదానేన మానేన చ యశస్వినా. ౩౩
లాలితాః కపిరాజేన ప్రాణాం స్త్యక్ష్యంతి వానరాః,
న వనేషు న శైలేషు న నిరోధేషు వా పునః. ౩౪
క్రీడామనుభవిష్యంతి సమేత్య కపికుంజరాః,
సపుత్త్రదారాస్సామాత్యా భర్తృవ్యసనపీడితాః. ౩౫
శైలాగ్రేభ్యః పతిష్యంతి సమేత్య విషమేషు చ,
విషముద్బంధనం వాపి ప్రవేశం జ్వలనస్య వా. ౩౬
ఉపవాసమథో శస్త్రం ప్రచష్యంతి వానరాః,
ఘోరమారోదనం మన్యే గతే మయి భవిష్యతి. ౩౭
ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసాం,
సోఽహం నైవ గమిష్యామి కిష్కింధాం నగరీమితః. ౩౮
న చ శక్ష్యామ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా,
మయ్యగచ్ఛతి చేహస్థే ధర్మాత్మానౌ మహారథౌ. ౩౯
ఆశయా తౌ ధరిష్యేతే వానరాశ్చ మనస్వినః,
హస్తాదానో ముఖాదానో నియతో వృక్షమూలికః. ౪౦
వానప్రస్థో భవిష్యామి హ్యదృష్ట్వా జనకాత్మజాం,
సాగరానూపజే దేశే బహుమూలఫలోదకే. ౪౧

బాయును. వాలి చచ్చుటచేఁ గలిగినదుఃఖముచేఁ బీడింపఁబడినదై నవయుచున్న తారయు వాలి నశించుటచేతను, వినతండ్రియుం రాజును నగు సుగ్రీవుండు పోవుటచేతను దుఃఖించి దుఃఖించి నవయుబాలుఁ డగునంగదుండును నెట్లు బ్రదికియుందురు? రాజగు సుగ్రీవుఁడు మృతినొందిన దుఃఖముచేఁ గరంబు నొచ్చి వానరులందఱు నఱచేతులచేతను బిడికిళులచేతను దలలపై గొట్టుకొందురు. కీర్తిగలవాఁడగు సుగ్రీవునిచే మంచిమాటలచేతను బహుమతుల నిచ్చుటచేతను గౌరవించుటచేతను బాలింపఁబడిన వానరులందఱును బ్రాణములు విడుతురు. వానరోత్తములు మునుకటివలెఁ గిష్కింధకు వచ్చి వనములయందును గొండలయందును అడ్డుగల మఱి యేచోట్లయందేనియుం నాటలాడఁబోరు. అట్లు రాజు చచ్చుటవలని వ్యసనముచేఁ బీడింపఁబడిన వానరప్రభువులు భార్యలతోడను బిడ్డలతోడను మంత్రులతోను గొండల కొనలనుండి మిట్టపల్లములంబడి మ్రగ్గుదురు. వానరులు విషముం గొనుదురు. గొంతున నురిపోసికొందురు. అగ్నియందుఁ బ్రవేశింతురు. అన్నపానములు మాని ప్రాయోపవేశము సేయుదురు. ఖడ్గముచే గొంతులు కోసికొందురు. నేను కిష్కింధ కేఁగితినేని భయంకరమగు రోదనధ్వని యంతటను బుట్టును. ఇక్ష్వాకుకులముయొక్క నాశమును మర్కటవంశముయొక్క చేటును గలుగును కావున నేను గిష్కింధ కిచ్చటనుండి పోవుటలేదు. సీతను గొనిపోకన్నే సుగ్రీవునిఁ జూడనోపను. ౨౮-౩౮

నేను గిష్కింధకుఁ బోక యిక్కడనే యుండునంతవఱకు ధర్మముగ వర్తించువారును మహారథు లనుబిరుదులుగలవారును నగు రామలక్ష్మణులు నారాక కెదురుచూచుచు నాశచే బ్రతికియుందురు. వానరులు నెమ్మదిగ నుందురు. ౩౯

జానకిని జూడనేరనేని తానై చేతికందినవస్తువును నోటికందినపదార్థమును మాత్రమే తినుచు నియమముగలవాఁడనై వృక్షములనీడను వసియించుచు వానప్రస్థాశ్రమము నుండెదను. అనేకములగుదుంపలను ఫలములను శుద్ధమగు నుదకమును గల సముద్రతీరభూములందు శరీరమును దహించుటకై సొచ్చి

చితాం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధమరణీసుతం,
ఉపవిష్టస్య వా సమ్యగ్లింగినీం సాధయిష్యతః. ౪౨
శరీరం భక్షయిష్యంతి వాయసాశ్శ్వాపదాని చ,
ఇదం మహర్షిభిర్దృష్టం నిర్యాణమితి మే మతిః. ౪౩
సమ్యగాపః ప్రవేక్ష్యామి న చేత్పశ్యామి జానకీం,
సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ. ౪౪
ప్రభగ్నా చిరరాత్రీయం మమ సీతామపశ్యతః,
తాపసో వా భవిష్యామి నియతో వృక్షమూలికః. ౪౫
నేతః ప్రతిగమిష్యామి తామదృష్ట్వాఽసితేక్షణాం,
యదీతః ప్రతిగచ్ఛామి సీతామనధిగమ్య తామ్. ౪౬
అఙ్గదస్సహ తైస్సర్వైర్వానరైర్న భవిష్యతి,
వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి. ౪౭
తస్మాత్ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః,
ఏవం బహువిధం దుఃఖం మనసా ధారయన్ముహుః. ౪౮

నాధ్యగచ్ఛత్తదా పారం శోకస్య కపికుంజరః,
[తతో విక్రమమాసాద్య ధైర్యవాన్ కపికుఞ్జరః,]
రావణం వా వధిష్యామి దశగ్రీవం మహాబలమ్. ౪౯
కామమస్తు హృతా సీతా ప్రత్యాచీర్ణం భవిష్యతి,
అథ వైనం సముత్క్షిప్య ఉపర్యుపరి సాగరమ్. ౫౦
రామాయోపహరిష్యామి పశుం పశుపతే రివ,
ఇతి చింతాం సమాపన్నస్సీతామనధిగమ్య తామ్. ౫౧
ధ్యానశోకపరీతాత్మా చింతయామాస వానరః,
యావత్సీతాం హి పశ్యామి రామపత్నీం యశస్వినీమ్. ౫౨
తావదేతాం పురీం లంకాం విచినోమి పునః పునః,

కొని యగ్నితగిల్చి యామంటయందుఁ జొచ్చువాఁడను. అన్నపానములను వర్జించి ప్రాయోపవేశ మను వ్రతమును ధరించి జీవుని వెలువరించుచున్నది యగు నాదేహమును గాకులును మృగములును భక్షించునుగాక! జానకిని చూడనేరనైతి నేని లోఁతుగలనీటఁ జొచ్చువాఁడను. ఇట్లు దేహమును విడుచుట యోగ్యులగు ఋషులకు సమ్మతమైనమార్గము అని తలంచెదను. బాగుగఁ బ్రారంభ మైనదియుఁ మిక్కిలి మాహాత్మ్యము గలదియుఁ స్తోత్రార్హమైనదియు నగు నీదీర్ఘమగురాత్రి సీతను గానకయే ముగియవచ్చినది. నల్లనికన్నులు గలదగుసీతాదేవిని గానక నేను మరలుటలేదు. నియతిగలవాఁడనై వృక్షములనీడ నిలచి తపస్సుచేయువాఁడ నయ్యెదను. సీతను జూడకయే యిందుండి పోయితి నేని నన్నుం జూచినతోడనే యంగదుఁడు వానరసేనలతోఁ గూడ బ్రాణములను త్యజించును. మరణము గలిగినచో దోషము లనేకములు సంభవించుచున్నవి. జీవించియున్నవాఁడుగదా శుభములను జెందఁగలఁడు. కావున నేనే నేను ప్రాణముల బిగఁబట్టి యుండెదను. మేలు కలుగును గాక! అని యిట్లనేకవిధములైనదుఃఖములను బలుమఱు మనస్సున ధరించినవాఁడై హనుమంతుఁడు శోకమునకుఁ దుదఁ గానకయుండెను. ౪౦-౪౧

[ఇంతలో మరల ధిటవుదెచ్చుకొని యిట్లనుకొనెను.]

రావణునిచేఁ దేఁబడినది యగుసీత యెట్లయిన నుండుఁగాక పదితలలు గలిగి మిక్కిలిబలవంతుఁ డను పేరు పొందిన యారావణునిఁ జంపితి నేని దెబ్బకుదెబ్బగా ద్వేషమేనియుఁ దీరును. అట్లుగానిచో నీరావణుని నెత్తికొని అగ్నికుండముకడకు హోమముసేయుటకై యజ్ఞపశువును గొనిపోవు నట్లు శ్రీరామునికడకుఁ గొనిపోయెదను, అనుచుఁ జింతను బొందినవాఁడగువానరుఁడు సీతను గానమిచేత మిక్కిలి ఖిన్నమైనమనస్సు గలవాఁడై యోచించుచుండెను. ౪౯-౫౧

కీర్తిగలదియుఁ శ్రీరామునిభార్యయైనదియు నగుసీత నెప్పుడు గందునో యంతవఱకును నే నీలంకాపురమందుఁ బలుమాఱు వెదకుచుందును. సంపాతి యనుపక్షి పలికినమాటలను నమ్మి శ్రీరామునిఁ బిలచికొని వచ్చియుందు నేని శ్రీరాముఁడు సీతను గానక దుఃఖించి కోపించి వానరులనందఱను గాల్చి

సంపాతివచనాచ్చాపి రామం యద్యానయామ్యహమ్. ౫౩
అపశ్యన్ రాఘవో భార్యాం నిర్దహేత్సర్వవానరాన్,
ఇహైవ నియతాహారో వత్స్యామి నియతేంద్రియః. ౫౪
న మత్కృతే వినశ్యేయుస్సర్వే తే నరవానరాః,
అశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా. ౫౫
ఇమామధిగమిష్యామి న హీయం విచితా మయా,
వసూన్ రుద్రాంస్తథాఽఽదిత్యానశ్వినౌ మరుతోఽపి చ. ౫౬
నమస్కృత్వా గమిష్యామి రక్షసాం శోకవర్ధనః,
జిత్వా తు రాక్షసాన్ సర్వానిక్ష్వాకుకులనందినీమ్. ౫౭
సంప్రదాస్యామి రామాయ యథా సిద్ధిం తపస్వినే,
స ముహూర్తమివ ధ్యాత్వా చింతావిగ్రథితేంద్రియః. ౫౮
ఉదతిష్ఠన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః,
నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై,
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః. ౫౯
స తేభ్యస్తు నమస్కృత్య సుగ్రీవాయ చ మారుతిః. ౬౦
దిశస్సర్వాస్సమాలోక్య హ్యశోకవనికాం ప్రతి,
స గత్వా మనసా పూర్వమశోకవనికాం శుభామ్. ౬౧
ఉత్తరం చింతయామాస వానరో మారుతాత్మజః,
ధ్రువం తు రక్షో బహుళా భవిష్యతి వనాకులా. ౬౨
అశోకవనికా చింత్యా సర్వసంస్కారసంస్కృతా,
రక్షిణశ్చాత్ర విహితా నూనం రక్షంతి పాదపాన్. ౬౩
భగవానపి సర్వాత్మా నాతిక్షోభం ప్రవాతి వై,

వైచును. మితమైన యాహారముంగొని యింద్రియములవేగము నణంచుచు నే నీలంకయందే యుందును. అట్టయినచో వానరులకును రాజపుత్రులగురామలక్ష్మణులకును నానిమిత్తమునఁ జావు గలుగకుండును. గొప్పవృక్షములు గలిగి యుగుపడుచున్న యాయశోకవనమున కేఁగెదను. అచ్చోట నేను మున్ను వెదుకనైతిని. దేవతలలోని వారగు వసువులకు రుద్రులను ఆదిత్యులను అశ్వినీదేవతలను వాయువులకుగూర్చి మ్రొక్కులిడి రాక్షసులను శోకమును బెంచువాఁడనై యశోకవనమున కేఁగుచున్నాఁడను. సమస్తరాక్షసులను జయించి (ఇక్ష్వాకుకులమునకు వన్నె తెచ్చు కోడలగు) సీతను (తపస్సు చేయుచున్నవానికి దాని ఫలము నిచ్చినట్లుగా) శ్రీరామునకు సమర్పించువాఁడను. అని మిక్కిలి ప్రతాపముగలవాఁడును వాయుపుత్రుండును నగు హనుమంతుఁడు కొంతసేపు యోచించి శోకముడిగినచిత్తము గలవాఁ డయ్యెను. ౫౭-౫౮

లక్ష్మణసహితుఁ డగు శ్రీరామునకు మ్రొక్కెదను. జనకమహారాజపుత్రి యగు సీతాదేవికిని నమస్కారము చేసెదను. రుద్ర, ఇంద్ర, యమ, వాయువులకు జోహా రొనర్చెదను. చంద్రసూర్యాది దేవతలకుఁ జేతులు మోడ్చెదను. ౫౯

అని హనుమంతుండు వారలకెల్ల మ్రొక్కులిడి సుగ్రీవుని దలఁచి నమస్కరించి యన్నిదిక్కులను గాంచి యటుపై నశోకవనమును జూచెను. అట్లు చూచినవాఁడై ముందువెనుకలు యోచింపక మంగళకరమగు నశోకవనమున కేఁగి పిమ్మటఁ జేయందగుపనినిగూర్చి యోచించెను. ౬౦-౬౧

పెక్కండ్రు రక్కసులచే నిండినదియుఁ దట్టమైన చెట్లుగలదియుఁ సర్వవిధములగు నలంకారములచే నొప్పినదియు నగు నీయశోకవనము తప్పక వెదుకఁదగినది. వనమును గాపాడుసేవకులును వనమందే యుండువారై చెట్లను శ్రద్ధతోఁ బెంచుచున్నారు. సర్వశక్తుఁడును సర్వవ్యాపియు నగువాయుదేవుఁడు కూడ నీవనమున లెస్సగ వీచుటలేదు. ౬౨-౬౩

సంక్షిప్తో౽యం మయా౽౽త్మా చ రామార్థే రావణస్యచ. ౬౪
సిద్ధిం మే సంవిధాస్యంతి దేవా స్సర్షిగణా స్త్విహ,

బ్రహ్మా స్వయంభూర్భగవాన్ దేవాశ్చైవ దిశంతు మే. ౬౫
సిద్ధిమగ్నిశ్చవాయుశ్చ పురుహూతశ్చ వజ్రభృత్,
వరుణః పాశహస్తశ్చ సోమాదిత్యౌ తథైవ చ. ౬౬
అశ్వినౌ చ మహాత్మానౌ మరుతశ్శర్వ ఏవ చ,

సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవ యః ప్రభుః. ౬౭
దాస్యంతి మమ యే చాన్యే హ్యదృష్టాః పథి గోచరాః,

తదున్నసం పాండురదంతమవ్రణం
శుచి స్మితం పద్మపలాశలోచనం,
ద్రక్ష్యే తదార్యావదనం కదాన్వహం
ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్. ౬౮
క్షుద్రేణ పాపేన నృశంసకర్మణా
సుదారుణాలంకృతవేషధారిణా,
బలాభిభూతా హ్యబలా తపస్వినీ
కథం ను మే దృష్టిపథే౽ద్య సా భవేత్. ౬౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రయోదశస్సర్గః.

---

## చతుర్దశస్సర్గః

స ముహూర్తమివ ధ్యాత్వా మనసా చాధిగమ్య తాం,
అవప్లుతో మహాతేజాః ప్రాకారం తస్య వేశ్మనః. ౧

నా దేహము శ్రీరామునిశుభమునకును రావణుఁడు చూచునేమో యను భయమునకును మిక్కిలి చిన్నదిగాఁ జేయంబడియె. ఋషులును దేవతలును నాకుఁ గార్యము చక్కఁబడునట్లు సేయంబాలుదురు. ౧౪

తనంతటనే పుట్టినవాఁడును మాహాత్మ్యముగలవాఁడును నగుబ్రహ్మయుం వజ్రాయుధమును ధరించియున్న దేవేంద్రుఁడును అగ్నియు వాయుదేవుఁడును పాశమును ధరించినవాఁ డగువరుణుఁడును సూర్యచంద్రానులును అశ్వినీదేవతలును రుద్రుఁడును నాకుఁ గార్యము సిద్ధించునట్లు చేయుందురుగాక! ౧౫,౧౬

సమస్తభూతములును. సర్వభూతములకును ప్రభువును నాబుద్ధి కందకయున్నను కార్యానుకూలమార్గమందున్న యితరదేవతలును నాకు నీకార్యము ననుకూలము సేయుందురుగాక ! ౧౭

ఎత్తగు ముక్కుఁగలదియుం తెల్లని పండ్లుగలదియుం గాయమెందును లేనిదియు నిర్మలమగు నవ్వును దోఁపించునదియుం తామరఱేకులవంటి కన్నులుగలదియు నిండుచందురునింబోలె నగపడుచున్నదియు నగునట్లు రామునిచేఁ జెప్పంబడిన సీతమోము నే నెప్పుడు గాంతునో ? ౧౮

నీచుఁడును పాపియు ఘాతకుఁడు మిక్కిలి భయంకరముగా నలంకరింపఁబడిన వేషము గలవాఁడును నగురావణునిచేత బలహీనయుం తపస్విచేయుఁబడియుం నగుసీత బలాత్కారముగా నవమాన పెట్టంబడియెను. అట్టిసీత యిపుడు నాకన్నుల కెట్లగపడును ? ౧౯

ఇది పదుమూఁడవసర్గము.

# పదునాల్గవసర్గము

మిక్కిలి దర్పముగలవాఁ డగుహనుమంతుఁడు కొంతసేపు మనస్సున నిట్లు యోచించి యొక్కదాఁటున రావణునిగృహము వదలి యశోకవనము యొక్క ప్రాకారమును జేరెను.

స తు సంహృష్టసర్వాంగః ప్రాకారస్థో మహాకపిః,
పుష్పితాగ్రాన్వసంతాదౌ దదర్శ వివిధాన్ ద్రుమాన్. ౨
సాలానశోకాన్భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్,
ఉద్దాలకాన్నాగవృక్షాం శ్చూతా న్కపిముఖానపి. ౩

అథామ్రవణసంఛన్నాం లతాశతసమావృతాం,
జ్యాముక్త ఇవ నారాచః పుప్లువే వృక్షవాటికామ్. ౪

స ప్రవిశ్య విచిత్రాం తాం విహగైరభినాదితాం,
రాజతైః కాంచనైశ్చైవ పాదపైస్సర్వతో వృతామ్. ౫
విహగైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననాం,
ఉదితాదిత్యసంకాశాం దదర్శ హనుమాన్కపిః. ౬
వృతాం నానావిధైర్వృక్షైః పుష్పోపగఫలోపగైః,
కోకిలైర్భృంగరాజైశ్చ మత్తైర్నిత్యనిషేవితామ్. ౭
ప్రహృష్టమనుజే కాలే మృగపక్షిసమాకులే,
మత్తబర్హిణసంఘుష్టాం నానాద్విజగణాయుతామ్. ౮

మార్గమాణో వరారోహాం రాజపుత్రీమనిందితాం,
సుఖప్రసుప్తాన్విహగాన్ బోధయామాస వానరః. ౯

ఉత్పతద్భిర్ద్విజగణైః పక్షైః స్సాలాః స్సమాహతాః,
అనేకవర్ణా వివిధా ముముచుః పుష్పవృష్టయః. ౧౦
పుష్పావకీర్ణశ్శుశుభే హనుమాన్మారుతాత్మజః,
అశోకవనికామధ్యే యథా పుష్పమయో గిరిః. ౧౧

మీఁదఁ జెప్పఁబడినట్లు ప్రాకారమునంజేరినవాఁ డగుహనుమంతుఁడు తనదేహమును మిక్కిలి కుఱుచపఱచి యావసంతఋతువుయొక్క ప్రారంభదశయందుఁ బుష్పించి వెలుంగుచున్నకొనలుగల నానావిధవృక్షములను ఏపె చెట్లను అందమగునశోకవృక్షములను లెస్సగఁ బూచిన సంపెంగచెట్లను మామిడిచెట్లను కపిముఖ మను చెట్లను గనియె. ౨, ౩

అటుపై మామిడిమ్రాఁకులచే మఱుఁగుపడియున్నదియుఁ బెక్కు తీఁగెలచేఁ జుట్టఁబడియున్నదియు నగు వృక్షసమూహమునకు వింటినారినుండి విడువఁబడిన బాణమువలె నాతఁడు దాఁటెను. ౪

అట్లు దాఁటి యావృక్షసమూహమునఁ జొచ్చి పక్షులచే నంతటను ధ్వనించుచున్నదియు వెండిచేతను బంగారముచేతను చేయఁబడిన చెట్లచే నంతటఁ జుట్టఁబడినదియు పక్షులచేతను మృగసమూహములచేతను వింతయైనదియు వింతలగు చిన్నచిన్న వనములు గలదియు బాలసూర్యునితోఁ దుల్యమై వెలుంగునదియు బుష్పములను ఫలములను మెండుగఁ గలిగియున్న నానావిధవృక్షములచేఁ జుట్టఁబడినదియు మదించినకోకిలలచేతను గండుతుమ్మెదలచేతను సర్వకాలములయందు నాశ్రయింపఁబడినదియు మదించిన నెమళుల గొప్పధ్వనిని గలదియుఁ బెక్కువిధములగు పక్షుల గుంపులతోఁ గూడినదియు నగు నశోకవనమును సంతసించిన మనుష్యులతోఁ గూడినదానిని మృగములయొక్కయుఁ బక్షులయొక్కయు సమూహములచే మెండుకొనియుండుదానిని వానరోత్తముఁ డగుహనుమంతుఁడు గనియెను. ౫-౮

ఆవానరుఁ డుత్తమచరితము గలదియు రాజపుత్రికయు స్త్రీరత్నమును నగుసీతాదేవిని వెదకుచు నందు గాఢముగ నిద్రించుచున్న పక్షులను మేల్కొలిపెను. ౯

అట్లు మేల్కొని యెగయుచున్న పక్షుల తాఁకులను వాని ఱెక్కల పోకునను వృక్షము లనేకవర్ణములుగల పుష్పముల విడచెను. ౧౦

అట్లు రాలినపుష్పముల జల్లుచేఁ గప్పంబడినవాఁడై హనుమంతుఁడు [అశోకవనమధ్యమందు] పుష్పములకొండవలె నొప్పెను. ౧౧

దిశస్సర్వాః ప్రధావంతం వృక్షషండగతం కపిం,
దృష్ట్వా సర్వాణి భూతాని వసంత ఇతి మేనిరే. ౧౨
వృక్షేభ్యః పతితైః పుష్పైరవకీర్ణా పృథగ్విధైః,
రరాజ వసుధా తత్ర ప్రమదేవ విభూషితా. ౧౩
తరస్వినా తే తరవ స్తరసాభిప్రకంపితాః,
కుసుమాని విచిత్రాణి సస్సృజుః కపినా తదా. ౧౪
నిర్ధూతపత్త్రశిఖరాశ్శీర్ణపుష్పఫలా ద్రుమాః,
నిక్షిప్తవస్త్రాభరణా ధూర్తా ఇవ పరాజితాః. ౧౫
హనూమతా వేగవతా కంపితా స్తే నగోత్తమాః,
పుష్పపర్ణఫలాన్యాశు ముముచుః పుష్పశాలినః. ౧౬
విహంగసంఘైర్హీనా స్తే స్కంధమాత్రాశ్రయా ద్రుమాః,
బభూవురగమాస్సర్వే మారుతేనేవ నిర్ధుతాః. ౧౭

నిర్ధూతకేశీ యువతిర్యథా మృదితవర్ణకా,
నిష్పీతశుభదంతోష్ఠీ నఖైర్దంతైశ్చ విక్షతా. ౧౮
తథా లాంగూలహస్తైశ్చ చరణాభ్యాం చ మర్దితా,
బభూవాశోకవనికా ప్రభగ్నవరపాదపా. ౧౯
మహాలతానాం దామాని వ్యధమ త్తరసా కపిః,
యథా ప్రావృషి వింధ్యస్య మేఘజాలాని మారుతః. ౨౦

స తత్ర మణిభూమీశ్చ రాజతీశ్చ మనోరమాః,
తథా కాంచనభూమీశ్చ దదర్శ విచరన్కపిః. ౨౧
వాపీశ్చ వివిధాకారాః పూర్ణాః పరమవారిణా,

అన్నిదిక్కులఁ బరుగెత్తుచున్నవాఁడును జెట్లకొమ్మలపై నున్నవాఁడును నగుహనుమంతునిఁ గని సర్వభూతములును వసంతుఁ డని తలంచెను. ౧౨

వృక్షములనుండి రాల్పఁబడిన నానావిధపుష్పములచేతను నిండినదై భూదేవి [బాగుగ నలంకరింపఁబడిన] పడుచువలె నచ్చటఁ గనంబడియెను. ౧౩

వేగవంతుఁ డగుహనుమంతునిచే బలవంతముగఁ గదల్పఁబడిన యా వృక్షములన్నియుం నానావిధములగుపుష్పములను బ్రోగులువడ రాల్చెను. ౧౪

కదల్పఁబడిన యాకులుఁ గొమ్మలు గలవియుం రాలిన పుష్పములు ఫలములుగలవియుం నగువృక్షములు [పందెమునకై వస్త్రములను సొమ్ముల నూడ్చి పెట్టి బోసిగనున్న] జూదరులవలెఁ గాంతిహీనములై యుండెను. వేగవంతుఁ డగుహనుమంతునిచేఁ గదల్పఁబడిన [పువ్వులుగల] పెద్దచెట్లను బువ్వులను బత్రములను ఫలములను జల్లున విదిల్చెను. ౧౫. ౧౬

పక్షిసమూహములను బోఁగొట్టుకొన్నవై కొమ్మలు నాకులు లేక మొనట్టనుమాత్రము గలవియై వృక్షములు పెనుగాలిచే డస్సినవానివలెఁ గనఁబడి నిలువ నాధారము లేనివయ్యెను. ౧౭

వదలిన కొప్పుగలదియుం నలిగిన మేనిపూతలుగలదియుం లెస్సఁగాఁ జుంబింపఁబడిన పెదవిగలదియుం గోళ్లచేతను దంతములచేతను గాట్లుపడినదియుం నగు వయసుకత్తె యెట్లుండునో యటువలెనే తోఁకచేతను హస్తములచేతను బాదములచేతను లెస్సఁగ మెదుపంబడి ధ్వంసమైన పెనుమ్రాఁకులఁ గలిగినదై యశోకవన మొప్పెను. ౧౮, ౧౯

ఆవానరోత్తముఁడు వర్షాకాలమందు వింధ్యపర్వతముపైఁ జేరిన మేఘములను వాయుదేవుఁడు తూలఁగొట్టునట్లుగా నశోకమందలి పెద్దతీఁగెలవరుసలను వేగముచేఁ జదిపెను. ౨౦

ఆ యశోకవనమందు మనస్సున కింపుగురత్నములు పొదిగిన ప్రదేశములును వెండిజేతులు బంగారుపలకలు పరుపంబడిన సెలవులును నిర్మలమగు నుదకములచే నిండి వెలగలరత్నములమెట్లు గలిగి నానావిధములుగా నిర్మింపఁబడి యందమైనవియు ప్రక్కలనున్న విచిత్రములగు బంగారుచెట్లచే వెలింగి ముత్తె

మహార్హైర్మణిసోపానై రుపపన్నా స్తత స్తతః. ౨౨
ముక్తాప్రవాళసికతాః స్ఫాటికాంతరకుట్టిమాః,
కాంచనై స్తరుభిశ్చిత్రై స్తీరజై రుపశోభితాః. ౨౩
ఫుల్లపద్మోత్పలవనాశ్చక్రవాకోపకూజితాః,
నత్యూహరుతసంఘుష్టా హంససారసనాదితాః. ౨౪
దీర్ఘాభిర్ద్రుమయుక్తాభిస్సరిద్భిశ్చ సమంతతః,
అమృతోపమతోయాభిశ్శివాభి రుపసంస్కృతాః. ౨౫
లతాశతైరవతతా స్సంతానకుసుమావృతాః,
నానాగుల్మావృతఘనాః కరవీరకృతాంతరాః. ౨౬
తతోఽంబుధరసంకాశం ప్రవృద్ధశిఖరం గిరిం,
విచిత్రకూటం కూటైశ్చ సర్వతః పరివారితమ్. ౨౭
శిలాగృహైరవతతం నానావృక్షైస్సమావృతం,
దదర్శ హరిశార్దూలో రమ్యం జగతి పర్వతమ్. ౨౮

దదర్శ చ నగా త్తస్మాన్నదీం నిపతితాం కపిః,
అంకాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్. ౨౯
జలే నిపతితాగ్రైశ్చ పాదపై రుపశోభితాం,
వార్యమాణామివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబంధుభిః. ౩౦
పునరావృత్తతోయాం చ దదర్శ స మహాకపిః,
ప్రసన్నామివ కాంతస్య కాంతాం పునరుపస్థితామ్. ౩౧
తస్యాదూరాత్సపద్మిన్యో నానాద్విజగణాయుతాః,
దదర్శ హరిశార్దూలో హనుమాన్మారుతాత్మజః. ౩౨

కృత్రిమాం దీర్ఘికాం చాపి పూర్ణాం శీతేన వారిణా,
మణిప్రవరసోపానాం ముక్తాసికతశోభితామ్. ౩౩

ములయొక్కయు పగడములయొక్కయుఁ జారుగలిగి స్ఫటికములు పరుపఁ బడినతగ్గలిన్నెలును వికసించినట్టి కమలములయొక్కయు కలువలయొక్కయు సమూహములు గలవియు చక్రవాకపక్షులయొక్క కూఁతలు గలవియు భరత పక్షుల విశేషధ్వని గలవియు హంసలయొక్కయు బెగ్గురుపక్షులయొక్కయు ధ్వనిచే మ్రోఁగుచున్నవియు ఉన్నతములైన వృక్షములు గట్లయందుఁ గలిగి యమృతమువంటి మంగళకరమగునుదకము గలిగినవాఁకలచే నంతటఁ బరిశుద్ధములైయున్నవియు తీఁగెలమొత్తములచే నిండినవియు కల్పవృక్షములు చుట్టును గలవియు పెక్కువిధముల పొదలచేఁ జుట్టఁబడి దట్టమైనదియు గన్నేరుచెట్లు నడుమనడుమ గలవియు నగు బావులను హనుమంతుం డిటునటుఁ దిరుగుచుఁ గాంచెను. ౨౧-౨౬

అటుపై మేఘముతోఁ దుల్యమైనదియు ఉన్నతమైన శిఖరములుగలదియు వింతలగు శిఖరములుగలదియు శిఖరములచే నంతట వ్యాపించునదియు జాలియిండ్లు మెండుగాఁగలదియు సర్వవిధవృక్షములచేతను జుట్టంబడినదియును మనోహరమైనదియు నగు క్రీడాపర్వతమును (ఆటలాడుకొనుటకై మంటిచేఁ జేయంబడిన కొండను), వానరశ్రేష్ఠుఁడు గాంచెను. ౨౭,౨౮

ఆపర్వతమునుండి వెలువడినదియు ప్రియునియొక్క తొడపైనుండి వెలువడినభార్యవలె నున్నదియు పోవలదని చుట్టము లడ్డగింపఁగా వినక యలిగి పోవుచున్న స్త్రీవలె నీటియందుఁ గొనలు వ్రాలియున్న చెట్లచే నొప్పి ప్రవహించుచున్నదియు కోపమునుమాని మరల మగనిఁ జేరవచ్చుచిల్లాలివలె మరలివచ్చుచున్న యుదకముగలదియు నగు నదిని వానరోత్తముఁ డగుహనుమంతుఁడు గాంచెను. ౨౯,౩౧

వానరశ్రేష్ఠుండును వాయుపుత్రుఁడును నగుహనుమంతుఁడు మీఁదఁ జెప్పఁబడిన నదికి దూరమున ననేకవిధము లగుపక్షిసమూహములతోఁ గూడిన తామరతీఁగలను గనియెను. ౩౨

చల్లని నీటిచేత నిండినదియు శ్రేష్ఠమగు రత్నములమెట్లుగలదియు ముత్తెముల యిసుకచే నొప్పినదియు అనేకవిధములగు మృగసమూహముచేఁ

వివిధైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననాం,
ప్రాసాదైస్సుమహాద్భిశ్చ నిర్మితైర్విశ్వకర్మణా. ౩౪

కాననైః కృత్రిమైశ్చాపి సర్వతస్సమలంకృతాం,
యే కేచిత్పాదపాస్తత్ర పుష్పోపగఫలోపగాః. ౩౫

సచ్ఛత్రాస్సవితర్ధికాస్సర్వే సౌవర్ణవేదికాః,
లతాప్రతానైర్బహుభిః పర్ణైశ్చ బహుభిర్వృతామ్. ౩౬

కాంచనీం శింశుపామేకాం దదర్శ హరియూథపః,
వృతాం హేమమయీభిస్తు వేదికాభిస్సమంతతః. ౩౭

తేషాం ద్రుమాణాం ప్రభయా మేరోరివ దివాకరః,
అమన్యత తదా వీరః కాంచనోఽస్మీతి వానరః. ౩౮

సోఽపశ్యద్భూమిభాగాంశ్చ గర్తప్రస్రవణాని చ,
సువర్ణవృక్షానపరాన్ దదర్శ శిఖిసన్నిభాన్. ౩౯

తాం కాంచనైస్తరుగణైర్మారుతేన చ వీజితాం,
కింకిణీశతనిర్ఘోషాం దృష్ట్వా విస్మయమాగమత్. ౪౦

స పుష్పితాగ్రాం రుచిరాం తరుణాంకురపల్లవాం,
తామారుహ్య మహాబాహుశ్శింశుపాం పర్ణసంవృతామ్. ౪౧

ఇతో ద్రక్ష్యామి వైదేహీం రామదర్శనలాలసాం,
ఇతశ్చేతశ్చ దుఃఖార్తాం సంపతంతీం యదృచ్ఛయా. ౪౨

అశోకవనికా చేయం దృఢం రమ్యా దురాత్మనః,
చంపకైశ్చందనైశ్చాపి వకుళైశ్చ విభూషితా. ౪౩

ఇయం చ నలినీ రమ్యా ద్విజసంఘనిషేవితా,

నందమైనదియుం వింతలగువనములు గలదియుం విశ్వకర్మచే నిర్మింపఁబడిన మిక్కిలి గొప్పమేడలచేతను ఉద్యానములచేతను నంతట నలంకరింపఁబడి నదియుం నగు నడబావిని వానరవీరుఁడు గనియెను. ౩౩,౩౪

ఆనడబావికడ మొదళ్లయందుఁ దిన్నె గలవియగు వృక్షములన్నియుం గొడుగువలె దట్టముగ నాకులు గొమ్మలుం గలవియుఁ బూవులు ఫలములు గలవియుం బంగారుతిన్నెలు గలవియునుగా నుండెను. ౩౫

అనేకములగు తీఁగెలమొత్తములచేతను పెక్కాకులచేతను జుట్టఁబడినదియుం బంగారుతిన్నెలచేత నంతటను జుట్టంబడినదియుం నగు నిరుగుడుచెట్టు నొక్కదానిని వానరోత్తముఁ డగుహనుమంతుండు గనియెను. ౩౬,౩౭

ఆహనుమంతుఁడు గుంటలను ఊటలను భూమిభాగములను అగ్నితోఁ దుల్యముగ వెలుంగుచున్న బంగారువృక్షములను గొన్నింటిని గాంచెను. ౩౮

వీరుఁడగు నాంజనేయుఁడు మీఁదఁ జెప్పఁబడిన బంగారుచెట్లసమీపమున నున్నపుడు (మేరువు సమీపమందున్న సూర్యునివలె) దాను బంగారుమయమయిన దేహము గలిగినట్లు తలంచెను. ౩౯

బంగారుచెట్లసమూహముతోఁ గూడినదియు గాలిచే వీవంబడినదియుం పెక్కులగు మువ్వలధ్వనితోఁ గూడినదియుం నగు నశోకవృక్షము గాంచి హనుమంతుఁడు మిక్కిలి యాశ్చర్యపడెను. ౪౦

మిక్కిలి బలశాలి యగుహనుమంతుఁడు పూచికొమ్మలతోఁ గూడినదియుం బ్రకాశించుచున్నదియుం లేఁతచిగుళ్లు గలదియు ఆకులు దట్టముగాఁ గలదియుఁనగు నిరుగుడుచెట్టు నెక్కినవాఁడై "శ్రీరామునిదర్శనమున కాశించుచున్నదియుం దుఃఖముచే నొచ్చి యందిందు వెఱ్ఱిదానివలెఁ దిరుగుచున్నదియుం నగు జానకిని నిచ్చటనుండి చూచెదనుగాక. సంపెఁగఁదీఁగెలచేతను జందనపుమ్రాఁకులచేతను బొగడచెట్లచేతను నలంకరింపఁబడినదై దట్టమై యింపుగనున్నయది పాపాత్ముఁడగురావణునియశోకవనము పక్షులకలకలముతోఁ

ఇమాం సా రామమహిషీ నూనమేష్యతి జానకీ. ౪౪
సా రామా రామమహిషీ రాఘవస్య ప్రియా సతీ,
వనసంచారకుశలా నూనమేష్యతి జానకీ. ౪౫
అథవా మృగశాబాక్షీ వనస్యాస్య విచక్షణా,
వనమేష్యతి సాఽఽర్యేహ రామచింతానుకర్శితా. ౪౬
రామశోకాభిసంతప్తా సా దేవీ వామలోచనా,
వనవాసే రతా నిత్యమేష్యతే వనచారిణీ. ౪౭
వనేచరాణాం సతతం నూనం స్పృహయతే పురా,
రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ. ౪౮
సంధ్యాకాలమనాశ్శ్యామా ధ్రువమేష్యతి జానకీ,
నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ. ౪౯
తస్యాశ్చాప్యనురూపేయమశోకవనికా శుభా,
శుభా యా పార్థివేంద్రస్య పత్నీ రామస్య సమ్మతా. ౫౦
యది జీవతి సా దేవీ తారాధిపనిభాననా,
ఆగమిష్యతి సాఽవశ్యమిమాం శివజలాం నదీమ్. ౫౧

ఏవం తు మత్వా హనుమాన్మహాత్మా
ప్రతీక్షమాణో మనుజేంద్రపత్నీం,
అవేక్షమాణశ్చ దదర్శ సర్వం
సుపుష్పితే పర్ణఘనే నిలీనః. ౫౨

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుర్దశస్సర్గః.

గూడి యీతామరతీఁగె యందమైయున్నది. దీనియందమును జూడ రాముని పట్టపుదేవియగు సీత రాకమానదు. జనకుని ప్రియపుత్త్రికయుం రాఘవునకుఁ బ్రాణసఖియు రామునకుఁ బట్టపుదేవియుం నయినయాయింతి వనవిహారమునందు నేర్పుగలది గావునఁ దప్పక యిందు రాఁగలదు. అట్లుగాక పసిజింకచూపుల వంటి చూపులుగలదియుం రామునిఁ దలఁచి దుఃఖించి బక్కచిక్కి యున్న దియు నగు సీత యీయశోకవనసంచారమందు శ్రద్ధగలదిగావున గుణవతియగు ఆ యిల్లాలు తప్పక యిందు రాఁగలదు. అంచమగుకన్నులుగలదియుఁ శ్రీరాము నెడబాయుటవలని శోకముచేఁ బరితపించుచున్నదియుం విహారమం దాసక్తి గలదియుం వనమందే యుండ నిచ్ఛగలదియు నగుసీత యనుదినము వచ్చు చుండును. జనకుని పుత్త్రికయై ప్రఖ్యాతిగాంచినదియుం శ్రీరామునకుఁబ్రాణము వలెఁ బ్రియమైనదియుం నగుసీత ముందే వానరులకు మేలుం గోరుచున్నది. మనోహరమగురూపము గలదియు యుక్తమగు ప్రాయమందున్నదియు నగు జనకపుత్త్రిక సంధ్యాకాలమును వేచియుండి యీనదియందలి పుణ్యోదకము లతో పరిశుద్ధురాలై యీశ్వరు నారాధింపవచ్చుట సత్యము. ఆసీతాదేవికి మంగళకరమగు నీయశోకవనము తగినదై యున్నది. రాజోత్తముఁ డగు శ్రీరామునియొక్క భార్యయుం నీవనమునకుఁ దగినదై యున్నది. నిండు చంద్రునింబోలు మోముగల యారాముని పట్టపుదేవి జీవించియే యున్నదై నచో నీమంగళకరమగు జలముగలనదికిఁ దప్పక వచ్చును. ౪౧-౫౧

ఇట్లు తలంచి సమర్థుఁ డగుహనుమంతుఁడు మనుజేంద్రుఁడగు రాముని యొక్క భార్యయగు సీతరాక కెదురుచూచుచున్నవాఁడై మెండుగఁ బుష్పించి తఱచుగ నాకులుగలిగియున్న యిరుగుడుచెట్టునం దాఁగి యంతటఁ గనుచుండెను. ౫౨

ఇది పదునాల్గవసర్గము.

## పఞ్చదశస్సర్గః

స వీక్షమాణస్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీం,
అవేక్షమాణశ్చ మహీం సర్వాంతా మన్వవైక్షత. ౧

సంతానకలతాభిశ్చ పాదపైరుపశోభితాం,
దివ్యగంధరసోపేతాం సర్వతస్సమలంకృతామ్. ౨
తాం స నందనసంకాశాం మృగపక్షిభిరావృతాం,
హర్మ్యప్రాసాదసంబాధాం కోకిలాకులనిస్వనామ్. ౩
కాంచనోత్పలపద్మాభిర్వాపీభిరుపశోభితాం,
బహ్వాసనకుథోపేతాం బహుభూమిగృహాయుతామ్. ౪
సర్వర్తుకుసుమై రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః,
పుష్పితానామశోకానాం శ్రియా సూర్యోదయప్రభామ్. ౫
ప్రదీప్తామివ తత్రస్థో మారుతిస్సముదైక్షత,
నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణామివాసకృత్. ౬
వినిష్పతద్భిశ్శతశశ్చిత్రైః పుష్పావతంసకైః,
ఆమూలపుష్పనిచితైరశోకైశ్శోకనాశనైః. ౭
పుష్పభారాతిభారైశ్చ స్పృశద్భిరివ మేదినీం,
కర్ణికారైః కుసుమితైః కింశుకైశ్చ సుపుష్పితైః. ౮

స దేశః ప్రభయా తేషాం ప్రదీప్త ఇవ సర్వతః,
పున్నాగాస్సప్తపర్ణాశ్చ చంపకోద్దాలకాస్తథా. ౯
వివృద్ధమూలా బహవశ్శోభంతే స్మ సుపుష్పితాః,
శాంతకుంభనిభాః కేచిత్కేచి దగ్నిశిఖోపమాః. ౧౦
నీలాంజననిభాః కేచిత్తత్రాఽశోకాస్సహస్రశః,
నందనం వివిధోద్యానం చిత్రం చైత్రరథం యథా. ౧౧

## పదునైదవసర్గము

ఆహనుమంతుఁడాయిరుగుఁడుచెట్టుపైనుండి సీతను వెదకుచున్నవాఁడై యన్నిదిక్కులకుఁ జూపుల వ్యాపింపఁజేయుచు నచ్చటి భూప్రదేశము నంతయుఁ గనియెను. ౧

కల్పవృక్షములయం దల్లిన తీఁగెలచేతను పెక్కువృక్షములచేతను బ్రకాశించునదియు శ్రేష్ఠమగు పరిమళమును రుచియును గలఫలపుష్పములు గలదియు దేవేంద్రునినందనవనముతో సమమైనదియు మృగములచేతను పక్షులచేతను జుట్టుకొనంబడినదియు ధనికులయొక్కయుఁ బ్రభువుల యొక్కయు మేడలచేఁ దఱచైనదియు కోకిలయొక్క కలకలధ్వనిగలదియు బంగారుపుఁగమలములును గలువలును గలబావులచే నందమైనదియు పెక్కు పీఠములు గలదియు రత్నకంబళులు పరువంబడియున్నదియు పెక్కులగు పాతాళగృహములు గలదియు అన్నిఋతువులయందును బుష్పములను గలిగి ఫలములచే నొప్పెడివృక్షములచే మనోహరమైనదియు లెస్సగఁ బూచియున్న యశోకవృక్షములయొక్క కాంతిచే సూర్యోదయకాంతి గలిగి మండుచున్నట్టున్నదియు ఆకులును కొమ్మలును లేకుండఁజేయుటకుఁ గాఁబోలు ననునట్లు విదిలించుచున్న ఱెక్కలతోఁగూడిన పక్షులచే నొప్పినదియు మితిలేక రాలుచున్న నానావర్ణములు గల పుష్పములచే మొదళ్లయందు దట్టమైయున్నట్టియు మనోవేదనను బాపునట్టియుఁ బుష్పములభారముచే భూమి నంటుచున్నట్టియు నశోకవృక్షములచేతను పూచిన కొండగోఁగులచేతను బాగుగఁ బుష్పించియున్న మోదుగుచెట్లచేతను జారుతరంబైనయశోకవనమును హనుమంతుఁడు గనియెను. ౨-౮

ఆ యశోకవృక్షములకాంతిచే నాచోటెల్ల మండుచున్నట్లుండెను. మొదళ్లు బలిసియున్నవియు బాగుగఁ బుష్పించియున్నవియు లెక్కకు మించియున్నవియు నగుపొన్నచెట్లును ఏడాకులయరఁటిచెట్లును సంపంగి యుద్దాలకము లనుచెట్లును కొన్ని బంగారుచాయయుఁ గొన్ని యగ్నిజ్వాలలయొక్క కాంతియుఁ గొన్ని కాటుకవలెఁ బ్రకాశముగలవియు నగుచున్న యశోకవృక్షములు నచ్చో మితిలేక ప్రకాశించుచుండెను. అందందుఁ జిన్నచిన్న వన

అతివృత్తమివాచింత్యం దివ్యం రమ్యం శ్రియావృతం,
ద్వితీయమివ చాకాశం పుష్పజ్యోతిర్గణాయుతమ్. ౧౨
పుష్పరత్నశతైశ్చిత్రం పంచమం సాగరం యథా,
సర్వర్తుపుష్పైర్నిచితం పాదపైర్మధుగంధిభిః. ౧౩
నానానినాదైరుద్యానం రమ్యం మృగగణైర్ద్విజైః,
అనేకగంధప్రవహం పుణ్యగంధం మనోరమమ్. ౧౪
శైలేంద్రమివ గంధాఢ్యం ద్వితీయం గంధమాదనం,

అశోకవనికాయాం తు తస్యాం వానరపుంగవః. ౧౫
స దదర్శావిదూరస్థం చైత్యప్రాసాదముచ్ఛ్రితం,
మధ్యే స్తంభసహస్రేణ స్థితం కైలాసపాండురమ్. ౧౬
ప్రవాళకృతసోపానం తప్తకాంచనవేదికం,
ముష్ణంతమివ చక్షూంషి ద్యోతమానమివ శ్రియా. ౧౭
విమలం ప్రాంశుభావత్వాదుల్లిఖంతమివాంబరం,
తతో మలినసంవీతాం రాక్షసీభిస్సమావృతామ్. ౧౮
ఉపవాసకృశాం దీనాం నిశ్శ్వసంతీం పునః పునః,
దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖామివామలామ్. ౧౯
మందం ప్రఖ్యాయమానేన రూపేణ రుచిరప్రభాం,
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః. ౨౦
పీతేనైకేన సంవీతాం క్లిష్టేనోత్తమవాససా,
సపంకామనలంకారాం విపద్మామివ పద్మినీమ్. ౨౧
వ్రీళితాం దుఃఖసంతప్తాం పరిమ్లానాం తపస్వినీం,
గ్రహేణాంగారకేణేవ పీడితామివ రోహిణీమ్. ౨౨

ములతోఁ గూడియున్న యింద్రుని యుద్యానమువలెను కుబేరునివనముంబోలె వింతయైనదియు మితిమించిన సొంపుగలది యగుటచే వర్ణింపఁ దరముకానిదియు కాంతిచే నొప్పి యుంపైయున్నదియు ఆకాశము చుక్కలచేఁ బ్రకాశించునట్లు పుష్పములచేతఁ బ్రకాశించుచున్నదియు పుష్పములనెడు రత్నముల యొక్క కాంతిచే నొప్పియైదవసముద్రమువలె వింతగనున్నదియు అన్నిఋతువులయందును ఋష్పములు గలవియుఁ దేనెవాసన గలవియు నైన చెట్లచేఁ దఱుచుగ నున్నదియు పెక్కుధ్వనులుగల మృగములయొక్కయుఁ బక్షులయొక్కయు సమూహముచే రమ్యమైనదియు పెక్కు వాసనలను ధరించియున్నదియు పవిత్రమగు వాసనగలిగి మనోహరమైనదియు పర్వతశ్రేష్ఠములవలెఁ బరిమళమును గ్రక్కుచున్నదియు రెండవగంధమాదనపర్వతమువలె సుగంధమును వెదజల్లుచున్నదియు నగుసావనమును హనుమంతుఁడు గనియెను. ౯-౧౪

వానరశ్రేష్ఠుం డగు నాహనుమంతుండు ఆయశోకవనికయందే కొంత సమీపంబున నత్యున్నతంబై నడుమ వేయి స్తంభంబులచే మోయఁబడుచుఁ గైలాస పర్వతంబుంబోలెఁ దెల్లనై పవడములతోఁ జేసిన నడికట్లును మంచి బంగారముతోఁ జేసిన తిన్నెలునుగల్గి యధికముగాఁ గాంతిగల్గుటం జేసి కండ్లఁబొగొట్టునంతతీక్ష్ణంబై నిర్మలంబై యౌన్నత్యంబును నాకాశమునొరయునట్లు చూపట్టుచున్న బౌద్ధాలయమువలె నిర్మితంబయినప్రాసాదంబును జూచెను. ౧౫-౧౭

అంత మలినవస్త్రంబు ధరించి రాక్షసస్త్రీలచేఁ బరివృతయై ఉపవాసంబులచే శుక్లపక్షాదియందలి చంద్రరేఖయుంబోలెఁ గృశించియున్నదై దీనయై మాటిమాటికి నిట్టూర్పులు పుచ్చుచు మిక్కిలియుఁ గృశయు మాలిన్యముతోఁగూడినదియుఁ గావునఁ గొంచెముగా గుఱుతుపెట్టఁదగిన రూపంబుతోఁ గూడి మనోహరంబగు కాంతి గలిగి ధూమజాలంబునం గప్పఁబడినయగ్నిజ్వాల భంగిం జూపట్టుచు పీతవర్ణంబును జీర్ణంబు నగు నొక్కటే యుత్తమవస్త్రంబు దాల్చి పతివ్రతయగుటవలన దేహసంస్కారాదులు చేసికొనకుండుటం జేసి దేహమునం దెచ్చుగా మురికిగల్గియు నలంకారములు చేసికొనక యుండుటచేఁ గమలంబులులేని తామరకొలంకులకైవడిఁ గాంతిఁ దఱిగి తలవంచుకొని దుఃఖం

అశ్రుపూర్ణముఖీం దీనాం కృశామనశనేన చ,
శోకధ్యానపరాం దీనాం నిత్యం దుఃఖపరాయణామ్. ౨౩
ప్రియం జనమపశ్యంతీం పశ్యంతీం రాక్షసీగణం,
స్వగణేన మృగీం హీనాం శ్వగణాభివృతామివ. ౨౪
నీలనాగాభయా వేణ్యా జఘనం గతయైకయా,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ. ౨౫
సుఖార్హాం దుఃఖసంతప్తాం వ్యసనానామకోవిదాం,

తాం సమీక్ష్య విశాలాక్షీమధికం మలినాం కృశామ్. ౨౬
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః,

హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా. ౨౭
యథారూపా హి దృష్టా వై తథారూపేయమంగనా,

పూర్ణచంద్రాననాం సుభ్రూం చారువృత్తపయోధరామ్. ౨౮
కుర్వంతీం ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః,
తాం నీలకేశీం బింబోష్ఠీం సుమధ్యాం సుప్రతిష్ఠితామ్. ౨౯
సీతాం పద్మపలాశాక్షీం మన్మథస్య రతిం యథా,
ఇష్టాం సర్వస్య జగతః పూర్ణచంద్రప్రభామివ. ౩౦
భూమౌ సుతనుమాసీనాం నియతామివ తాపసీం,
నిశ్శ్వాసబహుళాం భీరుం భుజగేంద్రవధూమివ. ౩౧
శోకజాలేన మహతా వితతేన న రాజతీం,
సంసక్తాం ధూమజాలేన శిఖామివ విభావసోః. ౩౨

బున వాఁడు వాలిన మేను గలిగి చూచువారికి దుఃఖంబును గల్గించునట్టి కష్టావస్థ నొంది అంగారకగ్రహంబుచేఁ బీడింపఁబడిన రోహిణీనక్షత్రంబుంబోలెఁ బొల్పరి నేత్రంబులఁ గన్నీరు నించుచు భయమునొందినదై యాహారంబు దీసి కొనకుండుటంజేసి కృశించినదై యెల్లప్పుడును దుఃఖించుచుఁ జింతించుచు ప్రియజనులం గానక రాక్షసస్త్రీలం జూచుచు లేళ్లంబాసి కుక్కలచేఁ గాఱియ పెట్టఁబడు లేడికైవడి విలపించుచు సంస్కారంబు లేకుండుటచే నొకటిగాఁ జుట్టుకొని కృష్ణసర్పమువలె నల్లగా జఘనంబుపై వ్రేలఁగాడుచున్న తలవెండ్రుకల జడతోఁ గూడి యట్లు శరదృతువునందు నల్లనివనపంక్తితోఁ గూడియుండు భూమియుంబోలెఁ జూపట్టుచున్నదాని సుఖంబునుమాత్ర మనుభవింపఁదగినదియుఁ దుఃఖితయుం నెప్పుడును వ్యసనంబుల ననుభవింపనిదియు నగుదాని నొక్కవనితం జూచెను. ౧౮-౨౧

అట్లు మిగుల మలినయయి కృశించియున్న యావనితం జక్కఁగాఁ జూచి యాహనుమంతుఁడు సరియయిన కారణముచేత "ఈబిడయే సీత" యని యూహించెను. ౨౨

అప్పుడు కామరూపియగు రాక్షసుఁడు కొనిపోవఁగా మేము చూచిన స్త్రీ కేరూపం బుండినదో అదేరూపం బీబిడ కున్నది. అని హనుమంతుఁ డూహించెను. ౨౩

నిండుచందురునింబోలు ముఖంబును సుందరంబులయిన కనుబొమ్మలును సుందరంబులు గుండ్రంబులు నగు స్తనంబులును గల్గి దేహప్రభచే సమస్తదిక్కుల చీకట్లనుం బోఁగొట్టుచు నల్లనివెండ్రుకలతో దొండపండువంటి పెదవితోను సుందరం బగునడుముతోనుం జెలంగుచు పాతివ్రత్యమందు స్థైర్యంబు గలిగి తామరఱేకులుంబోలె విశాలసుందరంబులగు నేత్రంబులతోఁ గూడి మన్మథునిభార్యయగు రతియుంబోలె నొప్పుచు సమస్తలోకంబులకును సమ్మతయై నిండుచందురునికాంతిఁబోలు కాంతిగలదై నేలంగూర్చున్నదై కృశించియున్న దేహముగలదై నియమం బవలంబించియుండు తాపసియుంబోలెఁ జూపట్టుచు భయంబునొంది యెచ్చుగా నిట్టూర్పులుపుచ్చుచు నాగకన్య

తాం స్మృతీమివ సందిగ్ధామృద్ధిం నిపతితామివ,
విహతామివ చ శ్రద్ధామాశాం ప్రతిహతామివ. ౩౩

సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ,
అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ. ౩౪

రామోపరోధవ్యథితాం రక్షోహరణకర్శితాం,
అబలాం మృగశాబాక్షీం వీక్షమాణాం తతస్తతః. ౩౫

బాష్పాంబుపరిపూర్ణేన కృష్ణవక్త్రాక్షిపక్ష్మణా,
వదనేనాప్రసన్నేన నిశ్శ్వసంతీం పునః పునః. ౩౬

మలపంకధరాం దీనాం మండనార్హామమండితాం,
ప్రభాం నక్షత్రరాజస్య కాలమేఘైరివావృతామ్. ౩౭

తస్య సందిదిహే బుద్ధిర్ముహుస్సీతాం నిరీక్ష్య తు,
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ. ౩౮

దుఃఖేన బుబుధే సీతాం హనుమాననలంకృతాం,
సంస్కారేణ యథా హీనాం వాచ మర్థాంతరం గతామ్. ౩౯

తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీమనిందితాం,
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః. ౪౦

కయుంబోలెఁ గనుపట్టుచు నధికంబుగా దుఃఖంబుగలది కావునఁ బ్రకాశింపకున్న దియై పొగలచేఁ గప్పబడిన యగ్నిజ్వాలయుంబోలెఁ జూడనగుచు, సందేహంబుతోఁ గూడిన యర్థంబుగల స్మృతియుంబోలె నిరోగించుట కశక్తయై తఱిగినసంపదయుంబోలె కాంతిదగ్గినదై ఫలాభావంబునంజేసి తగ్గిన శ్రద్ధకైవడి సాఫల్యంబులేకుండుటవలన వ్యర్థమయినయాశపగిది విఘ్నంబునొందిన కార్యసిద్ధిభంగి కపటసహితంబగుబుద్ధిరీతి నపవాదంబుచేఁ దఱిగిన కీర్తిపోల్కి క్షీణరూపయై రామసంగమంబు లేమింజేసి దుఃఖితయై రాక్షసుఁ డగురావణునిచే నపహరింపఁబడుటవలనఁ గృశించినదేహంబు గలదై యబలయు జింకపిల్లలకుంబోలెఁ జంచలనేత్రంబులు గలదియుఁ గావున నాల్గుప్రక్కలం జూచుచుఁ గన్నీళ్లునిండి నల్లనివియు వంకరయుం నగు కనురెప్పలుగల్గి యప్రసన్నంబైయున్న ముఖంబుతోఁ గూడి మాటిమాటికి నిట్టూర్పులు పుచ్చుచు మలినదేహయై గర్వంబుడిగినదై యలంకారార్హయయునను భర్తృవిరహంబునంజేసి యలంకారంబు చేసికొనక కాలమేఘంబులచేఁ గప్పఁబడిన చంద్రుని కాంతియుంబోలెఁ జూడనగుచున్న సీతను హనుమంతుఁడు చూచెను. ౨౮-౩౭

అభ్యాసము లేకుండుటవలన మరవఁబడిన విద్యయుంబోలెఁ గృశించియున్నసీతను మాటిమాటికిం జూచి యాహనుమంతుఁడు "ఈయమ యిట్లు కృశించి మలినదేహయై యున్నదే, సీత యానో, కాదో" అని సందేహము నొందెను. ౩౮

పండితుఁడు కానివాఁడు పలుకుమాటను అతనికి శబ్దవ్యుత్పత్తి లేనందువలన చక్కఁగా పలుకఁజాలఁడు. కావున ఆమాట యతఁడు చెప్పఁదలఁచిన యర్థమును విడిచి మఱియొక్కయర్థమును బోధించుటఁజేసి పండితుఁడు పూర్వోత్తరసందర్భము నాలోచించి బహుకష్టంబునం దెలిసికొనునట్లు హనుమంతుఁడు అలంకారంబులేక యుపవాసాదులచే మాఱురూపునొంది యున్నసీతను రాముండు చెప్పినగుఱుతుల నాలోచించి బహుకష్టంబునం దెలిసికొనెను. ౩౯

ఆ హనుమంతుఁడు నిందింపఁబడనిదియును రాచకుమార్తెయుం నగుసా సీతం జూచి సరియయినకారణములచేత సీత యని యూహించెను. ౪౦

వైదేహ్యా యాని చాంగేషు తదా రామోఽన్వకీర్తయత్,
తాన్యాభరణజాలాని శాఖాశోభీన్యలక్షయత్. ౪౧

సుకృతౌ కర్ణవేష్టౌ చ శ్వదంష్ట్రౌ చ సుసంస్థితౌ,
మణివిద్రుమచిత్రాణి హస్తేష్వాభరణాని చ. ౪౨

శ్యామాని చిరయుక్తత్వాత్తథా సంస్థానవంతి చ,
తాన్యేవైతాని మన్యేఽహం యాని రామోఽన్వకీర్తయత్.

తత్ర యాన్యవహీనాని తాన్యహం నోపలక్షయే,
యాన్యస్యా నావహీనాని తానీమాని న సంశయః, ౪౪

పీతం కనకపట్టాభం స్రస్తం తద్వసనం శుభం,
ఉత్తరీయం నగాసక్తం తదా దృష్టం ప్లవంగమైః. ౪౫

భూషణాని చ ముఖ్యాని దృష్టాని ధరణీతలే,
అనయైవాపవిద్ధాని స్వనవంతి మహాంతి చ. ౪౬

ఇదం చిరగృహీతత్వాద్వసనం క్లిష్టవత్తరం,
తథాఽపి నూనం తద్వర్ణం తథా శ్రీమద్యథేతరత్. ౪౭

ఇయం కనకవర్ణాంగీ రామస్య మహిషీ ప్రియా,
ప్రణష్టాపి సతీ యాఽస్య మనసో న ప్రణశ్యతి. ౪౮

ఇయం సా యత్కృతే రామశ్చతుర్భిః పరితప్యతే,
కారుణ్యేనానృశంస్యేన శోకేన మదనేన చ. ౪౯

రాముండు హనుమంతుఁడు బయలుదేఱునపుడు ఆనవాలు కాసీత యేయే యాభరణంబుల ధరించుచున్నదని చెప్పెనో సీత పతివ్రత యగుటంజేసి భర్తృవిరహకాలంబున ధరింపరాదని తలంచి చెట్టుకొమ్మలకుఁ గట్టియున్న సుందరంబు లగుకుండలంబులు శ్వదంష్ట్రంబులను కర్ణాభరణంబులును మణులును బవడములుగూర్చి నిర్మింపఁబడినవియుం విరహబాధవలన నలుపుదగిలియున్నవియు నగు హస్తాభరణములు మొదలగు నాయాభరణంబుల నన్నింటిని మఱియుం సీతదేహంబున వానిధరించుచోట్ల నేర్పడియుండు ముద్రలనుం జూచెను. ౪౧-౪౨

రాముం డేయాభరణంబుల నానవాలుగాఁ జెప్పెనో అవియే యీ యాభరణంబు లని తలంచెదను. ౪౩

ఆ ఋశ్యమూకపర్వతంబునందు ఈసీత యే యాభరణంబులఁ బడవైచెనో ఆ యాభరణంబు లిప్పుడు నా కగుపడలేదు. అప్పుడు పాఱవేయఁబడని వీ యాభరణంబులు, అందు సందేహములేదు. ౪౪

ఈసీత యా ఋశ్యమూకపర్వతంబుపైఁ బడవైచిన పసుపురంగు గల్గి బంగారుపట్టెంబోలె వెలుంగుచున్న పయఁటవేసుకొనువస్త్రమును సుగ్రీవాది వానరులు చూచినారు. ౪౫

ఈబిడచేతను నేలం బడవైవఁబడి గల్లుగల్లు మని మ్రోగుచున్న శ్రేష్ఠములగు భూషణంబులును జూడఁబడినవి. ౪౬

ఈవస్త్రము బహుకాలముగా విడువక ధరింపఁబడుటంజేసి మిగుల నలిగియున్నది. అయినను మునుపు పర్వతంబుపైఁ బడవైవఁబడినదానియట్లు అదే రంగును అదే కాంతియును గల్గియున్నది. ౪౭

ఎవ్వతె రావణుఁ డపహరించుటచేఁ గండ్ల కగపడకున్నను రామునిచే నెల్లపుడు మనంబున ధ్యానింపఁబడుచుండుటంజేసి విడువక శ్రీరామునిమనంబున కగపడుచుండునో అట్టిరాముని ప్రియభార్యయయినసీతయే యీవనిత.

రాముం డేసీతనుగుఱించి సాధారణంబుగా నెవ్వఁడు నాపత్సమయంబున రక్షింపవలసిన స్త్రీ యగపడకపోయినదే యెంత శ్రమపడుచున్నదో అని దయవలనను, "త న్నాశ్రయించినదాని రక్షించుటకు లేకపోయినదే" యని

స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాదాశ్రితేత్యానృశంస్యతః,
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ. ౫౦

అస్యా దేవ్యా యథా రూపమంగప్రత్యంగసౌష్ఠవం,
రామస్య చ యథారూపం తస్యేయమసితేక్షణా. ౫౧

అస్యా దేవ్యా మనస్తస్మింస్తస్య చాస్యాం ప్రతిష్ఠితం,
తేనేయం స చ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి. ౫౨

దుష్కరం కృతవాన్రామో హీనో యదనయా ప్రభుః,
ధారయత్యాత్మనో దేహం న శోకేనావసీదతి. ౫౩

దుష్కరం కురుతే రామో య ఇమాం మత్తకాశినీం,
సీతాం వినా మహాబాహుర్ముహూర్త మపి జీవతి. ౫౪

ఏవం సీతా తదా దృష్ట్వా హృష్టః పవనసమ్భవః,
జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్. ౫౫

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చదశస్సర్గః.

యనుతాపంబువలన, "సాభార్య సాదేహముల సగమని వేదములఁ జెప్పఁ బడినది. సమస్తధర్మంబులు సేయుటకును సహాయురాలు అగపడలేదే" యని దుఃఖంబువలనను "నాప్రియురా లెచ్చటనో యగపడలేదే విరహబాధ నోర్వలేనే" యని మన్మథబాధవలనను ఇట్లు దయచేతను అనుతాపముచేతను దుఃఖముచేతను మన్మథబాధచేతను నాలుగింటను బాధపడుచున్నాఁడో ఆ సీతయే యీబిడ. ౪౮-౫౦

ఈసీత కెట్లు సౌందర్యంబును దేహావయవంబుల చక్కఁదనము నున్నవో రామునకును అట్లేయున్నవి. కావున రామున కీబిడ తగియున్నది.౫౧

ఈసీత మనసు రామునియందును రామునిమనసు సీతయందును స్థిరముగా నెలకొనియున్నది. అట్లు మనసువ నొకరినొకరు చూచుకొనుచుండుట వలననే ఈసీతగాని ధర్మాత్ముండగు నారాముండుగాని యింతవరకు బ్రతికియున్నారు. ౫౨

రాముండు సీతను విడిచియును దేహంబు ధరించియున్నాఁడే సీత మాత్రము స్వతంత్రురాలు కాదు. కావున దేహంబు విడుచుటకు శక్తురాలు కాదు. రాముఁడు పురుషుండు కావున స్వతంత్రుండు. అట్లుండఁగ దుఃఖంబున దేహంబు విడువక జీవించియుండుట చాల నాశ్చర్యకరముగా నున్నది. మఱియెవ్వరును ఇట్లుండఁజాలరు. ౫౩

మదంబుచేఁ బ్రకాశించునట్టి యుత్తమవనితయయిన యీసీతను విడిచి యింతవఱకు బ్రతికియున్నాఁడు కావున మహాబాహుండగు రాముండు ఎట్టివారికిఁ జేయ నశక్యమయినకార్యమును జేయుచున్నాఁడు. అని హనుమంతుఁడు చింతించెను. ౫౪

వాయుదేవునికుమారుం డగుహనుమంతుం డప్పుడు ఇట్లు సీతంజూచి సంతోషంబునొంది మనంబున రాముని దలంచుకొని సమస్తలోకనాయకుం డగు నారామునిం బొగడెను. ౫౫

ఇది పదునైదవసర్గము.

## షోడశస్సర్గః

ప్రశస్య తు ప్రశస్తవ్యాం సీతాం తాం హరిపుంగవః,
గుణాభిరామం రామం చ పునశ్చింతాపరోఽభవత్. ౧
స ముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః,
సీతామాశ్రిత్య తేజస్వీ హనుమాన్విలలాప హ. ౨

మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా,
యది సీతాఽపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః. ౩

రామస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ ధీమతః,
నాత్యర్థం క్షుభ్యతే దేవీ గంగేవ జలదాగమే. ౪

తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణాం,
రాఘవోఽర్హతి వైదేహీం తం చేయమసితేక్షణామ్. ౫

తాం దృష్ట్వా నవహేమాభాం లోకకాంతామివ శ్రియం,
జగామ మనసా రామం వచనం చేదమబ్రవీత్. ౬
అస్యా హేతోర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః,
రావణప్రతిమో వీర్యే కబంధశ్చ నిపాతితః, ౭
విరాధశ్చ హతస్సంఖ్యే రాక్షసో భీమవిక్రమః,
వనే రామేణ విక్రమ్య మహేంద్రేణేవ శంబరః. ౮

చతుర్దశసహస్రాణి రక్షసాం భీమకర్మణాం,
నిహతాని జనస్థానే శరైరగ్నిశిఖోపమైః. ౯

## పదునాఱవసర్గము

వానరశ్రేష్ఠుం డగుహనుమంతుండు ప్రశంసింపఁదగినసీతాదేవిని గుణవంతుఁడగు రామునిం బ్రశంసించి మరలఁ జింతలో మునింగెను. ౧

మహాపరాక్రమశాలి యగుహనుమంతుండు కొంచెముసేపు ఆలోచించి యంతఁ గన్నీట దోఁగుచుండు నేత్రములతో సీతనుగుఱించి యిట్లని విలపించెను. ౨

గురువులచే శిక్షింపఁబడి ధార్మికుం డైనలక్ష్మణునిచేఁ బూజింపఁదగినదై రామునకుఁ బ్రియురాలై యున్నసీతకును దుఃఖము గలిగినది. కావున కాలము నతిక్రమింప నేరికి నలవిగాదు. ౩

ఈసీతాదేవి రాముని పరాక్రమంబును బుద్ధిమంతుఁ డగులక్ష్మణుని పరాక్రమంబునుం దెలిసినది కావున వారలు ద న్నెట్టయిన శత్రువుం జంపి మరలఁ గొనిపోవుదురని నమ్మి యెచ్చుగాఁ దుఃఖింపకున్నది. ౪

రాముండు తన కెచ్చుతక్కువలు లేక స్వభావంబునకును వయసునను సదాచారంబునను గులంబునను శుభలక్షణంబులను సమానుఁడైయుండు సీతకుఁ దగియున్నాఁడు. నల్లనికండ్లుగల యీసీతయును ఆరామునకుఁ దగియున్నది. అని హనుమంతుండు దలంచెను. ౫

ఆ హనుమంతుఁడు నూతనం బగుబంగారముం బోలెఁ దేజరిల్లుచుఁ బ్రపంచమునకంతయుఁ బ్రియయయి లక్ష్మీదేవిం బోలియున్న సీతం జూచి రాముం దలంచుకొని యిట్లని తనలోఁ దాను చెప్పుకొనెను. ౬

పెద్దనేత్రంబులు గల యీసీతకుఁ గానే రాముండు అధికమయిన బలముగలవాలిని బరాక్రమంబున రావణునితో సరివచ్చు కబంధునిఁ జంపెను. ౭

మఱియుం నీసీతకుఁగానే రాముండు దేవేంద్రుండు శంబరాసురుని జంపినట్లు వనంబునఁ బరాక్రమించి యుద్ధంబునందు మహాపరాక్రమశాలి యగు విరాధుం డనురాక్షసుని జంపెను. ౮

మఱియు నీబిడకుఁగానే రాముఁడు జనస్థానంబునందు భయంకరమగు పరాక్రమము గలవారలఁ బదునాలుగువేలరాక్షసుల నగ్నిజ్వాలలంబోలు బాణంబులచేఁ జంపెను. ౯

ఖరశ్చ నిహతస్సంఖ్యే త్రిశిరాశ్చ నిపాతితః,
దూషణశ్చ మహాతేజా రామేణ విదితాత్మనా. ౧౦
ఐశ్వర్యం వానరాణాం చ దుర్లభం వాలిపాలితం,
అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతమ్. ౧౧

సాగరశ్చ మయా క్రాన్తశ్శ్రీమాన్నదనదీపతిః,
అస్యా హేతోర్విశాలాక్ష్యాః పురీచేయం నిరీక్షితా. ౧౨
యది రామస్సముద్రాన్తాం మేదినీం పరివర్తయేత్,
అస్యాః కృతే జగచ్చాపి యుక్తమిత్యేవ మే మతిః. ౧౩

రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా,
త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్కలామ్. ౧౪

ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః,
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా. ౧౫
ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే,
పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః. ౧౬
విక్రాన్తస్యార్యశీలస్య సంయుగేష్వనివర్తినః,
స్నుషా దశరథస్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ. ౧౭
ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య రామస్య విదితాత్మనః,
ఇయం సా దయితా భార్యా రాక్షసీవశమాగతా. ౧౮

సర్వాన్భోగాన్పరిత్యజ్య భర్తృస్నేహబలాత్కృతా,
అచిన్తయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్. ౧౯
సన్తుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణే రతా,

ఆత్మజ్ఞానంబు గలరాముం డీబిడకుఁగానే యుద్ధంబున ఖరుని త్రిశిరుని మహాపరాక్రమశాలి యగుదూషణునిం జంపెను. ౧౦

ఈబిడవలననే సుగ్రీవుఁడు దుర్లభంబును లోకంబున గౌరవంబు నొందినదియు నగు వాలి యధీనముగ నుండు వానరుల నైశ్వర్యంబు నొందెను. ౧౧

ఈసీతకుఁగా నేను శ్రీమంతంబును నదంబులకును నదులకును బ్రభువు నగు సముద్రంబును దాఁటివచ్చి యీ లంకాపట్టణంబును జూచినాను. ౧౨

ఇట్టి సీతకుఁగా రాముండు సముద్రపర్యంతం బగు భూమినంతయును సమస్తలోకంబులనుగూడఁ దలక్రిందుగాఁ జేసినను అదియుం యుక్తమేయని నాకుఁ దోఁచుచున్నది. ౧౩

త్రైలోక్యరాజ్యం బెచ్చా? జనకుని కొమార్తె యగుసీత యెచ్చా? యని యోచింతుమేని త్రైలోక్యరాజ్యంబంతయుం సీతయొక్క పదియాఱవ పాలునకు సరికాదు. ౧౪

ధర్మస్వభావుండు మిథిలాధిపతియును మహాత్ముండు నగు జనక మహారాజు కొమార్తెయుం దృఢమయిన పాతివ్రత్యము గలదియుఁ దామర పూవరాగంబులంబోలునట్టి మంగళకరంబు లగుయాగ క్షేత్రపరాగంబులచేతఁ గప్పఁబడిన నాఁగటికఱ్ఱున దున్నఁబడినక్షేత్రంబున భూమిని భేదించుకొని యుద్భవించినదియు నగునాసీత యీబిడయే. ౧౫-౧౬

ఈబిడే పరాక్రమశాలియుఁ, బూజ్యం బగుస్వభావముగలవాఁడును, యుద్ధంబుల వెనుదీయనివాఁడు నగుదశరథమహారాజుయొక్క పెద్దకోడలు. ౧౭

సమస్తధర్మంబుల నెఱింగినవాఁడును కృతజ్ఞుండును బరమాత్మజ్ఞానము కలవాఁడు నగు రాముని ప్రియభార్య యయినట్టి యీసీత రాక్షసస్త్రీలచేతఁ జిక్కియున్నది. ౧౮

భర్తయందలి స్నేహాబలంబునంజేసి సమస్తభోగంబులు విడిచి దుఃఖం బులం దలంపక నిర్జనంబగువనంబుఁ బ్రవేశించి పూర్వము మిక్కిలియు మధుర మయినయాహారమును భుజించుచుండినదయ్యు నడవియందు పండ్లకును కంద ములకును దృప్తిఁజెందుచు భర్త కెప్పుడు నేమఱక శుశ్రూష సేయుచు

యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా. ౨౦
సేయం కనకవర్ణాంగీ నిత్యం సుస్మితభాషిణీ,
సహతే యాతనామేతామనర్థానామభాగినీ. ౨౧

ఇమాం తు శీలసంపన్నాం ద్రష్టుమర్హతి రాఘవః,
రావణేన ప్రమథితాం ప్రపామివ పిపాసితః. ౨౨

అస్యా నూనం పునర్లాభాద్రాఘవః ప్రీతిమేష్యతి,
రాజా రాజ్యపరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీమ్. ౨౩
కామభోగైః పరిత్యక్తా హీనా బంధుజనేన చ,
ధారయత్యాత్మనో దేహం తత్సమాగమకాంక్షిణీ. ౨౪

నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్పుష్పఫలద్రుమాన్,
ఏకస్థహృదయా నూనం రామమేవానుపశ్యతి. ౨౫

భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి,
ఏషా తు రహితా తేన భూషణార్హా న శోభతే. ౨౬

దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః,
ధారయత్యాత్మనో దేహం న దుఃఖేనావసీదతి. ౨౭

ఇమామసితకేశాంతాం శతపత్రనిభేక్షణాం,
సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః. ౨౮

గృహంబున నుండునప్పుడు సంతోషంబు నొందుచుండునట్లే వనంబునందును మిగుల సంతోషంబు నొందుచున్నదియు బంగారువంటి మేను గలదియు నెల్లప్పుడును చిఱునవ్వుతో మాటలాడునదియు సాహసలం బొంద నర్హురాలు కానిదియు నగునట్టి యీసీత యిప్పు డిట్టి మహాదుఃఖంబు సహించుచున్నదే! ఏమన వచ్చును! ౧౯-౨౦

దప్పిగొనినవాఁడు చలిపందిరినిఁ జూచునట్లు రాముండు సదాచారముతోఁ గూడినదై రావణునిచేఁ గాఱియపెట్టఁబడుచున్న యీసీతం జూడ వలయును. ౨౧

రాజ్యంబుఁ బోఁగొట్టుకొన్నరాజు మరల రాజ్యముం బొంది సంతోషమునొందునట్లు రాముఁడు మరల సీతం బొంది సంతోషంబు నొందఁగలఁడు.

ఈసీత తలకుఁ బువ్వులు గంధములు మున్నగు భోగపదార్థములు లేకపోయినను బంధువులు లేకున్నను రామసమాగమంబు గోరునది కావున "జీవించియుండినచో నెప్పుడయినను రాముని గూడవచ్చును" అని తలంచి దేహంబునఁ బ్రాణంబులు ధరించియున్నది. ౨౪

ఈసీత యిప్పు డీరాక్షసస్త్రీలఁ జూడదు. రాముని విరహకాలంబున ఫలపుష్పంబులతోఁ గూడిన యీవృక్షంబులును రాక్షసస్త్రీలుంబోలెఁ జూడ వికృతములుగా నుండుటవలన వానినిం జూడదు. ఏకాగ్రచిత్తయయి మనంబున ఇతరము సర్వము విడిచి రామునిమాత్రమే ధ్యానించుచున్నది. ఇది నిశ్చయము. ౨౫

పెనిమిటి యనఁగా స్త్రీకి భూషణముకన్నను అధికమయిన యలంకారము. భూషణంబుల ధరింపఁదగినదగు నీ సీత అట్టిపెనిమిటి లేకుండుటచే నెంతమాత్రము ప్రకాశింపకున్నది. ౨౬

లోకనాయకుం డగు రాముఁడు [illegible] యుండును దుఃఖంబుచే వ్రాలినొందక దేహంబు ధరించుచున్నాఁ[illegible] ఇది మఱియెవ్వరికిని జేయునలవి గాదు. ౨౭

నల్లని చెంద్రుకకొనలుగల్గినదియు తామరపూవులవంటికండ్లతో నొప్పుచున్నదియు సుఖంబుమాత్ర మనుభవింపఁ దగినదియు నగు సీసీత దుఃఖంబు

క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యాం,
సా రాక్షసీభిర్వికృతేక్షణాభి
స్సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే. ౨౯

హిమహతనలినీవ నష్టశోభా
వ్యసనపరంపరయా నిపీడ్యమానా,
సహచరరహితేవ చక్రవాకీ
జనకసుతా కృపణాం దశాం ప్రపన్నా. ౩౦

అస్యా హి పుష్పావనతాగ్రశాఖా
శ్శోకం దృఢం వై జనయన్త్యశోకాః,
హిమవ్యపాయేన చ మందరశ్మి
రభ్యుత్థితో నైకసహస్రరశ్మిః. ౩౧
ఇత్యేవమర్థం కపిరన్వవేక్ష్య
సీతేయమిత్యేవ నివిష్టబుద్ధిః,
సంశ్రిత్య తస్మిన్నిషసాద వృక్షే
బలీ హరీణామృషభస్తరస్వీ. ౩౨

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షోడశస్సర్గః.

పొందుటం జూడఁగా నీవిధదుఃఖముతోఁగాని సుఖముతోఁగాని యెంతమాత్రము సంబంధములేని మధ్యస్థుండనగు నామనసునకును దుఃఖము గలుగుచున్నది. ఇంక నీ సీతకుఁ బ్రియుండగు రామునకు దుఃఖము గలుగునని చెప్పనేల? ౨౮

పూర్వమెవతెను రాముండును లక్ష్మణుండును రక్షింపుచుండిరో భూమియుం బోలె నోర్పు గలదియుఁ దామరపూలవంటి కండ్లుగలదియు నగునట్టిసీత కిప్పుడు చెట్టుక్రింద వికృతంబులగు కండ్లతోఁ జూడ నసహ్యముగా నున్న రాక్షసస్త్రీలు కావలియున్నారు. ౨౯

జనకునింట మిక్కిలియు గారాబముగాఁ బెంపఁబడినసీత యిప్పుడు మంచుదగిలిన తామరతీఁగెయుంబోలెఁ గాంతిలేనిదై ఎడతెగక గల్గుచుండు దుఃఖములచే బాధింపఁబడుచు మగజక్కవం బాసిన యాఁడుజక్కవభంగిఁ బ్రియవిరహం బొక్కక్షణమయిన నోర్వలేనిదిగావునఁ జూచువారికినిం గూడ దుఃఖము గల్గించునట్టి నోటం జెప్ప నశక్యంబును మనసునం దలంప నశక్యంబు నగుదురవస్థం బొందియున్నది. ౩౦

పూలభారంబువలన వంగినకొనకొమ్మలు గల యశోకవృక్షంబువలనను వసంతర్తువుతోఁగూడ నుదయించియుండు నల్లనైనకిరణంబులు గల చంద్రుని వలనను ఈసీతకు అధికముగా దుఃఖము గలుగుచున్నది. అని హనుమంతుఁడు దనలోఁ దాను జెప్పుకొనెను. ౩౧

బలవంతుండును వానరశ్రేష్ఠుండును వేగవంతుఁడు నగు హనుమంతు డిట్లు తనలోఁ దాను జెప్పుకొని "ఈవిడ సీతయే వేఱు కాదు" అని నిశ్చయించి ఆశింశుపావృక్షమునందుఁ గూర్చుండియుండెను. ౩౨

ఇది పదునాఱవసర్గము.

---

## సప్తదశస్సర్గః

తతః కుముదషండాభో నిర్మలో నిర్మలం స్వయం,
ప్రజగామ నభశ్చంద్రో హంసో నీలమివోదకమ్. ౧

సాచివ్యమివ కుర్వన్ స ప్రభయా నిర్మలప్రభః,
చంద్రమా రశ్మిభిశ్శీతైస్సిషేవే పవనాత్మజమ్. ౨

స దదర్శ తతస్సీతాం పూర్ణచంద్రనిభాననాం,
శోకభారైరివ న్యస్తాం భారైర్నావమివాంభసి. ౩

దిదృక్షమాణో వైదేహీం హనుమాన్మారుతాత్మజః,
స దదర్శావిదూరస్థా రాక్షసీర్ఘోరదర్శనాః. ౪
ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
అకర్ణాం శంకుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాసనాసికామ్. ౫
అతికాయోత్తమాంగీం చ తనుదీర్ఘశిరోధరాం,
ధ్వస్తకేశీం తథాఽకేశీం కేశకంబళధారిణీమ్. ౬
లంబకర్ణలలాటాం చ లంబోదరపయోధరాం,
లంబోష్ఠీం చుబుకోష్ఠీం చ లంబాస్యాం లంబజానుకామ్. ౭
హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా,
కరాళాం భుగ్నవక్త్రాం చ పింగాక్షీం వికృతాననామ్. ౮

# పదునేడవసర్గము

అటుపిమ్మట తెల్లకలువల సమూహముంబోలె నొప్పుచు నిర్మలుండై యున్న చంద్రుండు హంసపక్షి నల్లని యుదకంబులోనికిం బోవునట్లు ఆకాశ మధ్యభాగంబు నొందెను. ౧

స్వచ్ఛం బగు కాంతిగల యాచంద్రుఁడు హనుమంతునకుఁ దనవెలుంగు చూపి కొంత సాహాయ్యంబు సేయువాఁడుంబోలెఁ దనచల్లనికిరణంబుల హను మంతునిపైఁ బఱపెను. ౨

అంత నాహనుమంతుండు బరువులచే నావ నీట మునుంగునట్లు దుఃఖ భారంబున మునింగియున్నదియుం నిండుచంద్రునింబోలు ముఖంబుఁగల సీతం జూచెను. ౩

వాయుదేవునికుమారుం డగుహనుమంతుండు సీతం జూడఁగోరి విమ ర్శించి చూచుచు సీతకు సమీపంబున నున్నవారలఁ జూపరులకు వెఱపుఁ బుట్టించు వారల రాక్షసస్త్రీలను ఒక్కకన్నుగలదానిని ఒక్కచెవిగలదానిని విశాలంబు లగుచెవులను దలపైఁగప్పుకొనియున్నదానిని చెవులు లేనిదానిని నీరుపంది చెవుల వంటి చెవులుంగలదానిని కలతట్టుగా నిట్టూర్పులు విడుచు ముక్కుగలదానిని పెద్దతలలుగలదానిని కృశించి నిడుపుగానుండు కంఠముగలదానిని కొంచెముగా వెండ్రుకలు గలదానిని వెండ్రుకలు లేనిదానిని కంబళివంటి వెండ్రుకలు గల దానిని వ్రేలుకాడుచుండు చెవులును నొసలును గలదానిని వ్రేలుకాడుచుండు కడుపును స్తనములును గలదానిని వ్రేలాడుపెదవి గలదానిని గడ్డమునందుఁ బెదవిగలదానిని వ్రేలాడు ముఖముగలదానిని వ్రేలాడు మోఁకాళ్లుగలదానిని పొట్టిదానిని పొడుగుదానిని గూనిదానిని వంకరదేహము గలదానిని వామనా కృతి గలదానిని మిట్టకండ్లదానిని వంకరగలదానిని గోరోచనపురంగు గల వండ్లతోఁ గూడినదానిని వికృతమైన ముఖము గలదానిని జూచెను. ౪-౫

వికృతాః పింగళాః కాళీః క్రోధనాః కలహప్రియాః,
కాలాయసమహాశూలకూటముద్గరధారిణీః. ౯
వరాహమృగశార్దూలమహిషాజశివాముఖీః,
గజోష్ట్రహయపాదీశ్చ నిఖాతశిరసోఽపరాః. ౧౦
ఏకహస్తైకపాదాశ్చ ఖరకర్ణ్యశ్వకర్ణికాః,
గోకర్ణీర్హస్తికర్ణీశ్చ హరికర్ణీస్తథాపరాః. ౧౧
అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాః,
గజసన్నిభనాసాశ్చ లలాటోచ్ఛ్వాసనాసికాః. ౧౨
హస్తిపాదా మహాపాదా గోపాదాః పాదచూళికాః,
అతిమాత్రశిరోగ్రీవా అతిమాత్రకుచోదరీః. ౧౩
అతిమాత్రాస్యనేత్రాశ్చ దీర్ఘజిహ్వా నఖాస్తథా,
అజాముఖీర్హస్తిముఖీర్గోముఖీస్సూకరీముఖీః. ౧౪
హయోష్ట్రఖరవక్త్రాశ్చ రాక్షసీర్ఘోరదర్శనాః,
శూలముద్గరహస్తాశ్చ క్రోధనాః కలహప్రియాః. ౧౫
కరాళా ధూమ్రకేశీశ్చ రాక్షసీర్వికృతాననాః,
పిబంతీస్సతతం పానం సదా మాంససురాప్రియాః. ౧౬
మాంసశోణితదిగ్ధాంగీర్మాంసశోణితభోజనాః,
తా దదర్శ కపిశ్రేష్ఠో రోమహర్షణదర్శనాః. ౧౭
స్కంధవంతముపాసీనాః పరివార్య వనస్పతిం,

హనుమంతుండు వికారమైనవేషముగలవారలను గోరోచనపు వన్నెగలవారలను నల్లనివారలను కోపించుస్వభావము గలవారలను గలహప్రియులగువారలను ఇనుపశూలమును గూటమును ఇనుపగుదియనుం దాల్చియుండువారలను పందిముఖంబు గలవారలను లేడిముఖములోఁ గూడినవారలను పులిముఖంబు గలవారలను ఎనుఁబోతుముఖంబు గలవారలను గుఱ్ఱమువంటి ముఖముగలవారలను నక్కముఖంబు గలవారలను గజపాదంబులు గలవారలను ఒంటెపాదంబులు గలవారలను గుఱ్ఱపుకాళ్లు గలవారలను దేహములోపలఁ దల గలవారలను ఒకచేయియుఁ నొకకాలు గలవారలను గాడిదచెవులు గలవారలను గుఱ్ఱమువంటి చెవులుగలవారలను గోకర్ణంబులుగలవారలను ఏనుఁగువంటి చెవులు గలవారలను కోఁతిచెవులు గలవారలను ముక్కులేనివారలను పెద్దముక్కు గలవారలను అడ్డముగానుండు ముక్కుగలవారలను ఏనుఁగువంటి ముక్కు గలవారలను నొసట నిట్టూర్పులు విడుచుచుండు ముక్కుగలవారలను గజపాదంబులు గలవారలను పెద్దపాదంబులు గలవారలను ఆవువంటి పాదములు గలవారలను పాదములందు జుట్టుగలవారలను పెద్దతలయును పెద్దమెడయును గలవారలను పెద్దస్తనములును పెద్దకడుపును గలవారలను నిడుపునాలుకయును నిడుపుగోళ్లును గలవారలను మేఁక ముఖంబుతోఁ గూడినవారలను ఏనుంగుముఖము గలవారలను గోముఖంబు గలవారలను పందిముఖము గల మఱికొందఱను అశ్వముఖంబు గలవారలను ఒంటెముఖంబు గలవారలను గాడిదముఖంబు గలవారలను చూపరులకు వెఱపు బుట్టించు రాక్షసస్త్రీలను మఱియును శూలమును ఇనుపగుదియను జేతులం దాల్చియుండువారలను కోపస్వభావంబు గలవారలను గలహప్రియులను మిట్టపండ్లవారలను నలుపెచ్చుగాఁ గలసిన యెఱుపువర్ణంబు గలవెండ్రుకలతోఁ గూడినవారలను వికృతమయిన నోరు గలవారలను ఎల్లప్పుడును మద్యంబుం ద్రావుచుండువారలను ఎల్లప్పుడు మాంసమునందును మద్యంబునందును ప్రీతిగలవారలను మాంసంబునను నెత్తుటనుం దోఁగుచుండు దేహంబుకలవారలను మాంసంబును నెత్తురు నాహారంబుగాఁ గలవారలను జూపరులకు గగుర్పాటు గల్పించుచుఁ బెద్దబోదెగల చెట్టుం జుట్టుకొని కూర్చుండియున్న యారాక్షసస్త్రీలం జూచెను. ౯-౧౩

తస్యాధస్తాచ్చ తాం దేవీం రాజపుత్రీమనిందితామ్. ౧౭
లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజాం,
నిష్ప్రభాం శోకసంతప్తాం మలసంకులమూర్ధజామ్. ౧౯
క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌ తారాం నిపతితామివ,
చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శనదుర్గతామ్. ౨౦
భూషణైరుత్తమైర్హీనాం భర్తృవాత్సల్యభూషణాం,
రాక్షసాధిపసంరుద్ధాం బంధుభిశ్చ వినాకృతామ్. ౨౧
వియూథాం సింహసంరుద్ధాం బద్ధాం గజవధూమివ,
చంద్రరేఖాం పయోదాంతే శారదాభ్రైరివావృతామ్. ౨౨
క్లిష్టరూపామసంస్పర్శాదయుక్తామివ వల్లకీం,

సీతాం భర్తృవశే యుక్తామయుక్తాం రాక్షసీవశే. ౨౩
అశోకవనికామధ్యే శోకసాగరమాప్లుతాం,
తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్. ౨౪
దదర్శ హనుమాన్ దేవీం లతామకుసుమామివ,

సా మలేన చ దిగ్ధాంగీ వపుషా చాప్యలంకృతా. ౨౫
మృణాలీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ,

సీతం జూచుటవలన నధికమయిన కాంతిగలహనుమంతుండు అచ్చట్టి క్రి గాంతిలేనిదై దుఃఖంబునఁ దపించుచున్నదై సంస్కారములేకుండుటం జేసి ముఱికితో నిండియుండు తలవెండ్రుకలు గలదై పుణ్యంబుఁ దఱిగిన పిమ్మట నాకాశంబునుండి భూమిపయింబడిన నక్షత్రంబు పగిదిం జూపట్టుచుఁ బాతివ్రత్యాది సదాచారములఁ గీర్తినొంది భర్తృదర్శనము లేనిదై యుత్తమ భూషణంబుల ధరింపక భర్తయందలిభక్తియే భూషణంబుగాఁ దలంచినదై బంధువులు లేనిదై రావణునిచే బాధింపఁబడుచుండుటంజేసి గజసమూహంబు వదలి సింహముచే బాధింపఁబడిన యాఁడేనుంగు పోల్కిం జూడనగుచు శరదృతువునందలి తెల్లని మేఘంబులం గప్పఁబడిన చంద్రరేఖకైవడిఁ గొంచెము స్పష్టముగాను గొంచె మస్పష్టముగాను తెలియంబడుచున్నదై దేహసంస్కారము లేమింజేసి కొంచెము తఱిగిన సౌందర్యంబు గలిగియుండుటంజేసి తంత్రులారోపింపకుండునప్పుడు శోభింపకుండు వీణెయుం బోలె గనుపట్టుచున్నదాని రాజకుమార్తె యగుదాని నిందింపఁబడనిదాని జనకునికుమార్తె యగుదాని సీతాదేవిం జూచెను. ౧౮, ౨౨

ఎల్లప్పుడు పెనిమిటియగు రామునియొద్దనే యుండఁదగినదియును రాక్షసస్త్రీలకు లోఁబడియుండఁ దగనిదియును దుఃఖసముద్రమునందు మునింగియున్నదియు రాక్షసస్త్రీలు చుట్టుచుం జుట్టుకొనియుండుటంజేసి క్రూరగ్రహములతోఁ గూడిన రోహిణీనక్షత్రంబుంబోలె నాభరణంబులు విడిచియుండుటవలనఁ బుష్పంబులులేకుండు తీఁగెయుంబోలెఁ గాంతిహీనయైయున్నదియు నగు సీతాదేవిని అయశోకవనిక నడుమను హనుమంతుఁడు చూచెను. ౨౩, ౨౪

తామరతీఁగ బురదగలిగియున్నను స్వభావంబున తెల్లనైనది కావునఁ బ్రకాశించుచును బ్రకాశింపకయుఁ జూపట్టునట్లు ఆసీత దేహంబంతయు ముఱికిదగిలియున్నను స్వభావంబున సౌందర్యంబు గలదికావునఁ బ్రకాశించుచును ప్రకాశింపకయుఁ గనుపట్టుచుండినది. ౨౫

మలినేన తు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్, ౨౬
సంవృతాం మృగశాబాక్షీం దదర్శ హనుమాన్కపిః,
తాం దేవీం దీనవదనామదీనాం భర్తృతేజసా. ౨౭

రక్షితాం స్వేన శీలేన సీతామసితలోచనాం,
తాం దృష్ట్వా హనుమాన్ సీతాం మృగశాబనిభేక్షణామ్. ౨౮
మృగకన్యామివ త్రస్తాం వీక్షమాణాం సమంతతః;
దహంతీమివ నిశ్శ్వాసైర్వృక్షాన్ పల్లవధారిణః. ౨౯

సంఘాతమివ శోకానాం దుఃఖస్యోర్మిమివోత్థితాం,
తాం క్షమాం సువిభక్తాంగీం వినాభరణశోభినీమ్. ౩౦
ప్రహర్షమతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీం,

హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణామ్. ౩౧
ముమోచ హనుమాంస్తత్ర నమశ్చక్రే చ రాఘవం,

నమస్కృత్వా(స)చ రామాయ లక్ష్మణాయ చ వీర్యవాన్. ౩౨
సీతాదర్శనసంహృష్టో హనుమాన్ సంవృతోఽభవత్.

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తదశస్సర్గః.

## అష్టాదశస్సర్గః

తథా విప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపం,
విచిన్వతశ్చ వైదేహీం కించిచ్ఛేషా నిశాఽభవత్. ౧

మఱియును నలిఁగినదియు నగుచీరఁగట్టుకొని జింకపిల్లకుంబోలె సుందరంబులగు కండ్లు గల్గి దైన్యంబునొంది పెనిమిటి పరాక్రమంబు దలంచుకొన్నప్పుడు మాత్రము దైన్యంబులేనిదై తన పాతివ్రత్యంబు విడువకున్న యాసీతాదేవిని హనుమంతుడు చూచెను. ౨౬, ౨౭

జింకపిల్లలకుంబోలె విశాలంబులును సుందరంబులు నగుకండ్లు గలిగి భయంబునొందిన లేడియుంబోలె నన్నిప్రక్కలం జూచుచు వేఁడినిట్టూర్పులచే నచ్చటివృక్షంబుల చిగురుటాకుల దహించునట్లు చూపట్టుచు నాకారము వహించిన దుఃఖపరంపరయుంబోలెఁ జూడనగుచున్న యాసీతం జూచి హనుమంతుండు సంతోషంబు నొందెను. ౨౮, ౨౯

వాయుదేవునికుమారుం డగుహనుమంతుండు భూమియుంబోలెఁ జాల నోర్పుగలదియును వేఱువేఱుగా నయ్యైతెఱంగున సుందరంబులై యుండు నవయవంబులు గలదియు నాభరణంబు లేమియు లేకున్నను దేహసౌందర్యంబు నను ప్రకాశించుచున్నదియు నగు సీతంజూచి మిగుల నధికమయిన సంతోషంబు నొందెను. ౩౦

ఆయశోకవనికయందు మదిరేక్షణ యగునాసీతం జూచి యాహనుమంతుఁడు కండ్ల నానందబాష్పములు విడుచుచు రామునకు నమస్కరించెను. ౩౧.

మహాపరాక్రమశాలి యగు నాహనుమంతుఁడు రామునకును లక్ష్మణునకును నమస్కరించి "సీతం జూచితిని గదా" యని మిగుల సంతోషంబు నొంది రాక్షసస్త్రీలు తన్నుఁ జూడకుండుటకై యాశింశుపావృక్షపత్త్రంబులం గప్పుకొనియుండెను. ౩౨.

ఇది పదునేడవసర్గము.

---

## పదునెనిమిదవసర్గము

ఆహనుమంతుఁ డట్లు చక్కఁగాఁ బూచియుండు చెట్లుగల యశోకవనికను జూచుచు సీతను వెదకుచుండఁగా రాత్రిలోఁ గొంచెము ప్రొద్దు మాత్రము మిగిలియుండినది. ౧

షడంగవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్,
శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసామ్. ౨

అథ మంగళవాదిత్రశబ్దైశ్శ్రోత్రమనోహరైః,
ప్రాబుధ్యత మహాబాహుర్దశగ్రీవో మహాబలః. 3
విబుధ్యతు యథాకాలం రాక్షసేంద్రః ప్రతాపవాన్,
స్రస్తమాల్యాంబరధరో వైదేహీమన్వచింతయత్. ౪

భృశం నియుక్తస్తస్యాం చ మదనేన మదోత్కటః,
న స తం రాక్షసః కామం శశాకాత్మని గూహితుమ్. ౫

స సర్వాభరణైర్యుక్తో బిభ్రచ్ఛ్రియమనుత్తమామ్,
తాం నగైర్బహుభిర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః. ౬
వృతాం పుష్కరిణీభిశ్చ నానాపుష్పోపశోభితామ్,
సదామదైశ్చ విహగైర్విచిత్రాం పరమాద్భుతామ్. ౭
ఈహామృగైశ్చ వివిధైర్జుష్టాం దృష్టిమనోహరైః,
వీథీస్సంప్రేక్షమాణశ్చ మణికాంచనతోరణాః. ౮
నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితైర్వృతామ్,
అశోకవనికామేవ ప్రావిశత్సంతతద్రుమామ్. ౯

అంగనాశతమాత్రం తు తం వ్రజంతమనువ్రజత్.
మహేంద్రమివ పౌలస్త్యం దేవగంధర్వయోషితః. ౧౦

అంత నపరరాత్రియందు హనుమంతుఁడు శిక్షాది షడంగములను
వేదములను దెలిసినవారును గొప్పయాగంబులను జేయించువారు నగుబ్రాహ్మణ
రాక్షసులు వేదాధ్యయనము సేయఁగా సాధ్వనులను వినెను. ౨

అంతఁ జెవులకుఁ సుఖంబుగా మంగళవాద్యంబులు మ్రోయఁగా సాధ్వ
నులకు మహాబాహుండును మహాబలుండు నగురావణుండు మేలుకొనెను. ౩

పరాక్రమశాలి యగు రావణుండు నిద్రించుటవలన స్థలంబుదప్పి
జాఱియుండు పుష్పమాలికతోను వస్త్రముతోను మేలుకొని యంత సీతం
దలంచుకొనెను. ౪

చాలమదంబు గలయారావణుండు ఆసీతనుగుఱించి మన్మథునిచే
మిక్కిలియుఁ బ్రేరితుం డగుటంజేసి యా మన్మథతాపంబును మనంబున
నడంచుకొన లేకుండెను. మన్మథుం డెంతప్రేరేపించినను ఆరావణుం డెంత
మాత్రమును మన్మథవికారంబు నొందలేదు. ఆసీతయందు మిగుల భక్తివిన
యంబులు గల్గియుండెను. అట్టిరావణుండు ఆమన్మథుని దనమనంబునఁ
యడంచుకొనంజాలఁడా యేమి! చాలు ననుట కేమియుం సందియములేదు. ౫

ఆరావణుండు సమస్తాభరణంబులును ధరించి సరిలేనికాంతిం దేజ
రిల్లుచు సమస్తపుష్పంబులను ఫలంబులను నిండియున్న యనేకంబు లగువృక్షం
బులతో నొప్పుచున్నదియుఁ బెక్కుకొనేరులతోఁ గూడినదియుం నానావిధ
పుష్పంబులఁ జూడ నందంబైనదియు నెప్పుడు ముదంబున విహరించుచుండు
పక్షులు గల్గి చూపరుల కాశ్చర్యంబు గల్గించునదియు సుందరములయిన
తోఁడేళ్లతోఁ గూడినదియుం నానావిధమృగంబులనొప్పుచున్నదియు చెట్లనుండి
నేల రాలినఫలంబులఁ గప్పఁబడినదియును చెట్లతో నిండియున్నదియు నగు
నాయశోకవనికను బంగారుతోను మణులతోనుం జేయంబడినద్వారంబులు
గల వీథులం జూచుచుఁ బ్రవేశించెను. ౬-౯

దేవతాస్త్రీలును గంధర్వస్త్రీలును దేవేంద్రుని వెంబడించునట్లు
ఆరావణుండు పోవుచుండఁగా నూఱుమంది స్త్రీలతని వెంబడించిరి. ౧౦

దీపికాః కాంచనీః కాశ్చిజ్జగృహుస్తత్ర యోషితః,
వాలవ్యజనహస్తాశ్చ తాలవృంతాని చాపరాః. ౧౧

కాంచనైరపి భృంగారైర్జహ్రుస్సలిలమగ్రతః,
మండలాగ్రాన్ బృసీం చైవ గృహ్యాన్యాః పృష్ఠతో యయుః.

కాచిద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ,
దక్షిణా దక్షిణేనైవ తదా జగ్రాహ పాణినా. ౧౩
రాజహంసప్రతీకాశం ఛత్రం పూర్ణశశిప్రభం,
సౌవర్ణదండమపరా గృహీత్వా పృష్ఠతో యయౌ. ౧౪
నిద్రామదపరీతాక్ష్యో రావణస్యోత్తమాః స్త్రియః,
అనుజగ్ముః పతిం వీరం ఘనం విద్యుల్లతా ఇవ. ౧౫

వ్యావిద్ధహారకేయూరాస్సమామృదితవర్ణకాః,
సమాగలితకేశాంతాస్సస్వేదవదనాస్తథా. ౧౬
ఘూర్ణంత్యో మదశేషేణ నిద్రయా చ శుభాననాః,
స్వేదక్లిష్టాంగకుసుమాస్సుమాల్యాకులమూర్ధజాః. ౧౭
ప్రయాంతం నైరృతపతిం నార్యో మదిరలోచనాః,
బహుమానాచ్చ కామాచ్చ ప్రియా భార్యాస్తమన్వయుః. ౧౮

స చ కామపరాధీనః పతిస్తాసాం మహాబలః,
సీతాసక్తమనా మందో మదాంచితగతిర్బభౌ. ౧౯

తతః కాంచీనినాదం చ నూపురాణాం చ నిస్స్వనం,

అందుఁ గొందఱుస్త్రీలు బంగారు స్తంభంబులు గల దీపంబులం బట్టుకొనియుండిరి. కొందఱు చామరంబులఁ జేకొనియుండిరి. మఱికొందఱు విసనకఱ్ఱలను గ్రహించి యుండిరి. ౧౧

కొందఱు స్త్రీలు బంగారు వెండిపాత్రల జలంబుగొని రావణునకు ముందు నడిచిరి. మఱికొందఱు వనితలు కత్తులను ఆసవంబులను జేకొని రావణుని వెనుకకుం బోయిరి. ౧౨

అప్పుడు చాతుర్యము గల యొకానొకస్త్రీ మద్యముతో నిండిన మణిమయపాత్రమును దనకుడిచేతం బట్టుకొనిపోయెను. ౧౩

మఱియొక్కతె రాయంచయుం బోలె నిండుచంద్రుండుంబోలెఁ దెల్లఁగానుండు ఛత్త్రంబును బట్టుకొని రావణునివెనుకం బోయెను. ౧౪

ఉత్తమస్త్రీ లగు రావణుని భార్యలు నిదురచేతను మద్యమదంబుచేతను ఘూర్ణిల్లుచున్న కండ్లుగలిగి కాంతిచే మెఱయుచు మేఘంబును మెఱపుఁదీఁగెలు వెంబడించునట్లు పరాక్రమశాలియగు తమభర్త రావణుని వెంబడించిపోయిరి.

ఆరావణుని ప్రియభార్యలు నిద్రించుటంజేసి స్థలంబు దప్పినహారంబులను బాహుపురులునుం గలిసి మాసినమైపూఁతతోఁగూడి తమవెండ్రుకల కొనలు జాఱి వ్రేలుచుండఁగా ముఖంబున చెమటపట్టఁగా కైపుచేతను నిదురచేతను దిరుగుడునొందుచు ఆట్టియవస్థ గలుగుటంజేసి ముఖంబులు మిగుల సుందరంబులై వెలఁగఁగా జెమటనీళ్లు వాడినపువ్వుంబులు గల్గి మంచి పువ్వుమాలికలతో నిండియుండు తలవెండ్రుకలతో నొప్పుచు భర్తృగౌరవంబునను అగ్గలం బగు మన్మథతాపమునను రాక్షసరాజగు రావణుని వెంబడించిరి.

ఆస్త్రీలకుఁ బెనిమిటియుం మహాబలుండు నగు రావణుండు మన్మథాధీనుండై మనస్సు సీతయందు మగ్నం బగుటవలన జడుండుంబోలె నేమియుం దోఁచక మెల్లగా లీలమెయిం బోవుచుఁ బ్రకాశించెను. ౧౫

అంత వాయుదేవునికుమారుం డగు నాహనుమంతుండు ఆయుత్తమ

శుశ్రావ పరమస్త్రీణాం స కపిర్మారుతాత్మజః. ౨౦
తం చాప్రతిమకర్మాణమచింత్యబలపౌరుషం,
ద్వారదేశమనుప్రాప్తం దదర్శ హనుమాన్ కపిః. ౨౧
దీపికాభిరనేకాభిస్సమంతాదవభాసితం,
గంధతైలావసిక్తాభిర్ధ్రియమాణాభిరగ్రతః. ౨౨
కామదర్పమదైర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణం,
సమక్షమివ కందర్పమపవిద్ధశరాసనమ్. ౨౩
మథితామృతఫేనాభమరజోవస్త్రముత్తమం,
సలీలమనుకర్షంతం విముక్తం సక్తమంగదే. ౨౪

తం పత్రవిటపే లీనః పత్త్రపుష్పఘనావృతః,
సమీపమివ సంక్రాంతం నిధ్యాతుముపచక్రమే. ౨౫

అవేక్షమాణస్తు తతో దదర్శ కపికుంజరః,
రూపయౌవనసంపన్నా రావణస్య వరస్త్రియః. ౨౬

తాభిః పరివృతో రాజా సురూపాభిర్మహాయశాః,
తన్మృగద్విజసంఘుష్టం ప్రవిష్టః ప్రమదావనమ్. ౨౭

క్షీబో విచిత్రాభరణశ్శంకుకర్ణో మహాబలః,
తేన విశ్రవసః పుత్త్రస్స దృష్టో రాక్షసాధిపః. ౨౮

స్త్రీలు నడుచుచుండఁగాఁ బుట్టిన మొలనూళ్లధ్వనిని అందెలశబ్దంబును వినెను.

సరిలేని గొప్పకార్యంబులు చేయువాఁడును మనంబునంగూడ నెన్న రాని బలపౌరుషంబులు గలవాఁడునై స్త్రీలచే ముందఱఁబట్టుకొనఁబడిన వాసన నూనె పోసిన యనేక దీపంబుల వెల్తురుచేఁ జక్కఁగాఁ గనఁబడుచు మన్మథ తాపంబును గర్వంబును మద్యమదంబునుం గల్గి వక్రంబులై యెఱ్ఱనై దీర్ఘం బులై యుండు నేత్రంబుల నొప్పుచు చెఱకువిల్లు విడిచి ప్రత్యక్షంబుగా వచ్చిన మన్మథుం డనందగి స్వస్థానంబునుండి జాఱి బాహుపురిలోఁ దగులు కొనినట్టి మజ్జిగనురుఁగును బాలనురుఁగునుం బోలె సూక్ష్మం బై ధవళంబయి యెంతమాత్రంబును దుమ్ములేకుండు నుత్తమంబగు వస్త్రంబును విలాసంబుతోఁ బయికీడ్చుకొనుచు నాయశోకవనిక ద్వారమునను వచ్చిన రావణుని హను మంతుఁడు చూచెను. ౨౧-౨౪

ఆ హనుమంతుండు ఆకులతో నిండిన కొమ్మయందు ఎవ్వరికిని గానరా కుండునట్లు ఆకులను బూలనుం గప్పుకొని దూరముననున్నను గాంతిచే దగ్గఱకు వచ్చినట్లు చూపట్టుచున్న రావణునిం జూడసాగెను. ౨౫

అంత వానరశ్రేష్ఠుం డగుహనుమంతుఁడు ఆరావణునిం జూచుచు అధిక మయిన సౌందర్యంబుతోను యౌవనంబుతోను ఒప్పుచున్నవారల రావణు భార్యలం జూచెను. ౨౬

అధికమయిన కీర్తిగల యారావణుండు సౌందర్యవంతులగు నాస్త్రీ లతోఁ గూడి మధురంబుగాఁ గూయుచుండునట్టి మృగంబులతోఁ బక్షులతో నొప్పుచుండు నశోకవనికం బ్రవేశించెను. ౨౭

ఆహనుమంతుఁడు మద్యపానంబున మత్తుఁడును నానావిధంబులగునాభ రణంబుల ధరించినవాఁడును గర్వంబున స్తబ్ధంబు లగుటం జేసి స్తంభంబులం బోలె నిశ్చలంబు లయినచెవులు గలవాఁడు నగువానిఁ జంద్రుండు నక్షత్రంబు లచేఁ బరివేష్టింపఁబడునట్లు ఉత్తమస్త్రీలచేఁ బరివేష్టింపఁబడియున్నవాని రాక్ష సులకుఁ బ్రభువయినవాని విశ్రవసుకుమారుని రావణునిం జూచెను. ౨౮

వృతః పరమనారీభి స్తారాభిరివ చంద్రమాః,
తం దదర్శ మహాతేజా స్తేజోవంతం మహాకపిః. ౨౮
రావణోఽయం మహాబాహురితి సంచింత్య వానరః,
[సోఽయమేవ పురా శేతే పురమధ్యే గృహోత్తమే]
అవప్లుతో మహాతేజా హనుమాన్మారుతాత్మజః. ౩౦
స తథాఽప్యుగ్రతేజాస్సన్నిర్ధూత స్తస్య తేజసా,
పత్రగుహ్యాంతరే సక్తో హనుమాన్ సంవృతోఽభవత్. ౩౧

స తామసితకేశాంతాం సుశ్రోణీం సంహత స్తనీం,
దిదృక్షురసితాపాంగా ముపావర్తత రావణః. ౩౨

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - అష్టాదశస్సర్గః.

## ఏకోనవింశస్సర్గః

తస్మిన్నేవ తతః కాలే రాజపుత్రీ త్వనిందితా,
రూపయౌవనసంపన్నం భూషణోత్తమభూషితమ్. ౧
తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపం,
ప్రావేపత వరారోహా ప్రవాతే కదలీ యథా. ౨

ఆచ్ఛాద్యోదరమూరుభ్యాం బాహుభ్యాం చ పయోధరౌ,
ఉపవిష్టా విశాలాక్షీ రుదంతీ వరవర్ణినీ. ౩

మహాతేజుం డగుహనుమంతుం డట్లు అధికమయిన తేజస్సు గల రావణునిం జూచెను. ౨౯

మహాతేజుండును వాయుదేవునికుమారుం డగు నాహనుమంతుఁడు "మహాబాహుండగు నితండు (మున్ను నేఁ జూచిన) రావణుండే" అని తలంచి యతనిచేష్టలన్నియుం జక్కఁగాఁ జూచుటకై క్రిందికొమ్మకు దిగెను. ౩౦

ఆహనుమంతుఁడు, భయంకరమగు తేజంబు గలవాఁడయ్యును, ఆరావణుని తేజంబునకు భయపడి యాకులు నిండియుండు ప్రదేశంబునం దెవ్వరికేని గానరాకుండునట్లు నిలీనుండై యుండెను. ౩౧

ఆరావణుండు నల్లనివెండ్రుకలకొనలును సుందరంబులగు పిఱుఁదులును గల్గి మిగుల బలిసినవై నడుమ సందులేకుండుటచేఁ బరస్పరము నొరసికొనుచున్న స్తనంబులతో నల్లనికడకండ్లతో నొప్పుచున్న యాసీతం జూడఁగోరి, ఆబిడ సమీపంబునకు వచ్చెను. ౩౨

ఇది పదునెనిమిదవసర్గము.

## పందొమ్మిదవ సర్గము

అంత నప్పుడు రాచకొమార్తెయును బరిశుద్ధయును గొప్పపిఱుఁదులు గలదియు నగుసీత సౌందర్యముతో యౌవనముతో నొప్పుచు శ్రేష్ఠభూషణంబులతో నలంకరించుకొని వచ్చుచున్నవాని రాక్షసాధిపుం డగురావణుని దూరంబునుండియే జూచి పెద్దగాలికిం దూలు నరఁటిచెట్టుకైవడి భయంబున గడగడ వడంకెను. ౧,౨

ఉష్ణకాలమున సుఖశీతలంబును శీతకాలంబు సుఖోష్ణంబు నగు దేహంబు గలిగి భర్తయం దనురాగము గలదై పెద్దకండ్లు గలిగియుండు సీతాదేవి రావణుఁడు వచ్చుటం జూచినంతనే భయంబునఁ దొడలతోఁ గడుపును భుజంబులతో స్తనంబులను గప్పుకొని యేడ్చుచుఁ గూర్చుండియుండినది. ౩

దశగ్రీవస్తు వైదేహీం రక్షితాం రాక్షసీగణైః,
దదర్శ సీతాం దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే. ౪
అసంవృతాయామాసీనాం ధరణ్యాం సంశితవ్రతాం,
ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివ వనస్పతేః. ౫
మలమండనచిత్రాంగీం మండనార్హామమండితాం,
మృణాలీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ. ౬

సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః,
సంకల్పహయసంయుక్తైర్యాంతీమివ మనోరథైః. ౭
శుష్యంతీం రుదతీమేకాం ధ్యానశోకపరాయణాం,
దుఃఖస్యాంతమపశ్యంతీం రామాం రామమనువ్రతామ్. ౮
వేష్టమానాం తథాఽఽవిష్టాం పన్నగేంద్రవధూమివ,
ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా. ౯
వృత్తశీలకులే జాతా మాచారవతి ధార్మికే,
పునస్సంస్కారమాపన్నాం జాతామివ చ దుష్కులే. ౧౦
అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ,
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ. ౧౧
సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితాం,
పూజామివ పరిక్షీణామాశాం ప్రతిహతామివ. ౧౨
ఆయతీమివ విధ్వస్తామాజ్ఞాం ప్రతిహతామివ,
దీప్తామివ దిశం కాలే పూజామపహృతామివ. ౧౩
పద్మినీమివ విధ్వస్తాం హతశూరాం చమూమివ,
ప్రభామివ తమోధ్వస్తా ముపక్షీణామివాపగామ్. ౧౪

రాక్షసస్త్రీలచే రక్షింపఁబడినదై, యతిదుఃఖంబు నొందినది కావున సముద్రంబులో మునింగిన యోడయుంబోలెఁ జూపట్టుచు, నతితీక్ష్ణంబగు పాతివ్రత్యవ్రతంబు నవలంబించినదై యాస్తరణంబులేని నేలపైఁ గూర్చున్నదై నఱుకఁగా నేలంబడిన చెట్టుకొమ్మయుంబోలెఁ జూడనగుచు, మఱికి పేరుకొని యుండుటవలనఁ జిత్రవర్ణంబుగా నుండు దేహముతో నొప్పుచు నలంకారంబునకుఁ దగిన సౌందర్యంబుగలదయ్యును అలంకారము చేసికొనకున్నదికావున, బురదదగిలిన తామరతూఁడుంబోలెఁ బ్రకాశించునదియుఁ బ్రకాశింపకున్నదియు నై యున్న సీతాదేవిం జూచెను. ౪-౭

గుఱ్ఱంబులుంబోలె నతివేగంబులైన సంకల్పంబులచే మనంబున రాజశ్రేష్ఠుండుఁ బరమాత్మవేత్తయు నగురాము సన్నిధానంబునకుఁ బోవుచున్నట్టున్నదై యాహారంబులేమిం జేసి యెండియున్నదై యేడ్చుచు నేకాకినియై యెల్లప్పుడును ఆలోచించుచు దుఃఖంబునొంది, దుఃఖంబునకుఁ దుదిం గానక, రాముని మనంబున ధ్యానించుచు మణిమంత్రాదులకుఁ గట్టుపడి నేలంజుట్టుకొనియున్న త్రాఁచుఁబామువలె ధూమకేతువుచే బాధింపఁబడిన రోహిణీనక్షత్రంబు పగిదిఁ జూపట్టుచు సదాచారంబుగలదియు ధార్మికంబు నగు కులంబునంబుట్టి దుష్కులంబునం బెండ్లియయిన కన్యకైవడి, నసత్యాపవాదంబుచేఁ జెడినకీర్తియుంబోలె, నావృత్తిలేమిం జేసి మఱపుదగిలిన విద్యభంగి, క్షీణించిన మహాకీర్తిరీతి, నవమానింపఁబడినవాని కవమానించిన వానియందుండు శ్రద్ధలాగున, బూజాద్రవ్యంబులులేనిపూజావిధంబున, నిష్ఫలంబయిన యాశకైవడిఁ, జాలఁ దగ్గిన ధనలాభంబుమాడ్కి, భృత్యులచే నాదరింపఁబడని యాజ్ఞవిధంబున, నుత్పాతజాలంబున జ్వలించుచున్న దిక్కులాగున, దుష్టులచేఁ జెఱుపఁబడిన పూజాసామగ్రియుంబోలె మంచుచేఁ గాంతిపీడిన తామరతీఁగెచాడ్పున, శూరులు చంపఁబడినవెనుక భయంబునం బఱచుసేనపోల్కిఁ జీఁకటిచే నగపడని వెల్తురు విధంబున నీళ్లులేనినదియుంబోలె శూద్రాదులు తాఁకినయగ్నివేది భాతిఁ, జల్లారిన యగ్నిజ్వాలయుంబోలెఁ, జంద్రుఁడు గ్రహణంబునొందఁగాఁ గాంతిలేకుండు పున్నమనాఁటి రేయుంబోలె శేషంగులు తుండంబులచేఁ బత్రంబులును

వేదీమివ పరామృష్టాం శాంతామగ్నిశిఖామివ,
పౌర్ణమాసీమివ నిశాం రాహుగ్రస్తేందుమండలామ్. ౧౫

ఉ(త్స)త్కృష్టపర్ణకమలాం విత్రాసితవిహంగమాం,
హస్తిహస్తపరామృష్టామాకులాం పద్మినీమివ. ౧౬

పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితామివ,
పరయా మృజయా హీనాం కృష్ణపక్షనిశామివ. ౧౭

సుకుమారీం సుజాతాంగీం రత్నగర్భగృహోచితాం,
తప్యమానామివోష్ణేన మృణాలీమచిరోద్ధృతామ్. ౧౮

గృహీతా మాళితాం స్తంభే యూథపేన వినాకృతాం,
నిశ్శ్వసంతీం సుదుఃఖార్తాం గజరాజవధూమివ. ౧౯

ఏకయా దీర్ఘయా వేణ్యా శోభమానామయత్నతః,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ. ౨౦

ఉపవాసేన శోకేన ధ్యానేన చ భయేన చ,
పరిక్షీణాం కృశాం దీనామల్పాహారాం తపోధనామ్. ౨౧

ఆయాచమానాం దుఃఖార్తాం ప్రాంజలిం దేవతామివ,
భావేన రఘుముఖ్యస్య దశగ్రీవపరాభవమ్. ౨౨

సమీక్షమాణాం రుదతీమనిందితాం
సుపక్ష్మతామ్రాయతశుక్లలోచనాం,
అనువ్రతాం రామమతీవ మైథిలీం
ప్రలోభయామాస వధాయ రావణః. ౨౩

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే-ఏకోనవింశస్సర్గః.

కమలంబులును చెఱుకంగాఁ బక్షులు బెదరఁగా నాకులంబై యుండు తామర కొలనుం బోలె, గట్టుతెగి నీళ్ళన్నియుఁ బాఱఁగా నెండిన నదియునుఁబోలెఁ, కృష్ణపక్షరాత్రిపగిది భర్తృదుఃఖంబున దేహసంస్కారం బేమియుఁ జేసి కొనకుంటఁ జేసి కాంతిహీనయై కోమలంబులును సుందరంబులు నగు నవయవంబులతో నొప్పుచు మణిమయగృహంబున నుండఁదగినదయ్యును నేలం గూర్చుండియుంటంజేసి యప్పుడే పెఱికంబడిన యొండకు వాడుచున్న తామరతూఁడుంబోలెఁ జూడనగుచు నరణ్యంబున వేటకాండ్రు పట్టుకొని స్తంభంబునఁ గట్టివేయఁగాఁ బెనిమిటిం బాసి నిట్టూర్పులు పుచ్చుచు దుఃఖంబునం బరితపించుచున్న యేనుఁగుభంగిం జూపట్టుచు సంస్కారంబు లేకుండుటవలన నొకటిగా జడకట్టుకొనిన నిడుపైన వెండ్రుకలు గలిగినది కావున శరదృతువునందు నల్లనివృక్షపంక్తితోఁ గూడియుండు భూమియుంబోలె నొప్పుచు నుపవాసంబునను దుఃఖంబునను జింతనంబునను భయంబునను క్షీణతనొంది కృశించి దైన్యంబునొందియున్నదానిఁ బాతివ్రత్యరూపంబగు తపస్సును గట్టిగా నవలంబించి యున్నదానిఁ గొంచెముగా భుజించుటయును నుత్తమ స్త్రీలక్షణంబుగలదానిని దుఃఖంబునం జేమోడ్పు ధరించియుండుటంజేసి మనంబున రామునివలన రావణునకుఁ బరాభవంబు గలుగవలెనని యిష్టదేవతం బ్రార్థించుచున్నట్లు చూపట్టుచున్న సీతాదేవిని రావణుండు చూచెను. ౬-౨౨

తనకు రక్షకుం డెవ్వఁడైన నగపడునో యని నాల్గుప్రక్కలం జూచుచు రోదనంబు సేయుచున్నదియును, అనిందితయును సుందరములయిన ఱెప్పలు గలిగి కొనల నల్లనై దీర్ఘములై నడుమం దెల్లఁగా నుండు కండ్లు గలదియు నెల్లప్పుడును రామునందే మనసునుంచి యుండునదియు నగు నాసీతను రావణుండు మంచిమాటలచేఁ దనపై నాసగొనునట్లు చేయ నారంభించెను. ౨౩

ఇది పందొమ్మిదవసర్గము.

## వింశస్సర్గః

స తాం పతివ్రతాం దీనాం నిరానందాం తపస్వినీం,
సాకారైర్మధురై ర్వాక్యైర్న్యదర్శయత రావణః. ౧

మాం దృష్ట్వా నాగనాసోరు గూహమానా స్తనోదరం,
అదర్శనమివాత్మానం భయాన్నేతుం త్వమిచ్ఛసి. ౨

కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే,
సర్వాంగగుణసంపన్నే సర్వలోకమనోహరే. ౩

నేహ కేచిన్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః,
వ్యపసర్పతు తే సీతే భయం మత్తస్సముత్థితమ్. ౪

స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః,
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా. ౫

ఏవం చైతదకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి,
కామం కామశ్శరీరే మే యథాకామం ప్రవర్తతామ్. ౬

## ఇరువదవసర్గము

ఆరావణుండు దైన్యంబునొంది సంతోషములేక చూపరులకుఁ గనిక రింపఁ దగియుండు పతివ్రత యగు నాసీతకు సాభిప్రాయంబులయిన యింపు మాటలతోఁ దనయభిప్రాయంబుం దెలిపెను. ౧

ఏనుంగుతొండములవంటి తొడలుగల సీతా! నీవు నన్ను జూచి భయంబున స్తనంబులను గడుపును మూసికొని దేహంబునంతయు నా కెంతమాత్ర మగపడకుండునట్లు చేయఁగోరినట్లున్నావు. ౨

సీతా! నీవు విశాలంబులగు కండ్లుగలదానవు. నాకుఁ బ్రియురాలవు. శుభలక్షణములతోఁ గూడిన యవయవములు గలదానవు. లోకంబులకును సంతోషంబు గల్గించుదానవు. నీరూపంబుఁజూచి మోహించియున్నాను. నన్ను బహుమానింపుము. నీవు నా కీశ్వరివై నన్నుద్ధరింపవలయునని కోరుచున్నాను. నన్ను బహుమానించి నామనవి యంగీకరింపుము. ౩

ఇచ్చట మనుష్యులుగాని కామరూపులగు రాక్షసులుగాని నీకు భయంబు గల్గించువార లెవ్వరును లేరు. నేనో నీమీఁద మోహంబు గలవాఁడను కావున నీకు భయంబు వలదు. విడువుము. ౪

భయపడు స్వభావముగల సీతా! నాకుఁ బరస్త్రీగమనమను దోషంబు గల్గు నని తలంపవలదు. పరస్త్రీలతో రమించుటగాని బలాత్కారముగా వారల నపహరించుటగాని రాక్షసులకు కులధర్మము. ఇందుకు సందేహము లేదు. కావునఁ గులధర్మముచేసినచో నెంతమాత్రము దోషము లేకుండుట మాత్రమె కాదు. పుణ్యంబు గలుగును. ౫

ఈవిషయ మిట్లున్నది. ఐనను నీవు నాయందు వలపు లేకున్నావు. కావున నిన్ను మాత్రము నేను దాఁకను. అందువలన యథేచ్ఛగా నాదేహంబున గామంబు నుంచి నన్నుఁ గాపాడుము. ౬

(ఈవిషయం బిట్లుండఁగా నీవు విష్ణుపత్నివి కావున నీయాజ్ఞ లేక నిన్నుఁ దాఁకనుంజాలను. అట్లుగుటం జేసి నీవు నన్ను భర్తనుఁగాఁ జేకొని నిన్నుఁ బా

దేవి నేహ భయం కార్యం మయి విశ్వసిహి ప్రియే,
ప్రణయస్వ చ తత్త్వేన మైవం భూశ్శోకలాలసా. ౭

ఏకవేణీ ధరాశయ్యా ధ్యానం మలినమంబరం,
అస్థానేఽప్యుపవాసశ్చ నైతాన్యౌపయికాని తే. ౮

విచిత్రాణి చ మాల్యాని చందనాన్యగరూణి చ,
వివిధాని చ వాసాంసి దివ్యాన్యాభరణాని చ. ౯
మహార్హాణి చ పానాని శయనాన్యాసనాని చ,
గీతం నృత్తం చ వాద్యం చ లభ మాం ప్రాప్య మైథిలి. ౧౦
స్త్రీరత్నమసి మైవం భూః కురు గాత్రేషు భూషణం,
మాం ప్రాప్య హి కథం ను స్యాస్త్వమనర్హా సువిగ్రహే. ౧౧

ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే,
యదతీతం పునర్నైతి స్రోతశ్శీఘ్రమపామివ. ౧౨

జించునట్లు నా కనుజ్ఞ యిమ్ము. మన్మథుండు నాశరీరంబునందుఁ బ్రవర్తించి యేమిచేసినను నామనస్సు పరిశుద్ధంబై యున్నది కావున నామనస్సునకు వైక ల్యము గలుగదు. నీవు భయపడవలదు.)

నాకుఁ బ్రియురాల వగుసీతా! ఇచ్చటభయపడవలదు. నన్ను నమ్ముము. యథార్థముగా నాయందు స్నేహం బుంచుము; ఇట్లు దుఃఖించుచుండకుము. ౭

(సీతా! నీకు భక్తుండ భృత్యుండ నగు నే నుండఁగా నిచ్చట నీవేల భయపడెదవు? భయపడకుము. నన్ను నమ్ముము. నాయం దనుగ్రహంబుం చుము. ఇట్లు దుఃఖించుచుండవలదు.)

తలదువ్వికొనక యొకటేజడగా వెండ్రుకల ముడివేసికొనియుండుట నేలం బరుండుట మురికివస్త్రము గట్టుకొనుట యసమయంబునందు నుపవాసం బుండుట ఇవన్నియుం నీకుఁ దగినవికావు. కావున వీనిని విడువుము. ౮

సీతా! నీవు నన్నుఁ గూడి నానావిధంబులగు పుష్పమాలికలను జందన గంధములను అగరుగంధములను బలువిధంబులయిన వస్త్రంబులను దివ్యంబు లయిన యాభరణంబులను ధరించి శ్రేష్ఠంబులగు మద్యంబులం గ్రోలుచు నుత్త మంబులయినశయనంబులను ఆసనంబుల సుఖంబుగాఁ బరుండి విహరించుచు నాటపాటలను వాద్యంబులను బ్రొద్దుపుచ్చుచు సుఖంబుగా నుండుము ౯,౧౦

మంచిరూపముగల సీతా! నీవు స్త్రీలందఱిలో నుత్తమురాలవు. ఇట్లుండకుము. సొమ్ములు పెట్టుకొనుము. నన్నుఁ బొందియును నీవు సొమ్ములు లేని దాన వెట్లు కావచ్చును? ఎంతమాత్ర మట్లు కాఁగూడదు. ౧౧

మనోహరంబుగాఁ బొడమియుండి నీయౌవనంబు వ్యర్థమై పోవు చున్నది. పాఱిపోయిననీళ్లు మఱల రానట్లు కడచినయౌవనము మఱల రాదు; కావున నుపేక్షింపక భోగంబుల ననుభవింపుము.

(నీ భృత్యుఁడ నగు నాయౌవనకాలము వ్యర్థముగాఁ బోవుచున్నది. పాఱిపోయిననీళ్లు మఱల రానట్లు గడచిన యౌవనంబు మఱల రాదు; యౌవ నంబునందె దార్ఢ్యం బుండును. యౌవనం బతిక్రమించినపిదప నీకుఁ బూజ చేయుటకు నేను శక్తుఁడఁ గాఁజాలను. కావున నిన్నుఁ బూజించుట కిప్పుడె యనుజ్ఞ నిమ్ము.)

త్వాం కృత్వోపరతో మన్యే రూపకర్తా స విశ్వసృట్,
న హి రూపోపమా త్వన్యా తవాస్తి శుభదర్శనే. ౧౩

త్వాం సమాసాద్య వైదేహి రూపయౌవనశాలినీం,
కః పుమానతివర్తేత సాక్షాదపి పితామహః. ౧౪
యద్యత్పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే,
తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే. ౧౫

భవ మైథిలి భార్యా మే మోహమేనం విసర్జయ,

బహ్వీనాముత్తమస్త్రీణామాహృతానామితస్తతః. ౧౬
సర్వాసామేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ,

లోకేభ్యో యాని రత్నాని సంప్రమథ్యాహృతాని వై. ౧౭
తాని మే భీరు సర్వాణి రాజ్యం చైతదహం చ తే,

విజిత్య పృథివీం సర్వాం నానానగరమాలినీమ్. ౧౮

జనకాయ ప్రదాస్యామి తవ హేతోర్విలాసిని,
నేహ పశ్యామి లోకేఽన్యం యో మే ప్రతిబలో భవేత్. ౧౯
పశ్య మే సుమహద్వీర్యమప్రతిద్వన్ద్వమాహవే,

అసకృత్సంయుగే భగ్నా మయా విమృదితధ్వజాః. ౨౦
అశక్తాః ప్రత్యనీకేషు స్థాతుం మమ సురాసురాః,

ఇచ్ఛయా క్రియతామద్య ప్రతికర్మ తవోత్తమమ్. ౨౧

సుందరంబులగు కండ్లుగల సీతా! ప్రపంచమం దెచ్చటను నీవంటి
రూపముగలది మఱియొక్కతె లేదు కావున రూపంబులు సేయం సా బ్రహ్మదేవుఁడు
నిన్ను నిర్మించి యంత శ్రమంబునం బని చాలించుకొనెను అని తలంచెదను. ౧౩

సీతా! సరిలేని సౌందర్యంబును యౌవనంబును గల నిన్నుఁ జూచి
బ్రహ్మదేవుండైనను మోహించును. ఇతరులు మోహింతురని చెప్పనేల? ౧౪

పెద్దపిఱుఁదులు గలదానవును జంద్రబింబోలు ముఖంబుగలదానవు
నగు సీతా! నేను నీయవయవంబులలో దేనిఁజూచినను మఱల సాకంటిని.
అచ్చటినుండి మఱలింపలేకున్నాను. ౧౫

సీతా! నాకు భార్యవగుము. నే నితరపురుషుండ నను నజ్ఞానంబును
వదలుము.

నీకు మంగళ మగుఁగాక. నేను నానాస్థలంబులనుండి తెచ్చిన యుత్తమ
స్త్రీలు పెక్కుమంది యున్నారు. వారలందఱికన్న నీవు నా కగ్రభార్యవుగా
నుండుము. ౧౬

భయపడు స్వభావముగల సీతా! నేను నానాలోకంబులనుండి బలా
త్కారముగాఁ దెచ్చిన మణులన్నియుం నారాజ్యంబును నీ కిచ్చెదను. నేను
నీకు భృత్యుండ నైతిని. ౧౭

సీతా! నీకుఁగాను నేను నానావిధపట్టణంబులతోఁ గూడియున్న
భూమినంతయు జయించి జనకమహారాజున కిచ్చెదను. ౧౮

నా కెదురుగా నిలిచి నాతో యుద్ధము సేయువాఁడు ఇదివఱ కీ
లోకంబున నా కగపడలేదు.

యుద్ధమునందు నా కెవ్వరైన నెదురుపత్తురో నాపరాక్రమం బెట్లుం
డునో జూడుము. ౧౯

నాశత్రువులలో దేవతలును అసురులును నాతో యుద్ధముచేసి పలు
మాఱు అపజయమునొంది నాచే విఱువఁబడిన టెక్కెములతో నాయెదుట
నిలువలేక పాఱిపోయిరి. ఇంక నితరులగతి చెప్పనేల? ౨౦

నాయందు మోహంబుసేయుము. ఇప్పుడు చక్కఁగా నలంకరించు
కొనుము ౨౧

స్వప్రభాణ్యవసజ్యంతాం తవాంగే భూషణాని చ,
సాధు పశ్యామి తే రూపం సంయుక్తం ప్రతికర్మణా. ౨౨

ప్రతికర్మాభిసంయుక్తా దాక్షిణ్యేన వరాననే,
భుజ్క్ష్వ భోగాన్యథాకామం పిబ భీరు రమస్వ చ. ౨౩
యథేష్టం చ ప్రయచ్ఛ త్వం పృథివీం వా ధనాని చ,
లలస్వ మయి విస్రబ్ధా ధృష్టమాజ్ఞాపయస్వ చ. ౨౪

మత్ప్రసాదాల్లలంత్యాశ్చ లలంతాం బాంధవాస్తవ,
బుద్ధిం మమానుపశ్య త్వం శ్రియం భద్రే యశశ్చ మే. ౨౫

కిం కరిష్యసి రామేణ సుభగే చీరవాససా,
నిక్షిప్తవిజయో రామో గతశ్రీర్వనగోచరః. ౨౬
వ్రతీ స్థండిలశాయీ చ శంకే జీవతి వా న వా,
న హి వైదేహి రామస్త్వాం ద్రష్టుం వాప్యుపలప్స్యతే. ౨౭
పురోబలాకైరసితైః మేఘైర్జ్యోత్స్నామివావృతాం,
న చాపి మమ హస్తాత్త్వాం ప్రాప్తుమర్హతి రాఘవః. ౨౮
హిరణ్యకశిపుః కీర్తిమింద్రహస్తగతామివ,

నీదేహంబంతయుఁ గాంతిచే వెలుఁగుచుండు నాభరణంబులఁ బెట్టుకొనుము.

నీవు చక్కఁగా నలంకరించుకొనియుండఁగా నీరూపంబును జూడ వలయునని యున్నాను. ౨౨

సుందరమయిన ముఖముగల సీతా! నీవు సొగసుగా నలంకరించుకొని యథేచ్ఛగా భోగంబుల ననుభవింపుము. మద్యంబులం ద్రోలుము. క్రీడింపుము.

నీవు నీకుఁ గావలసినవారలకు యథేష్టముగా భూమిగాని ధనమునుగాని యిచ్చుకొనుము. ౨౩

నాయందు నమ్మకం బుంచి నిర్భయముగ యథేష్టముగాఁ గ్రీడింపుము. భయపడక నీకుఁ గావలసిన కార్యములందు న న్నాజ్ఞాపింపుము. ౨౪

నీవు నాయనుగ్రహంబున, సంతోషం బనుభవింపుచుండుటం జూచి నీబంధువులును సంతోషంబున నుందురు.

మంగళస్వరూపిణి వగు సీతా! నీవు నాసమృద్ధిని సంపదను గీర్తినిం జూడుము. ౨౫

నీవు సుందరివి; నారచీరలు కట్టుకొని యరణ్యంబున నుండురామునితో నీకేమి ప్రయోజనము?

జయంబులేనివాఁడై సంపదను విడిచి యరణ్యంబున నివసించుచు వానప్రస్థవ్రతంబు నవలంబించి నేలం బరుండుచున్న రాముం డింకను బ్రతికి యున్నాఁడో లేదో అని నాకు సందేహముగా నున్నది. ౨౬

సీతా! అగ్రభాగంబున బకపక్షులు సంచరించుచుండఁగా విశాలంబు లయిన నల్లని మేఘంబులచేత మఱుఁగుపడియుండు వెన్నెలను జూడఁజాలనట్లు నావశంబున నున్ననిన్ను రాముండు చూడనుగూడఁ జాలఁడు. ౨౭

ఇంద్రుండు తనభార్యను హరింపఁగా నారదముఖముగాఁ బ్రార్థించి హిరణ్యకశిపుండు తనభార్యను మరలం బొందినట్లు నావశంబున నున్ననిన్ను రాముం డెంతమాత్రము పొందలేఁడు. అతం డెన్నివినయంబులు చూపినను నేను నిన్నియ్యను. ౨౮

చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని. ౨౯
మనో హరసి మే భీరు సుపర్ణః పన్నగం యథా,

క్లిష్టకౌశేయవసనాం తన్వీమప్యనలంకృతామ్. 3౦
త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభామ్యహం,

అంతఃపురనివాసిన్యస్స్త్రియస్సర్వగుణాన్వితాః. 3౧

యావంత్యో మమ సర్వాసామైశ్వర్యం కురు జానకి,
మమ హ్యసితకేశాంతే త్రైలోక్యప్రవరాస్స్త్రియః. 3౨

తాస్త్వాం పరిచరిష్యంతి శ్రియమప్సరసో యథా,
యాని వైశ్రవణే సుభ్రు రత్నాని చ ధనాని చ. 33
తాని లోకాంశ్చ సుశ్రోణి మాంచ భుఙ్క్ష్వ యథాసుఖం,

న రామస్తపసా దేవి న బలేన న విక్రమైః. 3౪
న ధనేన మయా తుల్యస్తేజసా యశసాఽపి వా,
పిబ విహర రమస్వ భుఙ్క్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీం చ,
మయి లల లలనే యథాసుఖం త్వం
త్వయి చ సమేత్య లలంతు బాంధవాస్తే. 3౫
కుసుమితతరుజాలసంతతాని
భ్రమరయుతాని సముద్రతీరజాని,

భయపడునట్టి స్వభావముగల సీతా ! నీవు సుందరమగు చిఱునవ్వుగల దానవు. రమణీయంబులగు దంతములు గలదానవు. మనోహరంబులగు కండ్లు గలదానవు. అధికముగా విలాసము గలదానవు. ఇట్టిసౌందర్యము గల్గియుండు టంజేసి గరుత్మంతుండు సర్పంబును హరించునట్లు నామనసును హరించు చున్నావు. ౨౯

నీవు నలంగిన కట్టుబట్ట కట్టుకొని కృశించి యలంకరించుకొనకుండు నప్పుడె నిన్నుం జూచినదిమ్మట నాభార్యలయందు నా కిష్టము దప్పియున్నది. నీవు చక్కంగా నలంకారములు చేసికొని మంచివస్త్రము కట్టుకొని సంతోష ముతో నుండునప్పుడు చూతునేని యెట్లుండునో ? ౩౦

సీతా ! యంతఃపురంబున సమస్త శుభలక్షణంబులతోను గూడిన యుత్తమస్త్రీ లెందఱున్నారో వారలకందఱకును నీశ్వరిగా నుండుము. ౩౧

నల్లని వెండ్రుకలకొనలుగల సీతా ! ముల్లోకంబులం దంతటను ఉత్తమ లైన నాభార్యలందఱును లక్ష్మీదేవికి అప్సరసలు పరిచర్య సేయునట్లు నీకుం బరిచర్య సేయుదురు. ౩౨

సుందరమయిన కనుబొమ్మలును బిఱుందులును గలదానవగు సీతా ! కుబే రునియొద్ద నెన్నిరత్నంబు లున్నవో వానినన్నింటిని, నేను జయించిన లోకంబు లను నీవిగాం జేసికొని సుఖంబుగా ననుభవింపుచుండుము. నన్నును నీవు బతి నిగా స్వీకరించి సుఖం బనుభవింపుము. ౩౩

సీతా ! రాముండు తపంబునంగాని బలంబునంగాని పరాక్రమంబునం గాని నాకు సరి కానేరండు. ౩౪

విలసించియుండునట్టిస్వభావముగల సీతా ! నీవు యథేష్టంబుగా మద్యంబు త్రాగుము. సుఖముగాం దిరుగుము. క్రీడింపుము. కావలసినభోగంబుల ననుభవింపుము. నీకు ధనంబంతయు భూమినంతయు నిచ్చెదను. నాయందు మోహంబుంచి సుఖంబుగా రమింపుచుండుము. నీవిట్లధికసంతోషంబుగా నుం డుటంజూచి నీబంధువులందఱు నిన్నుంజేరి సంతోషం బనుభవింతురుగాక! ౩౫

భయముపడు స్వభావముగలసీతా ! నీవు స్వచ్ఛమగుబంగారుహారంబు దాల్చి పుష్పించియుండు చెట్లతోంగూడి తుమ్మెదలు మధురంబుగాం గూయు

కనకవిమలహారభూషితాంగి
విహర మయా సహ భీరు కాననాని. ౨౬

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - వింశస్సర్గః.

## ఏకవింశస్సర్గః

తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః.
ఆర్తా దీనస్వరా దీనం ప్రత్యువాచ శనైర్వచః. ౧
దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ,
చింతయంతీ వరారోహా పతిమేవ పతివ్రతా. ౨
తృణమంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా,

నివర్తయ మనో మత్తస్స్వజనే క్రియతాం మనః. 3

న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్,

అకార్యం న మయా కార్యమేకపత్న్యా విగర్హితమ్. ౪
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా,

ఏవముక్త్వా తు వైదేహీ రావణం తం యశస్వినీ. ౫
రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచనమబ్రవీత్,

నాహమౌపయికీ భార్యా పరభార్యా సతీ తవ. ౬

చుండఁగా రమణీయంబులైన సముద్రతీరంబునందలి వనంబులయందు నాతోఁ గూడఁ గ్రీడింపుచుండుము. ౩౩

ఇది యిరువదవ సర్గము.

---

## ఇరువదియొకటవ సర్గము

భయంకరుండగు నారావణుండుచెప్పిన యీమాటను విని సీత చాల దుఃఖమునొంది దీనయై దీనంబగు స్వరంబున మెల్లగా నిట్లని చెప్పెను. ౧

సుందరములగు పిఱుందులు గలదియును స్వభావంబునను యెల్లప్పుడును దెల్లని చిఱునవ్వు గలదియును పతివ్రతయు నగు సీతాదేవి పరమదుఃఖంబునొంది రోదనంబుసేయుచు భయంబున గడగడ వడంకుచుఁ జూపరులకు గనికరింపఁదగినదై పెనిమిటినే మనంబున ధ్యానించుచు రావణునితోఁ బ్రత్యక్షముగా మాటలాడుట తగదు కావున నొకగడ్డిపోఁచను నడుమనుంచుకొని యిట్లని చెప్పెను. ౨

నీవు నాయందు మనం బుంచకుము. నీమనసును మరలించుకొని నీభార్యలయందుఁ జేర్చుము. ౩

పాపిష్ఠుండు మోక్షమును గోరునట్లు నీవు నన్నుఁ గోరఁదగదు. ఎంత కోరినను బాపిష్ఠునకు మోక్షము గలుగకుండునట్లు నీకు నేను దక్కను.

నేను పరిశుద్ధంబగు కులంబున వివాహమాడినాను. అట్లు పరిశుద్ధవంశంబునం బుట్టినాను. పతివ్రత నని పేరుపడసితిని. అట్టి నేను నిందితంబయిన చేయరానిపనిని జేయఁగూడదు. అని సీత రావణునితోఁ జెప్పెను. ౪

అధికమయిన కీర్తిగలసీతాదేవి యిట్లుపలికి యంత రావణునిప్రక్కఁ జూడక రావణునకు వీఁపు గనుపడునట్లు వెనుకకుం దిరిగి కూర్చుండి మరల రావణునితో నిట్లని చెప్పెను. ౫

నే నితరపురుషుని భార్యను. పతివ్రతను. నీకు భార్యగాఁ దగినదానను గాను. ౬

సాధు ధర్మమవేక్షస్వ సాధు సాధువ్రతం చర,

యథా తవ తథాఽన్యేషాం దారా రక్ష్యా నిశాచర. ౭

ఆత్మానముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతాం,

అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేంద్రియమ్. ౮
నయంతి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవం,

ఇహ సంతో న వా సంతి సతో వా నానువర్తసే. ౯
తథాహి విపరీతా తే బుద్ధిరాచారవర్జితా,

వచో మిథ్యాప్రణీతాత్మా పథ్యముక్తం విచక్షణైః. ౧౦
రాక్షసానామభావాయ త్వం వా న ప్రతిపద్యసే,

అకృతాత్మానమాసాద్య రాజానమనయే రతమ్. ౧౧
సమృద్ధాని వినశ్యంతి రాష్ట్రాణి నగరాణి చ,

తథేయం త్వాం సమాసాద్య లంకా రత్నౌఘసంకులా. ౧౨
అపరాధాత్తవైకస్య న చిరాద్వినశిష్యతి,

ధర్మంబును జక్కఁగాఁ జూచుకొనుము, విడువకుము. సత్పురుషుల యాచారముప్రకార మాచరింపుము.

రాక్షసుఁడా! నీవు నీభార్యలు వ్యభిచారము లేక పరిశుద్ధలయి యుండవలయునని కోరుచున్నావుగదా! అట్లు ఇతరభార్యలందును ఆబుద్ధినే యుంచుము. ౭

ఇతరులు నీభార్యలతో రమించినప్పుడు నీ కెట్లుండునో వారలకును దమభార్యలతో నీవు రమించినప్పు డట్లే యుండునని తెలిసికొని యితర భార్యలను విడిచి నీభార్యలతోనే రమించుచుండుము.

తనభార్యలయందుఁ దనివినొందక చపలుండై చపలంబులగు నింద్రియములు గలవాఁడై శఠుండై పరభార్యలం బొందునేని దానివలన నతని యాయుస్సును ఐశ్వర్యంబును మొదలగున వన్నియును నశించును. ౮

ఇచ్చట నీకు మంచిబుద్ధి చెప్పుటకుఁ బెద్ద లెవరును లేరా! ఉన్నను నీవు వారల ననుసరింపవా యేమి? నీవు వారల ననుసరింపవేని వారలు నీకెట్లు మంచి చెప్పఁగలరు? నీవు వారలం దిరస్కరించుటవలన వారలు నిన్ను విడిచి యుందురు. నీవిట్లు శిష్టాచారంబును విడిచి యధర్మబుద్ధి నవలంబించియున్నావు. కావున నిన్ను వారలు విడిచియుందు రనుటకు సందేహము లేదు. ౯

అటుగానిచో నీవు మనంబునందు దురహంకారంబు గలవాఁడవయ్యును బైటికి వినయంబుతోఁ బండితుల నాదరించున ట్లభినయించుచుండుటం జేసి వారలు తమమాటను నీవు వినుదువని నీకు హితంబు చెప్పఁగా రాక్షసులందఱు నశింపవలసిన కాలంబు వచ్చినది కావుననే యామాట లంగీకరింప కున్నావా యేమి? ౧౦

తెలివిలేనివాఁడును దుర్మార్గుండు నగువాఁడు రాజగునేని సమస్త సంపదలతో నిండినవయ్యును దేశంబులును బట్టణములును మొదలగునవి నాశమునొందును. ౧౧

ఈప్రకారముగా నానావిధమణులతో నిండి సమస్తసంపదలతో నొప్పుచున్న యీలంకయంతయు నీవు రాజగుటచే నీయొక్కయపరాధంబున శీఘ్రంబుగా నాశము నొందఁగలదు. ౧౨

స్వకృతై ర్హన్యమానస్య రావణాదీర్ఘదర్శినః. ౧౩
అభినందంతి భూతాని వినాశే పాపకర్మణః,

ఏవం త్వాం పాపకర్మాణం వక్ష్యంతి నికృతా జనాః. ౧౪
దిష్ట్యైతద్వ్యసనం ప్రాప్తో రౌద్ర ఇత్యేవ హర్షితాః,

శక్యా లోభయితుం నాహమైశ్వర్యేణ ధనేన వా. ౧౫
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా,

ఉపధాయ భుజం తస్య లోకనాథస్య సత్కృతమ్. ౧౬
కథం నామోపధాస్యామి భుజమన్యస్య కస్యచిత్,

అహమౌపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః. ౧౭
వ్రతస్నాతస్య విప్రస్య విద్యేవ విదితాత్మనః,

సాధు రావణ రామేణ మాం సమానయ దుఃఖితామ్. ౧౮
వనే వాశితయా సార్ధం కరేణ్వేవ గజాధిపం,

మిత్రమౌపయికం కర్తుం రామస్స్థానం పరీప్సతా. ౧౯
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాఽసౌ పురుషర్షభః.

విదితస్స హి ధర్మజ్ఞశ్శరణాగతవత్సలః. ౨౦

తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి,

రావణుఁడా! పాపిష్ఠుండగువాఁడు దూరదృష్టిలేక స్వాపరాధంబున నాశంబు నొందుచుండఁగాఁ జూచి ప్రాణులందఱు సంతసింతురు. ౧౩

ఈప్రకారముగానే ఇంక నీకు నాశంబు గల్గునప్పుడు మున్ను నీచే నవమానింపఁబడిన జనులందఱు సంతోషంబున మాభాగ్యవశంబున భయంకరుం డగు నీరావణునకు వినాశంబు వాటిల్లినది అనియే చెప్పుదురు. ౧౪

నేను అంతఃపురస్త్రీల ప్రభుత్వమునకుఁగాని ధనమునకుఁగాని యింక దేనికిఁగాని ఆశపడుదానను గాను. వెల్తురు సూర్యుని విడిచియుండనట్లు నే క్షణమాత్రము రాముని విడిచియుండను. ౧౫

నే నట్టిలోకనాథుం డగురాముని యుత్తమభుజంబు గౌఁగిలించుకొని యింక ననామధేయుఁడగు మఱియొక్కని భుజము నెట్లు గౌఁగిలించుకొందును? ౧౬

వేదవ్రతోద్యాపనము చేసికొని స్నాతుండగు నాత్మవేత్తయయిన బ్రాహ్మణునకు సాంగవేదవిద్య యొప్పియుండునట్లు నేను భూమికి ప్రభువైన యారామునకే తగినభార్యను మఱియెవ్వరికిని గాను. ౧౭

రావణుఁడా! అడవియందు మగయేనుఁగుంబాసి దుఃఖించుచున్న యాఁడేనుంగుతో మగయేనుఁగుం గూర్చినట్లు సుందరంబగునట్లుగా దుఃఖిత నగు నాతో రామునిం గూర్చుము. ౧౮

నీవు రామునిచే భయంకరం బగువధంబు నొందక లంకయందు బ్రతికియుండఁ గోరుదువేని నీవు పురుషోత్తముండగు రాముని మిత్రునిఁగాఁ జేసికొనుట యుక్తము. అతఁడు పురుషోత్తముండు కావున నీయపరాధంబులు క్షమించి నిన్ను విడిచిపుచ్చును. ౧౯

ఆరాముఁడు "సమస్తధర్మంబుల నెఱింగినవాఁడు. శరణుఁ జొచ్చిన వారలపై నతిదయ గలవాఁడు." అని సమస్తలోకంబులయందును బ్రసిద్ధి వహించియున్నాఁడు. ౨౦

నీకు బ్రతికియుండవలెనని కోరిక గలదేని అట్టి శరణాగతవత్సలుం డగు రామునితో స్నేహంబు సేయుము

ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్. ౨౧

మాం చాస్మై ప్రయతో భూత్వా నిర్యాతయితుమర్హసి,

ఏవం హి తే భవేత్స్వస్తి సంప్రదాయ రఘూత్తమే. ౨౨

అన్యథా త్వం హి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ,

వర్జయేద్వజ్రముత్సృష్టం వర్జయేదంతకశ్చిరమ్. ౨3
త్వద్విధం తు న సంక్రుద్ధో లోకనాథస్స రాఘవః,

రామస్య ధనుషశ్శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్. ౨౪
శతక్రతువిసృష్టస్య నిర్ఘోషమశనే రివ,
ఇహ శీఘ్రం సుపర్వాణో జ్వలితాస్యా ఇవోరగాః. ౨౫
ఇషవో నిపతిష్యంతి రామలక్ష్మణలక్షణాః,

రక్షాంసి పరినిఘ్నంతః పుర్యామస్యాం సమంతతః. ౨౬
అసంపాతం కరిష్యంతి పతంతః కంకవాససః,

రాక్షసేంద్రమహాసర్పాన్ స రామగరుడో మహాన్. ౨౭
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్,

నీవును రామునకు సంతోషంబు గల్గునట్లు చేయుము. నేను నీకొఱకై వేఁడుకొనెదను. అతండు శరణాగతవత్సలుఁడు కావునఁ దప్పక నిన్ను మన్నించును. ౨౦

నీవు రాముని శరణంబొచ్చుట మాత్రమే చాలదు. మనంబునఁ గాలుష్యంబువిడిచి శుద్ధాంతఃకరణంబుతో నన్ను రామున కియ్యవలెను. లేనిచో నీయందు రామునకుఁ బ్రసాదంబు గలుగనేరదు.

ఈప్రకారముగా నీవు నన్ను రామునకు సమర్పింతువేని నీకు మేలు గలుగును. ౨౧

రావణుండా! నీవట్లుచేయక వేఱువిధముగాఁ జేయుదువేని తప్పక రాముండు నిన్నుఁ జంపును.

ఒకవేళ నింద్రుండు ప్రయోగించిన వజ్రాయుధంబు నిన్ను విడిచినను విడుచును. యముండును నిన్ను బహుకాలము గొనిపోక విడిచియుండును. ఇంద్రుని వజ్రాయుధంబునకును యమునకు లోఁబడనివాఁడవని విఱ్ఱవీఁగవలదు. కుపితుండయిన లోకనాథుం డగు రాముండు మాత్రము నీవంటి దురాత్ము నెంతమాత్రమును జంపక విడువఁడు. ౨౩

నీవు శీఘ్రంబుగా దేవేంద్రుఁడు విడిచిన వజ్రాయుధంబునకుంబోలె మహానాదంబులుగల రాముని ధనుర్ధ్వనిని వినఁగలవు. ౨౪

సుందరములయిన గణుపులుగల్గి మండుచున్న ముఖంబులతో సర్పంబులుంబోలె నున్న రామలక్ష్మణుల పేరులచే నంకితంబులగు బాణంబులు శీఘ్రంబుగనే యీలంకాపట్టణంబునందు వ్యాపింపఁగలవు. ౨౫

రామలక్ష్మణనామాంకితము లగుబాణములు ఈపట్టణమునం దంతటను బ్రయోగింపఁబడి రాక్షసులంజంపుచు నెంతమాత్రమును జోటులేనట్లు ఈపట్టణంబంతయుం వ్యాపింపఁగలవు. ౨౬

ఆరాముం డను గరుత్మంతుఁడు సర్పంబులఁ జంపునట్లు వేగంబునఁ రాక్షసు లనుసర్పంబులఁ జంపును. ౨౭

అపనేష్యతి మాం భర్తా త్వత్తశ్శీఘ్రమరిందమః. ౨౮
అసురేభ్యశ్శ్రియం దీప్తాం విష్ణుస్త్రిభిరివ క్రమైః,

జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే. ౨౯
అశక్తేన త్వయా రక్షః కృతమేతదసాధు వై,

ఆశ్రమం తు తయోశ్శూన్యం ప్రవిశ్య నరసింహయోః. ౩౦
గోచరం గతయోర్భ్రాత్రోరపనీతా త్వయాఽధమ,

న హి గంధముపాఘ్రాయ రామలక్ష్మణయోస్త్వయా. ౩౧
శక్యం సందర్శనే స్థాతుం శునా శార్దూలయోరివ,
తస్య తే విగ్రహే తాభ్యాం యుగగ్రహణమస్థిరమ్. ౩౨
వృత్రస్యేవేంద్రబాహుభ్యాం బాహోరేకస్య నిగ్రహః,

క్షిప్రం తవ సనాథో మే రామస్సౌమిత్రిణా సహ. ౩౩
తోయమల్పమివాదిత్యః ప్రాణానాదాస్యతే శరైః,

గిరిం కుబేరస్య గతోఽపథాయ వా
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః,
అసంశయం దాశరథేర్న మోక్ష్యసే
మహాద్రుమః కాలహతోఽశనేరివ. ౩౪

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకవింశస్సర్గః.

విష్ణుదేవుండు మూఁడడుగులచే నసురులయొద్దనుండి రాజ్యలక్ష్మిని హరించినట్లు శత్రువుల నడంగఁద్రొక్కంజాలిన నా పెనిమిటియగు రాముండు నీయొద్దనుండి నన్ను శీఘ్రముగాఁ దీసికొని పోఁగలఁడు. ౨౮

జనస్థానములందలి రాక్షసులందఱును జంపఁబడి జనస్థానంబంతయుఁ బాడగుటంజూచి నీవు యుద్ధంబుసేయ శక్తిలేనివాఁడవు కావున భయంబున దొంగతనముగా నన్నుఁ గొని తెచ్చినావు. ౨౯

అధముఁడవగు రావణుఁడా! పురుషశ్రేష్ఠులయిన యారామలక్ష్మణు లిద్దరు వెలుపలఁబోఁగానే యదిచూచి నీవాశ్రమంబు ప్రవేశించి దొంగతనంబున నన్నుఁ గొనితెచ్చినావు. ౩౦

అప్పుడు రామలక్ష్మణుల వాసనయయినను నీకుఁ దోఁచియుండునేని పులులవాసనగన్న కుక్కయుంబోలె నచ్చట నిమిషమైనను నిలిచియుండలేవు.

నీవు మొదలే బలములేనివాఁడవైనందున భయపడియున్నావు. అట్టి నీకు ఆరామలక్ష్మణు లిద్దఱితో యుద్ధముగలుగునేని నీకు జయంబుగలుగదు. వృత్రునకును ఇంద్రునకును యుద్ధము గలుగఁగా ఇంద్రునకు రెండు చేతు లుండుటచే నొకటేచేయి గలవృత్రుని కపజయము గల్గినట్లు వారలిద్దఱును నీకొకండవు నగుటచే నీకపజయంబుగల్గుట తప్పదు. ౩౧

నా పెనిమిటియగు రాముఁడు లక్ష్మణునితోఁగూడఁజేరి సూర్యుండు కిరణంబులచేఁ గొంచెపునీళ్లను గ్రహించునట్లు శీఘ్రముగా బాణంబులచే నీ ప్రాణంబులం గొనును. ౩౩

నీకిది మంచికాలముకాదు కావుననే నన్నిట్లు నిర్బంధించుచున్నావు. అట్లగుటంజేసి నీవు రామునిబారింబడి కుబేరునిపట్టణంబునకుఁ బోయినను వరుణునొద్దకుఁ బోయినను ఎచ్చటికిఁ బోయినను పిడుగుపడఁగా వృక్షము తప్పించుకొనలేనట్లు తప్పించుకొనలేవు. ౩౪

ఇది యిరువదియొకటవ సర్గము.

## ద్వావింశస్సర్గః

సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసాధిపః,
ప్రత్యువాచ తతస్సీతాం విప్రియం ప్రియదర్శనామ్. ౧

యథా యథా సాంత్వయితా వశ్యస్త్రీణాం తథా తథా,
యథా యథా ప్రియం వక్తా పరిభూత స్తథా తథా. ౨
సన్నియచ్ఛతి మే క్రోధం త్వయి కామస్సముత్థితః,
ద్రవతోఽమార్గమాసాద్య హయానివ సుసారథిః. ౩
వామః కామో మనుష్యాణాం యస్మి౯ కిల నిబధ్యతే,
జనే తస్మిం స్త్వనుక్రోశస్స్నేహశ్చ కిల జాయతే. ౪
ఏతస్మాత్కారణాన్న త్వాం ఘాతయామి వరాననే,
వధార్హామవమానార్హాం మిథ్యా ప్రవ్రజితే రతామ్. ౫

పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషిమాం,
తేషు తేషు వధో యుక్త స్తవ మైథిలి దారుణః. ౬
ఏవముక్త్వా తు వైదేహీం రావణో రాక్షసాధిపః,
క్రోధసంరంభసంయుక్తస్సీతాముత్తరమబ్రవీత్. ౭
ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధి స్తే మయాకృతః,
తతశ్శయన మారోహ మమ త్వం వరవర్ణిని. ౮
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీం,
మమ త్వాం ప్రాతరాశార్థమారభంతే మహానసే. ౯
తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేంద్రేణ జానకీం,
దేవగంధర్వకన్యా స్తా విషేదుర్వికృతేక్షణాః. ౧౦

# ఇరువదిరెండవసర్గము

రాక్షసేశ్వరుండగు రావణుండు సీతచెప్పిన పరుషవచనంబులను విని చూపరులకు సంతోషంబు గలిగించు సీతాదేవినిఁజూచి కఠినంబుగా నిట్లని చెప్పెను. ౧

పురుషుఁడు స్త్రీల నెంత బుజ్జగించునో అంత వారలకు స్వాధీనుఁడగును. మఱివారల కెంతమంచిమాటలం జెప్పెనో అంత వారలచేఁ దిరస్కరింపఁబడును.

నాకిప్పుడు నీయందుఁగలిగిన కామము సమర్థుండగుసారథి త్రోవదప్పి పరుగెత్తుగుఱ్ఱములను లాగికట్టునట్లు నాకోపమును అణఁచుచున్నది. ౩

కామ మనునది చెడ్డది. అది యెవ్వరియందు దృఢముగఁబుట్టునో ఆ జనంబు శిక్షింపఁదగినవారైనను అచ్చట దయయును స్నేహంబును గలుగును. ౪

సుందరమగు ముఖముగల సీతా! ఇట్లు నాకు నీమీఁద మోహంబు గల్గియుండు కారణంబుననె నీవు నన్నుఁ విడిచి కపటవానప్రస్థవేషధరుం డగు రామునందు దాసక్తిఁనుంచియున్నను అవమానించి చంపఁదగినదానవైనను నిన్నుఁ జంపకున్నాను. ౫

సీతా! నీవు నన్నుఁగూర్చి పరుషంబులగుమాట లెన్ని పలికితివో వానిలో నొక్కొకటికిని నిన్ను భయంకరముగాఁ జంపవలసియున్నది. ౬

రాక్షసులకుఁ బ్రభుండగు రావణుఁ డిట్లు సీతతోఁ జెప్పి యంత నగ్గలంబగుకోపంబున మరల నిట్లని చెప్పెను. ౭

నేను నీకేర్పఱచిన గడువుప్రకారము ఇంక రెండుమాసములు కాచి యుండవలయును. ౮

సీతా! అటుపిమ్మట నీవు శయనంబున నాతోఁగూడఁ బరుండవలయును.

ఆరెండుమాసములలో నీవు నన్నుఁ జెలిమిటిగా వరింపవేని నా కామలు వాఁటి ప్రాతఃకాలభోజనంబునకై నిన్ను వంటయింటఁజంపి వండుదురు. ౯

రాక్షసేశ్వరుఁడగురావణుం డిట్లు సీతను బెదరించుటఁజూచి యచ్చట రావణునిలోఁ గూడనుండు దేవతాస్త్రీలును గంధర్వవనితలును దుఃఖంబున నెల్లని వికృతములైన కండ్లతో దుఃఖించిరి. ౧౦

ఓష్ఠప్రకారైరపరా వక్త్రనేత్రై స్తథాఽపరాః,
సీతామాశ్వాసయామాసు స్తర్జితాం తేన రక్షసా. ౧౧
తాభిరాశ్వాసితా సీతా రావణం రాక్షసాధిపం,
ఉవాచాత్మహితం వాక్యం వృత్తశౌండీర్యగర్వితమ్. ౧౨
నూనం న తే జనః కశ్చి దస్తి నిశ్శ్రేయసే స్థితః,
నివారయతి యో న త్వాం కర్మణోఽస్మాద్విగర్హితాత్. ౧౩
మాం హి ధర్మాత్మనః పత్నీం శచీమివ శచీపతేః,
త్వదన్య స్త్రిషు లోకేషు ప్రార్థయేన్మనసాఽపి కః. ౧౪

రాక్షసాధమ రామస్య భార్యా మమితతేజసః,
ఉక్తవానసి యత్పాపం క్వ గత స్తస్య మోక్ష్యసే. ౧౫

యథా దృప్తశ్చ మాతంగశ్శశశ్చ సహితో వనే,
తథా ద్విరదవద్రామ స్త్వం నీచ శశవత్స్మృతః. ౧౬

స త్వమిక్ష్వాకునాథం వై క్షిపన్నిహ న లజ్జసే,
చక్షుషో ర్విషయం తస్య న తావదుపగచ్ఛసి. ౧౭

ఇమే తే నయనే క్రూరే విరూపే కృష్ణపింగళే,
క్షితౌ న పతితే కస్మా న్మామనార్య నిరీక్షతః. ౧౮

తస్య ధర్మాత్మనః పత్నీం స్నుషాం దశరథస్య చ,
కథం వ్యాహరతో మాం తే న జిహ్వా వ్యవశీర్యతే. ౧౯
అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్,
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మభస్మార్హ తేజసా. ౨౦

మఱికొందఱు పెదవులను గదలించియుఁ గొందఱు ముఖసంజ్ఞలచేతను రావణునిచే బెదరింపఁబడిన సీతను నూఱడించిరి. ౧౧

సీతాదేవియు వారలచే నట్లూఱడింపఁబడినదైన రాక్షసేశ్వరుం డగు రావణుం జూచి పాతివ్రత్యబలగర్వంబునఁ దనకు హితంబగునట్లు చెప్పెను. ౧౨

ఇచ్చట నీమేలుఁగోరువాఁ డెవ్వఁడును లేఁడు. నీవిట్లు పతివ్రతనగు నన్ను నిర్బంధించుచుండఁగా "నిది యకార్య" మని చెప్పి నిన్ను మరల్చువారలెవ్వరును లేరు. ఇది నిశ్చయము. ౧౩

దేవేంద్రునకు శచీదేవియుంబోలె ధర్మాత్ముండగు రామునకు భార్యనై యున్న నన్ను ముల్లోకంబులయందును నీవుదప్ప మఱియెవ్వరును ఇట్లు మోహించి భార్యగాఁ గోరరు. ౧౪

రాక్షసాధముండా! కొలఁదిలేని పరాక్రమంబుగల రాముని భార్యనగు నన్నిట్టి మాటలాడితివే నీ వేలోకంబునకుఁబోయి యీయపరాధంబు దప్పించుకొనఁగలవు? ఎక్కడికిఁబోయినను రాముఁడు నిన్ను దండింపక విడువఁడు. ౧౫

అడవియందు మదపుటేనుఁగును గుందేలును బోరునేని యెట్లుండునో అట్లు రాముండును నీవును యుద్ధము సేయుదురేని రాముండు మదపుటేనుంగు వలెను నీవు నీచమయిన కుందేలువలెను అవుదురు. ౧౬

ఇట్లిప్పుడు బింకపుమాటలాడుచున్నావే అప్పుడు కపటంబున రాముని దూరముగాఁ బోవునట్లు చేసి దొంగతనముగా నన్నుం గొనితెచ్చితివే, సిగ్గు లేదా? నీవింకను రామునికండ్ల కగపడలేదు. అతనికంటం బడితివేని నీకుఁ దెలియును. ౧౭

దుష్టుండవగు రావణుండా! పతివ్రతనగు నన్ను మోహంబునం జూచుచున్నావే. భయంకరములై వికృతములై నడుమ నల్లగాను గోరోజనమువంటి వర్ణముగలిగియుండు నీకండ్లు రెండును ఊడి నేలంబడవేల? ౧౮

ధర్మాత్ముండగు రాముని భార్యను దశరథుని కోడలనగు నన్నుఁగూర్చి యిట్టి యనరానిమాటలనుచున్నావే. ఎందువలన నీనాలుక ఊడి నేలంబడకున్నది?

రావణుండా! నీవు భస్మముగాఁ జేయఁదగినవాఁడవయినను "అపరాధము గలవాని దండింపు" మని పెనిమిటి యాజ్ఞలేకుండుటవలనను పాతివ్రత్యంబువలనఁ గల్గినతపస్సు తఱుగునని యుం నిన్ను భస్మముగాఁ జేయకున్నాను.

నాపహర్తుమహం శక్యా త్వయా రామస్య ధీమతః,
విధిస్తవ వధార్థాయ విహితో నాత్రసంశయః. ౨౧

శూరేణ ధనదభ్రాత్రా బలైస్సముదితేన చ,
అపోహ్య రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్. ౨౨

సీతాయా వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః,
వివృత్య నయనే క్రూరే జానకీమన్వవైక్షత. ౨౩
నీలజీమూతసంకాశో మహాభుజశిరోధరః,
సింహసత్త్వగతిశ్శ్రీమాన్ దీప్తజిహ్వాగ్రలోచనః. ౨౪
చలాగ్రమకుటప్రాంశుశ్చిత్రమాల్యానులేపనః,
రక్తమాల్యాంబరధరస్తప్తాంగదవిభూషణః. ౨౫
శ్రోణీసూత్రేణ మహతా మేచకేన సుసంవృతః,
అమృతోత్పాదనద్ధేన భుజగేనేవ మందరః. ౨౬
తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభేఽచలసంకాశశ్శృంగాభ్యామివ మందరః. ౨౭

తరుణాదిత్యవర్ణాభ్యాం కుండలాభ్యాం విభూషితః,
రక్తపల్లవపుష్పాభ్యామశోకాభ్యామివాచలః. ౨౮
స కల్పవృక్షప్రతిమో వసంత ఇవ మూర్తిమాన్,
శ్మశానచైత్యప్రతిమో భూషితోఽపి భయంకరః. ౨౯

బుద్ధిమంతుఁ డగురాము నొద్ద నేనుండఁగా నన్నపహరించుటకు నీచేతఁ గాదు. నీకుఁ జావుగలుగుటకై రాముండు దూరముగాఁ బోవునట్లును నీవు నన్ను దొంగతనముగా నపహరించునట్లును దైవము ఘటించినది. ౨౧

“నేను యుద్ధమునందు భయంపడనివాఁడను. కుబేరుని తమ్ముండను. బలంబున వినుతికెక్కినవాఁడను” అని చెప్పుకొనుచున్నావే. అట్టివాఁడగుదు వేని బంగారులేడిచే రాముని దూరముగాఁ బోవునట్లుచేసి యతనిభార్యనగు నన్ను ఏల దొంగిలించి తెచ్చితావు? అతనియెదుటనే తేవచ్చుఁగదా! అని సీత రావణునితో ననెను. ౨౨

రాక్షసేశ్వరుండగు రావణుండు సీతపలికినమాటను విని మిక్కిలి ఆగ్ర హంబునొంది భయంకరము లగుకండ్లను బెద్దగాఁ దెఱచి సీతంజూచెను. ౨౩

నీలమేఘంబుబోలె నల్లగానుండు మేనును విశాలమగు భుజంబులను మెడయుఁనుంగలిగి సింహంబునకుంబోలె బలంబును గమనంబునుంగలిగి ప్రకా శించుచున్న వాలుకకొనతోను కండ్లతో నొప్పుచుఁ గోపంబునం గదలుచున్న కిరీటంబు కొనతోఁ జూడనగుచుఁ జిత్రవర్ణంబు లగుపువ్వుమాలికల ననులేప నంబుల రక్తవర్ణంబులగు పువ్వుమాలికలరక్తవస్త్రంబులనుం దేజరిల్లుచు బాహు పురులుదాల్చి దీర్ఘంబై ఇంద్రనీలఘటితంబై నల్లగానుండు మొలనూలు ధరించి యుండుటంజేసి యమృతంబుఁ బుట్టించుటకై కట్టిన సర్పంబుతోఁగూడిన మందరపర్వతంబుంబోలె దర్శనీయుండై పర్వతాకారుండై యున్న రాక్షసేశ్వ రుండగు రావణుఁడు ఉన్నతంబులగు భుజంబులచే శిఖరంబుల మందరపర్వతంబు ప్రకాశించునట్లు ఎంతయుం బ్రకాశించుచుండెను. ౨౪-౨౬

బాలసూర్యవర్ణంబున నొప్పుచుండు కుండలంబులఁ దాల్చినవాఁడు కావున నెఱ్ఱనిచిగుళ్లఁ బూలుంగలిగిన యశోకవృక్షంబులచేఁ గూడి పర్వతంబు మాడ్కిం జూపట్టుచు నలంకరింపఁబడియుండుటంజేసి కల్పవృక్షంబుంబోలెఁ జూడనగుచు నాకారంబు వహించిన వసంతుం డనందగి భూషణంబులుధరించి యున్నను భయంకరుండై యుండుటంజేసి శ్మశానమంటపంబుకైవడిఁ జూ

అవేక్షమాణో వైదేహీం కోపసంరక్తలోచనః,
ఉవాచ రావణస్సీతాం భుజంగ ఇవ నిశ్శ్వసన్. ౩౦
అనయేనాభిసంపన్నమర్థహీన మనువ్రతే,
నాశయామ్యహమద్య త్వాం సూర్యస్సంధ్యామివౌజసా. ౩౧

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణశ్శత్రురావణః,
సందిదేశ తతస్సర్వా రాక్షసీర్ఘోరదర్శనాః. ౩౨
ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా,
గోకర్ణీం హస్తికర్ణీం చ లంబకర్ణీమకర్ణికామ్. ౩౩
హస్తిపాద్యశ్వపాద్యౌ చ గోపాదీం పాదచూలికాం,
ఏకాక్షీమేకపాదీం చ పృథుపాదీమపాదికామ్. ౩౪
అతిమాత్రశిరోగ్రీవా మతిమాత్రకుచోదరీం,
అతిమాత్రాస్యనేత్రాం చ దీర్ఘజిహ్వామజిహ్వికామ్. ౩౫
అనాసికాం సింహముఖీం గోముఖీం సూకరీముఖీం,

యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ. ౩౬
తథా కురుత రాక్షస్యస్సర్వాః క్షిప్రం సమేత్య చ,
ప్రతిలోమానులోమైశ్చ సామదానాదిభేదనైః, ౩౭
ఆవర్తయత వైదేహీం దండస్యోద్యమనేన చ,

ఇతి ప్రతిసమాదిశ్య రాక్షసేంద్రః పునఃపునః. ౩౮
కామమన్యుపరీతాత్మా జానకీం పర్యతర్జయత్,

దుక్కులకు వ్రేఁగై యున్న యారావణుండు కోపంబున ఎఱ్ఱంబాఱినకండ్లతో సీతం జూచుసర్పంబుంబోలె నిట్టూర్పులు పుచ్చుచు సీతతో నిట్లని చెప్పెను.

దుర్మార్గము నవలంబించియున్నవాఁడును దరిద్రుండు నగురాము ననుసరించియున్నావు. నే నెంతచెప్పినను నామాట వినవైతివి. కావున సూర్యుఁడు ప్రాతస్సంధ్యను నశింపఁజేయునట్లు నేనిప్పుడె నిన్ను నశింపఁ జేసెదను. ౩౧

శత్రువుల నేడ్పించునట్టిరావణుండు సీతతో నాప్రకారము చెప్పి యొక్కకన్నుగలదానిని ఒకచెవిగలదానిని చెవులు విశాలము లయియుండఁగా వానినే యుత్తరీయముగా ధరించినదానిని ఆవుచెవులవంటి చెవులుగల దానిని ఏనుంగుచెవులవంటి చెవులుగలదానిని వ్రేలుకాఁడు చెవులుగలదానిని చెవులే లేనిదానిని ఏనుంగుపాదమువంటి పాదములుగలదానిని గుఱ్ఱము పాదమువంటి పాదములుగలదానిని ఆవుపాదమువంటి పాదములు గలదానిని పాదంబునందు జుట్టు మొలచియుండుదానిని అట్లు ఒక కన్నుగల మఱియొక దానిని ఒక్కకాలుగలదానిని విశాలపాదంబు లేనిదానిని మిగులఁ బెద్దనైన తలయును మెడయునుగలదానిని మిక్కిలియుఁ బెద్దవైన స్తనంబులును గడుపును గలదానిని అతివిశాలంబులగు ముఖంబును గండ్లును గలదానిని పొడుగు నాలుకగలదానిని నాలుకయే లేనిదానిని ముక్కులేనిదానిని సింహముఖంబు వంటి ముఖంబుగలదానిని ఆవుముఖమువంటి ముఖముగలదానిని బందివంటి ముఖంబుగలదానిని ఇట్లు చూపరులకు భయంబుగలుగఁజేయుచుండు రాక్షస స్త్రీలనందఱంజూచి యిట్లని యాజ్ఞాపించెను. ౩౨-౩౫

రాక్షసస్త్రీలారా! మీరందఱు నొకటయి "జనకుని కొమార్తెయగుసీత శీఘ్రముగా నామీఁద ననురాగము గలదగునట్లు కావింపుఁడు. ౩౬

ఈబిడకుఁ బ్రతికూలకార్యములనైనను అనుకూలకార్యములనైనను సామదానభేదములనైనను లేక దండముఁ జూపి యయినను ఈసీతను వశీకరింపుఁడు" అని రావణుండు రాక్షసస్త్రీల కాజ్ఞాపించెను. ౩౭

రాక్షసులకుఁ బ్రభుండైన రావణుం డిట్లు రాక్షసస్త్రీల కాజ్ఞాపించి మఱియుం గామక్రోధంబు లతిశయిల్లఁగా మాటిమాటికిని సీత నదలించెను.

ఉపగమ్య తతః శీఘ్రం రాక్షసీ ధాన్యమాలినీ. ౩౯
పరిష్వజ్య దశగ్రీవమిదం వచన మబ్రవీత్,
మయా క్రీడ మహారాజ సీతయా కిం తవానయా. ౪౦
వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర,

నూనమస్యా మహారాజ న దివ్యాన్ భోగస త్తమాన్. ౪౧
విదధాత్యమరశ్రేష్ఠ స్తవ బాహుబలార్జితాన్,

అకామాం కామయానస్య శరీరముపతప్యతే. ౪౨

ఇచ్ఛంతీం కామయానస్య ప్రీతిర్భవతి శోభనా,

ఏవము క్తస్తు రాక్షస్యా సముత్క్షి ప్త స్తతో బలీ. ౪౩
ప్రహసన్మేఘసంకాశో రాక్షసస్సన్యవ ర్తత,
ప్రస్థితస్స దశగ్రీవః కంపయన్నివ మేదినీమ్. ౪౪
జ్వలద్భాస్కరవర్ణాభం ప్రవివేశ నివేశనం,
దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ సర్వతః. ౪౫
పరివార్య దశగ్రీవం వివిశు స్తం గృహో త్తమం,
స మైథిలీం ధర్మపరామవస్థితాం
ప్రవేపమానాం పరిభ ర్త్స్య రావణః,
విహాయ సీతాం మదనేన మోహిత
స్స్వమేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్. ౪౬
ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్వావింశస్సర్గః.

అంత రావణుని కనిష్ఠభార్య యయిన ధాన్యమాలిని యనురాక్షసస్త్రీ శీఘ్రముగా రావణునొద్దకుఁ బోయి యతని కౌఁగిలించికొని యిట్లని పలికెను.

మహారాజవగు రావణుఁడా! నీవు నాతోఁ గ్రీడింపుము. నీవు రాక్షసేశ్వరుండవు. వికృతమగువర్ణముగలదియుం మనుష్యస్త్రీయుం నగునాసీత నీకేల ! ౪౦

మహారాజా ! ఇది ఈవిడతప్పుగాదు. నీభుజబలంబున సంపాదింపఁబడినదివ్యభోగంబుల ననుభవించుటకుం దగుభాగ్యంబు ఈవిడకు బ్రహ్మదేవుం డొసఁగఁడయ్యె. కావుననే యీవిడకు నిన్ను భర్తగా వరింప నిష్టము లేకున్నది. ౪౧

తనపై నిచ్ఛలేనిదానిని గోరినచో వ్యర్థముగా దేహంబునకుఁ గ్లేశమే కాని మఱియేమియుం బ్రయోజనములేదు. ౪౨

తనపై నిచ్ఛగలయాడుదానిం గోరినచో మిక్కిలి సంతోషంబు ననుభవింపవచ్చును. కావున నీపై మోహంబుగలదానిని నన్నుంగోరుము. అని ధాన్యమాలిని రావణునితోఁ జెప్పెను.

బలవంతుండును మేఘంబుంబోలు మేనుగలవాఁడునగు నారావణుండు ధాన్యమాలిని చెప్పినమాటలు విని యంత ధ్యానమాలినిచే విడువఁబడినవాఁడై నవ్వుచు నవ్వలికిం బోయెను. ౪౩

ఆరావణుండు భూమి యదరునట్లు పాదన్యాసంబులు సేయుచు మధ్యాహ్నసూర్యుండుంబోలె వెలుంగుచున్న తనగృహంబుం బ్రవేశించెను.

దేవకన్యకలును గంధర్వకన్యలును నాగకన్యలును ఆరావణునిచుట్టుం బరివేష్టించి యతనితోఁగూడ నుత్తమంబగు నాగృహముఁ జొచ్చిరి. ౪౪

ఆరావణుఁడు ధర్మం బవలంబించి దృఢచిత్తయై భయంబున వడంకుచున్న సీతను విడిచి మన్మథమోహితుం డై సుందరం బై వెలుంగుచున్న తన యింటికిం బోయెను. ౪౫

ఇది యిరువదిరెండవ సర్గము.

## త్రయోవింశస్సర్గః

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణశ్శత్రురావణః,
సందిశ్య చ తతస్సర్వా రాక్షసీర్నిర్జగామ హ. ౧

నిష్క్రాన్తే రాక్షసేంద్రే తు పునరంతఃపురం గతే,
రాక్షస్యో భీమరూపా స్తాస్సీతాం సమభిదుద్రువుః. ౨

తతస్సీతాముపాగమ్య రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
పరం పరుషయా వాచా వైదేహీమిదమబ్రువన్. ౩
పౌలస్త్యస్య వరిష్ఠస్య రావణస్య మహాత్మనః,
దశగ్రీవస్య భార్యాత్వం సీతే న బహుమన్యసే. ౪

తత స్త్వేకజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
ఆమన్త్ర్య క్రోధతామ్రాక్షీ సీతాం కరతలోదరీమ్. ౫
ప్రజాపతీనాం షణ్ణాం తు చతుర్థో యః ప్రజాపతిః,
మానసో బ్రహ్మణః పుత్త్రః పులస్త్య ఇతి విశ్రుతః. ౬

పులస్త్యస్య తు తేజస్వీ మహర్షిర్మానసస్సుతః,
నామ్నా స విశ్రవా నామ ప్రజాపతిసమప్రభః. ౭
తస్య పుత్త్రో విశాలాక్షి రావణశ్శత్రురావణః,

తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితుమర్హసి. ౮

మయోక్తం చారుసర్వాంగి వాక్యం కిం నానుమన్యసే,

## ఇరువది మూఁడవ సర్గము

శత్రువులంగొట్టి యేడ్పించునట్టి రావణుండు సీతతో నీప్రకారము చెప్పి యంత రాక్షసస్త్రీలకందఱకు నుత్తరవిధంబున నాజ్ఞాపించి యింటికిం బోయెను. ౧

రాక్షసేశ్వరుండగు రావణుండు వెడలి యంతఃపురంబు సేరఁగానే భయంకరాకారులయిన యారాక్షసస్త్రీలందఱును సీతకు నానావిధకఠినోక్తులం బాధంబు గలుగఁజేసిరి. ౨

అంత నారాక్షసస్త్రీలు పరమకోపంబు వహించి సీతయొద్దకుంబోయి మిక్కిలి పరుషంబులగు వాక్యంబుల సీతతో నిట్లనిరి. ౩

సీతా! సాక్షాత్పులస్త్యప్రజాపతివంశంబునఁ బుట్టినవాఁడును గులంబున నైశ్వర్యంబునను శ్రేష్ఠుఁడును మహాపరాక్రమశాలియుఁ బదికంఠములు గలవాఁడు నగు రావణునకు భార్యగానుండుట నీకెచ్చుగాఁ దోఁచలేదేమి! ౪

అంతట నేకజట యనురాక్షసి కోపంబున నెఱ్ఱనైన కండ్లతో నఱచేయి యంతటి కడుపు గలసీతం బిలిచి యిట్లని చెప్పెను. ౫

'మరీచి రత్ర్యంగిరసౌ పులస్త్యః పులహః క్రతుః' (మరీచియు నత్రియు నంగిరసుండును బులస్త్యుండును బులహుండును గ్రతువును వీరు ప్రజాపతు లార్వురు) అని చెప్పఁబడిన ప్రజాపతు లార్వురిలోను నాలవవాఁడు పులస్త్యుండని పేరొందినవాఁడు బ్రహ్మమానసపుత్రుం డొకఁ డుండెను. ౬

పులస్త్యుని మానసపుత్రుండు మహాప్రభావుండును, మహర్షియు బ్రహ్మదేవునకు సరియయిన వాఁడునగు విశ్రవసుండు. ౭

విశాలమయిన కండ్లుగల సీతా! శత్రువుల నేడ్పించునట్టి యీరావణుండు మహాత్ముండగు నావిశ్రవసుని కొడుకు.

నీ వట్టిసత్కులమునందుఁ బుట్టి రాక్షసుల కందఱకుఁ బ్రభుండై వెలయుచున్న రావణునకు భార్య వగుము. ౮

అన్ని యవయవములును సుందరముగాఁగలసీతా! నీవు నేను చెప్పు మాట నేల వినవు!

తతో హరిజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్ ౯
వివర్త్య నయనే కోపాన్మార్జారసదృశేక్షణా,
యేన దేవాస్త్రయస్త్రింశద్దేవరాజశ్చ నిర్జితాః. ౧౦
తస్య త్వం రాక్షసేన్ద్రస్య భార్యా భవితు మర్హసి,

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ క్రోధమూర్ఛితా. ౧౧
భర్త్సయంతీ తదా ఘోరమిదం వచనమబ్రవీత్,
వీర్యోత్సిక్తస్య శూరస్య సంగ్రామేష్వనివర్తినః. ౧౨
బలినో వీర్యయుక్తస్య భార్యా త్వం కిం న లప్స్యసే,

ప్రియాం బహుమతాం భార్యాం త్యక్త్వా రాజా మహాబలః.
సర్వాసాం చ మహాభాగాం త్వాముపైష్యతి రావణః,

సమృద్ధం స్త్రీసహస్రేణ నానారత్నోపశోభితమ్. ౧౪
అంతఃపురం సముత్సృజ్య త్వాముపైష్యతి రావణః,
అన్యా తు వికటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్. ౧౫
అసకృద్దేవతాయుద్ధే నాగగంధర్వదానవాః,
నిర్జితాస్సమరే యేన స తే పార్శ్వముపాగతః. ౧౬

తస్య సర్వసమృద్ధస్య రావణస్య మహాత్మనః,
కిమద్య రాక్షసేంద్రస్య భార్యాత్వం నేచ్ఛసేఽధమే. ౧౭

తతస్తు దుర్ముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,

యస్య సూర్యో న తపతి భీతో యస్య చ మారుతః. ౧౮

అంతట బిల్లివంటి కండ్లుగల హరిజట యనునొక్కరక్కసి కోపంబునం గండ్లు ద్రిప్పుచు సీతంజూచి యిట్లని చెప్పెను. ౯

ముప్పదిమూఁడుకోట్లదేవతలను దేవేంద్రుని జయించి యెదురులేకున్నట్టి రాక్షసేశ్వరుండగు రావణుండు నిన్నుఁ గోరుచున్నాఁడు నీవు బదులుచెప్పక యతనికి భార్యవగుము. ౧౦

అంతట బ్రఘస యనురక్కసి మహాకోపంబునొంది సీతంజూచి భయంకరంబుగా బెదరించుచు నిట్లని చెప్పెను. ౧౧

మహాపరాక్రమశాలి యగుటచేఁ బరాక్రమంబున నెదురులేక గర్వించి యున్నవాఁడును శూరుండును యుద్ధంబున వెనుదీయనివాఁడును బలవంతుఁడు నగురావణునకు భార్యవగుటకు నీకేమికష్టము ? ౧౨

మహాబలుండును రాక్షసరాజు నగురావణుండు అందఱభార్యలలోను బ్రియురాలయి బహుమానముం బొందినదై మహాభాగయై యుండు మండోదరినింగూడ విడిచి నిన్నే పొందియుండఁగలఁడు. ౧౩

రావణుండు వేవురు స్త్రీలతో నిండి నానావిధమణులచే నలంకృతంబై యుండు నంతఃపురంబునుంగూడ విసర్జించి నిన్నే పొందియుండఁగలఁడు. ౧౪

మఱియొక్కతె వికట యనురాక్షసి సీతంజూచి యిట్లనియె. ౧౫

పలుమాఱు యుద్ధంబున దేవతలును బన్నగులును గంధర్వులును దానవులును ఎవ్వనిచే జయింపబడిరో అట్టి రావణుండు ని న్నాశ్రయించి యున్నాఁడు. ౧౬

సీతా! నీవు నీచురాలవు. సమస్తైశ్వర్యంబులు గలవాఁడును మహాబల పరాక్రమశాలియు రాక్షసేశ్వరుండు నగునట్టి రావణునకు భార్యవై యుండుటకు నీకేమి కష్టము ? ౧౭

అటుపిమ్మట దుర్ముఖి యను పేరుగల రాక్షసస్త్రీ సీతంజూచి యిట్లని చెప్పెను.

విశాలము లగుకండ్లుగలసీతా! ఎవ్వనిభయంబున సూర్యుండు తపింపఁ

న వాతి స్మాయతాపాంగే కిం త్వం తస్య న తిష్ఠసి,

పుష్పవృష్టిం చ తరవో ముముచుర్యస్య వై భయాత్. ౧౯
శైలాశ్చ సుభ్రు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి,
తస్య నైరృతరాజస్య రాజరాజస్య భామిని. ౨౦

కిం త్వం న కురుషే బుద్ధిం భార్యార్థే రావణస్య హి,
సాధు తే తత్త్వతో దేవి కథితం సాధు భామిని. ౨౧
గృహాణ సుస్మితే వాక్య మన్యథా న భవిష్యసి,

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రయోవింశస్సర్గః.

---

## చతుర్వింశస్సర్గః

తతస్సీతాముపాగమ్య రాక్షస్యో వికృతాననాః,
పరుషం పరుషా నార్య ఊచుస్తాం వాక్యమప్రియమ్. ౧

కిం త్వమంతఃపురే సీతే సర్వభూతమనోహరే,
మహార్హశయనోపేతే న వాసమనుమన్యసే. ౨

మానుషీ మానుషస్యైవ భార్యాత్వం బహుమన్యసే,
ప్రత్యాహర మనో రామాన్న త్వం జాతు భవిష్యసి. ౩

త్రైలోక్యవసుభోక్తారం రావణం రాక్షసేశ్వరం,
భర్తారముపసంగమ్య విహరస్వ యథాసుఖమ్. ౪
మానుషీ మానుషం తం తు రామమిచ్ఛసి శోభనే,

చేయకున్నాఁడో ఎవ్వనిభయంబున వాయుదేవుం డధికముగ వీవకున్నాఁడో అట్టిరావణునియొద్ద నుండుటకు నీవేల యిచ్ఛింపవు ? ౧౮

సుందరములయిన కనుబొమలుగలసీతా! ఎవ్వనికి భయంపడి వృక్షములు పూలవానగురియుచున్నవో మఱియు నతండు గోరినప్పుడెల్లఁ గొండలును మేఘంబులును జలం బోసంగుచున్నవో అట్టిరాక్షసేశ్వరుండును రాజరాజు నగురావణునకు భార్యవగుటకై నీవేల యిచ్ఛయింపకున్నావు? ౧౯

సుందరమయిన చిఱునగవుగలసీతా! నీకు యథార్థమయిన సంగతిని చెప్పినాము. నీవా ప్రకారము నడుచుకొనుము. అట్లు కాదేని జీవించియుండలేవు. అని దుర్ముఖ యనురాక్షసి సీతతోఁ జెప్పెను. ౨౦, ౨౧.

ఇది యిరువదిమూఁడవ సర్గము.

## ఇరువదినాల్గవ సర్గము

అటుపిమ్మట వికృతంబులగు ముఖములు గలవారలును బరుషస్వభావులు నగురాక్షసస్త్రీలు ఆసీతంజూచి మరల అప్రియంబును బరుషంబు నగు నీమాటఁ జెప్పిరి. ౧

సీతా! ఎట్టివారికిని గోరఁదగినదియు నుత్తమంబగు శయనంబుతోఁ గూడినదియు నగు నంతఃపురమున నుండుమని ప్రార్థింపఁగా నందు సుఖంబుగాఁ నుండుటకు నీ వేల సమ్మతింపవు ? ౨.

నీవు మనుష్యస్త్రీవి గావున మనుష్యుం డగురామునకు భార్యగా నుండుట గొప్పగాఁ దలంచుచున్నావు. ఎంత నీచురాలవు? ఇంకనైనను రామునియందుండి మనసును ద్రిప్పుకొనుము. ఇంక నీవెప్పటికిని రామునియొద్దఁ జేరి యతనికి భార్యగా నుండలేవు. 3

ముల్లోకంబుల నుత్పన్నంబు లగుధనంబుల ననుభవించుచుండు రాక్షసేశ్వరుండగు రావణుని బెనిమిటిగా వరించి సుఖంబుగా విహరించుచుండుము. ౪

నీవు మంగళస్వరూపిణివి. నిందింపఁదగనిదానవు. అయినను మనుష్య

రాజ్యాద్భ్రష్టమసిద్ధార్థం విక్లబం త్వమనిందితే. ౫

రాక్షసీనాం వచ శ్శ్రుత్వా సీతా పద్మనిభేక్షణా,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యామిదం వచనమబ్రవీత్. ౬

యదిదం లోకవిద్విష్ట ముదాహరథ సంగతాః,
నైతన్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతి వః. ౭

న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. ౮

దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః,
తం నిత్య మనురక్తాఽస్మి యథా సూర్యం సువర్చలా.

యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి,
అరుంధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా. ౧౦
లోపాముద్రా యథాఽగస్త్యం సుకన్యా చ్యవనం యథా,
సావిత్రీ సత్యవంతం చ కపిలం శ్రీమతీ యథా. ౧౧
సౌదాసం మదయంతీవ కేశినీ సగరం యథా,
నైషధం దమయంతీవ భైమీ పతిమనువ్రతా. ౧౨
తథాఽహమిక్ష్వాకువరం రామం పతిమనువ్రతా,

స్త్రీవి కావున రాజ్యభ్రష్టుండును ఏకోర్కెనైన నీడేర్చుకొనలేనివాఁడును మనుష్యుండు నగు రామునే కోరుచున్నావు. రాక్షసేశ్వరుండగు రావణుం డెంత ప్రార్థించినను వినకున్నావు. అని రాక్షసస్త్రీలు సీతతోఁ జెప్పిరి. ౫

తామరపూలంబోలు కండ్లుగల సీతాదేవి యారాక్షసస్త్రీలు చెప్పిన మాటలు విని కన్నీళ్లతో నిండినకండ్లతో నారాక్షసస్త్రీలం జూచి యిట్లని చెప్పెను. ౬

మీరందఱు నొక్కటిగాఁజేరి నన్నుఁగూర్చి లోకవిద్విష్టంబగు నీమాటం జెప్పితిరే యిట్టిమాటఁ జెప్పినట్లయినఁ బాపమని మీమనసునకుఁ దోఁచలేదా యేమి ? ౭

మనుష్యస్త్రీ యెప్పటికిని రాక్షసునకు భార్యయగుటకుఁ దగినదికాదు. మీరందఱును జేరి నన్ను యథేచ్ఛగా భక్షించినను భక్షింపుఁడు. నాకదియుం నిష్టమే. నే నేమో మీరు చెప్పినట్లు చేయను. ౮

నాభర్తయగు రాముండు దీనుండుగాని రాజ్యంబు లేనివాఁడుగాని యతండే నాకధికుండు. సువర్చల సూర్యునియం దనురాగంబు గలిగియుండు నట్లు నేనతనియందే మిగుల యనురాగంబు గలిగియుందును. ౯

మహాభాగయగు శచీదేవి యెట్లు దేవేంద్రు ననుసరించి యుండునో యేప్రకార మరుంధతీదేవి వసిష్ఠు ననుసరించియుండునో యేలాగున రోహిణీదేవి చంద్రు ననుసరించియుండునో యేరీతిని లోపాముద్రాదేవి యగస్త్యు ననుసరించియుండునో యేవిధంబున సుకన్య చ్యవను ననుసరించి యుండినదో యెట్లు సావిత్రి సత్యవంతు ననుసరించియుండినదో యేవిధంబున శ్రీమతి కపిలు ననుసరించి యుండినదో యేవడువున మదయంతి సౌదాసు ననుసరించి యుండినదో యెట్లు కేశిని సగరచక్రవర్తి ననుసరించియుండినదో యెట్లు భీమునికొమార్తెయగు దమయంతి నలచక్రవర్తి ననుసరించి యుండినదో ఆ ప్రకారము నేను నా పెనిమిటి యగు ఇక్ష్వాకువంశంబునఁ బుట్టినవారలలో నుత్తముండగు రామునే యనుసరించియుందును. అని సీత రాక్షసస్త్రీలతోఁ జెప్పెను. ౧౦-౧౩.

సీతాయా వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః. ౧౩
భర్త్సయంతిస్మ పరుషైర్వాక్యై ర్రావణచోదితాః,

అవలీనస్స నిర్వాక్యో హనూమాన్ శింశుపాద్రుమే. ౧౪
సీతాం సంతర్జయంతీ స్తా రాక్షసీరశృణోత్కపిః,

తామభిక్రమ్య సంక్రుద్ధా వేపమానాం సమంతతః. ౧౫
భృశం సంలిలిహుర్దీప్తాన్ ప్రలంబాన్ దశనచ్ఛదాన్,

ఊచుశ్చ పరమక్రుద్ధాః ప్రగృహ్యాశు పరశ్వథాన్. ౧౬

నేయమర్హతి భర్తారం రావణం రాక్షసాధిపం,

సా భర్త్స్యమానా భీమాభీ రాక్షసీభిర్వరాననా. ౧౭

సా బాష్పమపమార్జంతీ శింశుపాం తాముపాగమత్,

తత స్తాం శింశుపాం సీతా రాక్షసీభిస్సమావృతా. ౧౮
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా,

తాం కృశాం దీనవదనాం మలినాంబరధారిణీమ్. ౧౯
భర్త్సయాంచక్రిరే సీతాం రాక్షస్యస్తాం సమంతతః,

తతస్తాం వినతా నామ రాక్షసీ భీమదర్శనా. ౨౦
అబ్రవీత్కుపితాకారా కరాళా నిర్ణతోదరీ,

అట్లు రావణునిచే నాజ్ఞాపింపఁబడియున్న యారాక్షసస్త్రీలు సీతచెప్పిన మాటలు విని మిక్కిలి కోపంబు నొంది పరుషవచనంబుల నా సీతాదేవిని బెదరించుచుండిరి. ౧౩

శింశుపావృక్షమునందు దాఁగియున్న యాహనుమంతుఁడు ఏమియుఁ బలుకక యట్లు సీతను బెదరించుచున్న యారాక్షసస్త్రీల మాటల వినుచుండెను. ౧౪

ఆరాక్షసస్త్రీలు భయంబున గడగడవడఁకుచున్న సీతం జుట్టు చుట్టుకొని మహాకోపంబున నెట్టిగా వెలుంగుచు వ్రేలుకాడుచున్న తమ పెదవుల నాలుకచే నాఁకిరి. ౧౫

ఆరాక్షసస్త్రీ లట్టు మహాకోపంబున గండ్రగొడ్డళ్లం జేకొని సీతం జూచి యిట్లని పలికిరి. ౧౬

ఈసీత రాక్షసులకు ప్రభుండైన రావణునకు భార్యయయి యుండఁ దగదు. అని రాక్షసస్త్రీలు చెప్పిరి.

సుందరంబగు ముఖముగల యాసీత చూపరులకు భయంబుఁబుట్టించు నారాక్షసస్త్రీలచే నట్టు బెదరింపఁబడుచుండెను. ౧౭

ఆసీత యిట్లు రాక్షసస్త్రీలచే బెదరింపఁబడి కన్నీళ్లం దుడుచుకొనుచు హనుమంతుండు దాఁగియున్న శింశుపావృక్షంబు నొద్దకుం బోయెను.

అంత విశాలంబులగు నేత్రంబులుగల సీతాదేవి రాక్షసస్త్రీలు చుట్టును బరివేష్టించిరాఁగా నాహనుమంతుండు దాఁగియున్న శింశుపావృక్షంబుఁ జేరి దుఃఖసముద్రంబులో మునిఁగియుండెను. ౧౮

రాక్షసస్త్రీలు చుట్టునుం జేరి మహాపతివ్రతయు నుపవాసవ్రతంబునం గృశించి దుఃఖితయయి మురికిబట్టలం గట్టుకొనియున్నదియు నగు నాసీతను మఱల బెదరింపసాగిరి. ౧౯

అంత భయంకరములగు కండ్లు గలదియును జూపరులకు వెఱపుఁ బుట్టించునదియు నగు వినత యను రక్కసి కోపంబునొంది యాసీతం జూచి యిట్లని చెప్పెను. ౨౦

సీతే పర్యాప్తమేతావద్భర్తుస్స్నేహో నిదర్శితః. ౨౧

సర్వత్రాతికృతం భద్రే వ్యసనాయోపకల్పతే,

పరితుష్టాస్మి భద్రం తే మానుషస్తే కృతో విధిః. ౨౨

మమాపి తు వచః పథ్యం బ్రువంత్యాః కురు మైథిలీ,

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్. ౨౩
విక్రాంతం రూపవంతం చ సురేశమివ వాసవం,
దక్షిణం త్యాగశీలం చ సర్వస్య ప్రియదర్శనమ్. ౨౪

మానుషం కృపణం రామం త్యక్త్వా రావణమాశ్రయ,

దివ్యాంగరాగా వైదేహి దివ్యాభరణభూషితా. ౨౫

అద్య ప్రభృతి సర్వేషాం లోకానామీశ్వరీ భవ,
అగ్నేస్స్వాహా యథా దేవీ శచీవేంద్రస్య శోభనే. ౨౬
కిం తే రామేణ వైదేహి కృపణేన గతాయుషా,

ఏతదుక్తం చ మే వాక్యం యది త్వం న కరిష్యసి. ౨౭
అస్మిన్ముహూర్తే సర్వాస్త్వాం భక్షయిష్యామహే వయం,

సీతా! నీకు నీపెనిమిటియందుఁ గల స్నేహంబును జూపితివి. ఇంత మట్టుకుం జాలును. ౨౦

మంగళస్వరూపిణివగు సీతా! దేనినైన మిక్కిలి యధికముగా నాచరించినచో దుఃఖంబె గలుగుఁగాని సుఖము గలుగదు. కావున మితముగా నుండవలయును. ౨౧

నీవు మనుష్యజాతికిఁ దగిన పాతివ్రత్యమును బ్రకటించినావు. ఇంత మట్టుకుఁ జాలును. నీపాతివ్రత్యమునకు నేను సంతసించితిని. నీకు మంగళము గలుగుఁగాక. ౨౨

సీతా! నేను నీకు మేలు గలుగుమాటం జెప్పెదను. నేఁ జెప్పినట్లును గొంచెము చేయుము.

పరాక్రమశాలియు రూపవంతుఁడును దేవతలకధిపుం డగు దేవేంద్రుని వంటివాఁడును జతురుండును దాతయుఁ జూపరులకు సంతోషము గల్గించువాఁడును రాక్షసు లందఱకును బ్రభుండు నగు రావణునిం బెనిమిటిగా వరింపుము. ౨౩-౨౪

మనుష్యుఁడును గుత్సితుఁడు నగు రాముం బరిత్యజించి రావణుని వరింపుము.

సీతా! నీవు శ్రేష్ఠమయిన సుగంధం బలందుకొని మంచి యాభరణంబుల ధరించియుండుము.

ఇది మొదలు నీవు సమస్తలోకంబులకును బ్రభువుగా నుండుము. ౨౫

మంగళకరివగు సీతా! అగ్నికి స్వాహాదేవియు నింద్రునకు శచీదేవియు భార్యలుగా నుండునట్లు నీవు రావణునకు భార్యగా నుండుము. రాముండు దుఃఖితుఁడై యున్నవాఁడు, మఱియు రావణునకు విరోధియయి యింక జీవింపఁజాలఁడు. ఇంక నతనియం దాశ విడువుము. ౨౬

నే నిప్పుడు చెప్పిన మాటప్రకారము నీవు చేయవేని ఇప్పుడే మే మందఱమును జేరి నిన్ను భక్షింతుము. అని వినతయను రాక్షసి సీతతోఁ జెప్పినది. ౨౭

అన్యా తు వికటా నామ లంబమానపయోధరా. ౨౮
అబ్రవీత్కుపితా సీతాం ముష్టిముద్యమ్య గర్జతీ,
బహూన్యప్రియరూపాణి వచనాని సుదుర్మతే. ౨౯
అనుక్రోశాన్మృదుత్వాచ్చ సోఢాని తవ మైథిలి,
న చ నః కురుషే వాక్యం హితం కాలపురస్కృతమ్. ౩౦
ఆనీతాఽసి సముద్రస్య పారమన్యైర్దురాసదం,
రావణాంతఃపురం ఘోరం ప్రవిష్టా చాసి మైథిలి. ౩౧
రావణస్య గృహే రుద్ధామస్మాభిస్తు సురక్షితాం,
న త్వాం శక్తః పరిత్రాతుమపి సాక్షాత్పురందరః. ౩౨
కురుష్వ హితవాదిన్యా వచనం మమ మైథిలి,
అలమశ్రుప్రపాతేన త్యజ శోక మనర్థకమ్. ౩౩
భజ ప్రీతిం చ హర్షం చ త్యజైతాం నిత్యదైన్యతాం,
సీతే రాక్షసరాజేన సహ క్రీడ యథాసుఖమ్, ౩౪
జానాసి హి యథా భీరు స్త్రీణాం యౌవనమధ్రువం,
యావన్న తే వ్యతిక్రామేత్తావత్సుఖమవాప్నుహి. ౩౫
ఉద్యానాని చ రమ్యాణి పర్వతో పవనాని చ,

వ్రేలాడుచున్న స్తనములుగల వికట యను మఱియొక్క రాక్షసస్త్రీ కోపంబునఁ బిడికిలి యెత్తి గర్జించుచు సీతం జూచి యిట్లని చెప్పెను. ౨౮

దుష్టబుద్ధివగు సీతా! నీ విదివఱ కెన్ని యప్రియవచనంబు లాడుచున్నను మేము దయవలనను దిన్నఁదనము వలనను వానికన్నింటికిని ఓర్చుచుంటిమి. ౨౯

ఇప్పటికాలమునకుఁ దగినట్లుగా నీకు మేలు గల్గునట్లుగా మేము చెప్పినమాటలను జేయకున్నావు. ౩౦

ఇప్పుడు నీవు సముద్రముదాఁటి యీవలిగట్టునకుఁ దేఁబడియున్నావు. ఇట్లు సముద్రముదాఁటి యిచ్చటికి వచ్చుటకు ఇంక మఱి యెవ్వరికిని నలవిగాదు.

సీతా! మఱియెవ్వరికిం జొరరాని రావణు నంతఃపురంబులో నున్నావు. ౩౧

రావణునియింట దాఁచఁబడి మాచే జక్కఁగా రక్షింపఁబడుచున్న నిన్నిచ్చటనుండి కొనిపోవుటకు సాక్షాద్దేవేంద్రుఁడైనను శక్తుండు గాఁడు.

సీతా! నేను నీకు మేలు గలుగుటకై చెప్పుచున్నాను. నామాట ప్రకారము సేయుము. ౩౨

నీ విట్లు కన్నీరు విడుచుటం జాలింపుము. ఇట్లు నిష్ప్రయోజనముగా దుఃఖింపకుము. ౩౩

రావణునియందు స్నేహంబు నుంచి సంతోషంబుగా నుండుము. ఇట్లు ఎల్లప్పుడు నేకరీతిగా దుఃఖించుచుండకుము.

సీతా! రాక్షసేశ్వరుండగు రావణుఁగూడి సుఖముగా రమింపుచుండుము.

భయముగలదానవగు సీతా! స్త్రీలకు యౌవనము నిత్యముగాదని నీకుఁ దెలియును గదా!

అట్టి నీయౌవనము నశించుటకు మున్నె రావణునిం గూడి సుఖంబు లనుభవింపుము.

మదముగప్పినట్లు కండ్లుగల సీతా! నీవు రాక్షసేశ్వరుండగు రావణుని

సహ రాక్షసరాజేన చర త్వం మదిరేక్షణే. ౩౬

స్త్రీసహస్రాణి తే సప్త వశే స్థాస్యంతి సుందరి,

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్. ౩౭

ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి,
యది మే వ్యాహృతం వాక్యం న యథావత్కరిష్యసి. ౩౮
తతశ్చండోదరీ నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భ్రామయంతీ మహచ్ఛూలమిదం వచనమబ్రవీత్ ౩౯
ఇమాం హరిణలోలాక్షీం త్రాసోత్కంపిపయోధరాం,
రావణేన హృతాం దృష్ట్వా దౌహృదో మే మహానభూత్.౪౦

యకృత్ప్లీహమథోత్పీడం హృదయం చ సబంధనం,
అంత్రాణ్యపి తథాశీర్షం ఖాదేయమితి మే మతిః. ౪౧

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
కంఠమస్యా నృశంసాయాః పీడయామ కిమాస్యతే. ౪౨
నివేద్యతాం తతో రాజ్ఞే మానుషీ సా మృతేతి హ,

నాత్ర కశ్చన సందేహః ఖాదతేతి స వక్ష్యతి. ౪౩

గూడి రమణీయంబులగు నుద్యానవనంబులందును బర్వతముల సమీపమునందలి వనంబులందును విహరించుచుండుము. 3౬

సౌందర్యవతివగు సీతా ! ఏడువేలమంది స్త్రీలు నీ వశంబులో నుండి నీకు సేవ సేయుచుండుదురు.

సమస్తరాక్షసులకుఁ బ్రభుండై వెలయుచున్న రావణుని బెనిమిటిగా వరింపుము. 3౭

సీతా ! నేను చెప్పినమాట ప్రకారము సేయవేని నీగుండెం బెఱికి భక్షింతును. అని వికట యనునది సీతతోఁ జెప్పినది. 3౮

అంత చండోదరి యను రాక్షసి మహాకోపంబునొంది శూలంబుఁ ద్రిప్పుచు నీమాటం జెప్పెను. 3౯

జింకకుంబోలెఁ జంచలంబులగు నేత్రంబులు గలదియుఁ భయంబున నిట్టూర్పులు విడుచుటంజేసి వడకుచున్న స్తనంబులుగలదియు నగు నీసీతను రావణుం డిచ్చటికిఁ దెచ్చినప్పుడు నేఁజూచినది మొదలు నాకొక గొప్ప కోర్కి గలిగియున్నది. ౪౦

ఈ సీతం జంపి ఈబిడదేహమునందు హృదయమునకు దక్షిణభాగంబుననుండు మాంసమును దానికి వామభాగమునందుండు మాంసమును దానికిఁ బయినుండు నేమాంసమును లేక హృదయస్థానమున దామరమొగ్గలవలె నుండు మాంసమును దానికిఁ గ్రింద నాధారమయి యుండు మాంసమును బ్రేగులను దలను దినవలయునని నేను గోరుచున్నాను. అని చండోదరి చెప్పినది. ౪౧

అంతఁ బ్రఘస యనురాక్షసి యిట్లని చెప్పినది.

క్రూరచిత్తయగు నీసీతమెడను బిసికి చంపివేయుదము. ఊరకుండనేల?

ఆవెనుక "మనుష్యయగు సీత చచ్చినది" అని రావణునకుఁ జెప్పుదుము.

అంత రావణుండును "అయితే భక్షింపుఁడు" అని చెప్పును. ఈవిషయమునం దెంతమాత్రమును సందేహము లేదు. అని ప్రఘస యను రాక్షసి చెప్పినది. ౪౩

తత స్త్వజాముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
విశస్యేమాం తతస్సర్వాస్సమాన్ కురుత పీలుకాన్. ౪౪

విభజామ తతస్సర్వా వివాదో మే న రోచతే,

పేయమానీయతాం క్షిప్రం లేహ్యముచ్చావచం బహు. ౪౫

తతశ్శూర్పణఖా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
అజాముఖ్యా యదుక్తం హి తదేవ మమ రోచతే. ౪౬
సురా చానీయతాం క్షిప్రం సర్వశోకవినాశినీ,
మానుషం మాంసమాస్వాద్య నృత్యామోఽథ నికుంభిలామ్.

ఏవం సంభర్త్స్యమానా సా సీతా సురసుతోపమా,
రాక్షసీభిస్సుఘోరాభి ర్ధైర్య ముత్సృజ్య రోదితి. ౪౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుర్వింశస్సర్గః

## పఞ్చవింశస్సర్గః

తథా తాసాం వదంతీనాం పరుషం దారుణం బహు,
రాక్షసీనామసౌమ్యానాం రురోద జనకాత్మజా. ౧
ఏవముక్తా తు వైదేహీ రాక్షసీభిర్మనస్వినీ,
ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా. ౨
న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి,

అంత అజాముఖి యను రాక్షసస్త్రీ యిట్లని చెప్పినది.

మీరందఱును చేరి యీసీతదేహమును ఛేదించి సమముగా మాంస ఖండములం జేయుఁడు. ౪౪

అంత మనమందఱమును ఆమాంసఖండములను సమానముగాఁ బంచు కొందము. నాకుఁ గలహముఁజేయుట సరిపడదు.

నానావిధములగు మద్యములను దేశిమొదలగు లేహ్యపదార్థములను దీసికొనిరండు. వానిం జేర్చికొని భక్షింతము. అని యజాముఖి యనురాక్షసి చెప్పినది. ౪౫

అంత శూర్పణఖ యనురాక్షసి యిట్లని చెప్పెను.

అజాముఖి యేమి చెప్పినదో అదియే నాకును సరిగాఁ దోఁచుచున్నది.

దుఃఖంబులనెల్లఁ బోఁగొట్టునట్టి మద్యమునుం దీసికొనిరండు. మనుష్య మాంసమును భక్షించి యీమద్యముం గ్రోలి లంక పశ్చిమద్వారమునందుండు నికుంభిల యనుశక్తికిఁ బ్రీత్యర్థమయి నర్తనము సేయుందము. అని శూర్పణఖ యనురాక్షసి చెప్పినది. ౪౬

దేవకన్యకయుం బోలె సర్వాంగసుందరి యయియుండు నాసీత యిట్లు భయంకరులయిన రాక్షసస్త్రీలు సేయుబెదరింపులకు జడిసి ధైర్యంబు విడిచి రోదనముచేసెను. ౪౭

ఇది యిరువదినాల్గవసర్గము.

---

## ఇరువదియైదవసర్గము

భయంకరాకారలయిన యీ రాక్షసస్త్రీలు అట్లు కఠినముగాను భయంకరముగాను బెక్కుమార్లు సెప్పుచుండఁగా నామాటలను విని సీత దుఃఖమున నేడ్చినది. ౧

మంచిమనస్సు గలసీత రాక్షసస్త్రీలమాటలను విని పరమభయంబు నొంది డగ్గుత్తికతో నిట్లని చెప్పినది. ౨

ఎప్పటికిని మనుష్యస్త్రీ రాక్షసునకు భార్య కాఁదగదు. కావున నేను

కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 3

సా రాక్షసీమధ్యగతా సీతా సురసుతోపమా,
న శర్మ లేభే దుఃఖార్తా రావణేన చ తర్జితా. ౪

వేపతేస్మాధికం సీతా విశంతీవాంగమాత్మనః,
వనే యూథపరిభ్రష్టా మృగీ కోకైరివార్దితా. ౫

సా త్వశోకస్య విపులాం శాఖామాలంబ్య పుష్పితాం,
చింతయామాస శోకేన భర్తారం భగ్నమానసా. ౬
సా స్నాపయంతీ విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః,
చింతయంతీ న శోకస్య తదాంతమధిగచ్ఛతి. ౭
సా వేపమానా పతితా ప్రవాతే కదలీ యథా,
రాక్షసీనాం భయత్రస్తా వివర్ణవదనాఽభవత్. ౮
తస్యాస్సా దీర్ఘవిపులా వేపంత్యా సీతయా తదా,
దదృశే కంపినీ వేణీ వ్యాలీవ పరిసర్పతీ. ౯
సా నిశ్శ్వసంతీ దుఃఖార్తా శోకోపహతచేతసా,
ఆర్తా వ్యసృజదశ్రూణి మైథిలీ విలలాప హ. ౧౦
హా రామేతి చ దుఃఖార్తా హా పునర్లక్ష్మణేతి చ,
హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ. ౧౧
లోకప్రవాదస్సత్యోఽయం పండితైస్సముదాహృతః,
అకాలే దుర్లభో మృత్యుస్స్త్రియా వా పురుషస్య వా. ౧౨
యత్రాహమేవం క్రూరాభీ రాక్షసీభిరిహార్దితా,
జీవామి హీనా రామేణ ముహూర్తమపి దుఃఖితా. ౧౩

రావణునకు భార్యఁ గాఁదగను.

మీరందఱు నన్ను యథేచ్ఛగాఁ దినివేయుఁడు. నేను మీరుచెప్పినట్లు చేయను. అని సీత చెప్పినది. ౩

అట్లు రావణునిచే బెదరింపఁబడిన దుఃఖంబునొంది రాక్షసస్త్రీలనడుమ నున్న దేవకన్యకతో సమానమయిన సీతాదేవి యెంతమాత్రము సుఖంబు నొందదయ్యె. ౪

సమస్తేంద్రియముల వృత్తులను ఉపరమింపఁజేకొనినట్లున్న సీతాదేవి యడవియందు గుంపుదప్పి తోఁడేళ్లచే బాధింపఁబడుచున్న లేడియుంబోలె మిక్కిలియు గడగడ వడంకెను. ౫

ఆసీత అశింశుపావృక్షముదగ్గఱఁ జక్కఁగాఁ బూచి విశాలముగా నుండు నశోకశాఖం బట్టుకొని దుఃఖంబునఁ బెనిమిటియగు రాముని ధ్యానించెను.

అప్పు డట్లాసీత కన్నీళ్లచేఁ బెద్దస్తనంబులు తడియుచుండఁగా మనంబున రాముని ధ్యానించుచు నెంతమాత్రమును దుఃఖావధిని బొందఁజాలదయ్యె ౭

ఆసీత గడగడ వడంకుచు నరఁటిచెట్టు పెద్దగాలికి నేలంబడునట్లు క్రిందఁ బడిలేచి రాక్షసస్త్రీలవలని భయంబునం దెల్లఁబాఱినముఖంబుతో నుండెను. ౮

అప్పు డిట్లు వడంకుచున్న సీత తనవెండ్రుకలజడ పొడవై విశాలమయి కదలుచుండుటం జేసి చలించు సర్పంబుబోలెఁ జూపట్టుచుండినది. ౯

ఆసీత యిట్లు దుఃఖమున బుద్ధి కలఁతనొందఁగా గన్నీళ్లు విడుచుచు రోదనముఁ జేసెను. ౧౦

సీత యిట్లు పరమదుఃఖమునొంది "హా! రాముఁడా! అనియును, హా! లక్ష్మణుఁడా! అనియు, హా! నాయత్తవగుకౌసల్యా! హా! సుమిత్రా!" అనియును రోదనముచేసినది. ౧౧

నే నిట్టిచ్చట నిర్దయలయిన యీరాక్షసస్త్రీలచేఁ దర్జింపఁబడుచు రాముని బాసి దుఃఖముం బొందియుండు బ్రాణంబులు విడువలేక మహార్తమయినను జీవించియున్నాను. కావున, స్త్రీకిఁగానీ పురుషునకుఁగానీ యీశ్వరేచ్ఛ లేనపుడు మరణంబు రానేరదు. అని పండితులు చెప్పుమాట సత్యముగానే యున్నది.

ఏషాఽల్పపుణ్యా కృపణా వినశిష్యామ్యనాథవత్,
సముద్రమధ్యే నౌః పూర్ణా వాయువేగైరివాహతా. ౧౪

భర్తారం త మపశ్యంతీ రాక్షసీవశ మాగతా,
సీదామి ఖలు శోకేన కూలం తోయహతం యథా. ౧౫

తం పద్మదళపత్త్రాక్షం సింహవిక్రాంతగామినం,
ధన్యాః పశ్యంతి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్. ౧౬

సర్వథా తేన హీనాయా రామేణ విదితాత్మనా,
తీక్ష్ణం విషమివాస్వాద్య దుర్లభం మమ జీవితమ్. ౧౭
కీదృశం తు మయా పాపం పురా జన్మాంతరే కృతం,
యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్. ౧౮
జీవితం త్యక్తుమిచ్ఛామి శోకేన మహతావృతా,

రాక్షసీభిశ్చ రక్షంత్యా రామో నాసాద్యతే మయా. ౧౯

ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతాం,
న శక్యం యత్పరిత్యక్తుమాత్మచ్ఛందేన జీవితమ్. ౨౦

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చవింశస్సర్గః.

పదార్థంబులచే నుంపఁబడియుండునోడ సముద్రంబునడుమ వాయువేగంబున నశించునట్లు స్వల్పపుణ్యంబు గలదానను బాపిష్ఠురాలగు నేను అనాథవలెం బోలె నాశంబు నొందఁగలను. ౧౪

నేను నా పెనిమిటియగు నా రామచంద్రునిం జూడఁజాల. ఇట్లు రాక్షసస్త్రీలచేతులలోఁ జిక్కి జలప్రవాహంబు తాఁకుడుచే నశించు నేటిగట్టుంబోలె నాశంబు నొందఁగలను. ౧౫

వికసించిన తామరపూ ఱేకులంబోలు కన్నులుగలవాఁడును సింహంబుబోలె నడచువాఁడును ఇతరులు దనకుఁ గొంచె ముపకారము చేసినను దాని నెచ్చుగా భావించుచుండువాఁడును అందఱకు సంతోషము గలుగునట్లు మాటలాడుచుండువాఁడును అట్లు సర్వాంగసుందరుండును సమస్తసద్గుణసంపన్నుండునగు నా పెనిమిటిని రాముని ఇప్పుడు పుణ్యవంతులయినవారలు చూచుచుందురు. నేను బాపిష్ఠురాలనుగాన నాకట్టి రామునిం జూడఁ గలుగదయ్యె. ౧౬

అట్టి పరమాత్మవేత్తయగు రాముని బాసి నేను దీవ్రంబగు విషంబు గ్రోలినదియుంబోలె నెంతమాత్రము జీవింపఁజాలను. ౧౭

నే నిప్పు డిట్లు అత్యంతభయంకరంబగుదుఃఖము ననుభవించుచున్నానే ఇట్టి దుఃఖమునకుఁ గారణమయినపాపము నేనేమిచేసితిని ? ౧౮

ఇట్టి మహాదుఃఖంబు ననుభవించుచు నేను బ్రతికియుండంజాలను. ప్రాణంబులు విడువఁగోరెదను.

నాకిట్టి రాక్షసస్త్రీలు కావలియున్నారు కావున నే నింక నెప్పటికిని రామునిఁ జేరఁజాలను. ౧౯

మనుష్యులకుఁ గోరినప్పుడు మరణంబు గలుగనేరదు. నాయిష్టము చొప్పున నాకిప్పుడు మృత్యువురాదు. మఱియు నగ్నిపతనాదులచే బ్రాణంబులు విడువవచ్చునన్నచోఁ బతియధీనురాలనుగావున బతియాజ్ఞలేక ప్రాణంబులు విడుచుటకు నా కధికారములేదు. కాఁబట్టి మనుష్యత్వమును ఇతరుల యధీనతలోనుండుటయుం నింద్యాతినింద్యము అని చెప్పుచు సీత యేడ్చినది. ౨౦

ఇది ఇరువదియొుదవసర్గము.

## షడ్వింశస్సర్గః

ప్రసక్తాశ్రుముఖీత్యేవం బ్రువంతీ జనకాత్మజా,
అధోముఖముఖీ బాలా విలప్తుముపచక్రమే. ౧

ఉన్మత్తేవ ప్రమత్తేవ భ్రాంతచిత్తేవ శోచతీ,
ఉపావృత్తా కిశోరీవ వివేష్టంతీ మహీతలే. ౨

రాఘవస్య ప్రమత్తస్య రక్షసా కామరూపిణా,
రావణేన ప్రమథ్యాహమానీతా క్రోశతీ బలాత్. ౩

రాక్షసీవశమాపన్నా భర్త్స్యమానా సుదారుణం,
చింతయంతీ సుదుఃఖార్తా నాహం జీవితుముత్సహే. ౪

న హి మే జీవితేనార్థో నైవార్థైర్న చ భూషణైః,
వసంత్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథమ్. ౫

అశ్మసారమిదం నూనమథవాప్యజరామరం,
హృదయం మమ యేనేదం న దుఃఖేనావశీర్యతే. ౬

ధిఙ్మామనార్యామసతీం యాఽహం తేన వినాకృతా,
ముహూర్తమపి రక్షామి జీవితం పాపజీవితా. ౭

కా చ మే జీవితే శ్రద్ధా సుఖే వా తం ప్రియం వినా,
భర్తారం సాగరాంతాయా వసుధాయాః ప్రియంవదమ్. ౮

భిద్యతాం భక్ష్యతాం వాపి శరీరం విసృజామ్యహం,

# ఇరువదియాఱవసర్గము

జనకుని కొమార్తె యగుసీత తలవంచి కన్నీళ్లు కాఱఁగా నీప్రకారము చెప్పుచు రోదనంబుసేయ నారంభించెను. ౧

సీత పిచ్చిపట్టినదానియట్లు వైకల్యముఁ బొందినదియుం బోలె భ్రాంతినొంది నదివలె నలసటదీఱుటకై పొరలింపఁబడు నాఁడుగుఱ్ఱము చందంబున నేలం బొరలుచు నేడ్చుచుండెను. ౨

రాముండు ప్రమాదంబున నెచ్చటికో పోయియుండఁగా: గామరూపి యగు నీరావణుండు దుఃఖంబున నేడ్చుచున్ననన్ను బలాత్కారంబునం గొని తెచ్చినాఁడు. 3

నే నీరాక్షసస్త్రీలకుఁ జిక్కి వీరలచే భయంకరంబులయిన బెదరింపు మాటలను వినుచు రామునిం జూడనేరక ధ్యానించుచుఁ బరమదుఃఖంబున నిట్లు బ్రతికియుండంజాలను. ౪

తన్నును సారథిని గుఱ్ఱములను గాపాడుకొనుచుఁ బదునాల్గువేల మంది విలుకాండ్రతోఁ బోరఁజాలిన నాపెనిమిటి రాముం బాసి భయంకరా కారలయిన యీరాక్షసస్త్రీలనడుమం జిక్కియున్న నాకు ఇంక బ్రతుకుచే నేమి ప్రయోజనము? ధనముతోఁగాని సొమ్ములతోఁగాని నా కింక నేమి కార్యము? ౫

నే నింతదుఃఖము నొందియున్నను నామనసు నశింపకున్నది. కావున నిది ఱాయివంటిది. నిశ్చయము. అటుకాదేని ముసలితనముగాని మరణముగాని లేక నిత్యముగా నుండునది కాఁబోలు. ౬

అట్టిరామునిం బాసి పాపస్వభావంబు నవలంబించి కొంచెముసేపైనను బ్రాణమును గాపాడుచున్నానే. అట్టి నేను మిక్కిలి దుష్టురాలను. నేదహింపఁ బడుదునుగాక! ౭

నాలుగుసముద్రములవఱకున్న భూమికంతయుఁ బ్రభుఁడును బ్రియం వదుండు నగునట్టి ప్రియుండు రాముండు లేకుండఁగా నాకుఁ బ్రాణమునందుఁ గాని సుఖమునందుగాని యాసక్తి యెందులకు? ౮

రాక్షసస్త్రీలారా! నేను దేహమును విడిచెదను. ముక్కలుగాఁగొట్టుకొనుఁడు.

న చాప్యహం చిరం దుఃఖం సహేయం ప్రియవర్జితా. ౯

చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్,
రావణం కింపునరహం కామయేయం విగర్హితమ్. ౧౦
ప్రత్యాఖ్యాతం న జానాతి నాత్మానం నాత్మనః కులమ్,
యో నృశంసస్వభావేన మాం ప్రార్థయితుమిచ్ఛతి. ౧౧
ఛిన్నా భిన్నా విభక్తా వా దీప్తే వాగ్నౌ ప్రదీపితా,
రావణం నోపతిష్ఠేయం కిం ప్రలాపేన వశ్చిరమ్. ౧౨
ఖ్యాతః ప్రాజ్ఞః కృతజ్ఞశ్చ సానుక్రోశశ్చ రాఘవః,
సద్వృత్తో నిరనుక్రోశశ్శంకే మద్భాగ్యసంక్షయాత్. ౧౩

రాక్షసానాం సహస్రాణి జనస్థానే చతుర్దశ,
యేనైకేన నిరస్తాని స మాం కిం నాభిపద్యతే. ౧౪
నిరుద్ధా రావణేనాహమల్పవీర్యేణ రక్షసా,

సమర్థః ఖలు మే భర్తా రావణం హన్తుమాహవే. ౧౫

విరాధో దండకారణ్యే యేన రాక్షసపుంగవః,
రణే రామేణ నిహతస్స మాం కిం నాభిపద్యతే. ౧౬
కామం మధ్యే సముద్రస్య లంకేయం దుష్ప్రధర్షణా,
న తు రాఘవబాణానాం గతిరోధీహ విద్యతే. ౧౭
కిన్ను తత్కారణం యేన రామో దృఢపరాక్రమః,
రక్షసాపహృతాం భార్యామిష్టాం నాభ్యవపద్యతే. ౧౮

భక్షించినను భక్షింపుఁడు. నేను బ్రియుండగు రాముని బాసి బహుకాలం బీ దుఃఖము నోర్వఁజాలను. ౯

నేను రాక్షసుండగు రావణుని యెడమకాలితోనైనను దాఁకను. మఱి యతనియందు మోహం బుంచుదునా! ఎన్నటికి నుంచను. ౧౦

ఈరావణుండు క్రౌర్యంబు నవలంబించి నన్నుఁ గోరుచున్నాఁడే. ఇతనికి దీనివలనఁ దాను జెడుటయుఁ దనకులంబు నశించిపోవుటయుఁ దెలియకున్నది.

మీరలు నన్ను ఛేదింపుఁడు. ముక్కలుగోట్టుఁడు. పంచుకొనుఁడు. నిప్పులోఁ గాల్చివేయుఁడు. ఏమిచేసినను జేయుఁడు. నే నెంతమాత్రమును రావణుని గౌరవింపను. మీ రెంత యఱచినను బ్రయోజనము లేదు. ౧౨

శత్రువులచేతనుగూడ సద్గుణుండని పొగడంబడినవాఁడును బండితుండును దన కితరులు కొంచె ముపకారముచేసినను దాని నధికముగా భావించువాఁడును దయాశాలి యయినవాఁడును సదాచారుండు నగు రాముండు నా దౌర్భాగ్యంబున నిప్పుడు నిర్దయుండై యతి క్రూరుండుగా నున్నాఁడు అని సందేహించుచున్నాను. ౧౩

ఎవ్వం డొక్కండే జనస్థానంబునఁ బదునాలుగువేల రాక్షసులం జంపెనో అట్టి రాముఁడు నాయొద్దకు వచ్చి నన్నేల రక్షింపఁడు!

స్వల్పంబగు పరాక్రమంబుగల రావణుండు నన్ను నిరోధించుచున్నాఁడు. ౧౪

నా పెనిమిటియగు రాముండు యుద్ధంబున రావణుం జంపుటకు సమర్థుండుగదా. ౧౫

ఎవ్వండు దండకారణ్యంబున రాక్షసశ్రేష్ఠుఁడగు విరాధుని వధించినాఁడో అట్టిరాముండు నన్నేల రక్షింపఁడు? ౧౬

ఈలంక సముద్రంబునడుమ నున్నది కావున నెదిరింపఁగూడనిది వాస్తవమే. అయితే రామబాణంబుల కెందు నడ్డ మేదియు లేదు. ౧౭

తనకుఁ బ్రియభార్యయగు నన్ను రావణుం డపహరించియుండఁగా తాను మహాపరాక్రమశాలియయ్యు రాముండు నన్ను రక్షింపకున్నాఁడే. దీని

ఇహస్థాం మాం న జానీతే శంకే లక్ష్మణపూర్వజః,
జానన్నపి హి తేజస్వీ ధర్షణం మర్షయిష్యతి. ౧౯

హృతేతి యోఽధిగత్వా మాం రాఘవాయ నివేదయేత్,
గృధ్ర రాజోఽపి స రణే రావణేన నిపాతితః. ౨౦

కృతం కర్మ మహత్తేన మాం తథాఽభ్యవపద్యతా,
తిష్ఠతా రావణద్వంద్వే వృద్ధేనాపి జటాయుషా. ౨౧
యది మామిహ జానీయాద్వర్తమానాం స రాఘవః,
అద్య బాణై రభిక్రుద్ధః కుర్యాల్లోక మరాక్షసమ్. ౨౨

విధమేచ్చ పురీం లంకాం శోషయేచ్చ మహోదధిం,
రావణస్య చ నీచస్య కీర్తిం నామ చ నాశయేత్. ౨౩

తతో నిహతనాథానాం రాక్షసానాం గృహేగృహే,
యథాహ మేవం రుదతీ తథా భూయో న సంశయః. ౨౪

అన్విష్య రక్షసాం లంకాం కుర్యాద్రామస్సలక్ష్మణః,

న హి తాభ్యాం రిపుర్దృష్టో ముహూర్తమపి జీవతి. ౨౫

చితాధూమాకులపథా గృధ్రమండలసంకులా,
అచిరేణ తు లంకేయం శ్మశానసదృశీ భవేత్. ౨౬
అచిరేణైవ కాలేన ప్రాప్స్యామ్యేవ మనోరథం,

కేమి కారణము? ౧౮

లక్ష్మణుని కన్నయగు రాముండు నే నిచ్చట నున్నానని యిదివఱ కెఱుంగకున్నాఁడని తోఁచుచున్నది. రాముం డెఱింగియుండునేని మహా పరాక్రమశాలి కావున నీతిరస్కారము నెంతమాత్రము నోర్వఁడు. తక్షణమే రావణుం జంపును? ౧౯

నన్ను రావణుం డపహరించుటం జూచినవాఁడు కావున నీసంగతిని రామున కెవ్వండు చెప్పంగలఁడో అట్టి జటాయువునుంగూడ రావణుండు యుద్ధంబునం జంపినాఁడు. ౨౦

జటాయువు వృద్ధుండైనను రావణునితో నిలిచి యుద్ధముచేసి తనచే నైనంతవఱకు నన్ను రక్షించి మహాకార్యమును జేసినాఁడు. ౨౧

అట్టిరాముండు నే నిచ్చట నున్నానని తెలిసికొనునేని యిప్పుడే కోపంబున బాణంబులు ప్రయోగించి లోకంబులో నొకరాక్షసుండైన లేనట్లు సమస్తరాక్షసులనుం జంపును. ౨౨

నే నిచ్చటనుండుట రామునకుం దెలియునేని అతం డంత మహాకోపంబున సముద్రమును శోషింపఁజేయును. ఈలంకాపట్టణము నూఁదివేయును. మఱియు నీచుండగు రావణుని పేరును కీర్తియును నశించునట్లు సేయును. ౨౩

అంత నే నిచ్చట నె ట్లేడ్చుచున్నానో అట్లు ఇంటింటను దనపెనిమిటులు రామునిచేఁ జంపఁబడుటంజేసి రాక్షసస్త్రీలందఱును ఇంతకన్న నెచ్చుగా నేడ్చుచుండఁగలరు. ఇందుకు సంశయములేదు. ౨౪

రాముండును లక్ష్మణుండును ఈలంకయంతయుం వెదకి రాక్షసులనందఱిం జంపుదురు.

ఆరామలక్ష్మణుల దృష్టిపథంబునం బడునేని శత్రుం డెంతమాత్రమును బ్రదుకంజాలఁడు. ౨౫

ఇంక శీఘ్రముగానే యీలంక మార్గములన్నియుఁ బీనుంగుపొగలం గప్పఁబడఁగా గ్రద్దలతో నిండి శ్మశానంబువంటిది కాఁగలదు. ౨౬

నే నింక శీఘ్రకాలములోనే నాకోర్కె చొప్పున లంకయంతయు శ్మశానంబువంటిదై యుండఁగాఁ జూడఁగలను.

దుష్ప్రస్థానోఽయమాఖ్యాతి సర్వేషాం వో విపర్యయమ్. ౨౭

యాదృశానీహ దృశ్యంతే లంకాయామశుభాని వై,
అచిరేణ తు కాలేన భవిష్యతి హతప్రభా. ౨౮

నూనం లంకా హతే పాపే రావణే రాక్షసాధమే,
శోషం యాస్యతి దుర్ధర్షా ప్రమదా విధవా యథా. ౨౯

పుణ్యోత్సవసముత్థా చ నష్టభర్త్రీ సరాక్షసీ,
భవిష్యతి పురీ లంకా నష్టభర్త్రీ యథాఽంగనా. 30

నూనం రాక్షసకన్యానాం రుదంతీనాం గృహే గృహే,
శ్రోష్యామి నచిరాదేవ దుఃఖార్తానామిహ ధ్వనిమ్. 31

సాంధకారా హతద్యోతా హతరాక్షసపుంగవా,
భవిష్యతి పురీ లంకా నిర్దగ్ధా రామసాయకైః. 32
యది నామ స శూరో మాం రామో రక్తాంతలోచనః,
జానీయాద్వర్తమానాం హి రావణస్య నివేశనే. 33
అనేన తు నృశంసేన రావణేనాధమేన మే,
సమయో యస్తు నిర్దిష్టస్తస్య కాలోఽయమాగతః. 34

[స చ మే విహితో మృత్యురస్మిన్ దుష్టే న వర్తతే]
అకార్యం యే న జానంతి నైరృతాః పాపకారిణః,
అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతి హి సాంప్రతమ్. 35

ఇప్పుడు మీ రిట్లు దుర్మార్గంబునఁ బ్రవర్తించుటవలనను రాక్షసులకందఱకు కీడు వాటిల్లు నని తెలియవచ్చుచున్నది. ౨౭

అట్లు కీడువాటిల్లుటకు సూచకములయిన యమంగళనిమిత్తములును ఈలంకలోఁ గానంబడుచున్నవి.

అట్లు గావున నీలంక యింక స్వల్పకాలంబునను కాంతిచెడి నాశంబు నొందఁగలదు. ౨౮

పాపిష్ఠుండును రాక్షసాధముండునగు రావణుండు రామునిచేతం జంపఁబడి యంతఁ బెనిమిటిచనిపోయిన వెనుకనుండు స్త్రీవలె నీలంక ఏమియు నలంకారమును గాంతియు లేక యుండఁగలదు. ఇది తప్పదు. ౨౯

ఇట్లు నాథుం డగురావణుండును రాక్షసపురుషులందఱును జంపఁబడిన వెనుక నీలంకాపురి విధవయింబోలె మంగళోత్సవ మేదియు లేక కాంతిహీనయయి యుండఁగలదు. ౩౦

నే నింక శీఘ్రముగానే యీలంకయం దింటింటను దమ పెనిమిటులు చంపఁబడుటఁజేసి దుఃఖార్తలై రోదనంబు సేయుచుండు రాక్షసస్త్రీల కంఠధ్వనిని వినఁగలను. ౩౧

ఎఱ్ఱనికొనలుగల కండ్లు గలిగి మహాశూరుండై వెలయురాముండు నేను రావణునింట నున్నానని యెఱుంగునేని యాక్షణమె యీలంకాపురి యతని బాణంబులచే దహింపఁబడును; ఈలంకయంతయుఁ జెనుచీకట్లచేఁ గప్పఁబడి కాంతి చెడియుండును; ఈలంకలోని మేటిరాక్షసులందఱును హతు లగుదురు. ౩౨, ౩౩

క్రూరుండును నీచుండునగు నీరావణుండు నాకు నిర్ణయించిన యవధియును సమీపించినది. [ఈ క్రూరుఁడు శాసించినట్లు వీనివలన నాకెన్నఁడును మృత్యువు గలుగనేరదు.] ౩౪

పాపిష్ఠులగు రాక్షసు లధర్మము నవలంబించి యుండువారలు గావున "ఇది కార్యము. ఇది యకార్యము" అని యెంతమాత్రమును విమర్శింపకయె సాహసింతురు. అట్లగుటంజేసి యిప్పుడు ఈరావణుండు అనర్థంబునకు వెనుదీయక నన్నుఁ జంపినను జంపును. ౩౫

నైతే ధర్మం విజానంతి రాక్షసాః పిశితాశనాః,

ధ్రువం మాం ప్రాతరాశార్థే రాక్షసః కల్పయిష్యతి. ౩౬

సాఽహం కథం కరిష్యామి తం వినా ప్రియదర్శనం,
రామం రక్తాంతనయనమపశ్యంతీ సుదుఃఖితా. ౩౭

యది కశ్చిత్ప్రదాతా మే విషస్యాద్య భవేదిహ,

క్షిప్రం వైవస్వతం దేవం పశ్యేయం పతినా వినా. ౩౮

నాజానాజ్జీవతీం రామస్స మాం లక్ష్మణపూర్వజః,
జానంతౌ తౌ న కుర్యాతాం నోర్వ్యాం హి మమ మార్గణమ్.

నూనం మమైవ శోకేన స వీరో లక్ష్మణాగ్రజః,
దేవలోకమితో యాతస్త్యక్త్వా దేహం మహీతలే. ౪౦

ధన్యా దేవాస్సగంధర్వాస్సిద్ధాశ్చ పరమర్షయః,
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్. ౪౧

అథవా కిన్ను తస్యార్థో ధర్మకామస్య ధీమతః,
మయా రామస్య రాజర్షేర్భార్యయా పరమాత్మనః. ౪౨

ఈరాక్షసులు ఎల్లప్పుడును మాంసమునే భక్షించుచుఁ గ్రూరస్వభావంబు గలిగియుండువారలు కావున వీరలకెంతమాత్రమును ధర్మము తెలియదు.

అట్లు కావున రాక్షసుండగు నీరావణుండు నన్నుఁ బ్రాతఃకాలమునందలి యాహారముగాఁ గొని భక్షింపఁగలఁడు. ఇది నిజము. ౩౬

ఎఱ్ఱనికొనలుంగల కండ్లు గలిగి శూరుఁడైయున్న రాముం జూడక మిక్కిలి దుఃఖంబు నొందియున్నాను. నే నట్టిప్రియదర్శనుం డగు రాముని విడిచి యేమిచేయఁగలను? ౩౭

ఇప్పు డిచ్చట నా కెవ్వండైనను విషము నిచ్చునేని నేను దానిం గ్రోలి రామునివిడిచియుండుటకన్న శీఘ్రముగా యమలోకంబునకుఁ బోదును.

లక్ష్మణుని కన్నయగురామునకు నే నిచ్చట జీవించియున్నానని యిది వఱకుఁ దెలియకుండునట్లు తోఁచుచున్నది. ౩౮

ఆరామలక్ష్మణులకు నే నిచ్చట బ్రతికియుండుట తెలిసియుండునేని వారలు న న్నొంతమాత్రము నుపేక్షింపరు. సిద్ధముగా భూమియంతయుఁ దిరిగి నన్ను వెదకుదురు. అట్లు వెదకినట్లు లేకుండుటవలన వారలకు నాసంగతి తెలియనట్లే యున్నది. ౩౯

అట్లుకాదేని మహాపరాక్రమశాలి యగురాముండు నాదుఃఖంబునచే నేలపై దేహంబు విడిచి స్వర్గలోకంబు నొందెనేమో! ఇది నిశ్చయముగా నుండును. ౪౦

అట్లు మృతుండైన నాపెనిమిటిని తామరపూలుంబోలె విశాలసుందరంబులయిన కండ్లుగలవాని రాముని స్వర్గలోకంబున నెవ్వరు చూచుచున్నారో ఆదేవతలును, గంధర్వులును, సిద్ధులును, మహర్షులును మిక్కిలి ధన్యులు. ౪౧

అటుగాక రాముండు సులక్షణముగా జీవించియుండును. అయినను ధర్మమునందుమాత్రమె యిచ్ఛగలిగి రాజర్షియయి మనస్సు నిర్మలము చేసికొని యిట్లు వైరాగ్యంబునొంది యుండుటంజేసి రామునకు నాపై నక్కఱ తప్పియున్న దేమో! ౪౨

దృశ్యమానే భవేత్ప్రీతిస్సౌహృదం నాస్త్యపశ్యతః,
నాశయంతి కృతఘ్నాస్తు న రామో నాశయిష్యతి. ౪౩

కిం ను మే న గుణాః కేచిత్కిం వా భాగ్యక్షయో మమ,
యాఽహం సీదామి రామేణ హీనా ముఖ్యేన భామినీ. ౪౪

శ్రేయో మే జీవితాన్మర్తుం విహీనాయా మహాత్మనః,
రామాదక్లిష్టచారిత్రాచ్ఛూరాచ్ఛత్రునిబర్హణాత్. ౪౫

అథవా న్యస్తశస్త్రౌ తౌ వనే మూలఫలాశినౌ,
భ్రాతరౌ హి నరశ్రేష్ఠౌ సంవృత్తౌ వనగోచరౌ. ౪౬

అథవా రాక్షసేంద్రేణ రావణేన దురాత్మనా,
ఛద్మనా ఘాతితౌ శూరౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ. ౪౭

సాఽహమేవం గతే కాలే మర్తుమిచ్ఛామి సర్వదా,
న చ మే విహితో మృత్యురస్మిన్ దుఃఖేఽపి వర్తతి. ౪౮
ధన్యాః ఖలు మహాత్మానో మునయస్త్యక్తకిల్బిషాః,
జితాత్మానో మహాభాగా యేషాం న స్తః ప్రియాప్రియే. ౪౯

స్నేహంబు గలిగినవెనుక నొకరినొకరు జూచుకొను చుండుదురేని యాస్నేహము చెడకుండును. అట్లు చూచుకొనకుందురేని యాస్నేహము నశించును. కావున నేనును రాముండును ఒకరినొకరు విడిచియున్నాము. కాబట్టి నాయందు రామునకుఁ గల్గియుండినస్నేహము నశించినదేమొ!

ఇతరులు తమకుఁజేసిన యుపకారము మఱచునట్టి పాపాత్ములు మాత్రమె యట్లు పూర్వముగలిగిన ప్రీతిని వియోగముగల్గినప్పుడు మఱతురు. కాని రాముండుమాత్రము ఎవ్వరియందేని మొదటఁ దనకుఁ బ్రీతి గల్గినచో దాని నెన్నఁటికిని మఱువఁడు కావున నాతని కెప్పుడును ప్రీతి తప్పియుండదు. ౪౩

ఆఁడుదాననగు నేను నెనిమిటియగుచున రాముని బాసి యిట్లు దుఃఖంబున నాశంబు నొందుచున్నానే? నే నింతకుముందు చేసినపాపమువలన నిట్లు నాకు వాటిల్లినదా? లేక నాదౌర్భాగ్యమే దీనికిఁ గారణమా? ౪౪

మహాత్ముండును నిర్దోషంబగు చరిత్రముగలవాఁడును శూరుండును శత్రులం జంపువాఁడునగు రామునిం బాసి జీవించియుండుటకన్న నాకు మరణంబు నొందుటయ మేలు. ౪౫

అట్లుగాదేని మూలంబులను బండ్లనుం దినుచు నడవిం దిరుగుచున్న పురుషశ్రేష్ఠులగు నారామలక్ష్మణు లిద్దఱును దుఃఖంబున నాయుధంబులు విడిచి మునివృత్తి నవలంబించియున్నారేమొ! ౪౬

అటుగాదేని దుష్టాత్ముండును రాక్షసేశ్వరుండునగు నీ రావణుండు శూరులగు నారామలక్ష్మణుల నిద్దఱను గపటంబున జంపినాఁడా యేమి?

కాలమహిమ యిట్టియినది కావున నేను రాముని విడిచి యెంతమాత్రము బ్రతికియుండంజాలను. ప్రాణంబులు విడువఁగోరెదను. ౪౭

ఇట్టి మహాదుఃఖము గలిగియున్నను నాకు మరణంబు సిద్ధింపకున్నది.

మాకుండునట్టు "ఇది ప్రియము, ఇది యప్రియము" అనుభేద మెవ్వరికి లేకున్నదో అట్టి యధికధైర్యము గలవారలును పాపంబులేనివారలును మనము స్వాధీనముచేసికొని యుండువారలును మహాభాగులు నగు మునులు

ప్రియాన్న సంభవేద్దుఃఖమప్రియాదధికం భయం,
తాభ్యాం హి యే వియుజ్యంతే నమస్తేషాం మహాత్మనామ్.

సాఽహం త్యక్తా ప్రియార్హేణ రామేణ విదితాత్మనా,
ప్రాణాంస్త్యక్ష్యామి పాపస్య రావణస్య గతా వశమ్. ౫౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షడ్వింశస్సర్గః.

---

## సప్తవింశస్సర్గః

ఇత్యుక్తాస్సీతయా ఘోరా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
కాశ్చిజ్జగ్ముస్తదాఖ్యాతుం రావణస్య తరస్వినః. ౧

తతస్సీతాముపాగమ్య రాక్షస్యో ఘోరదర్శనాః,
పునః పరుషమేకార్థ మనర్థార్థ మథాబ్రువన్. ౨

అద్యేదానీం తవానార్యే సీతే పాపవినిశ్చయే,
రాక్షస్యో భక్షయిష్యంతి మాంసమేతద్యథాసుఖమ్. ౩
సీతాం తాభిరనార్యాభిర్దృష్ట్వా సంతర్జితాం తదా,
రాక్షసీ త్రిజటా వృద్ధా శయానా వాక్యమబ్రవీత్. ౪

ఆత్మానం ఖాదతానార్యా న సీతాం భక్షయిష్యథ,
జనకస్య సుతా మిష్టాం స్నుషాం దశరథస్య చ. ౫

ఇట్టి కష్టము ననుభవింపవలసినది లేదు కావున పుణ్యవంతులు. ౪౯

ప్రియం బగుదానివలన సుఖంబు గలుగును. అప్రియం బగుదానివలన దుఃఖము గలుగును. అట్టి సుఖదుఃఖములు గలిగించు ప్రియాప్రియంబులను విడిచియుండు మహాత్ములగు మునులకు నమస్కరించెదను. ౫౦

నే నట్టిదానను గాను. కేవలము ప్రియపదార్థమునందే ప్రీతిగలదానను గావున నాకుఁ బ్రియుండగు రాముని విడిచి యప్రియుండగు పాపిష్ఠుని రావణుని యధీనతకుం జిక్కి బ్రతికియుండఁజాలను. ప్రాణంబులు విడిచెదను అని సీత యేడ్చినది. ౫౧

ఇది యిరువదియాఱవ సర్గము.

---

## ఇరువదియేడవ సర్గము

భయంకరాకారలగు రాక్షసస్త్రీలు సీతమాటలు విని మహాకోపంబు నొంది యందుఁ గొందఱు అట్లు సీత ప్రాణంబులు విడువ నిశ్చయించిన సంగతిని బలవంతుండగు రావణునకుం జెప్పుటకుఁ బోయిరి. ౧

చూచువారలకు భయంబుగలిగించు నారాక్షసస్త్రీలు సీతయొద్దకు వచ్చి మరల మునుపుచెప్పినట్లె పరుషంబును అనర్థము గల్గించునదియు నగు మాటం జెప్పిరి. ౨

దుష్టురాలవు పాపిష్ఠురాలవు నగు సీతా! నేఁ డీక్షణమునందు రాక్షసస్త్రీలు నీదేహమునందలి మాంసమును దనివిదీఱం దినఁగలరు. ౩

అప్పు డట్లు దుష్టలయిన యారాక్షసస్త్రీలు బెదరించుచుండుటం జూచి యంతవఱకుఁ బరుండి నిద్రించుచుండిన ముసలిరాక్షసి త్రిజట యనునది యా రాక్షసస్త్రీలం జూచి యిట్లని చెప్పెను. ౪

దుష్టలయిన రాక్షసస్త్రీలారా! జనకుఁగొమార్తెయు దశరథునకుఁ గోడలును ప్రపంచమునకంతయుఁ బ్రియము నగు సీతను భక్షింపకుఁడు; అందుకు బదులుగా నన్ను భక్షింపుఁడు. ౫

స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రాక్షసానామభావాయ భర్తురస్యా జయాయ చ. ౬

ఏవముక్తాస్త్రిజటయా రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
సర్వా ఏవాబ్రువన్భీతా స్త్రిజటాం తామిదం వచః. ౭
కథయస్వ త్వయా దృష్టః స్వప్నోఽయం కీదృశో నిశి,
తాసాం శ్రుత్వా తు వచనం రాక్షసీనాం ముఖాచ్చ్యుతమ్. ౮

ఉవాచ వచనం కాలే త్రిజటా స్వప్నసంశ్రితం,
గజదంతమయీం దివ్యాం శిబికామంతరిక్షగామ్. ౯
యుక్తాం హంససహస్రేణ స్వయమాస్థాయ రాఘవః,
శుక్లమాల్యాంబరధరో లక్ష్మణేన సహాగతః. ౧౦
స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లాంబరావృతా,
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వతమాస్థితా. ౧౧
రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా,
రాఘవశ్చ మయా దృష్టశ్చతుర్దంతం మహాగజమ్. ౧౨
ఆరూఢశ్శైలసంకాశం చచార సహలక్ష్మణః,

తతస్తౌ నరశార్దూలౌ దీప్యమానౌ స్వతేజసా. ౧౩
శుక్లమాల్యాంబరధరౌ జానకీం పర్యుపస్థితౌ,

తతస్తస్య నగస్యాగ్రే హ్యాకాశస్థస్య దంతినః. ౧౪
భర్త్రా పరిగృహీతస్య జానకీస్కంధమాశ్రితా,
భర్తురంకాత్సముత్పత్య తతః కమలలోచనా. ౧౫

రాక్షసులకు వినాశంబును ఈసీత పెనిమిటియయిన రామునకు జయంబును సూచించునట్టి భయంకరంబును గగుర్పాటు గలిగించునదియు నగు నొక స్వప్నంబు గంటిని. అని త్రిజట రాక్షసస్త్రీలతోఁ జెప్పినది. ౬

అట్లు మహాశోకంబు నొందియుండు నారాక్షసస్త్రీలు త్రిజటచెప్పిన మాటను విని యందఱును భయంబునొంది త్రిజటంజూచి యిట్లని జెప్పిరి. ౭

నీ వీరాత్రియందుఁ గనిన స్వప్నం బెట్టిదో మాకుఁ జెప్పుము.

ఉషఃకాలమునందు త్రిజట ఆరాక్షసస్త్రీలమాటను విని వారలకుఁ దన స్వప్నవృత్తాంతము నిట్లని చెప్పెను. ౮

రాముండు తెల్లనిపువ్వుమాలికలను వస్త్రంబులునుం దాల్చి యేనుఁగు దంతములతోఁ జేయఁబడినదియు నంతరిక్షమునందు సంచరించునదియును వేయిహంసలు గూర్పంబడియుండునదియు నగు శ్రేష్ఠమయిన పల్లకి నెక్కి లక్ష్మణునితోఁగూడ నీలంకకు వచ్చెను. ౯, ౧౦

ఇప్పుడు నేను స్వప్నంబున నే ఈసీత తెల్లనివస్త్రంబు గట్టుకొని సముద్రంబు నడుమనుండు శ్వేతపర్వతంబు నెక్కియున్నట్టు చూచినాను.

వెల్తురు సూర్యునితోఁగూడియుండు విధంబున ఈసీత రామునితోఁ జేరియున్నట్టు చూచినాను. ౧౧

రాముండు లక్ష్మణునింగూడి నాలుగుదంతములుగలదియుఁ బర్వతముంబోలె నుండునదియు నగు పెద్దయేనుఁగు నెక్కి లంకలో సంచరించునట్లు చూచినాను. ౧౨

అంతటఁ దమదేహకాంతిచే వెలుంగుచుఁ దెల్లనిపువ్వుమాలికలను వస్త్రంబులను దాల్చియున్న పురుషశ్రేష్ఠులయిన యా రామలక్ష్మణులును సీతాసమీపంబునకు వచ్చిరి. ౧౩

అంత శ్వేతపర్వతశిఖరసమీపంబున నాకాశంబునందున్న రాముం డెక్కిన యేనుంగుపై సీతాదేవి యెక్కినది. ౧౪

అంతఁ దామరఱేకులఁ బోలు కండ్లుగల యాసీత పెనిమిటియగు

చంద్రసూర్యౌ మయా దృష్టౌ పాణినా పరిమార్జతీ,
తతస్తాభ్యాం కుమారాభ్యామాస్థితస్స గజోత్తమః. ౧౬
సీతయా చ విశాలాక్ష్యా లంకాయా ఉపరి స్థితః,
పాణ్డురర్షభయుక్తేన రథేనాష్టయుజా స్వయమ్. ౧౭
[శుక్లమాల్యామ్బరధరో లక్ష్మణేన సహాగతః,
తతోఽన్యత్ర మయా దృష్టో రామస్సత్యపరాక్రమః.]
ఇహోపయాతః కాకుత్స్థస్సీతయా సహ భార్యయా,
[సాణ్డం త్రిభువనం సర్వం సర్వతస్సచరాచరం,
సర్వం గ్రస్తం మయా దృష్టం రామేణాక్లిష్టకర్మణా.
క్షీరోదధిజలే మధ్యే శ్వేతశ్శైలస్సముత్థితః,
తస్య మూర్ధ్ని తతశ్శ్వేతశ్చతుర్దంతో మహాగజః.
తస్య పృష్ఠే స్థితః శ్రీమాన్ రామో రాజీవలోచనః,
తతస్సీతా సముత్పత్య భర్తురఙ్కాశ్రితా తదా,
బాహుభ్యాం సంపరిష్వజ్య సంపూర్ణం చంద్రమండలం,
తతోఽన్యత్ర మయా దృష్టో రామో రాజీవలోచనః.
ఆసీనః ప్రాఙ్ముఖః శ్రీమానాసనే పరమాద్భుతే,
అభిషిక్తస్తు కాకుత్స్థః సర్వదేవైర్నమస్కృతః.
స బ్రహ్మర్షిగణైస్సర్వైః సర్వతీర్థజలేన చ,
శుక్లమాల్యాంబరధరా శుక్లమాల్యానులేపనా,
సాధు సా తత్ర సుశ్రోణీ రరాజ జనకాత్మజా,
తతో దేవాస్సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః,
బ్రహ్మాణమగ్రతః కృత్వా రామం తత్ర వవన్దిరే,
పునరేవ మయా దృష్టో రామో రమయతాం వరః.
విష్ణురేవ స్వయం భూత్వా తస్మిన్నాస్తే వరాసనే,

రాముని తొడపైనుండి లేచి హస్తంబునఁ జంద్రసూర్యులం బట్టుచుండునట్లు చూచినాను. ౧౫

అంత శ్రీరామలక్ష్మణులును బెద్దకండ్లుగల సీతయును ఎక్కియున్న యాయేనుంగు ఆకాశంబున లంకకుఁ బైఁగా నుండునట్లు చూచినాను. ౧౬

రాముఁడు సీతతోఁగూడ నెనిమిది తెల్లయెద్దులు గట్టంబడియుండు రథంబునెక్కి యిచ్చటికి వచ్చినాఁడు. [తర్వాత మఱియొకవైపున తెల్లని యుడుపులు ధరించుకొని లక్ష్మణునితోఁ గూడి వచ్చియున్న కుంటువడని పరాక్రమముగల రాముని జూచినాను.] ౧౭

[ఈముల్లోకములతోడి బ్రహ్మాండమంతయు జంగమస్థావర సమేతముగా రాముఁడు మ్రింగివేసిన ట్లగపడెను. ఒకవైపున పాలసముద్రములో నట్టనడుమ విజృంభించియున్న యొక తెల్లనికొండమీఁద నాలుగుకోఱలుగల పెద్ద తెల్ల యేనుఁగ గనబడెను. ఆయేనుఁగువీఁపుమీఁద శ్రీరామచంద్రమూర్తి యెక్కియుండెను. ఇంతలో సీతమ్మయు నెగసివచ్చి యారాముని తొడమీఁదఁ గూర్చుండెను. రాముఁడున్ను ఆమెను ప్రియముమీఱఁ గౌఁగిలించికొన్న ట్లగపడెను. ఇంకొక్కదిక్కున అతిపవిత్రమైన భద్రాసనమందు రాముఁడు తూర్పుమొగముగాఁ గూర్చున్నట్లును ఎల్లదేవతలు మహర్షులును వచ్చి సర్వతీర్థజలముల తోడ ఆయన కభిషేకముచేసినట్లును సీతమ్మయు తెల్లనివస్త్రములు పూవులు గందము ధరించుకొని కన్నులపండువుగా వెలుంగుచున్నట్లును సమస్తదేవతలు బ్రహ్మతోఁ గలసివచ్చి రామునకు మ్రొక్కి వీడ్కొనినట్లును చూచితిని. మఱియొకప్రక్క రాముఁడు తననిజరూపముతో శంఖచక్రాదిదివ్యశ్రీచిహ్నములను ధరించి వైకుంఠవాసియు పరాత్పరుఁడునగు విష్ణువువిధమున దివ్యసింహాసనముపై మెఱయఁగా దేవతలు పితృదేవతలు మునులు గంధర్వులు విద్యాధరులు నాగులు మొదలయినవారందఱు చేతులు జోడించుకొని పట్టాభిషిక్తుండైన యామహావిష్ణువును సేవించుచున్నట్లును తర్వాత సమస్తగాయకులు రంభాద్యప్సరసలు వచ్చి వివిధనృత్యగానముచే సేవించినట్లును చూచితిని.]

పరం బ్రహ్మ పరం తత్త్వం పరం జ్ఞానం పరంతపః.
పరం బీజం పరం క్షేత్రం పరం కారణకారణం,
శంఖచక్రగదశ్శ్రీమా౯ పుండరీకాయతేక్షణః
శ్రీవత్సవక్షా నిత్యశ్రీరజేయశ్శాశ్వతో ధ్రువః,
ఏవంభూతో మహాతేజా రామః కమలలోచనః,
సర్వలోకేశ్వరశ్శ్రీమా౯ సస్రజ రఘునన్దనః,
తతోఽమరేంద్రాః పితరో మునీంద్రా
గంధర్వవిద్యాధరపన్నగేన్ద్రాః,
కృతాభిషేకం పరివార్య రామం
ప్రతుష్టువుః ప్రాఞ్జలయః ప్రహృష్టాః.
తతస్తు సర్వాప్సరసః ప్రహృష్టా
నృత్యన్తి గాయన్తి సమేత్య యత్ర,
వాద్యం ప్రకుర్వన్తి సమేత్యశంఖా
వంశాశ్చ వీణా మురజాశ్చ భేర్యః.
తతోఽన్యత్ర మయా దృష్టో రామస్సత్యపరాక్రమః.]
లక్ష్మణేన సహభ్రాత్రా సీతయా సహ వీర్యవాన్. ౧౮
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభం,
ఉత్తరాం దిశమాలోక్య జగామ పురుషోత్తమః. ౧౯
ఏవం స్వప్నే మయా దృష్టో రామో విష్ణుపరాక్రమః,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ రాఘవః. ౨౦

న హి రామో మహాతేజాశ్శక్యో జేతుం సురాసురైః,
రాక్షసైర్వాపి చాన్యైర్వా స్వర్గః పాపజనైరివ. ౨౧

రావణశ్చ మయా దృష్టః క్షితౌ తైలసముక్షితః,

రక్తవాసాః పిబన్మత్తః కరవీరకృతస్రజః. ౨౨

విమానాత్పుష్పకాదద్య రావణః పతితో భువి,
కృష్యమాణస్స్త్రియా దృష్టో ముండః కృష్ణాంబరః పునః. ౨౩

రథేన ఖరయుక్తేన రక్తమాల్యానులేపనః,
పిబంస్తైలం హసన్నృత్యన్ భ్రాన్తచిత్తాకులేన్ద్రియః. ౨౪

గర్దభేన యయౌ శీఘ్రం దక్షిణాం దిశమాస్థితః,

పునరేవ మయా దృష్టో రావణో రాక్షసేశ్వరః. ౨౫

పతితోఽవాక్ఛిరా భూమౌ గర్దభాద్భయమోహితః,
సహసోత్థాయ సంభ్రాన్తో భయార్తో మదవిహ్వలః. ౨౬
ఉన్మత్త ఇవ దిగ్వాసా దుర్వాక్యం ప్రలపన్బహు,
దుర్గంధం దుస్సహం ఘోరం తిమిరం నరకోపమమ్. ౨౭
మలపంకం ప్రవిశ్యాశు మగ్నస్తత్ర స రావణః,
ప్రస్థితో దక్షిణామాశాం ప్రవిష్టః కర్దమహ్రదం,]
కంఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ. ౨౮
కాలీ కర్దమలిప్తాంగీ దిశం యామ్యాం ప్రకర్షతి,
ఏవం తత్ర మయా దృష్టః కుంభకర్ణో నిశాచరః. ౨౯

రావణస్య సుతాస్సర్వే దృష్టాస్తైలసముక్షితాః,

బూసికొని యెఱ్ఱనిబట్ట గట్టుకొని నూనెఁ ద్రావుచుఁ గైపునొంది నేలపై నుండుటఁ జూచినాను. ౨౨

రావణుఁడు మరల పుష్పకవిమానంబునుండి నేలంబడి తలలో జుట్టు లేక నల్లనిబట్టలు గట్టుకొని యొకయాఁడుదానిచేత నీడ్వఁబడుచున్నట్లు జూచినాను. ౨౩

మఱియుం రావణుఁడు ఎఱ్ఱపూలమాలికలను రక్తగంధమును ధరించి నూనెఁ ద్రావుచు నవ్వుచు నర్తనముసేయుచు భ్రాంతచిత్తుఁడై యింద్రియంబుల స్వాధీనతఁ దప్పి గాడిదలు గట్టిన రథంబు నెక్కి పోవుచుండుటం జూచినాను. ౨౪

మఱియుం రావణుఁడు గాడిద నెక్కి దక్షిణపుదిక్కునుబట్టి శీఘ్రముగాఁ బోయెను.

మరల రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు భయంబున దేహంబును దెలియక గాడిదపై నుండి తలక్రిందుగా నేలం బడుటను జూచినాను. ౨౫

ఆరావణుఁ డంత శీఘ్రంబుగా లేచి తొట్రుపడుచు భయంబునొంది మనంబున నవయవంబుల స్వాధీనత దప్పి పిచ్చిపట్టినట్లు చెప్పరానిదుర్వాక్యంబులు విశేషంబుగాఁ బలుకుచు శీఘ్రంబుగా దుర్గంధంబై సహింప నలవిగాక భయంకరంబై యంధకారపూర్ణంబై నరకంబువలెనుండు మలపంకంబుఁ జొచ్చి యందు మునింగెను. [మఱియు దక్షిణపుతట్టుగాఁ బోయి యొకబురదమడుఁగులోఁ గూలెను.] ౨౬, ౨౭

ఎఱ్ఱనిబట్టలు గట్టుకొని దేహమంతయు బురదఁ బూసికొనియుండు నొకనల్లనిస్త్రీ రావణుని మెడకుఁ ద్రాడుగట్టి దక్షిణపుదిక్కున కీడ్చుకొని పోవుచుండెను. ౨౮

అప్పుడుఁ గుంభకర్ణుండును ఈప్రకారముగానే యుండఁగాఁ జూచినాను. ౨౯

రావణునికొడుకు లందఱు దేహమంతయు నూనె నభిషేకించుకొని యుండఁగాఁ జూచినాను.

వరాహేణ దశగ్రీవశ్శింశుమారేణ చేంద్రజిత్. ౩౦

ఉష్ట్రేణ కుంభకర్ణశ్చ ప్రయాతా దక్షిణాం దిశం,
ఏకస్తత్ర మయా దృష్టశ్శ్వేతచ్ఛత్రో విభీషణః. ౩౧
శుక్లమాల్యాంబరధరశ్శుక్లగంధానులేపనః,
శంఖదుందుభినిర్ఘోషైర్నృత్తగీతైరలంకృతః. ౩౨
ఆరుహ్య శైలసంకాశం మేఘస్తనితనిస్స్వనం,
చతుర్దంతం గజం దివ్యమాస్తే తత్ర విభీషణః. ౩౩
చతుర్భిస్సచివైస్సార్ధం వైహాయస ముపస్థితః,
సమాజశ్చ మయా దృష్టో గీతవాదిత్రనిస్స్వనః. ౩౪

పిబతాం రక్తమాల్యానాం రక్షసాం రక్తవాససాం,
లంకా చేయం పురీ రమ్యా సవాజిరథకుంజరా. ౩౫

సాగరేపతితా దృష్టా భగ్నగోపురతోరణా,
లంకా దృష్టా మయా స్వప్నే రావణేనాభిరక్షితా. ౩౬
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా,
పీత్వా తైలం ప్రనృత్తాశ్చ ప్రహసంత్యో మహాస్వనాః. ౩౭

లంకాయాం భస్మరూక్షాయాం ప్రవిష్టా రాక్షసస్త్రియః,
కుంభకర్ణాదయశ్చేమే సర్వే రాక్షసపుంగవాః. ౩౮
రక్తం నివసనం గృహ్య ప్రవిష్టా గోమయహ్రదే,
అపగచ్ఛత నశ్యధ్వం సీతామాప స రాఘవః. ౩౯
ఘాతయేత్పరమామర్షీ సర్వైస్సార్ధం హి రాక్షసైః,
[రావణం రాఘవో ఘోరే భార్యాహర్తారమాహవే,]

రావణుఁడు పందిని ఇంద్రజిత్తు మొసలిని కుంభకర్ణుఁ డొంటెను ఎక్కి-
వీరు మువ్వురును దక్షిణపుదిక్కు-నుబట్టి పోయిరి. ౩౦

అప్పుడు విభీషణుం డొక్కఁడు మాత్రము తెల్లపూలమాలికను ధరించి తెల్లబట్టలఁ గట్టుకొని తెల్లనిగంధముఁ బూసికొని శంఖధ్వనులును భేరీనాదంబులుఁ జెలంగఁగా నృత్తగీతంబులతో నొప్పుచుఁ గొండతో సాటి యయినదియుం మేఘధ్వనివంటిధ్వని గలదియును నాలుగుదంతములు గలదియుం నాకాశంబున సంచరించునదియుం నగుదివ్యమైనయేనుఁగు దానును దనమంత్రులు నల్వురునుం గూడి యారోహించి యున్నట్టు చూచితిని. ౩౧-౩౩

మఱియుం నూనె త్రావుచు నెఱ్ఱనిపూలమాలికలను ధరించి యెఱ్ఱని బట్టలు కట్టుకొని పాడుచు వాద్యంబుల వాయించుచున్నరాక్షసులఁ జూచితిని. ౩౪

రమణీయం బగు నీలంకాపట్టణము గవనులును బహిర్ద్వారములును విఱిగి గుఱ్ఱములతోను రథములతోను ఏనుఁగులతోను సముద్రంబునఁ బడినట్టు జూచితిని. ౩౫

రావణునిచేత రక్షింపఁబడుచున్న యీలంకను రామునిదూత యయిన బలవంతుఁ డగునొకవానరుఁడు దహించినట్టు స్వప్నంబున నగపడినది.

రాక్షసస్త్రీలు నూనెం ద్రావి నర్తనము చేయుచు నవ్వుచు గట్టిగాఁ గేకలు వేయుచు భస్మమాత్రావశిష్టయయి ప్రవేశించుట కలవిగాకుండు లంకలోఁ దిరుగుచుండిరి. ౩౬, ౩౭

కుంభకర్ణుఁడు మొదలుగా మేటిరాక్షసులందఱు ఎఱ్ఱనివస్త్రములు గట్టుకొని పేడగుంటలోఁబడి మునింగిరి. ౩౮

మీర లవ్వలికిఁ బొండు. అట్లు చేయరేని నాశంబునొందుదురు. ఇఁక రాముఁడు సీతం బొందినట్లే నిశ్చయించుకొనుఁడు. ఆయన తప్పక రాక్షసుల యందఱతో మిమ్ముఁ జంపును. [విశేషముగా దారను దొంగిలిన రావణుని కడిందిపోరునఁ జంపఁగలఁడు.] ౩౯

ప్రియాం బహుమతాం భార్యాం వనవాసమనువ్రతామ్. ౪౦.
భర్త్సితాం తర్జితాం వాపి నానుమంస్యతి రాఘవః,

తదలం క్రూరవాక్యైర్వస్సాన్త్వమేవాభిధీయతామ్. ౪౧.

అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచతే,
యస్యామేవంవిధస్స్వప్నో దుఃఖితాయాం ప్రదృశ్యతే. ౪౨.
సా దుఃఖైర్వివిధైర్ముక్తా ప్రియం ప్రాప్నోత్యనుత్తమం,

భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః కిం వివక్షయా. ౪౩.

రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితం,

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా. ౪౪.
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్,

[తతస్సా హ్రీమతీ బాలా భర్తుర్విజయహర్షితా,
అవోచద్యది తత్తథ్యం భవేయం శరణం హి వః.
అపి చాస్యా విశాలాక్ష్యా న కించిదుపలక్షయే. ౪౫
విరూపమపి చాంగేషు సుసూక్ష్మమపి లక్షణం,

ఛాయావైగుణ్యమాత్రం తు శంకే దుఃఖముపస్థితమ్. ౪౬.
అదుఃఖార్హామిమాం దేవీం వైహాయసముపస్థితాం,

ప్రియురాలును బహుమానంబు నొందియున్నదియును వనంబునకుం గూడ వెంబడించి వచ్చినదియు నగుభార్యను నిందించినను బెదరించినను రాముఁ డెంతమాత్రము సహించి యుండఁడు. ౪౦

అట్లు కావున మీకఠినవచనంబుల విడువుఁడు. మంచిమాటగానే చెప్పుఁడు. ౪౧

సీతను అభయం బొసంగుమని ప్రార్థింపుదము. ఇది నాయభిప్రాయము.

ఏస్త్రీయయిన దుఃఖము నొంది యుండఁగా నిట్టిస్వప్నము గలుగునేని ఆస్త్రీ దుఃఖములన్నియు విడిచి మితిలేని సంతోషము నొందును. కావున ఈసీత దుఃఖముతో నుండఁగా నా కీస్వప్నము గలిగినది. కాఁబట్టి ఈసీత దుఃఖములన్నియుఁ బోయి పరమసంతోషము నొందఁగలదు. ౪౨

రాక్షసస్త్రీలారా! "మన మట్లు నిందించియున్నామే. మనయం దీబిడ కనుగ్రహము గల్గునా" అని సందేహించుచుండవలదు. మీర లీసీతను బ్రార్థింపుఁడు, మీయం దీబిడ కనుగ్రహము గల్గును. ౪౩

ఇఁక శీఘ్రముగనే రామునివలన రాక్షసుల కందఱకు మహాభయంబు వాటిల్లును.

రాక్షసస్త్రీలారా! జనకునికూఁతురయిన ఈసీతమాత్రమె మీనమస్కారమునకుఁ బ్రసన్నయయి యింక రామునివలన మీకుఁ గలుగఁబోవు భయంబుఁ బోఁగొట్టఁజాలును. ౪౪

[భర్తృవిజయమునకు సంతసించిన యీయమ్మ మమ్ము రక్షించునని మన కభయ మిచ్చెనా యిఁకఁ దప్పదు.]

ఇదిగాక విశాలంబులగు కండ్లుగల యీసీతాదేవి యంగంబులందు దుఃఖము నొందించునట్టి లక్షణముగాని అంగవైకల్యముగాని కొంచెమైనను నా కగపడలేదు. ౪౫

ఈబిడదేహంబునందలి కాంతిమాత్రము కొంచెము మాసియున్నది. దీనిచేతనే దుఃఖమునకుఁ దగనిదియును దివ్యభోగంబు లనుభవింపఁదగినదియు నగు సీతాదేవి కీదుఃఖంబు కల్గినదని తలంచుచున్నాను. ౪౬

అర్థసిద్ధిం తు వైదేహ్యాః పశ్యామ్యహముపస్థితామ్. ౪౭
రాక్షసేంద్రవినాశం చ విజయం రాఘవస్య చ,
నిమిత్తభూతమేతత్తు శ్రోతుమస్యా మహత్ప్రియమ్. ౪౮

దృశ్యతే చ స్ఫురచ్చక్షుః పద్మపత్రమివాయతం,
ఈషచ్చ హృషితో వాస్యా దక్షిణాయా హ్యదక్షిణః. ౪౯
అకస్మాదేవ వైదేహ్యాః బాహురేకః ప్రకంపతే,
కరేణుహస్తప్రతిమస్సవ్యశ్చోరురనుత్తమః. ౫౦
వేపమానస్సూచయతి రాఘవం పురతస్స్థితం,

పక్షీ చ శాఖానిలయం ప్రవిష్టః
పునః పునశ్చోత్తమసాంత్వవాదీ,
సుస్వాగతాం వాచముదీరయానః
పునః పునశ్చోదయతీవ హృష్టః. ౫౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తవింశస్సర్గః.

---

## అష్టావింశస్సర్గః

సా రాక్షసేన్ద్రస్య వచో నిశమ్య
తద్రావణస్యాప్రియమప్రియార్తా,
సీతా వితత్రాస యథా వనాన్తే
సింహాభిపన్నా గజరాజకన్యా. ౧
సా రాక్షసీమధ్యగతా చ భీరుర్వాగ్భిర్భృశం రావణతర్జితా చ
కాన్తారమధ్యే విజనే విసృష్టా బాలేవ కన్యా విలలాప సీతా.

రాక్షసేశ్వరుఁ డగు రావణుఁడు నశించుటయు రామునకు విజయంబు గలుగుటయు నిట్టు సీతాదేవి యభీష్టసిద్ధి శీఘ్రముగానే యగునని తలంచెదను.

ఈస్వప్నము ఈసీతాదేవికి మహాసంతోషంబు గలుగుటను మనము వినఁగల మని సూచించుచున్నది. ౪౮

మఱియుఁ దామరపూఱేకుఁబోలె విశాలమైన యాసీతాదేవి యెడమ కన్నదురుచున్నది.

సమర్థురాలయిన యాసీతాదేవి యెడమభుజమును కొంచెము గగురుపొడిచినట్లు గనుపట్టుచు నిష్కారణముగా నదురుచున్నది. ౪౯

ఆఁడేనుఁగు తొండమువంటిదియు నుత్తమంబు నగుసీతాదేవి యెడమతొడ యదురుచున్నది. కావున రాముఁడు శీఘ్రముగా నిచ్చటికి వచ్చునని తెలియవచ్చుచున్నది. ౫౦

పింగళపక్షి చెట్టుకొమ్మపైఁ గూర్చుండి పలుమాఱు మధురంబుగాఁ గూయుచు బంధువురాకను దెల్పుచు "రాముఁడు శీఘ్రముగా వచ్చును" అని చెప్పునట్టున్నది. గరుడపక్షియుం జెక్కలు విదిర్చుకొని ప్రదక్షిణంబుగాఁ దిరిగి చెట్టుకొమ్మపైఁ గూర్చుండి మధురంబుగాఁ గూయుచు రామునిరాకం దెలుపుచు నింక దుఃఖింపకుమని ప్రేరేపించుచున్నట్టున్నది. ౫౧

ఇది యిరువదియేడవసర్గము.

---

## ఇరువదియెనిమిదవ సర్గము

ఆసీత రాక్షసేశ్వరుఁడగు రావణుఁడుచెప్పిన యాయప్రియవచనంబు విని మహాదుఃఖంబునొంది యడవినడుమ సింహంబులచేతిలోఁ జిక్కిన యాఁడేనుంగుంబోలె మహాభయంబు నొందెను. ౧

భయపడుస్వభావముగల యాసీతాదేవి రాక్షసస్త్రీల నడుమం జిక్కి రావణుని బెదరింపులకు భయపడి విజనం బగునడవినడుమ నొంటిగాఁ జిక్కిన చిన్నకన్నియయుంబోలె నేడ్చినది. ౨

సత్యం బతేదం ప్రవదంతి లోకే
నాకాలమృత్యుర్భవతీతి సంతః,
యత్రాహమేవం పరిభర్త్స్యమానా
జీవామి కించి త్క్షణమప్యపుణ్యా. ౩
సుఖాద్విహీనం బహుదుఃఖపూర్ణ
మిదం తు నూనం హృదయం స్థిరం మే,
విశీర్యతే యన్న సహస్రధాఽద్య
వజ్రాహతం శృంగమివాఽచలస్య. ౪
నైవాస్తి దోషం మమ నూనమత్ర
వధ్యాహమస్యాఽప్రియదర్శనస్య,
భావం న చాస్యాహమనుప్రదాతు
మలం ద్విజో మంత్రమివాఽద్విజాయ. ౫

నూనం మమాంగాన్యచిరాదనార్య
శ్శస్త్రైశ్శితైశ్ఛేత్స్యతి రాక్షసేంద్రః,
తస్మిన్ననాగచ్ఛతి లోకనాథే
గర్భస్థజంతోరివ శల్యకృన్తః. ౬
దుఃఖం బతేదం మమ దుఃఖితాయా
మాసౌ చిరాయాధిగమిష్యతో ద్వౌ,
బద్ధస్య వధ్యస్య తథా నిశాంతే
రాజాపరాధాదివ తస్కరస్య. ౭
హా రామ హా లక్ష్మణ హా సుమిత్రే
హా రామమాతస్సహ మే జనన్యా,

నే నిట్లు నిందింపఁబడుచున్నదాన నయ్యుఁ బ్రాణంబులు విడువలేక స్వల్పకాలమైనను కుత్సితముగా బ్రదికియున్నాను. కావున నకాలంబున మృత్యువు గల్గదని పెద్దలు చెప్పుమాట సత్యమే. అయ్యో! 3

ఎంతమాత్రము సుఖములేక మహాదుఃఖమునొందియుండు నాహృదయము ఇట్టి యవస్థయందును వజ్రాయుధము ప్రేటునకుఁ బగులు పర్వతశిఖరముంబోలె వేయి పఱియలుగాఁ బగులకున్నది గావున ఇది స్థిరము. ఈమాట నిశ్చయము. 4

చూపరులకు రోఁత గలిగించునట్టిరావణుండు నన్నెట్లైనను జంపుటకే యున్నాఁడు. అదియు దుర్నివారణంబె యగుచున్నది. కావున నే నిప్పుడు నా ప్రాణంబులవిడుచుటయందు నాకేమియు నధికదోషంబులేదు. ఇది నిశ్చయము. అయితే అతని ననుసరించినే ప్రాణంబులు గాపాడుకొని దోషంబె లేకుండ వచ్చునే యని యన్నచో బ్రాహ్మణుఁడు వేదమంత్రమును శూద్రుని కియ్యఁజాలనట్లు నేను నామనసును ఈరావణున కెంతమాత్రము నియ్యఁజాలను. 5

ఈరెండుమాసంబులలోపల లోకనాథుఁ డగురాముఁ డిచ్చటికి రాకుండునేని గర్భంబులోఁ జచ్చినశిశువును మంగలవాఁడు వెలికిఁ దీయుటకై తునుకలుగా ఛేదించునట్లు దుష్టుఁ డగురావణుఁడు నన్ను కఱకుగలయాయుధములచేఁ దుండుతుండుగా ఛేదించును. 6

ఇఁక నీరెండుమాసములును శీఘ్రముగానే ముగియును. అయ్యో! రాజుపట్ల నపరాధంబు సేయుటవలన బద్ధుఁడై తెల్లవాఱినంతనే చంపఁబడుటకున్నఁ దొంగకుఁ గల్గుదుఃఖ మిప్పుడు నాకుఁ బ్రాప్తమయినది. 7

అయ్యో రాముఁడా! లక్ష్మణుఁడా! సుమిత్రా! తల్లీ! రామునిఁగన్న తల్లివయిన కౌసల్యా! అల్పభాగ్యనగు నేను సముద్రమధ్యంబున సుడిగాలివలన చలించు నోడయుంబోలె ఇచ్చట నాశంబు నొందుచున్నాను. 8

ఏషా విపద్యామ్యహమల్పభాగ్యా
మహార్ణవే నౌరివ మూఢవాతా. ౮
తరస్వినా ధారయతా మృగస్య
సత్త్వేన రూపం మనుజేంద్రపుత్రౌ,
నూనం విశస్తౌ మమ కారణాత్తౌ
సింహర్షభౌ ద్వావివ వైద్యుతేన. ౯
నూనం స కాలో మృగరూపధారీ
మామల్పభాగ్యాం లులుభే తదానీం,
యత్రార్యపుత్రం విససర్జ మూఢా
రామానుజం లక్ష్మణపూర్వజం చ. ౧౦
హా రామ సత్యవ్రత దీర్ఘబాహో
హా పూర్ణచంద్రప్రతిమానవక్త్ర,
హా జీవలోకస్య హితః ప్రియశ్చ
వధ్యాం న మాం వేత్సి హి రాక్షసానామ్. ౧౧
అనన్యదైవత్వమియం క్షమా చ
భూమౌ చ శయ్యా నియమశ్చ ధర్మే,
పతివ్రతాత్వం విఫలం మమేదం
కృతం కృతఘ్నేష్వివ మానుషాణామ్. ౧౨

మోఘో హి ధర్మశ్చరితో మయాఽయం
తథైకపత్నీత్వ మిదం నిరర్థం,
యా త్వాం న పశ్యామి కృశా వివర్ణా
హీనా త్వయా సంగమనే నిరాశా. ౧౩

రెండుసింహంబులుగాని రెండువృషభంబులుగాని పిడుగుతాఁకుడుచేఁ జంపఁబడునట్లు బలవంతు లగునారామలక్ష్మణులు నాకుఁగా జింకరూపము ధరించినరాక్షసునిచేఁ జంపఁబడియుందురు. ఇది నిశ్చయముగా నుండును. ౯

యముఁడే యిప్పుడు జింకరూపుఁ దాల్చి నా కాశం జూపియుండును. ఇది నిశ్చయము. కావున నేను నా పెనిమిటిని రాముని అతనితమ్ముఁడు లక్ష్మణునిం బోమ్మంటిని. ౧౦

అయ్యో రామఁడా! సత్యవ్రతుఁడా! ఆజానుబాహుఁడా! నిండుచంద్రునింబోలు ముఖంబుగలవాఁడా! అయ్యో! నీవు ప్రాణిసమూహమున కంతయుం మేలును సంతోషమును జేయువాఁడవే! ఇప్పుడు నేను రాక్షసుల చేతిలోఁ జావఁ బోవుట నెఱుంగవుగదా! ౧౧

పెనిమిటిదప్ప నితరుం డగుదేవుని గొలువకుండుటయుం నీ రాక్షసస్త్రీలును రావణుండును ఎట్టిపరుషవచనంబు లాడినను "కొంతకాలమునకైన రాముని ప్రియవచనంబులు వినంగలుగుఁగదా" యని యోర్చియుండుటయుం నేలం బరుండుటయును ధర్మంబు విడువకుండుటయు నిట్టి నాపాతివ్రత్యము రామసంగమంబు సిద్ధింపకుండుటం జేసి కృతఘ్నునకుఁ జేసిన యుపకారమంబోలె వ్యర్థమయినది. ౧౨

నే నింతకాలము శ్రమపడినను నిన్నువదలి కృశించి వైవర్ణ్యమునొంది మరల నిన్నుఁ జేర నాశయించుకొనుటకును దగినయవకాశము లేకున్నాను. కావున నే నింతవఱ కనుష్ఠించిన ధర్మమును బాతివ్రత్యమును వ్యర్థమైనది. ఇంతకాల మిట్లు శ్రమపడక రావణుండు నన్నపహరించినప్పుడే ప్రాణంబులు విడిచియుండునేని ఇంతకష్టము రాకుండును. ౧౩

పితుర్నిదేశం నియమేనకృత్వా
వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ,
స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభి
స్త్వం రంస్యసే వీతభయః కృతార్థః. ౧౪
అహం తు రామ త్వయి జాతకామా
చిరం వినాశాయ నిబద్ధభావా,
మోఘం చరిత్వా చ తపోవ్రతం చ
త్యక్ష్యామి ధిగ్జీవితమల్పభాగ్యా. ౧౫
సా జీవితం క్షిప్రమహం త్యజేయం
విషేణ శస్త్రేణ శితేన వాపి,
విషస్య దాతా న హి మేఽస్తి కశ్చి
చ్ఛస్త్రస్య వా వేశ్మని రాక్షసస్య. ౧౬
ఇతీవ దేవీ బహుధా విలప్య
సర్వాత్మనా రామమనుస్మరంతీ,
ప్రవేపమానా పరిశుష్కవక్త్రా
నగోత్తమం పుష్పితమాససాద. ౧౭
శోకాభితప్తా బహుధా విచింత్య
సీతాఽథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా,
ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్ర
మహం గమిష్యామి యమస్య మూలమ్. ౧౮
ఉపస్థితా సా మృదుసర్వగాత్రీ
శాఖాం గృహీత్వాఽథ నగస్య తస్య,
తస్యాస్తు రామం ప్రవిచింతయంత్యా
రామానుజం స్వం చ కులం శుభాంగ్యాః. ౧౯

రాముఁడా! నీవు నియమంబునఁ దండ్రియాజ్ఞను నెఱవేర్చి వ్రతంబు ముగిసినపిదప వనంబు విడిచి యయోధ్యకుఁ బోయి కృతార్థుండవై నన్ను మఱచి యెంతమాత్రమును దుఃఖములేక విశాలంబు లగునేత్రంబులు గల స్త్రీలంగూడి క్రీడించుచుందువు. ౧౪

రాముఁడా! అల్పభాగ్య నగునేను మాత్రము నీయం దనురాగంబు గలదాన నగుటయేకాక వినాశంబు నొందుటకై యే నీ యందు హృదయంబు స్థిరంబుగా నుంచి వ్యర్థముగా నియమ మవలంబించి యుపవాసంబులు సల్పి తుదకు నిందితములైన యీప్రాణముల నిప్పుడు విడిచెదను. అని సీతాదేవి రాము నుద్దేశించి చెప్పినది. ౧౫

అట్లు సమస్తదుఃఖంబులం బరితపించుచున్న నేను ఇప్పుడు విషంబుఁ దినిగాని తీక్ష్ణంబగునాయుధముచేఁగాని శీఘ్రంబుగా ప్రాణంబులు విడిచెదను.

ఈరావణునింట నాకు విషమునుగాని యాయుధముగాని యిచ్చువాఁ డెవ్వఁడును లేఁడు. అని సీతాదేవి విలపించినది. ౧౬

సీతాదేవి పెక్కువిధంబుల విలపించి హృదయంబున రాముని ధ్యానంబుసేయుచు దుఃఖంబున వడంకుచు నో రెండఁగా నాశింశుపావృక్షంబుఁ జేరెను. ౧౭

అంత నాసీతాదేవి దుఃఖంబునఁ బరితపించుచుఁ దలజడను మెడకుఁ గట్టుకొని "దీనిచే నే నురివోసికొని ప్రాణంబులు విడిచి యమలోకంబున కరిగెదను" అని తలఁచెను. ౧౮

అంత మృదువులయిన యవయవములు గలసీతాదేవి యిట్లు మరణంబు నొంద నిశ్చయించి ఆశింశుపావృక్షముకొమ్మం బట్టుకొని యుండినది.

అప్పుడు రాముని లక్ష్మణునిం దలంచుకొని యట్టి పరాక్రమశాలు లుండునప్పుడును నా కిట్టియవస్థ గలిగినదే యనియుఁ దనవంశముం దలంచు

శోకానిమిత్తాని తథా బహూని
ధైర్యార్జితాని ప్రవరాణి లోకే,
ప్రాదుర్నిమిత్తాని తదా బభూవుః
పురాపి సిద్ధాన్యుపలక్షితాని. ౨౦

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - అష్టావింశస్సర్గః.

## ఏకోనత్రింశస్సర్గః

తథాగతాం తాం వ్యథితామనిందితాం
వ్యపేతహర్షాం పరిదీనమానసాం,
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే
నరం శ్రియా జుష్టమివోపజీవినః. ౧

తస్యాశ్శుభం వామ మరాళపక్ష్మ
రాజీవృతం కృష్ణవిశాలశుక్లం,
ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా
మీనాహతం పద్మమివాభితామ్రమ్. ౨
భుజశ్చ చార్వంచితపీనవృత్తః
పరార్థ్యకాలాగరుచందనార్హః,
అనుత్తమేనాధ్యుషితః ప్రియేణ
చిరేణ వామస్సమవేపతాఽశు. ౩
గజేంద్రహస్తప్రతిమశ్చ పీన
స్తయోర్ద్వయోస్సంహతయోస్సుజాతః,
ప్రస్పందమానః పునరూరురస్యా
రామం పురస్తాత్ స్థితమాచచక్షే. ౪

కాని యిట్టిపుణ్యవంతులవంశంబులోఁ బుట్టిన నాకుఁ బాపిష్ఠం బగునీదుర్మరణంబు సేయవలసివచ్చెనే యనియుం వగచుచున్న శుభాంగి యగునాసీతకు శుభసూచకములును ధైర్యము గలిగించునవియును లోకప్రసిద్ధములును నిదివఱకుఁ బెక్కుమాఱులు శుభకరంబులని పరీక్షింపఁబడి నిర్ణయింపఁబడినవియు నగునిమిత్తము లనేకములు కనుపడినవి. ౧౯, ౨౦

ఇది యిరువదియొనిమిదవసర్గము.

## ఇరువదితొమ్మిదవసర్గము

సంపత్తుగలవాని నతనిసేవకు లాశ్రయించులాగున నట్లు చెప్ప నలవి గానివిధంబున నాశింశుపావృక్షంబు నొద్దకు వచ్చియున్నదియుఁ బరమ దుఃఖితయు నట్టిరామవిరహదశయందుఁ దా నెట్లుండవలయునో అట్లె యుపవాసాది పతివ్రతాధర్మంబు లాచరించుచున్నది కావునఁ బ్రస్తుతింపఁదగినదియును ఎంతమాత్రము సంతోషము లేనిదియును దీనంబగుమనంబుతో నున్నదియును మంగళరూపిణియు నగునాసీతను శుభనిమిత్తము లాశ్రయించినవి. ౧

మంగళలక్షణంబులు గలదై వంకరలయిన ఱెప్పవెండ్రుకలు గలిగి గ్రుడ్డున నల్లగాను ఆపైని తెల్లగాను కొనల నెఱ్ఱగాను ఒప్పుచుండునట్టి యాసీతాదేవి యెడమకన్ను మీనుచేఁ గొట్టఁబడిన కమలంబు గదలునట్లు స్ఫురించినది. ౨

సుందరంబై యుత్తమంబై బలిసి గుండ్రముగా నుండునదియు శ్రేష్ఠమయిన కృష్ణాగరుగంధముచేఁ బలుమాఱుఁ బూయఁబడినదియు సమస్త పురుషోత్తముఁ డగురామునిచే బహుకాలము తలగడగాఁ జేసికోఁబడినదియు నగు నాసీతాదేవియెడమభుజము గడగడ వడంకినది. ౩

సమస్తశుభలక్షణములు గలిగి యొకటితో నొకటి చక్కఁగాఁ గలిసి కొనియుండు నాబిడ రెండుతొడలలో నేనుంగు తొండములకుసాటియై బలిసి సుందరమయిన యెడమతొడ మిక్కిలి కదలుచు "రాముఁడు ముందటనె యున్నవాఁ" డని సూచించినది. ౪

శుభం పునర్హేమసమానవర్ణ
మీషద్రజోధ్వస్తమివామలాక్ష్యాః,
వాసస్స్థితాయాశ్శిఖరాగ్రదత్యాః
కించిత్పరిస్రంసత చారుగాత్ర్యాః. ౫

ఏతైర్నిమిత్తైరపరైశ్చ సుభ్రూ
స్సంబోధితా ప్రాగపి సాధు సిద్ధైః,
వాతాతపక్లాంతమివ ప్రణష్టం
వర్షేణ బీజం ప్రతిసంజహర్ష. ౬

తస్యాః పునర్బింబఫలాధరోష్ఠం
స్వక్షిభ్రు కేశాంత మరాళపక్ష్మ,
వక్త్రం బభాసే సితశుక్లదంష్ట్రం
రాహోర్ముఖాచ్చంద్ర ఇవ ప్రముక్తః. ౭

సా వీతశోకా వ్యపనీతతంద్రీ
శాంతజ్వరా హర్షవివృద్ధసత్త్వా,
అశోభతార్యా వదనేన శుక్లే
శీతాంశునా రాత్రిరివోదితేన. ౮

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకోనత్రింశస్సర్గః.

---

## త్రింశస్సర్గః

హనూమానపి విక్రాంతస్సర్వం శుశ్రావ తత్త్వతః,
సీతాయాస్త్రిజటాయాశ్చ రాక్షసీనాం చ తర్జనమ్. ౧

అవేక్షమాణ స్తాం దేవీం దేవతామివ నందనే,
తతో బహువిధాం చింతాం చింతయామాస వానరః. ౨

స్వచ్ఛములయిన కండ్లుగలదియును కొనలగుండ్రములుగా నుండుదంతములు గలదియుం సుందరములైన యవయవములుగలదియుం నిలుచుచున్నదియుం నగుసీతాదేవి కట్టుకొనియుండునట్టి మంగళకరంబును బంగారురంగుగలదియుం గొంచెము దుమ్ముగలిగి యుండుటచేఁ గాంతిదఱిగియున్నదియునగు వస్త్రము జాఱినది. ౫

సుందరములయిన కనుబొమ్మలు గల యీసీతాదేవి యిదివఱకుఁ బలుమాఱు "సరియయిన ఫలముల నిచ్చునవి" యని పరీక్షించి నిర్ణయింపఁబడినట్టి యీనిమిత్తములను మఱి యితరులనుజూచి వానిచే రామాగమనంబు గల్గు నని యెంచి గాలియెండలతాఁకునను వాడి కృశించియుండు చిన్న మొలక వాన కురియఁగానే మరలఁ గాంతినొందునట్లు మిక్కిలి సంతోషించెను. ౬

ఇదిగాక దొండపండువంటి క్రిందిపెదవితో నొప్పుచు సుందరములైనకండ్లును గనుబొమ్మలును ముంగురులును వంకరయిన ఱెప్పవెండ్రుకలును గలిగి మిక్కిలి ధవళంబులైన పండ్లచేఁ జెలంగుచున్న యీసీతాదేవిముఖము రాహువు నోటనుండి చంద్రబింబముంబోలెఁ బ్రకాశించినది. ౭

పూజనీయయగు నాసీతాదేవిదుఃఖంబుగాని యాలస్యంబుగాని తాపముగాని లేక సంతోషంబున మనంబు వికాసంబు నొందఁగాఁ బ్రకాశించుచుండు ముఖంబుచేత శుక్లపక్షరాత్రి చంద్రునిచేతం బ్రకాశించునట్లు తేజరిల్లుచుండినది. ౮

ఇది యిరువదితొమ్మిదవ సర్గము.

## ముప్పదియవ సర్గము

అశింశుపావృక్షంబునందు విశ్రమించి యున్న హనుమంతుఁడు (పాఠాంతరపక్షమందు "పరాక్రమశాలియగు హనుమంతుఁడు") సీతాదేవి వృత్తాంతమును త్రిజట చెప్పిన స్వప్నవృత్తాంతమును రాక్షసస్త్రీలు సీతను బెదరించిన విధంబును అంతయును గ్రమముగా వినుచుండెను. ౧

అంత హనుమంతుఁడు నందనవనంబుననున్న దేవతాస్త్రీనింబోలె సీతాదేవిం జూచుచు నిట్లని పెక్కువిధంబులం జింతించెను. ౨

యాం కపీనాం సహస్రాణి సుబహూన్యయుతాని చ,
దిక్షు సర్వాసు మార్గంతే సేయమాసాదితా మయా. ౩
చారేణ తు సుయుక్తేన శత్రోశ్శక్తిమవేక్షతా,
గూఢేన చరతా తావదవేక్షిత మిదం మయా. ౪

రాక్షసానాం విశేషశ్చ పురీ చేయమవేక్షితా,
రాక్షసాధిపతేరస్య ప్రభావో రావణస్య చ. ౫
యుక్తం తస్యాప్రమేయస్య సర్వసత్త్వదయావతః,
సమాశ్వాసయితుం భార్యాం పతిదర్శనకాంక్షిణీమ్. ౬

అహమాశ్వాసయామ్యేనాం పూర్ణచంద్రనిభాననాం,
అదృష్టదుఃఖాం దుఃఖార్తాం దుఃఖస్యాంతమగచ్ఛతీమ్. ౭

యద్యప్యహామిమాం దేవీం శోకోపహతచేతనాం,
అనాశ్వాస్య గమిష్యామి దోషవద్గమనం భవేత్. ౮
గతే హి మయి తత్రేయం రాజపుత్రీ యశస్వినీ,
పరిత్రాణమవిందంతీ జానకీ జీవితం త్యజేత్. ౯

మయా చ స మహాబాహుః పూర్ణచంద్రనిభాననః,
సమాశ్వాసయితుం న్యాయ్యస్సీతాదర్శనలాలసః. ౧౦

నిశాచరీణాం ప్రత్యక్షమనర్హం చాపి భాషణం,

వానరులు వేలుగాను బెక్కుదశసహస్రంబులుగాను జేరి సమస్తదిక్కులందును ఏ సీతను వెదకుచున్నారో ఆసీతను నే నిక్కడఁ జూచుచున్నాను.

నేను మిక్కిలియు నెచ్చరికగల్గి శత్రువులసామర్థ్యంబును దెలిసికొనుచారుండనై యెవ్వరికిం దెలియకుండునట్టు లంకయంతయుఁ దిరిగి పీసినంతయుఁ దెలిసికొంటిని. ౪

రాక్షసులవిశేషంబుఁ జూచినాను, ఈలంకాపురివిధంబును జూచితిని. మఱియు రాక్షసులకుఁ బ్రభుఁడైన యారావణునిప్రభావంబునుం గంటిని. ౫

కొఱంతలేనిప్రభావము గలవాఁడును సమస్తప్రాణులందును దయగలవాఁడునగు నారాముని భార్యయును బెనిమిటిని జూడఁగోరి దుఃఖించుచున్నదియునగు నీసీతకు రామక్షేమంబు చెప్పి కొంతయూఱట గల్గించుట యుక్తము.

ఇదివఱ కెన్నఁడును దుఃఖము ననుభవించినదికాదు కావున నిప్పుడు సంభవించినదుఃఖంబు నోర్వలేక దుఃఖమునకంతంబుగానక పరితపించుచున్న చిండుచంద్రునింబోలు ముఖంబుగల యీసీతకు రామవార్తం జెప్పి దుఃఖము పోవునట్లు చేసెదను. ౭

నేను ఇట్లు దుఃఖసముద్రంబున మునింగి పరితపించుచున్న యీసీతాదేవి నాశ్వాసింపకయె రామునొద్దకుంబోదునేని దోషంబు సంభవించును. ౮

నేను ఈసీత నాశ్వాసింపక రామునొద్దకుఁ బోఁగానే కీర్తిమంతురాలును రాచకొమార్తెయునగు సీతాదేవి తన్ను గాపాడువార లెవ్వరును లేరని తలంచి ప్రాణంబులు విడుచును. ౯

మహాబాహుండును నిండుచంద్రునింబోలు ముఖంబుగలవాఁడును సీతంజూడఁగోరి తపించుచున్నవాఁడునగు నారామునకును నేను సీతాదేవిక్షేమవార్తఁ జెప్పి యవశ్యము కొంతయూఱట గల్గింపవలెను. ౧౦

నే నెట్లయినను సీతాదేవి నాశ్వాసింపవలసినది. ఈ రాక్షసస్త్రీలే చురల సీతం గనిపెట్టి యున్నవారు. నేను వీరలయెదుట సీతాదేవితో మాటలాడుటయుం బరిగాదు.

కథం ను ఖలు కర్తవ్యమిదం కృచ్ఛ్రగతో హ్యహమ్. ౧౧

అనేన రాత్రిశేషేణ యది నాశ్వాస్యతే మయా,
సర్వథా నాస్తి సందేహః పరిత్యక్ష్యతి జీవితమ్. ౧౨
రామశ్చ యది పృచ్ఛేన్మాం కిం మాం సీతాఽబ్రవీద్వచః,
కిమహం తం ప్రతిబ్రూయామసంభాష్య సుమధ్యమామ్. ౧౩

సీతాసందేశరహితం మామితస్త్వరయాగతం,
నిర్దహేదపి కాకుత్స్థః క్రుద్ధస్తీవ్రేణ చక్షుషా. ౧౪

యది చోద్యోజయిష్యామి భర్తారం రామకారణాత్,
వ్యర్థమాగమనం తస్య ససైన్యస్య భవిష్యతి. ౧౫

అంతరం త్వహమాసాద్య రాక్షసీనామిహ స్థితః,
శనైరాశ్వాసయిష్యామి సంతాపబహుళామిమామ్. ౧౬

అహం త్వతితనుశ్చైవ వానరశ్చ విశేషతః,
వాచం చోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్. ౧౭

యది వాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతాం,
రావణం మన్యమానాం మాం సీతా భీతా భవిష్యతి. ౧౮
వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణం,

ఇట్లున్నదే నేనెట్లు ఇప్పుడు సీత నాశ్వాసింపఁగలను? నాకేమియుఁ దోఁచలేదు. అట్లు సీత నాశ్వాసింపక పోవుటయును యుక్తముగాదు. సీత నాశ్వాసించుటకు నవకాశము లేకున్నది. ఏమి చేయవచ్చును? సంకటంబుగల్గినది.

నేను సూర్యోదయమునకు లోపల నాశ్వాసింపకుందునేని యీసీతా దేవి ప్రాణంబులు విడుచును. దీని కెంతమాత్రమును సందేహము లేదు. ౧౨

నేనిప్పుడు సీతతో నేమియుం మాటలాడకయే రామునొద్దకుఁబోయిన పిమ్మట అతఁడు "సీత నాకేమి చెప్పి పంపినది" అని యన్నదుగునేని నతని కేమని బదులు చెప్పుదును? ౧౩

నేనిచ్చటనుండి వేగమునఁ దనయొద్దకు వచ్చి "సీతతో నేను మాటలాడలేదు గావున నాబిడ నాతో నేమియుం జెప్పిపంపలేదు" అని చెప్పఁగానే రాముండు మహాక్రోధంబు నొంది చుఱుకుఁజూపుల నన్ను దహించినను దహించును. ౧౪

నేను సీతతో మాటలాడకయేపోయి రామునకై సుగ్రీవునిం బ్రేరేపించి యిచ్చటికిఁ దోడ్కొనివచ్చినను ఈసీత యింతవఱకు దుఃఖముతోఁ బ్రాణంబులు ధరించియుండఁజాలదు. గావున నాసుగ్రీవుండు సైన్యములతో నిచ్చటికి వచ్చుటయును వ్యర్థమగును. ౧౫

నే నిచ్చటనేయుండి యీరాక్షసస్త్రీలు కొంచెము మెచ్చరికదప్పియుండు నప్పుడుగాని యవ్వలికిఁ బోయినప్పుడుగాని కొంచెము మవకాశము గలిగినంతనే పరమదుఃఖితయై యున్న యీసీతను పీరలు వినకుండునట్లు మెల్లఁగా నాశ్వాసించెదను. ౧౬

నేను మిక్కిలి సూక్ష్మమైన దేహమునొందియున్నవాఁడను. అందును వానరుండను. గావున నన్నీరాక్షసస్త్రీలు కనుఁగొనఁజాలరు. అందు కనుకూలముగా మనుష్యులు మాటలాడునట్లు సంస్కృతభాషను నవలంబించి చెప్పెదను. అదియుం నీరాక్షసస్త్రీలకుఁ దెలియదు. ౧౭

నేను బ్రాహ్మణుఁడుంబోలె సంస్కృతభాషను మాటలాడుదునేని సీతాదేవి "కోతి సంస్కృతభాషతో నెట్లు మాటలాడు!" అని తలంచి నన్ను రావణుఁడని భయంబునొందును. ౧౮

అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్యమర్థవత్. ౧౯

మయా సాన్త్వయితుం శక్యా నాన్యథేయమనిన్దితా,

సేయమాలోక్య మే రూపం జానకీ భాషితం తథా. ౨౦
రక్షోభిస్త్రాసితా పూర్వం భూయస్త్రాసం గమిష్యతి,

తతో జాతపరిత్రాసా శబ్దం కుర్యా న్మనస్వినీ. ౨౧
జానమానా విశాలాక్షీ రావణం కామరూపిణం,
సీతయా చ కృతే శబ్దే సహసా రాక్షసీగణః. ౨౨
నానాప్రహరణో ఘోరస్సమేయాదన్తకోపమః,
తతో మాం సంపరిక్షిప్య సర్వతో వికృతాననాః ౨౩
వధే చ గ్రహణే చైవ కుర్యుర్యత్నం యథాబలం,

గృహ్య శాఖాః ప్రశాఖాశ్చ స్కన్ధాంశ్చోత్తమశాఖినామ్.
దృష్ట్వా విపరిధావన్తం భవేయుర్భయశంకితాః,
మమ రూపం చ సంప్రేక్ష్య వనే విచరతో మహత్. ౨౪
రాక్షస్యో భయవిత్రస్తా భవేయుర్వికృతాననాః,
తతః కుర్యుస్సమాహ్వానం రాక్షస్యో రక్షసామపి. ౨౫
రాక్షసేన్ద్రనియుక్తానాం రాక్షసేన్ద్రనివేశనే,
తే శూలశక్తినిస్త్రింశవివిధాయుధపాణయః. ౨౬
ఆపతేయుర్విమర్దేఽస్మిన్వేగేనోద్విగ్నకారిణః,
సంరుద్ధస్తైస్తు పరితో విధమన్ రక్షసాం బలమ్. ౨౭
శక్నుయాం న తు సంప్రాప్తుం పరం పారం మహోదధేః,

కావున నవశ్యము సాధారణమగు మనుష్యభాష నవలంబించియే మాటలాడవలెను. సంస్కృతభాషలో మాటలాడఁగూడదు. ౧౯

అట్లుగాక మఱియేవిధంబునను అనిందితయగు నీసీత నాశ్వాసింప నా కలవిగాదు.

ఈసీత నేను వానరుండనై యుండుటకు మనుష్యులు మాటలాడునట్లు మాటలాడుటనుంజూచి పూర్వ మిట్టిరాక్షసుల వేషంబులం జూచి భయపడి యున్నది గావున కామరూపియగు రావణుఁడే యిట్లు వచ్చెనని ఇనుమడి భయంబునొందును. ౨౦

అంత విశాలంబులగు కండ్లు గలదియును బతివ్రతయు నగుసీత నాచందంబు చూచినంతనె మహాభయంబు నొంది గట్టిగా నఱచును. ౨౧

సీత గట్టిగా నఱవఁగానే ఈరాక్షసస్త్రీలందఱు నానావిధాయుధంబులు ధరించి భయంకరముగా మృత్యువుంబోలె వేగంబున నాపైకివత్తురు.

అంత నీరాక్షసస్త్రీలు నాచుట్టునుం జుట్టుకొని వారలచేతనైనంత వఱకు నన్నుఁ జంపుటకుఁ గాని లేక పట్టుకొనుటకుఁగాని ప్రయత్నము చేయుందురు. ౨౩

చెట్టుకొమ్మలను చిన్నకొమ్మలను పెద్దచెట్టుబోదెలను దీసికొని నాలుగు ప్రక్కలను బరుగెత్తు నన్నుఁజూచి మిక్కిలియు భయమునొందుదురు. ౨౪

వికృతంబులగు ముఖంబులుగల రాక్షసస్త్రీలు అశోకవనంబున విహరించుచున్న నామహారూపంబుఁ జూచి భయపడుదురు. ౨౫

అంత రాక్షసస్త్రీలు రాక్షసేశ్వరుండగు రావణునింట రావణునిచే నియోగింపఁబడి కావలియుండు రాక్షసులం బిలుతురు. ౨౬

ఆరాక్షసులు శూలంబులు శిల్లకోలలు ఖడ్గములు మొదలగునానావిధాయుధములఁ జేతులందాల్చి వేగంబునఁ జూపరులకు భయంబు గలిగించుచు యుద్ధంబునకు వత్తురు. ౨౭

రాక్షసులు నన్ను నాలుగుప్రక్కలం జుట్టుకొని యదిగింపఁగా నేను వారల నందఱఁ బ్రహరింపనైనను శక్తుఁడ నగుదునుగాని యీమహాసముద్రము దాఁటి యవ్వలిగట్టుఁ జేరఁజాలను. ౨౮

మాం వా గృహ్ణీయురాప్లుత్య బహవశ్శీఘ్రకారిణః. ౨౯

స్యాదియం చాగృహీతార్థా మమ చ గ్రహణం భవేత్,

హింసాభిరుచయో హింస్యురిమాం వా జనకాత్మజామ్. ౩౦

విపన్నం స్యాత్తతః కార్యం రామసుగ్రీవయోరిదం,

ఉద్దేశే నష్టమార్గేఽస్మిన్ రాక్షసైః పరివారితే. ౩౧
సాగరేణ పరిక్షిప్తే గుప్తే వసతి జానకీ,

విశస్తే వా గృహీతే వా రక్షోభిర్మయి సంయుగే. ౩౨
నాన్యం పశ్యామి రామస్య సాహాయ్యం కార్యసాధనే,

విమృశంశ్చ న పశ్యామి యో హతే మయి వానరః. ౩౩
శతయోజనవిస్తీర్ణం లంఘయేత మహోదధిం,

కామం హన్తుం సమర్థోఽస్మి సహస్రాణ్యపి రక్షసామ్. ౩౪
న తు శక్ష్యామి సంప్రాప్తుం పరం పారం మహోదధేః,

అసత్యాని చ యుద్ధాని సంశయో మే న రోచతే. ౩౫
కశ్చ నిస్సంశయం కార్యం కుర్యాత్ప్రాజ్ఞస్ససంశయం,

ప్రాణత్యాగశ్చ వైదేహ్యా భవేదనభిభాషణే. ౩౬

చుట్టుగాఁ బనిసేయునట్టి యీరాక్షసు లనేకులుచేరి యాకాశమున కెగిరి నన్నుఁ బట్టుకొనినం బట్టుకొందురు. ౨౯

అట్లగునేని యీసీతకు రామవృత్తాంతము దెలియకపోవును. నేనును రాక్షసులచేతిలోఁ జిక్కుదును.

ఈరాక్షసులు ఎప్పుడును జీవకోటులం జంపఁగోరుచుండువారలు గావున ఈసీతను జంపినను జంపుదురు. ౩౦

అట్లగునేని రాముఁడును సుగ్రీవుఁడును సాధింపఁ గోరియుండు కార్యమంతయు నాశమునొందును.

వానరుల కెవ్వరికిని దెలియని దారిగలదియుఁ బెక్కురాక్షసులు గావలియున్నదియుఁ జుట్టును సముద్రముచేఁ బరివేష్టింపఁబడియున్నదియు నెవ్వరికిని దెలియనిదియు నగు నీస్థలంబున సీతయున్నది. ౩౧

నేను యుద్ధంబున రాక్షసులచేఁ జచ్చినను బట్టువడినను మరల రామునకు సహాయుఁడై యిట్టికార్యము సాధింపఁగలవాఁడు మఱియొవ్వఁడు నా కగపడలేదు. ౩౨

నేనిచ్చట యుద్ధంబునఁ జచ్చినపిమ్మట నూఱు యోజనంబుల దూరము ఈమహాసముద్రమును దాఁటఁజాలిన వానరుఁడు మఱియొవ్వఁడును ఎంత యాలోచించినను నాబుద్ధి కగపడలేదు. ౩౩

నే నెన్ని వేలరాక్షసులనైనను సరకుసేయక చంపఁగలనుగాని యట్లు యుద్ధంబున నలసినపిమ్మట నీమహాసముద్రమును దాఁటి యవ్వలిగట్టును జేరఁ జాలను. ౩౪

యుద్ధములో జయమే గల్గునని నిశ్చయింపఁగూడదు. అపజయము గల్గినను గల్గును. కావున నిట్లు సందిగ్ధం బగుకార్యము సేయుటకు నాకు సమ్మతిలేదు. పండితుఁ డగువాఁ డెవ్వఁడును ఇట్లు సందిగ్ధం బగుకార్యమును నిస్సంశయముగాఁ జేయఁజాలఁడు. ౩౫

నేను సీతతో మాటలాడకయె పోదునేని సీతాదేవి తన కెవ్వరును దిక్కులే రనుకొని ప్రాణంబులు విడుచును. ౩౬

ఏష దోషో మహాన్ హి స్యాన్మమ సీతాభిభాషణే,

భూతాశ్చార్థా వినశ్యంతి దేశకాలవిరోధితాః. ౩౭.
విక్లబం దూతమాసాద్య తమస్సూర్యోదయే యథా,
అర్థానర్థాంతరే బుద్ధిర్నిశ్చితాపి న శోభతే. ౩౮.
[మోహాద్యర్థం బహుధా వేద ససమర్థోఽర్థసాధనే]
ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః,

న వినశ్యేత్కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్. ౩౯.
లంఘనం చ సముద్రస్య కథంను న వృథా భవేత్,
కథంను ఖలు వాక్యం మే శృణుయాన్నోద్విజేతవా. ౪౦.

ఇతి సంచింత్య హనుమాంశ్చకార మతిమాన్మతిం,

రామమక్లిష్టకర్మాణం స్వబంధుమనుకీర్తయన్. ౪౧.
నైనాముద్వేజయిష్యామి తద్బంధుగతమానసాం,

ఇక్ష్వాకూణాం వరిష్ఠస్య రామస్య విదితాత్మనః. ౪౨.
శుభాని ధర్మయుక్తాని వచనాని సమర్పయన్,
శ్రావయిష్యామి సర్వాణి మధురాం ప్రబ్రువన్ గిరమ్. ౪౩.

శ్రద్ధాస్యతి యథా హీయం తథా సర్వం సమాదధే,

సీతతో మాటలాడినను ఇప్పుడు చెప్పినట్లు నాకు మహాదోషంబు సంభవించును.

సర్వసిద్ధములయినను గార్యములు దూత వివేకము లేనివాఁ డగునేని సూర్యోదయమునందుఁ జీకటి నశించునట్లు నశించును. ౩౭

ప్రభువు కార్యాకార్యవిషయమునందుఁ జక్కఁగా నాలోచించి 'ఇట్లు చేయవలసిన' దని నిశ్చయించినను కార్యమునం దవివేకు లగుదూతల నియోగించునేని అది యెంతమాత్రము చక్కఁబడదు. ఈదూతలు తమకేమియుఁ దెలియకున్నను దమకన్నఁ బండితులు లేరని యహంకరించి కార్యంబులఁ జెఱతురు. ౩౮

రామకార్యము చెడకుండునట్లును ఈమహాసముద్రంబు దాఁటినది వ్యర్థము గాకుండునట్లును జేయవలెను. ౩౯

సీత నేను జెప్పుమాటను వినునట్లుగాని లేక నామాటను విని భయపడకుండునట్లుగాని నేను మాటలాడవలెను. అని హనుమంతుఁడు ఆలోచించెను.

బుద్ధిమంతుఁ డగుహనుమంతుఁ డిట్లు చక్కఁగా నాలోచించి చేయవలసినవిధము నిట్టని నిశ్చయించెను. ౪౦

నేను ఈసీతకు బంధుఁడగు రాముని గీర్తించెదను. కావున నీసీత మనస్సు రామునియందే బద్ధమయి యుండుటంజేసి యీవిడకు భయంబు గలుగదు. ౪౧

ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవారలలో శ్రేష్ఠుఁడును బరమాత్మవేత్తయు నగురాముఁడు సీతకుఁ జెప్పుమని చెప్పిన ధర్మిష్ఠంబు లగుమంగళవచనంబులను మెల్లమెల్లఁగాఁ జెప్పుచు నిట్లు మధురవచనంబుల రామునిమాటల నన్నింటిని వినిపించెదను. ౪౨, ౪౩

ఎట్లు చెప్పినట్లయిన నీసీత భయంబునొందక హనుమంతుని మాటపై నమ్మకముంచునో ఆప్రకారముగానే చెప్పునట్లు హనుమంతుఁడు నిశ్చయించినాఁడు.

ఇతి స బహువిధం మహానుభావో
జగతీపతేః ప్రమదామవేక్షమాణః,
మధురమవితథం జగాద వాక్యం
ద్రుమవిటపాంతరమాస్థితో హనూమాన్. ४४

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రింశస్సర్గః.

## ఏ క త్రిం శ స్స ర్గః

ఏవం బహువిధాం చింతాం చింతయిత్వా మహాకపిః,
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ. ౧

రాజా దశరథో నామ రథకుంజరవాజిమాన్,
పుణ్యశీలో మహాకీర్తిర్ఋజురాసీన్మహాయశాః. ౨

రాజర్షీణాం గుణశ్రేష్ఠస్తపసా చర్షిభిస్సమః,
చక్రవర్తికులే జాతః పురందరసమో బలే. 3

అహింసారతిరక్షుద్రో ఘృణీ సత్యపరాక్రమః,
ముఖ్యశ్చేక్ష్వాకువంశస్య లక్ష్మీవాన్ లక్ష్మివర్ధనః. ४

పార్థివవ్యంజనైర్యుక్తః పృథుశ్రీః పార్థివర్షభః.
పృథివ్యాం చతురంతాయాం విశ్రుతస్సుఖదస్సుఖీ. ౫

తస్య పుత్త్రః ప్రియో జ్యేష్ఠస్తారాధిపనిభాననః,
రామో నామ విశేషజ్ఞః శ్రేష్ఠస్సర్వధనుష్మతామ్. ౬

మహానుభావుఁడగు నాహనుమంతుఁడు చెట్టుకొమ్మపై సీత కనఁబడకుండ సీతంజూచుచు మధురంబును వ్యర్థమయిన సంగతిలేనిదియు నగుమాట నీప్రకారముగా నానావిధంబులఁ జెప్పెను. ౪౪

ఇది ముప్పదియవ సర్గము.

---

## ముప్పదియొకటవ సర్గము

హనుమంతుఁ డిట్లు నానావిధములుగా నాలోచించి సీతాదేవిసమీపంబున విన్నంతనె సంతోషంబు గల్గించునట్టిమధురం బగుమాటం జెప్పెను. ౧

రథంబులు నేనుంగులు గుఱ్ఱంబులుఁ గలిగి పుణ్యంబులు మాత్రమె చేయుచుఁ గపటంబులేక దానంబులను బరాక్రమంబునను నధికమయిన కీర్తి నొందియుండు దశరథుం డనురాజొకఁ డుండెను. ౨

ఆదశరథుఁడు గుణంబుల రాజర్షులలోఁ గడునధికుఁడు. తపంబున ఋషులకు సరివచ్చువాఁడు. చక్రవర్తులగురాజులవంశంబునఁ బుట్టినవాఁడు. పరాక్రమంబున దేవేంద్రునకు సరియగును. 3

ఆదశరథుఁడు ప్రాణిలోకమును హింసింపఁడు! దుష్టుఁడు గాఁడు. దయాశాలి. దృఢమయిన పరాక్రమంబు గలవాఁడు. ఇక్ష్వాకువంశమున కంతయు ముఖ్యుఁడు. నధికమైనసంపదఁ గలవాఁడు ఆశ్రితులసంపదను వృద్ధిఁ బొందించువాఁడు. ౪

మఱియు నాదశరథుఁడు శంఖచక్రరేఖలు మొదలగురాజలక్షణములు గలవాఁడు. అధికమయినదేహకాంతిగలవాఁడు. రాజులలో మేటియయిన వాఁడు. చతుస్సముద్రంబులనడుమనుండు భూమియందంతటను బ్రసిద్ధినొందిన వాఁడు. జనులకు సుఖంబు గలుగఁజేయువాఁడు. మిక్కిలియు సుఖంబు ననుభవించువాఁడు. ౫

ఆదశరథునకుఁ జంద్రబింబముంబోలు ముఖంబుగలవాఁడును ధర్మవిశేషంబుల నెఱింగినవాఁడును విలుకాండ్రందఱిలోను శ్రేష్ఠుండును బ్రియుండు నగు జ్యేష్ఠపుత్రుఁడు రాముఁ డనువాఁడు గలఁడు. ౬

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా,
రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః. ౭

తస్య సత్యాభిసంధస్య వృద్ధస్య వచనాత్పితుః,
సభార్యస్సహ చ భ్రాత్రా వీరః ప్రవ్రాజితో వనమ్. ౮

తేన తత్ర మహారణ్యే మృగయాం పరిధావతా,
రాక్షసా నిహతాశ్శూరా బహవః కామరూపిణః. ౯

జనస్థానవధం శ్రుత్వా హతౌ చ ఖరదూషణౌ,
తతస్త్వమర్షాపహృతా జానకీ రావణేన తు. ౧౦

వంచయిత్వా వనే రామం మృగరూపేణ మాయయా,
స మార్గమాణస్తాం దేవీం రామస్సీతామనిందితామ్. ౧౧

ఆససాద వనే మిత్రం సుగ్రీవం నామ వానరం,
తతస్స వాలినం హత్వా రామః పరపురంజయః. ౧౨

ప్రాయచ్ఛత్కపిరాజ్యం తత్సుగ్రీవాయ మహాబలః,
సుగ్రీవేణాపి సందిష్టా హరయః కామరూపిణః. ౧౩

దిక్షు సర్వాసు తాం దేవీం విచిన్వంతి సహస్రశః
అహం సంపాతివచనాచ్ఛతయోజనమాయతమ్. ౧౪

అస్యా హేతోర్విశాలాక్ష్యాస్సాగరం వేగవాన్ ప్లుతః,
యథారూపాం యథావర్ణాం యథాలక్ష్మీం చ నిశ్చితామ్. ౧౫

అశ్రౌషం రాఘవస్యాహం సేయమాసాదితా మయా,
విరరామైవముక్త్వాసౌ వాచం వానరపుంగవః. ౧౬

ఆరాముఁడు తనక్షత్త్రియవర్ణమునకు విధింపఁబడిన ధర్మమును రక్షించుకొనువాఁడు. తనధర్మమును రక్షించుకొనునట్లు తనబంధుజనమును రక్షించునట్లు సమస్తప్రాణులను రక్షించును. అట్లు వర్ణాశ్రమధర్మమును దప్పకుండ రక్షించువాఁడు. శత్రువులం జంపువాఁడు. ౭

సత్యసంకల్పుఁడును వృద్ధుఁడునగు తండ్రియయిన దశరథునియాజ్ఞచే పరాక్రమశాలి యగురాముఁడు భార్యయుఁ దమ్ముండును వెంటరా నరణ్యంబునకుఁ బోయెను. ౮

ఆమహారణ్యంబున రాముఁడు వేఁటాడుచు ఘోరులును గామరూపులు నగురాక్షసుల ననేకుల ఖరుఁడు మొదలగువారలం జంపెను. ౯

రావణుఁడు జనస్థానంబునందలిరాక్షసులందఱును ఖరుఁడును దూషణుఁడును రామునిచేఁ జచ్చుటను విని యంతఁ గోపంబున రాముని మాయామృగరూపంబున మోసపుచ్చి సీత నపహరించినాఁడు. ౧౦

ఆరాముఁడు పతివ్రతయయిన తనభార్యనుసీతను వనంబున వెదకుచుఁ బోఁగా నచ్చట సుగ్రీవుఁ డనువానరుఁ డతనికి స్నేహితుఁ డయ్యె. ౧౧

అంత శత్రుపట్టణంబుల జయించువాఁడును మహాబలుఁడు నగు రాముఁడు వాలి యనువానరుం జంపి యతనికుండిన వానరరాజ్యంబు సుగ్రీవునకిచ్చెను. ౧౨

అంత సుగ్రీవుం డాజ్ఞాపింపఁగాఁ గామరూపు లగువానరులు వేలకొలఁది సమస్తదిక్కులందును ఆసీతాదేవిని వెదకుచున్నారు. ౧౩

నేను ఈసీతకుఁగాను సంపాతిమాటప్రకారము వేగంబున నూఱు యోజనంబుల దూరముగల యీసముద్రమును దాఁటి వచ్చినాను. ౧౪

రాముఁడు నాకు సీతదేహంబును రంగును గాంతియును ఎట్లుండునని చెప్పెనో అట్టి దేహంబును గాంతియుం గలయాసీతను చూచినాను. అని హనుమంతుఁడు చెప్పెను. ౧౫

వానరశ్రేష్ఠుఁ డగుహనుమంతుఁ డింతవఱకుఁ జెప్పి యంత యూరకుండెను.

జానకీ చాపి తచ్ఛ్రుత్వా పరం విస్మయమాగతా,

తతస్సా వక్రకేశాంతా సుకేశీ కేశసంవృతమ్. ౧౭

ఉన్నమ్య వదనం భీరుశ్శింశుపావృక్షమైక్షత,

నిశమ్య సీతా వచనం కపేశ్చ
దిశశ్చ సర్వాః ప్రదిశశ్చ వీక్ష్య,
స్వయం ప్రహర్షం పరమం జగామ
సర్వాత్మనా రామ మనుస్మరంతీ. ౧౮

సా తిర్యగూర్ధ్వం చ తథాప్యధస్తా
న్నిరీక్షమాణా తమచింత్యబుద్ధిం,
దదర్శ పింగాధిపతే రమాత్యం
వాతాత్మజం సూర్యమివోదయస్థమ్. ౧౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకత్రింశస్సర్గః.

---

## ద్వా త్రిం శ స్స ర్గః

తతశ్శాఖాంతరే లీనం దృష్ట్వా చలితమానసా,
వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాతపింగళమ్. ౧

సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినం,
ఫుల్లాశోకోత్కరాభాసం తప్తచామీకరేక్షణమ్. ౨

సీతయును హనుమంతుఁడు చెప్పినమాటలను విని 'ఇప్పు డిక్కడ నట్టి మాటలం జెప్పువాఁ డెవ్వఁడు?' అని మిక్కిలి యాశ్చర్యము నొందెను.

అంతఁ గొనలందు వంకరలయి సుందరములయియుండు వెండ్రుకలతోఁ బొల్పుచుండు నాసీతాదేవి భయపడు స్వభావంబు గలది గావునఁ గొంచెము భయంబుగదుర నరిపోసికొనుటకై వెండ్రుకలం గట్టఁబడియుండు ముఖమును బైకెత్తి శింశుపావృక్షముం జూచెను. ౧౭

సీతాదేవి హనుమంతునిమాట విని సమస్తములయిన దిక్కులను విదిక్కులనుం జూచి యెవ్వరినిం గానక నిశ్చలం బగుమనంబున రామాకారంబుగా ధ్యానించుచుఁ బరమసంతోషంబు నొందెను. ౧౮

సీతాదేవి యాశింశుపావృక్షమునకుఁ బార్శ్వంబులను బైగాను గ్రిందను వెదకుచు అచింత్యం బగుబుద్ధిగలవాఁడును వానరేశ్వరుండగు సుగ్రీవుని మంత్రియును ఉదయకాలసూర్యుండుంబోలెఁ జూపరులకు సంతోషంబు గలిగించువాఁడు నగు వాయుకుమారుని హనుమంతుం జూచెను. ౧౯

ఇది ముప్పదియొకటవ సర్గము.

---

## ముప్పదిరెండవ సర్గము

అంత నాసీతాదేవి చెట్టుకొమ్మనడుమ దాఁగినవాఁడై తెల్లవస్త్రము గట్టుకొని మెఱపులసమూహంబునకుం బోలెఁ బ్రకాశంబు గలిగియుండు నాహనుమంతుం జూచి కొంచెము భయంబు నొందెను. ౧

అట్లు సీతాదేవి చక్కఁగాఁ జెట్టుకొమ్మపైఁ జూడఁగా వాఁడును వినయంబుగలవాఁడై ప్రియవాక్యంబులు పలుకుచు వికసించిన యశోకపుష్పంబులకాంతియుంబోలెఁ బ్రకాశించుచు నుత్తమమయిన బంగారము వన్నెగలకండ్లతోఁ బొల్పుచుండు వానరుం డొక్కఁడు (హనుమంతుఁడు) కనఁబడెను. ౨

[సాధు దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదవస్థితం]

మైథిలీ చింతయామాస విస్మయం పరమం గతా,
అహో భీమమిదం రూపం వానరస్య దురాసదమ్. 3
దుర్నిరీక్షమితి జ్ఞాత్వా పునరేవ ముమోహ సా,

విలలాప భృశం సీతా కరుణం భయమోహితా. ४
రామరామేతి దుఃఖార్తా లక్ష్మణేతి చ భామినీ,

రురోద బహుధా సీతా మందం మందస్వరా సతీ. ౫

సా తం దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదుపస్థితం,
మైథిలీ చింతయామాస స్వప్నోఽయమితి భామినీ. ౬
సా వీక్షమాణా పృథు భుగ్నవక్త్రం
శాఖామృగేంద్రస్య యథోక్తకారం,
దదర్శ పింగాధిపతే రమాత్యం
వాతాత్మజం బుద్ధిమతాం వరిష్ఠమ్. ౭
సా తం సమీక్ష్యైవ భృశం విసంజ్ఞా
గతాసుకల్పేవ బభూవ సీతా,
చిరేణ సంజ్ఞాం ప్రతిలభ్య భూయో
విచింతయామాస విశాలనేత్రా. ౮
స్వప్నే మయాఽయం వికృతోఽద్య దృష్ట
శ్శాఖామృగశ్శాస్త్రగణైర్నిషిద్ధః,

[చెట్టుకొమ్మలలో శాఖలలోనివిం దెలవలె నణఁగి మణఁగియున్న యాతనిఁ జక్కఁగా నిరూపించి.]

అంత సీతాదేవి పరమాశ్చర్యంబునొంది యిట్లని చింతించెను.

'అయ్యో! నాకీ వానరరూపం బగపడినదే! ఇది భయంకరమయినది. మహాదుఃఖంబుగల్గు సమయంబునంగాని యగపడదు. చూచువారలకు మహాదుఃఖము గల్గించునది' అని తలంచి సీతాదేవి మరల దుఃఖంబున మూర్ఛనొందెను. ౩

సీతాదేవి భయంబునను దుఃఖంబునను గుందుచు 'రాముఁడా! లక్ష్మణుఁడా!' అని పలుకుచు వినువారలకును దుఃఖము గల్గునట్లుగా నానాప్రకారంబుల దుఃఖించెను. ౪

అంత సీత రాక్షసస్త్రీలు విందు రనుభయంబునఁ దిన్ననిశబ్దంబుతో మెల్లఁగా దుఃఖంబు పట్టఁజాలక యేడ్చెను. ౫

ఆసీతాదేవి వినీతుండై తనసమీపంబునందుఁ జెట్టుపైనుండు వానరశ్రేష్ఠుని హనుమంతుంజూచి యిది స్వప్నమే కాని వేఱుగాదు అని తలంచెను. ౬

ఆసీత ఇట్టటుఁ జూచుచుఁ బెద్దవంకరముఖంబు గలవాఁడును వానరేశ్వరుండును సుగ్రీవునకుఁ జెప్పినట్లు సేయువాఁడును మంత్రియును బుద్ధిమంతుల లోపల శ్రేష్ఠుండు నగు వాయుదేవునికుమారుని హనుమంతుం జూచెను.

ఆసీత హనుమంతునిఁ జూచినంతనె చచ్చినదాని పోల్కి మైమఱచియుండెను. ౭

విశాలంబు లగునేత్రంబులుగల సీతాదేవి యంత బహుకాలంబునకు మూర్ఛదేఱి మరల నిట్లని చింతించెను. ౮

నే నిప్పుడు స్వప్నంబున వికృతంబగు కోఁతిం జూచినాను. శాస్త్రములయందంతటను స్వప్నంబునఁ గోఁతిని జూచువారలకు మహాదుఃఖంబు గలుగు నని చెప్పఁబడియున్నది. కావున రామాదుల కేమి కష్టమువచ్చినదో

స్వ_స్త్యస్తు రామాయ సలక్ష్మణాయ
తథా పితుర్మే జనకస్య రాజ్ఞః. ౯
స్వప్నోఽపి నాయం న హి మేఽస్తి నిద్రా
శోకేన దుఃఖేన చ పీడితాయాః,
సుఖం హి మే నాస్తి యతోఽస్మి హీనా
తేనేందుపూర్ణప్రతిమాననేన. ౧౦

రామేతి రామేతి సదైవ బుద్ధ్యా
విచింత్య వాచా బ్రువతీ తమేవ,
తస్యానురూపాం చ కథాం తమర్థ
మేవం ప్రపశ్యామి తథా శృణోమి. ౧౧
అహం హి తస్యాద్య మనోభవేన
సంపీడితా తద్గతసర్వభావా,
విచింతయంతీ సతతం తమేవ
తథైవ పశ్యామి తథా శృణోమి. ౧౨
మనోరథస్స్యాదితి చింతయామి
తథాపి బుద్ధ్యా చ వితర్కయామి,
కిం కారణం తస్య హి నాస్తి రూపం
సువ్య_క్తరూపశ్చ వదత్యయం మామ్. ౧౩

రామునకును లక్ష్మణునకును నాతండ్రి జనకమహారాజునకును మంగళంబు కలుగుం గాక. ౯

రామవిరహంబునను రాక్షసుల మధ్యంబునం జిక్కియుండుటవలనను ఇట్లు రెండువిధంబులను దుఃఖమునొంది పరితపించుచున్నాను. కావున నాకు నిదుర వచ్చుటకే యవకాశము లేదే! స్వప్నం బెట్లు గలుగును? మఱియుం నిండుచంద్రునింబోలుముఖంబు గలరాముని విడిచియున్నాను. నాకు సుఖం బెక్కడిది? సుఖంబు లేనిచో నిదుర ఎట్లు వచ్చును? కావున నిది యొంత మాత్రము స్వప్నము కాదు. ౧౦

నేను ఎల్లప్పుడును రామునే ధ్యానించుచు నోటం జెప్పుకొనుచున్న దానను. అందుకుం దగినట్లుగా నారాముని గుఱించిన కథను వినుచున్నాను. ఆయభిప్రాయమును దెలుసుకొనుచున్నాను. ౧౧

నేను రాముని విడిచినది మొదలు రామవిరహంబున మన్మథునిచేఁ బీడింపఁబడి నిశ్చలంబగు మనంబున నేకాకారముగా 'నారామునే యెల్లప్పుడును ధ్యానించుచున్నాను. గావున నేను మనంబున ధ్యానించునట్టె నాకండ్లకు నగపడుచున్నది. నాచెవులకు నట్లె వినవచ్చుచున్నది. ౧౨

నా కిదివఱకున్నట్లు ఇప్పుడును నాహృదయంబున నలికయించియుండు రామవిషయికమయిన మనోరథముచేతనే యిట్లు నాకు వినవచ్చులాగునఁ గల్పిత మగుచున్నది. అట్లది భ్రాంతియే కాని వాస్తవముగా నెవ్వరుఁ జెప్పినదికాదు. అని తలంచెదను. అయిన బుద్ధిచే విచారింపఁగా మాత్రము అట్లు కాదని తెలియవచ్చుచున్నది. ఏలయనఁగా మనోరథంబునకు రూపము లేదు. కావున దానిచేఁ గల్పిత మయినచో నిదియుం నగపడక యూరక మనస్సునకు మాత్రము వినవచ్చులాగునఁ దోఁచవలయు. ఇప్పు డట్లు లేదు. ఈవానరునిరూపము నాకు స్పష్టముగాఁ గనఁబడుచున్నది. మఱియుం నితని కంఠస్వరమును అతండు చెప్పుటయును స్పష్టముగా నాకు వినవచ్చుచున్నది. కావున నీవానరుం డెవ్వఁడో వాస్తవముగా నిచ్చటికి వచ్చి నాకుఁ దెలియ వలెనని చెప్పినమాటేగాని వేఱుగాదు. ౧౩

నమోఽస్తు వాచస్పతయే సవజ్రిణే
స్వయంభువే చైవ హుతాశనాయ చ,
అనేన చోక్తం యదిదం మమాగ్రతో
వనౌకసా తచ్చ తథాస్తు నాన్యథా. ౧౪

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్వాత్రింశస్సర్గః.

## త్రయస్త్రింశస్సర్గః

సోఽవతీర్య ద్రుమాత్తస్మాద్విద్రుమప్రతిమాననః,
వినీతవేషః కృపణః ప్రణిపత్యోపసృత్య చ. ౧
తామబ్రవీన్మహాతేజా హనూమాన్మారుతాత్మజః,
శిరస్యంజలి మాధాయ సీతాం మధురయా గిరా. ౨

కా ను పద్మపలాశాక్షి క్లిష్టకౌశేయవాసిని,
ద్రుమస్య శాఖామాలంబ్య తిష్ఠసి త్వమనిందితే. ౩

కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజం,
పుండరీకపలాశాభ్యాం విప్రకీర్ణమివోదకమ్. ౪

సురాణామసురాణాం వా నాగగంధర్వరక్షసాం,
యక్షాణాం కిన్నరాణాం వా కా త్వం భవసి శోభనే. ౫

కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే,
వసూనాం వా వరారోహే దేవతా ప్రతిభాసి మే. ౬

దేవేంద్రునకును బృహస్పతికిని బ్రహ్మదేవునకును అగ్నిహోత్రునకును నమస్కరించెదను. నాముందట నావానరుఁడు చెప్పినమాటలన్నియుం సత్యంబులగుఁగాక. స్వప్నంబుగాని మఱియేదిగాని యయి యబద్ధము గాకుండవలెను. అని సీతాదేవి చెప్పినది. ౧౪

ఇది ముప్పదిరెండవ సర్గము.

---

## ముప్పదిమూఁడవ సర్గము

పగడమువంటిరీతి కెంపైన ముఖంబు గలవాఁడును మహాతేజుండగు వాయుపుత్రుండైన హనుమంతుఁడు అవృక్షంబు నుండి నేలకు దిగి యిదివఱకు సీతాదేవిదుఃఖమును జూచినవాఁ డగుటంజేసి దీనుండై వినయంబున నమస్కరించి కొంతసమీపంబునకుఁ బోయి శిరస్సునఁ జేమోడ్పు గీలించి యాసీతం జూచి మధురవచనంబున నిట్లని చెప్పెను. ౧, ౨

తామరపూరేకులవంటి కండ్లతో నొప్పుచు నలఁగిన పట్టువస్త్రంబు గట్టుకొని యీచెట్టుకొమ్మం బట్టుకొనియున్నావు. పతివ్రతవుగా నున్నావు. నీ వెవ్వతెవు ? ౩

అలలచేఁ బైకెగురఁగొట్టఁబడి తెల్లదామరపూలం బడిననీళ్లు ఆ తెల్లతామరపూలరేకులనుండి కాఱునట్లు నీకండ్లనుండి దుఃఖంబునంజేసి కన్నీరు కాఱుచున్నదేల ! ౪

మంగళకరివగుదానా ! నీవు దేవతలు అసురులు నాగకన్యలు గంధర్వులు రాక్షసులు యక్షులు కిన్నరులను వీరలయందు ఎవ్వరిలోఁ జేరిన దానవు ! ౫

సుందరమయిన ముఖంబుగలదానా ! నీవు రుద్రగణంబులోఁ జేరిన దానవా ? వాయువులలోఁ జేరినదానవా ! లేక వసువులలోఁ జేరినదానవా ? నీ వెవ్వతెవు! సుందరము లయిన పిఱుఁదులుగలదానా ! నీవు దేవతవని నాకుఁ దోఁచుచున్నది. ౬

కిన్ను చన్ద్రమసా హీనా పతితా విబుధాలయాత్,

రోహిణీ జ్యోతిషాం శ్రేష్ఠా శ్రేష్ఠసర్వగుణాన్వితా. ౭
కా త్వం భవసి కల్యాణి త్వమనిందితలోచనే,

కోపాద్వా యది వా మోహాద్భర్తారమసితేక్షణే. ౮
వసిష్ఠం కోపయిత్వా త్వం నాసి కల్యాణ్యరుంధతీ,

కో ను పుత్రః పితా భ్రాతా భర్తా వా తే సుమధ్యమే. ౯

అస్మాల్లోకాదముం లోకం గతం త్వమనుశోచసి,

రోదనాదతినిశ్శ్వాసాద్భూమిసంస్పర్శనాదపి. ౧౦
న త్వాం దేవీమహం మన్యే రాజ్ఞస్సంజ్ఞావధారణాత్,

వ్యంజనాని చ తే యాని లక్షణాని చ లక్షయే. ౧౧
మహిషీ భూమిపాలస్య రాజకన్యాసి మే మతా,

రావణేన జనస్థానాద్బలాదపహృతా యది. ౧౨
సీతా త్వమసి భద్రం తే తన్మమాచక్ష్వ పృచ్ఛతః,

యథా హి తవ వై దైన్యం రూపం చాప్యతిమానుషమ్. ౧౩
తపసా చాన్వితో వేషస్త్వం రామమహిషీ ధ్రువం,

సా తస్య వచనం శ్రుత్వా రామకీర్తనహర్షితా. ౧౪
ఉవాచ వాక్యం వైదేహీ హనుమంతం ద్రుమాశ్రితం,

నీవు చంద్రుని విడిచి స్వర్గంబునుండి భూమికి వచ్చియున్న నక్షత్ర శ్రేష్ఠయు నుత్తమగుణంబులు గలదియు నగు రోహిణివా యేమి?

మంగళస్వరూపిణివగుదానా! నీ వెవ్వతెవు? ఎంతమాత్రము దోషము లేక సులక్షణయుక్తంబులయి సుందరంబు లయిన కండ్లు గలదానా! నీ వెవ్వతెవు! చెప్పుము. ౭

నల్లనికండ్లు గలదానవు మంగళకరి వగుదానా! నీవు కోపమునఁగాని ప్రణయకోపమువలనఁగాని పెనిమిటి యగువసిష్ఠునిపైఁ గోపమువూని భూమికి వచ్చిన యరుంధతివి కావా యేమి? ౮

సుందరమయిన నడుముగలదానా! నీకొడుకెవ్వఁడు తండ్రియెవ్వఁడు! నీసహోదరుఁ డెవ్వఁడు! నీ పెనిమిటి యెవ్వఁడు! నాకుఁ జెప్పుము. ౯

నీబంధు వెవ్వఁడైనను మరణము నొందఁగా నతనిఁ గూర్చి నీ విప్పుడు దుఃఖించుచున్నావా యేమి!

ఏడ్చుటవలనను నిట్టూర్పు విడుచుటవలనను నేలను స్పృశించుటవలనను రాజలక్షణము లగపడుటవలనను నీవు దేవతాస్త్రీవి కావని తలంచుచున్నాను. అయిన రాజస్త్రీవిగా నుండవచ్చునని మాత్రము తోఁచుచున్నది.

నీదేహమున నుండు స్తనజఘనాద్యవయవముల యునికిని మంగళకరము లయిన సాముద్రికలక్షణములనుంబట్టి చూడఁగా "నీవు రాజు పట్టపురాణివి. రాచకొమార్తెవు" అని నాకు తోఁచుచున్నది. ౧౦

నీవు రావణుండు జనస్థానమున బలాత్కారముగా నపహరించిన సీతాదేవి వగుదువేని ఆసంగతినే నేనిప్పుడడుగుచున్నాను నాకు దాని శీఘ్రముగాఁ జెప్పుము. నీకు మంగళము గలుగుఁగాక! ౧౨

నీదుఃఖమును మనుష్యస్త్రీలకుఁ గలుగని నీసౌందర్యమును నీతాపసవేషమునుం జూడఁగా నీవు రామునిభార్యవే. ఇం దెంతమాత్రమును సందేహము లేదు. అని హనుమంతుఁడు సీతాదేవింజూచి చెప్పెను. ౧౩

సీతాదేవి హనుమంతుఁడు చెప్పినమాట విని రామునిసంగతివిని మిక్కిలి సంతోషమునొందినదై చెట్టుక్రిందనుండు హనుమంతుం జూచి యిట్లని చెప్పెను. ౧౪

పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః. ౧౫

స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాపినః,
దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః. ౧౬
సీతేతి నామ నామ్నాఽహం భార్యా రామస్య ధీమతః,
సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే. ౧౭
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ,

తత్ర త్రయోదశే వర్షే రాజ్యేనేక్ష్వాకునందనమ్. ౧౮
అభిషేచయితుం రాజా సోపాధ్యాయః ప్రచక్రమే,
తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవస్యాభిషేచనే. ౧౯
కైకేయీ నామ భర్తారం దేవీ వచనమబ్రవీత్,

న పిబేయం న ఖాదేయం ప్రత్యహం మమ భోజనమ్. ౨౦
ఏష మే జీవితస్యాంతో రామో యద్యభిషిచ్యతే,
యత్తదుక్తం త్వయా వాక్యం ప్రీత్యా నృపతిసత్తమ. ౨౧
తచ్చేన్న వితథం కార్యం వనం గచ్ఛతు రాఘవః,

స రాజా సత్యవాగ్దేవ్యా వరదానమనుస్మరన్. ౨౨
ముమోహ వచనం శ్రుత్వా కైకేయ్యాః క్రూరమప్రియం,

తతస్తు స్థవిరో రాజా సత్యే ధర్మే వ్యవస్థితః. ౨౩
జ్యేష్ఠం యశస్వినం పుత్రం రుదన్రాజ్యమయాచత,

నేను భూమియందలి రాజశ్రేష్ఠుల కందఱకును ముఖ్యుఁడై పరమాత్మవేత్తయై శత్రుసైన్యంబుల జంపువాఁడై యుండిన దశరథమహారాజుకోడలను.

మహాపరాక్రమశాలియుఁ విదేహదేశాధిపతియుఁ నగు జనకమహారాజు కొమార్తెను. ౧౬

నా పేరు సీతయని చెప్పుదురు. నేను బుద్ధిమంతుఁడగు రామునిభార్యను.

నేను వివాహమయినపిమ్మట నాదశరథునింటఁ బండ్రెండువత్సరంబులు నిరంతరంబుగా మానుషభోగంబు లనుభవించుచు సమస్తకామంబులం బొందుచుంటిని. ౧౭

పదుమూఁడవసంవత్సరమున దశరథమహారాజు ఉపాధ్యాయుఁడగు వసిష్ఠుం గూడి రామునకుఁ బట్టాభిషేకము సేయ యత్నించెను. ౧౮

అట్లు రామునిపట్టాభిషేకమునకై సంభారములు కూర్పఁబడుచుండఁగానే కైకేయి యనెడు దశరథునిభార్య యొకతె వచ్చి తనపెనిమిటింజూచి యిట్లని చెప్పినది. ౧౯

రామునకుఁ బట్టాభిషేకము సేయుదువేని నే నెంతమాత్రము నీళ్లు త్రాగను. అన్నము తినను. ఈక్షణమే ప్రాణములు విడుతును. ౨౦

రాజశ్రేష్ఠుఁడవగు దశరథుఁడా! నీవె నాకు మున్ను సంతోషమున వరం బొసంగియున్నావే ఆవరము వ్యర్థము కాకుండుట నీకిష్టమె యగునేని రాముం డిప్పుడు వనమునకుఁ బోవలయును. అని కైకేయి దశరథునితోఁ జెప్పినది. ౨౧

ఆ దశరథమహారాజు కైకేయి చెప్పిన క్రూరమును నప్రియమునగు మాటను విని తాను కైకేయికి వరం బిచ్చియుండుటను దలంచుకొని సత్యవాది కావున దానికి బదులాడంజాలక మూర్ఛనొందెను. ౨౨

అంతఁ గొంచెమయిన స్ఖాలిత్యములేక సత్యమును ధర్మమును గాపాడుచుండు ముసలివాఁడైన దశరథమహారాజు రోదనముసేయుచు మహాకీర్తిశాలి యగుతనజ్యేష్ఠపుత్రుం డయినరామునింజూచి "నేనిప్పుడు నీ కిచ్చెదనని చెప్పిన రాజ్యమును నాకు మరలనిమ్ము" అని యాచించెను. ౨౩

స పితుర్వచనం శ్రీమానభిషేకాత్పరం ప్రియమ్. ౨౪
మనసా పూర్వమాసాద్య వాచా ప్రతిగృహీతవాన్,
దద్యాన్న ప్రతిగృహ్ణీయాన్న బ్రూయాత్కించిదప్రియమ్. ౨౫
అపి జీవితహేతోర్వా రామస్సత్యపరాక్రమః,

స విహాయోత్తరీయాణి మహార్హాణి మహాయశాః. ౨౬
విసృజ్య మనసా రాజ్యం జనన్యై మాం సమాదిశత్,

సాహం తస్యాగ్రతస్తూర్ణం ప్రస్థితా వనచారిణీ. ౨౭

నహి మే తేన హీనాయా వాసస్స్వర్గేఽపి రోచతే,
ప్రాగేవ తు మహాభాగస్సౌమిత్రిర్మిత్రనందనః. ౨౮
పూర్వజస్యానుయాత్రార్థే ద్రుమచీరైరలంకృతః,

తే వయం భర్తురాదేశం బహుమాన్య దృఢవ్రతాః. ౨౯
ప్రవిష్టాః స్మ పురా దృష్టం వనం గంభీరదర్శనం,
వసతో దండకారణ్యే తస్యాహమమితౌజసః. ౩౦
రక్షసాఽపహృతా భార్యా రావణేన దురాత్మనా,

ద్వౌ మాసౌ తేన మే కాలో జీవితానుగ్రహః కృతః. ౩౧
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం తతస్త్యక్ష్యామి జీవితం.

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రయస్త్రింశస్సర్గః.

అందఱికన్న నధికుండగు నారాముండు పట్టాభిషేకముకన్న నధిక ప్రియమయిన తండ్రిమాటను మనఃపూర్వకముగా నంగీకరించెను. ౨౪

రాముండు ఎవరు దేనిం గోరుదురో దాని వారల కిచ్చును. ప్రాణసంకటము సంభవించినను ఎవ్వరియొద్దను దేనిని పుచ్చుకొనండు. మఱియుం గొంచెమయిన నితరుల కప్రియమయినమాటను జెప్పండు. ౨౫

మహాకీర్తిశాలియగు నారాముండు తానుగట్టుకొనియుండిన శ్రేష్ఠవస్త్రముల విడిచి నారచీరలు గట్టుకొని మనసునంగూడ రాజ్యముగోరక వనమునకుం బోవ నిశ్చయించి నన్నుంజూచి "నీవు కౌసల్యయొద్దనుండుము" అని చెప్పెను. పతివ్రతనగు నేనును వనములోనుండ నిశ్చయించి యారామునకు ముందుగాం బయనంబయితిని. ౨౭

నేను ఆరాముని విడిచి స్వర్గమునందైనను ఉండంజాలను.

అంతకుమును పే మహాభాగ్యశాలియును స్నేహితులకు సంతోషముం గలిగించువాండును నగుసుమిత్రకొడుకైన లక్ష్మణుండు అన్నయగు రాముని వెంబడించుటకై నారచీరలం గట్టుకొనెను. ౨౮

అట్లు మేము మువ్వురము దశరథునియాజ్ఞకు బద్ధులమై దృఢచిత్తంబున నిదివఱ కెప్పుడును మేమెఱుంగని గంభీరంబగు నడవిం బ్రవేశించినాము. ౨౯

కొలందిలేని పరాక్రమంబుగల యారాముండు దండకారణ్యంబున నుండంగా నతనిభార్యనగు నన్ను దుష్టాత్ముండును రాక్షసుండు నగురావణుండు ఇచ్చటికిం గొనితెచ్చెను. ౩౦

ఆరావణుండు ఇంక రెండుమాసంబులవఱకు నన్ను బ్రతుకనిచ్చెదనని చెప్పియున్నాండు. ఆరెండుమాసంబులపైన నేను బ్రాణంబుల విడువంగలను, అని సీతాదేవి హనుమంతునితోం జెప్పెను. ౩౧

ఇది ముప్పదిమూండవ సర్గము.

## చతుస్త్రింశస్సర్గః

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్హరియూథపః,
దుఃఖాద్దుఃఖాభిభూతాయాస్సాంత్వముత్తరమబ్రవీత్. ౧

అహం రామస్య సందేశాద్దేవి దూతస్తవాగతః,
వైదేహి కుశలీ రామస్త్వాం చ కౌశలమబ్రవీత్. ౨

యో బ్రాహ్మమస్త్రం వేదాంశ్చ వేద వేదవిదాం వరః,
స త్వాం దాశరథీ రామో దేవి కౌశలమబ్రవీత్. ౩

లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽనుచరః ప్రియః,
కృతవాన్ శోకసంతప్తశ్శిరసా తేఽభివాదనమ్. ౪

సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః,
ప్రీతిసంహృష్టసర్వాంగీ హనూమంతమథాబ్రవీత్. ౫

కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మా,
ఏతి జీవంతమానందో నరం వర్షశతాదపి. ౬

తయా సమాగతే తస్మిన్ ప్రీతిరుత్పాదితాఽద్భుతా,

పరస్పరేణ చాలాపం విశ్వస్తౌ తౌ ప్రచక్రతుః. ౭

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనూమాన్హరియూథపః,
సీతాయాశ్శోకదీనాయాస్సమీపముపచక్రమే. ౮

## ముప్పదినాలుగవసర్గము

వానరసమూహమున కధిపతియయిన హనుమంతుఁడు దుఃఖమునొంది యున్న యాసీతాదేవిమాటలు విని దుఃఖమునొంది యాసీతాదేవి నూఱడించుచు నిట్లని చెప్పెను. ౧

సీతాదేవీ! నేను రాముసాజ్ఞంజేసి దూతనై నీయొద్దకు వచ్చినాను.

సీతాదేవీ! రాముఁడు క్షేమముగా నున్నాఁడు తనక్షేమము నీతోఁ జెప్పుమన్నాఁడు. ౨

సీతాదేవీ! ఎవ్వఁడు బ్రహ్మాస్త్రమును వేదముల నెఱుంగునో వేదవేత్తలలో శ్రేష్ఠుండును దశరథపుత్రుండు నగునారాముండు నీక్షేమము నడుగుమన్నాఁడు. ౩

నీ పెనిమిటి యగు రామునకుఁ బ్రియుండును అతని వెంటఁబడివచ్చినవాఁడును మహాపరాక్రమశాలియుం నగులక్ష్మణుఁడును దుఃఖంబున నీకుసాష్టాంగనమస్కారంబు గావించెను. అని హనుమంతుఁడు సీతతోఁ జెప్పెను. ౪

ఆసీతాదేవి పురుషశ్రేష్ఠులగు నారామలక్ష్మణులు క్షేమంబుగ నుండుట విని దేహంబంతయుం బులకలు పొడమఁగా నంత హనుమంతునిఁ జూచి యిట్లని చెప్పినది. ౫

“మనుష్యుఁడు బ్రతికియుండునేని నూఱుసంవత్సరములకైనను తప్పక ఆనందంబు నొందును.” అని లోకంబునం బ్రసిద్ధి కెక్కియుండు సామెత నాపట్ల సత్యమయినదిగాఁ దోఁచుచున్నది. సంతోషము!” అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పినది. ౬

రామునొద్దనుండి వచ్చిన యాహనుమంతుని విషయమయి యాసీతకు అద్భుతంబగు సంతోషము కల్గినది.

అట్టు లాసీతయుం హనుమంతుఁడును సందేహమువిడిచి యొండొరులతో మాటలాడుకొనిరి. ౭

వానరసమూహంబున కధిపతి యయినహనుమంతుఁడు అట్టు దుఃఖిత యయి యుండు నాసీతాదేవి చెప్పినమాటను విని మెల్లఁగా నామెసమీపంబునకుఁ బో నారంభించెను. ౮

యథా యథా సమీపం స హనూమానుపసర్పతి,
తథా తథా రావణం సా తం సీతా పరిశంకతే. ౯

అహో ధిగ్దుష్కృతమిదం కథితం హి యదస్య మే,
రూపాంతరముపాగమ్య స ఏవాయం హి రావణః. ౧౦

తామశోకస్య శాఖాం సా విముక్త్వా శోకకర్శితా,
తస్యామేవానవద్యాంగీ ధరణ్యాం సముపావిశత్. ౧౧
హనుమానపి దుఃఖార్తాం తాం దృష్ట్వా భయమోహితాం,
అవందత మహాబాహు స్తత స్తాం జనకాత్మజామ్. ౧౨

సా చైనం భయవిత్రస్తా భూయో నైవాభ్యుదైక్షత,

తం దృష్ట్వా వందమానం తు సీతా శశినిభాననా. ౧౩
అబ్రవీద్దీర్ఘముచ్ఛ్వస్య వానరం మధురస్వరా,

మాయాం ప్రవిష్టో మాయావీ యది త్వం రావణస్స్వయమ్.
ఉత్పాదయసి మే భూయస్సంతాపం తన్న శోభనం,

స్వం పరిత్యజ్య రూపం యః పరివ్రాజకరూపధృత్. ౧౪
జనస్థానే మయా దృష్ట స్త్వం స ఏ వాసి రావణః,
ఉపవాసకృశాం దీనాం కామరూప నిశాచర. ౧౫
సంతాపయసి మాం భూయస్సంతప్తాం తన్న శోభనం,

అథవా నైతదేవం హి యన్మయా పరిశంకితమ్. ౧౬

ఆహనుమంతుం డెంతదగ్గఱకుఁ బోవుచున్నాఁడో అంతయధికముగ నాసీత రావణుండే వానరవేషంబు వేసికొని వచ్చెనోయేమో అని హనుమంతునిపై సందేహము నొందెను. ౯

అయ్యో! నేను దహింపఁ బడుదునుగాక! ఇతనియెదుట నేనెప్పుడు చెప్పరానిమాటం జెప్పితినే. రావణుండే యిట్లు వానరరూపంబు నొంది వచ్చినాఁడు. ౧౦

దుఃఖముచేఁ గృశించియున్న సర్వాంగసుందరి యగు నాసీతాదేవి యా యశోకవృక్షముకొమ్మను విడిచి దానిక్రిందినేలపైఁ గూర్చుండినది. ౧౧

మహాబాహుఁడగు హనుమంతుఁడును దుఃఖితయయి భయంబుచేఁ దన్నుంజూచి సంశయించుచున్న యాసీతాదేవింజూచి యాబిడకు నమస్కరించెను. ౧౨

ఆసీత యిట్లు మిక్కిలి భయంబునొంది యాహనుమంతుని మరలఁ జూడకుండినది.

చంద్రునకు సరివచ్చు ముఖంబుగల యాసీతాదేవి యట్లు తనకు నమస్కారంబు చేయుచున్న హనుమంతుఁజూచి యధికముగా నిట్టూర్పులుపుచ్చి మనోహరం బగు స్వరంబున నిట్లని చెప్పెను. ౧౩

నీవు మాయావియగు రావణుఁడవే యగుదువేని యిప్పుడిట్లు మాయచే వానరరూపంబు నొందివచ్చి నన్ను మరల దుఃఖింపఁజేయుట యెంతమాత్రము మంచిదికాదు. ౧౪

తనరూపంబు విడిచి సన్న్యాసిరూపంబునొంది జనస్థానంబున నాయొద్దకు వచ్చిన ఆరావణుఁడవే నీవు. ౧౫

ఇచ్చకువచ్చిన రూపంబు దాల్పంగల రాక్షసుండగు రావణుఁడా! ఉపవాసములచేఁ గృశించినదానను, దుఃఖితురాలను, ఇదివఱకే సంతాపము నొందియున్నదాన నగునన్ను మరల సంతాపంబు నొందునట్లు చేయుచున్నావు. ఇది మంచిదికాదు. ౧౬

లేక నేనిప్పుడు సందేహించినది సరికాదేమో. ఏలయనఁగా నిన్నుఁ జూడఁగా నామనసునకు సంతోషంబు గలుగుచున్నది. ౧౭

మనసో హి మమ ప్రీతిరుత్పన్నా తవ దర్శనాత్,
యది రామస్య దూత స్త్వమాగతో భద్రమస్తు తే. ౧౮
పృచ్ఛామి త్వాం హరిశ్రేష్ఠ ప్రియా రామకథా హి మే,

గుణాన్ రామస్య కథయ ప్రియస్య మమ వానర. ౧౯

చిత్తం హరసి మే సౌమ్య నదీకులం యథా రయః,

అహో స్వప్నస్య సుఖతా యాహమేవం చిరాహృతా. ౨౦
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసం,

స్వప్నేఽపి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణమ్. ౨౧
పశ్యేయం నావసీదేయం స్వప్నోఽపి మమ మత్సరీ,

నాహం స్వప్నమిమం మన్యే స్వప్నే దృష్ట్వా హి వానరమ్. ౨౨
న శక్యోఽభ్యుదయః ప్రాప్తుం ప్రాప్తశ్చాభ్యుదయో మమ,

కిన్ను స్యాచ్చిత్తమోహోఽయం భవేద్వాతగతిస్త్వియమ్. ౨3
ఉన్మాదజో వికారో వా స్యాదియం మృగతృష్ణికా,

అథవా నాయమున్మాదో మోహోఽప్యున్మాదలక్షణః. ౨౪
సంబుధ్యే చాహమాత్మానమిమం చాపి వనౌకసం,

ఇత్యేవం బహుధా సీతా సంప్రధార్య బలాబలమ్. ౨౫
రక్షసాం కామరూపత్వాన్మేనే తం రాక్షసాధిపం,

నీవు రామునిదూతవుగానే వచ్చియుండుట యథార్థమగునేని నీకు మంగళము గలుగుంగాక ౧౮

వానరశ్రేష్ఠుండగు హనుమంతుఁడా ! నాకు రామకథలు ప్రియంబులు గావున వాని ని న్నడిగెదను.

హనుమంతుఁడా ! నాకుఁ బ్రియుండగు రామునిగుణంబులను నాకుఁ జెప్పుము. ౧౯

తిన్ననివాఁడవగు హనుమంతుఁడా ! నీళ్ల వేగము, ఏటిగట్టును హరించునట్లు నామనసును నీవు ఆకర్షించుచున్నావు.

బహుకాలముగా రాముని విడిచి దుఃఖించుచు నే నిప్పుడు స్వప్నమందు రాముఁడు పంపినవారలనైనం జూచినాను గావున స్వప్నమునందుఁ గల్గినసుఖం బిం తని చెప్పందరము గాదు. ౨౦

ఇట్లు స్వప్నమునం దైనను పరాక్రమశాలియగు రాముఁడును లక్ష్మణుఁడు నగపడుదురేని నాదుఃఖము పోయి నేను నాశము నొందకుందును. స్వప్నమునకును నాయందుఁ గోపమున్నది. ౨౧

నా కిది స్వప్నముగాఁ దోఁచలేదు ఏలయనఁగా స్వప్నమునఁ గోఁతిం జూచినచో సంతోషము నొందనేరరు. మఱియుం నాకిప్పుడు సంతోషంబు గల్గియున్నది. ౨౨

నాకిప్పుడేమైనఁ జిత్తభ్రాంతి గలిగినదాయేమి? లేక వాతప్రకోపముయి యందుచే నిట్లు తోఁచున్నదా? అట్లుకాక యున్మాదవికారముచే నేమైన నిట్లు గనుపడుచున్నదా? లేక యెండమావులంబోలె నొకటి యుండఁగా మఱి యొకటిగాఁ జూచుచున్నానా యేమి? ౨౩

అట్లుకాదేని ఇది పిచ్చిగాదు. అట్లు పిచ్చివలెనే యుండునట్టి చిత్తభ్రాంతియుండును గాదు. ఏలయనఁగా నేను నన్నును ఈవానరునిఁ జక్కఁగా నెఱుంగుచున్నాను అని సీతాదేవి చెప్పినది. ౨౪

సీతాదేవి యి ట్లనేకవిధంబుల బలాబలపర్యాలోచన పూర్వకంబుగా నిశ్చయించి మరల రాక్షసులు కామరూపు లగుటం దలంచుకొని యాహనుమంతుని రాక్షసేశ్వరుండగు రావణునిఁగానే తలంచెను. ౨౫

ఏతాం బుద్ధిం తదా కృత్వా సీతా సా తనుమధ్యమా. ౨౬
న ప్రతి వ్యాజహారాథ వానరం జనకాత్మజా,

సీతాయాశ్చింతితం బుద్ధ్వా హనుమాన్మారుతాత్మజః. ౨౭
శ్రోత్రానుకూలైర్వచనై స్తదా తాం సంప్రహర్షయత్,

ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాంతశ్శశీ యథా. ౨౮
రాజా సర్వస్య లోకస్య దేవో వైశ్రవణో యథా,
విక్రమేణోపపన్నశ్చ యథా విష్ణుర్మహాయశాః. ౨౯
సత్యవాదీ మధురవాగ్దేవో వాచస్పతిర్యథా,
రూపవాన్ సుభగశ్శ్రీమాన్ కందర్ప ఇవ మూర్తిమాన్. ౩౦

స్థానక్రోధః ప్రహర్తా చ శ్రేష్ఠో లోకే మహారథః,

బాహుచ్ఛాయామవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః. ౩౧
[దేవా ఇవ మహేన్ద్రస్య మోదన్తే విగతజ్వరాః] ]
అపకృష్యాశ్రమపదాన్మృగరూపేణ రాఘవం,
శూన్యే యేనాపనీతాసి తస్య ద్రక్ష్యసి యత్ఫలమ్. ౩౨
న చిరాద్రావణం సంఖ్యే యో వధిష్యతి వీర్యవాన్,
రోషప్రముక్తైరిషుభిర్జ్వలద్భిరివ పావకైః. ౩౩

తేనాహం ప్రేషితో దూతస్త్వత్సకాశమిహాగతః,
త్వద్వియోగేన దుఃఖార్తస్స త్వాం కౌశలమబ్రవీత్. ౩౪

అప్పుడు జనకునికూఁతురయిన సన్నని నడుము గల యాసీతాదేవి యీప్రకారము తలంచి యటుపిమ్మట హనుమంతునితో నేమియుఁ బలుకకుండినది. ౨౬

వాయుదేవునికుమారుండగు హనుమంతుఁడు సీతమనంబులో నుండు తలంపు నెఱిఁగి చెవులకు సుఖకరంబులగు మాటలు చెప్పి యామెకు సంతోషము గలుగఁజేసెను. ౨౭

రాముఁడు సూర్యునివలె నధికముగాఁ గాంతిగలవాఁడు. చంద్రుండుంబోలె లోకంబునకంతయు మనోహరుండై యుండువాఁడు. ౨౮

రాముఁడు కుబేరుఁడుంబోలె రాజాధిరాజు. మహావిష్ణుఁడుంబోలెఁ బరాక్రమశాలి. అధికమయిన కీర్తిగలవాఁడు. ౨౯

రాముఁడు బృహస్పతియుంబోలె సత్యవాది. మనోహరముగా మాటలాడువాఁడు. ఆకారమునొందిన మన్మథుండువలె సౌందర్యశాలి. మనోహరుఁడు. కాంతిమంతుఁడు. ౩౦

మఱియు రాముఁడు యుక్తవిషయంబులమాత్రమే కోపమునొందును. అతనికోపము వ్యర్థముగాదు. అతఁడు లోకంబునం దందఱికన్న నుత్తముఁడు. తన్నును దనసారథిని గుఱ్ఱములను గాపాడుకొనుచుం బదునొకండు వేలమంది విలుకాండ్రతోఁ బోరఁగలవాఁడు.

లోకమంతయు నేమహాత్మునిబాహుచ్ఛాయ నాశ్రయించి యున్నదో (ఇంద్రునిప్రాపున దేవసంఘమువలె నెవనియండను మనోరుజను బాసి సుఖించునో) అట్టిరాముని మాయచే నాశ్రమపదంబునుండి యవ్వలికిఁ బోనిచ్చి అతఁడు లేనప్పుడు నిన్నపహరించికొని తెచ్చినట్టి రావణునకు గల్గుఫలంబును జూడఁగలవు. ౩౧, ౩౨

ఎవ్వఁ డింక శీఘ్రముగానే యుద్ధంబులందు నిప్పులుంబోలెఁ బ్రజ్వరిల్లుచున్న బాణంబులచే రావణునిం జంపునో అట్టి మహాపరాక్రమశాలియగు రాముఁడు పంపఁగా దూతనై నీయొద్దకు వచ్చినాను. ౩౩

నీవు లేకుండుటంజేసి దుఃఖంబునం బరితపించుచుండు నట్టిరాముఁడు క్షేమము నడుగుచున్నాఁడు. ౩౪

లక్ష్మణశ్చ మహాతేజాస్సుమిత్రానందవర్ధనః,
అభివాద్య మహాబాహుస్స త్వాం కౌశలమబ్రవీత్. 3౫
రామస్య చ సఖా దేవి సుగ్రీవో నామ వానరః,
రాజా వానరముఖ్యానాం స త్వాం కౌశలమబ్రవీత్. 3౬
నిత్యం స్మరతి రామస్త్వాం ససుగ్రీవస్సలక్ష్మణః,
దిష్ట్యా జీవసి వైదేహి రాక్షసీవశమాగతా. 3౭
నచిరాద్ద్రక్ష్యసే రామం లక్ష్మణం చ మహాబలం,
మధ్యే వానరకోటీనాం సుగ్రీవం చామితౌజసమ్. 3౮
అహం సుగ్రీవసచివో హనుమాన్నామ వానరః,
ప్రవిష్టో నగరీం లంకాం లంఘయిత్వా మహోదధిమ్. 3౯
కృత్వా మూర్ధ్ని పదన్యాసం రావణస్య దురాత్మనః,
త్వాం ద్రష్టుముపయాతోఽహాం సమాశ్రిత్యపరాక్రమమ్. ౪౦
నాహమస్మి తథా దేవి యథా మామవగచ్ఛసి,
విశంకా త్యజ్యతామేషా శ్రద్ధస్వ వదతో మమ. ౪౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుస్త్రింశస్సర్గః.

---

## పఞ్చత్రింశస్సర్గః

తాం తు రామకథాం శ్రుత్వా వైదేహీ వానరర్షభాత్,
ఉవాచ వచనం సాంత్వమిదం మధురయా గిరా. ౧
క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్షణం,
వానరాణాం నరాణాం చ కథమాసీత్సమాగమః. ౨
యాని రామస్య లింగాని లక్ష్మణస్య చ వానర,
తాని భూయస్సమాచక్ష్వ న మాం శోకస్సమావిశేత్. 3

మహాపరాక్రమశాలియు మహాబాహుండును సుమిత్రాపుత్రుండు నగు లక్ష్మణుండు నీకు నమస్కరించి నీక్షేమసమాచారము నడుగుచున్నాఁడు. ౩౫

సీతాదేవీ! రామునిమిత్త్రుండు వానరులకందఱకుఁ బ్రభుండు నగుసుగ్రీవుఁడను వానరుండును నీక్షేమము నడుగుచున్నాఁడు. ౩౬

రాముండును లక్ష్మణుండును సుగ్రీవుఁడును ఎల్లప్పుడును నిన్నే తలంచుకొనుచున్నారు.

సీతాదేవీ! నీ విట్టి రాక్షసస్త్రీలచేతులలోఁ జిక్కియును భాగ్యవశముచే జీవించియున్నావు కాని వేఱు కాదు. ౩౭

నీవు రాముని మహాబలుం డగులక్ష్మణుని పెక్కుకోటుల వానరులచేఁ బరివేష్టింపఁబడియుండు సుగ్రీవుని శీఘ్రముగానే చూడఁగలవు. ౩౮

నేను సుగ్రీవుని మంత్రిని, హనుమంతుఁ డనువాఁడ. సముద్రంబును దాఁటి లంకాపట్టణంబును బ్రవేశించినాను. ౩౯

నేను పరాక్రమంబు నవలంబించి దురాత్ముండగు రావణునితలపైఁ బాదంబుంచి నిన్నుఁ జూచుటకై యిచ్చటికి వచ్చినాను. ౪౦

సీతాదేవీ! నీవు నావిషయమయి భ్రమించునట్లు నే నింతమాత్రము మాయావినిగాను. ఈసందేహమును విడువుము. నామాటలయందు శ్రద్ధ యుంచుము. అని హనుమంతుఁడు సీతాదేవితోఁ జెప్పెను. ౪౧

ఇది ముప్పదినాలుగవ సర్గము.

---

## ముప్పదియైదవ సర్గము

సీతాదేవి వానరశ్రేష్ఠుం డగుహనుమంతుఁడు చెప్పిన యారామునికథను విన్నంతనే మధురవాక్యంబునఁ దిన్నగా నిట్లని చెప్పెను. ౧

నీకెచ్చట రామునితో సంబంధము కల్గినది? లక్ష్మణుని నెట్లెఱుంగుదువు? వానరులకును నరులకు నెట్లు సమాగమంబు గల్గినది. ౨

హనుమంతుఁడా! రామునకును లక్ష్మణునకును గుఱుతు లేవి గలవో వానిని మరల నాకుఁ జెప్పుము. వానిని విందునేని నాకు దుఃఖము గలుగదు.

కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశం,
కథమూరూ కథం బాహూ లక్ష్మణస్య చ శంస మే. ౪

ఏవముక్తస్తు వైదేహ్యా హనుమాన్మారుతాత్మజః,
తతో రామం యథాతత్త్వమాఖ్యాతుముపచక్రమే. ౫

జానంతీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి,
భర్తుః కమలపత్రాక్షి సంస్థానం లక్ష్మణస్య చ. ౬

యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ యాని వై,
లక్షితాని విశాలాక్షి వదతశ్శృణు తాని మే. ౭

రామః కమలపత్రాక్షస్సర్వసత్త్వమనోహరః,
రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతో జనకాత్మజే. ౮

తేజసాఽఽదిత్యసంకాశః క్షమయా పృథివీసమః,
బృహస్పతిసమో బుద్ధ్యా యశసా వాసవోపమః. ౯

రక్షితా జీవలోకస్య స్వజనస్యాభిరక్షితా,
రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః. ౧౦

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా,
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః. ౧౧

అర్చిష్మా నర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః,
సాధూనాముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్. ౧౨

రామునియవయవంబు లెట్లుండును? రూపం బెట్టిది? లక్ష్మణునితొడ లెట్లుండును? నాకుఁ జెప్పుము. ౪

వాయుదేవునికుమారుఁడగు హనుమంతుఁడుఇట్లు సీతాదేవిచెప్పినమాటను విని యంత రామునిరూపురేఖలను ఉన్నదియున్నట్లు చెప్పనారంభించెను. ౫

తామరపూరేకులంబోలుకండ్లుగలసీతాదేవీ! నీవు నన్ను రామదూతనుగా నెఱింగియుండు నాభాగ్యవశంబునం జేసి రామలక్ష్మణుల యవయవసన్నివేశము నడిగినావు. నాకు రామలక్ష్మణులం గీర్తించుపుణ్యంబు గల్గినది. సంతోషము. ౬

విశాలములయినకండ్లుగలసీతాదేవీ! నీవు రామునియందును లక్ష్మణుని యం దేయేగుణములంజూచియున్నావో ఆయాగుణములంజెప్పెదను వినుము.

జనకునికూఁతురయిన సీతాదేవీ! రాముఁడు సర్వాంగసుందరుఁడు. తామరరేకులంబోలు కండ్లుగలవాఁడు. రూపదాక్షిణ్యాదిగుణంబులు గలవాఁడునై పుట్టినవాఁడు. ౮

రాముఁడు తేజంబున సూర్యునకు సరివచ్చును. ఓర్పున భూమికి సమానుఁడు. బుద్ధిచే బృహస్పతితో సరియయినవాఁడు. కీర్తియందు దేవేంద్రునకు పోటియగును. ౯

రాముఁడు ప్రాణిలోకంబునంతయుఁ గాపాడువాఁడు. విశేషించి తన బంధువుం గాపాడువాఁడు. తన క్షత్త్రియజాతికిం దగిన యాచారమును వర్ణాశ్రమధర్మంబులను రక్షించుచుండువాఁడు. శత్రువులం దరింపఁజేయువాఁడు. ౧౦

సీతాదేవీ! రాముఁడు లోకంబునందలి నాలుగు వర్ణంబులను రక్షించువాఁడు. మఱియు నతఁడు లోకంబునందలిమర్యాదల ననుష్ఠించువాఁడు. ప్రజలచే ననుష్ఠింపఁ జేయువాఁడు. ౧౧

రాముఁడు మిక్కిలి కాంతిమంతుఁడు. పెద్దలచేఁ బూజింపఁబడువాఁడు. బ్రహ్మచర్యవ్రతంబు నవలంబించి యుండువాఁడు. పెద్దల కుపకారము చేయువాఁడు. కర్మగతి నెఱింగినవాఁడు. ౧౨

రాజవిద్యావినీతశ్చ బ్రాహ్మణానాముపాసితా,
శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః. ౧౩

యజుర్వేదవినీతశ్చ వేదవిద్భిస్సుపూజితః.
ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితః. ౧౪

విపులాంసో మహాబాహుః కంబుగ్రీవశ్శుభాననః,
గూఢజత్రుస్సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః. ౧౫

దుందుభిస్వననిర్ఘోషస్స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్,
సమస్సమవిభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః. ౧౬

త్రిస్థిరస్త్రిప్రలంబశ్చ త్రిసమస్త్రిషు చోన్నతః,
త్రితామ్రస్త్రిషు చ స్నిగ్ధో గంభీరస్త్రిషు నిత్యశః. ౧౭

త్రివలీవాంస్త్ర్యవనతశ్చతుర్వ్యంగస్త్రిశీర్షవాన్,
చతుష్కలశ్చతుర్లేఖశ్చతుష్కిష్కుశ్చతుస్సమః. ౧౮

రాముఁడు రాజవిద్యల నేర్చినవాఁడు. బ్రాహ్మణుల సేవించువాఁడు. విద్యల నేర్చినవాఁడు. సదాచారము గలవాఁడు. వినీతుఁడు. శత్రువులం దపింపఁజేయువాఁడు. ౧౩

రాముఁడు యజుర్వేదంబును జక్కఁగాఁ జదివినవాఁడు. వేదవేత్తలగు వారలచేతఁ జక్కఁగాఁ బూజింపఁబడువాఁడు. ధనుర్వేదమును ఇతరవేదములును జక్కఁగాఁ దెలిసినవాఁడు. ౧౪

సీతాదేవీ! రాముఁడు విశాలమయినమూఁపులు గలవాఁడు. పెద్ద చేతులు గలవాఁడు. శంఖమువంటి మెడ గలవాఁడు. మఱియు నతని మొగము సుందరముగా నుండును. అతనిమూఁపుల సంధియెముకలు మాంసముచేత మూయఁబడి యగపడకుండును. అతఁడు సమస్తలోకంబులయందుఁ బ్రసిద్ధుఁడు. ౧౫

రామునికంఠధ్వని భేరీధ్వనియుంబోలె నుండును. అతనిదేహవర్ణము సుందరముగా నుండును. అతనిపరాక్రమము గొప్పది. అతనిదేహము అంత పొడవును అంతపొట్టియును గాక సమముగా నుండును. అతని యవయవంబు లన్నియు నెచ్చుతక్కువలు లేక యొకటితో నొకటి చేరక సుందరము లయి యుండును. అతనిదేహము నల్లగా నుండును. ౧౬

రామునిఱొమ్మును, మణికట్టును బిడికిలియును దిటవుగా నుండును. అతనికనుబొమ్మలును, వృషణములును, బాహువులును దీర్ఘములుగా నుండును. అతనితలవెండ్రుకలును, వృషణములును. మోఁకాళ్లును సమానములుగానుండును. అతనినాభియును, లోఁగడుపును, ఱొమ్మును బొడవుగా నుండును. అతని కనుఁగొనలును, నఖములును, అఱచేతులును, అఱకాళ్లును ఎఱ్ఱగా నుండును. అతని పాదరేఖలును, వెండ్రుకలును, లింగమును నునుపు గలిగియుండును. అతని కంఠధ్వనియును, నడకయును, నాభియును గంభీరములుగా నుండును. ౧౭

రాముఁడు కంఠమునందు మూఁడురేఖలుగలవాఁడు. మఱియు నతని స్తనాగ్రంబులును స్తనంబులును రేఖలును బల్లముగానుండును. అతనికంఠమును లింగమును పిఱ్ఱలును పిక్కలును హ్రస్వములుగా నుండును. అతనితలలో మూఁడుసుడ్లు గలవు. అతనియంగుష్ఠమూలంబున నాలుగురేఖ లున్నవి. అతని

చతుర్దశసమద్వంద్వశ్చతుర్దంష్ట్రశ్చతుర్గతిః,
మహోష్ఠహనునాసశ్చ పంచస్నిగ్ధోఽష్టవంశవాన్. ౧౯

దశపద్మోదశబృహత్త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్,
షడున్నతో నవతనుస్త్రిభిర్వ్యాప్నోతి రాఘవః. ౨౦

సత్యధర్మపరశ్శ్రీమాన్ సంగ్రహానుగ్రహేరతః
దేశకాలవిభాగజ్ఞస్సర్వలోకప్రియంవదః ౨౧

నుదుటను పాదతలంబులను అఱచేతులందును నాలుగురేఖలు గలవు. అతని యౌన్నత్యము తొంబదియాఱంగుళములు. అతని బాహువులు మోఁకాళ్లును తొడలును బిక్కలును సమానములుగా నుండును. ౧౮

రాముని కనుబొమ్మలు ముక్కురంధ్రములును కండ్లును చెవులును పెదవులును స్తనాగ్రంబులు మోచేతులును మణికట్టులును మోఁకాళ్లును వృషణంబులును గటిస్థలంబులును జేతులును బాదంబులును బిఱుదులును సమానంబులుగా నుండును. అతనికి దంష్ట్ర లనంబడు నాలుగు శుభలక్షణలక్షితంబులయినపండ్లు గలవు. అతఁడు సింహము పెద్దపులి యేనుఁగు వృషభంబులు ఇవి నడుచునట్లు నడుచును. ఎఱ్ఱఁగా బలిసియుండు పెదవులును బలిసి యున్నతములయిన హనువులు నున్నతంబయిన ముక్కును గలిగియుండును. అతనికి కండ్లయందును బండ్లయందును దేహచర్మమునందును బాదంబులయందును గేశంబులయందును గాంతి యుండును. అతని బాహువులును వ్రేళ్లును దొడలును బిక్కలును దీర్ఘములయి యుండును. ౧౯

రామునిముఖమును కండ్లును నోరును నాలుకయును పెదవులును దొడలును స్తనములును గోళ్లును హస్తములును బాదములును బద్మములవలె నుండును. అతనితలయును లలాటమును చెవులును గంఠమును ఱొమ్మును హృదయమును కడుపును చేతులును కాళ్లును బిఱ్ఱలును బెద్దవి. అతఁడు తేజంబునను యశంబునను సంపదను బ్రసిద్ధికెక్కినవాఁడు. అతని మాతృపితృవంశంబులు రెండును బరిశుద్ధంబులు. అతని చంకయును కడుపును ఱొమ్మును ముక్కును మూఁపును లలాటమును ఉన్నతములుగా నుండును. అతనివ్రేళ్లగణుపులును తలవెండ్రుకలును గోళ్లును చర్మమును లింగమును మీసమును దృష్టియును బుద్ధియును సూక్ష్మములు. అతఁడు పూర్వాహ్ణమధ్యాహ్నపరాహ్ణకాలంబులందు వరుసగా ధర్మార్థకామంబుల ననుష్ఠించును. ౨౦

రాముఁడు సత్యంబునందును ధర్మంబునందును మిక్కిలి యాసక్తిగలవాఁడు, శ్రీమంతుఁడు, ధనాదుల నార్జించును. దానిని యాచకుల కిచ్చును. ఏదేశంబున నేకాలంబున దేనిం జేయవలయునో దానినంతయుం దెఱుంగును. సమస్తప్రాణులకును బ్రియముగానే మాటలాడును. ౨౧

భ్రాతా చ తస్య ద్వైమాత్రస్సౌమిత్రిరపరాజితః,
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః. ౨౨
[స సువర్ణచ్ఛవిశ్శ్రీమాన్ రామశ్శ్యామో మహాయశాః]
తావుభౌ నరశార్దూలౌ త్వద్దర్శనసముత్సుకౌ,
విచిన్వంతౌ మహీం కృత్స్నామస్మాభిరభిసంగతౌ. ౨౩
త్వామేవ మార్గమాణౌ తౌ విచరంతౌ వసుంధరాం,
దదర్శతుర్మృగపతిం పూర్వజేనావరోపితమ్. ౨౪
ఋశ్యమూకస్య పృష్ఠే తు బహుపాదపసంకులే,
భ్రాతుర్భయార్తమాసీనం సుగ్రీవం ప్రియదర్శనమ్. ౨౫
వయం తు హరిరాజం తం సుగ్రీవం సత్యసంగరం,
పరిచర్యాస్మహే రాజ్యాత్పూర్వజేనావరోపితమ్. ౨౬
తతస్తౌ చీరవసనౌ ధనుః ప్రవరపాణినౌ,
ఋశ్యమూకస్య శైలస్య రమ్యం దేశముపాగతౌ. ౨౭
స తౌ దృష్ట్వా నరవ్యాఘ్రౌ ధన్వినౌ వానరర్షభః,
అవప్లుతో గిరేస్తస్య శిఖరం భయమోహితః. ౨౮
తతస్స శిఖరే తస్మిన్ వానరేంద్రో వ్యవస్థితః,
తయోస్సమీపం మామేవ ప్రేషయామాస సత్వరమ్. ౨౯
తావహం పురుషవ్యాఘ్రౌ సుగ్రీవవచనాత్ప్రభూ,
రూపలక్షణసంపన్నౌ కృతాంజలి రుపస్థితః. ౩౦

తౌ పరిజ్ఞాతతత్త్వార్థౌ మయా ప్రీతిసమన్వితౌ,
పృష్ఠమారోప్య తం దేశం ప్రాపితౌ పురుషర్షభౌ, ౩౧

నివేదితౌ చ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే,

అరామునికన్నఁ డిన్నతల్లులకుఁ బుట్టినవాఁడును బరాజయంబునొందని వాఁడు నగు లక్ష్మణుఁడును దయయందును సౌందర్యమునందు నితరగుణంబు లందును రామునకు సరివచ్చును. (లక్ష్మణుఁడు బంగారువన్నెవాఁడుగను రాముఁడు నీలవర్ణుఁడుగను నుందురు.) ౨౨

పురుషశ్రేష్ఠులగు నా రామలక్ష్మణులు నిన్నుఁ జూడఁగోరినవారలై భూమియంతయుం వెదకుచుండఁగా మాకును వారికిని సమాగమంబు గల్గినది.

ఆ రామలక్ష్మణు లట్లు నిన్నువెదకుచు భూమియంతయుం దిరిగి యన్న యగువాలిచే సింహాసనంబునుండి త్రోయఁబడి వాలివలన భయంబునఁ బెక్కు వృక్షంబులతో నొప్పుచున్న ఋశ్యమూకపర్వతమధ్యప్రదేశములో నున్నవానిఁ బ్రియదర్శనుం డగువాని వానరాధీశ్వరు సుగ్రీవుం జూచిరి. ౨౩,౨౪

మేము వాలిచే రాజ్యంబునుండి ద్రోయఁబడిన సత్యప్రతిజ్ఞుండు వానరాధీశ్వరుండు నగు సుగ్రీవునకు సేవచేయుచుందుము. ౨౫

అంత నారచీరలుగట్టుకొని శ్రేష్ఠంబులగు ధనువులు చేతం బూని యా రామలక్ష్మణులు ఋశ్యమూకపర్వతములోని యాసుందరప్రదేశమును జేరిరి. ౨౬

వానరశ్రేష్ఠుండగునాసుగ్రీవుఁడు ధనుర్ధరులగు నాపురుషశ్రేష్ఠుల రామలక్ష్మణులంజూచి భయంబున వాలి దన్నుఁ జంపుటకై వీరలం బంపెనో యని యెంచి యాపర్వతశిఖరంబుమీఁదికి దుమికెను. ౨౭

అంత వానరాధీశ్వరుఁడగు నాసుగ్రీవుఁడు ఆపర్వతశిఖరంబుననుండి శీఘ్రముగా నారామలక్ష్మణులయొద్దకు నన్నే పంపెను. ౨౮

నేను సుగ్రీవుని మాటప్రకారము పురుషశ్రేష్ఠులును రాజులును సౌందర్యముతోను శుభలక్షణములతోను ఒప్పుచున్నవారలు నగు నారామలక్ష్మణులయొద్దకుఁ బోయి చేతులు మొగుడ్చుకొని నిల్చినాను. ౨౯

నేను పురుషశ్రేష్ఠులగు నారామలక్ష్మణుల యథార్థస్థితిం దెలిసికొని వారలు సంతోషింపఁగా నిరువురిని వీఁపుపైనెంచుకొని సుగ్రీవుం డుండు చోటికిఁ దీసికొనిపోతిని. ౩౦

నే నంత నారామలక్ష్మణుల యథార్థస్థితిని మహాత్ముఁడగు సుగ్రీవునకుం దెలిపితిని. ౩౧

తయోరన్యోన్యసల్లాపాద్భృశం ప్రీతిరజాయత. ౩౨

తతస్తౌ ప్రీతిసంపన్నౌ హరీశ్వరనరేశ్వరౌ,
పరస్పరకృతాశ్వాసౌ కథయా పూర్వవృత్తయా. ౩౩

తతస్స సాన్త్వయామాస సుగ్రీవం లక్ష్మణాగ్రజః,
స్త్రీహేతోర్వాలినా భ్రాత్రా నిరస్తమురుతేజసా. ౩౪

తతస్త్వన్నాశజం శోకం రామస్యాక్లిష్టకర్మణః,
లక్ష్మణో వానరేంద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్. ౩౫
స శ్రుత్వా వానరేంద్రస్తు లక్ష్మణేనేరితం వచః,
తదాసీన్నిష్ప్రభోఽత్యర్థం గ్రహగ్రస్త ఇవాంశుమాన్. ౩౬

తతస్త్వద్గాత్రశోభీని రక్షసా హ్రియమాణయా,
యాన్యాభరణజాలాని పాతితాని మహీతలే. ౩౭
తాని సర్వాణి రామాయ ఆనీయ హరియూథపాః,
సంహృష్టా దర్శయామాసుర్గతిం తు న విదుస్తవ. ౩౮
తాని రామాయ దత్తాని మయైవోపహృతాని చ,
స్వనవన్త్యవకీర్ణాని తస్మిన్విగతచేతసి. ౩౯
తాన్యఙ్కే దర్శనీయాని కృత్వా బహువిధం తవ,
తేన దేవప్రకాశేన దేవేన పరిదేవితమ్. ౪౦
పశ్యతస్తాని రుదతస్తామ్యతశ్చ పునఃపునః,
ప్రాదీపయన్దాశరథేస్తాని శోకహుతాశనమ్. ౪౧

రాముఁడును సుగ్రీవుఁడును బరస్పరము మాటలాడుకొనఁగానే వారల కిర్వురకును మిక్కిలి స్నేహంబు గలిగినది. ౩౨

అంత వానరనాయకుఁడగు సుగ్రీవుఁడును నరనాయకుఁడగు రాముఁడును వీరలిర్వురును సంతోషంబునొంది ఒకరితోనొకరు తమ కడిపఱకు సంభవించినస్థితులం జెప్పుకొని కొంత యూఱట నొందిరి. ౩౩

అంత మహాపరాక్రమశాలి యగు నగ్రజుఁడయినవాలిచే భార్యకుఁగా నవమానింపఁబడియున్న సుగ్రీవుంజూచి లక్ష్మణున కన్నయగురాముఁడు "వాలిం జంపి నీభార్యను నీకొసంగెదను" అనునది మొదలగు మాటలచే నాశ్వాసించెను. ౩౪

అంత లక్ష్మణుఁడు నీ వగపడక పోవుటయుం దానంజేసి రామునకు దుఃఖము గలిగియుండుటయుం వానరేశ్వరుఁడగు సుగ్రీవునకుఁ జెప్పెను. ౩౫

వానరనాయకుఁడగు నాసుగ్రీవుఁడు లక్ష్మణుఁడు చెప్పినమాటను విన్నంతనే "తనకుంబోలెఁ దనస్నేహితుఁ డగు రామునకుంగూడ మహాదుఃఖము సంభవించియున్నదే" యని రాహువుచే గ్రసింపఁబడిన సూర్యుఁడుం బోలెఁ జల్లఁబోయెను. ౩౬

అంత నిన్ను రావణుఁడు గొనిపోవునప్పుడు నీవు నేలంబడవేసిన సొమ్ములను వానరశ్రేష్ఠులు సంతోషంబునం గొనితెచ్చి రామునకుఁ జూపిరి. నీ వున్నస్థానముమాత్రము వారలకుఁ దెలియదయ్యెఁ గావున దాని వారు చెప్పరైరి. ౩౭, ౩౮

ఆయాభరణంబుల రామున కిచ్చిరి. అతఁడు వానింజూచి మూర్ఛిల్లఁగా నవి నేలంబడి మ్రోఁగుచుండినవి. అంత నేనే వాని నెత్తిపెట్టినాను. ౩౯

దేవసమానుండగు నీభర్త రాముండు సుందరములయిన యాయాభరణంబులం దొడపైనుంచుకొని నానాప్రకారంబు రోదనంబుజేసెను. ౪౦

రాముఁడు మాటిమాటికి ఆయాభరణంబులఁ జూచుచు రోదనంబుల సేయుచుఁ బరితపించుచుండెను. ఆ ట్లాయాభరణంబులం జూడఁగానే రామునకు దుఃఖంబు వృద్ధిఁబొందినది. ౪౧

శయితం చ చిరం తేన దుఃఖార్తేన మహాత్మనా,
మయాపి వివిధై ర్వాక్యైః కృచ్ఛ్రాదుత్థాపితః పునః. ౪౨

తాని దృష్ట్వా మహాబాహుర్దర్శయిత్వా ముహుర్ముహుః,
రాఘవ స్సహ సౌమిత్రి స్సుగ్రీవే స న్యవేదయత్. ౪౩

స తవాదర్శనాదార్యే రాఘవః పరితప్యతే,
మహతా జ్వలతా నిత్యమగ్నినేవాగ్నిపర్వతః. ౪౪
త్వత్కృతే తమనిద్రా చ శోకశ్చింతా చ రాఘవమ్,
తాపయంతి మహాత్మానమగ్న్యగారమివాగ్నయః. ౪౫

తవాదర్శనశోకేన రాఘవః ప్రవిచాల్యతే,
మహతా భూమికంపేన మహానివ శిలోచ్చయః. ౪౬
కాననాని సురమ్యాణి నదీః ప్రస్రవణాని చ,
చరన్న రతిమాప్నోతి త్వామపశ్యన్నృపాత్మజే. ౪౭

స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః,
సమిత్రబాంధవం హత్వా రావణం జనకాత్మజే. ౪౮

సహితౌ రామసుగ్రీవావుభావకురుతాం తదా,
సమయం వాలినం హంతుం తవ చాన్వేషణం తథా. ౪౯
తతస్తాభ్యాం కుమారాభ్యాం వీరాభ్యాం స హరీశ్వరః,
కిష్కింధాం సముపాగమ్య వాలీ యుద్ధే నిపాతితః. ౫౦
తతో నిహత్య తరసా రామో వాలినమాహవే,
సర్వేషాం హరిసంఘానాం సుగ్రీవమకరోత్పతిమ్. ౫౧

అట్లు మహాత్ముండగు రాముఁడు దుఃఖితుండై బహుకాలము నేలంబడి యుండెను. అంత లక్ష్మణుండును సుగ్రీవుఁడును నేనును ఇతరులును నానావిధ వాక్యంబులం దేర్పఁగాఁ గష్టంబున మరల లేచినాఁడు. ౪౨

మహాబాహుఁడగు రాముఁడును లక్ష్మణునితోఁగూడ నాయాభరణంబులం బలుమాఱు చూచి సుగ్రీవునకుఁ జూపి యంత సుగ్రీవునిచేతి కిచ్చినాఁడు. ౪౩

పూజ్యురాలవగు సీతాదేవీ! రాముఁడు నీవగపడకుండుటంజేసి మండుచున్న మహాగ్నిహోత్రముచే నగ్నిపర్వతమునుంబోలెఁ బరితపించుచున్నాఁడు.

మహాత్ముఁడగు నారాముఁడు నీకుఁగా నిదురలేక దుఃఖంబునను చింతచేతను అగ్నిహోత్రములచే నగ్నిహోత్రగృహమునుంబోలెఁ దాపంబునొందుచున్నాఁడు. ౪౫

రాముఁడు నీవగపడని దుఃఖముచేత భూకంపముచేఁ బర్వతము చలించునట్లు చలనంబు నొందుచున్నాఁడు. ౪౬

రాచకుమార్తె వగు సీతాదేవీ! నిన్నుఁ జూడకున్నందున రామునకు సుందరములయిన యరణ్యంబులను నదులను సెలయేఱులనుం దిరిగినను సంతోషంబు గలుగకున్నది. ౪౭

జనకునికొమార్తె వగు సీతాదేవీ! పురుషశ్రేష్ఠుఁడగు నారాముఁడు ఇంక శీఘ్రంబుననే రావణుని మిత్రబాంధవులతోడఁ జంపి నిన్నుఁ బొందఁగలఁడు. ౪౮

అప్పుడు రామసుగ్రీవు లిర్వురును జేరి రాముఁడు వాలిం జంపునట్లును సుగ్రీవుండు నిన్ను వెదకునట్లును బ్రతిజ్ఞ చేసికొనిరి. ౪౯

అంతఁ బరాక్రమశాలులగు నా రామసుగ్రీవులు కిష్కింధకుఁ బోయి యుద్ధంబున వానరేశ్వరుఁడగువాలిం జంపిరి. ౫౦

అంత రాముండు బలంబు నాశ్రయించి యుద్ధంబున వాలిం జంపి సమస్తములయిన యెలుగుగొడ్డులకును వానరులకును సుగ్రీవుని ప్రభువుగాఁ జేసెను. ౫౧

రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సమజాయత,
హనుమంతం చ మాం విద్ధి తయోర్దూతమిహాగతమ్. ౫౨

స్వరాజ్యం ప్రాప్య సుగ్రీవస్సమానీయ హరీశ్వరాన్,
త్వదర్థం ప్రేషయామాస దిశో దశ మహాబలాన్. ౫౩
ఆదిష్టా వానరేంద్రేణ సుగ్రీవేణ మహౌజసా,
అద్రిరాజప్రతీకాశాస్సర్వతః ప్రస్థితా మహీమ్. ౫౪

తతస్తే మార్గమాణా వై సుగ్రీవవచనాతురాః,
చరంతి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః. ౫౫
అంగదో నామ లక్ష్మీవాన్ వాలిసూనుర్మహాబలః,
ప్రస్థితః కపిశార్దూల స్త్రిభాగబలసంవృతః. ౫౬
తేషాం నో విప్రణష్టానాం వింధ్యే పర్వతసత్తమే,
భృశం శోకపరీతానామహోరాత్రగణా గతాః. ౫౭
తే వయం కార్యనైరాశ్యాత్కాలస్యాతిక్రమేణ చ,
భయాచ్చ కపిరాజస్య ప్రాణాం స్త్యక్తుం వ్యవస్థితాః. ౫౮

విచిత్య వనదుర్గాణి గిరిప్రస్రవణాని చ,
అనాసాద్య పదం దేవ్యాః ప్రాణాం స్త్యక్తుం సముద్యతాః. ౫౯

దృష్ట్వా ప్రాయోపవిష్టాంశ్చ సర్వాన్వానరపుంగవాన్,
భృశం శోకార్ణవే మగ్నః పర్యదేవయదంగదః. ౬౦

సీతాదేవీ! ఈప్రకారముగా రామునకును సుగ్రీవునకును సమాగమంబు గల్గినది.

నేను హనుమంతుఁడను. ఆరామసుగ్రీవుల పనుపున దూతనై యిచ్చటికి వచ్చినా నని యెఱుంగుము. ౫౨

అట్లు సుగ్రీవుఁడు తనరాజ్యంబునొంది బలవంతులగు వానరనాయకుల నందఱ రప్పించి నిన్ను వెదకుటకై పదిదిక్కులకుం బంపెను. ౫౩

పెద్దకొండలంతటి వానరులు మహాపరాక్రమశాలియుం వానరనాయకుండు నగు సుగ్రీవుని యాజ్ఞను శిరసావహించి నిన్ను వెదకుటకై భూమి యంతయుఁ దిరుగుచున్నారు. ౫౪

అంత నేను మొదలుగా నావానరుల మందఱము సుగ్రీవునియాజ్ఞకు భయపడి నిన్ను వెదకుచు భూమియంతయుఁ దిరుగుచున్నాము. ౫౫

అందు మహాబలుండును శ్రీమంతుఁడును వానరశ్రేష్ఠుండు నగు వాలి పుత్రుఁ డంగదుండు సైన్యములో మూఁడవభాగముంగూడి వెడలెను. ౫౬

అట్లు మేము నిన్ను వెదకుచుఁ బర్వతోత్తమంబయిన వింధ్యపర్వతములో నొకబిలముఁ బ్రవేశించి మరల వచ్చుటకు దారి తెలియక మిక్కిలి దుఃఖపడుచుఁ బెక్కహోరాత్రములు గడపినాము. ౫౭

అట్లు పెక్కుదివసంబులు గడచుగానే మేము సుగ్రీవుఁడు నిర్ణయించిన కాలం బతిక్రమించిపోవుటం జూచి యింకఁ గార్యసాధనంబున కెంతమాత్రముపాయంబు గానక సుగ్రీవునివలన భయంబునఁ బ్రాణంబులవిడువ నిశ్చయించినాము. ౫౮

మేము ప్రవేశింప నలవిగాని యరణ్యంబులందును బర్వతముల యందును సెలయేఱులయందును వెదకి యట్లు సుగ్రీవుండు నిర్ణయించిన కాలం బతిక్రమించుటయుం "సుగ్రీవుం డైనను దనయాజ్ఞ నుల్లంఘించినందులకై కుష్ఠులం జంపును" అని యెంచి యచ్చటనే ప్రాణంబులు విడువ నిశ్చయించినాము. ౫౯

సీతాదేవీ! అంత నంగదుండు ప్రాయోపవిష్టులయిన వానరులనందఱిం జూచి దుఃఖసముద్రంబున మునిఁగి ఏ వగపడకపోవుటయుం వాలి చావుఁబడు

తవ నాశం చ వైదేహి వాలినశ్చ వధం తథా,
ప్రాయోపవేశమస్మాకం మరణం చ జటాయుషః. ౬౧
తేషాం నస్స్వామిసందేశాన్నిరాశానాం ముమూర్షతాం,
కార్యహేతోరివాయాతశ్శకునిర్వీర్యవాన్ మహాన్. ౬౨

గృధ్రరాజస్య సోదర్యస్సంపాతిర్నామ గృధ్రరాట్,
శ్రుత్వా భ్రాతృవధం కోపాదిదం వచనమబ్రవీత్. ౬౩

యవీయాన్కేన మే భ్రాతా హతః క్వ చ నిపాతితః,
ఏతదాఖ్యాతుమిచ్ఛామి భవద్భిర్వానరోత్తమాః. ౬౪

అంగదోఽకథయత్తస్య జనస్థానే మహద్వధం,
రక్షసా భీమరూపేణ త్వాముద్దిశ్య యథాతథమ్. ౬౫
జటాయుషో వధం శ్రుత్వా దుఃఖితస్సోఽరుణాత్మజః,
త్వాం శశంస వరారోహే వసంతీం రావణాలయే. ౬౬

తస్య తద్వచనం శ్రుత్వా సంపాతేః ప్రీతివర్ధనం,
అంగదప్రముఖాస్తూర్ణం తతస్సంప్రస్థితా వయమ్. ౬౭
వింధ్యాదుత్థాయ సంప్రాప్తాస్సాగరస్యాంతముత్తరం,
త్వద్దర్శనకృతోత్సాహా హృష్టాస్తుష్టాః ప్లవంగమాః. ౬౮
అంగదప్రముఖాస్సర్వే వేలోపాంతముపస్థితాః,
చింతాం జగ్ముః పునర్భీతాస్త్వద్దర్శనసముత్సుకాః. ౬౯
అథాహం హరిసైన్యస్య సాగరం ప్రేక్ష్య సీదతః,
వ్యవధూయ భయం తీవ్రం యోజనానాం శతం ప్లుతః. ౭౦
లంకా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా,

టయుం మేమందఱమును మారణవ్రతముం బూనుటయుం జటాయువు చచ్చుటయుం వీనినన్నింటిని జెప్పికొని దుఃఖించెను. ౬౦, ౬౧

సుగ్రీవుండు "నిర్ణయకాలము నతిక్రమించి వచ్చినవాఁడు చంపఁబడును" అని యాజ్ఞాపించియుండుటవలన ప్రాణంబులపట్ల నిరాశులమయి ప్రాణంబులు విడువనున్న మాకుఁ గార్యసిద్ధి నిచ్చుటకైయే వచ్చెనో యని యనం దగునట్లు పరాక్రమశాలియుఁ బాహ్యుఁడునగు పక్షిరాజొకం డచ్చటికివచ్చెను.

అతండు గృధ్రరాజగు జటాయువునకుఁ దోఁబుట్టువు. అతని పేరు సంపాతి. అతఁడు తనతమ్ముండు జటాయువు చంపఁబడుటను విని కోపంబు నొంది యిట్లని చెప్పెను. ౬౩

వానరశ్రేష్ఠులారా! నాతమ్ముండగు జటాయువును ఎవ్వఁడు చంపినాఁడు? ఎచ్చటఁ జంపినాఁడు? మీర లీసంగతి నాకుఁ జెప్పవలెను. అని సంపాతి చెప్పెను. ౬౪

అంగదుం డతనికి జనస్థానంబున నీకొఱకై భయంకరాకారుం డగు రావణుండు జటాయువుంజంపుట మొదలుగానావృత్తాంతమంతయుం జెప్పెను.

శ్రేష్ఠములయిన పిఱుదులుగల సీతాదేవీ! అరుణునికొడుకైన యా సంపాతి రావణుండు జటాయువును చంపుటను విని దుఃఖితుండై "నీవు రావణునింట నున్నావు" అని మాకుఁ జెప్పెను. ౬౬

అంత నాసంపాతిమాటను విని అంగదుండు మొదలు మేమందఱమును బరమసంతోషంబునొంది శీఘ్రముగాఁ బయనంబయితిమి. ౬౭

అంత వానరులందఱు నిన్ను సందర్శింప నుత్సుకులయి సంతోషంబున మేనులం బులకలునొడము నుత్తరపుదిక్కునందలి సముద్రపుగట్టుం జేరిరి. ౬౮

అట్లు అంగదుండు మున్నగువారలందఱు నిన్నుఁజూడ నుత్సాహంబున సముద్రపుగట్టు చేరి సముద్రంబుఁజూచి భయపడి మరలం జింతనొందిరి. ౬౯

అంత నే నట్లు సముద్రంబుఁజూచి వారలభయంబుఁ బోఁగొట్టి నూఱు యోజనంబుల దూరంబు గలసముద్రంబును దాఁటివచ్చినాను. ౭౦

రాక్షసులచేనిండియుండునీలంకను రాత్రికాలమునలోఁ బ్రవేశించి నాను.

రావణశ్చ మయా దృష్ట స్త్వం చ శోకపరిప్లుతా. ౭౧
ఏతత్తే సర్వమాఖ్యాతం యథావృత్తమనిన్దితే,
అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథేరహమ్. ౭౨

తం మాం రామకృతోద్యోగం త్వన్నిమిత్తమిహాగతం,
సుగ్రీవసచివం దేవి బుధ్యస్వ పవనాత్మజమ్. ౭౩

కుశలీ తవ కాకుత్స్థస్సర్వశస్త్రభృతాం వరః,
గురోరారాధనే యుక్తో లక్ష్మణశ్చ సులక్షణః. ౭౪

తస్య వీర్యవతో దేవి భర్తుస్తవ హితే రతః,
అహమేకస్తు సంప్రాప్తస్సుగ్రీవవచనాదిహ. ౭౫
మయేయమసహాయేన చరతా కామరూపిణా,

దక్షిణా దిగనుక్రాన్తా త్వన్మార్గవిచయైషిణా. ౭౬
దిష్ట్యాహం హరిసైన్యానాం త్వన్నాశమనుశోచతామ్,
అపనేష్యామి సన్తాపం తవాభిగమశంసనాత్. ౭౭

దిష్ట్యా హి మమ న వ్యర్థం దేవి సాగరలంఘనం,
ప్రాప్స్యామ్యహమిదం దిష్ట్యా త్వద్దర్శనకృతం యశః. ౭౮
రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వామభిపత్స్యతే,
సమిత్రబాన్ధవం హత్వా రావణం రాక్షసాధిపమ్. ౭౯
మాల్యవాన్నామ వైదేహి గిరీణాముత్తమో గిరిః,
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః. ౮౦
స చ దేవర్షిభిర్దిష్టః పితా మమ మహాకపిః,
తీరే నదీపతేః పుణ్యే శంబసాదనముద్ధరత్. ౮౧

శ్లో॥ ... ణుని జూచినాను. పరమదుఃఖితయైయున్న నిన్నుం జూచినాను.

నిందింపఁబడని సీతాదేవీ! ఈవృత్తాంతమునంతయు నడిచినది నడిచినట్లుగా నీకుఁ జెప్పినాను. నేను రాముఁడు పంపఁగా వచ్చినదూతనుగాని యన్యుఁడఁ గాను. నాతో మాటలాడుము. ౨౨

సీతాదేవీ! నేను రామునికార్యము చేయువాఁడను. అతఁడు పంపఁగా నీకై యిచ్చటికి వచ్చినాఁడను. సుగ్రీవునకు మంత్రిని. వాయుపుత్త్రుఁడను. నీవు తలంచినట్లు మాయావిని గాను. అని యెఱుంగుము. ౨౩

ఆయుధధారు లందఱిలోపలను శ్రేష్ఠుండగు నీపెనిమిటి రాముండు క్షేమముగ నున్నవాఁడు. అన్నయగు రామునకు శుశ్రూష చేయుచు శుభలక్షణంబులతోఁగూడియుండు లక్ష్మణుండును క్షేమముగ నున్నవాఁడు. ౨౪

సుగ్రీవునియాజ్ఞచే పరాక్రమశాలియగు నీపెనిమిటి రామునిహితము గోరి నే నొక్కఁడనుమాత్రమే యిచ్చటికి వచ్చినాను. ౨౫

నే నొక్కండనె నీవుండుచోటును వెదకఁగోరి యసహాయుండనై కామరూపినై తిరుగుచు నీదక్షిణపుదిక్కుఁ జేరినాను. ౨౬

నాభాగ్యవశంబున నాకు నీ వగపడకపోవుటవలన దుఃఖించుచుండు వానరులకు నీ వగపడినసంగతిం జెప్పి వారలదుఃఖంబుఁ బోఁగొట్టం గల్గినది.

నాభాగ్యవశంబున నేను సముద్రమును దాఁటి యింతదూరము వచ్చుట వ్యర్థము గాలేదు. ౨౮

నాభాగ్యవశంబున నిన్నుఁ జూచుటవలనఁ గలిగిన మహాకీర్తింబొందఁ గంటిని. ౨౯

మహాపరాక్రమశాలి యగురాముఁడు ఇంక శీఘ్రముగానే రాక్షసేశ్వరుం డగురావణుని వానిస్నేహితులను బంధువులనుం జంపి నిన్నుఁ జేకొనును.

సీతాదేవీ! పర్వతములలో శ్రేష్ఠమయినది మాల్యవంత మనుపర్వతం బొకటి గలదు. కేసరి యను వానరుండు దానివిడిచి గోకర్ణ మనుపర్వతము నకుఁ బోయెను. ౩౦

ఆకేసరియే నాతండ్రి. అతం డచ్చట దేవర్షులచే నాజ్ఞాపింపఁబడి పవిత్రంబగు సముద్రతీరంబున శంబసాదనుం డనురాక్షసుం జంపెను. ౩

తస్యాహం హరిణః క్షేత్రే జాతో వాతేన మైథిలి,
హనుమానితి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా. ౨

విశ్వాసార్థం తు వైదేహి భర్తురుక్తా మయా గుణాః,
అచిరాద్రాఘవో దేవి త్వామితో నయితాఽనఘే. ౮౩

ఏవం విశ్వాసితా సీతా హేతుభిశ్శోకకర్శితా,
ఉపపన్నైరభిజ్ఞానైర్దూతం తమవగచ్ఛతి. ౮౪
అతులం చ గతా హర్షం ప్రహర్షేణ చ జానకీ,
నేత్రాభ్యాం వక్రపక్ష్మాభ్యాం ముమోచానందజం జలమ్. ౮౫
చారు తద్వదనం తస్యాస్తామ్రశుక్లాయతేక్షణం,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్. ౮౬
హనుమంతం కపిం వ్యక్తం మన్యతే నాన్యథేతి సా,
అథోవాచ హనూమాంస్తాముత్తరం ప్రియదర్శనామ్. ౮౭

ఏతత్తే సర్వమాఖ్యాతం సమాశ్వసిహి మైథిలి,
కిం కరోమి కథం వా తే రోచతే ప్రతియామ్యహమ్. ౮౮

హతేఽసురే సంయతి శంబసాదనే
కపిప్రవీరేణ మహర్షిచోదనాత్,
తతోఽస్మి వాయుప్రభవో హి మైథిలి
ప్రభావతస్తత్ప్రతిమశ్చ వానరః. ౮౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చత్రింశస్సర్గః.

సీతాదేవీ! నేను అట్లు కేసరి గోకర్ణపర్వతమునకుఁ బోయి యుండు నప్పుడు అతని భార్యయందు వాయుదేవునిచేఁ బుట్టినాను. నేను జేసినకార్యంబునకు గుణితుగానే లోకంబున నాకు హనుమంతుఁడని పేరు గలిగినది. ౧౨

సీతాదేవీ! నీకు నమ్మకము కలుగుటకై నీపెనిమిటి యగు రాముని గుణంబులం జెప్పినాను. ౧౩

ఎంతమాత్రము పాపములేనట్టి సీతాదేవీ! రాముఁ డింక శీఘ్రంబుగనే నిన్నిచ్చటనుండి కొనిపోఁగలఁడు. అని హనుమంతుఁడు సీతతోఁ జెప్పెను.

అట్లు పరమదుఃఖిత యయి యుండు నాసీతాదేవి హనుమంతుఁడు చెప్పిన సరియయిన గుఱుతులచే నతని రామదూతనుగా నమ్మెను. ౧౪

సీతాదేవి యంత సరిలేని సంతోషంబునొంది వంకరలైన కనుఱెప్పలచే నానందబాష్పంబుల విడిచెను. ౧౫

అట్లు సంతోషంబున సుందరంబయి కొనల నెఱ్ఱనివై నడుమ తెల్లఁగా విశాలంబులయియుండునట్టి కండ్లుగల యాసీతాదేవిముఖంబు రాహువుచే విడువంబడిన చంద్రుఁడుంబోలెఁ బ్రకాశించినది. ౧౬

ఆసీతాదేవి హనుమంతుని స్పష్టముగా వానరుండనియుం మాయావి గాఁడనియుఁ దెలిసికొనినది.

అంత హనుమంతుండు చూపరులకు సంతోషంబు గల్గించునట్టి సీతం జూచి మరల నిట్లని చెప్పెను. ౧౭

సీతాదేవీ! నీ కీవృత్తాంతమంతయుఁ జెప్పినాను. ఊరడిల్లుము. నే నిప్పుడేమి సేయవలెను? నీకేమి దోఁచుచున్నది. శీఘ్రముగా నానతిమ్ము. నేను మరల రాముని యొద్దకుఁ బోవలయును. ౧౮

సీతాదేవీ! మహర్షులు ప్రేరేపించుటంజేసి నాతండ్రి యగు కేసరి యుద్ధంబున శంబసాదనుండను నసురం జంపఁబోఁగా నందువలన నేను వాయువునకుఁ బుట్టినాను. ప్రభావంబున నావాయువునకు సమానుండను. అని హనుమంతుండు సీతతోఁ జెప్పెను. ౧౯

ఇది ముప్పదియైదవ సర్గము.

## షట్త్రింశస్సర్గః

భూయఏవ మహాతేజా హనుమాన్మారుతాత్మజః,
అబ్రవీత్ప్రశ్రితం వాక్యం సీతాప్రత్యయకారణాత్. ౧
వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః,

రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్. ౨

ప్రత్యయార్థం తవాఽఽనీతం తేన దత్తం మహాత్మనా,

సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలా హ్యసి. ౩
[ఇత్యుక్త్వా ప్రదదౌ తస్యై సీతాయై వానరోత్తమః]
గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణం,
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్. ౪

చారు తద్వదనం తస్యాస్తామ్రశుక్లాయతేక్షణం,
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్. ౫

తతస్సాహ్రీమతీ బాలా భర్తృసందేశహర్షితా,
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్. ౬

విక్రాంతస్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ,
యేనేదం రాక్షసపదం త్వయైకేన ప్రధర్షితమ్. ౭

శతయోజనవిస్తీర్ణస్సాగరో మకరాలయః,
విక్రమశ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః. ౮

## ముప్పదియాఱవ సర్గము.

మహాపరాక్రమశాలియు వాయుదేవునికుమారుండు నగు హనుమం తుండు సీతకు నమ్మకంబు గల్గించుటకై మరల వినయంబుతో నిట్లని చెప్పెను.

మహాభాగురాలవగు సీతాదేవీ! నేను వానరుండను గాని రాక్షసుండను గాను. బుద్ధిమంతుండగు రాముండు పంపఁగా వచ్చినదూతను.

సీతాదేవీ! ఇదిగో రామునిపేరు వ్రాసిన యుంగరముఁ దెచ్చి, యున్నాను. చూడుము. ౨

నీకు నమ్మకము గలుగుటకై మహాత్ముండగురాముం డివ్వఁగాఁ దీసికొని వచ్చినాను.

ఇంక నూఱటఁ నొందుము. నీకు మంగళము గలుగుఁగాక! నీ దుఃఖము లన్నియుం నశించినవి [అని చెప్పి యాయుంగరమును సీత కిచ్చెను.] ౩

ఆసీతాదేవి తనపెనిమిటిహస్తభూషణమయిన యుంగరమును దీసికొని పలుమాఱులు చూచిచూచి పెనిమిటియగు రామునిం బొందినట్లు పరమసంతోషము నొందినది. ౪

అప్పుడు సంతోషమున కొనల తెల్లనై నడుమం దెల్లనై విశాలము లయిన కండ్లుగలిగి సుందరంబై యుండు నాసీతాదేవి ముఖము రాహువుచే విడువంబడిన చంద్రుండుంబోలెఁ బ్రకాశించె. ౫

అంత బాలయగు నాసీతాదేవి పెనిమిటివార్త విన్నందులకై సంతుష్ట యయి పేనం బులకలువొడమఁ గొంత లజ్జనొంది సంతోషమున హనుమంతునిం బొగడెను. ౬

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీ వొక్కండవె రాక్షసులచే నిండిన యీలంకను సరకుసేయక ప్రవేశించినావే. నీపరాక్రమమును, నీధైర్య మును, నీబుద్ధిని ఏమని కొనియాడఁగలను? నీవే పరాక్రమశాలివి. నీవే ధైర్య శాలివి. నీవే బుద్ధిశాలివి. ౭

సముద్రము నూఱుయోజనముల వైశాల్యముగలది. మొసళ్లధికముగాఁ గలది. అట్టిసముద్రమును నీవు ఆవుపాదమంతటిదానిగాఁ దలఁచి దాఁటినావే. నీపరాక్రమము గొనియాడం దగినది గదా. ౮

న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ,
యస్య తే నాస్తి సంత్రాసో రావణాన్నాపి సంభ్రమః. ౯

అర్హసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుం,
యద్యపి ప్రేషిత స్తేన రామేణ విదితాత్మనా. ౧౦
ప్రేషయిష్యతి దుర్ధర్షో రామో న హ్యపరీక్షితం,
పరాక్రమ మవిజ్ఞాయ మత్సకాశం విశేషతః. ౧౧

దిష్ట్యా చ కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః,
లక్ష్మణశ్చ మహాతేజాస్సుమిత్రానందవర్ధనః. ౧౨

కుశలీ యది కాకుత్ స్థః కిం ను సాగరమేఖలాం,
మహీం దహతి కోపేన యుగాంతాగ్నిరివోత్థితః. ౧౩

అథవా శక్తిమంతౌ తౌ సురాణామపి నిగ్రహే,
మమైవ తు న దుఃఖానామస్తి మన్యే విపర్యయః. ౧౪

కచ్చిన్న వ్యథితో రామః కచ్చిన్న పరితప్యతే,

ఉత్తరాణి చ కార్యాణి కురుతే పురుషోత్తమః. ౧౫

కచ్చిన్న దీనస్సంభ్రాంతః కార్యేషు చ న ముహ్యతి,
కచ్చి త్పురుషకార్యాణి కురుతే నృపతేస్సుతః ౧౬

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! సర్వభూతభయంకరుండగు రావణునివలన నీకు భయములేదు. కొంచెము తొట్రుపాటైనను లేదు. కావున నీవు సాధారణమయిన కోఁతియని నాకుఁ దోఁచలేదు. ౯

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! పరమాత్మవేత్తయగు రాముఁడు పంపఁగా వచ్చినావు కావున నీతో నేను మాటలాడవచ్చును. ౧౦

రాముఁడు మహాబుద్ధిశాలి. నీపరాక్రమంబు తెలిసికొనక నిన్ను నానావిధంబులం బరీక్షింపక యెచ్చటికిని పంపఁడు. అందు విశేషించి నాయొద్దకెంతమాత్రము పంపఁడు. అట్టిరాముఁడు నిన్ను నాయొద్దకుఁ బంపుటవలననే నీశక్తి యద్భుతమని తెలియవచ్చుచున్నది. ౧౧

నాభాగ్యవశంబున ధర్మాత్ముండును సత్యసంధుండు నగు రాముండును మహాపరాక్రమశాలి యగు సుమిత్రాపుత్త్రుండు లక్ష్మణుండును క్షేమంబుగ నున్నవారు. ౧౨

రాముండు క్షేమంబుగ నున్నపక్షమున ప్రియభార్యనగు నన్ను రాక్షసుండు గొనిపోవుటంజేసి కోపంబునొంది ప్రళయకాలాగ్నియుంబోలె భూమియంత దహించుచున్నాఁడా? ఎందువలన దహింపఁడు? శక్తిలేనివాఁడా యేమి? శక్తియున్నచో దహించుచునే యుండును. అదిలేదు. కావుననే యూరకున్నాఁడు. ౧౩

అటుకాదేని రాముండును లక్ష్మణుండును దేవతలనైన జయింప సమర్థులే. అయితే నాదుఃఖములకు నాశములేదు కాఁబోలు. అందువలననె వారలకు నామీఁద మనసురాకున్నది. ౧౪

రాముండు నాదుఃఖంబునఁ గృశింపకున్నాఁడుగదా? మఱియు నన్నుగూర్చియే యెల్లప్పుడును పరితపింపకున్నాఁడు గదా?

పురుషశ్రేష్ఠుండగు రాముండు అట్టు దుఃఖమునొందక నన్నుఁ బొందుటకై చేయవలసిన పనులను జేయుచుండుఁగదా! ౧౫

దశరథమహారాజపుత్త్రుండగురాముండు ఎల్లప్పుడును దీనుండై యుండఁడుగదా? అట్టు సంభ్రమంబునొంది కార్యములం జెఱుపుకొనఁడుగదా? ఊరకుండక పురుషుండు చేయవలసిన ప్రయత్నంబులం జేయుచుండునుగదా?

ద్వివిధం త్రివిధోపాయ ముపాయమపి సేవతే,
విజిగీషుస్సుహృత్కచ్చిన్మిత్రేషు చ పరంతపః. ౧౭

కచ్చిన్మిత్రాణి లభతే మిత్రైశ్చాప్యభిగమ్యతే,
కచ్చిత్కల్యాణమిత్రశ్చ మిత్రైశ్చాపి పురస్కృతః. ౧౮

కచ్చిదాశాస్తి దేవానాం ప్రసాదం పార్థివాత్మజః,
కచ్చిత్పురుషకారం చ దైవం చ ప్రతిపద్యతే. ౧౯

కచ్చిన్న విగతస్నేహః ప్రవాసాన్మయి రాఘవః,
కచ్చిన్మాం వ్యసనాదస్మాన్మోక్షయిష్యతి వానర. ౨౦
సుఖానాముచితో నిత్యమసుఖానామనోచితః,
దుఃఖముత్తరమాసాద్య కచ్చిద్రామో న సీదతి. ౨౧

కౌసల్యాయాస్తథా కచ్చిత్సుమిత్రాయాస్తథైవ చ,
అభీక్ష్ణం శ్రూయతే కచ్చిత్కుశలం భరతస్య చ. ౨౨
మన్నిమిత్తేన మానార్హః కచ్చిచ్ఛోకేన రాఘవః,
కచ్చిన్నాన్యమనా రామః కచ్చిన్మాం తారయిష్యతి. ౨౩

కచ్చిదక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః,
ధ్వజినీం మంత్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే. ౨౪

శత్రువులం దపింపఁజేయునట్టి రాముండు స్నేహితులయెడ మంచి తలంపు గలిగి వారల సామదానంబుల చేతను ఉపలాలించుచు శత్రువులయెడ దానభేదదండోపాయంబులం బ్రయోగించుచు సమయంబు కొలంది మెలంగు చుండును గదా! ౧౭

రాముఁడు క్రొత్తక్రొత్తస్నేహితులం బొందునుగదా! ఇతరులును అతండు తమకు స్నేహంబు గావలయునని గోరుదురుగదా!

రామునకు మంచిస్నేహితులు గల్గుదురు గదా! ఆస్నేహితు లతనిం దమకుఁ బ్రధానముగాఁ దలంతురుగదా!

రాచకొమరుం డగురాముఁడు దేవతానుగ్రహమును గోరుచుండును గదా!

రాముఁడు చేయుప్రయత్నమునకు దైవము అనుకూలముగా నుండును గదా! ౧౯

రామునకు ఇట్టు ఎడఁబాటు గల్గుటవలన నాయందలిస్నేహము తొలఁ గకున్నది గదా!

హనుమంతుఁడా! రాముఁడు నాదుఃఖమును బోఁగొట్టును గదా!

ఎల్లప్పుడును సుఖంబులనే యనుభవింపందగినవాఁడును అతిసుకుమారుఁడు గావున దుఃఖంబు లనుభవింపం దగనివాఁడు నగురాముఁడు ఇప్పు డిట్టి మహాదుఃఖంబు నొంది కృశింపుచున్నాఁడు గదా! ౨౧

కౌసల్య సుమిత్ర భరతుఁడు వీరలక్షేమవార్త యప్పుడప్పుడు తెలియ వచ్చుచున్నది గదా! ౨౨

పూజింపఁ దగిన రాముఁడు నన్నుగుఱించి దుఃఖించుచున్నాఁడుగదా!

రాముఁడు నాదుఃఖంబున నితరకార్యంబు లన్నియుం విడిచియుండునా యేమి? నన్నుఁ గడతేర్చునా యేమి? ౨౩

అన్నయందు మిక్కిలి భక్తిగల భరతుఁడు నాకై మంత్రులచే రక్షింపఁ బడి భయంకరంబై యుండు నొక యక్షౌహిణిసేనం బంపునాయేమి! ౨౪

వానరాధిపతిశ్శ్రీమాన్ సుగ్రీవః కచ్చిదేష్యతి,
మత్కృతే హరిభిర్వీరైర్వృతో దంతనఖాయుధైః. ౨౫

కచ్చిచ్చ లక్ష్మణశ్శూరస్సుమిత్రానందవర్ధనః,
అస్త్రవిచ్ఛరజాలేన రాక్షసాన్విధమిష్యతి. ౨౬

రౌద్రేణ కచ్చిదస్త్రేణ జ్వలతా నిహతం రణే,
ద్రక్ష్యామ్యల్పేన కాలేన రావణం ససుహృజ్జనమ్. ౨౭

కచ్చిన్న తద్ధేమసమానవర్ణం తస్యాననం పద్మసమానగంధి,
మయా వినా శుష్యతి శోకదీనం జలక్షయే పద్మమివాతపేన.

ధర్మాపదేశాత్త్యజతశ్చ రాజ్యం
మాం చాప్యరణ్యం నయతః పదాతిం,
నాసీద్వ్యథా యస్య న భీర్న శోకః
కచ్చిత్స ధైర్యం హృదయే కరోతి. ౨౯
న చాస్య మాతా న పితా చ నాన్య
స్స్నేహాద్విశిష్టోఽస్తి మయా సమో వా,

తావత్త్వహం దూత జిజీవిషేయం
యావత్ప్రవృత్తిం శృణుయాం ప్రియస్య. 3౦

ఇతీవ దేవీ వచనం మహార్థం
తం వానరేంద్రం మధురార్థముక్త్వా,

వానరాధీశ్వరుండును శ్రీమంతుండు నగుసుగ్రీవుండు పరాక్రమశాలు
రును దంతములును నఖంబులు నాయుధంబులుగాఁ గలవారలు నగువానరు
లతోఁ గూడి నాకై యిచ్చటికి వచ్చునా యేమి? ౨౫

శూరుండు నస్త్రంబులం దెలిసినవాఁడు నగుసుమిత్రాపుత్త్రుండయిన
లక్ష్మణుం డిచ్చటికి వచ్చి పెక్కుబాణంబులం బరఁగించి రాక్షసుల నందఱను
వధించునా యేమి? ౨౬

యుద్ధంబున భయంకరంబుగ జ్వలించుచున్న యస్త్రంబులచేత రావ
ణుండును అతనిబంధువర్గంబును చంపఁబడుటను నే నింక స్వల్పకాలంబునం
జూడఁగలనా యేమి? ౨౭

జలమంతయుం నెండిపోయినపిమ్మట నెండతాకుననుఁ గమలంబు శోషిల్లు
నట్లు బంగారమువలె నిర్మలంబును దామరపూవువలె సుగంధంబుగలదియు నగు
నారామునిముఖంబు నన్నువిడిచి దుఃఖంబున శోషిలకున్నదిగదా? ౨౮

ఎవ్వనికి మున్ను ధర్మసిద్ధికై రాజ్యంబు విడిచి నన్నుఁ బాసచారిణిగా
నరణ్యంబునకుం దోడ్కొనివచ్చినప్పుడు కొంచెమయినను చింతగాని భయము
గాని దుఃఖముగాని కలుగకుండెనో అట్టిరాముఁ డిప్పుడు నేను లేకుండుటచే
మనంబున ధైర్యంబు దప్పకున్నాఁడా యేమి? ౨౯

రాముని తల్లికిఁగాని తండ్రికిఁగాని యితరబంధువులకుఁగాని యెవ్వరికిని
అతనిపై నాకన్న నధికస్నేహముగాని నాతనిపైఁ గలిగియుండు స్నేహ
మంతటి స్నేహముగాని లేదు.

అట్లు కావున రాముఁడు నన్నుఁ దోడ్కొనిపోవఁ దలంచియున్నాఁడో
లేదో యనుసంగతి నాకుఁ దెలియునంతవఱకు నేను బ్రతుకఁగోరియున్నాను.
రాముఁడు నన్ను మరలం దోడ్కొనిపోవం గోరునేని సరే లేనిచోఁ బ్రాణం
బుల విడిచెదను. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౩౦

సీతాదేవి యిట్లు హనుమంతునితో నధికమయిన యర్థములుగలదియుం
మధురమునగు మాటం జెప్పి యంత నతనివలన రాముని గుఱించిన దగుటం జేసి
మనోహరమయినమాటను వినుటకై యూరకుండెను. ౩౧

శ్రోతుం పున స్తస్య వచోఽభిరామం
రామార్థయుక్తం విరరామ రామా. ౩౧
సీతాయా వచనం శ్రుత్వా మారుతిర్భీమవిక్రమః,
శిరస్యంజలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్. ౩౨

న త్వామిహస్థాం జానీతే రామః కమలలోచనే,

తేన త్వాం నానయత్యాశు శచీమివ పురందరః. ౩౩

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్. ౩౪
విష్టంభయిత్వా బాణౌఘైరక్షోభ్యం వరుణాలయం,
కరిష్యతి పురీం లంకాం కాకుత్స్థశ్శాంతరాక్షసామ్. ౩౫
తత్ర యద్యంతరా మృత్యుర్యది దేవాస్సహాసురాః,
స్థాస్యంతి పథి రామస్య స తానపి వధిష్యతి. ౩౬

తవాదర్శనజేనార్యే శోకేన స పరిప్లుతః,
న శర్మ లభతే రామస్సింహార్దిత ఇవ ద్విపః. ౩౭

మలయేన చ వింధ్యేన మేరుణా మందరేణ చ,
దర్దురేణ చ తే దేవి శపే మూలఫలేన చ. ౩౮
యథా సునయనం వల్గు బింబోష్ఠం చారుకుండలం,
ముఖం ద్రక్ష్యసి రామస్య పూర్ణచంద్రమివోదితమ్. ౩౯

భయంకరంబయిన పరాక్రమంబుగల వాయుపుత్రుఁడగు హనుమంతుఁడు సీతాదేవి చెప్పినమాటను విని శిరంబునఁ జేమోడ్పుగీలించుకొని యిట్లని బదులు చెప్పెను. 3౨

తామరపూలంబోలు కండ్లుగల సీతాదేవీ! నీ విచ్చట నున్నావని రామునం డెఱుంగఁడు.

అందుచేతనే అనుహ్లాదునొద్దనుండు శచీదేవి నెఱుంగకుండుటంజేసి యింద్రుండు తీసికొని పోవకుండునట్లు నిన్ను శీఘ్రముగాఁ దీసికొని పోవకున్నాఁడు కాని వేఱుగాదు. ఇంద్రునకు శచీదేవి యనుహ్లాదునొద్ద నున్నదని తెలిసిన పిమ్మట నాబిడంగొనిపోయినట్లు నేనుఁ బోయి చెప్పినంతనే నిన్నుఁ గొనిపోవంగలఁడు. 33

రాముఁడు నేనుబోయి నీసంగతిం జెప్పినంతనే వానరులను భల్లూకంబులను బిలుచుకొని శీఘ్రంబుగా నిచ్చటికి వచ్చును. 3౪

రాముఁడు అక్షోభ్యంబగు సముద్రంబును బాణంబుల స్తంభించి దాఁటి వచ్చి యీలంకాపట్టణంబునందలి రాక్షసుల నందఱిం జంపును. 3౫

అప్పుడు రాముని మార్గంబునకు మృత్యువుగాని దేవతలుగాని యసురులుగాని యడ్డమువచ్చినను రాముఁడు వారలంగూడఁ జంపును. ఇంక నీరాక్షసులఁ జంపునని చెప్పనేల? 3౬

పూజ్యురాలవగు సీతాదేవీ! రాముఁడు నిన్నుఁ జూడకుండుటచేత దుఃఖసముద్రంబున మునింగి సింహంబుచేఁ బీడింపఁబడుచుండు నేనుంగుంబోలె కొంతమాత్రము సుఖంబు నొందకున్నాఁడు. 3౭

సీతాదేవీ! సుందరములయిన కండ్లుగలిగి మనోహరంబై దొండపండు వంటి పెదవితోఁ గూడి సుందరములయినకుండలంబులతో నొప్పుచునుండు చందురునిం బోలుచుండు రాముని ముఖంబును నీవు నిశ్చయముగాఁ జూడఁ గలవు. అట్లు నేను నావాసస్థానములగు మలయవింధ్యమేరుమందరదర్దురం

శీఘ్రం ద్రక్ష్యసి వైదేహి రామం ప్రస్రవణే గిరౌ,
శతక్రతు మివాసీనం నాగరాజస్య [నాకపృష్ఠస్య] మూర్ధని.

న మాంసం రాఘవో భుఙ్క్తే న చాఽపి మధు సేవతే,

వన్యం సువిహితం నిత్యం భక్తమశ్నాతి పంచమమ్. ౪౧

నైవ దంశా న్న మశకా న్న కీటా న్న సరీసృపాన్,
రాఘవోఽపనయేద్గాత్రా త్త్వద్గతేనాంతరాత్మనా. ౪౨
నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోకపరాయణః,
నాన్యచ్చింతయతే కించిత్స తు కామవశం గతః. ౪౩
అనిద్రస్సతతం రామ స్సుప్తోఽపి చ నరోత్తమః,
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే. ౪౪

దృష్ట్వా ఫలం వా పుష్పం వా యద్వాఽన్యత్సుమనోహరం,
బహుశో హా ప్రియేత్యేవం శ్వసంస్త్వామభిభాషతే. ౪౫

స దేవి నిత్యం పరితప్యమాన
స్త్వామేవ సీతేత్యభిభాషమాణః,
ధృతవ్రతో రాజసుతో మహాత్మా
తవైవ లాభాయ కృతప్రయత్నః. ౪౬

సా రామసంకీర్తనవీతశోకా రామస్య శోకేన సమానశోకా.

బులు మొదలగు పర్వతంబులచేతను సాయాహారంబగు కందమూలంబులచేతను నీకు సమ్మతంబు గలుగుటకై తపము సేయుచున్నాను. ౩౮, ౩౯

సీతాదేవీ! నీ వింక శీఘ్రంబుగనే ప్రస్రవణంబను పర్వతంబుపైఁ గూర్చుండి యైరావతంబుపై నున్న [పాఠాంతరబత్తమునందు—నాకపృష్ఠంబుపై నున్న] దేవేంద్రునిఁబోలుచున్న రాముం జూడఁగలవు. ౪౦

రాముఁడు నీదుఃఖంబున మాంసమును భుజింపఁడు. మద్యమును త్రావఁడు.

రాముఁడు ప్రతిదినంబును సాయంకాలంబునం దొక్కమాఱు వానప్రస్థులకు యోగ్యములయిన వన్యంబులగుమూలఫలంబులను దినుచున్నాఁడు.

రాముఁడు మనంబున నిన్నే ధ్యానించుచు దేహంబుననుండి యడవి యీఁగలనుగాని పురుగులగాని పాములనుగాని యవ్వలికిఁ దోలికొనఁడు.

రాముఁడు నీవు లేకుండుటంజేసి మన్మథపరవశుండై యెల్లప్పుడును నిన్నే పేర్కొని దుఃఖించుచు నితరము దేనినిం గొంచెమయినం దలంపఁడు.

పురుషశ్రేష్ఠుఁడగురాముఁడు నీదుఃఖంబున నెప్పుడును నిదురింపఁడు. అట్లు కొంచెము నిదురవోయినను సీతా యని మధురంబుగా నిన్నుఁ బేర్కొనుచు మేల్కొనును. ౪౪

రాముఁడు ఫలమునుగాని పుష్పమునుగాని యట్టిమనోహరపదార్థమును మఱిదేనినిగాని చూచునేని అప్పుడే నిన్నుఁదలంచుకొని "ప్రియురాలా" అని నిన్నుఁ బేర్కొనుచు నిట్టూర్పులు విడుచును. ౪౫

సీతాదేవీ! తండ్రియాజ్ఞచే వానప్రస్థవ్రతము నవలంబించియున్నవాఁడును మహాపరాక్రమశాలియును రాచకొమరుండు నగురాముండు ఎల్లప్పుడును నిన్నే దలంచుకొని పరితపించుచు నిన్నే "సీతా" యని పేర్కొనుచు నిన్నుఁ బొందుటకే యత్నము సేయుచున్నాఁడు. అనిహనుమంతుఁడు సీతతోఁ జెప్పెను. ౪౬

జనకుని కొమార్తెయగు నాసీతాదేవి "రాముఁడు తన్ను దోడ్కొని పోవుటకై వచ్చును." అని వినుటచే దుఃఖము లేనిదయ్యె "రాముఁడు

శరన్ముఖే సాంబుదశేషచంద్రా నిశేవ వైదేహసుతా బభూవ.౪౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షట్త్రింశస్సర్గః.

## సప్తత్రింశస్సర్గః

సీతా తద్వచనం శ్రుత్వా పూర్ణచంద్రనిభాననా,
హనూమంతమువాచేదం ధర్మార్థసహితం వచః. ౧

అమృతం విషసంసృష్టం త్వయా వానర భాషితం,
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోకపరాయణః. ౨

ఐశ్వర్యే వా సువిస్తీర్ణే వ్యసనే వా సుదారుణే,
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి. 3

విధిర్నూనమసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ,
సౌమిత్రిం మాం చ రామం చ వ్యసనైః పశ్య మోహితాన్.

శోకస్యాస్య కదా పారం రాఘవోఽధిగమిష్యతి,
ప్లవమానః పరిశ్రాంతో హతనౌస్సాగరే యథా. ౫
రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణం,
లంకామున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః. ౬

విరహ మునఁ బరమదుఃఖితుండై యున్నాఁ"డని వినుటచే రామునకుం గల్గి నంతటి దుఃఖమునొంది శరదారంభంబునఁ గొంచెము మేఘముచేఁ గప్పఁబడిన చంద్రునితోఁగూడిన రాత్రివలె బ్రకాశముగల్గియు లేకయు నుండెను. ४३

ఇది ముప్పదియాఱవ సర్గము.

---

## ముప్పదియేడవ సర్గము

నిండుచంద్రునింబోలు ముఖంబుగల సీతాదేవి యా హనుమంతుండు చెప్పినమాటను విని హనుమంతుం జూచి ధర్మసహితం బగు నీమాటం జెప్పెను. ౧

హనుమంతుఁడా! నీవు "రాముఁడు ఎప్పుడును నన్నే తలంచుకొను చున్నాఁడు" అని నాకు సంతోషకరంబగు వార్తను, "ఎప్పుడును దుఃఖించు చున్నాఁడు" అని నాకు దుఃఖకరంబగు వార్తను ఇట్లు అమృతంబును విషం బునుం గలిపినట్లు ఈ రెండుమాటలం జేర్చి చెప్పినావు. కావున నాకు సంతోషంబును దుఃఖంబునుం గలుగుచున్నది. ౨

మిక్కిలియుం నధికమయినయైశ్వర్యము వచ్చినప్పుడుగాని యతిభయం కరమయిన వ్యసనంబు సంభవించినప్పుడుగాని పురుషుఁ డెంతమాత్రము స్వతంత్రుఁడు గాఁడు. దైవం బతనిఁ ద్రాటిచే బంధించినట్లు కట్టుకొని యీడ్చుకొనిపోవును. ३

వానరశ్రేష్ఠుండ వగు హనుమంతుఁడా! ప్రాణులకు దైవము నతి క్రమింప నలవిగాదు. ఇది నిశ్చయము. లక్ష్మణుఁడును నేనును రాముఁడును ముగ్గురమును మహావ్యసనంబులం బొందియున్నాము చూడుము. ४

సముద్రంబున నోడ మునుంగఁగా నీఁదుకొనుచు నలసటనొందినవాఁడు వలెఁ బరమదుఃఖితుఁడగు రామునకు ఈదుఃఖ మెప్పుడు నశించును? ౫

నా పెనిమిటియగు రాముఁడు రాక్షసుల నందఱం జంపి రావణుని వధించి యీ లంకయంతయుం నాశంబునొందించి నన్నెప్పుడు చూడఁ గలఁడు? ౬

స వాచ్యస్సంత్వరస్వేతి యావదేవ న పూర్యతే,
అయంసంవత్సరః కాలస్తావద్ధి మమ జీవితమ్. ౭

వర్తతే దశమో మాసో ద్వౌతు శేషౌ ప్లవంగమ,
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ. ౮

విభీషణేన చ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి,
అనునీతః ప్రయత్నేన న చ తత్కురుతే మతిమ్. ౯

మమ ప్రతిప్రదానం హి రావణస్య న రోచతే,

రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశంగతమ్. ౧౦

జ్యేష్ఠా కన్యాఽనలా నామ విభీషణసుతా కపే,
తయా మమేదమాఖ్యాతం మాత్రా ప్రహితయా స్వయమ్.
[అవింధ్యో నామ మేధావీ విద్వాన్ రాక్షసపుఙ్గవః,
ద్యుతిమాన్ శీలవాన్ వృద్ధో రావణస్య సుసంమతః. ౧౧
రామక్షయమనుప్రాప్తం రక్షసాం ప్రత్యచోదయత్,
న చ తస్య స దుష్టాత్మా శృణోతి వచనం హితమ్.]
అసంశయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః,
అంతరాత్మా హి మే శుద్ధస్తస్మింశ్చ బహవో గుణాః. ౧౨

ఉత్సాహః పౌరుషం సత్త్వమానృశంస్యం కృతజ్ఞతా,
విక్రమశ్చ ప్రభావశ్చ సంతి వానర రాఘవే. ౧౩

నాకు రావణుఁడు పెట్టిన యీసంవత్సరకాలము గడువు గడచుటకు మున్నే యిచ్చటికి శీఘ్రముగా రావలసినట్లు నీవు రామునకుం జెప్పుము. నేను బ్రతుకున దంతవఱకే. ఆపిమ్మట నన్ను రావణుండు చంపివేయును. ౭

హనుమంతుఁడా! క్రూరుఁడగు రావణుఁడు నాకొక్కసంవత్సరం బవధి యుంచియున్నాఁడు. అందిప్పుడు పదవమాసము ముగియవచ్చినది. ఇంక రెండుమాసములె మిగిలియున్నవి. ఈ రెండుమాసములె నే నింక బ్రతికి యుండఁగలను. ఈలోపలనే రాముం డిచ్చటికి వచ్చునట్లు సేయవలెను. ౮

రావణుని తమ్ముఁడు విభీషణుం డనువాఁడు "నన్ను రామున కొసంగుము" అని రావణునకుఁ బ్రయత్నపూర్వకంబుగా మంచి మాటలం జెప్పెను. అట్లయినను అతఁడు ఆమాట నంగీకరింపఁడయ్యె. ౯

నన్ను మరల రామున కొసంగుటకు రావణుఁ డెంతమాత్ర మొప్పుకొనఁడయ్యె.

కాలవశంగతుఁడగు రావణుని యుద్ధంబునం గొనిపోవ మృత్యువు వెదకుచున్నాఁడు కాఁబోలు. ౧౦

హనుమంతుఁడా! విభీషణుని పెద్దకూఁతురు నలయనునది యొక్కతె యున్నది. ఆబిడ తనతల్లి పంపఁగా నాయొద్దకువచ్చి యీసమాచారమంతయుం జెప్పినది. [మఱియు నవింధ్యుఁ డనురాక్షసుఁడు మిక్కిలి తెలివిగలవాఁడును పండితుఁడును యుక్తాయుక్తవివేకముగలవాఁడును ఏఁడ్లుగడచినవాఁడును గావున రామునివలన నీకు చేటు మూడినదని తెలిపి చెప్పెను గాని యా దురాత్ముఁడు కండక్రొవ్వుచే దానిని లెక్కఁగొనఁడు.] ౧౧

వానరోత్తముఁడగు హనుమంతుఁడా! నా పెనిమిటి రాముండు నన్ను శీఘ్రముగాఁ బొందఁగలఁడు. ఇం దెంతమాత్రము సందేహము లేదు. ఏల యనఁగా నామనసు నిర్మలంబుగ నున్నది. మఱియు రామునందుఁ బెక్కుగుణంబులు గలవు. ౧౨

హనుమంతుఁడా! గొప్పకార్యములు సేయఁ బ్రయత్నించుటయుం నట్టికార్యములు సేయుటయుం బలంబును దయయు నుపకారంబు మఱవకుండుటయు శౌర్యంబును కీర్తియు నీగుణంబులన్నియు రామునందున్నవి. ౧౩

చతుర్దశసహస్రాణి రాక్షసానాం జఘాన యః,
జనస్థానే వినా భ్రాత్రా శత్రుః కస్తస్య నోద్విజేత్. ౧౪

న స శక్యస్తులయితుం వ్యసనైః పురుషర్షభః,
అహం తస్య ప్రభావజ్ఞా శక్రస్యేవ పులోమజా. ౧౫

శరజాలాంశుమాన్ శూరః కపే రామదివాకరః,
శత్రురక్షోమయం తోయముపశోషం నయిష్యతి. ౧౬

ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితాం,
అశ్రుసంపూర్ణనయనా మువాచ వచనం కపిః. ౧౭

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః,
చమూం ప్రకర్షన్మహతీం హర్యృక్షగణసంకులామ్. ౧౮
అథవా మోచయిష్యామి త్వామద్యైవ వరాననే,
అస్మాద్దుఃఖాదుపారోహ మమ పృష్ఠమనిన్దితే. ౧౯

త్వాం హి పృష్ఠగతాం కృత్వా సంతరిష్యామి సాగరం,
శక్తిరస్తి హి మే వోఢుం లంకామపి సరావణామ్. ౨౦

అహం ప్రస్రవణస్థాయ రాఘవాయాద్య మైథిలి,
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుతమివానలః. ౨౧

ద్రక్ష్యస్యద్యైవ వైదేహి రాఘవం సహ లక్ష్మణం,
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధే యథా. ౨౨

జనస్థానంబున లక్ష్మణుండును లేకుండునప్పుడు అసహాయుండైన తా నొక్కఁడె పదునాలుగువేలరక్కసులం జంపినట్టి రామునకు శత్రువైనవాఁ డెవ్వఁడు బ్రతుకంజాలును? ౧౪

పురుషశ్రేష్ఠుఁడగు నారాముండు ఎన్నికష్టంబులు వచ్చినను ఎంత మాత్రము చలింపఁడు. దేవేంద్రుని ప్రభావము శచీదేవికిఁ దెలిసినట్లు రాముని ప్రభావము నాకుఁ దెలియును. ౧౫

హనుమంతుఁడా! సూర్యుఁడు కిరణంబుల జలమును శోషిల్లఁజేయు నట్లు రాముండు బాణంబులచే శత్రువులయిన రాక్షసులం జంపఁగలఁడు. అని సీత హనుమంతునితోఁ జెప్పెను. ౧౬

హనుమంతుఁ డీప్రకారము చెప్పుచున్నదియు రాముని నిమిత్తమయి దుఃఖంబునం గృశించియున్నదియు కండ్లనిండఁ గన్నీళ్లు గార్చుచున్నదియు నగు నాసీతంజూచి యిట్లని చెప్పెను. ౧౭

రాముఁడు నేనుబోయి నీసంగతిం జెప్పినంతనే పెక్కువానరులను భల్లూకంబులనుం గూడి యిచ్చటికి శీఘ్రముగా రాఁగలఁడు. ౧౮

సుందరమయిన ముఖముగలదానవు నిందింపఁబడనిదానవు నగు సీతా దేవీ! అటుకాదేని నీదుఃఖంబు నిప్పుడె పోఁగొట్టెదను. నీవు నావీఁపుపై నెక్కుము. నిన్నిప్పుడె రామునొద్దకుఁ దీసికొనిపోయెదను. ౧౯

నేను నిన్నిప్పుడు వీఁపుపై నుంచుకొని సముద్రమును దాఁటెదను.

నాకు నిన్ను మోసికొనిపోవుటకు శక్తియున్నదో లేదో యని శంకింప వలదు. రావణునితోఁగూడ నీలంకనైనను మోసికొనిపోవంజాలుదును. ౨౦

సీతాదేవీ! వ్రేల్వంబడిన హవిస్సు నగ్నిహోత్రుండు దేవేంద్రున కొసంగినట్లు నే నిప్పుడు నిన్నుఁ దీసికొనిపోయి ప్రస్రవణపర్వతంబునందున్న రామున కొసంగెదను. ౨౧

సీతాదేవీ! లక్ష్మణునింగూడి రాక్షసవధంబునఁ బ్రయత్నంబు సేయు చున్నట్లు దైత్యవధంబునం బ్రయత్నించు విష్ణుదేవుండుంబోలె నున్న రాముని నిప్పుడె చూడఁగలవు. ౨౨

త్వద్దర్శనకృతోత్సాహమాశ్రమస్థం మహాబలం,
పురందరమివాసీనం నాగరాజస్య మూర్ధని. ౨౩

పృష్ఠమారోహ మే దేవి మా వికాంక్షస్వ శోభనే,
యోగమన్విచ్ఛ రామేణ శశాంకేనేవ రోహిణీ. ౨౪
కథయంతీవ చంద్రేణ సూర్యేణ చ మహార్చిషా,
మత్పృష్ఠమధిరుహ్య త్వం తరాకాశమహార్ణవౌ. ౨౫
నహి మే సంప్రయాతస్య త్వామితో నయతోఽంగనే,
అనుగంతుం గతిం శక్తాస్సర్వే లంకానివాసినః. ౨౬

యథైవాహమిహ ప్రాప్తస్తథైవాహమసంశయః,
యాస్యామి పశ్య వైదేహి త్వాముద్యమ్య విహాయసమ్. ౨౭

మైథిలీ తు హరిశ్రేష్ఠాచ్ఛ్రుత్వా వచనమద్భుతం,
హర్షవిస్మితసర్వాంగీ హనుమంతమథాబ్రవీత్. ౨౮

హనుమన్ దూరమధ్వానం కథం మాం వోఢుమిచ్ఛసి,
తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప. ౨౯

కథం వాల్పశరీరస్త్వం మామితో నేతుమిచ్ఛసి,
సకాశం మానవేంద్రస్య భర్తుర్మే ప్లవగర్షభ. ౩౦

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్మారుతాత్మజః,
చింతయామాస లక్ష్మీవాన్నవం పరిభవం కృతమ్. ౩౧

నిన్నుఁజూడఁ గోరుచున్నవాఁడును మహాబలుండును ఆశ్రమంబున నున్నవాఁడును ఐరావతంబుపైఁ గూర్చుండియున్న యింద్రుండుంబోలెఁ దేజరిల్లుచున్నవాఁడు నగురాము నిప్పుడె చూడఁగలవు. ౨౩

మంగళకరివగు సీతాదేవీ! నావీఁపుపైఁ గూర్చుండుము. ఉపేక్ష చేయవలదు. రోహిణీదేవి చంద్రునిం గూడునట్లు రామునిం గూడుము. ౨౪

నీవు నావీఁపుపై నెక్కి చంద్రునితోను సూర్యునితోను మాటలాడుచున్నట్లు ఆకాశమార్గంబు నవలంబించి సముద్రంబు దాఁటుము. ౨౫

సీతాదేవీ! నీవు స్త్రీవి కావున నేను నిన్నుఁదీసికొని బయలుదేఱఁగానే యొకవేళ రాక్షసులు నన్నుఁ బట్టుకొందురని తలంచెదవు కాఁబోలు. ఈలంకలో నున్నవాఁ డెవ్వఁడును నాతోసరిగా నాకాశంబునం దిరుగఁజాలఁడు. ౨౬

సీతాదేవీ! నేనిచ్చటి కెట్లు సులభముగా సముద్రమును దాఁటివచ్చినానో అట్లు ఏమియుఁ గష్టములేనట్లు నిన్నెత్తుకొని యాకాశమార్గంబున సముద్రంబు దాఁటెదను. సందేహము లేదు చూడుము. అని హనుమంతుఁడు సీతతోఁ జెప్పెను. ౨౭

సీతాదేవి వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు చెప్పిన యాశ్చర్యకరంబగు మాటను విని మహాసంతోషంబు నొంది దేహంబంతయుఁ గగుర్పాటు నొంద హనుమంతుంజూచి యిట్లని చెప్పెను. ౨౮

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడా! నీవు నన్ను బహుదూరము మోయుటకుఁ గోరుచున్నావే? ఇదియేమి? కావుననే నీవు కోఁతివైతివని తలంచెదను. ౨౯

వానరశ్రేష్ఠుఁడవగు హనుమంతుఁడా! నీవు చిన్నదేహము గలవాఁడవు. ఇచ్చటనుండి నా పెనిమిటి రాముఁడున్నస్థలమునకు బహుదూర మున్నది. నీ వచ్చటికి నన్నుఁ దీసికొనిపోఁగోరుచున్నావే! వింతగానున్నది. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౩౦

కాంతిమంతుఁడును వాయుపుత్త్రుఁడు నగుహనుమంతుఁడు సీతాదేవి తన్నుఁ బరిహసించినది విని తన కిప్పుడు గలిగిన క్రొత్తయవమానమును గుఱించి యిట్లని చింతించెను. ౩౧

న మే జానాతి సత్త్వం వా ప్రభావం వాఽసితేక్షణా,
తస్మాత్పశ్యతు వైదేహీ యద్రూపం మమ కామతః. 3౨

ఇతి సంచిన్త్య హనుమాంస్తదా ప్లవగసత్తమః,
దర్శయామాస వైదేహ్యాస్స్వరూపమరిమర్దనః. 33

స తస్మాత్పాదపాద్ధీమానాప్లుత్య ప్లవగర్షభః,
తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయకారణాత్. 3౪

మేరుమందరసంకాశో బభౌ దీప్తానలప్రభః,
అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః. 3౫

హరిః పర్వతసంకాశస్తామ్రవక్త్రో మహాబలః,
వజ్రదంష్ట్రనఖో భీమో వైదేహీమిదమబ్రవీత్. 3౬

సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణాం,
లంకామిమాం సనాథాం వా నయితుం శక్తిరస్తి మే. 3౭

తదవస్థాప్యతాం బుద్ధిరలం దేవి వికాంక్షయా,
విశోకం కురు వైదేహి రాఘవం సహలక్ష్మణమ్. 3౮

తం దృష్ట్వా భీమసంకాశమువాచ జనకాత్మజా,
పద్మపత్త్రవిశాలాక్షీ మారుతస్యౌరసం సుతమ్. 3౯

నల్లనికండ్లుగల సీతాదేవి నాబలమునుగాని నాప్రభావమును గాని కొంతమాత్ర మెఱుంగదు. కావుననే యిట్లు చెప్పినది.

అందువలన సీతాదేవి నా నిజమయిన రూపమును యథేచ్ఛముగాఁ జూచుఁగాక. అని హనుమంతుండు చింతించెను. ౩౨

అప్పుడు శత్రువుల మర్దింపఁజాలినవాఁడును వానరశ్రేష్ఠుఁడు నగు హనుమంతుం డిట్లు చింతించి తననిజమయిన రూపాకారమును సీతాదేవికిం జూపెను. ౩౩

బుద్ధిమంతుండును వానరశ్రేష్ఠుండు నగు హనుమంతుండు అంత నా చెట్టుమీఁదనుండి కొంత యవ్వలి కరిగి సీతకు నమ్మకంబు గల్గుటకై తనదేహంబును పెంచుకొన నారంభించెను. ౩౪

వానరశ్రేష్ఠుండగు హనుమంతుండు మేరుమందరపర్వతంబులుంబోలె నొప్పుచు మండుచున్న యగ్నిహోత్రమువలెఁ బ్రకాశించుచు సీతాదేవి యెదుట నిలిచెను. ౩౫

అంతఁ బర్వతాకారుండు నెఱ్ఱనిముఖము గలవాఁడును మహాబలుండును వజ్రములవలెఁ గఠినములయిన కోఱలును నఖములును గలవాఁడును జూపరులకు భయంబుఁ బుట్టించువాఁడు నగుహనుమంతుండు సీతంజూచి యిట్లని చెప్పెను. ౩౬

కొండలతోను వనంబులతోను గోటబురుజులతోను బ్రాకారములతోను పురద్వారములతోను గూడిన యీ లంకాపట్టణమునైనను రావణునితోఁగూడఁ బెల్లగించి తీసికొనిపోఁగలను. ౩౭

సీతాదేవీ! అట్లుండుటవలన భయముంచుకొనవలదు. బుద్ధిని స్థిరముగాఁ జేసికొనుము. అశ్రద్ధసేయకుము. రాముని లక్ష్మణుని దుఃఖములేనివారలుగాఁ జేయుము. అని హనుమంతుఁడు సీతాదేవితోఁ జెప్పెను. ౩౮

తామరపూఱేకులంబోలె విశాలంబులయిన కండ్లుగల సీతాదేవి చూపరులకు వెఱపుఁబుట్టించుచున్న వాయుదేవుని యుత్తమపుత్రుని హనుమంతుం జూచి యిట్లని చెప్పెను. ౩౯

తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే,
వాయోరివ గతిం చైవ తేజశ్చాగ్నేరివాద్భుతమ్. ౪౦

ప్రాకృతోఽన్యః కథం చేమాం భూమిమాగన్తుమర్హతి,
ఉదధేరప్రమేయస్య పారం వానరపుంగవ. ౪౧
జానామి గమనే శక్తిం నయనే చాపి తే మమ,
అవశ్యం సంప్రధార్యాశు కార్యసిద్ధిర్మహాత్మనః. ౪౨

అయుక్తంతు కపిశ్రేష్ఠ మమ గన్తుం త్వయాఽనఘ,
వాయువేగసవేగస్య వేగో మాం మోహయేత్తవ. ౪౩

అహమాకాశమాపన్నా హ్యుపర్యుపరి సాగరం,
ప్రపతేయం హి తే పృష్ఠాద్భయాద్వేగేన గచ్ఛతః. ౪౪

పతితా సాగరే చాహం తిమినక్రఝషాకులే,
భవేయమాశు వివశా యాదసామన్నముత్తమమ్. ౪౫

న చ శక్ష్యే త్వయాసార్థం గన్తుం శత్రువినాశన,
కళత్రవతి సందేహస్త్వయ్యపి స్యాదసంశయః. ౪౬

హ్రియమాణాం తు మాం దృష్ట్వా రాక్షసా భీమవిక్రమాః,
అనుగచ్ఛేయు రాదిష్టా రావణేన దురాత్మనా. ౪౭

హనుమంతుఁడా! నీధైర్యమును నీబలమును నేను జక్కఁగా నెఱుంగుదును. నీవు వాయుదేవుండుంబోలె శీఘ్రగమనము గలవాఁడవనియు నగ్నిహోత్రుఁడుంబోలెఁ దేజంబు గలవాఁడవనియు నాకుఁ జక్కఁగాఁ దెలియును. ౪౦

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! అట్లుగాక నీవు సాధారణుండవగుదువేని కొలందిలేని సముద్రంబు దాఁటి యిచ్చటి కెట్లు రాఁగలవు? ౪౧

నీవు రాక్షసులకుం జిక్కక పోఁగలవనియు నన్నుఁ దీసికొనిపోఁగలవనియు నాకుఁ దెలియును. అయితే మహాత్ముండగు రాముని కార్యము చెడకుండున ట్లాలోచింపవలయును. ౪౨

పాపరహితుండవు వానరశ్రేష్ఠుండవు నగుహనుమంతుఁడా! నేను నీతోఁ గూడవచ్చుట యెంతమాత్రము సరికాదు. ఏలయనఁగా నీవు వాయువేగం బంతటి వేగముగలవాఁడవు. నీవేగంబున నేను భయంబునొందుదును.

నీవు నన్ను వీఁపున నుంచుకొని యతివేగంబునం బోవుచుండఁగా సముద్రంబునకుఁ గొంచెము మీఁదుగాఁ బోవునప్పుడు నేను సముద్రంబును జూచి భయంబున నీవీఁపుపైనుండి సముద్రంబులోఁ బడుదును. ౪౪

అట్లు నేను నూఱుయోజనంబులపొడవుగల చేఁపలతోను మొసళ్లతోను సాధారణంబులగు చేఁపలతోను నిండియుండునట్టి సముద్రంబునం బడినంతనే పరవశురాల నగు నన్నుఁ దక్షణమే సముద్రమందలి జలజంతువులు భక్షించును. ౪౫

హనుమంతుఁడా! నీవు శత్రువుల నాశము నొందించువాఁడవే అయినను నేను నీతోఁగూడ రాఁజాలను. ఏలయనఁగా: ఎంత సమర్థునకును మఱియొకరు రక్షింపవలసినవా రుండునప్పుడు ఆపద సంభవించును. కావున నీవు నన్ను రక్షింపవలసియున్నది. కావున నప్పుడు నీప్రాణమునకును సంకటము సంభవించును. ఇందు సందేహము లేదు. ౪౬

నీవు నన్నుఁ దీసికొనిపోవుటం జూచినంతనె దుష్టాత్ముఁడగు రావణునాజ్ఞచే భయంకరంబగు పరాక్రమముగల రాక్షసు లనేకులు నిన్ను వెంబడింతురు. ౪౭

తైస్త్వం పరివృతశ్శూరై శ్శూలముద్గరపాణిభిః,
భవేస్త్వం సంశయం ప్రాప్తో మయా వీర కళత్రవాన్. ౪౮

సాయుధా బహవో వ్యోమ్ని రాక్షసాస్త్వం నిరాయుధః,
కథం శక్ష్యసి సంయాతుం మాం చైవ పరిరక్షితుమ్. ౪౯

యుధ్యమానస్య రక్షోభి స్తవ తైః క్రూరకర్మభిః,
ప్రపతేయం హి తే పృష్ఠాద్భయార్తా కపిసత్తమ. ౫౦

అథ రక్షాంసి భీమాని మహాంతి బలవంతి చ,
కథంచిత్సాంపరాయే త్వాం జయేయుః కపిసత్తమ. ౫౧

అథవా యుధ్యమానస్య పతేయం విముఖస్య తే,
పతితాం చ గృహీత్వా మాం నయేయుః పాపరాక్షసాః. ౫౨

మాం వా హరేయు స్త్వద్ధస్తాద్విశసేయురథాపి వా,
అవ్యవస్థౌ హి దృశ్యేతే యుద్ధే జయపరాజయౌ. ౫౩

అహం వాపి విపద్యేయం రక్షోభిరభితర్జితా,

త్వత్ప్రియత్నో హరిశ్రేష్ఠ భవేన్నిష్ఫల ఏవ తు. ౫౪

కామం త్వమసి పర్యాప్తో నిహంతుం సర్వరాక్షసాన్,
రాఘవస్య యశో హీయేత్త్వయా శస్తైస్తు రాక్షసైః. ౫౫

పరాక్రమశాలివగు హనుమంతుఁడా! అంత క్రూరులగునారాక్షసులు శూలంబులు నినుపగుదియలును దాల్చి నిన్నుం బరివేష్టింతురు. అంత నీవు రక్షింపవలసినదానను నేనున్నానుగావునఁ బ్రాణసందేహంబు గలుగును. ౪౮

ఆరాక్షసులు నిన్నాకాశంబునం జుట్టుముట్టుదురు. వారలాయుధంబులు గలవారలు. అనేకులు. నీవొక్కండవు ఆయుధంబు లేనివాఁడవు. యుద్ధము సేయుటకుఁగాని నన్ను రక్షించుటకుఁగాని నీ వెట్లు శక్తుఁడవగుదువు!

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీవు క్రూరులగు నారాక్షసులతో యుద్ధము సేయుచుండఁగా నేను భయంబు నొంది నీవీఁపుననుండి క్రిందం బడుదును. ౫౦

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! మఱియు భయంకరులును మహాకాయులును బలవంతులు నగురాక్షసులు యుద్ధంబున నొకవేళ నిన్నెట్లయిన జయించినను జయింతురు. ౫౧

అటుకాదేని యొక్కవేళ నీవు యుద్ధంబుసేయుచుఁ బరవశుండవై యుండఁగా నేను నేలంబడినను బడుదును. అంత నేను నేలంబడినంత నాపాపిష్ఠులగు రాక్షసులు నన్నుఁ దీసికొనిపోదురు. ౫౨

యుద్ధమునందు జయాపజయములకు నిశ్చయములేదు. కావున నీకు జయమే గలుగునని యేమినిశ్చయము? నీకుఁ బరాజయము గల్గినను గల్గును. అప్పుడు రాక్షసులు నీహస్తంబున నుండి నన్ను లాగుకొని నఱికివేసినను నఱికివేయుదురు. ౫౩

నేను రాక్షసులచేతికిఁ జిక్కి బాధింపఁబడి ప్రాణభయంబు నొందుదును.

వానరశ్రేష్ఠుండవగుహనుమంతుఁడా! అట్లగునేని నీ వింతదూరము శ్రమపడి వచ్చి చేసినప్రయత్నమంతయుఁ నిష్ఫలమగును. ౫౪

నీవొక్కండవె సమస్తరాక్షసులం జంపఁగలవు. ఇది వాస్తవమే. అయితే నీవు రాక్షసులనందఱిం జంపుదువేని రామునికీర్తి నశించును. ౫౫

అథవాఽఽదాయ రక్షాంసి న్యసేయుస్సంవృతే హి మాం,
యత్ర తే నాభిజానీయుర్హరయో నాపి రాఘవౌ. ౫౬

ఆరంభ స్తు మదర్థోఽయం తత స్తవ నిరర్థకః,
త్వయా హి సహ రామస్య మహానాగమనే గుణః. ౫౭

మయి జీవితమాయత్తం రాఘవస్య మహాత్మనః,
భ్రాతౄణాం చ మహాబాహో తవ రాజకులస్య చ. ౫౮

తౌ నిరాశౌ మదర్థం తు శోకసంతాపకర్శితౌ,
సహ సర్వర్క్షహరిభి స్త్యక్ష్యతః ప్రాణసంగ్రహమ్. ౫౯

భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర,
న స్పృశామి శరీరం తు పుంసో వానరపుంగవ. ౬౦
యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్గతా,
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ. ౬౧

యది రామో దశగ్రీవమిహ హత్వా సబాంధవం,
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్ ౬౨
శ్రుతా హి దృష్టాశ్చ మయా పరాక్రమా
మహాత్మన స్తస్య రణావమర్దినః,
న దేవగన్ధర్వభుజంగరాక్షసా
భవంతి రామేణ సమా హి సంయుగే. ౬౩

అటుకాదేని రాక్షసులు నన్నుఁ దీసికొనిపోయి యేవానరులుగాని రామలక్ష్మణులుగాని యెంతమాత్రము తెలియంగఁజాలనట్టి రహస్యప్రదేశము నందు దాఁచినను దాఁచుదురు. ౫౬

అంత నీవు నాకొఱకై చేసిన ప్రయత్న మంతయు వ్యర్థమగును.

నీవుపోయి రామునకు నాసంగతిం జెప్పి రాము నిచ్చటికిం బిలుచుకొని వచ్చితివేని మిక్కిలి గుణము గలదు. ౫౭

మహాబాహుండవగు హనుమంతుఁడా! మహాత్ముఁడగు రాముఁడు నతని తమ్ములును నీవును సుగ్రీవుని బంధువులును మీరందఱును ఇప్పుడు నన్నాశ్రయించి ప్రాణంబులుంచుకొనియున్నారు. నాకిప్పు డపాయంబు సంభవించు నేని మీరందఱుఁ బ్రాణంబుల విడుతురు. ౫౮

అట్లు నాకేదైన నపాయంబు గల్గునేని నన్ను గూర్చియే యిప్పుడు మహాదుఃఖంబును సంతాపంబును బొంది కృశించియుండు నారామలక్ష్మణులు "ఇంక నన్ను బొందఁగల" మను నాశను విడిచి వానరభల్లూకంబుల యందఱితోఁ గూడఁ బ్రాణంబులు విడువంగలరు. ౫౯

వానరశ్రేష్ఠుండ వగు హనుమంతుఁడా! నేను పెనిమిటియందు భక్తి నవలంబించి రాముండుదక్క నితరపురుషుని దేహమును దాఁకుటలేదు. ౬౦

అయితే "నిన్ను రావణుండు బలాత్కారంబునం దాఁకలేదా?" అని యందువేమో! అవును నాకప్పు డేమి చేయుటకును శక్తిలేదుగదా! నాపెనిమిటియు దగ్గఱ లేకుండెను. నేనును దుఃఖంబునం బరవశురాలనై యుంటిని ఏమిచేయవచ్చును? ౬౧

రాముం డిచ్చటికి వచ్చి రావణుని బంధువులతోఁగూడ వధించి నన్నిచ్చటినుండి తీసికొనిపోవునేని యట్లు చేయుట యతనికి సరిగానుండును. ౬౨

మహాపరాక్రమశాలియు యుద్ధంబున నెదురులేక శత్రువులను మర్దించువాఁడు నగురామునిపరాక్రమంబు లనేకంబుల నేను వినియున్నాను. చూచియు నున్నాను. దేవతలుంగాని గంధర్వులుగాని నాగంబులుగాని రాక్షసులుగాని యెవ్వరును యుద్ధంబున రామునకు సరికారు. ౬౩

సమీక్ష్య తం సంయతి చిత్రకార్ముకం
మహాబలం వాసవతుల్యవిక్రమం,
సలక్ష్మణం కో విషహేత రాఘవం
హుతాశనం దీప్తమివానిలేరితమ్. ౬౪

సలక్ష్మణం రాఘవమాజిమర్దనం
దిశాగజం మత్తమివ వ్యవస్థితం,
సహేత కో వానరముఖ్య సంయుగే
యుగాంతసూర్యప్రతిమం శరార్చిషమ్. ౬౫

స మే హరిశ్రేష్ఠ సలక్ష్మణం పతిం
సయూథపం క్షిప్రమిహోపపాదయ,
చిరాయ రామం ప్రతి శోకకర్శితాం
కురుష్వ మాం వానరముఖ్యహర్షితామ్. ౬౬

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తత్రింశస్సర్గః.

---

## అష్టత్రింశస్సర్గః

తతస్స కపిశార్దూలస్తేన వాక్యేన హర్షితః,
సీతామువాచ తచ్ఛ్రుత్వా వాక్యం వాక్యవిశారదః. ౧

యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే,
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్య చ. ౨

స్త్రీత్వం న తు సమర్థం హి సాగరం వ్యతివర్తితుం,
మామధిష్ఠాయ విస్తీర్ణం శతయోజనమాయతమ్. 3

మహాబలుండును దేవేంద్రుని పరాక్రమమువంటి పరాక్రమము గల వాఁడు నగు రాముఁడు యుద్ధంబునఁ జిత్రగతుల మెఱయుచు ధనువు ధరించి లక్ష్మణునిం గూడి వాయువుతోఁ గూడిన దీప్తాగ్నిచందంబునం దేజరిల్లుచుండ నతని నెవ్వరు దేఱి చూడఁగలరు? ౨౮

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! యుద్ధంబున నెదురులేక శత్రువులం జంపువాఁడును మదించిన దిగ్గజముం బోలె నున్నవాఁడును బ్రళయకాలమునందలి సూర్యునకు సరివచ్చుచు నాసూర్యకిరణములవంటి బాణములం బ్రయోగించువాఁడును లక్ష్మణునితోఁ గూడినవాఁడు నగు రాముని యుద్ధమున నెవ్వ రెదిరింపఁగలరు? ౨౯

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీవు నా పెనిమిటియగు రాముని లక్ష్మణుని వానరసేనానాయకులను అందఱను ఇచ్చటికి శీఘ్రముగాఁ దోడ్కొనిరమ్ము. రామవిరహమున బహుకాలముగా దుఃఖించుచుఁ గృశించి యున్న నాకు సంతోషము గల్గునట్లు సేయుము. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౩౦

ఇది ముప్పదియేడవసర్గము.

---

## ముప్పదియెనిమిదవ సర్గము

అంత మాటలు చెప్పుటయందుఁ బండితుండును వానరశ్రేష్ఠుండు నగు నాహనుమంతుండు సీత చెప్పిన మాటను విని సీత యట్టి ధార్మికంబైనమాటను జెప్పుటవలనఁ బరమసంతోషమునొంది సీతంజూచి యిట్లని చెప్పెను. ౧

సీతాదేవీ! నిన్నుఁ జూచువారలకు మంగళము లొదవును. నీవు చెప్పినది నీస్వభావమునకును నీపాతివ్రత్యమునకును సరిగా మిక్కిలి యుక్తముగా నున్నది. ౨

నావీపుపై నెక్కి యతివిస్తీర్ణంబయిన నూఱుయోజనముల సముద్రమును దాఁటుటకు స్త్రీ కెంతమాత్ర మలవిగాదు. ఇది వాస్తవమే. ౩

ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే,
రామాదన్యస్య నార్హామి సంస్పర్శమితి జానకి. ౪

ఏతత్తే దేవి సదృశం పత్న్యాస్తస్య మహాత్మనః,
కా హ్యన్యా త్వామృతే దేవి బ్రూయాద్వచనమీదృశమ్. ౫
శ్రోష్యతే చైవ కాకుత్స్థస్సర్వం నిరవశేషతః,
చేష్టితం యత్త్వయా దేవి భాషితం మమ చాగ్రతః. ౬

కారణైర్బహుభిర్దేవి రామప్రియచికీర్షయా,
స్నేహప్రస్కన్నమనసా మయైతత్సముదీరితమ్. ౭
లంకాయా దుష్ప్రవేశత్వాద్దుస్తరత్వాన్మహోదధేః,
సామర్థ్యాదాత్మనశ్చైవ మయైతత్సముదీరితమ్. ౮

ఇచ్ఛామి త్వాం సమానేతుమద్యైవ రఘుబన్ధునా,
గురుస్నేహేన భక్త్యా చ నాన్యథైతదుదాహృతమ్. ౯
యది నోత్సహసే యాతుం మయా సార్థమనిన్దితే,
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయాద్రాఘవో హి తత్. ౧౦

ఏవముక్తా హనుమతా సీతా సురసుతోపమా,

ఉవాచ వచనం మన్దం బాష్పప్రగ్రథితాక్షరమ్. ౧౧

ఇదం శ్రేష్ఠమభిజ్ఞానం బ్రూయాస్త్వంతు మమ ప్రియం,
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా. ౧౨
తాపసాశ్రమవాసిన్యాః ప్రాజ్యమూలఫలోదకే,
తస్మిన్ సిద్ధాశ్రమే దేశే మన్దాకిన్యా హ్యదూరతః. ౧౩

వినయాది సదాచారముగలదానవగు సీతాదేవీ! "రాముఁడు దక్క నితరపురుషుఁడు నన్నుఁ దాఁకఁగూడదు" అని నీవు రెండవ కారణము చెప్పితివే. ఆమాట మహాత్ముఁడగు రామునిపత్నివయిన నీకు సదృశముగా నున్నది. ౪

సీతాదేవీ! నీవుదక్క మఱియే స్త్రీ యిట్టి పరమధార్మికం బగుమాటం జెప్పును? ౫

సీతాదేవీ! నాముందఱ నీవు రామవిరహము సహింపఁజాల కురివోసి కొనం జూచుటయు రావణునిం దృణీకరించి చెప్పిన మాటలను నీసమాచార మంతయుం రామునకుఁ జెప్పెదను. ౬

సీతాదేవీ! పెక్కుకారణములచే నామనసు కరఁగి రామున కెట్లైన బ్రియంబు సేయవలయునని యిట్లు చెప్పినానుగాని వేఱుగాదు. ౭

లంకం బ్రవేశించుటయుం సముద్రము దాఁటుటయు మిక్కిలి కష్టము గావున నేను సమర్థుండవగుటవలన నా సామర్థ్యముఁ జూపుటకై యిట్లు చెప్పినానుగాని వేఱుగాదు. ౮

నేను నిన్నిప్పుడె రామునితోఁ జేర్పఁగోరి యధికస్నేహమునను భక్తి చేతను ఇట్లు చెప్పినానుగాని వేఱుగాదు. ౯

నిందింపఁబడని సీతాదేవీ! నీవు నాతోఁగూడ వచ్చుటకు సమ్మతింపవేని నే నిచ్చటికి వచ్చి నిన్నుఁ జూచుట రామునకుఁ దెలియునట్లు ఏదైననొక గుఱుతు నిమ్ము. అని హనుమంతుఁడు సీతతోఁ జెప్పెను. ౧౦

దేవకన్యకం బోలియున్న సీతాదేవి హనుమంతునిమాటను విని దుఃఖమునం దడఁబడుచుఁ దిన్నఁగా నిట్లని చెప్పెను.

నేను నీ కుత్తమ మయిన యొక గుఱుతుఁ జెప్పెదను. దాని నీవు నా ప్రియుండగు రామునకుం జెప్పుము. ౧౧

మున్ను చిత్రకూటపర్వతమునందలి మూలఫలోదకములు సమృద్ధము గాఁగల యీశాన్యపాదమునందు గంగానదికి సమీపమున సిద్ధాశ్రమంబగు. ప్రదేశమున నేను నీతోఁగూడ నొక ఋష్యాశ్రమమున నుండఁగా నీప్రకారము జరిగినది. ౧౨, ౧౩.

తస్యోపవనషండేషు నానాపుష్పసుగంధిషు,
విహృత్య సలిలక్లిన్నా తవాంకే సముపావిశమ్. ౧౪
తతో మాంససమాయుక్తో వాయసః పర్యతుండయత్,

తమహం లోష్టముద్యమ్య వారయామి స్మ వాయసమ్. ౧౫
దారయన్ స చ మాం కాక స్తత్రైవ పరిలీయతే,
న చాప్యుపారమ న్మాంసా ద్భక్షార్థీ బలిభోజనః. ౧౬

ఉత్కర్షన్త్యాం చ రశనాం క్రుద్ధాయాం మయి పక్షిణి,

స్రస్యమానే చ వసనే తతో దృష్టా త్వయా హ్యహమ్. ౧౭

త్వయాఽపహాసితా చాహం క్రుద్ధా సంలజ్జితా తదా,
భక్షగృధ్నేన కాకేన దారితా త్వా ముపాగతా. ౧౮

ఆసీనస్య చ తే శ్రాంతా పునరుత్సంగమావిశం,
క్రుధ్యంతీ చ ప్రహృష్టేన త్వయాఽహం పరిసాంత్వితా. ౧౯
బాష్పపూర్ణముఖీ మందం చక్షుషీ పరిమార్జతీ,
లక్షితాఽహం త్వయా నాథ వాయసేన ప్రకోపితా. ౨౦

పరిశ్రమాత్ప్రసుప్తా చ రాఘవాంకేఽప్యహం చిరం,
పర్యాయేణ ప్రసుప్తశ్చ మమాంకే భరతాగ్రజః. ౨౧

స తత్ర పునరేవాథ వాయసస్సముపాగమత్,

నేను అచ్చట నానావిధపుష్పముల సుగంధములు గుబాళించుచుండు వనములందు విహరించి చెమటచేఁ దడిసి నీయంకమునం గూర్చుంటిని. ౧౪

అంత నొక్క కాకి మాంసమునాశించి నా స్తనములనడుమ ముక్కుతోఁ బొడిచినది.

అప్పుడు నేను మంటిగడ్డనెత్తి యాకాకిం దోలినాను. ౧౫

ఆకాకి యెంత తోలినను బోక యచ్చటనే దాఁగియుండెను.

ఆహారమును గోరియున్నయాకాకి యెంతమాత్రమునవ్వలికిఁ బోక విడువక నా స్తనాంతరంబున గీఱుచు నామాంసమును దినుచునె యుండెను.

అట్లాకాకిచే నావస్త్రము పీడఁగా నేను గోపించి వస్త్రమును దృఢము జేసికొనుటకై మొలనూలు సవరించుకొనుచుండఁగా నీవు నన్నుఁ జూచినావు.

అప్పు డట్లు నేనాకాకిపైఁ గోపమునొంది దానిం దఱుముచుండఁగా నీవు నన్నుఁ బరిహసించినావు. నే లజ్జించియుంటిని. ౧౭

అట్లాకాకిచే విదారింపంబడి నేను నీయొద్ద నుంటిని.

నే నట్లలసటనొంది యచ్చటఁ గూర్చుండియున్న నీతొడపై మరలఁ గూర్చుంటిని. ౧౮

నే నట్లు గోపము నొందియుండుటం జూచి నీవు సంతోషమున నన్ను మంచిమాటలం దేర్చినావు. ౧౯

నాథుండగు రాముఁడా! నే నట్లు వాయసముచేసినదానికిఁ గోపము నొంది ముఖమునిండఁ గన్నీళ్లుంచుకొనుచుఁ దిన్నఁగాఁ గన్నీ రొడుచుకొను చుండఁగా నీవు నన్నుఁ జూచినావు. ౨౦

అంత నేను బరిశ్రమమున రామునితొడపైఁ బరుండి బహుకాలము నిదురించినాను. నేను లేచినంతనె రాముండును నాతొడపైఁ బరుండి నిద్రించినాఁడు. (ఇంతవఱకు సీతాదేవి హనుమంతునితో రామునింగూర్చి చెప్పినట్లు చెప్పి యిప్పుడు వృత్తాంతము విశదమగుటకై మరల హనుమంతునింగూర్చి చెప్పుచున్నది.) ౨౧

అంత నాకాకి యచ్చటికి మరల వచ్చినది.

తతస్సుప్తప్రబుద్ధాం మాం రామస్యాఙ్కాత్సముత్థితామ్. ౨౨
వాయస స్సహసాగమ్య విదదార స్తనాన్తరే,
పునఃపున రథోత్పత్య విదదార స మాం భృశమ్. ౨౩

తత స్సముత్థితో రామో ముక్తై శ్శోణితబిన్దుభిః,

వాయసేన తత స్తేన బలవత్ క్లిశ్యమానయా. ౨౪
స మయా బోధితశ్శ్రీమాన్ సుఖసుప్తః పరన్తపః,

స మాం దృష్ట్వా మహాబాహుర్వితున్నాం స్తనయో స్తదా.
ఆశీవిష ఇవ క్రుద్ధః శ్వసన్ వాక్య మభాషత,

కేన తే నాగనాసోరు విక్షతం వై స్తనాన్తరమ్. ౨౬
కః క్రీడతి సరోషేణ పఞ్చవక్త్రేణ భోగినా,

వీక్షమాణ స్తత స్తం వై వాయసం సముదైక్షత. ౨౭
నఖై స్సరుధిరై స్తీక్ష్ణైర్మామేవాభిముఖం స్థితమ్,
పుత్త్రః కిల స శక్రస్య వాయసః పతతాంవరః. ౨౮
ధరాన్తరగతశ్శీఘ్రం పవనస్య గతౌ సమః,
తత స్తస్మిన్మహాబాహుః కోపసంవర్తితేక్షణః. ౨౯
వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాంవరః,

స దర్భం సంస్తరాద్గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్. ౩౦

అంత నేను నిదురలేచి రాముని తొడపైనుండి లేచినంతనె యాకాకి కటాలున నాయొద్దకు వచ్చి నా స్తనములనడుమ ముక్కుతోఁ బొడిచినది.

మాటిమాటికి అట్లు ఆకాకి ఎగిరి నా స్తనములు గీఱి మిక్కిలి గాయము చేసినది. ౨౩

అట్లు కాకిచే గీఱఁబడుచుండు నా స్తనములనుండి కాఱు నెత్తురుబిందువులచే రాముఁడు తడిసినాఁడు.

అంత నట్లు ఆ కాకిచే నధికముగా బాధింపఁబడుచున్న నేను జేయునది లేక శ్రీమంతుఁడును సుఖనిద్రలో నున్నవాఁడును శత్రువులం దరింపఁజేయువాఁడు నగు రాముని బ్రబోధించినాను. ౨౪

మహాబాహుఁడగు రాముఁడప్పుడు నెత్తురుగాఱు స్తనములతో నున్న నన్ను జూచి సర్పముంబోలెఁ గోపమునొంది నిట్టూర్పులుపుచ్చుచు నిట్లని చెప్పెను. ౨౫

ఏనుఁగుతొండములవంటి తొడలుగల సీతాదేవీ! నీ స్తనమున నెవ్వఁడిట్లు గాయము చేసినాఁడు ? ఎవ్వఁ డిట్లు కోపము నొందియున్న యైదు తలల పాముతోఁ గ్రీడించుచున్నాఁడు ? కోపముతోఁ గ్రీడించువాని కేమి ఫలముగలుగునో నీ స్తనముల గాయములు గావించినవాఁ డాఫలము నొందును. అని రాముండు నన్నడిగెను. ౨౬

ఆరాముం డంత నాలుప్రక్కలం జూచుచు నెత్తురుతోఁ గూడిన కఱకునఖములతో నాయెదుటనే నిల్చియున్న యాకాకిం జూచెను. ౨౭

ఆకాకి యింద్రునికొడుకు. పక్షులలో మేటియయినవాఁడు. పర్వతంబునందు నివసించుచు, శీఘ్రగమనంబున వాయుదేవునకు సరివచ్చును. అని యటువెనుక రాముఁడు చెప్పెను. ౨౮

అంత బుద్ధిమంతులలో శ్రేష్ఠుండును మహాబాహుండు నగు నారాముఁడు ఆకాకిపైఁ గోపంబుఁబూని నేత్రంబులఁ గోపరసంబు గదుర దానిఁ జంపఁ గోరెను. ౨౯

ఆరాముఁడు తనదర్భాసనంబున నుండి యొకదర్భం దీసి దానిని బ్రహ్మాస్త్రముచే నభిమంత్రించెను. ౩౦

స దీప్త ఇవ కాలాగ్నిర్జజ్వాలాభిముఖో ద్విజం,

స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి. 3౧
తతస్తం వాయసం దర్భస్సోఽంబరేఽనుజగామ హ,

అనుసృష్టస్తదా కాకో జగామ వివిధాం గతిమ్. 3౨

లోకకామ ఇమం లోకం సర్వం వై విచచార హ,

స పిత్రా చ పరిత్యక్తస్సురైశ్చ సమహర్షిభిః. 33
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః,

స తం నిపతితం భూమౌ శరణ్యశ్శరణాగతమ్. 3౪
వధార్హ మపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్,

న శర్మ లబ్ధ్వా లోకేషు తమేవ శరణం గతః. 3౫

పరిద్యూనం విషణ్ణం చ స తమాయాంతమబ్రవీత్,

మోఘం కర్తుం న శక్యం తు బ్రాహ్మమస్త్రం తదుచ్యతామ్. 3౬
హినస్తు దక్షిణాక్షి త్వచ్ఛర ఇత్యథ సోఽబ్రవీత్,

తతస్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్. 3౭
దత్త్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః.

ఆదర్భ మండుచున్న ప్రళయాగ్నిచందంబున నాకాకి కెదురై ప్రజ్వరిల్లుచుండినది.

రాముం డట్లు మండుచున్నయాదర్భను కాకిపై వైచెను.

అంత నాదర్భ జ్వలించుచు నాకాశంబున నాకాకిం దఱుముకొని పోయినది. ౩౧

అప్పు డాకాకి యాదర్భచేఁ దఱుమఁబడినదై పెక్కుస్థానంబులకుం బోయెను. ౩౨

ఆకాకి తన్నెవరైనఁ గాపాడుదురో యని వెదకుచు నీప్రపంచము నంతయుఁ దిరిగెను.

ఆకాకి తండ్రియయిన యింద్రుఁడును నిన్ను రక్షింప నాచేతఁ గాదు అని విడిచినాఁడు. దేవతలును విడిచిరి. అట్లు మహర్షులును బరిత్యజించిరి. అట్టు లాకాకి ముల్లోకంబును ప్రదక్షిణంబులుచేసి తుదకు ఆరాముని శరణము నొందెను. ౩౩

శరణం బొందినవారలఁ గాపాడుట యనుదృఢవ్రతము గల రాముండు తనముందట శరణాగతమై నేలం బడియున్న యాకాకిం జూచి యది చంపఁ దగినదైనను దయచేఁ గాపాడెను. ౩౪

ఆకాకి యెన్నిలోకంబులు దిరిగినను ఆదర్భ తన్ను విడువకుండుటం జేసి యారామునే శరణునొందెను. ౩౫

ఆరాముఁడు తనయొద్దకుఁ బరితాపంబునొంది దుఃఖితుండై వచ్చిన కాకిం జూచి యిట్లని చెప్పెను.

ఈబ్రహ్మాస్త్రమును వ్యర్థముగాఁ జేసి మరలింప నలవిగాదు. కావున దాని కేమి సేయువచ్చును చెప్పుము. అని రాముఁడు కాకి నడిగెను. ౩౬

అంత నాకాకి రాముం జూచి 'నీబ్రహ్మాస్త్రంబు నా కుడికంటిని హింసించుఁగాక' అని చెప్పెను.

అంత నాదర్భ యాకాకి కుడికంటిని హింసించినది. ౩౭

ఆకాకి తనకుడికంటి నొసంగి తనప్రాణంబులం గాపాడుకొనెను.

స రామాయ నమస్కృత్వా రాజ్ఞే దశరథాయ చ. ౩౮
విసృష్టస్తేన వీరేణ ప్రతిపేదే స్వమాలయమ్,
మత్కృతే కాకమాత్రేతు బ్రహ్మాస్త్రం సముదీరితమ్. ౩౯
కస్మాద్యో మాం హరేత్త్వత్తః క్షమసే తం మహీపతే,

స కురుష్వ మహోత్సాహః కృపాం మయి నరర్షభ. ౪౦

త్వయా నాథవతీ నాథ హ్యనాథా ఇవ దృశ్యతే,

ఆనృశంస్యం పరో ధర్మ స్త్వత్త ఏవ మయా శ్రుతః. ౪౧

జానామి త్వాం మహావీర్యం మహోత్సాహం మహాబలం,
అపారపారమక్షోభ్యం గాంభీర్యాత్సాగరోపమమ్. ౪౨

భర్తారం ససముద్రాయా ధరణ్యా వాసవోపమం,
ఏవమస్త్రవిదాం శ్రేష్ఠస్సత్యవాన్బలవానపి. ౪౩

కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః,
న నాగా నాపి గంధర్వా నాసురా న మరుద్గణాః. ౪౪
రామస్య సమరే వేగం శక్తాః ప్రతిసమాధితుం,
తస్య వీర్యవతః కశ్చిద్యద్యస్తి మయి సంభ్రమః. ౪౫
కిమర్థం న శరైస్తీక్ష్ణైః క్షయం నయతి రాక్షసాన్,

అంత నాకాకి రామునకును దశరథమహారాజునకును నమస్కరించి పరాక్రమశాలి యగునారామునననుజ్ఞ నొంది తనవాసస్థానంబునకుం బోయెను.

రాముఁడా! నీవు మున్ను నాకొఱకు ఒక కాకియంతటి స్వల్పపక్షి మీఁద బ్రహ్మాస్త్రంబుఁ బ్రయోగించినావు. ఇప్పుడు నీయొద్దనుండి నన్నపహరించిన పరమాపరాధి యయినవాని క్షమించుచున్నా వేమి? ౩౯

పురుషోత్తముండ వగురాముఁడా! ఆట్లు దయాసముద్రుండవని ఖ్యాతి గాంచినట్టి నీవు అధికోత్సాహం బవలంబించి నాయందు దయఁజూపుము.

ఓనాథుఁడా! నీవు నాకు నాథుండ వయియుండియును నే ననాథ యుంబోలె నిట్లుండుట సరియగునా?

దయగలిగియుండుట పరమధర్మం బని నీవే నాకుఁ జెప్పియున్నావు. ఇప్పుడు నీవే యిట్లు దయదప్పవచ్చునా? ౪౦

నీవు మహాపరాక్రమశాలివనియుం, నధికమయినయుత్సాహముగలవాఁడవనియుం, మహాబలుండవనియుం, ననంతము లగుగుణంబులు గలవాఁడవనియుం నెంతకష్టమునందును క్షోభము నొందనివాఁడవనియుం, గాంభీర్యమున సముద్రము వంటివాఁడవనియుం, చతుస్సముద్రములతోఁ గూడినభూమి కంతయుం బ్రభుండవనియుం, దేవేంద్రునకు సాటియయినవాఁడవనియుం నాకుఁ దెలియును. ౪౧

రాముండు ఇట్లు అస్త్రవేత్తలలో నుత్తముఁడయ్యును సత్వవంతుఁడయ్యును బలవంతుఁడయ్యును రాక్షసులు నన్నిట్లు బాధించుచుండఁగా వారలపై నస్త్రములం బ్రయోగింపఁడేల? ౪౩

సర్పములంగాని గంధర్వులుగాని యసురులుగాని దేవతలుగాని యుద్ధమున రామునిపరాక్రమమును సహింపలేరు. ౪౪

మహాపరాక్రమశాలి యగురామునకు నన్ను దీసికొనిపోవలయునని యెంతమాత్రమయినఁ దొందర యుండునేని యీరాక్షసుల నందఱం దీక్ష్ణము లగుబాణములచేఁ జంపకున్నాఁడేల? ౪౫

భ్రాతురాదేశమాదాయ లక్ష్మణో వా పరంతపః. ౪౬
కస్య హేతోర్న మాం వీరః పరిత్రాతి మహాబలః,

యది తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ. ౪౭
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః,

మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః. ౪౮
సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ,

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్. ౪౯
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః,

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన మే శపే. ౫౦

రామే దుఃఖాభిపన్నే చ లక్ష్మణః పరితప్యతే,
కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్. ౫౧

ఇమం ముహూర్తం దుఃఖానాం ద్రక్ష్యస్యంతమనిందితే,

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రౌ మహాబలౌ. ౫౨
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః,

హత్వా చ సమరే క్రూరం రావణం సహబాంధవమ్. ౫౩
రాఘవస్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి,

వీరుండును మహాబలుండును శత్రువులఁ దపింపఁజేయువాఁడు నగు లక్ష్మణుం డయినను అన్నయొద్ద ననుజ్ఞఁ దీసికొని యిచ్చటికి వచ్చి నన్ను రక్షింపకున్నాఁడేమి?

పురుషోత్తములును వాయువునకు నగ్నిహోత్రునకునుంబోలెఁ గాంతి గలవారలును దేవతలకైన నెదిరింప నలవిగానివారలు నగు నారామలక్ష్మణు లిద్దఱును ఒకరి నొకరు విడువక యొకటిగాఁ జేరియుండువారేని నాపై నిట్టేల యుపేక్ష చేయుచున్నారు? ౪౭

శత్రువులం దపింపఁజేయునట్టి యీ రామలక్ష్మణులు నాదుఃఖంబు దొలఁగింప సమర్థులయినను నామీఁద దృష్టియుంచకుండుటకు నేను జేసియున్న మహాపాపమే కారణము. ఇందు సందేహము లేదు. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౪౮

మహాపరాక్రమశాలియు వాయుదేవునికుమారుండు నగుహనుమంతుండు సీతాదేవి కన్నీళ్లొలుకం జెప్పిన దుఃఖపుమాటలను విని యిట్లని బదులు చెప్పెను. ౪౯

సీతాదేవీ ! నీదుఃఖంబున రాముఁ డన్నిటియందు విముఖుం డైయున్నాఁడు. నేను సత్యముచే శపథము సేయుచున్నాను. ౫౦

రాముఁడు దుఃఖింపఁగానే లక్ష్మణుండును దుఃఖమునొందును.

మహాప్రయాసమున నిన్నుఁ జూడఁగంటిని. ఇప్పుడు నీవు సంతోషింపవలెను గాని దుఃఖించుట సరిగాదు. ౫౧

నిందింపఁబడని సీతాదేవీ! ఇంక స్వల్పకాలముననే నీదుఃఖములన్నియుం శమింపఁగలవు.

పురుషశ్రేష్ఠులును రాచకొమరులును మహాబలులును నినుఁ జూడఁగోరుచుండువారలు నగురామలక్ష్మణు లిద్దఱును ఇంక స్వల్పకాలంబుననే యీ లంకను భస్మంబు గావింతురు. ౫౨

విశాలంబు లగుకన్నులుగల సీతాదేవీ! రాముఁడు క్రూరుండగురావణుని బంధువులతోడం జంపి నిన్నుఁ దోడ్కొని తన యయోధ్యాపట్టణంబునకుఁ బోఁగలఁడు. ౫౩

బ్రూహి యద్రాఘవో వాచ్యో లక్ష్మణశ్చ మహాబలః. ౫౪
సుగ్రీవో వాపి తేజస్వీ హరయోఽపి సమాగతాః,

ఇత్యుక్తవతి తస్మింస్తు సీతా సురసుతోపమా. ౫౫
ఉవాచ శోకసంతప్తా హనుమంతం ప్లవంగమం,
కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ. ౫౬
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ,
స్రజశ్చ సర్వరత్నాని ప్రియాయాశ్చ వరాంగనాః. ౫౭
ఐశ్వర్యం చ విశాలాయాం పృథివ్యామపి దుర్లభం,
పితరం మాతరం చైవ సమ్మాన్యాభిప్రసాద్య చ. ౫౮
అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః,

ఆనుకూల్యేన ధర్మాత్మా త్యక్త్వా సుఖమనుత్తమమ్. ౫౯
అనుగచ్ఛతి కాకుత్స్థం భ్రాతరం పాలయన్వనే,
సింహస్కంధో మహాబాహుర్మనస్వీ ప్రియదర్శనః. ౬౦
పితృవద్వర్తతే రామే మాతృవన్మాం సమాచరన్,

హ్రియమాణాం తదా వీరో న తు మాం వేద లక్ష్మణః. ౬౧

వృద్ధోపసేవీ లక్ష్మీవాన్ శక్తో న బహుభాషితా,
రాజపుత్త్రః ప్రియశ్శ్రేష్ఠస్సదృశశ్శ్వశురస్య మే. ౬౨

రామునకుఁగాని మహాబలుఁ డగులక్ష్మణునకుఁగాని కాంతిమంతుఁడగు సుగ్రీవునకుఁగాని యచ్చట గుంపుగుంపులుగాఁ జేరియుండు వానరులకుఁగాని యేమి చెప్పవలయును. దానిఁ జెప్పుము. అని హనుమంతుఁడు సీతాదేవికిఁ జెప్పెను. ౧౪

హనుమంతుఁ డిట్లు చెప్పఁగా దేవకన్యకఁ బోలియున్న సీతాదేవి పరమదుఃఖితయయి హనుమంతుఁ జూచి యిట్లని చెప్పెను. ౧౫

మనస్విని యగుకౌసల్య లోకనాయకుఁ డగు నేపుత్రుఁ గనెనో అట్టి రాముని నీవు నాకై సుఖంబడిగి సాష్టాంగముగా నమస్కరింపుము. ౧౬

సుమిత్రా సత్పుత్రుండయిన లక్ష్మణుండు పుష్పంబులు మొదలగు నానావిధభోగ్యద్రవ్యంబులను సమస్తరత్నంబులను ఉత్తమస్త్రీలయిన ప్రియలను విశాలంబగు భూమియుఁ దంతయుఁ దుర్లభం బైనయైశ్వర్యమును విడిచి తల్లిదండ్రులఁ బూజించి వారలు సంతోషపడునట్లు చేసి రామునితోఁగూడ నరణ్యంబునకు వచ్చినాఁడు. ౧౭,౧౮

ఆలక్ష్మణుఁడు ధర్మాత్ముండు గావున అన్న యగురామునందలి స్నేహము చేత నడవియందు రాముని బాలించుకొనుచు వెంబడించి వచ్చినాఁడు.

మరియు నాలక్ష్మణుండు సింహముమూఁపులవంటి మూఁపులు గలవాఁడు, మహాబాహుండు. మంచిమనస్సు గలవాఁడు. చూపరులకుఁ బ్రియంబుఁ బుట్టించువాఁడు. నన్నుఁ దల్లియట్లు చూచుకొనుచు రామునందుఁ బితృభావం బుంచి యుండును. ౨౦

అప్పుడు నన్ను రావణుం డపహరించుకొనిపోవుట వీరుం డగులక్ష్మణుం డకును దెలియదు. తెలిసినచో నప్పుడే రావణుని వధించి నా కింతకష్టము సంభవింపకుండునట్లు చేసియుండును. ౨౧

ఆలక్ష్మణుండు ఎప్పుడును పెద్దలకు సేవ సేయుచుండును. అధికమయిన కాంతిగలవాఁడు. సమర్థుండు. అధికముగా మాటలాడఁడు. రాచకొమరుఁడు. చూపరులకు సంతోషము గలిగించును. ఉత్తముండు. గుణంబుల నామామయగు దశరథమహారాజునకు సరివచ్చువాఁడు. ౨౨

మమ ప్రియతరో నిత్యం భ్రాతా రామస్య లక్ష్మణః,
నియుక్తో ధురి యస్యాం తు తాముద్వహతి వీర్యవాన్. ౬౩

యం దృష్ట్వా రాఘవో నైవ వృత్తమార్యమనుస్మరేత్,
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనాన్మమ. ౬౪

మృదుర్నిత్యం శుచిర్దక్షః ప్రియో రామస్య లక్ష్మణః,
యథా హి వానరశ్రేష్ఠ దుఃఖక్షయకరో భవేత్. ౬౫

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ,
రాఘవస్త్వత్సమారంభాన్మయి యత్నపరో భవేత్. ౬౬
ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునఃపునః,
జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ. ౬౭

ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమి తే,
రావణేనోపరుద్ధాం మాం నికృత్యా పాపకర్మణా. ౬౮
త్రాతుమర్హసి వీర త్వం పాతాళాదివ కౌశికీం,

**తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్. ౬౯**
**ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ,**

అతండు రామునకుఁ దమ్ముండు నా కెప్పుడును సంతోషము సేయుచుండును.

పరాక్రమవంతుం డగులక్ష్మణుండు తన్ను రాముఁ డేకార్యంబునం దాజ్ఞాపించునో ఆకార్యమును తప్పక నెఱవేర్చును. ౬౩

ఎవ్వండు తనకుఁ దండ్రివలెఁ బోషణము సేయుచుండుటవలన రాముండు చనిపోయినతండ్రిని దశరథుం దలంపకుండునో అట్టిలక్ష్మణుని నాకై నీవు నామాటవలన క్షేమం బడుగుము. ౬౪

అతండు ఎప్పుడును మృదుప్రకృతి గలిగియుండువాఁడు కపటములేనివాఁడు. సమర్థుండు. రామునకుం బ్రియుండు.

వానరశ్రేష్ఠుండ వగుహనుమంతుఁడా! రాముండు నాదుఃఖంబును బోఁగొట్టునట్లు ఈకార్యమును నెఱవేర్చుటకు నీవే కర్తవు. ౬౫

నీప్రయత్నంబువలననె రాముండు నన్నుఁ దీసికొని పోవుటయందుఁ బ్రయత్నపడును. కావున నీవు చక్కఁగాఁ బ్రయత్నము సేయవలయు. ౬౬

నీవు శూరుం డగు నాపెనిమిటి రాముని జూచి తప్పక యీమాటను మాత్రము మాటిమాటికిఁ జెప్పుము.

దశరథపుత్త్రుండ వగురాముఁడా! నే నింక నొక్కమాసము ప్రాణంబులం దాల్చియుండెదను. ౬౭

నేను ఒకనెలకుఁ బిమ్మట నెంతమాత్రము జీవింపను. నీకు నమ్మకము గలుగుటకై సత్యముపై శపథము సేయుచున్నాను.

వీరుండ వగురాముఁడా! పూర్వము దేవేంద్రునిలక్ష్మి పాతాళంబుఁ బ్రవేశింపఁగా దేవతలచేఁ బ్రార్థితుండై విష్ణుదేవుండు దానిం దీసికొని వచ్చినట్లు నీవు పాపాత్ముండగు రావణునిచే నిరోధింపఁబడి యవమానంబునొందుచున్న నన్ను రక్షింపవలయును అని నేను చెప్పినట్లు రామునకుం జెప్పుము. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౬౮

అంత సీతాదేవి కొంగునం గట్టుకొనియున్న దివ్యమును సుందరమునగు చూడామణిం దీసి దీని రామున కిమ్ము అని చెప్పి హనుమంతునిచేతి కిచ్చెను.

ప్రతిగృహ్య తతో వీరో మణిరత్నమనుత్తమమ్. ౭౦
అంగుళ్యా యోజయామాస న హ్యస్య ప్రాభవద్భుజః,

మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాఽభివాద్య చ. ౭౧
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతస్స్థితః,

హర్షేణ మహతా యుక్తస్సీతాదర్శనజేన సః. ౭౨
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః,

మణివరముపగృహ్య తం మహార్హం
జనకనృపాత్మజయా ధృతం ప్రభావాత్,
గిరిరివ పవనావధూతముక్త
స్సుఖితమనాః ప్రతిసంక్రమం ప్రపేదే. ౭౩

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - అష్టత్రింశస్సర్గః.

---

## ఏకోనచత్వారింశస్సర్గః

మణిం దత్వా తతస్సీతా హనుమంతమథాఽబ్రవీత్,

అభిజ్ఞానమభిజ్ఞాతమేతద్రామస్య తత్త్వతః. ౧
మణిం తు దృష్ట్వా రామో వై త్రయాణాం సంస్మరిష్యతి,
వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ. ౨

అంత పరాక్రమశాలి యగుహనుమంతుండు ఉత్తమమయిన యా చూడామణిం దీసికొని తనవ్రేలికిం దొడుగుకొనెను. ఏలయనఁగా: నతండు మున్ను సీతాదేవికిఁ జూపిన భయంకరరూపము విడిచి సూక్ష్మరూపముదాల్చిన వాఁడయ్యెను ఆచూడామణి వెండ్రుకలతో దూర్చుకొనుటకై చేయఁబడిన మిక్కిలి సూక్ష్మమయినరంధ్రముగలది కావున వ్రేలిలోఁ దొడుగుకొనుటకు వీలుకాదయ్యె. ౨౦

వానరశ్రేష్ఠుం డగుహనుమంతుండు మణులలో శ్రేష్ఠంబయిన యా చూడామణిం దీసికొని సీతాదేవికిఁ బ్రదక్షిణనమస్కారంబులు చేసి వినయమునఁ బార్శ్వమునందు నిలుచుండెను. ౨౧

ఆహనుమంతుండు సీతం జూచుటవలన మహాసంతోషమునొంది దేహముచేమాత్ర మచ్చట నిలిచియుండినట్లుండెను. కాని మనంబున రామునొద్దకుఁ బోయి యుండెను. ౨౨

ఆహనుమంతుం డట్లు తనసామర్థ్యమున సీతం జూచి సీతాదేవి ధరించు నట్టిశ్రేష్ఠమయిన చూడామణిం దీసికొని పెనుగాలికిం గదలుచుండి దానిచే విడువంబడి సుఖంబుగా నుండుపర్వతంబువలె మనంబున సుఖంబునొంది మరల రామునొద్దకుఁ బోఁగోరెను. ౨౩

ఇది ముప్పదియొంబదవ సర్గము.

---

## ముప్పదితొమ్మిదవ సర్గము

సీతాదేవి యట్లు చూడామణిని హనుమంతున కొసంగి యంత హను మంతుం జూచి యిట్లని చెప్పెను.

ఈగురుతు రామునకు యథార్థముగాఁ జక్కఁగాఁ దెలియును. ౧

పరాక్రమవంతుఁ డగురాముఁడు ఈచూడామణిం జూడఁగానే ఈ చూడామణిని వివాహకాలమున నాకు నాతల్లి యిచ్చినది. కావున నాతల్లిని అప్పుడు దశరథమహారాజు నుండినందున దశరథమహారాజు నన్నును మా ముగ్గురినిం దలంచుకొనును. ౨

స భూయస్త్వం సముత్సాహే చోదితో హరిసత్తమ,
అస్మిన్ కార్యసమారంభే ప్రచింతయ యదుత్తరమ్. ౩

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ,
హనుమన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరో భవ. ౪

తస్య చింతయతో యత్నో దుఃఖక్షయకరో భవేత్,
స తథేతి ప్రతిజ్ఞాయ మారుతిర్భీమవిక్రమః. ౫
శిరసా వన్ద్య వైదేహీం గమనాయోపచక్రమే,
జ్ఞాత్వా సంప్రస్థితం దేవీ వానరం మారుతాత్మజమ్. ౬
బాష్పగద్గదయా వాచా మైథిలీ వాక్యమబ్రవీత్,
కుశలం హనుమన్ బ్రూయాస్సహితౌ రామలక్ష్మణౌ. ౭
సుగ్రీవం చ సహామాత్యం వృద్ధాన్ సర్వాంశ్చ వానరాన్,
బ్రూయాస్త్వం వానరశ్రేష్ఠ కుశలం ధర్మసంహితమ్. ౮
యథా స చ మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి. ౯
జీవంతీం మాం యథా రామస్సంభావయతి కీర్తిమాన్,
తత్తథా హనుమన్వాచ్యం వాచా ధర్మమవాప్నుహి. ౧౦

నిత్యముత్సాహయుక్తాశ్చ వాచశ్శ్రుత్వా త్వయేరితాః,
వర్ధిష్యతే దాశరథేః పౌరుషం మదవాప్తయే. ౧౧

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీ వెట్లయిన రామునకుఁ బ్రోత్సాహము సేయవలయునని మరలం జెప్పుచున్నాను.

ఈకార్యమునందుఁ బ్రయత్నించుట కిప్పు డేమిసేయవలయునో దాని నాలోచింపుము. ౩

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! ఈకార్యము సంఘటించుట యందు నీవే కర్తవు.

హనుమంతుఁడా! నీ వెట్లయినఁ బ్రయత్నంబుచేసి నాదుఃఖము నశించు నట్లు సేయుము. ౪

అట్టి మహాబుద్ధిశాలివైన నీ వాలోచించి ప్రయత్నముచేసితివేని తప్పక నాదుఃఖము నశింపఁగలదు. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను.

భయంకరమగు పరాక్రమముగలవాఁడును వాయుదేవునికుమారుండు నగు హనుమంతుండు సీతాదేవి చెప్పినందుకు "అలాగే" యని ప్రతిజ్ఞచేసి సీతాదేవికి సాష్టాంగనమస్కారము గావించి పయనంబు కాఁగోరెను. ౫

సీతాదేవి వాయుదేవునికుమారుండైన హనుమంతుండు పయనంబగుటం జూచి డగ్గుత్తికగదుర నిట్లని చెప్పెను. ౬

హనుమంతుఁడా! రామలక్ష్మణుల నిద్దఱను క్షేమం బడుగుము. ౭

వానరోత్తముండగు హనుమంతుఁడా! నీవు సుగ్రీవుని ఆతనిమంత్రులను వృద్ధులగువానరులను ఇంక నితరులయినవానరులను ధర్మము దప్పక క్రమముగా క్షేమం బడుగుము. ౮

మహాబాహుండగు నారాముండు నాదుఃఖముఁ బోఁగొట్టునట్లు నీ వతని సమాధానపఱుపవలసినది. ౯

హనుమంతుఁడా! నేను బ్రతికియుండఁగానే రాముఁడు నన్నుఁ దీసికొని పోయి కీర్తినొందునట్లు నీవు రామునికిఁ జెప్పవలయును. నీ విట్లు మాటచెప్పుట మాత్రముననే నీకు ధర్మము గలుగును. ౧౦

ఎల్లప్పుడును నీవు ప్రోత్సాహముఁ బుట్టించుమాటలం జెప్పఁగా వాని వినుటచే రామునకుఁ బౌరుషంబు హెచ్చి నన్నుఁ బొంద యత్నించును. ౧౧

మత్సందేశయుతా వాచస్త్వత్తశ్శ్రుత్వా చ రాఘవః,
పరాక్రమవిధిం వీరో విధివత్సంవిధాస్యతి. ౧౨

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్మారుతాత్మజః,
శిరస్యంజలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్. ౧౩
క్షిప్రమేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరైర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి. ౧౪
న హి పశ్యామి మర్త్యేషు నాసురేషు సురేషు వా,
యస్తస్య క్షిపతో బాణాన్ స్థాతుముత్సహతేఽగ్రతః. ౧౫

అప్యర్కమపి పర్జన్యమపి వైవస్వతం యమం,
స హి సోఢుం రణే శక్తస్తవ హేతోర్విశేషతః. ౧౬

స హి సాగరపర్యంతాం మహీం శాసితుమీహతే,

త్వన్నిమిత్తో హి రామస్య జయో జనకనందిని. ౧౭

తస్య తద్వచనం శ్రుత్వా సమ్యక్సత్యం సుభాషితం,
జానకీ బహుమేనేఽథ వచనం చేదమబ్రవీత్. ౧౮

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునఃపునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం సౌహార్దాదనుమానయత్. ౧౯

యదివా మన్యసే వీర వసైకాహమరిందమ,
కస్మింశ్చిత్సంవృతే దేశే విశ్రాంతశ్శ్వో గమిష్యసి. ౨౦

పరాక్రమశాలి యగురాముండు నీవు నేను చెప్పిపంపినమాటలం బలుమాఱు చెప్పుచుండఁగా విని నన్ను బొందుటకై పరాక్రమం బవలంబించి చక్కఁగాఁ బ్రయత్నము సేయును. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను.

వాయుదేవుని కుమారుఁడయిన హనుమంతుండు సీతాదేవి చెప్పిన మాటను విని శిరంబునఁ జేమోడ్పుం గీలించి యిట్లని బదులుచెప్పెను. ౧౩

రాముఁడు వానరులను భల్లూకంబులనుం బిలుచుకొని శీఘ్రంబుగా నిచ్చటికి వచ్చి యుద్ధంబున శత్రువులంజంపి నీదుఃఖంబు వోఁగొట్టఁగలఁడు.

మనుష్యులయందుఁగాని యసురులయందుఁగాని దేవతలయందుఁగాని యుద్ధంబున రాముఁడు బాణంబులు ప్రయోగించుచుండఁగా నతనియెదుట నిలువంగలవాఁడు ఎవ్వఁడును నా కగపడఁడు. ౧౪

ఆరాముండు యుద్ధంబున సూర్యునైనను దేవేంద్రునైనను యమునైనను సాధారణముగానే జయింపఁగలఁడు. ఇంక నీకొఱకై జయించు నని చెప్పనేల ? ౧౫

రాముండు నాలుగుసముద్రంబుల నడుమనున్న సమస్తభూమండలంబును బాలింప నుత్సాహంబు గల్గియున్నాఁడు.

జనకమహారాజకూఁతురవయిన సీతాదేవీ! రాముండు యుద్ధంబునం దప్పక జయంబునొంది నిన్నుఁ బొందఁగలఁడు. అని హనుమంతుండు సీతాదేవితోఁ జెప్పెను. ౧౭

సీతాదేవి యిట్లు హనుమంతుండు చెప్పినయుపపన్నంబును సత్యంబును జెవుల కింపైనదియు నగు మాటను విని యంత హనుమంతునియెడ గౌరవబుద్ధి గలదై యతనిం జూచి యిట్లని చెప్పెను. ౧౮

అంత సీతాదేవి పయనంబయినహనుమంతుని మాటిమాటికిం జూచుచు నతండు చెప్పినమాటవలనఁ బెనిమిటికిఁ దనయందుఁ గల స్నేహాతిశయము చక్కఁగాఁ దెలియవచ్చుటంజేసి మిక్కిలి సంతోషించి బహుమానించెను. ౧౯

శత్రువుల నడఁగఁద్రొక్కఁజాలినపరాక్రమశాలి వగుహనుమంతుఁడా! నీ కిచ్చయుండునేని యిచ్చట నొకరహస్యప్రదేశమునందు నొక్కదినముండి యలసట దీర్చుకొని రేపు పొమ్ము. ౨౦

మమ చేదల్పభాగ్యాయాస్సాన్నిధ్యాత్తవ వానర,
అస్య శోకస్య మహతో ముహూర్తం మోక్షణం భవేత్. ౨౧

గతే హి హరిశార్దూల పునరాగమనాయ తు,
ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః. ౨౨

తవాదర్శనజశ్శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖాద్దుఃఖపరామృష్టాం దీపయన్నివ వానర. ౨౩

అయం చ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాం స్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర. ౨౪
కథంను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిం,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. ౨౫
త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే,
శక్తిస్స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా. ౨౬
తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిదాం వరః. ౨౭

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే ఫలోదయః. ౨౮

బలైస్సమగ్రైర్యది మాం రావణం జిత్వా సంయుగే,
విజయీ స్వపురం యాయాత్తత్తు మే స్యాద్యశస్కరమ్. ౨౯

శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్స్థస్తత్తస్య సదృశం భవేత్. ౩౦

హనుమంతుఁడా! ఇట్లు నీవు విశ్రమార్థమయి యిచ్చటఁ గొంచెము సేపుందువేని నా కిప్పుడు గల్గియుండు మహాదుఃఖమునకుఁ గొంచె మువ శాంతి గల్గును. ౨౧

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీవు మరల వచ్చుటకై యిప్పుడు పోఁగానే నా ప్రాణంబులకును సందేహము గలుగును. ఇందులకు సంశయము లేదు. ౨౨

హనుమంతుఁడా! నీవు పోయినపిమ్మట నిన్ను చూడకుండుటవలన నా కిప్పుడు గల్గియున్న దుఃఖము మఱియు నతిశయించి నా కింక నధికముగాఁ బరితాపము గల్గించును. ౨౩

పరాక్రమశాలివి వానరశ్రేష్ఠుండవు నగుహనుమంతుఁడా! నీకు సహాయులయిన వానరభల్లూకవిషయమున నాకొక గొప్పసంశయ మున్నది. ౨౪

ఆ భల్లూకంబులుగాని రాజపుత్రులయిన రామలక్ష్మణులుగాని వానరులుగాని యపారమయిన సముద్రము నెట్లు దాఁటఁగలరు? ౨౫

ఈసముద్రంబు దాఁటుటకు గరుత్మంతునకు వాయుదేవునకును నీకును మీమువ్వురికే శక్తిగలదు కాని మఱియెవ్వరికిని లేదు. ౨౬

పరాక్రమశాలివగు హనుమంతుఁడా! అట్లుండుటవలన నతికష్టంబగు నీపనిని నెఱవేర్ప నేమియుపాయం బున్నది? నీవు కార్యంబుల నెఱవేర్పం గలవారలలో నుత్తముఁడవు గావున నా కాయుపాయంబుఁ జెప్పుము. ౨౭

శత్రువీరులం జంపునట్టి హనుమంతుఁడా! నీ వొక్కఁడవే రావణుం జంపి నన్ను రాముని కొసంగి యీ కార్యమునంతయు సాధింపంజాలినవాఁడవే యయినను అట్లు సేయుందువేని యది నీకే కీర్తికరము గాని నాకుఁ గాదు. ౨౮

రాముఁడు బలంబున యుద్ధమునందు రావణుం జంపి నన్నుఁ దీసికొని జయశాలి యయి యయోధ్యకుం బోవునేని యదియె నాకుఁ గీర్తికరముగా నుండును ౨౯

శత్రుబలంబులం జంపునట్టి రాముండు లంకాపురియంతయు బాణంబుల నిండునట్టుచేసి నన్నుం గొనిపోవునేని యది యతనికి సరిగానుండును. ౩౦

తద్యథా తస్య విక్రాంతమనురూపం మహాత్మనః,
భవేదాహవశూరస్య తథా త్వముపపాదయ. ౩౧

తదర్థోపహితం వాక్యం సహితం హేతుసంహితం,
నిశమ్య హనుమాన్ శేషం వాక్యముత్తరమబ్రవీత్. ౩౨

దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవస్సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః. ౩౩

స వానరసహస్రాణాం కోటీభిరభిసంవృతః,
క్షిప్రమేష్యతి వైదేహి రాక్షసానాం నిబర్హణః. ౩౪
తస్య విక్రమసంపన్నాస్సత్త్వవంతో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయస్స్థితాః. ౩౫
యేషాం నోపరి నాధస్తాన్న తిర్యక్సజ్జతే గతిః,

న చ కర్మసు సీదంతి మహాత్స్వమితతేజసః. ౩౬

అసకృత్తైర్మహోత్సాహైస్ససాగరధరాధరా,
ప్రదక్షిణీకృతా భూమిర్వాయుమార్గానుసారిభిః. ౩౭

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చిన్నాస్తి సుగ్రీవసన్నిధౌ. ౩౮

అహం తావదిహ ప్రాప్తః కింపునస్తే మహాబలాః,
న హి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః. ౩౯

అందువలన యుద్ధమునందు శూరుండును మహాపరాక్రమశాలియు నగు నారాముఁ డెట్లు పరాక్రమంబుఁ జూపి కీర్తినొందునో నీ వట్లు సన్నాహము సేయుము. ౩౧

హనుమంతుండు గొప్ప యర్థముతోఁ గూడినదియును సంగతంబును యుక్తియుక్తంబు నగుసీతాదేవిమాటను విని యంత నిదివఱకుఁ దాను చెప్పకున్న మాటలం జెప్పెను. ౩౨

సీతాదేవీ ! వానరసైన్యంబులకును భల్లూకసైన్యంబులకును నాయకుండును వానరశ్రేష్ఠుండును బలవంతుండు నగుసుగ్రీవుండు నీకార్యము నెట్లయిన సాధింపవలెనని నిశ్చయించియున్నాఁడు. ౩౩

సీతాదేవీ ! ఆసుగ్రీవుండు డీరాక్షసుల నందఱం జంపఁగలండు. అతఁడు పెక్కువేలకోట్ల వానరులంగూడి శీఘ్రంబుగా నిచ్చటికి వచ్చును. ౩౪

పరాక్రమశాలురును శక్తిమంతులును బలవంతులును మనోవేగంబు వంటి వేగముగలవారలునగు వానరు లనేకు లాసుగ్రీవునియాజ్ఞం గనిపెట్టియున్నారు. వారలు ఊర్ధ్వముగాఁగాని క్రిందుగాఁగాని యడ్డముగాఁగాని యడ్డులేక సంచరింతురు. ౩౫

వారలు కొలఁదిలేని శక్తిగలవారలు గావున నెట్టికార్యములైనను వెరవు సేయరు. ౩౬

అధికమయిన యుత్సాహంబు గల యీవానరులు వాయుమార్గంబున సంచరించుచు సముద్రపర్వతంబులతోఁ గూడిన భూమండలమునంతయుఁ బలుమాఱు చుట్టివచ్చియున్నారు. ౩౭

సుగ్రీవుని సమీపంబున నాకన్న నధికులు నాకు సమానులగు వానరులు పెక్కండ్రు గలరు. అందు నాకన్నఁ దక్కువయినవాఁ డెవ్వఁడును లేఁడు. ౩౮

లోకములో నెచ్చటికైన నుత్తములం బంపుదురా! సాధారణు లగు వారలనే పంపుదురుగదా ! నేనే సముద్రంబు దాఁటి యిచ్చటికి వచ్చినాచే ఇంక మహాబలశాలురగు నావానరులు వచ్చుట కేమి సందియము ? ౩౯

తదలంపరితాపేన దేవి శోకో వ్యపైతు తే,
ఏకోత్పాతేన తే లంకామేష్యంతి హరియూథపాః. ౪౦
మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యావివోదితౌ,
త్వత్సకాశం మహాసత్త్వౌ నృసింహావాగమిష్యతః. ౪౧

తతో వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ,
ఆగమ్య నగరీం లంకాం సాయకైర్విధమిష్యతః. ౪౨

సగణం రావణం హత్వా రాఘవో రఘునందనః,
త్వామాదాయ వరారోహే స్వపురం ప్రతి యాస్యతి. ౪౩
తదాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ,
న చిరాద్ద్రక్ష్యసే రామం ప్రజ్వలంతమివానలమ్. ౪౪

నిహతే రాక్షసేంద్రేఽస్మిన్ సపుత్త్రామాత్యబాంధవే,

త్వం సమేష్యసి రామేణ శశాంకేనేవ రోహిణీ. ౪౫
క్షిప్రం త్వం దేవి శోకస్య పారం యాస్యసి మైథిలి,
రావణం చైవ రామేణ నిహతం ద్రక్ష్యసేఽచిరాత్. ౪౬
ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీం పునరబ్రవీత్. ౪౭
తమరిఘ్నం కృతాత్మానం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవం,
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వారముపస్థితమ్. ౪౮
[సుగ్రీవసహితం శూరం వానరైః పరివారితం,]

నఖదంష్ట్రాయుధాన్వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,
వానరాన్వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్. ౪౯

సీతాదేవీ! అట్లు కావున నీవు పరితాపపడకుము. ఈదుఃఖంబు విడువుము. ఆవానరోత్తము లొక్కగంతునకే యీ లంకాపురిం జేరఁగలరు. ౪౦

బలవంతులును బురుషశ్రేష్ఠులు నగు నా రామలక్ష్మణులును నావీఁపునెక్కి యుదయించిన చంద్రసూర్యులందోలె వెలుంగుచు నీయొద్దకు రాఁగలరు. ౪౧

అంతఁ బరాక్రమశాలురును బురుషశ్రేష్ఠులు నగు రామలక్ష్మణు లిద్దఱును గూడివచ్చి నానావిధబాణంబులం బ్రయోగించి యీ లంకాపురి నంతయు నశింపఁ జేయఁగలరు. ౪౨

సుందరము లయిన పిఱుఁదులు గల సీతాదేవీ! రాముఁడు రావణుని నతని బంధువులను జంపి నిన్నుఁ దీసికొని యయోధ్యాపట్టణంబునకుఁ బోఁగలఁడు.

అందువలన నీవు దుఃఖంబు విడిచి దినంబు లెంచుకొనుచుండుము. నీకు మంగళమగుఁగాత! నీవు శీఘ్రంబుగనే మండుచున్న యగ్నిహోత్రంబోలెఁ జూపట్టుచు నీలంకాపురిం గాల్చుచున్న రాముం జూడఁగలవు. ౪౪

రావణుండును అతని కొడుకులును మంత్రులును బంధుజనంబులును జంపఁబడిన వెనుక నీవు రోహిణీదేవి చంద్రుం జేరునట్లు రాముం జేరఁగలవు.

సీతాదేవీ! ఇంక శీఘ్రంబుననే నీదుఃఖంబంతయు నశించును. ౪౫

నీవు శీఘ్రముగనే రామునిచేఁ జంపఁబడిన రావణునిం జూడఁగలవు. అని హనుమంతుఁడు సీతతోఁ జెప్పెను. ౪౬

వాయుదేవుని కుమారుండగు హనుమంతుఁడు ఈప్రకారము సీతాదేవి నూఱడించి యంతఁ బోఁదలఁచి మరల సీతాదేవిం జూచి యిట్లని చెప్పెను.

నీవు శీఘ్రఁబున శత్రువులం జంపునట్టివాఁడును నిశ్చితాత్ముండు నగు రాముఁడు ధనుర్ధరుండగు లక్ష్మణుఁడును [పెక్కువేల వానరులతోను వానరరాజగు సుగ్రీవునితోను గలసి వచ్చి] లంకాద్వారంబుఁ జేరియుండఁగాఁ జూడఁగలవు. ౪౭

నీ వింక శీఘ్రంబుగనే గోళ్లును గోఱలు నాయుధంబులుగాఁ గల్గినవారలును బరాక్రమవంతులును సింహశార్దూలంబులవంటి శౌర్యంబు గల

శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానామార్యే యూథాన్యనేకశః. ౫౦

స తు మర్మణి ఘోరేణ తాడితో మన్మథేషుణా,
న శర్మ లభతే రామస్సింహార్దిత ఇవ ద్విపః. ౫౧

మా రుదో దేవి శోకేన మాభూత్తే మనసోఽప్రియం,
శచీవ పత్యా శక్రేణ భర్త్రా నాథవతీ హ్యసి. ౫౨

రామాద్విశిష్టః కోఽన్యోఽస్తి కశ్చిత్సౌమిత్రిణా సమః,
అగ్నిమారుతకల్పౌ తౌ భ్రాతరౌ తవ సంశ్రయౌ. ౫౩

నాస్మింశ్చిరం వత్స్యసి దేవి దేశే
రక్షోగణైరధ్యుషితేఽతిరౌద్రే,
న తే చిరాదాగమనం ప్రియస్య
క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్. ౫౪

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకోనచత్వారింశస్సర్గః.

## చత్వారింశస్సర్గః

శ్రుత్వా తు వచనం తస్య వాయుసూనోర్మహాత్మనః,
ఉవాచాత్మహితం వాక్యం సీతా సురసుతోపమా. ౧

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర,
అర్ధసంజాతసస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా. ౨

వారలును గజేంద్రంబులవంటి మేనుగలవారలు నగువానరులు లంకాద్వారం బునం జేరియుండుటం జూడఁగలవు. ౪౯

భూజ్యారాలవగు సీతాదేవీ! నీ వింక శీఘ్రముగానే పర్వతాకారులును మేఘంబులకటి మేను గలవారలు నగు వానరశ్రేష్ఠులు గుంపులు గుంపులుగా లంకామలయసానువులం జేరి సింహనాదంబును గావించుటం జూడఁగలవు.

ఆరాముండును భయంకరంబులగు మన్మథబాణంబులచే మిక్కిలియుం బాధింపంబడి సింహంబుచేతం జిక్కిన యేనుంగుంబోలె సుఖంబు నొంద కున్నాఁడు. ౫౧

సీతాదేవీ! నీవిట్లుశాఘయుంబోలె రోదనంబు సేయకుము. మనంబున దుఃఖం బుంచకుము. శచీదేవికి దేవేంద్రుండుంబోలె నీకు నాథుఁడు రాముఁ డున్నాఁడు గదా! ౫౨

లోకంబున రామునికన్న నధికుఁ డెవ్వఁ డున్నాఁడు? లక్ష్మణునకు సరియయినవాఁ డెవ్వఁడు? నీ కాశ్రయులయిన యీ యన్నదమ్ము లిద్దఱును అగ్నివాయువులకు సరివత్తురు. ౫౩

సీతాదేవీ! రాక్షసుల కునికిపట్టయిన భయంకరమగు నీదేశమునందు నీ వింక బహుకాలం బుండవలసినది లేదు. నీపెనిమిటి రాముఁ డింక శీఘ్రంబు గానే యిచ్చటికి వచ్చును. నేను బోయి రాముం జేరునంతవఱకుమాత్ర మోర్చియుండుము. నేను బిలుచుకొనివచ్చెదను. అని హనుమంతుఁడు సీతా దేవితోఁ జెప్పెను. ౫౪

ఇది ముప్పదితొమ్మిదవ సర్గము.

## నలువదియవ సర్గము

దేవకన్యకతోఁ బోల్పఁగల సీతాదేవి మహాత్ముండును వాయుపుత్రుండు నగు నా హనుమంతుండు చెప్పిన మాటను విని తనకు హితముగా నిట్లని చెప్పెను. ౧

హనుమంతుఁడా! నాకుఁ బ్రియవార్తం జెప్పునట్టి నిన్నుఁ జూచుట వలన వానగురిసినపిమ్మట భూమియందు సగముపైరు మొలచునట్లు నాకు సగము కార్యసిద్ధియయినదని మిక్కిలి సంతోషించుచున్నాను. ౨

యథా తం పురుషవ్యాఘ్రం గాత్రైశ్శోకాభికర్శితైః,
సంస్పృశేయం సకామాహం తథా కురు దయాం మయి. 3

అభిజ్ఞానం చ రామస్య దద్యా హరిగణోత్తమ,
క్షిప్తామిషీకాం కాకస్య కోపాదేకాక్షిశాతనీమ్. ౪

మనశ్శిలాయా స్తిలకో గండపార్శ్వే నివేశితః,
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి. ౫

స వీర్యవాన్కథం సీతాం హృతాం సమనుమన్యసే,
వసంతీం రక్షసాం మధ్యే మహేంద్రవరుణోపమః. ౬

ఏష చూడామణిర్దివ్యో మయా సుపరిరక్షితః,

ఏతం దృష్ట్వా ప్రహృష్యామి వ్యసనే త్వామివానఘ. ౭

ఏష నిర్యాతితశ్శ్రీమాన్మయా తే వారిసంభవః,

అతః పరం న శక్ష్యామి జీవితుం శోకలాలసా. ౮

అసహ్యాని చ దుఃఖాని వాచశ్చ హృదయచ్ఛిదః,
రాక్షసీనాం సుఘోరాణాం త్వత్కృతే మర్షయామ్యహమ్. ౯

ధారయిష్యామి మాసం తు జీవితం శత్రుసూదన,
ఊర్ధ్వం మాసాన్న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ. ౧౦

మన్మథపీడితనైన నే నిట్లు దుఃఖంబునం గృశించియుండు నవయవంబులచేతఁ బురుషశ్రేష్ఠుం డగురాముని దాఁకునట్లు నాయందు దయయుంచి సంఘటింపుము. ౩

వానరశ్రేష్ఠుండగు హనుమంతుఁడా! రాముఁడు కోపంబునఁ గాకముపైఁ దృణంబు ప్రయోగించి వానికంటి నొకటి భేదించినసమాచారము నొక్కగుఱుతుఁ జెప్పితినిగదా! ఇఁకను మఱియొక్కగుఱుతుం జెప్పెదను.

ఒకనాఁడు నానుదుటిమీఁద బొట్టు కరఁగి కనుపడకుండఁగా నీవు మణిశిలను బొట్టుగాచేసి నానుదుటం బ్రతిఫలించి బొట్టుగా గనుపట్టుచుండునట్లు నాయెదుట నుండిన గుండ్రాయిపై నుంచినావు. దానిం దలంచుకొనుము. ౪

రాముఁడా! నీవు మహాపరాక్రమశాలివి. దేవేంద్రునకును వరుణునకును సరివచ్చువాఁడవు. పూర్వము నన్ను హింసించిన కాకాదులపై మహాకోపంబుఁ జూపినవాఁడవు. అట్టినీవు నేను రావణునిచే నపహరింపఁబడి యిట్లు రాక్షసులనడుమ నుండఁగా నెట్లుపేక్షించియున్నావు? ౫

శ్రేష్ఠమయిన యీచూడామణిని నే నిట్టిదుఃఖకాలంబునందును జాగ్రతతోఁ గాపాడినాను.

పాపరహితుండవగు రాముఁడా! నాకు మిక్కిలియుం దుఃఖము గలిగినప్పుడు నే నీచూడామణిం జూచి నిన్నుజూచినట్లు సంతోషంబునొందుదును.

శ్రీమంతంబును రత్నాకరంబగు సముద్రంబునం బుట్టినదియు నగు నీ చూడామణింగూడ నీకొఱ కిప్పుడు పంపినాను.

కొంచె మూఱట గలిగించునట్టి యీచూడామణియుం లేదు. కావున నింక నే నిట్టిదుఃఖము సహించి బ్రదుకంజాలను. ౭

నేను జీవించియున్న నెట్టయిన నీతో సంగమంబు గల్గు ననునాసచేత నోర్వరానిదుఃఖంబులను భయంకరాకారములయిన యారాక్షసస్త్రీలాడు దుర్వాక్యంబులను సహించి బ్రతికియున్నాను. ౮

శత్రువులం జంపునట్టి రాముఁడా! నే నింక నొక్కనెలమాత్రము ప్రాణములు ధరించియుండెదను. నెలకుఁ బైగా నొక్కక్షణమయినను నిన్ను విడిచి బ్రతుకంజాలను. ౧౦

ఘోరో రాక్షసరాజోఽయం
దృష్టిశ్చ న సుఖా మయి,
త్వాం చ శ్రుత్వా విపద్యంతం
[త్వాం చ శ్రుత్వా విషజ్జంతం]
న జీవేయ మహం క్షణమ్. ౧౧

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితం,
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్మారుతాత్మజః. ౧౨

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే,
రామే దుఃఖాభిభూతేతు లక్ష్మణః పరితప్యతే. ౧౩

కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుం,
ఇమం ముహూర్తం దుఃఖానామంతం ద్రక్ష్యసి భామిని. ౧౪

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్త్రావరిందమౌ,
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః. ౧౫

హత్వా తు సమరే క్రూరం రావణం సహబాంధవం,
రాఘవౌ త్వాం విశాలాక్షి స్వాం పురీం ప్రాపయిష్యతః. ౧౬

యత్తు రామో విజానీయాదభిజ్ఞానమనిందితే,
ప్రీతిసంజననం తస్య భూయస్త్వం దాతుమర్హసి. ౧౭

సాఽబ్రవీద్దత్తమేవేతి మయాభిజ్ఞానముత్తమం,
ఏతదేవహి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్. ౧౮
శ్రద్ధేయం హనుమన్వాక్యం తవ వీర భవిష్యతి,

రాక్షసేశ్వరుఁడగు నీరావణుఁ డతిభయంకరుఁడు. నన్నుఁ దిన్నఁగా నైనఁ జూడఁడు. మఱియు నీవును దుఃఖితుండవగుటను విన్నాను.(పాఠాంతర పక్షమందు "నీవు నుపేక్షించి యాలస్యము సేయుటయు నెఱింగినపిమ్మట") నేను మాసమునకుఁ బిమ్మట క్షణమయినను బ్రతుకఁజాలను. అని సీతాదేవి రామునిం బేర్కొని విలపించినది. ౧౧

సీతాదేవి కన్నీళ్లొలికించుచుఁ జెప్పిన దుఃఖకరంబగు మాటను విని వాయుదేవునికుమారుండగు హనుమంతుం డిట్లని చెప్పెను. ౧౨

సీతాదేవీ! నీదుఃఖంబుననే రాముఁ డేమియుం దోఁచక కార్యంబుల యెడ విముఖుఁడై యున్నాఁడు. నీకు నమ్మకముగలుగుటకై సత్యంబుచే శపథము చేసెదను. అట్లు రాముండు దుఃఖంబునొందఁగానే లక్ష్మణుఁడును దుఃఖము నొందుచున్నాఁడు. ౧౩

అతిప్రయాసముచేత నీవు నా కగపడినావు. ఇప్పుడు సంతోషింప వలయునుగాని దుఃఖింపరాదు. ఇంక నతిశీఘ్రంబుననే నీదుఃఖంబులన్నియు నశించును. ౧౪

పురుషశ్రేష్ఠులును శత్రువుల నడంగఁద్రొక్కఁజాలినవారలును రాచ కుమారులును నిన్నుఁ జూడ నుత్సాహంబు గలవారలు నగు నారామలక్ష్మణు లిద్దఱును ఈ లంకాపట్టణమును భస్మంబు గావింతురు. ౧౫

విశాలంబులగు కండ్లుగల సీతాదేవీ! ఆరామలక్ష్మణులు యుద్ధంబునఁ గ్రూరుండగు రావణుని సమస్తబంధువులతోడం జంపి నిన్నుఁ దమ యయోధ్యాపురికిం దోడ్కొనిపోవుదురు. ౧౬

ఎవ్వరిచేతను నిందింపఁబడని సీతాదేవీ! ఇంకను దేనిని రాముఁ డెఱుంగునో అట్టిగుఱుతు నొకటి రామునకు సంతోషంబు గల్గించుదానిని నీవు నా కీయవలయును. అని హనుమంతుఁడు సీతాదేవితోఁ జెప్పెను. ౧౭

పరాక్రమశాలివగు హనుమంతుఁడా! నేను నీ కుత్తమం బయిన గుఱుతు నిచ్చియున్నాను. నా తలవెండ్రుకలకు భూషణమయిన చూడామణిం జూడఁగానే రామునకు నీమాటయందు నమ్మకంబు గల్గును. అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౧౮

స తం మణివరం గృహ్య శ్రీమాన్ ప్లవగసత్తమః. ౧౯
ప్రణమ్య శిరసా దేవీం గమనాయోపచక్రమే,

తముత్పాతకృతోత్సాహమవేక్ష్య హరిపుంగవమ్. ౨౦
వర్ధమానం మహావేగమువాచ జనకాత్మజా,
అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పగద్గదయా గిరా, ౨౧

హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవంచ సహామాత్యం సర్వాన్బ్రూయాహ్యనామయమ్. ౨౨

యథాచ స మహాబాహుర్మాం తారయతి రాఘవః,
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్త్వం సమాధాతుమర్హసి. ౨౩
ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభిః పరిభర్త్సనం చ,
బ్రూయాస్తు రామస్య గతస్సమీపం
శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర. ౨౪
స రాజపుత్ర్యా ప్రతివేదితార్థః
కపిః కృతార్థః పరిహృష్టచేతాః,
అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం
దిశం హ్యుదీచీం మనసా జగామ. ౨౫

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చత్వారింశస్సర్గః.

## ఏకచత్వారింశస్సర్గః

స చ వాగ్భిః ప్రశస్తాభిర్గమిష్యన్ పూజితస్తయా,
తస్మాద్దేశాదపక్రమ్య చింతయామాస వానరః. ౧

శ్రీమంతుండును వానరశ్రేష్ఠుండు నగుహనుమంతుడు మణిశ్రేష్ఠం
బగు నాచూడామణిం దీసికొని సీతాదేవికి సాష్టాంగముగ నమస్కారంబు
గావించి పయనంబు కాఁ గోరెను. ౧౯

మరల సముద్రంబు నవ్వలిగట్టునకుఁబోవుటకై యాకాశంబున కెగురం
జూచుచు దేహంబుఁ బెంచుచున్న మహావేగుండగుహనుమంతుని జూచి సీతా
దేవి దుఃఖంబునొంది ముఖంబునిండఁ గన్నీళ్లుగ్రమ్మ డగ్గుత్తిక గదుర నిట్లని
చెప్పెను. ౨౦, ౨౧.

హనుమంతుఁడా! సింహంబులం బోలునట్టి యన్నదమ్ములు రామలక్ష్మ
ణులకును సుగ్రీవునకును అతని మంత్రులకును అందఱికిని నేను క్షేమంబుగ
నున్నానని చెప్పుము. ౨౨.

మహాబాహుండగు నారాముం డిచ్చటికి వచ్చి నాదుఃఖంబుఁ బోఁ
గొట్టునట్లు నీవు రామునకుఁ దగుమాటలం జెప్పవలయును. ౨౩

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీవు రామునియొద్దకుఁ బోయి
నంతనె నే ననుభవించుచుండు నీదుఃఖమును ఇట్లు రాక్షసులు నన్ను బెద
రించుటను వీనినంతయు వివరముగా రామునకుం జెప్పుము. నీకు మార్గమున
సుఖంబు గలుగుఁగాక! అని సీతాదేవి హనుమంతునకుం జెప్పెను. ౨౪

ఆ హనుమంతుఁడు రాచకొమార్తెయగు సీతాదేవి చెప్పిన యభిజ్ఞానం
బులను గ్రహించి కృతార్థుండై పరమసంతోషంబునొంది "ఇంకఁ జేయ
వలసినది కొంచెమె యున్న" దని యోజించి మనంబున నుత్తరపుదిక్కునకుం
బోఁగోరెను. ౨౫

ఇది నలువదియవ సర్గము.

## నలువదొకటవ సర్గము

ఆ హనుమంతుఁడు రామునొద్దకుఁ బయనంబయి యాసీతాదేవిచేత
నుత్తమవాక్యంబులం గొనియాడంబడి యాప్రదేశంబును విడిచి కొంత
యవ్వలి కరిగి యిట్లని యాలోచించెను. ౧.

అల్పశేషమిదం కార్యం దృష్టేయమసితేక్షణా,
త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ విద్యతే. ౨

న సామ రక్షస్సు గుణాయ కల్పతే
న దానమర్థోపచితేషు యుజ్యతే,
న భేదసాధ్యా బలదర్పితా జనాః
పరాక్రమస్త్వేవ మమేహ రోచతే, 3

న చాస్య కార్యస్య పరాక్రమాదృతే వినిశ్చయః కశ్చిదిహోప
పద్యతే, హత ప్రవీరాహి రణే హి రాక్షసాః కథంచిదీయుర్యది
హాద్య మార్దవమ్. ౪

కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్,
పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తుమర్హతి. ౫

న హ్యేకస్సాధకో హేతుస్స్వల్పస్యాపీహ కర్మణః,
యో హ్యర్థం బహుధా వేద స సమర్థోఽర్థసాధనే. ౬

ఇహైవ తావత్కృతనిశ్చయో హ్యహం
యది వ్రజేయం ప్లవగేశ్వరాలయం,
పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవి
త్తతః కృతం స్యాన్మమ భర్తృశాసనమ్. ౭

కథం ను ఖల్వద్య భవేత్సుఖాగతం
ప్రసహ్య యుద్ధం మమ రాక్షసైస్సహ,
తథైవ ఖల్వాత్మబలం చ సారవ
త్సంమానయేన్మాం చ రణే దశాననః. ౮

సీతాదేవిం జూచినాను. ఇంక రావణునిహృదయముం దెలిసికొనుటయు కావలసినది. ఈ విషయమునందు సామదానభేదములు మూఁడుపాయంబు లుతు బనికిరావు. చాలవదగు దండోపాయమునే ప్రయోగించవలసి యున్నది. ౨

రావణుఁడు రాక్షసుఁడు గావున నతనియందు సామోపాయముఁ బ్రయోగించుటవలన నేమియుఁ బ్రయోజనము గలుగదు. మిక్కిలి ధన వంతుఁడు గావున దానోపాయంబును బనికిరాదు. బలంబుచేఁ గ్రొవ్వి యున్నాఁడు గావున భేదమునకును లొంగఁడు. ఇంకఁ బరాక్రమంబుచే నాక్రమింపవలయునని నాకుఁ దోఁచుచున్నది. ౩

ఈకార్యంబు సాధించుటకుఁ బరాక్రమంబుకన్న వేఱేయుపాయ మేదియుం లేదు. ఇప్పుడు నేను యుద్ధముచేసి కొందఱరాక్షసవీరులం జంపుదు నేని యీరాక్షసు లెట్టయినఁ గొంచెము మృదుత్వము నొందుదురు. ౪

ఎవ్వఁడు తన కాజ్ఞాపింపఁబడిన కార్యమును నెఱవేర్చి యందుకు విరోధము లేకుండునట్లు ఇతరంబులఁ బెక్కుకార్యంబులను సాధించునో అతండె కార్యము సేయఁదగినవాఁడు. ౫

ఒక్కకారణముమాత్రము గొని స్వల్పకార్యమైనను సాధింపనలవి గాదు. ఇంక మహాకార్యము నెట్లు సాధింపవచ్చును? కావున నేను సీతం జూచుటమాత్రముననె యేమిఫలము! ఎవ్వఁడు కార్యమునకు సాధకములయిన నానావిధోపాయముల నెఱుంగునో యతండె కార్యంబు సాధింపఁగలఁడు గాని యితరున కలవిగాదు. ౬

నే నిచ్చటనె రావణునిబలముల నిశ్చయించుకొని రాక్షసులయందును మనవానరులయందునుం గల యుద్ధమునందలి తారతమ్యముం దెలిసికొని కిష్కింధకుఁ బోవుదునేని యప్పుడు నేను సుగ్రీవునియాజ్ఞను జక్కఁగా నెఱవేర్చినవాఁడ నగుదును. ౭

ఇప్పుడు నాకు రాక్షసులతోడ యుద్ధం బనాయాసంబుగా నేయుపా యంబునం గలుగును? యుద్ధంబు చేసిననేకదా రావణుండు తనవారిబలమును నాబలమును జక్కఁగాఁ దెలిసికొనును. ౮

తతస్సమాసాద్య రణే దశాననం
సమంత్రివర్గం సబలప్రయాయినం,
హృది స్థితం తస్య మతం బలం చ వై
సుఖేన మత్వాహమితః పునర్వ్రజే. ౯
ఇదమస్య నృశంసస్య నందనోపమముత్తమం,
వనం నేత్రమనఃకాంతం నానాద్రుమలతాయుతమ్. ౧౦
ఇదం విధ్వంసయిష్యామి శుష్కం వనమివానలః,
అస్మిన్ భగ్నే తతః కోపం కరిష్యతి దశాననః. ౧౧
తతో మహాత్సాశ్వమహారథద్విపం
బలం సమాదేక్ష్యతి రాక్షసాధిపః,
త్రిశూలకాలాయసపట్టిసాయుధం
తతో మహద్యుద్ధమిదం భవిష్యతి. ౧౨
అహం తు తైస్సంయతి చండవిక్రమై
స్సమేత్య రక్షోభిరసహ్యవిక్రమః,
నిహత్య తద్రావణచోదితం బలం
సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్. ౧౩
తతో మారుతవత్క్రుద్ధో మారుతిర్భీమవిక్రమః,
ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమథారభత్. ౧౪

తతస్తు హనుమాన్వీరో బభంజ ప్రమదావనం,
మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమలతాయుతమ్. ౧౫

తద్వనం మథితైర్వృక్షైర్భిన్నైశ్చ సలిలాశయైః,
చూర్ణితైః పర్వతాగ్రైశ్చ బభూవాప్రియదర్శనమ్. ౧౬

నేనంత యుద్ధంబున మంత్రిసమూహముతోను సేనాధిపతులతోఁ గూడియున్న రావణు నెదుర్కొని యతనిమనమునందు భావము నతనిబల మును సుఖముగాఁ దెలిసికొని యిచ్చటనుండి పోయెదను.

క్రూరుండగు నీరావణునిదైన యీయశోకవన ముత్తమంబయి కంటి కును మనమునకును సంతోషము గలుగుచు నానావిధములగు వృక్షములను తీఁగెలను గలిగి నందనవనముకరణిం గనుపట్టుచున్నది. ౧౦

అగ్నిహోత్రుం డెండినయడవి నేర్చుచందమున నేనీయశోకవనము విఱిచెదను. నేను దీనిని విఱువఁగా రావణునకు నాపైఁ గోపమువచ్చును. ౧౧

అంత రాక్షసేశ్వరుండగు రావణుండు గుఱ్ఱములతోను రథములతోను గజములతోఁ గూడి త్రిశూలములు నినుపకట్టిన ఖలులను దాల్చియుండు నట్టి గొప్పసేనం బంపును. అంత నాకును వారికిని నేను గోరినట్లు గొప్ప యుద్ధము గలుగును. ౧౨

ఓర్వఁగూడని పరాక్రమముగల నేనును భయంకరపరాక్రమశాలు రగు నా రాక్షసుల నెదిరించి యుద్ధమున నా రావణుండు పంపిన సేననంతయుం జంపి సుఖముగాఁ గిష్కింధకుఁ బోయెదను. అని హనుమంతుం డాలో చించెను. ౧౩

ఆప్రకారముగా నాలోచించి భయంకరం బగు పరాక్రమము గల వాయుపుత్రుం డగు హనుమంతుఁడు కోపమువహించి వాయుదేవునిభంగి నపారం బగునూరువేగమున వృక్షములం బడఁద్రోయ నారంభించెను. ౧౪

అంతఁ బరాక్రమవంతుం డగుహనుమంతుఁడు మదించి మనోహర ముగాఁ గూయుచున్న పక్షులతో నొప్పుచు నానావిధములగు వృక్షములను దీఁగెలునుం గలిగియున్న యంతఃపురవనమును విఱిచెను. ౧౫

అట్లు వృక్షములు విఱువఁబడియుఁ గొలంకులు పగులఁగొట్టఁబడియుఁ గ్రీడాపర్వతశిఖరములు చూర్ణితములయ్యునుండుటంజేసి యాయశోకవనము వికృతముగాఁ గానంబడియెను. ౧౬

నానాశకుంతవిరుతైః ప్రభిన్నైస్సలిలాశయైః,
తామ్రైః కిసలయైః క్లాంతైః క్లాంతద్రుమలతాయుతమ్. ౧౭
న బభౌ తద్వనం తత్ర దావానలహతం యథా,
వ్యాకులావరణా రేజుర్విహ్వలా ఇవ తా లతాః. ౧౮

లతాగృహైశ్చిత్రగృహైశ్చ నాశితై
ర్మహోరగై ర్వ్యాళమృగైశ్చ నిర్ధుతైః,
శిలాగృహైరున్మథితై స్తథా గృహైః
ప్రణష్టరూపం తదభూన్మహద్వనమ్. ౧౯
సా విహ్వలా శోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా,
జాతా దశాస్యప్రమదావనస్య
కపే ర్బలాద్ధి ప్రమదావనస్య. ౨౦
స తస్య కృత్వాఽర్థపతేర్మహాకపి
ర్మహద్వ్యళీకం మనసో మహాత్మనః,
యుయుత్సురేకో బహుభిర్మహాబలై
శ్శ్రియా జ్వలన్ తోరణమాస్థితః కపిః. ౨౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకచత్వారింశస్సర్గః.

## ద్విచత్వారింశస్సర్గః

తతః పక్షినినాదేన వృక్షభంగస్వనేన చ,
బభూవుస్త్రాససమ్భ్రాంతాస్సర్వే లంకానివాసినః. ౧
విద్రుతాశ్చ భయత్రస్తా వినేదుర్మృగపక్షిణః,

అచ్చట పత్రములు దీఁగెలును చిగురులును వాడియుండుటచేతను బక్షులు భయమున నానావిధధ్వనులు చేయుచుండుటచేతను గొలఁకులన్నియుం నాశము నొందియుండుటవలనను అయశోకవనము దావానలమున దగ్ధమయినట్లు ఎంత మాత్రము ప్రకాశము లేకుండెను. ౧౭

అచ్చటితీఁగెలు ప్రాఁకుమానులు వికలిగిపడియుండుటంజేసి మిక్కిలి దుఃఖమునొందిన స్త్రీలపోల్కిం గాఁపట్టుచుండినవి. ౧౮

లతాగృహములును చిత్రగృహములు నాశమునొందియుం మహాసర్పములును దుష్టమృగములు ఎల్లెడలం బడవేయఁబడియుం శిలాగృహములును సాధారణములగు గృహములును బగులఁగొట్టఁబడియు నుండుటవలన నాయశోకవనము ఎంతమాత్రము సౌందర్యము లేకుండెను. ౧౯

రావణునిభార్యలకు సమస్తభోగము లొసంగుచు నెంతమాత్రము బాధలేకుండుటవలన దుఃఖము నొందకుండినది. తీఁగెల నొప్పుచున్న యాయంతఃపురవనము హనుమంతునిచే విఱువఁబడి అందలి తీఁగెలన్నియుం దుఃఖము నొందినట్లు గాఁపట్టుచుండినవి. ౨౦

ఆహనుమంతుఁ డట్లు మహాపరాక్రమశాలియుం ధనవంతుండు నగురావణుని మనంబునకు గొప్ప యప్రియంబు గావించి తానొక్కఁడే మహాబలశాలురగు పెక్కురాక్షసులతో యుద్ధంబుసేయ నడుకట్టి కాంతిం దేజరిల్లుచు నాయశోకవనంబు వెలుపలిద్వారంబున నుండెను. ౨౧

ఇది నలువదియొకటవ సర్గము.

## నలువదిరెండవ సర్గము

అంత లంకలో నుండువారందఱును బక్షులధ్వనులను వృక్షంబుల విఱుచు శబ్దంబులను విని భయంబును దొట్రుపాటునుం బొందిరి. ౧

మృగంబులును బక్షులును మహాభయంబు నొంది నలుదెసలకుం బఱచుచు నఱచినవి.

రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతివేదిరే. ౨

తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః,
తద్వనం దదృశుర్భగ్నం తం చ వీరం మహాకపిమ్. 3

స తా దృష్ట్వా మహాబాహుర్మహాసత్త్వో మహాబలః,
చకార సుమహద్రూపం రాక్షసీనాం భయావహమ్. ౪

తతస్తం గిరిసంకాశ మతికాయం మహాబలం,
రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛుర్జనకాత్మజామ్. ౫
కోఽయం కస్య కుతో వాయం కిన్నిమిత్త మిహాగతః,
కథం త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత, ౬

ఆచక్ష్వ నో విశాలాక్షి మాభూత్తే సుభగే భయం,
సంవాదమసితాపాంగే త్వయా కిం కృతవానయమ్. ౭

అథాబ్రవీన్మహాసాధ్వీ సీతా సర్వాంగసుందరీ,

రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః. ౮

యూయమేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి,
అహిరేవ హ్యహేః పాదాన్విజానాతి న సంశయః. ౯

అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కోన్వయం,

అంత రాక్షసులకు నాశంబుగల్గునని సూచించునట్టి భయంకరంబులైన యశుభనిమిత్తంబులును దోఁచినవి. ౨

అంత వికృతంబులగు ముఖంబులు గల రాక్షసస్త్రీలు అధ్వనికి నిద్ర మేల్కొని నాశంబు నొందియున్న యాయశోకవనంబును మహాకాయుం డైయున్న పరాక్రమవంతుండగు హనుమంతుం జూచిరి. ౩

మహాబాహుండును మహాపరాక్రమశాలియు మహాభుజుండు నగు నా హనుమంతుండు ఆరాక్షసస్త్రీలు తన్నుఁజూచుటం జూచి వారలకు భయంబు గల్గునట్లు భయంకరమయిన గొప్పదేహము దాల్చెను. ౪

అంత నారాక్షసస్త్రీలు పర్వతంబంతటి మహాదేహంబుదాల్చియున్న మహాబలుండగు నాహనుమంతుం జూచి సీతాదేవి నిట్లని ప్రశ్నించిరి. ౫

ఇతం డెవ్వఁడు? ఎవఁడు పంపఁగా వచ్చినాఁడు? ఎచ్చటనుండి వచ్చినాఁడు? ఇచ్చట కెందులకు వచ్చినాఁడు? నీతో నెందులకు సంభాషణము చేసినాఁడు? ౬

నల్లనికడకండ్లుకలదానవు పెద్దకండ్లుగలదానవు మనోహరురాల వగు సీతాదేవీ! వానరుండు నీతో నేమి మాటలాడినాఁడు? నీవు భయపడవలదు. మాకు సవిస్తరముగాఁ జెప్పుము. అని రాక్షసులు సీతాదేవి నడిగిరి. ౭

అంతఁ బతివ్రతలలో నుత్తమురాలును సమస్తావయవంబులందును సౌందర్యంబుగలదియు నగు సీతాదేవి యిట్లని చెప్పెను.

భయంకరంబులగు నానావిధరూపంబులు ధరించునట్టి రాక్షసులకెఱుం గుటకు శక్తి నాకులేదు. ౮

పాము పాదంబులు పామునకే తెలియునుగాని మఱియొవ్వరికిఁ దెలియవు. అట్లు మీరు రాక్షసులు గావున రాక్షసులసంగతి మీకే తెలియును. కావున నీ వానరుం డెవ్వఁడో యేమిచేయునో యీ సమాచారమంతయు మీకే తెలియును. ఇందు సందియములేదు. ౯

నేనును ఇతనింజూచి భయపడియున్నాను. ఇతఁ డెవ్వఁడో నాకుం దెలియలేదు. ఇతం డెవ్వండు? మీరలే చెప్పుఁడు.

వేద్మి రాక్షసమేవైనం కామరూపిణమాగతమ్. ౧౦

వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా దిశః,
స్థితాః కాశ్చిద్గతాః కాశ్చిద్రావణాయ నివేదితుమ్. ౧౧

రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః,
విరూపం వానరం భీమమాఖ్యాతుముపచక్రముః. ౧౨

అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః,
సీతయా కృతసంవాదస్తిష్ఠత్యమితవిక్రమః. ౧౩

న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా,
అస్మాభిర్బహుధా పృష్టా నివేదయితుమిచ్ఛతి. ౧౪
వాసవస్య భవేద్దూతో దూతో వైశ్రవణస్య వా,
ప్రేషితో వాపి రామేణ సీతాన్వేషణకాంక్షయా. ౧౫

తేన త్వద్భుతరూపేణ యత్తత్తవ మనోహరం,
నానామృగగణాకీర్ణం ప్రమృష్టం ప్రమదావనమ్. ౧౬

న తత్ర కశ్చిదుద్దేశో యస్తేన న వినాశితః,

యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః, ౧౭

జానకీరక్షణార్థం వా శ్రమాద్వా నోపలభ్యతే,

నా కీవానరుని జూడఁగా నిచ్ఛకు వచ్చినరూపంబు దాల్చిన రాక్షసుండె యిట్లు వానరరూపంబు దాల్చి వచ్చియుండునని తోఁచుచున్నది. అని సీతాదేవి రాక్షసస్త్రీలతోఁ జెప్పినది. ౧౦

సీతాదేవి చెప్పినమాటను విని యారాక్షసస్త్రీలు భయంబున దిక్కులకుం బఱచిరి. కొందఱు సీతారక్షణార్థమయి యచ్చట నుండిరి. కొందఱీవృత్తాంతము రావణునకుం దెలుపఁబోయిరి. ౧౧

వికృతంబు లగుముఖంబులు గలరాక్షసస్త్రీలు రావణునిసమీపంబునకుఁ బోయి మహాకాయుండును భయంకరుండు నగుహనుమంతుని గూర్చి చెప్పసాగిరి. ౧౨

రావణుఁడా! భయంకరంబైనదేహము గలవాఁడును కొలందిలేనిపరాక్రమంబు గలవాఁడు నగువానరుం డొక్కఁడు సీతతో సంభాషించి యశోకవనమునడుమ నున్నాఁడు. ౧౩

జింకకండ్లవంటికండ్లుగలదియు జనకమహారాజపుత్త్రియు నగుసీత మేము నానావిధముల నడిగినను ఆవానరునిసంగతిం జెప్పకున్నది. ౧౪

ఆవానరుండు దేవేంద్రుండు పంపఁగా వచ్చినదూతయో! కుబేరునిదూతయో ? అట్లుగాక రాముండు సీతను వెదకుటకై పంపినదూతయో ? యేమియుం దెలియకున్నది.

నానావిధములగు మృగములతో నొప్పుచు మనోహరంబైయున్న యీ యంతఃపురవనంబంతయుం మహాకాయుండగు నావానరుండు తనదేహమునకు జూపఱు లచ్చెరువొంద నాశము నొందించెను. ౧౫

ఆయంతఃపురవనమునందు నాశమునొందింపని ప్రదేశ మొక్కటియును లేదు.

జనకమహారాజకుమార్తెయగు సీతాదేవి యున్నవృక్షము ఆ వానరుండు విఱువఁడయ్యె. ౧౬

అట్లతండు సీతయున్నవృక్షంబును సీతను రక్షించుటకై విఱువలేదో లేక యలసటవలననే విఱువఁడయ్యెనో తెలియలేదు.

అథవా కశ్చ్శ్రమ_స్తస్య సైవ తేనాభిరక్షితా. ౧౮

చారుపల్లవపుష్పాఢ్యం యం సీతా స్వయమాస్థితా,
ప్రవృద్ధశ్శింశుపావృక్షస్స చ తేనాభిరక్షితః. ౧౯

తస్యోగ్రరూపస్యోగ్ర ! త్వం దండమాజ్ఞాతుమర్హసి,
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్. ౨౦

మనః పరిగృహీతాం తాం తవ రక్షోగణేశ్వర,
కస్సీతామభిభాషేత యో న స్యాత్త్య క్తజీవితః. ౨౧

రాక్షసీనాం వచశ్శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
హుతాగ్నిరివ జజ్వాల కోపసంవర్తితేక్షణః. ౨౨

తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నాస్రబిందవః,
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషస్స్నేహబిందవః. ౨౩

ఆత్మనస్సదృశాన్ శూరాన్ కింకరాన్నామ రాక్షసాన్,
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః. ౨౪

తేషామశీతిసాహస్రం కింకరాణాం తరస్వినాం,
నిర్యయుర్భవనా త్తస్మాత్కూటముద్గరపాణయః. ౨౫
మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః,
యుద్ధాభిమనసస్సర్వే హనుమద్గ్రహణోద్యతాః. ౨౬

అటుగాజేసి అతనికి శ్రమం బెక్కడిది? సీతను రక్షించుటకే యతఁడు ఆచెట్టును విఱువఁడయ్యెను. ౧౮

సీతాదేవి తానే సుందరంబులయిన చిగురులతోను పువ్వులతోను వెలుఁగుచున్న యొక్క శింశుపావృక్షముకొద్దఁ బోయియుండినది. అతం డా శింశుపావృక్షముంగూడ విఱువఁడయ్యె. ౧౯

మహాకోపము గల రావణుఁడా! సీతతో సంభాషించి ఆయశోకవనము నంతయుం నశింపఁజేసి యిట్లు రెండువిధములగు మహాపరాధము గావించిన భయంకరాకారుండగు వానరునకు నీ విప్పుడు తీవ్రమయినశిక్ష యాజ్ఞాపింపవలయును. ౨౦

రాక్షసేశ్వరుండగు రావణుఁడా! బ్రతుక నిచ్చగలవాఁ డెవ్వఁడును నీవు మనంబునం బరిగ్రహించియున్నసీతతో మాటలాడఁడు. ఈవానరుండు మాటలాడినాఁడు. కావున నతం డింక బ్రతుకంజాలఁడు. అని రాక్షసస్త్రీలు రావణునితోఁ జెప్పిరి. ౨౧

రాక్షసేశ్వరుండగు రావణుండు రాక్షసస్త్రీలు చెప్పినమాటలు విని మహాకోపంబునొంది కండ్లు గుఱ్ఱు త్రిప్పుచు నేతిచే వ్రేల్వఁబడిన యగ్నిహోత్రంబు మండునట్లు మండెను. ౨౨

మండుచున్న దీపంబులనుండి మంటలతోఁగూడ నూనెబిందువులు నేలం బడునట్లు క్రుద్ధుఁడగు నారావణునినేత్రంబులనుండి మిక్కిలి వేఁడియయిన కన్నీటిబిందువులు పడినవి. ౨౩

అంత మహాపరాక్రమశాలి యగురావణుండు బలంబునం దనకు సమానులును శూరులు నగు కింకరులను రాక్షసులను హనుమంతుని నిగ్రహింప నాజ్ఞాపించెను. ౨౪

బలవంతు లగుకింకరులగురాక్షసు లప్పు డెనిమిదివేలమంది యుండిరి.

పెద్దకడుపు గలవారలును పెద్దకోఱలు గలవారలును భయంకరాకారులును మహాబలశాలులు నగు నాకింకరులను రాక్షసులందఱును కూటంబుల ముసుగుడియలను జేతులందాల్చి యుద్ధంబునకు సన్నద్ధులై హనుమంతునిం బట్టుకొనఁదలంచి యింటినుండి వెడలిరి. ౨౫,౨౬

తే కపీంద్రం సమాసాద్య తోరణస్థమవస్థితం,
అభిపేతుర్మహావేగాః పతంగా ఇవ పావకమ్. ౨౭

తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః,
ఆజఘ్ను ర్వానరశ్రేష్ఠం శరైశ్చాదిత్యసన్నిభైః. ౨౮

ముద్గరైః పట్టిసైశ్శూలైః ప్రాసతోమరశక్తిభిః,
పరివార్య హనూమంతం సహసా తస్థురగ్రతః, ౨౯

హనుమానపి తేజస్వీ శ్రీమాన్పర్వతసన్నిభః,
క్షితావావిధ్య లాంగూలం ననాద చ మహాస్వనమ్. 3౦
స భూత్వా సుమహాకాయో హనుమాన్మారుతాత్మజః,
ధృష్టమాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్. 3౧
తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా,
పేతుర్విహంగా గగనాదుచ్చైశ్చేదమఘోషయత్. 3౨

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః. 33

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః. 3౪

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః. 3౫
అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీం,
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్. 3౬

మహావేగులగు నాకింకరులు అశోకవనికబహిర్ద్వారంబున యుద్ధంబునకు సన్నద్ధుండైయున్న హనుమంతునింజూచి మిడుత లగ్నిహోత్రము పైకిం బోవునట్లు అతనిపైకిం బోయిరి. ౨౭

ఆకింకరులు వానరోత్తముం డగుహనుమంతుని నానావర్ణములయిన గదలచేతను బంగారముతో నలంకరింపఁబడిన యినుపగుదియలచేతను సూర్యుని భంగి వెలుంగుచున్న బాణంబులచేతనుం బ్రహరించిరి. ౨౮

ఆకింకరు లంత నినుపగుదియల నడ్డకత్తులను శూలంబుల నీఁటెలను దోమరంబులను జిల్లకోలలను ధరించి శీఘ్రంబున హనుమంతుం జుట్టుముట్టి యుండిరి. ౨౯

మహాపరాక్రమశాలియుం శ్రీమంతుండును బర్వతాకారుండు నగు హనుమంతుండు తోఁకను నేలపైఁ గొట్టి మహాధ్వని గల్గునట్లు అఱచెను. ౩౦

వాయుదేవునికుమారుం డగుహనుమంతుండు మఱియుం బెద్దరూపంబు ధరించి లంకయంతయుం శబ్దంబు నిండునట్లుగా గట్టిగా భుజంబు దట్టెను. ౩౧

భయంకరంబును బ్రతిధ్వనులు గలదియు నగు నాహనుమంతుని యాస్ఫోటితధ్వనిచేత నాకాశంబునుండి పక్షులు నేలఁబడినవి. అంత హనుమంతుండు ఇట్లని గట్టిగా నఱచెను ౩౨

మహాబలుం డగురాముండు జయంబు గల్గియున్నవాఁడు. మహాబలుం డగులక్ష్మణుండును జయంబు గల్గియున్నవాఁడు. వానరరాజగు సుగ్రీవుండును రామునిచేఁ బరిపాలితుండై జయంబు గల్గియున్నవాఁడు. ౩౩

నేను ఎట్టికార్యంబునందును క్లేశంబు నొందనివాఁడను గోసలదేశాధిపతియు నగురామునకు దాసుండను, హనుమంతుం డనుపేరు గలవాఁడను. శత్రుసైన్యంబులం జంపువాఁడను. వాయుదేవుని కుమారుండను. ౩౪

రాళ్లచేతను వృక్షములచేతను వేయివిధంబులం బ్రహరింపుచు విహారము చేయుచుండు నాకు యుద్ధమున వేయిమందిరావణులును సరికాఁజాలరు. ౩౫

నేను ఈ రాక్షసులందఱను జూచుచుండఁగానే యీలంకాపట్టణము నంతయుం నశింపఁజేసి సీతాదేవికి నమస్కారముచేసి కృతార్థుండనై రాముని యొద్దకుఁ బోయెదను. అని హనుమంతుఁడు గట్టిగా నఱచెను. ౩౬

తస్య సన్నాదశబ్దేన తేఽభవన్భయశంకితాః,
దదృశుశ్చ హనూమంతం సంధ్యామేఘమివోన్నతమ్. ౩౭

స్వామిసందేశనిశ్శంకా స్తత స్తే రాక్షసాః కపిం,
చిత్రైః ప్రహరణైర్భీమైరభిపేతు స్తత స్తతః. ౩౮

స తైః పరివృతశ్శూరైస్సర్వతస్సుమహాబలః,
ఆససాదాఽఽయసం భీమం పరిఘం తోరణాశ్రితమ్. ౩౯

స తం పరిఘమాదాయ జఘాన రజనీచరాన్,
స పన్నగమివాదాయ స్ఫురంతం వినతాసుతః. ౪౦
విచచారాంబరే వీరః పరిగృహ్య చ మారుతిః,
[సూదయామాస వజ్రేణ దైత్యానివ సహస్రదృక్.]
స హత్వా రాక్షసాన్వీరాన్ కింకరాన్మారుతాత్మజః. ౪౧
యుద్ధకాంక్షీ పునర్వీరస్తోరణం సముపాశ్రితః,

తత స్తస్మాద్భయాన్ముక్తాః కతిచి త్తత్ర రాక్షసాః. ౪౨
నిహతాన్ కింకరాన్ సర్వాన్ రావణాయ న్యవేదయన్,
స రాక్షసానాం నిహతం మహద్బలం
నిశమ్య రాజా పరివృత్తలోచనః,
సమాదిదేశాప్రతిమం పరాక్రమే
ప్రహ స్తపుత్త్రం సమరే సుదుర్జయమ్. ౪౩
ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్విచత్వారింశస్సర్గః

---

ఆకింకరులు ఆ హనుమంతుఁడు చేసిన మహాధ్వనికి భయమునొంది అప్పుడు సంధ్యాకాలంబునందలి మేఘముంబోలె నత్యున్నతుఁడై రక్తవర్ణుండై క్రాలుచున్న హనుమంతుం జూచిరి. ౩౬

అంత నాకింకరులు రాజాజ్ఞకు బద్ధులుకావున భయమువిడిచి యచ్చటచ్చట దూరముననుండి భయంకరములయిన నానావిధాయుధముల హనుమంతుం బ్రహరించిరి. ౩౭

అంత మహాబలుం డగుహనుమంతుండు నాలుగుప్రక్కలను క్రూరులగు నాకింకరులచేతఁ బరివేష్టింపఁబడినవాఁడై ఆద్వారముననున్న భయంకరమగు నినుపగుదియయొద్దకుఁ బోయెను. ౩౮

ఆహనుమంతుండు ఆయినుపగుదియం దీసికొని రాక్షసులం జంపెను.

పరాక్రమశాలి యగు నాహనుమంతుఁడు గరుత్మంతుఁడు సర్పంబుఁ దీసికొనునట్లు ఆయినుపగుదియం దీసికొని చేతంబట్టుకొని యాకాశంబున విహరించుచు [వజ్రపాణి యగునింద్రునట్లు] రాక్షసులఁ జంపఁదొడఁగెను. ౪౦

వాయుపుత్రుండును పరాక్రమవంతుండు నగుహనుమంతుఁడు వీరులగు నాకింకరులను రాక్షసులం జంపి మరల యుద్ధముఁగోరి యాబహిర్ద్వారంబుననె యుండెను. ౪౧

అంత నచ్చటనుండి భయంబునం బాఱినకొందఱు రాక్షసులు కింకరులందఱు హనుమంతునిచేఁ జంపఁబడిరి. అని రావణునకుం జెప్పిరి. ౪౨

రావణుండు కింకరులందఱును జంపఁబడుటను విని కోపంబునఁ గండ్లు త్రిప్పుచుఁ బరాక్రమంబున నెదురులేనివాఁడును యుద్ధంబున జయింప నలవిగానివాఁడు నగు ప్రహస్తపుత్రుని హనుమంతునిపైకిఁ బోవ నాజ్ఞాపించెను.

ఇది నలువదిరెండవ సర్గము.

## త్రిచత్వారింశస్సర్గః

తతస్స కింకరాన్హత్వా హనుమాన్ధ్యానమాస్థితః.
వనం భగ్నం మయా చైత్యప్రాసాదో న వినాశితః. ౧

తస్మాత్ప్రాసాదమప్యేవం భీమం విధ్వంసయామ్యహం,
ఇతి సంచిన్త్య మనసా హనుమాన్ దర్శయన్ బలమ్. ౨
చైత్యప్రాసాదమాప్లుత్య మేరుశృంగమివోన్నతం,
ఆరురోహ కపిశ్రేష్ఠో హనుమాన్మారుతాత్మజః. ౩

ఆరుహ్య గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః,
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః. ౪

సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్యప్రాసాదముత్తమం,
హనుమాన్ ప్రజ్వలన్ లక్ష్మ్యా పారియాత్రోపమోఽభవత్. ౫

స భూత్వా సుమహాకాయః ప్రభావాన్మారుతాత్మజః,
ధృష్టమాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్. ౬

తస్యాస్ఫోటితశబ్దేన మహతా శ్రోత్రఘాతినా,
పేతుర్విహంగమాస్తత్ర చైత్యపాలాశ్చ మోహితాః. ౭

అస్త్రవిజ్జయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః. ౮

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః,
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః. ౯

## నలుపదిమూఁడవ సర్గము

అహనుమంతుఁ డిట్లు కింకరులం జంపి యంత నిట్లని యాలోచించెను. నే నశోకవనమును విఱిచినానుగాని దేవాలయమువంటి యీ మేడను విఱువనైతిని. ౧

అందువలన నే నీచైత్యప్రాసాదంబునుంగూడఁ బగులఁగొట్టెదను. అని హనుమంతుం డాలోచించెను. ౨

వానరశ్రేష్ఠుండును వాయుకుమారుండు నగుహనుమంతుం డిట్లాలోచించి తనబలంబుఁ జూపుటకయి యెగిరి మేరుశిఖరంబుంబోలె సమున్నతంబై యున్న చైత్యప్రాసాదంబుమీఁదికి దుమికెను. ౩

వానరోత్తముండును కాంతిమంతుండు నగుహనుమంతుండు పర్వతాకారంబయిన చైత్యప్రాసాదం బధిరోహించి రెండవసూర్యుం డనందగి యొప్పుచుండెను. ౪

హనుమంతుండు ఎవ్వరికిం జొరరాని యుత్తమంబగు నాచైత్యప్రాసాదమును నశింపఁజేసి జయలక్ష్మీసమేతుండై పారియాత్ర పర్వతంబుకరణి వెలుంగుచుండెను. ౫

అంత వాయుకుమారుం డగుహనుమంతుండు ప్రభావమువలన మిక్కిలి గొప్పదేహంబు దాల్చి శబ్దము లంకయంతయుం నిండునట్లుగా భుజంబు దట్టెను. ౬

చెవులకు బాధసేయునట్టి యాహనుమంతుని యాస్ఫోటితధ్వనిచేతఁ బక్షు లాకాశంబుననుండి నేలంబడినవి. ఆచైత్యప్రాసాదంబునఁ గావలియున్న రాక్షసులందఱును మూర్ఛఁబొందిరి. ౭

సమస్తములయిన యస్త్రంబుల నెఱింగినరాముఁడు జయంబునొందుఁగాక! మహాబలుఁడగు లక్ష్మణుండును జయంబునొందుఁగాక! వానరరాజగు సుగ్రీవుండును రామునిచే రక్షింపఁబడినవాఁడై జయంబునొందుఁగాక! ౮

నేను కోసలదేశాధిపతియును ఎట్టికార్యంబునందును క్లేశంబునొందని వాఁడు నగురామునకు దాసుండ. హనుమంతుం డనువాఁడ. శత్రుసైన్యంబులం జంపువాఁడ. వాయుదేవుని కుమారుండ. ౯

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్,
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః. ౧౧

అర్దయిత్వా పురీం లంకామభివాద్య చ మైథిలీం,
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్. ౧౨

ఏవముక్త్వా విమానస్థశ్చైత్యస్థాన్ హరియూథపః,
ననాద భీమనిర్హ్రాదో రక్షసాం జనయన్ భయమ్. ౧౩

తేన శబ్దేన మహతా చైత్యపాలాశ్శతం యయుః,
గృహీత్వా వివిధానస్త్రాన్ప్రాసాన్ఖడ్గాన్పరశ్వధాన్.

విసృజంతో మహాకాయా మారుతిం పర్యవారయన్,

తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః. ౧౪
ఆజఘ్ను ర్వానరశ్రేష్ఠం బాణైశ్చాదిత్యసన్నిభైః,

ఆవర్త ఇవ గంగాయాస్తోయస్య విపులో మహాన్. ౧౫
పరిక్షిప్య హరిశ్రేష్ఠం స బభౌ రక్షసాం గణః,
తతో వాతాత్మజః క్రుద్ధో భీమ రూపం సమాస్థితః. ౧౬

ప్రాసాదస్య మహాస్తస్య స్తంభం హేమపరిష్కృతం,
ఉత్పాటయిత్వా వేగేన హనుమాన్ పవనాత్మజః. ౧౭

తతస్తం భ్రామయామాస శతధారం మహాబలః,
తత్ర చాగ్నిస్సమభవత్ప్రాసాదశ్చాప్యదహ్యత. ౧౮

డాళ్లచేతను వృక్షములచేతను నానావిధంబులం బ్రహరించుచు విహా
రంబు సేయుచున్న నాకు యుద్ధంబున వేయిమంది రావణులును సరి
కాఁజాలరు. ౧౦

నేను ఈరాక్షసులందఱుఁ జూచుచుండఁగానే లంకాపట్టణమును
నశింపఁజేసి సీతాదేవికి నమస్కారముచేసి కృతార్థుండనై రామునొద్దకుఁ
బోయెదను. అని హనుమంతుఁడు గట్టిగాఁ జెప్పెను. ౧౧

అట్లు ఆవానరోత్తముండగు హనుమంతుఁడు చైత్యప్రాసాదంబున
నుండువారలకుం దెలియఁజెప్పి యారాక్షసులకు భయంబు గల్గునట్లు భయం
కరంబయిన ధ్వని గావించెను. ౧౨

ఆ మహాధ్వనిని యాచైత్యప్రాసాదంబును రక్షించువారలు నూర్గురు
రాక్షసులు ఈఁటెలు ఖడ్గంబులు గండ్రగొడ్డళ్లు మొదలగు నానావిధంబులగు
నాయుధంబులం దీసికొని హనుమంతునిపైకిఁ బోయిరి. ౧౩

గొప్పదేహముగల యారాక్షసులు నానావిధాయుధంబులం బ్రయో
గించుచు వాయుపుత్రుండగు హనుమంతుం జుట్టుముట్టిరి.

ఆరాక్షసులు నానావర్ణములైన గదలచేతను బంగారముచే నలంక
రింపఁబడియుండు నినుపగుదియలచేతను సూర్యునిభంగి వెలుఁగుచున్న బాణంబుల
చేతను వానరోత్తముఁడగు నాహనుమంతుం బ్రహరించిరి. ౧౪

అప్పుడు వానరశ్రేష్ఠుండగు హనుమంతుం జుట్టుకొన్న యారాక్షసుల
గొప్పసమూహము గంగాజలమునందలి గొప్పసుడివలె నొప్పుచుండెను. ౧౫

అంత వాయుదేవుని కుమారుండగు హనుమంతుఁడు కోపించి భయం
కరంబగు రూపంబు ధరించెను. ౧౬

మహాబలుఁడును వాయుపుత్రుఁడు నగు హనుమంతుఁడు బంగారముచే
నలంకరింపఁబడిన యాచైత్యప్రాసాదమందలి స్తంభమును వేగంబునం బెఱికి
దానిం బలువిధంబుల శీఘ్రంబుగాఁ ద్రిప్పెను. ౧౭

అట్టు లా స్తంభమును ద్రిప్పుటచేత నిప్పుపుట్టినది. దానిచేత నాచైత్య
ప్రాసాదంబంతయు మండిపోయినది. ౧౮

దహ్యమానం తతో దృష్ట్వా ప్రాసాదం హరియూథపః,
స రాక్షసశతం హత్వా వజ్రేణేంద్ర ఇవాసురాన్. ౧౯
అంతరిక్షే స్థితశ్శ్రీమానిదం వచనమబ్రవీత్,

మాదృశానాం సహస్రాణి విసృష్టాని మహాత్మనామ్. ౨౦
బలినాం వానరేంద్రాణాం సుగ్రీవవశవర్తినామ్,

అటంతి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః. ౨౧

దశనాగబలాః కేచిత్కేచిద్దశగుణోత్తరాః,
కేచిన్నాగసహస్రస్య బభూవుస్తుల్యవిక్రమాః. ౨౨

సంతి చౌఘబలాః కేచిత్కేచిద్వాయుబలోపమాః,
అప్రమేయబలాశ్చాన్యే తత్రాసన్హరియూథపాః. ౨౩

ఈదృగ్విధైస్తు హరిభిర్వృతో దంతనఖాయుధైః,
శతైశ్శతసహస్రైశ్చ కోటీభి రయుతైరపి. ౨౪

ఆగమిష్యతి సుగ్రీవస్సర్వేషాం వో నిషూదనః,
నేయమస్తి పురీ లంకా న యూయం న చ రావణః,
యస్మాదిక్ష్వాకునాథేన బద్ధం వైరం మహాత్మనా. ౨౫

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రిచత్వారింశస్సర్గః.

శ్రీమంతుండును వానరశ్రేష్ఠుండు నగు హనుమంతుండు ఆచైత్య ప్రాసాదము దగ్ధమగుటం జూచి ఆ స్తంభముచేత ఇంద్రుండు వజ్రముచేత నసురులం జంపునట్లు ఆరాక్షసుల నూర్వురం జంపి యంతరిక్షంబుననుండి యిట్లని చెప్పెను. ౧౯

మహాపరాక్రమశాలురును సుగ్రీవునివశంబున నున్నవారలు నగు నావంటి వానరశ్రేష్ఠులు వేనవేలుగా సుగ్రీవునిచే సీతాదేవిని వెదకుటకై పంపఁబడిరి. ౨౦

మేముమాత్రమే కాదు. ఇంకననేకులు వానరులిట్లు భూమియంతయుం సీతను వెదకుచుఁ దిరుగుచున్నారు. ౨౧

అందుఁ గొందఱు పదియేనుగుల బలంబు గలవారలు. కొందఱు నూఱేనుగుల బలము గలవారలు. కొందఱు వేయి యేనుంగుల బలముగల వారలు. ౨౨

అచ్చటఁ గొందఱు ఓఘమను సంఖ్యగల యేనుంగుల బలము గ వారలు; కొందఱు వాయుబలము గలవారలు; ఇతరులగు వానరశ్రేష్ఠుల బల మునకుఁ గొలందియే లేదు. ౨౩

మిమ్ముందఱిం జంపునట్టివాఁ డగు సుగ్రీవుఁడు దంతములు నఖములు నాయుధములుగాఁ గలయట్టివానరులు నూఱులుగాను దశసహస్రంబులుగాను లక్షలుగాను గోటులుగానుం గొల్వఁగా నిచ్చటికి రాఁగలఁడు. ౨౪

మీరు మహాత్ముండగు రామునితో వైరంబు వహించినారు కావున నింక నీలంకాపట్టణ మెంతమాత్రము నుండదు. నాశమునొందును. మీరు నుండరు. చంపఁబడుదురు. అట్లు రావణుండు నింక నుండఁడు. అని హను మంతుఁడు చెప్పెను. ౨౫

ఇది నలుబదిమూఁడవ సర్గము.

## చతుశ్చత్వారింశస్సర్గః

సందిష్టో రాక్షసేంద్రేణ ప్రహస్తస్య సుతో బలీ,
జంబుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః. ౧
రక్తమాల్యాంబరధరస్స్రగ్వీ రుచిరకుండలః,
మహాన్వివృత్తనయనశ్చండస్సమరదుర్జయః. ౨
[దగ్ధత్రికూటప్రతిమో మహాజలదసన్నిభః,
మహాభుజశిరస్కంధో మహాదంష్ట్రో మహాననః.
మహాజవో మహోత్సాహో మహాసత్త్వోరువిక్రమః,
ఆజగామాతివేగేన వజ్రాశనిసమస్వనః.]
ధనుశ్శక్రధనుః ప్రఖ్యం మహద్రుచిరసాయకం,
విష్ఫారయానో వేగేన వజ్రాశనిసమస్వనమ్. ౩

తస్య విస్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః,
ప్రదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత. ౪
[ఉద్గచ్ఛన్నివ చాదిత్యః ప్రభాభిరివ లోహితః,
లోహితాఙ్గేన మహతా కవచేనాభిసంవృతః.
తిష్ఠ తిష్ఠేతి సహసా హనూమన్తమథాబ్రవీత్,]
రథేన ఖరయుక్తేన తమాగతముదీక్ష్య సః,
హనుమాన్వేగసంపన్నో జహర్ష చ ననాద చ. ౫

తం తోరణవిటంకస్థం హనుమంతం మహాకపిం,
జంబుమాలీ మహాబాహుర్వివ్యాధ నిశితైశ్శరైః. ౬
అర్ధచంద్రేణ వదనే శిరస్యేకేన కర్ణినా,
బాహ్వోర్వివ్యాధ నారాచైర్దశభిస్తం కపీశ్వరమ్. ౭

## నలువదినాలుగవ సర్గము

మహాదంష్ట్రుండును ఎఱ్ఱని పుష్పమాలికలును వస్త్రంబులు ధరించిన వాఁడును శిరమునం బూలుముడుచుకొన్నవాఁడును సుందరములయిన కుండలములు గలవాఁడును మహాకాయుఁడును గుండ్రములయిన నేత్రములు గలవాఁడును [మంటలతోడి త్రికూటమువలె నున్నవాఁడును పెద్ద మబ్బువలె నున్నవాఁడును ఎత్తయిన శిరస్సు భుజమూఁపులును గలవాఁడును నిడుపు కోఱలు గలవాఁడును వెడఁదనోరుగలవాఁడును గొప్పవేగోత్సాహములు గలవాఁడును గొప్పభుజములుగలవాఁడును మిక్కుటమైన శౌర్యముగలవాఁడును వజ్రము పిడుగు వీనివంటి చప్పుడుగలవాఁడునునై యతివేగముగావచ్చుచున్నవాఁడును] భయంకరాకారుండును యుద్ధమున నెవ్వరికిని జయింపనలవిగాని వాఁడును ప్రహస్తుని పుత్రుండు నగు జంబుమాలి యనువాఁడు రావణునిచే నాజ్ఞాపితుండై యింద్రధనుస్సుంబోలిన గొప్ప ధనువును సుందరములైన బాణములుం దాల్చి పిడుగుపడినట్లు మహాధ్వని కలుగునట్లు వారించుచు హనుమంతునిమీఁదికి వెడలెను. ౧-౩

అప్పు డాజంబుమాలి నారిసారింపఁగాఁ గల్గిన మహాధ్వని దిక్కులును విదిక్కులును నూర్ధ్వాధోభాగములును నిండి చెలంగినది [ఎఱ్ఱని మేనికాంతులచేఁ బొడుపుగొండమీఁది సూర్యునట్లు ప్రకాశించుచు అనిర్భేద్యకవచమును దొడిగికొని తొందరతో నిలుం నిలు మని యాంజనేయు నదల్చెను.] ౪

వేగవంతుఁడగు నా హనుమంతుఁడు గాడిదలు గట్టిన రథముమీఁద వచ్చిన యా జంబుమాలిం జూచి మరల యుద్ధముసేయఁగల్గెనని సంతోషమున సింహనాదము గావించెను. ౫

మహాబాహుఁడగు జంబుమాలి ద్వారముపైగాఁ వేసియుండు దూలంబున నున్న హనుమంతుని తీక్ష్ణములగు బాణంబులం బ్రహరించెను. ౬

ఆ జంబుమాలి హనుమంతుని ముఖమున నొక్క యర్ధచంద్రాకార బాణమును శిరమున నొక్క చెవివంటి బాణమును బాహువులయందుఁ బది యినుపబాణములను బ్రయోగించెను. ౭

తస్య తచ్ఛుశుభే తామ్రం శరేణాభిహతం ముఖం,
శరదీవాంబుజం ఫుల్లం విద్ధం భాస్కరరశ్మినా. ౮

తత్తస్య రక్తం రక్తేన రంజితం శుశుభే ముఖం,
యథాకాశే మహాపద్మం సిక్తం చందనబిందుభిః. ౯

చుకోప బాణాభిహతో రాక్షసస్య మహాకపిః,

తతః పార్శ్వేఽతివిపులాం దదర్శ మహతీం శిలామ్. ౧౦

తరసా తాం సముత్పాట్య చిక్షేప బలవద్బలీ,

తాం శరైర్దశభిః క్రుద్ధస్తాడయామాస రాక్షసః. ౧౧
విపన్నం కర్మ తద్దృష్ట్వా హనూమాంశ్చండవిక్రమః,
సాలం విపులముత్పాట్య భ్రామయామాస వీర్యవాన్. ౧౨

భ్రామయంతం కపిం దృష్ట్వా సాలవృక్షం మహాబలం,
చిక్షేప సుబహూన్ బాణాన్ జంబుమాలీ మహాబలః. ౧౩
సాలం చతుర్భిశ్చిచ్ఛేద వానరం పంచభిర్భుజే,
ఉరస్యేకేన బాణేన దశభిస్తు స్తనాంతరే. ౧౪
స శరైః పూరితతనుః క్రోధేన మహతా వృతః,
తమేవ పరిఘం గృహ్య భ్రామయామాస వేగితః. ౧౫
అతివేగోఽతివేగేన భ్రామయిత్వా బలోత్కటః,
పరిఘం పాతయామాస జంబుమాలేర్మహోరసి. ౧౬

స్వభావముననే యెఱ్ఱనైనదియు బాణముచేఁ గొట్టఁబడినది కావున రక్తముచే వ్యాపింపఁ బడినదియు నగు నాహనుమంతుని ముఖము శరదృతువు నందుఁ జక్కఁగా వికసించినదియు సూర్యకిరణములచే వ్యాప్తమయినదియు నగు నెఱ్ఱని కమలముంబోలెఁ బ్రకాశించినది. ౮

స్వభావముననే యెఱ్ఱనిదియు రక్తము గారుచుండుటవలన మఱియు నెఱ్ఱఁగా నున్నదియు నగు నాహనుమంతుని ముఖము ఆకాశమున రక్తచందన ద్రవముచేఁ దడుపఁబడియుండు నెఱ్ఱఁగలువయుంబోలెఁ బ్రకాశించినది ౯

హనుమంతుఁ డిట్లు జంబుమాలిచే బాణములఁ బ్రహరింపఁబడి కోపము నొందెను.

అంత నా హనుమంతుండు తనప్రక్క నొక్క విశాలమయిన పెద్ద ఱాయి యుండుటం జూచెను. ౧౦

బలవంతుఁడగు నా హనుమంతుఁడు వేగంబున నాఱాతిం బెకలించి తన బలంబుకొలంది జంబుమాలిపై వైచెను.

అంత జంబుమాలి కోపించి పదిబాణంబుల నాఱాతిం బడఁగొట్టెను.

అంత భయంకరంబగు పరాక్రమంబుగల హనుమంతుఁడు తాను వైచినఱాయి వ్యర్థమగుటం జూచి విశాలంబగు నొక్కసాలంబుఁ బెఱికి గిఱగిఱం ద్రిప్పెను. ౧౨

మహాబలుఁడగు జంబుమాలి యట్లు సాలవృక్షంబుఁ ద్రిప్పుచున్నవాని మహాబలుఁడగు హనుమంతునిం జూచి పెక్కుబాణంబులఁ బ్రయోగించెను.

ఆ జంబుమాలి నాలుగుబాణంబుల నాసాలవృక్షమును ఖండించి హనుమంతుని భుజంబున నయిదు బాణంబులను ఱొమ్మున నొక్క బాణమును స్తనప్రదేశములందుఁ బది బాణంబులనుం బ్రయోగించెను. ౧౪

అట్లా హనుమంతుఁడు తనదేహంబంతయు బాణంబులం గప్పఁబడఁగా మహాకోపంబునొంది యా యినుపగుదియనే దీసికొని వేగంబునం ద్రిప్పెను.

కొలందిలేని బలముగలవాఁడును మహావేగముగలవాఁడునునగు నా హనుమంతుఁడు ఇట్లు మహావేగంబునం ద్రిప్పి యా యినుపగుదియను విశాలంబగు నా జంబుమాలిఱొమ్ముపై వైచెను. ౧౬

తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ,
న ధనుర్న రథో నాశ్వాస్తత్రాదృశ్యంత నేషవః. ౧౭
స హతస్సహసా తేన జంబుమాలీ మహాబలః,
పపాత నిహతో భూమౌ చూర్ణితాంగవిభూషణః. ౧౮

జంబుమాలిం చ నిహతం కింకరాంశ్చ మహాబలాన్,
చుక్రోధ రావణశ్శ్రుత్వా కోపసంరక్తలోచనః. ౧౯

స రోషసంవర్తితతామ్రలోచనః
ప్రహస్తపుత్రే నిహతే మహాబలే,
అమాత్యపుత్రానతివీర్యవిక్రమాన్
సమాదిదేశాశు నిశాచరేశ్వరః. ౨౦

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుశ్చత్వారింశస్సర్గః.

## పఞ్చచత్వారింశస్సర్గః

తతస్తే రాక్షసేంద్రేణ చోదితా మంత్రిణస్సుతాః,
నిర్యయుర్భవనాత్తస్మాత్సప్తసప్తార్చివర్చసః. ౧
మహాబలపరీవారా ధనుష్మంతో మహాబలాః,
కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః. ౨
హేమజాలపరిక్షిప్తైర్ధ్వజవద్భిః పతాకిభిః,
తోయదస్వననిర్ఘోషైర్వాజియుక్తైర్మహారథైః. ౩
తప్తకాంచనచిత్రాణి చాపాన్యమితవిక్రమాః,
విష్ఫారయంతస్సంహృష్టాస్తటిత్వంత ఇవాంబుదాః. ౪

అంత నచ్చట నాజంబుమాలి తలగాని చేతులుగాని మోఁకాళ్లుగాని విల్లుగాని రథముగాని గాడిదలుగాని బాణంబులుగాని యేదియుం నగపడలేదు.

అట్లు హనుమంతుఁడు వేగంబునఁ గొట్టఁగానే మహాబలుండగు నా జంబుమాలి చచ్చుటయేగాక అతనిదేహంబు నాభరణంబులును జూర్ణములై రూపఱి నేలంబడినవి. ౧౮

అంత రావణుఁడు బలవంతులగు కింకరులు చంపఁబడుటయె గాక జంబుమాలియుఁ జంపఁబడుటను విని గనుఁగొనల నెఱ్ఱపుగదుర మహాకోపంబు నొందెను. ౧౯

మహాబలుఁడగు ప్రహస్తపుత్త్రుఁడు జంబుమాలి చావఁగానే రావణుఁడు కోపంబునం గనుల నెఱ్ఱఁదనంబుఁగదుర శీఘ్రంబున మహాబలపరాక్రమశాలులగు మంత్రిపుత్త్రుల హనుమంతునిపైకిఁబోవ నాజ్ఞాపించెను. ౨౦

ఇది నలువదినాలుగవ సర్గము

## నలువదియైదవ సర్గము

అంత మహాబలశాలులును అస్త్రవేత్తలలో నుత్తములును కొలఁదిలేని పరాక్రమంబు గలవారలు నగు నా మంత్రిపుత్త్రు లేడ్వురు రాక్షసేశ్వరుం డయిన రావణునిచే నాజ్ఞాపితులయి అగ్నిహోత్రంబులకైవడిఁ బ్రాలుచు గొప్పసైన్యంబు దీసికొని గొప్పధనువులం దాల్చి బంగారముతోఁ గప్పఁబడినవియు రాజచిహ్నంబులతోఁ గూడిన ధ్వజంబులు గలవియుఁ సాధారణంబులగుటెక్కెంబులతో నలంకరింపఁబడినవియుఁ మేఘమునవలెనే మహాధ్వని గలవియుఁ గుఱ్ఱంబులతోఁ గూడినవియుఁ నగు రథములనెక్కి "నేను జయించెదను. నేను జయించెదను" అని యహమహమికోత్తలాడుచుఁ బరమసంతోషము నొంది బంగారముతో నలంకరింపఁబడిన ధనువులను సారించుచు మెఱుపులతోఁ గూడిన మేఘములకరణిం బ్రాలుచు గృహములనుండి వెడలిరి. ౧-౮

జనన్యస్తు తతస్తేషాం విదిత్వా కింకరాన్హతాన్,
బభూవుశ్శోకసంభ్రాంతాస్సబాంధవసుహృజ్జనాః. ౫

తే పరస్పరసంఘర్షాత్తప్తకాంచనభూషణాః,
అభిపేతుర్హనూమంతం తోరణస్థమవస్థితమ్. ౬

సృజంతో బాణవృష్టిం తే రథగర్జితనిస్స్వనాః,
వృష్టిమంత ఇవాంభోదా విచేరుర్నైరృతాంబుదాః. ౭
అవకీర్ణస్తతస్తాభి ర్హనుమాన్ శరవృష్టిభిః,
అభవత్సంవృతాకారశ్శైలరాడివ వృష్టిభిః. ౮
స శరాన్మోఘయామాస తేషామాశుచరః కపిః,
రథవేగం చ వీరాణాం విచరన్విమలేఽంబరే. ౯

స తైః క్రీడన్ధనుష్మద్భిర్వ్యోమ్ని వీరః ప్రకాశతే,
ధనుష్మద్భిర్యథా మేఘైర్మారుతః ప్రభురంబరే. ౧౦

స కృత్వా నినదం ఘోరం త్రాసయంస్తాం మహాచమూం,
చకార హనుమాన్ వేగం తేషు రక్షస్సు వీర్యవాన్. ౧౧
తలేనాభ్యహనత్కాంశ్చిత్పాదైః కాంశ్చిత్పరంతపః,
ముష్టినాభ్యహనత్కాంశ్చిన్నఖైః కాంశ్చిద్వ్యదారయత్. ౧౨

ప్రమమాథోరసా కాంశ్చిదూరుభ్యామపరాన్ కపిః,

కేచిత్తస్య నినాదేన తత్రైవ పతితా భువి. ౧౩

అంత వారల తల్లులును బంధువులును స్నేహితులును "హనుమంతుండు కింకరులనుం గూడఁ జంపెనా"యని విని "అట్టి హనుమంతునిమీఁదికి వీరలు పోయెదరే" యని మిక్కిలి దుఃఖము నొందిరి. ౫

ఉత్తమంబగు బంగారముతోఁ జేసిన భూషణములు దాల్చియున్న యామంత్రిపుత్రులు "నేను ముందుపోవలయు నేను ముందుపోవలయు" నని యొకరినొకరు దొరకొనుచు నాయశోకవనద్వారమున యుద్ధసన్నద్ధుండై యున్న హనుమంతునిమీఁదికిఁ బోయిరి. ౬

ఆమంత్రిపుత్రు లేడ్వురును రథధ్వనియే గర్జితంబుగా బాణవర్షము గురియించుచు వర్షముగురియు మేఘములుంబోలె విహరించిరి. ౭

అంత హనుమంతుండు ఆబాణవర్షముల మునింగి వర్షములం గప్పఁబడిన హిమవత్పర్వతముకరణి నొప్పుచుండెను. ౮

ఆ హనుమంతుండు పరాక్రమవంతులగు నా రాక్షసులబాణములు దనపైఁ బడకుండునట్లును వారలు రథవేగమునఁ దన్ను గుఱిపట్టకుండునట్లును అతిశీఘ్రముగా స్వచ్ఛమయిన యాకాశమున సంచరించుచుండెను. ౯

పరాక్రమవంతుఁడగు నా హనుమంతుఁడు ధనుర్ధరులగు నా రాక్షసులతో నాకాశంబున విహరించుచు నాకాశంబున నింద్రధనుస్సులతోఁ గూడిన మేఘంబుల నొప్పుచుండు వాయుదేవునికైవడిఁ జూపట్టుచుండెను.

మహాపరాక్రమశాలియగు నా హనుమంతుండు భయంకరంబుగా నఱచి ఆసేననంతయు వెఱపించుచు నారాక్షసులయందు వేగంబు వహించెను.

శత్రువులం దపింపఁజేయునట్టి హనుమంతుఁడు ఆరాక్షసులం గొందఱ నఱచేతం గొట్టెను. కొందఱఁ బాదంబులం దన్నెను. కొందఱఁ బిడికిటిపోటునం బొడిచెను. మఱికొందఱ నఖంబులం జీల్చెను. ౧౨

హనుమంతుఁడు కొందఱరాక్షసులను ఱొమ్ముతోఁ జంపెను. మఱి కొందఱను దొడలతోఁ జంపెను.

కొందఱా హనుమంతుని ధ్వనికి యచ్చటనే నేలంబడిరి. ౧౩

తత స్తేష్వవసన్నేషు భూమౌ నిపతితేషు చ,
తత్సైన్యమగమత్సర్వం దిశో దశ భయార్దితమ్. ౧౪
వినేదుర్విస్వరం నాగా నిపేతుర్భువి వాజినః,
భగ్ననీడధ్వజచ్ఛత్రైర్భూశ్చ కీర్ణాఽభవద్రథైః. ౧౫
స్రవతా రుధిరేణాథ స్రవంత్యో దర్శితాః పథి,
వివిధైశ్చ స్వరైర్లంకా ననాద వికృతం తదా. ౧౬
స తాన్ప్రవృద్ధాన్వినిహత్య రాక్షసాన్
మహాబలశ్చండపరాక్రమః కపిః,
యుయుత్సురన్యైః పునరేవ రాక్షసై
స్తమేవ వీరోఽభిజగామ తోరణమ్ ౧౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చచత్వారింశస్సర్గః.

## షట్చత్వారింశస్సర్గః

హతాన్ మంత్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా,
రావణస్సంవృతాకారశ్చకార మతిముత్తమామ్. ౧

స విరూపాక్షయూపాక్షౌ దుర్ధరం చైవ రాక్షసం,
ప్రఘసం భాసకర్ణం చ పంచ సేనాగ్రనాయకాన్. ౨
సందిదేశ దశగ్రీవో వీరాన్నయవిశారదాన్,
హనుమద్గ్రహణవ్యగ్రాన్వాయువేగసమాన్యుధి. 3
యాత సేనాగ్రగాస్సర్వే మహాబలపరిగ్రహాః,
సవాజిరథమాతంగా స్స కపిశ్శాస్యతామితి. ౪
యత్తైశ్చ ఖలు భావ్యం స్యాత్తమాసాద్య వనాలయం,

అంత నారాక్షసులు మృతులై కూలంబడినది చూచి మిగిలిన సైన్యం బంతయు భయంబునొంది దిక్కులం బఱచినవి. ౧౪

ఏనుంగులు వికృతంబుగా నఱచినవి. గుఱ్ఱములు కూలంబడినవి. రథం బుల చైకప్పులును ధ్వజము గొడుగులును విఱిగి భూమియంతయు వ్యాపించి నవి. ౧౫

అంత మార్గమునందు నెత్తురు ఏఱులు గట్టి పాఱినవి. లంకయం దంతయు నానావిధంబులుగా వికృతధ్వని వినంబడినది. ౧౬

మహాబలుండును భయంకరరూపుఁడు పరాక్రమముగలవాఁడు నగు నా హనుమంతుండు బలంబున వృద్ధులగు నా రాక్షసులం జంపి యింకను ఇతరు లగు రాక్షసులతో యుద్ధము సేయఁగోరి యాతోరణప్రదేశమునకే పోయి యుండెను. ౧౭

ఇది నలువదియైదవ సర్గము.

## నలువదియాఱవ సర్గము

రావణుండు మంత్రిపుత్రులు మహాపరాక్రమశాలియగు హనుమంతు నిచే జంపబడిరని తెలిసికొని మనమున భయమునొందినవాఁడయ్యు దాని నొరులకుం దెలియనీయక భయమునంగల్గు దేహవికారములం గప్పికొని మంచి యాలోచన చేసెను. ౧

ఆరావణుండు విరూపాక్షుని యూపాక్షుని దుర్ధరుం డనురాక్షసుని ప్రఘసు భాసకర్ణుం డనువాని హనుమంతుం బట్టుకొన నధికేచ్ఛగలవారలును యుద్ధమున వాయుదేవునకుంబోలె వేగము గలవారలు నయవిశారదులును శూరులునగు నీసేనానాయకుల నైదుగురింజూచి యిట్లని యాజ్ఞాపించెను. ౨, 3

మహాబలశాలులగు సేనాధిపతులారా! మీరందఱు గుఱ్ఱములను రథము లను గజములనుంగూడి పోయి యావానరుని శిక్షింపుఁడు. అని యాజ్ఞాపించెను.

మీ రావానరునొద్దకుఁ బోయి యెంతమాత్రము నేమఱక ప్రయత్న మున నుండవలయును. మఱియు దేశకాలవిరోధియగు కార్యమును చేయ

కర్మ చాపి సమాధేయం దేశకాలవిరోధినమ్. ౫
[వానరోఽయమితి జ్ఞాత్వా న హి శుద్ధ్యతి మే మనః,
నైవాహం తం కపిం మన్యే యథేయం ప్రస్తుతా కథా.]
న హ్యహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్,
సర్వథా తన్మహద్భూతం మహాబలపరిగ్రహమ్. ౬

భవేదింద్రేణ వా సృష్టమస్మదర్థం తపోబలాత్,

సనాగయక్షగంధర్వా దేవాసురమహర్షయః. ౭

యుష్మాభిస్సహితైస్సర్వైర్మయా సహ వినిర్జితాః,
తైరవశ్యం విధాతవ్యం వ్యలీకం కించిదేవ నః. ౮

తదేవ నాత్ర సందేహః ప్రసహ్య పరిగృహ్యతామ్,
నావమాన్యో భవద్భిశ్చ హరిర్ధీరపరాక్రమః. ౯
దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః,
వాలీ చ సహ సుగ్రీవో జాంబవాంశ్చ మహాబలః. ౧౦

నీలస్సేనాపతిశ్చైవ యేచాన్యే ద్వివిదాదయః,
నైవం తేషాం గతిర్భీమా న తేజో న పరాక్రమః. ౧౧
న మతిర్న బలోత్సాహౌ న రూపపరికల్పనం,
మహత్సత్త్వమిదం జ్ఞేయం కపిరూపం వ్యవస్థితమ్. ౧౨
ప్రయత్నం మహదాస్థాయ క్రియతామస్య నిగ్రహః,
కామం లోకాస్త్రయస్సేంద్రాస్ససురాసురమానవాః. ౧౩
భవతామగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే,

రాదు. [ఆవ్యక్తి వానరమన్నంతమాత్రముననే నామనము గుసురుపడలేదు. ఇప్పటిచర్య చూడఁగా నది వానరమని నాకు నమ్మకము లేదు.] ౫

ఆతండు చేయుకార్యముల విచారింపఁగా నతండు వానరుండని నాకుఁ దోఁచలేదు.

అన్నివిధములం జూడఁగా నది మహాబలము గల గొప్ప భూతముగా నున్నది గాని వేఱుగాదు. ౬

ఒకవేళ నింద్రుండు తపస్సుచేసి మనలంజంపుటకై యీభూతమును సృజించినాఁడేమొ!

నేను మున్ను మిమ్ములనందఱంగూడి సర్పములను యక్షులను గంధర్వులను దేవతల నసురులను మహర్షులను జయించియున్నాను. ౭

కాఁబట్టి వారలు మనకేమైనను బదులుగాఁ గీడు చేయవలసినదే. అట్టిదే యిది. ఇందుకు సందేహము లేదు. బలాత్కారముగా దానిం బట్టుకొనుఁడు. ౮

ఈవానరుఁడు భయంకరమగు పరాక్రమము గలవాఁడు కావున వీని నవమానింప మీకు నలవిగాదు. ౯

నేను మున్ను వాలిని సుగ్రీవుని మహాబలుండగు జాంబవంతుని వానరసేనానాయకుండగు నీలుని మఱియు ద్వివిదుండు మున్నగు నితరులను మహాపరాక్రమశాలులగు వానరులం జూచియున్నాను. ౧౦

వారల కిట్టి భయంకరమయిన గతియును దేజమును బరాక్రమమును బుద్ధియును బలము నుత్సాహమును రూపమును లేదు. ౧౧

ఇది చూడఁగా వానరరూపమువహించి వచ్చిన మహాభూతముగా నున్నది గాని వేఱుకాదు. ౧౨

గొప్పప్రయత్నముఁజేసి యీవానరు నెట్లయిన నిగ్రహింపుఁడు.

ముల్లోకములనుండు దేవతలు నసురులు మానవులు నొక్కటియయి యింద్రునిం గూడివచ్చినను యుద్ధభూమియందు మీయెదుట నిలువం జాలరు. ఇదివాస్తవమే.

తథాపి తు నయజ్ఞేన జయమాకాంక్షతా రణే. ౧౪
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధిర్హి చంచలా,

తే స్వామివచనం సర్వే ప్రతిగృహ్య మహౌజసః. ౧౫
సముత్పేతుర్మహావేగా హుతాశసమతేజసః,
రథైర్మత్తైశ్చ మాతంగైర్వాజిభిశ్చ మహాజవైః. ౧౬
శస్త్రైశ్చ వివిధైస్తీక్ష్ణైస్సర్వైశ్చోపచితా బలైః,

తతస్తం దదృశుర్వీరా దీప్యమానం మహాకపిమ్. ౧౭
రశ్మిమంతమివోద్యంతం స్వతేజోరశ్మిమాలినం,
తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్. ౧౮

మహామతిం మహావేగం మహాకాయం మహాబలం,
తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వాస్వవస్థితాః. ౧౯

తైస్తైః ప్రహరణైర్భీమైరభిపేతుస్తతస్తతః,
తస్య పంచాయసాస్తీక్ష్ణాశ్శితాః పీతముఖాశ్శరాః. ౨౦
శిరస్యుత్పలపత్రాభా దుర్ధరేణ నిపాతితాః,

స తైః పంచభిరావిద్ధశ్శరైశ్శిరసి వానరః. ౨౧
ఉత్పపాత నదన్ వ్యోమ్ని దిశో దశ వినాదయన్,
తతస్తు దుర్ధరో వీరస్సరథస్సజ్యకార్ముకః. ౨౨
కిరన్ శరశతైస్తీక్ష్ణైరభిపేదే మహాబలః,

అట్లయినను యుద్ధంబున జయంబే కలుగునని నిశ్చయములేదు కావున జయమే గోరునట్టి రాజనీతిజ్ఞుండు ముఖ్యముగాఁ బ్రయత్నముచేఁ దన్నుఁదాను రక్షించుకొనవలసినది. అందువలన మీరు జాగ్రత్త నవలంబించియుండవలయును. అని రావణుండు ఆ యయిదుగురిసేనానాయకులకుఁ జెప్పెను. ౧౪

అంత మహాబలశాలులును మహావేగులును అగ్నిహోత్రమువంటిపరాక్రమము గలవారలు నగు నాసేనానాయకు లైదుగురును రాజాజ్ఞను శిరసావహించి రథములను మదించినయేనుంగులను మహావేగములగు గుఱ్ఱములను నానావిధములగు కఱకుశస్త్రములను సమస్తవిధసైన్యములనుం గూడి హనుమంతునొద్దకుఁ బోయిరి. ౧౫, ౧౬

అంత మహాపరాక్రమశాలు లగునాసేనానాయకులు అశోకవన బహిర్ద్వారమున వెలుంగుచున్నవాఁడు నప్పుడుదయించిన సూర్యునిభంగి నొప్పుచున్నవాఁడును దనకాంతిచే సూర్యుం బోలియున్నవాఁడును మహాకార్యంబులు సేయంగలవాఁడును మహాబలుండు నగు నాహనుమంతుం జూచిరి.

అంత నాసేనానాయకులు మహాబుద్ధిశాలియును మహావేగుండును మహాదేహుండును మహాబలుండు నగునాహనుమంతుం జూచినంతనే యతని చుట్టును నిలిచి భయంకరము లగునయ్యాయుధములతో నెదిరించిరి. ౧౯

దుర్ధరుండు ఆయసములును గ్రూరములును గఱుగలవియును ముఖముల బంగారునీరు బూసియుండుటంజేసి పసుపువన్నెగలవియుఁ గలువఱేకులంబోలెఁ గాంతిగలవియు నగు నైదుబాణముల నాహనుమంతునితలపైఁ బ్రయోగించెను. ౨౦

ఆహనుమంతుఁడు శిరమున నాయయిదుబాణములం దాఁకితుండై దశదిశలునిండ సింహనాదము సేయుచు నాకాశమున కెగిరెను. ౨౧

అంతఁ బరాక్రమశాలియును మహాబలుఁడు నగుదుర్ధరుఁడు ధనువెక్కుపెట్టి రథముతో నాకాశమున కుద్గమించి తీక్ష్ణములగు పెక్కుబాణములం బ్రయోగించుచు హనుమంతు నెదిరించెను. ౨౨

స కపిర్వారయామాస తం వ్యోమ్ని శరవర్షిణమ్. ౨౩
వృష్టిమంతం పయోదాంతే పయోదమివ మారుతః,

అర్ద్యమాన స్తత స్తేన దుర్ధరేణానిలాత్మజః. ౨౪
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్,

స దూరం సహసోత్పత్య దుర్ధరస్య రథే హరిః. ౨౫
నిపపాత మహావేగో విద్యుద్రాశిర్గిరావివ,
తతస్స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్. ౨౬
విహాయ న్యపతద్భూమౌ దుర్ధర స్త్యక్తజీవితః,
తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా నిపతితం భువి. ౨౭
సంజాతరోషౌ దుర్ధర్షావుత్పేతతురరిందమౌ,

స తాభ్యాం సహసోత్పత్య విష్ఠితో విమలేఽంబరే. ౨౮
ముద్గరాభ్యాం మహాబాహుర్వక్షస్యభిహతః కపిః,

తయోర్వేగవతోర్వేగం వినిహత్య మహాబలః. ౨౯
నిపపాత పునర్భూమౌ సుపర్ణసమవిక్రమః,

స సాలవృక్షమాసాద్య తముత్పాట్య చ వానరః. ౩౦
తావుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః,
తతస్తాంస్త్రీన్ హతాన్ జ్ఞాత్వా వానరేణ తరస్వినా. ౩౧
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిం,
భాసకర్ణశ్చ సంక్రుద్ధశ్శూలమాదాయ వీర్యవాన్. ౩౨

శరదృతువునందు వర్షముఁగురియు మేఘమును వాయువు సులభముగా నడ్డగించునట్లు హనుమంతుఁ డాకాశమున బాణవర్షము గురియుచున్న యా దుర్ధరు నడ్డగించెను. ౪౩

అంత నట్టి వేగవంతుఁడగు వాయుపుత్రకుమారుఁడైన హనుమంతుఁడు దుర్ధరునిచేఁ బీడింపఁబడి మఱియు నధికముగా మేను పెంచి యుద్ధము చేసెను. ౪౪

ఆహనుమంతుఁ డంత నధికవేగము నవలంబించి శీఘ్రమున దూరముగాఁ బైకెగిరి పర్వతముపైఁ బిడుగుపడునట్లు దుర్ధరునిరథముపై దుమికెను. ౪౫

అంత నెనిమిదిగుఱ్ఱములును జచ్చి కండ్లును నొగయును విఱిగి నేలం గూలిన రథమునుండి దుర్ధరుండు మృతుండై నేలంబడెను. ౪౬

ఆదుర్ధరుండు చచ్చి నేలంబడుటను జూచి దుర్ధర్షులును శత్రువుల నడంగఁద్రొక్కువారలు నగు విరూపాక్షయూపాక్షులు మహారోషమునొంది యాకాశమున కెగిరిరి. ౪౭

ఆవిరూపాక్షయూపాక్షులు శీఘ్రమున నెగిరి స్వచ్ఛంబగు నాకాశమున నున్న మహాబాహుండగు హనుమంతుని ఱొమ్మున నినుపగుదియలచేఁ గొట్టిరి. ౪౮

గరుత్మంతునకుంబోలెఁ బరాక్రమము గలవాఁడును మహాబలుండు నగు హనుమంతుండు వేగవంతులగు నావిరూపాక్ష యూపాక్షుల వేగము నడంచి మరల నేలకు వ్రాలెను. ౪౯

వాయుదేవుని కుమారుండగు నాహనుమంతుం డంత నొకమద్దిచెట్టుం జేరి దానిం బెఱికి దానిచే వీరులగు నావిరూపాక్షయూపాక్షులం జంపెను.

అంత నాదుర్ధర విరూపాక్ష యూపాక్షులు మువ్వురును బలవంతుఁడగు హనుమంతునిచేఁ జచ్చుటఁజూచి మహావేగుండగు ప్రఘసుండు వేగమున హనుమంతునిపైకిఁ బోయెను. పరాక్రమవంతుం డగుభాసకర్ణుండును కోపించి శూలముఁగొని హనుమంతునిమీఁది కదలెను. ౫౧, ౫౨

ఏకతః కపిశార్దూలం యశస్వినమవస్థితౌ,

పట్టిసేన శితాగ్రేణ ప్రఘసః ప్రత్యయోధయత్. 33
భాసకర్ణశ్చ శూలేన రాక్షసః కపిసత్తమం,
స తాభ్యాం విక్షతైర్గాత్రైరసృగ్దిగ్ధతనూరుహః. 34
అభవద్వానరః క్రుద్ధో బాలసూర్యసమప్రభః,

సముత్పాట్య గిరేశ్శృంగం సమృగవ్యాళపాదపమ్. 35
జఘాన హనుమాన్వీరో రాక్షసౌ కపికుంజరః,
[గిరిశృఙ్గవినిష్పిష్టౌ తిరశస్తౌ బభూవతుః]

తతస్తేష్వవసన్నేషు సేనాపతిషు పంచసు. 36

అశ్వైరశ్వాన్ గజైర్నాగాన్ యోధైర్యోధాన్రథై రథాన్.
స కపిర్నాశయామాస సహస్రాక్ష ఇవాసురాన్,

హతైర్నాగైశ్చ తురగైర్భగ్నాక్షైశ్చ మహారథైః. 37
హతైశ్చ రాక్షసైర్భూమీ రుద్ధమార్గా సమంతతః,

తతః కపిస్తాన్ ధ్వజినీపతీన్ రణే
నిహత్య వీరాన్ సబలాన్ సవాహనాన్,
సమీక్ష్య వీరః పరిగృహ్య తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే. 38

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షట్చత్వారింశస్సర్గః.

ఆప్రఘసభాసకర్ణు లిర్వురును ఒకప్రక్కనే యుండి వానరశ్రేష్ఠుండగు హనుమంతునితో యుద్ధము చేసిరి.

ప్రఘసుండు కఱకుగల యడ్డకత్తిగొని వానరశ్రేష్ఠుండగు హనుమంతునితో యుద్ధముచేసెను. భాసకర్ణుండు శూలముతో యుద్ధంబుచేసెను. ౩౩

ఆహనుమంతుండు అట్లు ప్రఘసభాసకర్ణులచేఁ బాధితుండై దేహం బంతయు నెత్తురు గ్రమ్మునేటి బాలసూర్యునిభంగి వెలుంగుచుఁ గోపంబు నొందెను. ౩౪

వానరశ్రేష్ఠుండును బరాక్రమశాలియు నగు హనుమంతుం డంత మృగంబులతోను సర్పంబులతోను వృక్షంబులతోను గూడిన యొకపర్వత శిఖరంబుఁ బెకలించి దానిచే నాప్రఘసభాసకర్ణులం జంపెను. [ఇట్లాగిరి శృంగముచే నుగ్గుమాడఁబడిన యారక్కసు లిరువురు నష్టముగాఁ బడిరి.] ౩౫

అట్లు హనుమంతుండు ఆసేనానాయకులు మృతులయినపిమ్మట మిగిలి యున్న సైన్యంబునుం జంపెను. ౩౬

ఆహనుమంతుఁడు గుఱ్ఱంబులచే గుఱ్ఱంబుల నేసియు నేనుగులపై నేనుం గుల నెత్తివైచియు భటుల నెత్తి భటులపైఁ బడవైచియు రథంబుల రథంబులపై నేసియు నీప్రకారమున దేవేంద్రుండు అసురులం జంపినట్లు ఆసైన్యము నంతయు నశింపఁజేసెను. ౩౭

చచ్చిపడియున్నయేనుంగులచేతను గుఱ్ఱములచేతను విఱిగికూలినగొప్ప రథంబులచేతను హతులయినరాక్షసుల కళేబరంబులచేతను భూమియంతయుఁ గప్పఁబడియుండుటంజేసి మార్గంబున నడుచుట కవకాశము లేకుండినది. ౩౮

పరాక్రమవంతుఁడగు నాహనుమంతుఁడు వీరులగు నాసేనానాయకుల నైదుగురను వారిసైన్యవాహనంబులతోడం జంపి యంత మరల నాబహిర్ద్వారము నొంది ప్రజలవినాశకాలమునం దుగ్రుండై యుండు యమునిభంగిం జూపట్టుచు నూఱకుండెను. ౩౯

ఇది నలువదియాఱవ సర్గము.

## సప్తచత్వారింశస్సర్గః

సేనాపతీ౯ పంచ స తు ప్రమాపితా౯
హనూమతా సానుచరా౯ సవాహనా౯,
సమీక్ష్య రాజా సమరోద్ధతోన్ముఖం
కుమారమక్షం ప్రసమైక్షతాగ్రతః. ౧
స తస్య దృష్ట్యర్పణసంప్రచోదితః
ప్రతాపవా౯ కాంచనచిత్రకార్ముకః,
సముత్పపాతాథ సదస్యుదీరితో
ద్విజాతిముఖ్యైర్హవిషేవ పావకః. ౨
తతో మహద్బాలదివాకరప్రభం
ప్రతప్తజాంబూనదజాలసంతతం,
రథం సమాస్థాయ యయౌ స వీర్యవా౯
మహాహరిం తం ప్రతి నైరృతర్షభః. ౩
తతస్తపస్సంగ్రహసంచయార్జితం
ప్రతప్తజాంబూనదజాలశోభితం,
పతాకినం రత్నవిభూషితధ్వజం
మనోజవాష్టాశ్వవరైస్సుయోజితమ్. ౪
సురాసురాధృష్యమసంగచారిణం
రవిప్రభం వ్యోమచరం సమాహితం,
సతూణమష్టాసినిబద్ధబంధురం
యథాక్రమావేశితశక్తితోమరమ్. ౫
విరాజమానం ప్రతిపూర్ణవస్తునా సహేమదామ్నా శశిసూర్య
వర్చసా, దివాకరాభం రథమాస్థితస్తతస్స నిర్జగామామర
తుల్యవిక్రమః. ౬

## నలువదియేడవసర్గము

అంత రావణుండు సేనానాయకులయిదుగురును సైన్యవాహనములతోఁగూడ హనుమంతునిచేఁ జంపఁబడుటను విని తనముందటనున్నవాఁడును ఎల్లప్పుడును గయ్యమునకుఁ గాలుద్రవ్వుచుండువాఁడును యుద్ధోన్మత్తుఁడు నగు తనకుమారుం డగు నక్షునిపైఁ గటాక్షంబుఁ బఱచెను. ౧

అంత మహాపరాక్రమశాలియగు నాయక్షకుమారుండు రావణునిచే దృష్టిమాత్రమున నాజ్ఞాపింపఁబడినవాఁడై బంగారముతో నలంకరింపఁబడిన ధనుస్సు ధరించి బ్రాహ్మణోత్తములచే హవిస్సు వ్రేల్చి వృద్ధిఁబొందింపఁబడిన యగ్నిహోత్రము కైవడి సంరంభమున లేచెను. ౨

అంత మహాపరాక్రమశాలియును రాక్షసశ్రేష్ఠుండు నగు నక్షకుమారుండు బాలసూర్యుండుంబోలె వెలుఁగునదియు నుత్తమంబగు బంగారముచే నలంకరింపఁబడినదియు నగు గొప్పరథము నెక్కి హనుమంతునొద్దకుఁ బోయెను. 3

అంత దేవతలకుంబోలె మహాపరాక్రమముగల యాయక్షకుమారుండు పెక్కుతపములచే సంపాదింపఁబడినదియుం శ్రేష్ఠమయిన బంగారములచే నలంకరింపఁబడినదియుం సాధారణములగు టెక్కెములును మణులచే నలంకృతమయిన రాజచిహ్నయుక్తములగు టెక్కెములును గలదియును మనోవేగముగల యెనిమిదియుత్తమాశ్వములు గట్టినదియును దేవతలకును నసురులకును దేఱిచూడఁ గూడనిదియును భూమినంటకయె సంచరించునదియును యుద్ధసన్నద్ధం బయినదియును అమ్ములపొదులతోను ఎనిమిదికత్తులతోనుం గూడినదియును గంటలు గట్టియుండునదియును అర్హస్థలముల నుంచఁబడిన శక్తితోమరము లనునాయుధములు గలదియును చంద్రసూర్యులుంబోలె వెలుంగుచున్న బంగారుపువ్వుమాలికలతో నొప్పుచున్నదియును ధనుఃకవచాది సమస్తోపకరణములతోనుం గూడినదియుం నగురథము నెక్కి వెడలెను. ౪-౬

స పూరయన్ ఖం చ మహీం చ సాచలాం
తురంగమాతంగమహారథస్వనైః,
బలైస్సమేతైస్సహి తోరణస్థితం
సమర్థమాసీనముపాగమత్కపిమ్. ౭

స తం సమాసాద్య హరిం హరీక్షణో
యుగాంతకాలాగ్నిమివ ప్రజాక్షయే,
అవస్థితం విస్మితజాతసంభ్రమ
స్సమైక్షతాక్షో బహుమానచక్షుషా. ౮

స తస్య వేగం చ కపేర్మహాత్మనః
పరాక్రమం చారిషు పార్థివాత్మజః,
విచారయన్ స్వం చ బలం మహాబలో
హిమక్షయే సూర్య ఇవాభివర్ధతే. ౯

స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమం
స్థిరం స్థితస్సంయతి దుర్నివారణం,
సమాహితాత్మా హనుమంతమాహవే
ప్రచోదయామాస శరైస్త్రిభిశ్శితైః. ౧౦

తతః కపిం తం ప్రసమీక్ష్య గర్వితం
జితశ్రమం శత్రుపరాజయోర్జితం,
అవైక్షతాక్షస్సముదీర్ణమానస
స్సబాణపాణిః ప్రగృహీతకార్ముకః. ౧౧

స హేమనిష్కాంగదచారుకుండల
స్సమాససాదాఽశు పరాక్రమః కపిం,
తయోర్బభూవాప్రతిమస్సమాగమ
స్సురాసురాణామపి సంభ్రమప్రదః. ౧౨

ఇట్లు అక్షకుమారుఁడు అశ్వగజరథములన్నవియు నాకాశమును బర్వతములతోఁ గూడిన భూమియు నిండ సమస్తసైన్యములం గూడి సమర్థుఁడును అశోకవనబహిర్ద్వారమునం గూర్చుండియున్నవాఁడు నగు హనుమంతుం జేరెను. ౭

సింహమునకుఁబోలె నేత్రము గల యాయక్షకుమారుఁడు ప్రజల నశింపఁజేయం బూనియున్న ప్రళయకాలాగ్నిహోత్రునిచందమునం జూచుచున్న హనుమంతుంజేరి యతని గంభీరరూపమున కాశ్చర్యమును దొట్రుపాటునుబొంది యతండు పరాక్రమవంతుఁడే యని యతని సగౌరవముగాఁ జూచెను. ౮

మహాబలుఁడగు నాయక్షకుమారుఁడు మహాపరాక్రమశాలియగు నాహనుమంతుని వేగమును శత్రువుల జయించు పరాక్రమమును తనబలమును పరిచూచుకొని వసంతర్తువునందు సూర్యుఁడు వృద్ధిఁబొందునట్లు వృద్ధిఁ బొందెను. ౯

అంత నక్షకుమారుండు "యుద్ధమున హనుమంతుని జయించుట కష్ట" మని యెఱింగి కోపమునొంది స్థిరుండై యెచ్చరికగలవాఁడై హనుమంతునిఁ దీక్ష్ణములగు మూఁడుబాణములఁ గొట్టెను. ౧౦

అంత నక్షుఁడు మనమున గర్వమునొంది ధనుర్బాణముల ధరించి హనుమంతుండు గర్వితుండు ఎట్టిశ్రమమును సరకుసేయక శత్రువులజయించుట యందు సమర్థుఁడు అని యెఱిఁగి కొంత యాలోచించెను. ౧౧

అంత బంగారుపతకము వేసిన బాహుపురులును బోఁగులును ధరించి యున్నవాఁడును శత్రువు చెయ్యెత్తుటకు నవకాశములేకుండునట్లు పరాక్రమించువాఁడు నగు నాయక్షకుమారుండు హనుమంతుం దాఁకెను. అప్పు డాయిరువురసమాగమం బసదృశమయి దేవతలకు నసురులకును భయంబుఁ గలిగించినది. ౧౨

రరాస భూమిర్న తతాప భానుమాన్
వవౌ న వాయుః ప్రచచాల చాచలః,
కపేః కుమారస్య చ వీక్ష్య సంయుగం
ననాద చ ద్యౌరుదధిశ్చ చుక్షుభే. ౧౩

తతస్స వీరస్సుముఖాన్ పతత్త్రిణ
స్సువర్ణపుంఖాన్ సవిషానివోరగాన్,
సమాధిసంయోగవిమోక్షతత్త్వవి
చ్ఛరానథ త్రీన్ కపిమూర్ధ్న్యపాతయత్. ౧౪

స తైశ్శరైర్మూర్ధ్ని సమం నిపాతితైః
క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః,
నవోదితాదిత్యనిభశ్శరాంశుమా
న్వ్యరాజతాదిత్య ఇవాంశుమాలికః. ౧౫

తతస్స పింగాధిపమంత్రిసత్తమ
స్సమీక్ష్య తం రాజవరాత్మజం రణే,
ఉదగ్రచిత్రాయుధచిత్రకార్ముకం
జహర్ష చాపూర్యత చాహవోన్ముఖః. ౧౬

స మందరాగ్రస్థ ఇవాంశుమాలికో
వివృద్ధకోపో బలవీర్యసంయుతః,
కుమారమక్షం సబలం సవాహనం
దదాహ నేత్రాగ్నిమరీచిభిస్తదా. ౧౭

తతస్స బాణాసనచిత్రకార్ముక
శ్శరప్రవర్షో యుధి రాక్షసాంబుదః,

అప్పు డక్షహనుమంతుల యుద్ధమును జూచి భయమునొంది భూమి ధ్వనించినది. సూర్యుండు తపింపఁజేయఁడయ్యె. వాయువు వీవఁడయ్యె. పర్వతము చలించినది. ఆకాశము నఱచినది. సముద్రమునుంగూడ కలంగినది. ౧౩

అంత లక్ష్యమునందు దృష్టియుంచుటయందును బాణమును సంధించుటయందును బ్రయోగించుటయందును నేర్పరి యగునాయక్షుండు సుందరములగు ముఖములు గలవియును ఱెక్కలు గట్టినవియును బంగారముతోఁ జేసిన క్రిందిచివరలు గలవియును విషంబుఁ బూసినవగుటచే సర్పములం బోలె నున్నవియు నగు మూఁడుబాణముల హనుమంతునిశిరముపైఁ బ్రయోగించెను. ౧౪

హనుమంతుఁడు ఆమూఁడుబాణములు శిరమున సమముగా నాటుకొనియుండుటచే ధారలుగాఁ గాఱు నెత్తుటం గన్నులు దడియ బాలసూర్యునిభంగి వెలుంగుచు బాణము లనియెడు కిరణముల నొప్పుచున్నవాఁడు కావున కిరణపఙ్క్తులు గల సూర్యుండుంబోలెఁ బ్రకాశించెను. ౧౫

అంత వానరరాజగు సుగ్రీవుని మంత్రులలో నుత్తముండగు నా హనుమంతుండు యుద్ధమున నుత్తమంబు లగు నానావిధాయుధములం గూడి చిత్రగతుల ధనువు మెఱయ విహరించుచుండు నాయక్షకుమారునిం జూచి సంతోషించి మేనుం బెంచి యుద్ధముసేయ నారంభించెను. ౧౬

అప్పుడు హనుమంతుఁడు భూమికి నడుమనుండునట్టి మందరపర్వత శిఖరమున నుండు సూర్యునిభంగి నత్యుగ్రుండై మహాకోపమునొంది బలపరాక్రమములు వహించి కోపమున నెఱ్ఱఁగానుండుటచే నగ్నిహోత్రములం బోలెఁ గ్రాలుచున్న నేత్రముల నక్షకుమారుని అతని సైన్యములను వాహనములను జూఱుచుఱం జూచెను. ౧౭

అంత యుద్ధమునఁ దనధనువే యింద్రధనువుగా బాణమయంబగు వర్షము గురియుచు మేఘమువలెనుండు నాయక్షుండు మేఘము పర్వతముపై

శరాన్ముమోచాశు హరీశ్వరాచలే
వలాహకో వృష్టిమివాచలోత్తమే. ౧౮
తతః కపిస్తం రణచండవిక్రమం
వివృద్ధతేజోబలవీర్యసంయుతం,
కుమారమక్షం ప్రసమీక్ష్య సంయుగే
ననాద హర్షాద్ఘనతుల్యవిక్రమమ్. ౧౯
స బాలభావాద్యుధి వీర్యదర్పితః
ప్రవృద్ధమన్యుః క్షతజోపమేక్షణః,
సమాససాదాప్రతిమం కపిం రణే
గజో మహాకూపమివావృతం తృణైః. ౨౦
స తేన బాణైః ప్రసభం నిపాతితై
శ్చకార నాదం ఘననాదనిస్స్వనః,
సముత్పపాతాశు నభస్స మారుతి
ర్భుజోరువిక్షేపణఘోరదర్శనః. ౨౧
సముత్పతంతం సమభిద్రవద్బలీ
స రాక్షసానాం ప్రవరః ప్రతాపవాన్,
రథీ రథిశ్రేష్ఠతమః కిరన్ శరైః
పయోధరశ్శైలమివాశ్మవృష్టిభిః. ౨౨
స తాన్ శరాంస్తస్య హరిర్విమోక్షయన్
చచార వీరః పథి వాయుసేవితే,
శరాంతరే మారుతవద్వినిష్పత
న్మనోజవస్సంయతి చండవిక్రమః. ౨౩
తమాత్తబాణాసనమాహవోన్ముఖం
ఖమాస్తృణంతం విశిఖైశ్శరోత్తమైః,

వర్షము గురియునట్లు పర్వతాకారుండగు నాహనుమంతునిపై బాణములం బ్రయోగించెను. ౧౮

అంత యుద్ధమున భయంకరంబగు పరాక్రమమునం గ్రాలుచు మిక్కిలి యధికంబగు తేజమును బలమును బరాక్రమమును గలిగి మేఘముంబోలె నాకాశమునం దిరుగుచున్న యక్షకుమారుంజూచి సంతోషమున సింహనాదము చేసెను. ౧౯

ఆయక్షుండు బాలుం డగుటం జేసి యుద్ధమునం బరాక్రమగర్వితుండై మహాకోపమునొంది నేత్రముల వెఱ్ఱిదనము గదుర నేయుంగు తృణములం గప్పంబడిన పెద్దపాముబావిపైకిం బోవునట్లు యుద్ధమున నెదురులేనట్టి హను మంతునిపైకిం బోయెను. ౨౦

మేఘగర్జనమువంటి ధ్వనిగల యాహనుమంతుండు అక్షకుమారుండు వేసినబాణముల ప్రేటునకు గట్టిగా నఱచెను.

వాయుదేవుని కుమారుండగు నాహనుమంతుండు బాహువులం దొడలను విసరుచుం జూపరులు భయమునొంద శీఘ్రముగా నాకాశమున కెగిరెను. ౨౧

బలవంతుండును రాక్షసశ్రేష్ఠుండును మహాపరాక్రమశాలియును రథికోత్తముండు నగు నాయక్షుండు మేఘము పర్వతముపై ఱాళ్లవాన గురియు నట్లు ఆకాశమున కెగురుచున్నహనుమంతునిపై బాణములు వేయుచు రథము తోంగూడం దోడనె తానును ఆకాశమున కెగిరెను. ౨౨

మనమునకుంబోలె వేగము గలవాండును యుద్ధమున భయంకరమైన పరాక్రమము కలవాండునగు హనుమంతుండు వాయువుంబోలె బాణములకు నడుమం దిరుగుచు నాయక్షకుమారుని బాణములు తనపైం బడనీయక వాయుసేవితంబగు నాకాశమున విహరించుచుండెను. ౨౩

వాయుదేవునికుమారుండగు నాహనుమంతుండు ధనువుధరించి యుద్ధమున కభిముఖుండై యాకాశమునంతయుం బాణములం గప్పుచున్న యక్ష

అవైక్షతాక్షం బహుమానచక్షుషా
జగామ చింతాం చ స మారుతాత్మజః. ౨౪

తతశ్శరైర్భిన్నభుజాంతరః కపిః
కుమారవీరేణ మహాత్మనా నదన్,
మహాభుజః కర్మవిశేషతత్త్వవి
ద్విచింతయామాస రణే పరాక్రమమ్. ౨౫

అబాలవద్బాలదివాకరప్రభః
కరోత్యయం కర్మ మహన్మహాబలః,
న చాస్య సర్వాహవకర్మశోభినః
ప్రమాపణే మే మతిరత్ర జాయతే. ౨౬

అయం మహాత్మా చ మహాంశ్చ వీర్యత
స్సమాహితశ్చాతిసహశ్చ సంయుగే,
అసంశయం కర్మగుణోదయాదయం
సనాగయక్షైర్మునిభిశ్చ పూజితః. ౨౭

పరాక్రమోత్సాహవివృద్ధమానస
స్సమీక్షతే మాం ప్రముఖాగతస్స్థితః,
పరాక్రమో హ్యస్య మనాంసి కంపయే
త్సురాసురాణామపి శీఘ్రగామినః. ౨౮

న ఖల్వయం నాభిభవేదుపేక్షితః
పరాక్రమో హ్యస్య రణే వివర్ధతే,
ప్రమాపణం త్వేవ మమాస్య రోచతే
న వర్ధమానోఽగ్నిరుపేక్షితుం క్షమః. ౨౯

కుమారునిం జూచి మెచ్చుకొని "యితని కెట్లు వధింపఁగలను" అని చింత నొందెను. ౨౪

అంత మహాబాహుండగుటచే హనుమంతుండు మహాబలపరాక్రమ శాలియగు నక్షకుమారునిచే బాణములచే భుజాంతరమునందుఁ గొట్టఁబడిన వాఁడై యఱచి కార్యవిశేషముల నెఱింగినవాఁడు కావున నక్షకుమారుని జయించుటను గుఱించి యిట్లని యాలోచించెను. ౨౫

ఇతఁడు మహాబలుండు బాలుండయ్యు బాలసూర్యునిభంగి వెలుఁగుచు గొప్పకార్యము సేయుచున్నాఁడు. మఱియు సమస్తయుద్ధోపాయములను దెలిసియున్నాఁడు. నా కితనిఁ జంపఁ దోఁచలేదు. ౨౬

ఇతండు మహాబలుండు. కష్టము నోర్చువాఁడు. యుద్ధమునందలి యుత్కర్షము గలుగుటవలన నితని నాగయక్షులును దేవతలును మునులును బూజించుచుందురు. ఇందు సందేహము లేదు. ౨౭

ఇతఁడు మనమునఁ బరాక్రమము నుత్సాహమును గదుర నాముఖంబు నెదుట నిలుచుండి నన్ను జూచుచున్నాఁడు.

మిక్కిలి వడిగాఁ బరాక్రమించునట్టి యితనిపరాక్రమముం జూచి నచో దేవాసురులకైనను మనమున భయము గల్గును. ౨౮

ఇతని నిప్పుడు చంపకుండ నుపేక్షించి విడుతునేని యటుపిమ్మట నితండు తప్పక మమ్ము బాధించును. ఏలయనఁగా నితనిపరాక్రమం బిప్పుడే మిక్కిలి యధికముగా నున్నది. ఇఁకఁ గొంతసేపటికి మఱియుం గొంత యధికమగునో? కావున నిప్పుడు వీనిం జంపుటయే యుక్తంబని నాకుఁ దోఁచుచున్నది. వృద్ధిఁబొందుచున్న యగ్నిహోత్రము నెప్పుడైన నుపేక్షింప వచ్చునా? అని హనుమంతుం డాలోచించెను. ౨౯

ఇతి ప్రవేగం తు పరస్య తర్కయ-
స్స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్,
చకార వేగం తు మహాబల స్తదా
మతిం చ చక్రేఽస్య వధే మహాకపిః. ౩౦

స తస్య తానష్టహయాన్మహాజవాన్
సమాహితాన్ భారసహాన్వివర్తనే,
జఘాన వీరః పథి వాయుసేవితే
తలప్రహారైః పవనాత్మజః కపిః. ౩౧

తత స్తలేనాభిహతో మహారథ
స్స తస్య పింగాధిపమన్త్రినిర్జితః,
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః
పపాత భూమౌ హతవాజిరంబరాత్. ౩౨

స తం పరిత్యజ్య మహారథో రథం
సకార్ముకః ఖడ్గధరః ఖముత్పతన్,
తపోఽభియోగాదృషిరుగ్రవీర్యవాన్
విహాయ దేహం మరుతామివాలయమ్. ౩౩

తతః కపి స్తం విచరంతమంబరే
పతత్రిరాజానిలసిద్ధసేవితే,
సమేత్య తం మారుతతుల్యవిక్రమః
క్రమేణ జగ్రాహ సపాదయోర్దృఢమ్. ౩౪

స తం సమావిధ్య సహస్రశః కపి
ర్మహోరగం గృహ్య ఇవాండజేశ్వరః,
ముమోచ వేగాత్పితృతుల్యవిక్రమో
మహీతలే సంయతి వానరోత్తమః. ౩౫

మహాపరాక్రమశాలియును మహాబలుఁడు నగు హనుమంతుఁడు ఈ ప్రకారము శత్రుపరాక్రమంబును గుఱించి యాలోచించి తాను చేయవలసిన విధంబును నిర్ణయించుకొని యతనిఁ జంప నిశ్చయించి యధికమయిన వేగంబు నవలంబించెను. ౩౦

పరాక్రమవంతుఁడును వాయుదేవుని కుమారుఁడు నగు హనుమంతుఁడు మహావేగంబు గలవియు నేమఱుపాటు లేనివియు నానావిధగతులందు రథభారంబు సహించునవియు నగు నాయక్షకుమారుని గుఱ్ఱముల నెనిమిదింటి నాకాశమున నఱచేతం గొట్టి చంపెను. ౩౧

అంత వానరరాజగు సుగ్రీవుని మంత్రియయిన హనుమంతుని యఱచేతి ప్రేటునకు ఆయక్షుని మహారథము చక్రంబులు విఱిగియు నొగతొలంగియు గుఱ్ఱంబులు చచ్చియు నాకాశంబుననుండి నేలంగూలిపడి. ౩౨

భయంకరంబగు పరాక్రమంబు గలవాఁడును దన్నును సారథిని గుఱ్ఱంబులనుం గాపాడుకొనుచుఁ బదునొకండు వేలమందివిలుకాండ్రతోఁ బోరం జాలిన మహాశూరుండు నగు నాయక్షుండు ఆరథంబు విడిచి ధనుస్సును ధరించి ఋషి తపంబు పెంపున దేహంబు విడిచి స్వర్గమునకుఁ బోవునట్లు ఆకాశంబున కెగిరెను. ౩౩

అంత వాయువునకుంబోలె మహాపరాక్రమము గల హనుమంతుఁడు గరుత్మంతునకును వాయుదేవునకును సిద్ధులకును విహారస్థానమయిన యాకాశమునందు విహరించుచున్న యాయక్షకుమారుం జూచి యుపాయమున నతనిపాదంబులం గట్టిగాఁ బట్టుకొనెను. ౩౪

తనతండ్రియగు వాయుదేవునకుఁబోలెఁ బరాక్రమంబు గలవాఁడును వానరోత్తముండు నగు నాహనుమంతుండు గరుత్మంతుండు మహాసర్పంబును బట్టుకొనునట్లు ఆయక్షునిం బట్టుకొని వేయిమార్లు త్రిప్పి వేగంబున నేలం బడఁగొట్టెను. ౩౫

స భగ్నబాహూరుకటీశిరోధరః
క్షరన్నసృఙ్నిర్మథితాస్థిలోచనః,
స భగ్నసంధిః ప్రవికీర్ణబంధనో
హతః క్షితౌ వాయుసుతేన రాక్షసః. 3౬

మహాకపిర్భూమితలే నిపీడ్య తం
చకార రక్షోధిపతేర్మహద్భయం,
మహర్షిభిశ్చక్రచరైర్మహావ్రతై
స్సమేత్య భూతైశ్చ సయక్షపన్నగైః. 3౭

సురైశ్చ సేంద్రైర్భృశజాతవిస్మయై
ర్హతే కుమారే స కపిర్నిరీక్షితః,
నిహత్య తం వజ్రిసుతోపమప్రభం
కుమారమక్షం క్షతజోపమేక్షణమ్. 3౮

తమేవ వీరోఽభిజగామ తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే.

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తచత్వారింశస్సర్గః.

---

## అష్టచత్వారింశస్సర్గః

తత స్స రక్షోధిపతిర్మహాత్మా
హనూమతాఽక్షే నిహతే కుమారే,
మనస్సమాధాయ తదేంద్రకల్పం
సమాదిదేశేంద్రజితం సరోషమ్. ౧

త్వ మస్త్రవి చ్ఛస్త్రవిదాం వరిష్ఠ
స్సురాసురాణామపి శోకదాతా,

ఆయక్షకుమారుండు చేతులును దొడలును మొలయును మెడయును విఱిగి దేహంబున నెత్తురుగాఱ నెముకలును గండ్లును నలఁగి కండ్లకుఁ గానరాకుండ సంధిబంధములు విఱుగ దట్టి పీడ హనుమంతునిచే హతుండై నేలం బడెను. ౩౬

హనుమంతుఁ డట్లక్షకుమారు నేలంగొట్టి ముద్దగాఁ జేసి రాక్షసేశ్వరుం డగు రావణునకు మహాభయము గలిగించెను.

హనుమంతుం డక్షకుమారుం జంపఁగానే జ్యోతిశ్చక్రంబునం దిరుగువారలును మహావ్రతులు నగుమహర్షులును భూతములును యక్షులును పన్నగములును దేవతలును దేవేంద్రుండు నొక్కటిగా మిక్కిలి యాశ్చర్యము నొంది యీహనుమంతుం జూచిరి. ౩౭

పరాక్రమవంతుఁ డగునాహనుమంతుఁడు దేవేంద్రునికొడుకుం బోలినవాఁడును నెత్తురువలె నెఱ్ఱనైనకండ్లు గలవాఁడు నగునక్షకుమారుం జంపి ఆ యశోకవనబహిర్ద్వారంబునకే పోయి ప్రళయకాలమునందు యముండుం బోలెఁ బ్రాణులకు భయంబుఁ బుట్టించుచు నూఱకుండెను. ౩౮

ఇది నలువదియేడవ సర్గము.

---

## నలువదియెనిమిదవ సర్గము

అట్లు హనుమంతునిచే నక్షకుమారుఁడు చచ్చుటను విని మహాపరాక్రమశాలియయిన రాక్షసేశ్వరుఁడగు రావణుండు దుఃఖం బడంచుకొని కోపంబు నొంది ఇంద్రతుల్యుం డగునింద్రజిత్తుం జూచి యిట్లని యాజ్ఞాపించెను. ౧

నీ వస్త్రవేత్తవు. శస్త్రవిద్య నేర్చినవారలలో నుత్తముఁడవు. నిన్నుఁ జూచి దేవతలు నసురులును దుఃఖము నొందుదురు. మఱియుఁ జెప్ప-

సురేషు సేన్ద్రేషు చ దృష్టకర్మా
పితామహారాధనసంచితాస్త్రః. ౨
త వాస్త్రబలమాసాద్య నాసురా న మరుద్గణాః,
న శేకుస్సమరే స్థాతుం సురేశ్వరసమాశ్రితాః. ౩
న కశ్చిత్త్రిషు లోకేషు సంయుగే న గతశ్రమః,

భుజవీర్యాభిగుప్తశ్చ తపసా చాభిరక్షితః. ౪
దేశకాలవిభాగజ్ఞస్త్వమేవ మతిసత్తమః,

న తేఽస్త్యశక్యం సమరేషు కర్మణా
న తేఽస్త్యకార్యం మతిపూర్వమంత్రణే. ౫
న సోఽస్తి కశ్చిత్త్రిషు సంగ్రహేషు వై
న వేద యస్తేఽస్త్రబలం బలం చ తే,
మమానురూపం తపసో బలం చ తే
పరాక్రమశ్చాస్త్రబలం చ సంయుగే. ౬
న త్వాం సమాసాద్య రణావమర్దే
మనశ్శ్రమం గచ్ఛతి నిశ్చితార్థం,
నిహతాః కింకరాస్సర్వే జంబుమాలీచ రాక్షసః. ౭
అమాత్యపుత్రా వీరాశ్చ పంచ సేనాగ్రయాయినః,
బలాని సుసమృద్ధాని సాశ్వనాగరథాని చ. ౮
సహోదరస్తే దయితః కుమారోఽక్షశ్చ సూదితః,

న హి తేష్వేవ మే సారో యస్త్వయ్యరినిషూదన. ౯

ఇదం హి దృష్ట్వా మతిమన్మహద్బలం
కపేః ప్రభావం చ పరాక్రమం చ,

మాఱులు దేవేంద్రునితోఁగూడ దేవతలనందఱ యుద్ధమున జయించినవాఁడవు. బ్రహ్మదేవు నారాధించి పెక్కుదివ్యాస్త్రంబులు సంపాదించియున్నావు. ౨

నీయస్త్రబలమహిమచే నసురులుగాని వాయువులుగాని దేవేంద్రుని కట్టువారలుగాని యుద్ధమున నీయెదుర నిలువంజాలరు. ౩

ముల్లోకములందును నీతో యుద్ధముచేసి పరాజయము నొందనివాఁ డెవ్వఁడును లేఁడు.

నీవు బాహుపరాక్రమమునను దపమునను రక్షితుండవు. ఏదేశమున నేకాలమున నేది సేయవలయునో ఆవిభాగము నెఱింగినవాఁడవు. తీక్ష్ణమయిన బుద్ధి కలవాఁడవు. నీయట్టివాఁ డెవ్వఁడును లేఁడు. ౪

యుద్ధమునఁ బురుషకారమున నీకశక్యమయిన దేదియు లేదు. బుద్ధితో నాలోచించుటయందు నీ కసాధ్య మేదియులేదు. ముల్లోకములందును నీయస్త్ర బలము నీదేహబలము నెఱుంగనివాఁ డెవ్వఁడును లేఁడు. ౫

నీవు తపోబలమునను యుద్ధమునను అస్త్రబలమునను నన్నుఁ బోలినవాఁ డవు. యుద్ధమున సంకటము గల్గునప్పుడు నామనసు నిన్నుఁ దలంచి దుఃఖము నొందకుండును. ౬

కింకరులందఱును జంపఁబడిరి. జంబుమాలియును వీరులగు మంత్రి పుత్త్రులును సేనానాయకు లయిదుగురును నిహతులైరి. మఱియు గుఱ్ఱంబుల నేనుంగుల రథంబుల సంపూర్ణంబులైన సైన్యంబులును జంపఁబడినది. ౭, ౮

నీకుఁ దమ్ముండును బ్రియుండును బాలుండు నగునక్షుండును జచ్చి నాఁడు.

శత్రువులం జంపునట్టి యింద్రజిత్తా! నాకు నీయందుండు గౌరవము వారలయందు లేదు. ౯

ఇంద్రజిత్తా! నీవు బుద్ధిమంతుఁడవు. కింకరు లాదిగా నక్షకుమారు

త్వమాత్మనశ్చాపి సమీక్ష్య సారం
కురుష్వ వేగం స్వబలానురూపమ్. ౧౦
బలావమర్దస్త్వయి సన్నికృష్టే
యథాగతే శామ్యతి శాంతశత్రౌ,
తథా సమీక్ష్యాత్మబలం పరంచ
సమారభస్వాస్త్రవిదాం వరిష్ఠ. ౧౧
న వీర సేనా గణశో చ్యవంతి
న వజ్రమాదాయ విశాలసారం,
న మారుతస్యాస్య గతేః ప్రమాణం
న చాగ్నికల్పః కరణేన హంతుమ్. ౧౨

తమేవమర్థం ప్రసమీక్ష్య సమ్యక్
స్వకర్మసామ్యాద్ధి సమాహితాత్మా,
స్మరంశ్చ దివ్యం ధనుషోఽస్త్రవీర్యం
వ్రజాక్షతం కర్మ సమారభస్వ. ౧౩
న ఖల్వియం మతిశ్శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయామ్యహం,
ఇయం చ రాజధర్మాణాం క్షత్రస్య చ మతిర్మతా. ౧౪

నానాశస్త్రైశ్చ సంగ్రామే వైశారద్యమరిందమ,
అవశ్యమేవ యోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే. ౧౫

తతః పితుస్తద్వచనం నిశమ్య ప్రదక్షిణం దక్షసుతప్రభావః,
చకార భర్తారమదీనసత్త్వో రణాయ వీరః ప్రతిపన్నబుద్ధిః. ౧౬

పటిమం గల శూరులం జంపిన యీవానరునిబలంబును బ్రభావంబును బరాక్రమంబును విమర్శించి నీబలంబునకుఁ దగునట్లు వేగము వహింపుము. ౧౦

అస్త్రవేత్తలలో నుత్తముఁడవగు నింద్రజిత్తా! శత్రువులను శమింపఁ జేయంగల నీవు ఇచ్చటనుండిపోయి యీవానరుం జేరఁగానే యటుపిమ్మటనైనను మనసేనకు నాశము గలుగకుండునట్లు నీబలంబును శత్రుబలంబునుం జూచుకొని యుద్ధంబుసేయుము. ౧౧

పరాక్రమశాలివగు నింద్రజిత్తా! ఒక్కొకసారికి గుంపులుగుంపులుగా భటులం జంపునట్టి యీవానరునివిషయమయి సేనలు పనికిరావు. వజ్రాయుధంబును అతనిపై నేమియుం జేయంజాలదు. కావున దానిం దీసికొనిపోవలదు. ఇతనికున్నంత శీఘ్రగమనము వాయువునకుంగూడ లేదు. మఱియు నగ్నిహోత్రంబువంటివాఁడు కావున నతని బిడికిళ్లం బొడిచియుఁ జంప నలవిగాదు. ౧౨

నీవు నే నిప్పుడు చెప్పినవిషయమును జక్కఁగా విచారించి నీకార్యంబు చెడకుండునట్లు ఏమఱుపాటులేక దివ్యంబగు నీయస్త్రబలంబును స్మరించుచుఁ బొమ్ము. అపాయము రాకుండునట్లు సేయుము. ౧౩

నేను నిన్ను యుద్ధమునకుఁ బంపుట యంత యుత్తమమయినదికాదు. అయితే ఈయుపాయము రాజధర్మములకును వాని ననుష్ఠించు క్షత్రియులకును యుక్తమయినది కావున నిన్నుఁ బంపుచున్నాను. ౧౪

శత్రువుల నడంగఁద్రొక్కఁజాలిన యింద్రజిత్తా! నీవు నానావిధాయుధంబుల యుద్ధంబు సేయుటయందుఁ బండితుండవు. కావున నవశ్యము యుద్ధము సేయవలసినది. కావున నవశ్యము యుద్ధంబు జయంబునొందునట్లు సేయవలయును. ౧౫

అంత దేవతలకుంబోలెఁ బ్రభావంబుగలవాఁడును మహాబలుండును బరాక్రమవంతుఁడు నగునింద్రజిత్తు తండ్రిచెప్పినమాటను విని యుద్ధంబునకుఁ గోదలంచి తండ్రికిఁ బ్రదక్షిణంబు చేసెను. ౧౬

తత స్తైస్స్వగణై రిష్టైరింద్రజిత్ప్రతిపూజితః,
యుద్ధోద్ధతః కృతోత్సాహస్సంగ్రామం ప్రత్యపద్యత. ౧౭
శ్రీమాన్పద్మపలాశాక్షో రాక్షసాధిపతేస్సుతః,
నిర్జగామ మహాతేజాస్సముద్ర ఇవ పర్వసు. ౧౮

స పక్షిరాజోపమతుల్యవేగై
ర్వ్యాళైశ్చతుర్భిస్సితతీక్ష్ణదంష్ట్రైః,
రథం సమాయుక్తమసంగవేగం
సమారురోహేంద్రజిదింద్రకల్పః. ౧౯
స రథీ ధన్వినాం శ్రేష్ఠశ్శస్త్రజ్ఞోఽస్త్రవిదాం వరః,
రథేనాభియయౌ క్షిప్రం హనుమాన్యత్ర సోఽభవత్. ౨౦

స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ,
నిశమ్య హరివీరోఽసౌ సంప్రహృష్టతరోఽభవత్. ౨౧
సుమహచ్చాపమాదాయ శితశల్యాంశ్చ సాయకాన్,
హనుమంతమభిప్రేత్య జగామ రణపండితః. ౨౨
తస్మిం స్తత స్సంయతి జాతహర్షే
రణాయ నిర్గచ్ఛతి బాణపాణౌ,
దిశశ్చ సర్వాః కలుషా బభూవు
ర్మృగాశ్చ రౌద్రా బహుధా వినేదుః. ౨౩
సమాగతా స్తత్ర తు నాగయక్షా
మహర్షయ శ్చక్రచరాశ్చ సిద్ధాః,
నభస్సమావృత్య చ పక్షిసంఘా
వినేదురుచ్చైః పరమప్రహృష్టాః. ౨౪

అంత నింద్రజిత్తు తనవారలు నానావిధములం బొగడ యుద్ధగర్వంబునం బరమోత్సాహంబు నొంది యుద్ధంబు సేయుటకై పోయెను. ౧౭

కాంతిమంతుండును కమలంబుల రేకులంబోలిన కన్నులుగలవాఁడును మహాపరాక్రమశాలియు నగునింద్రజిత్తు పర్వకాలంబులందు సముద్రుండువలె నుప్పొంగి యుద్ధంబునకు వెడలెను. ౧౮

ఇంద్రతుల్యుండగు నాయింద్రజిత్తు వేగంబున గరుత్మంతునకు సాటి యయినవియు వేగంబునఁ బరస్పరసమానములునుఁ దెల్లని కఱకుకోఱలు గలవియు నగు నాలుగుగజంబులతోఁ గూడినరథంబు నెక్కెను. ౧౯

రథికుండును విలుకాండ్రలో శ్రేష్ఠుఁడును శస్త్రవిద్య నేర్చినవాఁడును అస్త్రవేత్తలలో నుత్తముఁడు నగు నాయింద్రజిత్తు రథంబు నెక్కి శీఘ్రముగా హనుమంతుఁ డున్నచోటికిం బోయెను. ౨౦

హనుమంతుఁడు ఆయింద్రజిత్తురథధ్వనిని అల్లెత్రాటిధ్వనిని విని మరల యుద్ధంబు సేయఁగలిగినదని పరమసంతోషంబు బొందెను. ౨౧

యుద్ధంబున సమర్థుండగు నింద్రజిత్తు గొప్పధనుస్సును కఱకుబాణంబులను దీసికొని హనుమంతునిగుఱించి పోయెను. ౨౨

అంత నప్పుడు ఇంద్రజిత్తు ఉత్సాహంబున బాణంబు చేతందాల్చి యుద్ధంబునకు వెడలుచుండఁగా దిక్కులన్నియు మలినములుగాఁ దాపట్టినవి. క్రూరమృగంబులు నానావిధంబులుగ నఱచినవి. ౨౩

అప్పు డాయుద్ధముఁ జూడ నచ్చటికి జ్యోతిశ్చక్రసంచారులగు సర్పంబులును మహర్షులును సిద్ధులును వచ్చిరి. పక్షులు పరమసంతోషమున నాకాశమున గుంపులుగట్టి గట్టిగా నఱచినవి. ౨౪

ఆయాంతం సరథం దృష్ట్వా తూర్ణమింద్రజితం కపిః,
విననాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్. ౨౫

ఇంద్రజిత్తు రథం దివ్యమాస్థితశ్చిత్రకార్ముకః,
ధనుర్విస్ఫారయామాస తటిదూర్జితనిస్స్వనమ్. ౨౬
తతస్సమేతావతితీక్ష్ణవేగౌ మహాబలౌ తౌ రణనిర్విశంకౌ,
కపిశ్చ రక్షోధిపతేశ్చ పుత్త్రస్సురాసురేంద్రావివ బద్ధవైరౌ.

స తస్య వీరస్య మహారథస్య ధనుష్మతస్సంయతి సమ్మతస్య,
శరప్రవేగం వ్యహనత్ప్రవృద్ధశ్చచార మార్గేపితురప్రమేయే.

తతశ్శరానాయతతీక్ష్ణశల్యాన్
సుపత్రిణః కాంచనచిత్రపుంఖాన్,
ముమోచ వీరః పరవీరహంతా
సుసన్నతాన్ వజ్రనిపాతవేగాన్. ౨౯

తతస్తు తత్స్యందననిస్స్వనం చ మృదంగభేరీపటహస్వనం చ,
వికృష్యమాణస్య చ కార్ముకస్య నిశమ్యఘోషం పునరుత్పపాత.

శరాణామంతరేష్వాశు వ్యవర్తత మహాకపిః,
హరిస్తస్యాభిలక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్. ౩౧

వేగవంతుండగు హనుమంతుండు రథముపైకి శీఘ్రముగా వచ్చుచున్న యింద్రజిత్తుం జూచి సంతోషమున మహాధ్వని గల్గునట్లు సింహనాదంబు చేసి మేను బెంచెను. ౨౫

ఇంద్రజిత్తును జిత్రంబగు ధనువుఁ జేకొని దివ్యరథముపైనుండి పిడుగు నకుంబోలె మహాధ్వని గల్గునట్లు సారించెను. ౨౬

అంత మహావేగులును మహాబలశాలులును యుద్ధమునం దంతమాత్రము భయములేనివారలును బరస్పరవైరము గలవారలు నగు హనుమ దింద్రజిత్తులు ఒండొరులం గలిసిరి. ౨౭

ఆహనుమంతుఁడు మేనుఁబెంచి యప్రమేయంబగు నాకాశమున విహరించుచుఁ బరాక్రమశాలియనుఁ దన్నును సారథిని గుఱ్ఱములనుం గాపాడుకొనుచుఁ బదునొకండువేలమంది విలుకాండ్రతోఁ బోరంజాలినవాఁడును ధనుష్మంతుఁడును యుద్ధము సేయుటయందు సమర్థుఁడును గౌరవంబునొందినవాఁడు నగు నాయింద్రజిత్తు వేయుబాణములఁ దనపైఁ బడనీయక వ్యర్థముగాఁ జేసెను. ౨౮

అంత శత్రువీరుల జంపునట్టి వీరుఁడగు నింద్రజిత్తు నిడుపులయినవియుఁ గఱకుగలవియు నగు నుక్కుమేకులు గలవియును సుందరములగు ఱెక్కలు గట్టినవియును బంగారముతోఁ జేయఁబడిన చిత్రములగు క్రిందిచివరలు గలవియును గొంచెము వంగినయగ్రములు గలవియు వజ్రాయుధమునకుంబోలె వేగముగలవియు నగుబాణములను హనుమంతునిపై వేసెను. ౨౯

అంత నాహనుమంతుఁడు ఆయింద్రజిత్తు రథధ్వనిని మద్దెళలు భేరులు తప్పెటలు మొదలగువాని ధ్వనిని ఆకర్షింపఁబడుచున్న వింటిశబ్దమును విని మరల నాకాశమున కెగిరెను. ౩౦

ఆహనుమంతుండు గుఱిపట్టికొట్టుటయందుఁ బ్రసిద్ధుండైన యా-యింద్రజిత్తుపట్టిన గుఱి వ్యర్థమగునట్లు శీఘ్రగమనమున బాణముల మధ్యప్రదేశములందు సంచరించెను. ౩౧

శరాణామగ్రత స్తస్య పునస్సమభివర్తత,
ప్రసార్య హస్తౌ హనుమానుత్పపాతానిలాత్మజః. 3౨

తావుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ,
సర్వభూతమనోగ్రాహి చక్రతుర్యుద్ధముత్తమమ్. 33

హనూమతో వేద న రాక్షసోఽంతరం
న మారుతి స్తస్య మహాత్మనోఽంతరం,
పరస్పరం నిర్విషహౌ బభూవతు
స్సమేత్య తౌ దేవసమానవిక్రమౌ. 3౪
తతస్తు లక్ష్యే స విహన్యమానే
శరేష్వమోఘేషు చ సంపతత్సు,
జగామ చింతాం మహతీం మహాత్మా
సమాధిసంయోగసమాహితాత్మా. 3౫
తతో మతిం రాక్షసరాజసూను
శ్చకార తస్మిన్ హరివీరముఖ్యే,
అవధ్యతాం తస్య కపేస్సమీక్ష్య
కథం నిగచ్ఛేదితి నిగ్రహార్థమ్. 3౬
తతః పైతామహం వీరస్సోఽస్త్రమస్త్రవిదాం వరః,
సందధే సుమహాతేజా స్తం హరిప్రవరం ప్రతి. 3౭

అవధ్యోఽయమితి జ్ఞాత్వా తమస్త్రేణాస్త్రతత్త్వవిత్,
నిజగ్రాహ మహాబాహుర్మారుతాత్మజమింద్రజిత్. 3౮

తేన బద్ధస్తతోఽస్త్రేణ రాక్షసేన స వానరః,

వాయుదేవునికుమారుండగు హనుమంతుఁడు ఆయింద్రజిత్తుబాణములకు ముందట నెదురుగానుండి మరల జేతులఁజాఁచి యాకాశమున కెగిరెను, ఇట్లు నానాప్రకారముల విహరించెను. ౩౨

వేగవంతులును యుద్ధముసేయుటయందు సమర్థులును నగు హనుమ దింద్రజిత్తు లిర్వురును సమస్తభూతముల మనంబులకు సంతోషముగల్గునట్లు ఉత్తమంబగు యుద్ధముఁ జేసిరి. ౩౩

హనుమంతుని ఛిద్రం బింద్రజిత్తునకుం దెలియదయ్యె. హనుమంతునకు మహాపరాక్రమశాలియగు నాయింద్రజిత్తుని యంతరము దెలియలేదు. అట్లు దేవతలకుంబోలె మహాపరాక్రమము గల యాయిర్వురకును ఒకరినొకరు జయించుట యసాధ్యముగా నుండినది. ౩౪

అంత నత్యమోఘము లగుబాణము లేసినను హనుమంతునిపైఁ బడక గుఱితప్పి వ్యర్థమగుటం జూచి గుఱిపట్టుటయందును బాణములఁ సంధించుట యందును నేమఱుపాటు లేనట్టి మహాపరాక్రమశాలియగు నాయింద్రజిత్తు గొప్ప చింతనొందెను. ౩౫

అంత రాక్షసేశ్వరుండగు రావణుని కొడుకయిన యాయింద్రజిత్తు "హనుమంతుని వధింప నలవిగాదు" అని యెఱింగి పట్టుకొనుటకైనను "ఇతం డేవిధంబునఁ బట్టుపడు" నని యాలోచించి వానరోత్తముం డగుహానుమంతుఁడు పట్టుపడునట్లు ఒకయుపాయంబు కన్నెను. ౩౬

అంత వీరుండును అస్త్రవేత్తలలో నుత్తముఁడును మహాకాంతిశాలియు నగు నాయింద్రజిత్తు వానరశ్రేష్ఠుఁ డగు నాహనుమంతునిపైకి బ్రహ్మాస్త్రంబు సంధించెను. ౩౭

సమస్తాస్త్రతత్త్వంబుల నెఱింగినవాఁడును మహాబాహుఁడునగు నింద్రజిత్తు "హనుమంతుని జంప నలవిగా" దని యెఱింగి బ్రహ్మాస్త్రంబుఁ బ్రయోగించి వాయుపుత్రుఁడగు హనుమంతుని బట్టుకొనెను. ౩౮

అంత నాహనుమంతుఁడు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రంబు

అభవ న్నిర్విచేష్టశ్చ పపాత స మహీతలే. ౩౯

తతోఽథ బుద్ధ్వా స తదాస్త్రబంధం
ప్రభోః ప్రభావాద్విగతాత్మవేగః,
పితామహానుగ్రహమాత్మనశ్చ
విచింతయామాస హరిప్రవీరః. ౪౦

తతస్స్వాయంభువైర్మంత్రైర్బ్రహ్మాస్త్రమభిమంత్రితం,
హనూమాంశ్చింతయామాస వరదానం పితామహాత్. ౪౧

న మేఽస్త్రబంధస్య చ శక్తిరస్తి
విమోక్షణే లోకగురోః ప్రభావాత్,
ఇత్యేవ మత్వా విహితోఽస్త్రబంధో
మయాత్మయోనేరనువర్తితవ్యః. ౪౨

స వీర్యమస్త్రస్య కపిర్విచార్య
పితామహానుగ్రహమాత్మనశ్చ,
విమోక్షశక్తిం పరిచింతయిత్వా
పితామహాజ్ఞామనువర్తతే స్మ. ౪౩

అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే,
పితామహమహేంద్రాభ్యాం రక్షితస్యానిలేన చ. ౪౪

గ్రహణే చాపి రక్షోభిర్మహాన్మే గుణదర్శనః,
రాక్షసేంద్రేణ సంవాదస్తస్మాద్గృహ్ణంతు మాం పరే. ౪౫

స నిశ్చితార్థః పరవీరహంతా
సమీక్ష్యకారీ వినివృత్తచేష్టః,
పరైః ప్రసహ్యాభిగతైర్నిగృహ్య
ననాద తైస్తైః పరిభర్త్స్యమానః. ౪౬

నకుఁ గట్టుపడి చేష్టలు దక్కి నేలంబడెను. ౩౯

అంత నప్పుడు హనుమంతుఁడు తాను బ్రహ్మాస్త్రంబుచేఁ బట్టుపడుట యెఱింగి బ్రహ్మదేవుని ప్రభావంబువలనఁ జేష్టలు దక్కి తనకుఁ బూర్వము బ్రహ్మదేవుం డొసంగిన వరముం దలంచుకొనెను. ౪౦

అంత హనుమంతుఁడు తనపై నింద్రజిత్తు స్వాయంభువమంత్రంబుల నభిమంత్రించి బ్రహ్మాస్త్రము ప్రయోగించినాఁడని తెలిసికొని తనకుఁ బూర్వము బ్రహ్మదేవుఁడు వరం బొసంగియుండుటను తలంచుకొనెను. ౪౧

లోకగురుండగు బ్రహ్మదేవుని ప్రభావమువలన బ్రహ్మాస్త్రబంధము నేనే విడిపించుకొనంజాల నని తలంచి నన్ను యిట్టు బ్రహ్మాస్త్రముచే బంధించినాఁడు. అయినను నేను బ్రహ్మదేవునియస్త్రబంధమును గొంచె మనుసరించి యుండవలసినదే అని హనుమంతుఁడు తలంచెను. ౪౨

హనుమంతుఁ డట్లు బ్రహ్మాస్త్రప్రభావమును విచారించి తనకుఁ బూర్వమే యస్త్రములైనను సరకుసేయకుండుశక్తిని బ్రహ్మదేవుం డనుగ్రహించి యుండుటను దలంచుకొని బ్రహ్మదేవుని యాజ్ఞఁ జొప్పునఁ గొంతసేపు బద్ధుం డయ్యెను. ౪౩

బ్రహ్మాస్త్రంబున బంధింపఁబడినవాఁడ నగునన్ను బ్రహ్మదేవుండును దేవేంద్రుండును వాయుదేవుఁడును రక్షించుచున్నారు. కావున నాకేమియు భయంబు గలుగదు. ౪౪

ఒకవేళ రాక్షసులు నన్నుఁ బట్టుకొన్నను నాకు మహాఫలం బగు రావణునితోటి సంవాదంబు గల్గును. కావున నన్ను శత్రువులు పట్టుకొన్నను బట్టుకొందురుగాక! అని హనుమంతుఁడు తలంచెను. ౪౫

శత్రువీరులం జంపువాఁడును చక్కఁగా విచారించి కార్యంబులం జేయువాఁడు నగు నా హనుమంతుండు ఈ ప్రకారము నిశ్చయించి చేష్టలు దక్కి రాక్షసులు తన్నుఁ బట్టుకొని భయంబున మెల్లమెల్లఁగా నెదుటవచ్చి నానావిధంబులం బెదిరింపఁగా సింహనాదము చేసెను. ౪౬

తత స్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్టమరిందమం,
బబంధుశ్శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః. ౪౭

స రోచయామాస పరైశ్చ బంధనం
ప్రసహ్య వీరైరభినిగ్రహం చ,
కౌతూహలాన్మాం యది రాక్షసేంద్రో
ద్రష్టుం వ్యవస్యేదితి నిశ్చితార్థః. ౪౮
స బద్ధ స్తేన వల్కేన విముక్తోఽస్త్రేణ వీర్యవాన్,
అస్త్రబంధస్సచాన్యం హి న బంధమనువర్తతే. ౪౯

అథేంద్రజిత్తు ద్రుమచీరబద్ధం
విచార్య వీరః కపిసత్తమం తం,
విముక్తమస్త్రేణ జగామ చింతాం
నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్. ౫౦
అహో మహత్కర్మ కృతం నిరర్థకం
న రాక్షసైర్మంత్రగతిర్విమృష్టా,
పునశ్చ నాస్త్రే విహతేఽస్త్రమన్య
త్ప్రవర్తతే సంశయితాస్స్మ సర్వే. ౫౧

అస్త్రేణ హనుమాన్ ముక్తో నాత్మానమవబుధ్యత,
కృష్యమాణస్తు రక్షోభిస్తైశ్చ బంధైర్నిపీడితః. ౫౨

హన్యమాన స్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః,
సమీపం రాక్షసేంద్రస్య ప్రాకృష్యత స వానరః. ౫౩

అంత రాక్షసులు శత్రువుల నడంగఁ ద్రొక్కఁజాలిన హనుమంతుండు చేష్టలు దక్కియుండుటంజూచి జనపనారను నారచీరలును దేఁడి యాత్రాళ్లతో బంధించిరి. ౪౭

హనుమంతుండు "ఒకవేళ రావణుండు కౌతూహలమున దన్నుఁజూచు నేమో" అని తలంచి వీరులగు నారాక్షసులు దన్ను గట్టినను బలాత్కారమునం బట్టుకొన్నను దానికంతయు నొప్పియుండెను. ౪౮

రాక్షసు లట్లు పరాక్రమవంతుండగు హనుమంతుని ఆనారతోఁగట్టఁగా నా బ్రహ్మాస్త్రబంధం బతని విడిచినది. మఱియొకదానితోఁ గట్టినపిమ్మట బ్రహ్మాస్త్రబంధము నిలువదు. ౪౯

అంత వీరుండగు నింద్రజిత్తు వానరశ్రేష్ఠుఁడయిన హనుమంతుండు నారచీరతోఁ గట్టఁబడఁగానే బ్రహ్మాస్త్రబంధమువలన విడివడుట నెఱింగి "మఱియొకదానితోఁ గట్టినపిమ్మట బ్రహ్మాస్త్రబంధము నిలువదుగదా" యని చింతనొందెను. ౫౦

అయ్యో! గొప్పపనిచేసినను అదివ్యర్థమయినది. మూర్ఖులగు నీరాక్షసులు బ్రహ్మాస్త్రస్వభావమును విచారింపక యీనారతో హనుమంతుం గట్టినారు. మఱియుం బ్రహ్మాస్త్రము ప్రతిహతమయిన పిమ్మట మఱియొకయస్త్రము పాఱదు. ఇఁక మాయందఱితోడను రావణునకు సంకటము గల్గును. అని యింద్రజిత్తు చింతించెను. ౫౧

హనుమంతుఁడు బ్రహ్మాస్త్రంబువలన విడివడియును తన్ను రాక్షసులు గట్టిగా బంధించి యీడ్చుకొని పోవుచున్నను "దన్ను బ్రహ్మాస్త్రంబు విడిచిన" దని తెలిసికొనఁడయ్యె. ౫౨

అంత నిర్దయులగు నారాక్షసులు హనుమంతుని గట్టియలం గొట్టుచును పిడికిళ్ల బొడుచుచును రాక్షసేశ్వరుండగు రావణుని సమీపంబున కీడ్చుకొనిపోయిరి. ౫౩

అథేంద్రజిత్తం ప్రసమీక్ష్య ముక్త
మస్త్రేణ బద్ధం ద్రుమచీరసూత్రైః,
వ్యదర్శయత్తత్ర మహాబలం తం
హరిప్రవీరం సగణాయ రాజ్ఞే. ౪౪

తం మత్తమివ మాతంగం బద్ధం కపివరోత్తమం,
రాక్షసా రాక్షసేంద్రాయ రావణాయ న్యవేదయన్. ౪౫

కోఽయం కస్య కుతో వాఽత్ర కిం కార్యం కో వ్యపాశ్రయః,
ఇతి రాక్షసవీరాణాం తత్ర సంజజ్ఞిరే కథాః. ౪౬

హన్యతాం దహ్యతాం వాఽపి భక్ష్యతామితి చాపరే,
రాక్షసాస్తత్ర సంక్రుద్ధాః పరస్పరమథాబ్రువన్. ౪౭

అతీత్య మార్గం సహసా మహాత్మా
స తత్ర రక్షోఽధిపపాదమూలే,
దదర్శ రాజ్ఞః పరిచారవృద్ధాన్
గృహం మహారత్నవిభూషితం చ. ౪౮

స దదర్శ మహాతేజా రావణః కపిసత్తమం,
రక్షోభిర్వికృతాకారైః కృష్యమాణమితస్తతః. ౪౯

రాక్షసాధిపతిం చాపి దదర్శ కపిసత్తమః,
తేజోబలసమాయుక్తం తపంతమివ భాస్కరమ్. ౫౦

స రోషసంవర్తితతామ్రదృష్టి
ర్దశాననస్తం కపిమన్వవేక్ష్య,
అథోపవిష్టాన్ కులశీలవృద్ధాన్
సమాదిశత్తం ప్రతి మంత్రిముఖ్యాన్. ౫౧

అంత నారాజసభయం దింద్రజిత్తు బ్రహ్మాస్త్రంబువలన విడివడి నార చీరల త్రాళ్లచే బంధింపఁబడిన మహాబలుండగు నాహనుమంతుం జూచి "యి ఎడె యావానరుం" డని సభికులతోఁ గూడిన రావణునకుం జూపెను. ౫౪

రాక్షసులు మదించినయేనుంగుం బోలియున్న బద్ధుండగు నాహను మంతుం దీసికొనిపోయి రాక్షసేశ్వరుండగు రావణునకుం జూపిరి. ౫౫

ఈవానరుం డెవ్వఁడు ? ఎవ్వనిమనిషి ? ఇచ్చటి కేల వచ్చినాఁడు ? ఇచ్చట నితని కేమిపని? ఎవ్వనియొద్దకు వచ్చినాఁడు? అని యిట్లాసభయందు రాక్షసులు పరస్పరము చెప్పుకొనిరి. ౫౬

అంత నచ్చట మఱికొందఱు రాక్షసులు "ఈవానరుం జంపుఁడు- దహించివేయుఁడు. భక్షింపుదము" అని పరస్పరము చెప్పుకొనిరి. ౫౭

అంత మహాపరాక్రమశాలియగు హనుమంతుఁడు శీఘ్రంబుగ మార్గంబు నతిక్రమించి రావణుని పాదమూలంబుననున్న మంత్రివృద్ధులను దివ్యమణుల నలంకృతంబై యున్న సభాగృహమునుం జూచెను. ౫౮

మహాపరాక్రమశాలియగు నారావణుండు వికృతరూపులగు రాక్షసుల చేత నీతట్టున కాతట్టునకు నీడ్వఁబడుచున్న వానరోత్తముని హనుమంతుని జూచెను. ౫౯

వానరోత్తముఁడగు హనుమంతుఁడు కాంతిమంతుఁడును బలవంతుఁ డును మధ్యాహ్నమునందలి సూర్యునిభంగి వెలుంగుచున్నవాఁడు నగురావణుం జూచెను. ౬౦

అంత నారావణుండు కోపంబుచే నేత్రంబుల నెఱ్ఱఁదనంబు గదుర గ్రుడ్లు త్రిప్పుచు నాహనుమంతుం జూచి యతని సమాచారం బడుగఁటకై యచ్చటఁ గూర్చుండియున్నకులశీలవృద్ధులగుమంత్రిశ్రేష్ఠుల కాజ్ఞాపించెను.

యథాక్రమం తైస్స కపిర్విపృష్టః
కార్యార్థమర్థస్య చ మూలమాదౌ,
నివేదయామాస హరీశ్వరస్య
దూతస్సకాశాదహమాగతోఽస్మి. ౬౨

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - అష్టచత్వారింశస్సర్గః.

## ఏకోనపఞ్చాశస్సర్గః

తతస్స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః,
హనుమాన్రోషతామ్రాక్షో రక్షోఽధిపమవైక్షత. ౧

భ్రాజమానం మహార్హేణ కాంచనేన విరాజతా,
ముక్తాజాలావృతేనాథ మకుటేన మహాద్యుతిమ్. ౨
వజ్రసంయోగసంయుక్తైర్మహార్హమణివిగ్రహైః,
హైమైరాభరణైశ్చిత్రైర్మనసేవ ప్రకల్పితైః. ౩
మహార్హక్షౌమసంవీతం రక్తచందనరూషితం,
స్వనులిప్తం విచిత్రాభిర్వివిధాభిశ్చ భక్తిభిః. ౪
వివృతైర్దర్శనీయైశ్చ రక్తాక్షైర్భీమవిక్రమైః,
దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః ప్రలంబదశనచ్ఛదైః. ౫
శిరోభిర్దశభిర్వీరం భ్రాజమానం మహౌజసం,
నానావ్యాళసమాకీర్ణైశ్శిఖరైరివ మందరమ్. ౬
నీలాంజనచయప్రఖ్యం హారేణోరసి రాజతా,
పూర్ణచంద్రాభవక్త్రేణ సబలాకమివాంబుదమ్. ౭
బాహుభిర్బద్ధకేయూరైశ్చందనోత్తమరూషితైః,

అంత సామంత్రులు "నీ వేల యిచ్చటికి వచ్చినావు? ఎవ్వరు నిన్నుఁ బంపినారు?" అని క్రమంబున నడుగఁగా హనుమంతుండు "నేను వానరాధీశ్వరుండగు సుగ్రీవునిదూతను. అతఁడు పంపఁగా వచ్చినాను" అని వారలకుఁ జెప్పెను. ౭౦

ఇది నలుఁబదియెనిమిదవ సర్గము.

## నలువదితొమ్మిదవ సర్గము

అంత భయంకరపరాక్రముఁడగు హనుమంతుండు "రావణుఁడు తాను సింహాసనంబున నేయుండి నన్నుఁ గట్టించి యిచ్చటికిఁ దెప్పించినాఁడు గదా" యని యతనికార్యమున కాశ్చర్యమునొంది కోపంబున నేత్రంబులం దెఱ్ఱదనంబు గదుర రావణుం జూచెను. ౧

అంత హనుమంతుండు దివ్యంబును, గాంచనమయంబును, ముత్తెములతో నలంకరింపఁబడినదియు కిరీటముతో నొప్పుచున్నవాఁడును మహాకాంతి గలవాఁడును వజ్రంబులు మొదలగు నానావిధమణులం బొదిగి బంగారముతోఁ జేసిన నానావర్ణంబులగు నాభరణములతోఁ గూడినవాఁడును ఉత్తమంబగు పట్టువస్త్రము గట్టుకొన్నవాఁడును కస్తూరి మొదలగునవి గలిపిన రక్తచందనము ధరించియున్నవాఁడును గొంచెము తెఱవఁబడిన నోళ్లుగలవియు సుందరంబులును జూపరులకు భయంబుగలిగించునవియు నగు బెద్దకఱకు కోఱలు గలవియు వ్రేలుచుండు పెదవులుగలవియునగు పదితలలుగలవాఁడగుటచే నానాదుష్టమృగసంపన్నంబులగు శిఖరంబులతోఁ గూడిన మందరపర్వతంబువలె బడి భాసిల్లుచున్నవాఁడును కాటుకవలె నల్లనివాఁడును ఱొమ్మునయందుచంద్రునిబోలు పతకముతోఁగూడిన ముక్తాహారము గలవాఁడు కావునఁ గొక్కెరలతోఁ గూడినయాకాశంబుపగిదిఁ జూపట్టుచున్నవాఁడును బాహుపురులు ధరించినవియుఁ జందనాలంకృతంబులును బీనంబులును అయిదుతలల సర్పంబులుంబోలె నున్నవియు నగు బాహువులు గలవాఁడును రత్నంబులు చెక్కి మంచికంబళము పరచి సుందరముగానుండు స్ఫాటికపీఠంబునఁ

భ్రాజమానాంగదైః పీనైః పంచశీర్షైరివోరగైః. ౯
మహతి స్ఫాటికే చిత్రే రత్నసంయోగసంస్కృతే,
ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే. ౯
అలంకృతాభిరత్యర్థం ప్రమదాభిస్సమంతతః,
వాలవ్యజనహస్తాభిరారాత్సముపసేవితమ్. ౧౦
దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా,
మంత్రిభిర్మంత్రతత్త్వజ్ఞైర్నికుంభేన చ మంత్రిణా. ౧౧
సుఖోపవిష్టం రక్షోభిశ్చతుర్భిర్బలదర్పితైః,
కృత్స్నః పరివృతో లోక శ్చతుర్భిరివ సాగరైః. ౧౨
మంత్రిభిర్మంత్రతత్త్వజ్ఞైరన్యైశ్చ శుభబుద్ధిభిః,
అన్వాస్యమానం రక్షోభిస్సురై రివ సురేశ్వరమ్. ౧౩
అపశ్యద్రాక్షసపతిం హనుమానతితేజసం,
విష్ఠితం మేరుశిఖరే సతోయమివతోయదమ్. ౧౪
స తై స్సంపీడ్యమానోఽపి రక్షోభిర్భీమవిక్రమైః,
విస్మయం పరమం గత్వా రక్షోధిపమవైక్షత. ౧౫
భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్రాక్షసేశ్వరం,
మనసా చింతయామాస తేజసా తస్య మోహితః. ౧౬
అహో రూపమహో ధైర్యమహో సత్త్వమహో ద్యుతిః,
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా. ౧౭
యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః,
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా. ౧౮
అస్య క్రూరైర్నృశంసైశ్చ కర్మభిర్లోకకుత్సితైః,
తేన బిభ్యతి ఖల్వస్మాల్లోకాస్సామరదానవాః. ౧౯

జక్కఁగా నలంకరించుకొని చామరంబులు చేతులం దాల్చియున్న యుత్తమ స్త్రీలచే వీవంబడుచు నాలుగుప్రక్కలను దుర్ధరుండును ప్రహస్తుండును మహాపార్శ్వుండును నికుంభుండును నను నలుగురు మంత్రివర్యులు చతుస్సముద్రంబులు లోకముంబోలెఁ బరివేష్టించియుండ వారలతో సుఖసల్లాపంబులు సేయుచు నితరులగు పెక్కండ్రు మంత్రులచే దేవతలచే దేవేంద్రుండుబోలె సేవింపఁబడుచు మేరుపర్వతశిఖరంబుననున్న నూతనమేఘంబుకైవడి నీలదేహంబునఁ గాంచనసింహాసనగతుండై యొప్పుచున్నవాఁడు నగు రాక్షసేశ్వరుని రావణుం జూచెను. ౨-౧౪

ఆహనుమంతుఁడు భయంకరంబగుపరాక్రమంబు గల యారాక్షసులం తన్ను బాధించుచున్నను దాని సరకుసేయక రావణుని యద్భుతాకారంబునకుఁ బరమాశ్చర్యంబునొంది మరల రాక్షసనాయకుండగురావణుం జూచెను. ౧౫

హనుమంతుఁ డట్లు దేదీప్యమానుఁడై యున్న రావణునింజూచి యతని కాంతివలన మోహంబునొంది లేఁతిచూడంజాలక యిట్లని చెప్పెను. ౧౬

రాక్షసరాజగు రావణుని యాకారము ధైర్యము బలము కాంతి సమస్తశుభలక్షణంబులును అన్నియు నాశ్చర్యకరములుగా నున్నవి. ౧౭

ఇతఁడు ఇంత యధికమయినయధర్మమును చేయకుండునేని రాక్షసరాజగు రావణుండు ఇంద్రునకును దేవలోకంబునకుం గూడఁ బ్రభువగును.

ఈరావణుండు భయంకరంబులును క్రూరంబులును జనకంటకంబులు నగు కర్మంబుల ననేకంబులం జేసియున్నాఁడు. అందుచేతనే యితనింజూచి దేవతలును దానవులును మున్నగుసమస్తలోకంబులవారును భయంబునొందెదరు.

అయం వ్యవ్యుత్సహాతే క్రుద్ధః కర్తుమేకార్ణవం జగత్,

ఇతి చింతాం బహువిధామకరోన్మతిమాన్ హరిః,
దృష్ట్వా రాక్షసరాజస్య ప్రభావమమితౌజసః. ౨౦

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకోనపఞ్చాశస్సర్గః.

## పఞ్చాశస్సర్గః

తముద్వీక్ష్య మహాబాహుః పింగాక్షం పురతస్థితం,
కోపేన మహతాఽఽవిష్టో రావణో లోకరావణః. ౧

శంకాహృతాత్మా దధ్యౌ స కపీంద్రం తేజసా వృతం,
కిమేష భగవాన్నందీ భవేత్సాక్షాదిహాగతః. ౨

యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా,
సోఽయం వానరమూర్తిస్స్యాత్కింస్విద్బాణోఽపి వాఽసురః. 3

స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమం,
కాలయుక్తమువాచేదం వచో విపులమర్థవత్ ౪

దురాత్మా పృచ్ఛ్యతామేష కుతః కిం వాఽస్య కారణం,
వనభంగే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే. ౫

మత్పురీమప్రధృష్యాం వాఽఽగమనే కిం ప్రయోజనం,
ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్యతామేష దుర్మతిః. ౬

రావణస్య వచశ్శ్రుత్వా ప్రహస్తో వాక్యమబ్రవీత్,

ఇతండు కోపంబునొందునేని ప్రపంచమునంతయు శోకసముద్రంబుగాఁ జేయంజాలును. అని హనుమంతుండు చింతించెను.

బుద్ధిమంతుండగు హనుమంతుండు మహాకాంతిశాలి యగు రావణుని ప్రభావంబుఁజూచి యిట్లు నానావిధంబులుగాఁ దలపోసెను. ౨౦

ఇది నలువదితొమ్మిదవ సర్గము.

---

## ఏఁబదియవ సర్గము

మహాబాహుండును సమస్తలోకంబుల నేడ్పించువాఁడు నగు నారావణుండు మహాకోపంబునఁ దనముందట నున్నవాఁడును గోరోచనపువన్నెగల కండ్లతో నొప్పుచున్నవాఁడును తేజోవంతుండు నగువాని వానరోత్తము హనుమంతుంజూచి యంత మనంబున భయంబునొంది యిట్లని చింతించెను. ౧

మున్ను నేను కైలాసపర్వతమును గదలించినప్పుడు నాకు శాపంబు నొసంగినట్టి భగవంతుండగు సాక్షాన్నందికేశ్వరుండే యిచ్చటికి ఈవానర రూపంబున వచ్చినాఁడా యేమి? ౨

లేక మహాసురుండగు బాణుండె యిట్లు వానరాకారంబుఁ దాల్చి వచ్చినాఁడా యేమి? అని రావణుండు చింతించె. ౩

రాక్షసరాజగురావణుం డంతఁ గోపంబునొంది నేత్రంబుల నెఱ్ఱఁదనంబు గదుర మంత్రిశ్రేష్ఠుండగు ప్రహస్తుంజూచి యాకాలంబునకుఁ దగినట్లు అధికమయిన యర్థముగల గంభీరంబగుమాటం జెప్పెను. ౪

"నీ వెచ్చటనుండి వచ్చినావు? ఇచ్చటి కేలవచ్చినావు? అశోకవనంబు నేల విఱిచినావు? రాక్షసస్త్రీల నెందుకు బెదరించినావు?" అని నీ వీ దురాత్ముని నడుగుము. ౫

"నీ వెట్టివారికిఁ జొరరాని నాపట్టణంబున కేల వచ్చితివి? యుద్ధం బేల చేసితివి?" అని నీవు దురాత్ముండగు వీని నడుగుము. అని రావణుండు ప్రహస్తునితోఁ జెప్పెను. ౬

ప్రహస్తుఁడు రావణుఁడు చెప్పినమాటను విని హనుమంతుం జూచి యిట్లని చెప్పెను.

సమాశ్వసి హి భద్రం తే న భీః కార్యా త్వయా కపే. ౭

యది తావ త్త్వమిన్ద్రేణ ప్రేషితో రావణాలయం,
త త్త్వమాఖ్యాహి మాభూ త్తే భయం వానర మోక్ష్యసే. ౮
యది వైశ్రవణస్య త్వం యమస్య వరుణస్య చ,
చారరూపమిదం కృత్వా ప్రవిష్టో నః పురీమిమామ్. ౯

విష్ణునా ప్రేషితో వాఽపి దూతో విజయకాంక్షిణా,
న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్. ౧౦
త త్త్వతః కథయస్వాద్య తతో వానర మోక్ష్యసే,

అనృతం వదతశ్చాపి దుర్లభం తవ జీవితమ్. ౧౧
అథవా యన్నిమిత్తం తే ప్రవేశో రావణాలయే,

ఏవముక్తో హరిశ్రేష్ఠస్తదా రక్షోగణేశ్వరమ్. ౧౨
అబ్రవీన్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య వా,

ధనదేన న మే సఖ్యం విష్ణునా నాస్మి చోదితః. ౧౩

జాతిరేవ మమ త్వేషా వానరోఽహమిహాగతః,

దర్శనే రాక్షసేన్ద్రస్య దుర్లభే తదిదం మయా. ౧౪
వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితం,
తత స్తే రాక్షసాః ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణః. ౧౫

రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే,

హనుమంతుఁడా! ఊఱటనొందుము. నీకు మంగళం బగుఁగాక! భయపడవలదు. ౭

ఇచ్చటికి నిన్ను దేవేంద్రుఁడు పంపినాఁడా? కుబేరుండుగాని యముఁడుగాని వరుణుఁడుగాని పంపఁగా చారుఁడవై యిచ్చటికి వచ్చినావా? లేక విష్ణుదేవుండే యైనను రావణుని జయింపఁగోరి నిన్నిచ్చటికి దూతగాఁ బంపినాఁడా? ఎవ్వరు పంపినను నిన్నేమియుఁ జేయుటలేదు. భయంబు నొందకుము. యథార్థస్థితిం జెప్పుము. నిన్ను విడిచిపుచ్చెదము. ౮,౯

నీదేహముమాత్రము వానరదేహముగాని ప్రభావంబు దలంచినచో నద్భుతంబుగా నున్నది. ౧౦

నీవు నీవృత్తాంతమును యథార్థముగాఁ జెప్పుము. అపిమ్మట నిన్ను విడిచిపుచ్చెదము.

నీ వబద్ధముఁ జెప్పుదువేని ప్రాణంబులతో నుండఁజాలవు. ౧౧

అట్లు ఎవ్వరిచేతనుం బంపఁబడక నీవై యే వచ్చినవాఁడ వగుదువేని నిచ్చటి కేల వచ్చితివో దానినైన జెప్పుము.

వానరోత్తముండగు హనుమంతుండు ప్రహస్తుండు చెప్పినమాటను విని రాక్షసేశ్వరుండగు రావణుంజూచి యిట్లని చెప్పెను. నేను దేవేంద్రునకుఁ గాని యమునకుఁగాని వరుణునకుఁగాని చారుండనై వచ్చినవాఁడను గాను.

నాకుఁ గుబేరునితో నెంత మాత్రము స్నేహములేదు. నన్ను విష్ణుదేవుం డిచ్చటికిఁ బంపలేదు. ౧౩

నేను జాతిచేతను వానరుండుగాని వానరరూపంబు నొందివచ్చినవాఁడను గాను.

రాక్షసనాయకుండ వగునీదర్శనంబు నాకు దుర్లభం బగుటంజూచి నీ దర్శనంబుఁగోరి నీయశోకవనంబు విఱిచితిని. ౧౪

అంత బలవంతులగు రాక్షసులు నాతో యుద్ధంబు సేయఁగోరి నా పైకి వచ్చిరి. ౧౫

నాదేహసంరక్షణార్థమై యుద్ధంబున నేను వారలను మరలం గొట్టితిని.

అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి. ౧౬

పితామహాదేవ వరో మమాప్యేషోఽభ్యుపాగతః,
రాజానం ద్రష్టుకామేన మయాస్త్రమనువర్తితమ్. ౧౭

విముక్తోహ్యహమస్త్రేణ రాక్షసైస్త్వభిపీడితః,
కేనచిద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాన్తికమ్. ౧౮
దూతోఽహమితి విజ్ఞేయో రాఘవస్యామితౌజసః,

శ్రూయతాం చాపి వచనం మమ పథ్యమిదం ప్రభో. ౧౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చాశస్సర్గః.

## ఏకపఞ్చాశస్సర్గః

తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః,

వాక్యమర్థవదవ్యగ్రస్తమువాచ దశాననమ్. ౧

అహం సుగ్రీవసన్దేశాదిహ ప్రాప్తస్తవాలయమ్,
రాక్షసేన్ద్ర హరీశస్త్వాం భ్రాతా కుశలమబ్రవీత్. ౨

భ్రాతుశ్శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః,
ధర్మార్థోపహితం వాక్యమిహ చాముత్ర చ క్షమమ్. ౩

రాజా దశరథో నామ రథకుఞ్జరవాజిమాన్,
పితేవ బన్ధుర్లోకస్య సురేశ్వరసమద్యుతిః. ౪

దేవాసురులకును ఏయస్త్రంబునకును ఏపాశంబునకును నన్ను బంధింప వలవిగాదు. ౧౬

నాకును ఈవరంబును బ్రహ్మదేవుండె యిచ్చినాఁడు.

రాక్షసరాజవగు నిన్నుఁ జూడవలయు ననువాంఛచే నేనీబ్రహ్మాస్త్రంబునకు బద్ధుండనైతిని. వేఱుగాదు. ౧౭

నన్నీరాక్షసులు బంధించినంతనే బ్రహ్మాస్త్రంబు విడిచినది.

నా కొకరాజకార్యమున్నది. అందుకై నేను నీయొద్దకు వచ్చినాను.

నేను కొలందిలేని పరాక్రమంబు గల రాముని యొద్దనుండి వచ్చిన దూతనని యెఱుంగుఁడు.

రాక్షసప్రభుండవగు రావణుండా! నేను నీకు మేలుగలిగించుమాటలం జెప్పెదను. దానిని వినుము. అని రావణునితో హనుమంతుండు చెప్పెను. ౧౯

ఇది ఏఁబదియవ సర్గము.

---

## ఏఁబదియొకటవ సర్గము

బలవంతుండును వానరశ్రేష్ఠుండును నగు హనుమంతుండు మహాబలశాలియగు నారావణుంజూచి యధికమయిన యర్థముగల యీమాటం జెప్పెను.

సుగ్రీవుండు నీకుఁ జెప్పుమని కొన్నిసమాచారములఁ జెప్పి నన్నుఁ బంపుటంజేసి నేను నీయొద్దకు వచ్చినాను. ౧

రాక్షసులకుఁ బ్రభుండవగు రావణుండా! నీకుఁ దోఁబుట్టువువంటివాఁడును వానరాధీశ్వరుండు నగుసుగ్రీవుండు తనక్షేమమును నీకుఁ జెప్పుమనెను. ౨

మహాత్ముండును నీకుఁ దోఁబుట్టువువంటివాఁడు నగుసుగ్రీవుండు చెప్పిన ధర్మార్థసహితంబును ఇహపరలోకంబుల రెంటియందును మేలుగలిగించునదియు నగు మాటం జెప్పెదను. వినుము. ౩

అధికముగా రథంబులు నేనుంగులు గుఱ్ఱంబులును గలవాఁడును దేవేంద్రుండుఁబోలెఁ గాంతిమంతుండు నగుదశరథుం డను నొక్కమహారాజుండెను.

జ్యేష్ఠస్తస్య మహాబాహుః పుత్త్రః ప్రియకరః ప్రభుః,
పితుర్నిదేశాన్నిష్క్రాన్తః ప్రవిష్టో దణ్డకావనమ్. ౫
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చాపి భార్యయా,
రామో నామ మహాతేజా ధర్మ్యం పన్థానమాశ్రితః. ౬
తస్య భార్యా వనే నష్టా సీతా పతిమనువ్రతా,
వైదేహస్య సుతా రాజ్ఞో జనకస్య మహాత్మనః. ౭
సమార్గమాణస్తాం దేవీం రాజపుత్త్రస్సహానుజః,
ఋశ్యమూకమనుప్రాప్తస్సుగ్రీవేణ సమాగతః. ౮
తస్య తేన ప్రతిజ్ఞాతం సీతాయాః పరిమార్గణం,
సుగ్రీవస్యాపి రామేణ హరిరాజ్యం నివేదితమ్. ౯
తతస్తేన మృధే హత్వా రాజపుత్త్రేణ వాలినం,
సుగ్రీవః స్థాపితో రాజ్యే హర్యృక్షాణాం గణేశ్వరః. ౧౦
త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానరపుఙ్గవః,
రామేణ నిహతస్సఙ్ఖ్యే శరేణైకేన వానరః. ౧౧
స సీతామార్గణే వ్యగ్రస్సుగ్రీవస్సత్యసఙ్గరః,
హరీన్ సంప్రేషయామాస దిశస్సర్వా హరీశ్వరః. ౧౨
తాం హరీణాం సహస్రాణి శతాని నియుతాని చ,
దిక్షు సర్వాసు మార్గన్తే హ్యధశ్చోపరి చామ్బరే. ౧౩
వైనతేయసమాః కేచిత్కేచిత్తత్రానిలోపమాః,
అసఙ్గగతయశ్శీఘ్రా హరివీరా మహాబలాః. ౧౪
అహం తు హనుమాన్నామ మారుతస్యౌరసస్సుతః,
సీతాయాస్తు కృతే తూర్ణం శతయోజనమాయతమ్. ౧౫
సముద్రం లఙ్ఘయిత్వైవ తాం దిదృక్షురిహాఽగతః,

ఆదశరథమహారాజు జ్యేష్ఠపుత్త్రుండును అతనికిఁ బ్రియుండును మహాబాహుండును సమర్థుండును మహాతేజుండు నగురాముం డనువాఁడు తండ్రియాజ్ఞవలన ధర్మం బవలంబించి తమ్ముం డగులక్ష్మణుని భార్యనుం గూడి దండకారణ్యంబు నొందెను. ౫, ౬

మహాత్ముండగు విదేహదేశరాజు నగుజనకమహారాజుకూఁతురును పతివ్రతయు నగు నారామునిభార్య సీతయనునామె వనంబున నగపడకపోయినది.

రాజకుమారుం డగురాముండు తమ్మునితోఁగూడ సీతాదేవిని వెదకుచు ఋశ్యమూకంబునకు వచ్చి సుగ్రీవునితోఁ జేరెను. ౭

సుగ్రీవుండు రామునకు సీతను వెదకించెదనని ప్రతిజ్ఞ యొనరించెను. రాముం డందులకు బదులుగా సుగ్రీవుని వానరరాజ్యంబునకు రాజును జేసెదనని ప్రతిజ్ఞ చేసెను. ౮

అంత రాచకొమరుం డగురాముండు యుద్ధంబున వాలిం జంపి సుగ్రీవుం వానరభల్లూకసమూహంబుల కధిరాజునుగాఁ జేసెను. ౧౦

వానరోత్తముఁడగు వాలిని నీవును శెలుంగుదువుగదా! అట్టి వాలిని రాముఁడు యుద్ధంబునందు నొక్కబాణంబునం జంపెను. ౧౧

ప్రతిజ్ఞ దప్పనివాఁడును వానరాధీశ్వరుఁడు నగు నాసుగ్రీవుండు సీతను వెదకుటయందె యత్యాసక్తుండై సమస్తదిక్కులకును వానరులం బంపెను. ౧౨

వానరులు లక్షలుగాను వేయిలక్షలుగాను గుంపులుగూడి సమస్తదిక్కులందును పాతాళమునందును భూమియందును ఆకాశమునందును ఆసీతను వెదకుచున్నారు. ౧౩

అందు వేలనే తాఁకకుండ నతిశీఘ్రంబుగా సంచరించువారలు మహాబలశాలులు నగు వానరవీరులు కొందఱు గరుత్మంతునివంటి వేగముగలవారలు మఱికొందరు వాయువేగంబు గలవారలు. ౧౪

నేను వాయుదేవుని కుమారుండ హనుమంతుం డనువాఁడ.

నేను సీతానిమిత్తమయి నూఱుయోజనంబుల వైశాల్యంబు గల యీ సముద్రంబును దాఁటి సీతం జూచుటకై వచ్చినాను. ౧౫

భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా. ౧౬

తద్భవాన్ దృష్టధర్మార్థ స్తపఃకృతపరిగ్రహః,

పరదారాన్మహాప్రాజ్ఞ నోపరోద్ధుం త్వమర్హసి. ౧౭

న హి ధర్మవిరుద్ధేషు మహాపాయేషు కర్మసు,
మూలఘాతిషు సజ్జన్తే బుద్ధిమన్తో భవద్విధాః. ౧౮

కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినాం,
శరాణామగ్రతః స్థాతుం శక్తో దేవాసురేష్వపి. ౧౯

న చాపి త్రిషు లోకేషు రాజన్విద్యేత కశ్చన,
రాఘవస్య వ్యలీకం యః కృత్వా సుఖమవాప్నుయాత్. ౨౦
తత్త్రికాలహితం వాక్యం ధర్మ్యమర్థానుబన్ధి చ,
బుధ్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్. ౨౧

దృష్టా హీయం మయా దేవీ లబ్ధం యదిహ దుర్లభం,
ఉత్తరం కర్మ యచ్ఛేషం నిమిత్తం తత్ర రాఘవః. ౨౨

లక్షితేయం మయా సీతా తథా శోకపరాయణా,
గృహ్యా యాం నాభిజానాసి పఞ్చాస్యామివ పన్నగీమ్. ౨౩

నేయం జరయితుం శక్యా సాసురైరమరైరపి,
విషసంసృష్టమత్యర్థం భుక్తమన్నమివౌజసా. ౨౪

నే నీలంకయందు సీతను వెదకుచుండఁగా నీగృహంబునందే నాకు సీత యగపడినది. ౧౬

అట్లుండుటఁజేసి (నామాట వినుము) నీవు శాస్త్రంబులు చూచి చక్కఁగా ధర్మస్వరూపంబు దెలిసినవాఁడవు. మహాతపంబుచేసినవాఁడవు.

రావణుఁడా! నీవు మహాపండితుండవు. నీ విట్టు పరస్త్రీల నీయింట నుంచికొని నిరోధింపరాదు. ౧౭

నీవంటిబుద్ధిమంతులు ధర్మవిరుద్ధంబులును బెక్కపాయంబులం గల్గించు నవియునగు మూలతో హానికరంబులు నగుపనుల నెంతమాత్రమును జేయరు గదా. ౧౮

రాముండు కోపంబు నొందుటం జూచి లక్ష్మణుండు తానును మహాకోపంబునొంది ప్రయోగించుబాణంబులముందట నిలుచుటకు దేవాసురులయినను సమర్థులు కారు. ౧౯

రాక్షసరాజగు రావణుఁడా! రామున కపరాధము గావించి సుఖంబు నొందంగలవాఁడు ముల్లోకంబులందును ఒక్కఁడైన నుండఁడు ౨౦

ఈమాట సుగ్రీవుండు నీతోఁ జెప్పుమని చెప్పినాఁడు. ఇది నీకు భూతభవిష్యద్వర్తమానకాలంబులందును క్షేమంగలిగించునది. ధర్మమును మఱియు సమస్తపురుషార్థంబుల నొసంగునదియు నని తలంచి రామునకు సీతాదేవి నిమ్ము. ౨౧

నేను సీతాదేవిం జూచినాను. మాకందఱకును ఏది దుర్లభముగా నుండినదో అట్టిసీతాదర్శనము పొందఁబడినది. ఇంక మీఁదఁ జేయవలసిన కార్యము రామునియందున్నది. అది నా కాజ్ఞాపింపఁబడలేదు. ౨౨

నీవు అయిదుతలల సర్పంబును గ్రహించినట్లు ఎవ్వతెను గ్రహించి అయిదుతలల సర్పమువంటిదానిని గ్రహించినా నని తెలిసికొనకున్నావో అట్టి పరమదుఃఖితయయియున్న సీతాదేవిం జూచినాను. ౨౩

దేవతలు నసురులు నొకటియయినను ఎచ్చుగా విషముగలసిన యన్నమును దిని జీర్ణింపఁజేసికొనం జాలనట్లు ఈసీతను దక్కించుకొనం జాలరు.

తపస్సన్తాపలబ్ధస్తే యోఽయం ధర్మపరిగ్రహః,
న స నాశయితుం న్యాయ్య ఆత్మప్రాణపరిగ్రహః. ౨౫
అవధ్యతాం తపోభి ర్యాం భవా న్సమనుపశ్యతి,
ఆత్మనస్సాసురై ర్దేవై ర్హేతు స్తత్రాప్యయం మహాన్. ౨౬

సుగ్రీవో న హి దేవోఽయం నాసురో న చ రాక్షసః,
న దానవో న గన్ధర్వో న యక్షో న చ పన్నగః. ౨౭

[మానుషో రాఘవో రాజన్ సుగ్రీవశ్చ హరీశ్వరః,
తస్మాత్ప్రాణపరిత్రాణం కథం రాజ న్కరిష్యసి,

న తు ధర్మోపసంహారమధర్మఫలసంహితమ్. ౨౮

తదేవ ఫల మన్వేతి ధర్మశ్చాధర్మనాశనః,
ప్రాప్తం ధర్మఫలం తావద్భవతా నాత్ర సంశయః. ౨౯

ఫలమస్యాప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే,

జనస్థానవధం బుద్ధ్వా బుద్ధ్వా వాలివధం తథా. ౩౦
రామసుగ్రీవసఖ్యం చ బుధ్యస్వ హితమాత్మనః,

కామం ఖల్వహమప్యేకస్సవాజిరథకుఞ్జరామ్. ౩౧
లఙ్కాం నాశయితుం శక్త స్తస్యైష తు న నిశ్చయః,

నీవు మహాతపస్సు గావించి యందులకు ఫలముగా ఐశ్వర్యము నొంది యున్నావు దాని నశింపఁజేసికొనుట యుక్తము గాదు. ౨౪

నీవు గొప్ప తపస్సు చేసి దేవతలచేఁ గాని యసురులచేఁ గాని యవధ్యుఁడ వగునట్లు వరంబు గొని యున్నానని గర్వించుచున్నావు. అయినను గూడ బాధించు కారణం బొక్కటి యున్నది. ౨౫

ఈసుగ్రీవుఁడు దేవత గాఁడు కదా! యక్షుండును గాఁడు. రాక్షసుండును గాఁడు. దానవుండును గాఁడు. గంధర్వుండును గాఁడు. ఉరగుండును గాఁడు. పన్నగుఁడు గాఁడు. ఇట్లు నీ వెవ్వరివల్లనుం జావు లేనట్లు వరంబు గొనియున్నావో వారి కెవ్వరికిని జేరినవాఁడు గాఁడు ౨౬

[రాక్షసరాజవగు రావణుఁడా! రాముఁడు మానవుఁడు సుగ్రీవుఁడు కోఁతియుఁగదా!] ఇట్టి సుగ్రీవునిచేతను బోయె నీవు ప్రాణముల నెట్లు రక్షించుకొందువు?

ధర్మఫలం బెప్పుడును అధర్మఫలముతోఁ జేరదు. ధర్మఫలముతోనే చేరును. మఱియును ధర్మమువలననే యధర్మము నశించును. ౨౭

ఇట్లుండుటచేసి నీవు తపస్సు మొదలగువానిచే సంపాదించిన ధర్మఫలముతోఁ గొంత యధర్మమును నశింపఁజేసికొంటివి గాని సంపూర్ణముగను. మిగిలినదంతయును నీ వనుభవించినావు. దాని సందియము లేదు. ౨౮

ఇట్లు ధర్మఫలంబు నంతయును నిశ్శేషముగా ననుభవించితివి కావున సీతాపహరణంబునం గల్గిన యధర్మమును నశింపఁజేయు ధర్మము నీయొద్ద లేదు. కాఁబట్టి దీనిఫలముం గూడ నీవు శీఘ్రముగనే యనుభవింపఁగలవు.

రాముఁడొక్కఁడే జనస్థానంబులోని రాక్షసులనందఱిం జంపుటయు ఒక్కబాణంబునచే వాలిం జంపుటయు రాముఁడును సుగ్రీవుఁడును సఖ్యము చేసికొనుటయు విచారించి నీకు హితమగుదానిం దెలిసికొనుము. ౩౦

నేనొక్కఁడనె గుఱ్ఱంబులతోను రథంబులతోను గజంబులతోను నిండి యుండు నీలంకనంతయును రూపుమాపఁజాలుదును. అయినను అది రామునికి యిష్టము గాదు. ౩౧

రామేణ హి ప్రతిజ్ఞాతం హర్యృక్షగణసన్నిధౌ. ౩౨
ఉత్సాదనమమిత్రాణాం సీతా యైస్తు ప్రధర్షితా,
అపకుర్వన్హి రామస్య సాక్షాదపి పురన్దరః. ౩౩
న సుఖం ప్రాప్నుయాదన్యః కిం పునస్త్వద్విధో జనః,
యాం సీతేత్యభిజానాసి యేయం తిష్ఠతి తే వశే. ౩౪
కాళరాత్రీతి తాం విద్ధి సర్వలఙ్కావినాశినీమ్,
తదలం కాలపాశేన సీతావిగ్రహరూపిణా. ౩౫
స్వయం స్కన్ధావసక్తేన క్షమమాత్మని చిన్త్యతామ్,
సీతాయాస్తేజసా దగ్ధాం రామకోపప్రపీడితామ్. ౩౬
దహ్యమానామిమాం పశ్య పురీం సాట్టప్రతోళికామ్,
స్వాని మిత్రాణి మన్త్రీంశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్ సుతాన్ హితాన్.
భోగాన్దారాంశ్చ లఙ్కాం చ మా వినాశముపానయ,
సత్యం రాక్షసరాజేన్ద్ర శృణుష్వ వచనం మమ. ౩౭
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః,
సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్. ౩౮
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః,
దేవాసురనరేన్ద్రేషు యక్షరక్షోగణేషు చ. ౪౦
విద్యాధరేషు సర్వేషు గన్ధర్వేషూరగేషు చ,
సిద్ధేషు కిన్నరేన్ద్రేషు పతత్రిషు చ సర్వతః. ౪౧

సీతనపహరించిన శత్రువులం జంపెదనని రాముండు వానరభల్లూక సమూహంబులయెదుటఁ బ్రతిజ్ఞ చేసినాఁడు. ౩౨

సాక్షాద్దేవేంద్రుండైనను రామున కపకారము గావించునేని సుఖంబు నొందఁజాలఁడు ఇంక నీవంటియల్పులసంగతి చెప్పనేల ? ౩౩

నీవెవ్వతెను సీతయని తలంచియున్నావో యవ్వతె యిప్పుడు నీవశంబునం జిక్కియున్నదో అట్టిసీత యీలంకనంతయు నాశంబు నొందించునట్టి సంహారరాత్రి (మృత్యువు) అని యెఱుంగుము. ౩౪

అట్లుండుటంజేసి సీతాకారంబున నున్నట్టి యీ కాలపాశమును నీవే నీమెడపై వేసికొనవలదు. ఇంక నీకు హితమేదో దాని నాలోచించుకొనుము. ౩౫

ఈలంకాపట్టణము ఇప్పటికి సీతాతేజంబున దహింపఁబడియే యున్నది. ఇంక రాముని కోపంబునఁ గోటబురుజులతోను విథులతోను గూడ దహింపం బడఁగలదని యెఱుంగుము. ౩౬

నీస్నేహితులను మంత్రులను దాయాదులను తోఁబుట్టువులను ఇష్టంబులగు భోగంబులను భార్యలను లంకను నాశంబు నొందింపకుము. ౩౭

రాక్షసరాజులలో నుత్తముండగు రావణుండా! నేను రాముని దాసుండను గావున రాముని ప్రభావంబు చక్కఁగా నెఱుంగుదును. రాయబారిని గావున నీకు హితంబుఁ జెప్పవలసినవాఁడను. అందును నేను రాక్షసుండను గాని మనుష్యుండను గాని కాను వానరుండ నగుటవలన మధ్యస్థుండను. నిష్పక్షపాతంబుగాఁ జెప్పుదును. నామాటను వినుము. నేను చెప్పినది తప్పదు. ౩౮

మహాకీర్తిశాలి యగు నారాముఁడు పంచమహాభూతంబులతోను జంగమస్థావరంబులతోనుం గూడ సమస్తలోకంబులను సంహరించి మరల వాని యథాప్రకారముగా సృజింపఁ గలఁడు. ౩౯

విష్ణుదేవునకు సరియయిన పరాక్రమంబు గల రామునితో యుద్ధంబు చేయంగలవాఁడు దేవతలలోఁగాని అసురులలోఁగాని రాజులలోఁగాని రాక్షసులలోఁగాని విద్యాధరులలోఁగాని గంధర్వులలోఁగాని సర్పంబులలోఁ

సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః,
యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్. ౪౨
సర్వలోకేశ్వరస్యైవం కృత్వా విప్రియముత్తమం,
రామస్య రాజసింహస్య దుర్లభం తవ జీవితమ్. ౪౩
దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేన్ద్ర
గన్ధర్వవిద్యాధరనాగయక్షాః,
రామస్య లోకత్రయనాయకస్య
స్థాతుం న శక్తాః సమరేషు సర్వే. ౪౪
బ్రహ్మా స్వయమ్భూశ్చతురాననో వా
రుద్రస్త్రినేత్రస్త్రిపురాన్తకో వా,
ఇన్ద్రో మహేన్ద్రస్సురనాయకో వా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్. ౪౫

స సౌష్ఠవోపేతమదీనవాదినః
కపేర్నిశమ్యాప్రతిమోఽప్రియం వచః,
దశాననః కోపవివృత్తలోచన
స్సమాదిశత్తస్య వధం మహాకపేః. ౪౬

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకపఞ్చాశస్సర్గః.

---

## ద్విపఞ్చాశస్సర్గః

తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః,
ఆజ్ఞాపయద్వధం తస్య రావణః క్రోధమూర్ఛితః. ౧

గాని సిద్ధులలోఁగాని కిన్నరోత్తములలోఁగాని పక్షులలోఁగాని [illegible] ప్రాణులందును ఎచ్చటను ఏకాలమునందును లేరు. ౪౦-౪౧

సమస్తలోకనాయకుండును రాజశ్రేష్ఠుండును నగు రామున కింతటి మహాపకారంబు గావించినావు. ఇంక నీవు బ్రతుకఁజాలవు. ౪౩

రాక్షసులకుఁ బ్రభుండవగు రావణుఁడా! దేవతలును మనుష్యులును గంధర్వులును విద్యాధరులును సర్పంబులును యక్షులును [illegible] లోకంబులకుఁ బ్రభుండైన రామునియెదుట నిలువఁజాలరు. ౪౪

జనకుండా నే పుట్టుటం జేసి యతిశ్వయంభువుండును నాలుగు మొగంబుల చేత కాలంబున నాలుగువేదంబులం జదువఁజాలిన మహాత్ముండును సర్వాతిశాయియును నగు బ్రహ్మదేవుండైనఁగాని ప్రళయకాలంబున సమస్తభూతంబుల నశింపఁజేయువాఁడును బ్రహ్మకేశవులకుఁ గర్వాదిదోషంబులు మొదలగు సమస్తవిద్యల నుపదేశించువాఁడును మూఁడవనేత్రంబున మన్మథుని దహించినవాఁడును సమస్తదేవతలకు నసాధ్యులగు త్రిపురాసురుల నొక్క బాణమున నీఱుచేసినవాఁడు నగు శివుండైనఁగాని పరమైశ్వర్యశాలియు వృత్రాసురుం జంపినవాఁడును సమస్తదేవతలకును బ్రభుండగు దేవేంద్రుండైనంగాని వీ రందఱు నొకటియైనఁగాని యుద్ధమున రామవధ్యుండగువాని నొంతమాత్రము రక్షింపఁజాలరు. అని హనుమంతుండు రావణునకుఁ జెప్పెను. ౪౫

అసదృశుండగు రావణుండు హనుమంతుండు నిశ్చయముగాఁ జెప్పిన నిర్దోషంబును తన కప్రియంబు నగు నామాటను విని కోపంబున నేత్రంబులం ద్రిప్పుచు నాహనుమంతుం జంప నాజ్ఞాపించెను. ౪౬

ఇది యేఁబదియొకటవసర్గము

## యేఁబదిరెండవ సర్గము

రావణుఁడు బుద్ధిమంతుఁడగు నాహనుమంతుఁడు చెప్పినమాటను విని మహాకోపమునొంది ఆహనుమంతుని జంప నాజ్ఞాపించెను. ౧

వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా,
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః. ౨

తం రక్షోఽధిపతిం క్రుద్ధం తచ్చ కార్యముపస్థితం,
విదిత్వా చిన్తయామాస కార్యం కార్యవిధౌ స్థితః. 3

నిశ్చితార్థస్తతస్సామ్నా పూజ్య శత్రుజిదగ్రజం,
ఉవాచ హితమత్యర్థం వాక్యం వాక్యవిశారదః. ౪

క్షమస్వ రోషం త్యజ రాక్షసేన్ద్ర ప్రసీద మద్వాక్య
మిదం శృణుష్వ, వధం న కుర్వన్తి పరావరజ్ఞాః దూతస్య సన్తో
వసుధాధిపేన్ద్రాః. ౫

రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేశ్చ గర్హితం,
తవ చాసదృశం వీర కపేరస్య ప్రమాపణమ్. ౬

ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః,
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్. ౭

గృహ్యన్తే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః,
తతశ్శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్. ౮

తస్మాత్ప్రసీద శత్రుఘ్న రాక్షసేన్ద్ర దురాసద,
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదణ్డో విధీయతామ్. ౯

విభీషణవచశ్శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
రోషేణ మహతాఽఽవిష్టో వాక్యముత్తరమబ్రవీత్. ౧౦

దురాత్ముఁడగు రావణుఁడు హనుమంతుని జంప నాజ్ఞాపించుటను విని విభీషణుండు మాత్రము తాను వచ్చినకార్యమును యథార్థముగాఁ జెప్పిన దూతం జంపుటకు సమ్మతింపఁడయ్యెను. ౨

కార్యములందుఁ బండితుఁడగు విభీషణుఁడు రాక్షసేశ్వరుఁ డగు రావణుఁ డట్లు కోపంబునొంది యుగ్రుండయి హనుమంతుని వధసేయుమని యాజ్ఞించుటయు నెఱింగి చేయవలసినతెఱంగు నాలోచించెను. ౩

అంత శత్రువుల జయించువాఁడును మాటలు చెప్పుటయందుఁ బండితుండు నగువిభీషణుండు చేయఁదగు కార్యము నిశ్చయించి పూజ్యుండు నగ్రజుండునగు రావణుంజూచి పరమహితంబగు నీమాటం జెప్పెను. ౪

రాక్షసులకుఁ బ్రభుండవగు రావణుఁడా! క్షమింపుము. కోపము విడిచి ప్రసన్నుండవగుము. నామాటను వినుము. మంచిచెడుగులు తెలిసిన మహాత్ములగు రాజశ్రేష్ఠులు దూతం జంపరు. ౫

పరాక్రమశాలివగు రావణుఁడా! ఈహనుమంతుంజంపుట రాజధర్మమునకు విరుద్ధము. లోకాచారమునకు వ్యతిరిక్తముగా నున్నది. నీ యట్టి ధార్మికునకు సరియయిన కార్యమును కాదు. ౬

సమస్తప్రాణులలోను నీవే ధర్మముల నెఱింగినవాఁడవు, కృతజ్ఞుండవు, రాజధర్మములం జక్కఁగాఁ దెలిసినవాఁడవు మంచిచెడ్డలు దెలిసినవాఁడవు. మఱియుఁ బరమార్థము నెఱింగినవాఁడవు. ౭

నీవంటిపండితులును ఇట్లు ఆస్థానమునఁ గోపమూనుదురేని సమస్త శాస్త్రములును జదివి పాండిత్యము సంపాదించుకొనుటచే నేమి ప్రయోజనము? వట్టి శ్రమయ కదా! ౮

శత్రువులం జంపువాఁడవును శత్రువులకుఁ జెనక నలవిగానివాఁడవును రాక్షసేశ్వరుండవు నగు రావణుఁడా! అట్లగుటంజేసి కోపంబు విడువుము. యుక్తాయుక్తముల నాలోచించి దూతకు యోగ్యమైనశిక్ష విధింపుము. అని విభీషణుండు రావణునకుం జెప్పెను. ౯

రాక్షసనాయకుం డగు రావణుండు విభీషణుండు చెప్పినమాటను విని మహాకోపమునొంది యిట్లని బదులుచెప్పెను. ౧౦

వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా,
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః. ౨

తం రక్షోధిపతిం క్రుద్ధం తచ్చ కార్యముపస్థితం,
విదిత్వా చిన్తయామాస కార్యం కార్యవిధౌ స్థితః. ౩

నిశ్చితార్థస్తతస్సామ్నా పూజ్యం శత్రుజిదగ్రజం,
ఉవాచ హితమత్యర్థం వాక్యం వాక్యవిశారదః. ౪

క్షమస్వ రోషం త్యజ రాక్షసేన్ద్ర ప్రసీద మద్వాక్య
మిదం శృణుష్వ, వధం న కుర్వన్తి పరావరజ్ఞాః దూతస్య సన్తో
వసుధాధిపేన్ద్రాః. ౫

రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేశ్చ గర్హితం,
తవ చాసదృశం వీర కపేరస్య ప్రమాపణమ్. ౬

ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః,
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్. ౭

గృహ్యన్తే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః,
తతశ్శాస్త్రవిపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్. ౮

తస్మాత్ప్రసీద శత్రుఘ్న రాక్షసేన్ద్ర దురాసద,
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదణ్డో విధీయతామ్. ౯

విభీషణవచశ్శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః,
రోషేణ మహతాఽఽవిష్టో వాక్యముత్తరమబ్రవీత్. ౧౦

దురాత్ముండగు రావణుండు హనుమంతుని జంప నాజ్ఞాపించుటను విని విభీషణుండు మాత్రము తాను వచ్చినకార్యమును యథార్థముగాఁ జెప్పిన దూతం జంపుటకు సమ్మతింపఁడయ్యెను. ౨

కార్యములందుఁ బండితుఁడగు విభీషణుండు రాక్షసేశ్వరుఁ డగు రావణుఁ డట్లు కోపంబునొంది యుగ్రుండయి హనుమంతుని వధసేయయత్నించుటయు నెఱింగి చేయవలసిన తెఱంగు నాలోచించెను. ౩

అంత శత్రువుల జయించువాఁడును మాటలు చెప్పుటయందుఁ బండితుండు నగువిభీషణుండు చేయందగు కార్యము నిశ్చయించి పూజ్యుండు నగ్రజుండునగు రావణుంజూచి పరమహితంబగు నీమాటం జెప్పెను. ౪

రాక్షసులకుఁ బ్రభుండవగు రావణుఁడా! క్షమింపుము. కోపము విడిచి ప్రసన్నుండవగుము. నామాటను వినుము. మంచిచెడుగులు తెలిసిన మహాత్ములగు రాజశ్రేష్ఠులు దూతం జంపరు. ౫

పరాక్రమశాలివగు రావణుఁడా! ఈహనుమంతుంజంపుట రాజధర్మమునకు విరుద్ధము. లోకాచారమునకు వ్యతిరిక్తముగా నున్నది. నీ యట్టి ధార్మికునకు సరియయిన కార్యము కాదు. ౬

సమస్తప్రాణులలోను నీవే ధర్మముల నెఱింగినవాఁడవు, కృతజ్ఞుండవు, రాజధర్మములం జక్కఁగాఁ దెలిసినవాఁడవు మంచిచెడ్డలు దెలిసినవాఁడవు. మఱియుఁ బరమార్థము నెఱింగినవాఁడవు. ౭

నీవంటిపండితులును ఇట్లు అస్థానమునఁ గోపమూదుదురేని సమస్త శాస్త్రములును జదివి పాండిత్యము సంపాదించుకొనుటచే నేమి ప్రయోజనము? వట్టి శ్రమయ కదా! ౮

శత్రువులం జంపువాఁడవును శత్రువులకుఁ జెనక నలవిగానివాఁడవును రాక్షసేశ్వరుండవు నగు రావణుఁడా! అట్లగుటం జేసి కోపంబు విడువుము. యుక్తాయుక్తముల నాలోచించి దూతకు యోగ్యమైనశిక్ష విధింపుము. అని విభీషణుండు రావణునకుం జెప్పెను. ౯

రాక్షసనాయకుం డగు రావణుండు విభీషణుండు చెప్పినమాటను విని మహాకోపమునొంది యిట్లని బదులుచెప్పెను. ౧౦

న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన,
తస్మాదేనం వధిష్యామి వానరం పాపచారిణమ్. ౧౧

అధర్మమూలం బహురోషయుక్త
మనార్యజుష్టం వచనం నిశమ్య,
ఉవాచ వాక్యం పరమార్థతత్త్వం
విభీషణో బుద్ధిమతాం వరిష్ఠః. ౧౨
ప్రసీద లఙ్కేశ్వర రాక్షసేన్ద్ర
ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ,
దూతా నవధ్యాః సమయేషు రాజన్
సర్వేషు సర్వత్ర వదన్తి సన్తః. ౧౩

అసంశయం శత్రురయం ప్రవృద్ధః కృతం హ్యనేనాప్రియ మప్రమేయం, న దూతవధ్యాం ప్రవదన్తి సన్తో దూతస్య దృష్టా బహవో హి దణ్డాః. ౧౪

వైరూప్య మఙ్గేషు కశాభిఘాతో మౌణ్డ్యం తథా లక్షణ సన్నిపాతః, ఏతాన్ హి దూతే ప్రవదన్తి దణ్డాన్ వధ స్తు దూతస్య న నః శ్రుతోఽపి. ౧౫

కథం చ ధర్మార్థవినీతబుద్ధిః పరావరప్రత్యయనిశ్చితార్థః,
భవద్విధః కోపవశే హి తిష్ఠేత్ కోపం నియచ్ఛన్తి హి సత్త్వవన్తః.
న ధర్మవాదే న చ లోకవృత్తే న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి, విద్యేత కశ్చిత్తవ వీర తుల్య స్త్వం హ్యుత్తమ స్సర్వ సురాసురాణామ్. ౧౭
[పరాక్రమోత్సాహ మనస్వినాం చ సురాసురాణామపి దుర్జ

శత్రువులం జంపునట్టి విభీషణుఁడా! పాపిష్ఠులం జంపుటచే నెంత మాత్రము పాపము గలుగదు. అందువలనఁ బాపిష్ఠుం డగువీనిఁ జంపెదను. అని రావణుండు విభీషణునకుఁ జెప్పెను. ౧౧

బుద్ధిమంతులలో మొదటివాఁడగు విభీషణుండు రావణుండు బహుకోపంబునం జెప్పిన యధర్మిష్ఠమును దుష్టులకు మాత్రమె తగినదియు నగు మాటను విని పరమధర్మము గల్గునట్లు కార్యనిశ్చయము సేయువాఁడై యిట్లని చెప్పెను. ౧౨

లంకాధీశ్వరుండవు రాక్షసనాయకుండవు నగు రావణుఁడా! కోపము విడువుము. ధర్మాధర్మముల రెంటిని గలిగించునట్టి నా చెప్పెడు వినుము.

రాక్షసరాజవగు రావణుఁడా! ఏకాలమునందును ఏస్థలమునందును గాని దూతలం జంపఁగూడదు. అని పెద్దలు చెప్పెదరు. ౧౩

ఇతఁడు అక్షకుమారాదులం జంపుటచేన మాత్రమె కాదు. గొప్ప శత్రుండు నగును. ఇందు సందియములేదు. అయినను పెద్దలు దూతం జంపఁ గూడదని చెప్పెదరు. అయితే దూతను పెక్కుతెఱంగుల శిక్షలు చెప్పఁబడి యున్నవి. అందేదైన నిప్పుడు ప్రయోగింపవచ్చును. ౧౪

అంగవికృతి గావించుటగాని చబుకుతోఁ గొట్టుట గాని తలవెంట్రుక లన్నియుఁ గొఱిగి ముండనము గావించుట గాని ముద్ర వేయుట గాని యివి దూతకుఁ దగిన దండంబు లని పెద్దలు చెప్పెదరు. దూతం జంపుటను మాత్రము మన మెప్పుడు నేశాస్త్రమునను విన్నది గాదు. ౧౫

ధర్మార్థంబులు చక్కఁగాఁ దెలిసినవాఁడును మంచి చెడ్డలు తెలిసి కార్యంబులు సేయువాఁడు నగు నీయట్టిపండితుండును కోపమున కెట్లు వశ్యుం డగును? ధైర్యశాలు లగువారలు కోపంబు నణఁచుకొందురుగదా. ౧౬

పరాక్రమశాలివగు రావణుఁడా! ధర్మవాదమునందుఁగానీ లౌకికాచారమునందుఁగానీ శాస్త్రములందుఁగానీ బుద్ధియందుఁ గానీ నీవు యుక్తమగుదాని గ్రహించుటయందుఁ గానీ నీకుసమానుం డెవ్వఁడును లేఁడు. సమస్తదేవతలకన్నను సమస్తాసురులకన్నను నీవే యుత్తముండవు. [బలవీర్య

నేన, త్వయాఽప్రమేయేన సురేన్ద్రసంఘాః జితాశ్చ యుద్ధే
ష్వసకృన్నరేన్ద్రైః.
ఇత్థం విధస్యామరదైత్యశత్రోః శూరస్య వీరస్య తవాజితస్య,
కుర్వన్తి వీరా మనసా వ్యలీకం ప్రాణై ర్విముక్తా న తు భోః
పురా తే]

న చాప్యస్య కపేర్ఘాతే కంచిత్పశ్యామ్యహం గుణం,

తేష్వయం పాత్యతాం దణ్డో యైరయం ప్రేషితః కపిః. ౧౮
సాధుర్వా యది వాఽసాధుః పరై రేష సమర్పితః,
బ్రువన్పరార్థం పరవాన్ న దూతో వధమర్హతి. ౧౯

అపి చాస్మిన్హతే రాజన్నాన్యం పశ్యామి ఖేచరం,
ఇహ యః పునరాగచ్ఛేత్పరం పారం మహోదధేః. ౨౦

తస్మాన్నాస్య వధే యత్నః కార్యః పరపురంజయ,

భవాన్ సేన్ద్రేషు దేవేషు యత్నమాస్థాతుమర్హతి. ౨౧

అస్మిన్వినష్టే నహి దూత మన్యం పశ్యామి యస్తౌ నర
రాజపుత్రౌ, యుద్ధాయ యుద్ధప్రియ దుర్వినీతా వుద్యోజయే
ద్దీర్ఘపథావరుద్ధౌ. ౨౨
[అస్మిన్హతే వానరయూథముఖ్యే సర్వాపవం సంప్రవదంతి
సన్తః, నహి ప్రపశ్యామి గుణం యశో వా లోకాపవాదో
భవతి ప్రసిద్ధః.

శోభితులై మేధావు లగుదేవాసురులకు సైతము దుర్జయుండవై కొలఁదియిడ రానిమహిమగల నీచేత పెక్కుమాఱులు సమస్తదేవతలును ఎల్లరాజులును మహాయుద్ధముల నోడఁగొట్టఁబడిరి. ఇట్టి చండశాసనుఁడవు దేవాసురభయంకరుఁడవు సమరదుర్జయుఁడవు మహావీరుఁడవు నైననిన్నుఁ జెనకువాఁడు లేఁడు. సరిగదా. మనమునసైన నీయెడ విప్రతీపము తలఁచువాఁడే లేఁడు. మును పందఱు నీచేతఁ బడి యెట్లో ప్రాణములతోఁ గట్టనఁబడినవారే కావున నీకెదురు నెవఁడును రాఁడు.]

శాస్త్రవిరోధంబు మాత్రమే కాదు. ఇతని జంపుటచే మనకేమియును లాభమును లేదు.

ఈవానరు నిచ్చటి కెవ్వరు పంపినారో వారల వధింపుము. ౧౮

ఇతండు మంచివాఁడగుఁగాక. లేక చెడ్డవాఁడైన నగుఁగాక పరులు పంపఁగా వచ్చినాఁడు. పరాధీనుండు కావున వారలు చెప్పు మన్న మాటలు చెప్పుచున్నాఁడు. ఇది యితనితప్పుగాదు. కావున నితని జంపుట యుక్తము కాదు ౧౯

రాక్షసరాజవగు రావణుఁడా! ఈతఁడు చంపఁబడిన పిమ్మట ఈ మహాసముద్రంబు దాఁటి యిచ్చటికి రాఁగలఖేచరుండు మఱియొక్కండుండు నట్లు నాకుఁ దోఁచలేదు ౨౦

శత్రువుల పట్టణంబులను జయించునట్టి రావణుఁడా! అట్లు కావున నీ వితనిం జంపుటయందుఁ బ్రయత్నంబు సేయవలదు.

దేవేంద్రునితోఁ గూడ దేవత లెదిరించి వచ్చినప్పుడు నీవు వారలను వధింపఁదగుదువు కాని నీకు దూతయగు నీవానరుం జంపుట యుక్తము కాదు.

యుద్ధప్రియుండవగు రావణుఁడా! అతండు చంపఁబడునేని గర్వితులును బహుదూరస్థులునగు రామలక్ష్మణులను ఇచ్చటికివచ్చి నీతోఁ బోరు నట్లు సేయంజాలునట్టివాఁడు మఱియొక్కం డుండునట్లు నాకుఁ దోఁచలేదు. [మీ రీవానరునిఁ జంపుదురేని యెల్లరు మిమ్ము దూషింతురు. పోనీ మనకేమైన దీన మంచిపేరుగాని ప్రతిష్ఠాలాభముగాని కలుగునా అదియును లేదు. పైఁగా చెడ్డవాడుక యొకటి కల్గును. ఇది కాదుగాని కండక్రొవ్వున కోఁడె తెఱఁగక నీయంతటివానిమీఁది కీ తుచ్ఛవానరునిఁ బంపిన యామూర్ఖులను

మూఢైః ప్రగల్భైరపి దుర్వినీతైరైర్వ్యర్వానరోఽయం పురుషై
ర్విసృష్టః, తేషాం వధార్థం కురువీర యత్నం శీఘ్రం వినాశాయ
నిశాచరేన్ద్ర.
కురుష్వ తావత్పరమప్రయత్నం ధర్మం సమాస్థాయ సురేన్ద్ర
శత్రో, దేవేషు సర్వేషు సవాసవేషు దైత్యేషు సర్వేషు సదా
నవేషు.
కృత్వా ప్రయత్నం సుదృఢం సుశీఘ్రం మద్వాక్య మేవం
మనసా ప్రగృహ్య, తౌ రాజపుత్రౌ వినిగృహ్య వీరౌ జయం
పరం ప్రాప్స్యసి రాక్షసేన్ద్ర.]

పరాక్రమోత్సాహమనస్వినాం చ సురాసురాణా మపి
దుర్జయేన, త్వయా మనో నన్దన నైరృతానాం యుద్ధాయతి
ర్నాశయితుం న యుక్తా. ౨౩

హితాశ్చ శూరాశ్చ సమాహితాశ్చ కులేషు జాతాశ్చ
మహాగుణేషు, మనస్వినః శస్త్రభృతాం వరిష్ఠాః కోట్యగ్రతస్తే
సుభృతాశ్చ యోధాః. ౨౪

తదేకదేశేన బలస్య తావత్ కేచిత్తవాఽఽదేశకృతోఽ
భియాన్తు, తౌ రాజపుత్రౌ వినిగృహ్య మూఢౌ పరేషు తే
భావయితుం ప్రభావమ్. ౨౫

నిశాచరాణామధిపోఽనుజస్య విభీషణస్యోత్తమవాక్యమిష్టం,
జగ్రాహ బుద్ధ్యా సురలోకశత్రుర్మహాబలో రాక్షసరాజముఖ్యః.
[కిం వానరం బ్రహ్మ పరం చ సత్యం సర్వస్య బీజం జగతోఽస్య
విష్ణోః, యద్దేవదేవస్య పరంచ తేజః తదేవ తేజః కపిరేష వీరః.

బరిమార్ప యత్నింపుము. నామనవి చిత్తగించి దేవదానవులం జెల్ల జేయఁ జాలినకట్టుదిట్టముచేసి యారాజపుత్రుల నిద్దఱను బట్టితివా నీకు గొప్పవిజయము కీర్తియుం లభ్యపడును.] ౨౨

రాక్షసులకు సంతోషంబు గల్గించునట్టి రావణుఁడా! పరాక్రమంబు నుత్సాహంబును ధైర్యంబునుగల దేవాసురులైనను నిన్నుఁ జెనకఁగాలరు. కట్టి నీవు యుద్ధంబు రామండఁగా దాని బోఁగొట్టుకొఁబూడదు. ౨౩

నీకు మేలుసేయువారలును శూరులును బుద్ధికి గలవారలును మహాగుణంబులు గలవంశంబుల బుట్టినవారలును మంచిమనస్సు గలవారలును ఆయుధధారులలో నుత్తములును జక్కఁగాఁ బోషింపఁబడువారలగు నగు భటులు నీయొద్దఁ గోటానకోటు లున్నారు. ౨౪

అందువలన నీయాజ్ఞచేఁ గొందఱుశూరులు కొంతసైన్యముఁ గూడి పోయి మూఢులగు నారాచకొమరులయినరామలక్ష్మణులను నిగ్రహించి శత్రువులకు దమప్రభావంబు జూపుదురుగాక. అని విభీషణుండు రావణునకుఁ జెప్పెను. ౨౫

రాక్షసులకుఁ బ్రభుండును దేవతలకు శత్రుండును మహాబలుండును రాక్షసరాజు నగు రావణుండును విభీషణుండు చెప్పిన ప్రియంబు నుత్తమంబు నగుమాటను బుద్ధితో నాలోచించి యంగీకరించెను. [ఇది కోతి కాదు. సర్వకారణమై పరాత్పరుఁడైన విష్ణుని తేజమే. పందియ మేల. న

వధాయ మే వైష్ణవతేజ ఏవ నిస్సంశయోఽయం కపిరూపధారీ,
ఇత్యేవమేతద్బహుధా విచిన్త్య రక్షోఽధిపః క్రోధవశం జగామ.
క్రోధం చ జాతం హృదయే నిరుధ్య విభీషణోక్తం వచనం సుపూజ్య,
ఉవాచ రక్షోఽధిపతి ర్మహాత్మా విభీషణం శస్త్రభృతాం వరిష్ఠమ్.]

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్విపఞ్చాశస్సర్గః.

---

## త్రిపఞ్చాశస్సర్గః

తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాబలః,
దేశకాలహితం వాక్యం భ్రాతు రుత్తర మబ్రవీత్ ౧
సమ్యగుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా,
అవశ్యం తు వధా దన్యః క్రియతా మస్య నిగ్రహః. ౨
కపీనాం కిల లాంగూల మిష్టం భవతి భూషణం,
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు. ౩
తతః పశ్యన్త్విమం దీనమఙ్గవైరూప్యకర్శితం,
సమిత్రజ్ఞాతయస్సర్వే బాన్ధవాస్ససుహృజ్జనాః. ౪

ఆజ్ఞాపయ ద్రాక్షసేన్ద్రః పురం సర్వం సచత్వరం,
లాంగూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతామ్. ౫

తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్శితాః,
వేష్టయన్తి స్మ లాంగూలం జీర్ణైః కార్పాసకైః పటైః. ౬
సంవేష్ట్యమానే లాంగూలే వ్యవర్ధత మహాకపిః,

న్నంత మొందించుకొని కావైష్ణవతేజమే యిట్లు కోతియై పొదమినది, అని వేయివిధములఁ దలపోసికొని రాక్షసరాజమితక్రోధముఁ జెందెను. కాని తర్వాత నాక్రోశమంతయు నణఁచుకొని విభీషణునిమాటను గౌరవించి యాతనితో నిట్లనియె.] ౨౮

ఇది యేఁబదిరెండవ సర్గము.

## ఏఁబదిమూఁడవ సర్గము

మహాబలుండగు రావణుండు తమ్ముండు విభీషణునిమాటను విని దేశకాలంబులకుఁ దగునట్లు ఈప్రకారముగా బదులు చెప్పెను. ౧

నీవు చక్కఁగాఁ జెప్పినావు. దూతంజంపుట నింద్యమగుట వాస్తవమే. ఇతని కవశ్యము మఱియొకశిక్ష విధింపవలయును. ౨

కోఁతులకుఁ దోఁక ప్రియమయినదిగదా! ఇతనితోఁకను దహింపుఁడు. ఇతండు దగ్ధమయిన తోఁకతోఁ బోవుఁగాక. ౩

అంత సీతనియాప్తులును దాయాదులును స్నేహితులును బాంధవులు నందఱును అంగవికృతినొంది పరమదుఃఖితుం డైయున్న యితనిం జూతురుగాక. అని రావణుండు విభీషణునితోఁ జెప్పెను. ౪

రాక్షసేశ్వరుండగు రావణుండు "ఈహనుమంతునితోఁకం గాల్చి అదిమండుచుండఁగా, నితనిఁ జతుష్పథంబులందును బట్టణంబునందంతయుఁ ద్రిప్పుఁడు." అని యాజ్ఞాపించెను. ౫

రాక్షసులు రావణునాజ్ఞను విని మహాకోపంబునొంది చినిఁగినగుడ్డపేలికలతో హనుమంతునితోఁకకుఁ జుట్టిరి.

అట్లు వారలు తనతోఁకకు గుడ్డపేలికలంజుట్టుటనుజూచి హనుమంతుం

శుష్కమిన్ధనమాసాద్య వనేష్వివ హుతాశనః. ౭

తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్,

లాఙ్గూలేన ప్రదీప్తేన రాక్షసాంస్తానపాతయత్. ౮
రోషామర్షపరీతాత్మా బాలసూర్యసమాననః,

లాఙ్గూలం సంప్రదీప్తం తు ద్రష్టుం తస్య హనూమతః. ౯
సహస్త్రీబాలవృద్ధాశ్చ జగ్ముః ప్రీతా నిశాచరాః,

స భూయస్సఙ్గతైః క్రూరై రాక్షసైర్హరిసత్తమః. ౧౦
నిబద్ధః కృతవాన్వీర స్తత్కాలసదృశీం మతిం,

కామం ఖలు న మే శక్తా నిబద్ధస్యాపి రాక్షసాః. ౧౧
ఛిత్త్వా పాశాన్సముత్పత్య హన్యామహమిమాన్పునః,

యది భర్తుర్హితార్థాయ చరన్తం భర్తృశాసనాత్. ౧౨
బధ్నన్త్యేతే దురాత్మానో న తు మే నిష్కృతిః కృతా,

సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానామహం యుధి. ౧౩
కిన్తు రామస్య ప్రీత్యర్థం విషహిష్యేఽహమీదృశం,
లఙ్కా చారయితవ్యా వై పునరేవ భవేదితి. ౧౪

రాత్రౌ న హి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః,
అవశ్యమేవ ద్రష్టవ్యా మయా లఙ్కా నిశాక్షయే. ౧౫

దదవియుం బెండినకట్టెలకుఁ దగులుకొనిన యగ్నిహోత్రుండుంబోలె వృద్ధిఁ బొందెను. ౬

అంత వారాక్షసులు గుడ్డపేలికలు చుట్టిన తోఁకను నూనెతోఁ దడిపి నిప్పు నంటించిరి.

ఆ హనుమంతుండు మహాకోపంబున ముఖం బెఱ్ఱఁదనంబు నొంది బాల సూర్యునివగిదిం దోఁప మండుచున్నతోఁకను విసరి యారాక్షసులనందఱం బడమోఁదెను. ౭

అంత లంకయందలి రాక్షసులు హనుమంతుని వాలంబునకు నిప్పు దరి కొల్పుటవిని సంతోషంబు నొంది స్త్రీలతోను బాలురతోను వృద్ధులతోనుం గూడ దానిం జూడఁబోయిరి. ౮

పరాక్రమవంతుండును వానరోత్తముండు నగు నాహనుమంతుఁడు క్రూరులగురాక్షసు లందఱుం జేరి మరలఁ దన్ను బంధింపఁగా నాకాలంబు నకుం దగునట్లు ఈప్రకార మాలోచించెను. ౧౦

నేను బద్ధుండనైనను రాక్షసు లెంతమాత్రము నన్ను నిగ్రహింపం జాలరు. ఈపాశంబులం ద్రెంచుకొని యుద్ధమించి యొక్కపెట్ట నీరాక్షసుల నందఱిం జంపుదును. ౧౧

దురాత్ములగు నీరాక్షసులు రామహితంబుకొఱకు సంచరించుచున్న నన్ను రావణునాజ్ఞచే బంధింతురేని దీనివలన వీరలు నాకెంతమాత్రము ప్రతీకారము జేసినవారలు కాఁజాలరు. ఇది నన్నేమియుఁ జేయఁజాలదు. ౧౨

యుద్ధంబున రాక్షసుల కందఱకు నే నొక్కండనే చాలుదును. ౧౩

అయినను రాముండు తానే రావణుం జంపెదనని ప్రతిజ్ఞ చేసినాఁడు కావున నట్టిప్రతిజ్ఞాసిద్ధివలనం గలుగు సంతోషము రామునకుం గలుగుటకును వీరలు నన్ను లంకయంతయుఁ ద్రిప్పెదరు కావున మరల లంక యంతయుం జూడవచ్చుననియుం నే నిట్టియవమానంబు సహించియున్నానుగాని వేఱుగాదు.

నేను రాత్రియందు లంకంజూచినాను గావున నగరరక్షణసాధనవిశేష ములం జక్కఁగాఁ జూడలేదు. కాఁబట్టి ప్రాతఃకాలంబున నవశ్యంబుగ లంకం జూడవలయును. ౧౪

కామం బద్ధస్య మే భూయః పుచ్ఛస్యోద్దీపనేన చ,
పీడాం కుర్వన్తు రక్షాంసి న మేఽస్తి మనసశ్శ్రమః. ౧౬

తతస్తే సంవృతాకారం సత్త్వవన్తం మహాకపిం,
పరిగృహ్య యయుర్హృష్టా రాక్షసాః కపికుఞ్జరమ్. ౧౭
శఙ్ఖభేరీనినాదైస్తం ఘోషయన్తస్స్వకర్మభిః,
రాక్షసాః క్రూరకర్మాణశ్చారయన్తి స్మ తాం పురీమ్. ౧౮

అన్వీయమానో రక్షోభిర్యయౌ సుఖమరిన్దమః,
హనుమాంశ్చారయామాస రాక్షసానాం మహాపురీమ్. ౧౯
అథాపశ్యద్విమానాని విచిత్రాణి మహాకపిః,
సంవృతాన్ భూమిభాగాంశ్చ సువిభక్తాంశ్చ చత్వరాన్. ౨౦

వీథీశ్చ గృహసంబాధాః కపిశ్శృఙ్గాటకాని చ,
తథా రథ్యోపరథ్యాశ్చ తథైవ గృహకాన్తరాన్. ౨౧

గృహాంశ్చ మేఘసంకాశాన్ దదర్శ పవనాత్మజః,
చత్వరేషు చతుష్కేషు రాజమార్గే తథైవ చ. ౨౨
ఘోషయన్తి కపిం సర్వే చారీక ఇతి రాక్షసాః,
స్త్రీబాలవృద్ధా నిర్జగ్ముస్తత్ర తత్ర కుతూహలాత్. ౨౩
తం ప్రదీపితలాఙ్గూలం హనుమన్తం దిదృక్షవః,
దీప్యమానే తతస్తస్య లాఙ్గూలాగ్రే హనూమతః. ౨౪
రాక్షస్యస్తా విరూపాక్ష్యశ్శంసుర్దేవ్యాస్తదప్రియం,
యస్త్వయా కృతసంవాదస్సీతే తామ్రముఖః కపిః. ౨౫
లాఙ్గూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే,

ఈరాక్షసు లిప్పుడు నన్ను బంధించియున్నారుగదా! ఇంకను యథేష్టంబుగా నాతోఁకనుం గాల్చి నన్నుఁ బీడింతురుగాక. ఇందువలన నా కెంత మాత్రమును బాధలేదు. అని హనుమంతుండు మనంబున నాలోచించెను. ౧౬

అంత నారాక్షసులు సంతుష్టులయి తనయాకారమును సంకోచపఱచు కొనియున్న వానరోత్తముఁడగు హనుమంతుని దీసికొనిపోయిరి. ౧౭

క్రూరులగు నారాక్షసులు శంఖంబు లూఁదుచు భేరుల వాయించుచు సింహనాదంబులు సేయుచు భుజంబులు దట్టుచు హనుమంతుని లంకనంతయుం ద్రిప్పిరి. ౧౮

శత్రువుల నడఁగఁద్రొక్కఁజాలిన హనుమంతుండు రాక్షసులు తన్ను వెంబడింప సుఖంబునం బోవుచు నాలంకాపట్టణమంతయు సంచరించెను. ౧౯

అంత హనుమంతుండు నానావిధంబు లగు విమానంబులను సంవృతము లగు భూమియందలి యాయుధాదులుంచు రహస్యప్రదేశంబులను జక్కఁగా నేర్పఱుపఁబడియున్న చత్వరంబులనుం జూచెను. ౨౦

వాయుదేవునికుమారుఁడగు హనుమంతుఁడు ఇండ్లతో నిండినవీథులను నాలుగువీథులు గలయుస్థలములను రాజవీథులను చిన్నవీథులను స్వల్పగృహములను రహస్యద్వారంబులను మేఘసమానంబులగు నున్నతగృహంబులనుజూచెను.

అచ్చటచ్చటఁ జదుకములందును జతుస్తంభమంటపములందును రాజమార్గంబులందును రాక్షసులు హనుమంతుని చారుండని ప్రకటించుచుం బోయిరి. ౨౨

అచ్చటచ్చట స్త్రీలును బాలురును వృద్ధులును గౌతుకంబున మండుచున్నతోఁకతోఁ గూడిన హనుమంతుం జూచుటకై ఇండ్లనుండి వెడలిరి.

అంత హనుమంతుని తోఁకకు రాక్షసులు నిప్పుముట్టించినపిమ్మట వికృతంబులగుకండ్లుగలయారాక్షసస్త్రీలు ఆదుఃఖవార్తను సీతాదేవికిం జెప్పిరి.

సీతా! ఇంతకుముందు నీతో నెవ్వండు మాటలాడి పోయినాఁడో ఇప్పుడు ఆవానరునితోఁకకు నిప్పు ముట్టించి యతని నూరంతయుఁ ద్రిప్పుచున్నారు. అని రాక్షసస్త్రీలు సీతకుం జెప్పిరి. ౨౫

శ్రుత్వా తద్వచనం క్రూరమాత్మాపహరణోపమమ్. ౨౬
వైదేహీ శోకసన్తప్తా హుతాశనముపాగమత్,
మఙ్గళాభిముఖీ తస్య సా తదాఽఽసీన్మహాకపేః. ౨౭

ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనం,

యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః. ౨౮
యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః,
యది కించిదనుక్రోశస్తస్య మయ్యస్తి ధీమతః. ౨౯
యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః,

యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్. ౩౦
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః,

యది మాం తారయేదార్యస్సుగ్రీవస్సత్యసఙ్గరః. ౩౧
అస్మాద్దుఃఖామ్బుసంరోధాచ్ఛీతో భవ హనూమతః,

తత స్తీక్ష్ణార్చిరవ్యగ్రః ప్రదక్షిణశిఖోఽనలః. ౩౨
జజ్వాల మృగశాబాక్ష్యాశ్శంసన్నివ శివం కపేః,

హనుమజ్జనకశ్చాపి పుచ్ఛానలయుతోఽనిలః. ౩౩
వవౌ స్వాస్థ్యకరో దేవ్యాః ప్రాలేయానిలశీతలః,
[తాం తదా పరమోద్విగ్నాం సీతాం శోకాభికర్శితాం,
హనూమతి గృహీతే తు రక్షోభిర్భీమవిక్రమైః.
ఉవాచ సరమా వాక్యం తామాశ్వాసయితుం తదా,
మా శుచో దేవి వైదేహి హనూమన్తం మహాకపిమ్.

సీతాదేవి క్రూరంబగు నామాటను విని ప్రాణంబుల నపహరించి నట్లు పరమదుఃఖంబు నొంది యగ్నిహోత్రు నుపాసించెను. ౨౬

అప్పు డా సీతాదేవి యీహనుమంతునకు మంగళం బొనగూర్పఁ గోరినది. ౨౭

విశాలంబులగు నేత్రంబులుగలసీతాదవి పరిశుద్ధంబగుమనంబున నగ్నిహోత్రు నుపాసించినది.

నేను పతిసేవ చేసియుందునేని తపం బాచరించి యుందునేని నాకుఁ బాతివ్రత్యంబు గలదేని హనుమంతునకుఁ జల్లఁగా నుండుము. ౨౮

బుద్ధిమంతుఁడగు రామునకు నాయందేమైనఁ గొంచెము దయయుండు నేని నే నింకమీఁదఁ గొంచెమైనను భాగ్యముఁ బొందవలసియుందునేని హనుమంతునకుఁ జల్లఁగా నుండుము. ౨౯

నేను పాతివ్రత్యంబు వదలకున్నాననియు రాముని బొందలేననియే వగచుచున్నాననియుం ధర్మాత్ముఁడగు రాముఁడు తలంచియుందునేని హనుమంతునకుఁ జల్లఁగా నుండుము. ౩౦

పూజ్యుఁడును సత్యప్రతిజ్ఞుఁడునగు సుగ్రీవుఁడు నాకిప్పుడు గలిగి యున్నదుఃఖంబుఁ బోఁగొట్టునేని నీవు హనుమంతునకుఁ జల్లఁగా నుండుము అని సీతాదేవి యగ్నిహోత్రునిం బ్రార్థించినది. ౩౧

అంత హనుమంతుని తోఁకయందలి యగ్నిహోత్రుఁడు సీతకు హనుమంతునకు భయంబులేదని తెల్పుచుఁ దక్షిణంబున నధికంబులగు ప్రదక్షిణ జ్వాలలతో జ్వలించెను. ౩౨

హనుమంతుని తోఁకయందలి యగ్నిహోత్రముతోనున్న యతనితండ్రి యగువాయుదేవుండును సీతాదేవికి నెమ్మది గలుగుటకై మంచుగాలివలెఁ జల్లఁగా వీఁచెను. [ఇట్లు రాక్షసులచేతఁ జిక్కి లాంగూలదాహము సేయఁ బడుచున్న హనుమంతునివిషయమై బెంగ పెట్టుకొని వ్యసనపడుచున్న సీత నూఱడించుటకై సరమ యిట్లు పలికెను. అమ్మా! నీ వాతనికై చింతనొందకుము. ఆతఁడు మహానుభావుఁడు. అప్పుడే తన్నరికట్టిన కావలివారినందఱను గాలఁ జేత చదను జేసి ప్రత్యక్షమయిన యగ్నిదేవునిలాగున లంకనంతయుఁ

హత్వా తు రక్షిణస్సర్వాన్ రాక్షసాంస్తత ఏవ సః,
పురీం లఙ్కాం దహతి స సాక్షాదివ హుతాశనః.
భవనాద్భవనం గచ్ఛన్నసావత్యన్తవీర్యవాన్,
ప్రాసాదవరసంస్థాశ్చ గవాక్షస్థాశ్చ యోషితః.
వహ్నిప్రదీప్తనయనాః తథా క్రన్దంతి దుఃఖితాః,
ఏతా వరవిశాలాక్ష్యో వహ్నిజ్వాలాసమావృతాః.
అపశ్యన్తః క్వచిత్ స్థాతుం సర్వతోఽగ్నిసమావృతాః,
వహ్నావభ్యుత్పతన్త్యాశు కర్తవ్యం నైవ జజ్ఞిరే.
అభిధావన్తి సహసా క్రోశన్త్యస్సహబాలకైః,
అవరుద్ధాని కృత్వా స్మ వాసోభి ర్వేష్టితా స్తదా.
స్తంభై రాజతసౌవర్ణైః ప్రవాళమణిచారుభిః,
దృశ్యన్తేఽగ్నిసమాసక్తా వహ్నౌ వహ్నేరివోద్యతాః.
ప్రాసాదమాలా బహుధా అగ్నిదగ్ధాః పతన్తి వా,
అర్చిష్వేవ హిరణ్యానాం ప్రభాభిః కృష్ణవర్త్మనః.
దీప్యమానా ఇవాభాతి లఙ్కేయం కాలపర్యయే,
క్వచిద్దగ్ధాః ప్రదేశాస్తు క్వచిద్దగ్ధా వినాశితాః.
బహుభౌమా విభాన్తి స్మ గృహాణాం భూమయశ్శుభాః,
కాన్తాభిస్సహ విత్రస్తా దృశ్యన్తే రాక్షసా స్తదా.
హా హేత్యుచ్చైర్వదన్తి స్మ త్రాతారం నాభిజజ్ఞిరే,
సంప్రదీప్తాం పురీం లఙ్కాం హనుమద్వీర్యధర్షితామ్.
అన్తఃపురాణి సర్వాణి దృష్ట్వా దుద్రువిరే తదా,
క్వచిత్కుంకుమవర్ణాభాః క్వచిత్కింశుకసంనిభాః.
క్వచిన్మలినసంకాశాః శిఖా వహ్నేః ప్రకాశిరే,
ధూమేన సంవృతాః కేచిద్గృహోద్దేశాస్సుశోభనాః.

గాల్చుచున్నాఁడు. ఒక యింటిమీఁదనుండి మఱియొకయింటికి దుమికి యన్ని కొంపలు ముట్టించుచున్నాఁడు. అదె చూడుము. మేడలమీఁదనున్న స్త్రీలందఱు కన్నులు గమరి యేడ్చుచు కాపాడుదిక్కులేక మంటలకులోనై నిలువఁ జోటులేక చేయునది యెఱుఁగక కుప్పలోఁ గూలుచున్నారు. మఱియుఁ బుడుకలు వెంబడింపఁగా గుడ్డలు మొగముల కడ్డము పెట్టుకొని వెండి బంగారు స్తంభములమాటున నిలచి యొడలెల్ల మండుచుండఁగా నగ్నినుండి పుట్టిరా యనునట్లు తోఁచుచున్నారు. మేడలచా ళ్లన్నియుఁ గాలి యెట్లు కూలుచున్నవో కనుము. మేడలన్నియు నగ్నిజ్వాలలచేఁ గ్రమ్మఁబడి బంగారపువానివలె నున్నవి. చూచితివా లంక కెంతలో చేటు మూడినదో! కొన్ని చోట్ల ఇంకను కాలుచునే యున్నవి. అప్పుడే కొన్నితావులు కాలి బూడిదయైనవి. మనోహరమైన పెక్కంతస్తులమేడలు కూలి నేలపాలయినవి. రాక్షసులందఱు భార్యలతోఁ గూడి మంటలలోఁ జిక్కి మాఁడి కుయ్యో మొఱ్ఱో యని మొత్తుకొనుచున్నారు; కాని యెవరును కాపాడఁజాలినవారు లేరు. హనుమంతుఁ డట్లు లంకను గాల్చుచుండఁగా నంతఃపురవనితలెల్లరు దిక్కుగానక కలకొలవిధముగాఁ బరుగులిడుచున్నారు. చూచితివా అగ్నిజ్వాలలు కొన్నియెడల కుంకుమమువలె నెఱ్ఱఁగాను కొన్నిపట్టుల మోదుగుపూవులవలె పచ్చగాను కొన్నిచోట్ల నల్లగాను మాఁద నొప్పియున్నవి. మేడలన్నియు శాగ్రష్మి వర్షాకాలమేఘములచే నావృతమైన మిన్నువలెఁ దేజరిల్లుచున్నవి. స్నేహితురాలవైన సీతమ్మా! నీవు భయపడకుము. హనుమంతుఁడు పూరిపుల్ల మిగులకుండ లంకనంతయుఁ గాల్చి మగఁటిమిచే మింటఁ ద్రుళ్లిపడుచు మొగులుఁవిడిచిన చంద్రునివలె మెఱయుచున్నాఁడు. అని సరమ చెప్పఁగా విని సీతమ్మ చాల సంతసపడి సుఖించినదై మనసు కుదుటఁ బెట్టుకొనియెను.] 33

వర్షకాలే తు సంప్రాప్తే ఘనైరివ నభస్తలం,
దేవి వ్యాప్తైతు తే త్రాసో హనుమన్తం ప్రతి ప్రియే.
దగ్ధ్వైవ లఙ్కాం సుమహాన్ వ్యోమ్ని వీరః ప్రకాశతే,
దీర్ఘైర్ఘనామ్బుసంరోధైః ముక్తచన్ద్ర ఇవామలః.
ఏతచ్ఛ్రుత్వాఽభవత్ప్రీతా సీతా శశినిభాననా,
నిర్వృతిం పరమాం ప్రాప్తా బాలా స్వస్థాఽభవత్తదా.]
దహ్యమానే చ లాంగూలే చిన్తయామాస వానరః. 3౪

ప్రదీప్తోఽగ్నిరయం కస్మాన్న మాం దహతి సర్వతః,

దృశ్యతే చ మహాజ్వాలః కరోతి న చ మే రుజమ్. 3౫

శిశిరస్యేవ సమ్పాతో లాంగూలాగ్రే ప్రతిష్ఠితః,

అథవా తదిదం వ్యక్తం యద్దృష్టం ప్లవతా మయా. 3౬
రామప్రభావాదాశ్చర్యం పర్వతస్సరితాంపతౌ,

యది తావత్సముద్రస్య మైనాకస్య చ ధీమతః. 3౭
రామార్థం సంభ్రమస్తాదృక్కిమగ్నిర్న కరిష్యతి,
సీతాయాశ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ. 3౮
పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః,

భూయస్స చిన్తయామాస ముహూర్తం కపికుఞ్జరః. 3౯
[కథ మస్మద్విధస్యేహ బన్ధనం రాక్షసాధమైః,

అట్లు తనతోఁక దహింపఁబడుచుండుటఁ జూచి హనుమంతుం డిట్లు చింతించెను. ౩౪

నాతోఁకయందు నిప్పు మండుచున్నది. ఇది నన్నుంతటను దహింప కున్న దేల?

ఈనిప్పు పెనుమంటలు గల్గియున్నది అయినను నాకుఁ గొంచెమయి నను బాధ గల్గింపకున్నది. ౩౫

ఈయగ్నిహోత్రము నావాలాగ్రమునందుఁ జల్లనిదగు చందనము మొదలగువాని సమూహముంబోలెఁ జల్లఁగా నున్నది. దీని కేమి కారణము?

దీనికిఁ గారణ మిప్పుడు స్పష్టమయినది. నేను సముద్రంబు దాఁటు నప్పుడు సముద్రంబులో నాశ్చర్యంబుగా నొక్క పర్వతంబుఁ జూచితిని కదా! అందుకు రాముని ప్రభావమేగదా కారణము. అందువలన నిప్పుడు నాకు నిప్పు చల్లగానుండుటకు రాముని ప్రభావమే కారణము. ౩౬

సముద్రుండును బుద్ధిమంతుం డగు మైనాకుండును రామునకు మేలు సేయవలెనని యంతగా సంభ్రమపడినారు గదా! ఇంక నగ్నిహోత్రుండు మాత్రము రామునకు మేలుసేయ నేల యత్నింపఁడు! ౩౭

సీతాదేవి దయవలనను రాముని ప్రభావంబువలనను నాతండ్రియగు వాయుదేవుని కతండు స్నేహితుం డగుటవలనను ఈయగ్నిహోత్రుండు నన్ను దహింపకున్నాఁడు. అని హనుమంతుండు చింతించెను. ౩౮

వానరోత్తముఁడగు నాహనుమంతుఁడు మరల నాపైఁ జేయవలసిన కార్యమునుగుఱించి కొంచెము నేపాలోచించెను. [నాయంతవాని నీయఘములు

ప్రతిక్రియాస్య యుక్తా స్యాత్సతి మహ్యాం పరాక్రమే,
తతశ్ఛిత్వా చ తాన్ పాశాన్వేగవాన్వై మహాకపిః
ఉత్పపాతాథ వేగేన ననాద చ మహాకపిః,
పురద్వారం తతశ్శ్రీమాన్ శైలశృఙ్గమివోన్నతమ్. ౪౦
విభక్తరక్షస్సంబాధమాససాదానిలాత్మజః,
స భూత్వా శైలసఙ్కాశః క్షణేన పునరాత్మవాన్. ౪౧
హ్రస్వతాం పరమాం ప్రాప్తో బన్ధనాన్యవశాతయత్,
విముక్తశ్చాభవచ్ఛ్రీమాన్ పునః పర్వతసన్నిభః. ౪౨
వీక్షమాణశ్చ దదృశే పరిఘం తోరణాశ్రితం,

స తం గృహ్య మహాబాహుః కాలాయసపరిష్కృతమ్. ౪౩
రక్షిణస్తాన్ పునస్సర్వాన్ సూదయామాస మారుతిః,

స తాన్నిహత్వా రణచణ్డవిక్రమస్సమీక్షమాణః పునరేవ లఙ్కాం, ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ ప్రకాశతాఽఽదిత్య ఇవార్చిమాలీ. ౪౪

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రిపఞ్చాశస్సర్గః.

---

## చతుఃపఞ్చాశస్సర్గః.

వీక్షమాణస్తతో లఙ్కాం కపిః కృతమనోరథః,
వర్ధమానసముత్సాహః కార్యశేషమచిన్తయత్. ౧

కిన్ను ఖల్వవశిష్టం మే కర్తవ్యమిహ సామ్ప్రతం,
యదేషాం రక్షసాం భూయస్సన్తాపజననం భవేత్. ౨

రాక్షసులు కట్టువారా? ఛీ! నేనింతటివీరుఁడనై యీరాక్షసులకుఁ దగినశాంతి చేయకేని నావిక్రమమేల యని తొందరగా కట్లుత్రెంపుకొని విడిబడెను.]

అంత హనుమంతుఁడు వేగంబున నెగిరి సింహనాదముచేసెను. ౩౯

అంత శ్రీమంతుఁడగు హనుమంతుఁడు పర్వతశిఖరంబుబోలె నున్నతంబును రాక్షససంచారంబు లేనిదియు నగుపట్టణద్వారంబుఁ జేరెను. ౪౦

పర్వతాకారుండును మహాధైర్యశాలియు నగు నాహనుమంతుండు క్షణంబున మిక్కిలి చిన్నరూపము వహించి బంధంబు లన్నియు వదలించుకొనెను. ౪౧

శ్రీమంతుఁ డగు హనుమంతుఁడు బంధంబులు వదలించుకొన్నంతనే మరలఁ బర్వతాకారంబు వహించి నలుదిక్కులఁజూచి బహిర్ద్వారంబున వేసియున్న యినుపగుదియం గనెను. ౪౨

మహాబాహుండును వాయుదేవునికుమారుండు నగు నాహనుమంతుం డాయినుపగుదియం జేకొని మరలం దనకుఁ గావలియున్న రాక్షసులనందఱం జంపెను. ౪౩

యుద్ధంబున భయంకరంబగు పరాక్రమముఁగల యాహనుమంతుం డా రాక్షసులం జంపి మరల లంకతట్టు చూచుచుఁ దోఁకయందలి యగ్నిజ్వాలలచేఁ గప్పఁబడినవాఁ డగుటంజేసి కిరణసమూహంబులం గప్పఁబడియుండు సూర్యునిపోల్కిం బ్రకాశించెను. ౪౪

ఇది యేఁబదిమూఁడవ సర్గము.

## ఏఁబదినాలుగవ సర్గము

అంత నట్లు హనుమంతుండు తనకోర్కెలం దీర్చుకొని లంకం జూచుచు నుత్సాహం బంతకంతకు వృద్ధిఁ బొంద "నింక నేమి చేయవలసినది" అని యాలోచించెను. ౧

రాక్షసుల కేది యింక నధికముగా నష్టముగలిగించునో అట్టికార్యము ఇప్పు డిచ్చట నేనైనఁ జేయవలసియున్నదా యేమి! ౨

వనం తావత్ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః,
బలైకదేశః క్షపితశ్శేషం దుర్గవినాశనమ్. 3

దుర్గే వినాశితే కర్మ భవేత్సుఖపరిశ్రమం,

అల్పయత్నేన కార్యేఽస్మిన్ మమ స్యాత్సఫలశ్శ్రమః. ౪

యో హ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః,
అస్య సన్తర్పణం న్యాయ్యం కర్తుమేభిర్గృహోత్తమైః. ౫
తతః ప్రదీప్తలాంగూల స్సవిద్యుదివ తోయదః,
భవనాగ్రేషు లఙ్కాయా విచచార మహాకపిః. ౬
గృహాద్గృహం రాక్షసానాముద్యానాని చ వానరః,
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః. ౭
అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనం,
అగ్నిం తత్ర స నిక్షిప్య శ్వసనేన సమో బలీ. ౮

తతోఽన్యత్పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్,
ముమోచ హనుమానగ్నిం కాలానలశిఖోపమమ్. ౯

వజ్రదంష్ట్రస్య చ తదా పుప్లువే స మహాకపిః,
శుకస్య చ మహాతేజాస్సారణస్య చ ధీమతః. ౧౦

తథా చేన్ద్రజితో వేశ్మ దదాహ హరియూథపః,

జమ్బుమాలేస్సుమాలేశ్చ దదాహ భవనం తతః. ౧౧

రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రోస్తథైవ చ,

అశోకవనము విఱిచినాను. మేటిరాక్షసులం గొందఱఁ జంపినాను. సైన్యములోఁ గొంతభాగము నశింపఁజేసినాను. ఇంక నీపట్టణదుర్గమును నశింపఁజేయవలసినది యొకటి మిగిలియున్నది. 3

నే నీదుర్గంబును నశింపఁజేయుదునేని సముద్రము దాఁటుట మొదలగు కార్యములందు నేఁ బడినశ్రమము సఫలమగును.

ఈదుర్గనాశనంబును సులభముగా నే చేయఁదగియున్నది. దీనిం జేయుదునేని నాశ్రమంబంతయుం సఫలమగును. ౪

నాతోఁకయం దగ్నిహోత్రుండు మండుచున్నాఁడే. ఇతని కీయుత్తమ గృహంబులచేఁ దృప్తిసేయుట యుక్తము. ౫

అంత హనుమంతుండు మండుచున్న వాలంబుతో మెఱుపులతోడి మేఘంబుకైవడి భాసిల్లుచు లంకాపట్టణంబునందలి యిండ్లపై సంచరించెను. ౬

ఆహనుమంతుండు ఉద్యానవనంబులను ప్రాసాదంబులనుం జూచుచు నిర్భయంబుగా రాక్షసులయిండ్లన్నియుఁ దిరిగెను. ౭

మహావేగుండును వాయుదేవునితో సమానుండును బలవంతుండును బరాక్రమశాలియు నగు నాహనుమంతుండు ప్రహస్తునియింటిపై కెగిరి యచ్చట నిప్పుముట్టించి యంత మహాపార్శ్వునియింటిపై కెగిరెను. ౮

హనుమంతుం డంత మహాపార్శ్వునింటఁ గాలాగ్నిజ్వాలం బోలిన యగ్నిహోత్రంబు దరికొల్పెను. ౯

అంత మహాపరాక్రమశాలియగు నాహనుమంతుండు వజ్రదంష్ట్రుని యింటికిని శుకునిగృహంబునకు బుద్ధిమంతుండగు సారణునిగృహంబునకు నేగి యాగృహంబులకు నిప్పు ముట్టించెను. ౧౦

అట్లు వానరోత్తముఁడగు హనుమంతుఁడు ఇంద్రజిత్తుగృహంబును దహించెను.

అంత హనుమంతుఁడు జంబుమాలియుం సుమాలియుం ననువారల గృహంబులను దహించెను. ౧౧

మహాపరాక్రమశాలియుం వానరోత్తముఁడు నగు హనుమంతుఁ డట్లు

హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః. ౧౨
యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య రక్షసః,
విద్యుజ్జిహ్వస్య ఘోరస్య తథా హస్తిముఖస్య చ. ౧౩
కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి,
కుమ్భకర్ణస్య భవనం మకరాక్షస్య చైవ హి. ౧౪
యజ్ఞశత్రోశ్చ భవనం బ్రహ్మశత్రోస్తథైవ చ,
నరాన్తకస్య కుమ్భస్య నికుమ్భస్య దురాత్మనః ౧౫
వర్జయిత్వా మహాతేజా విభీషణగృహం ప్రతి,
క్రమమాణః క్రమేణైవ దదాహ హరిపుఙ్గవః. ౧౬
తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః,
గృహేష్వృద్ధిమతామృద్ధిం దదాహ స మహాకపిః. ౧౭

సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేన్ద్రస్య వీర్యవాన్,
ఆససాదాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్. ౧౮

తతస్తస్మిన్గృహే ముఖ్యే నానారత్నవిభూషితే,
మేరుమన్దరసఙ్కాశే సర్వమఙ్గళశోభితే. ౧౯

ప్రదీప్తమగ్నిముత్సృజ్య లాంగూలాగ్రే ప్రతిష్ఠితం,
ననాద హనుమాన్వీరో యుగాన్తజలదో యథా. ౨౦

శ్వసనేన చ సంయోగా దతివేగో మహాబలః,
కాలాగ్నిరివ జజ్వాల ప్రావర్ధత హుతాశనః. ౨౧

ప్రదీప్తమగ్నిం పవనస్తేషు వేశ్మస్వచారయత్,

క్రమంబునఁ బ్రతిగృహంబును దిరుగుచు విభీషణునింటిని మాత్రము విడిచి రశ్మికేతుగృహంబును సూర్యశత్రుభవనంబును హ్రస్వకర్ణుని యాలయంబును వజ్రదంష్ట్రుని నిలయంబును లోమశుండను రాక్షసుని మందిరంబును యుద్ధోన్మత్తుని సదనంబును మత్తునియాలయంబును ధ్వజగ్రీవుని సద్మంబును భయంకరుండగు విద్యుజ్జిహ్వుని వేశ్మంబును హస్తిముఖుని నివేశనంబును కరాళపిశాచుల నికేతనంబులును శోణితాక్షుని గృహంబును కుంభకర్ణుని మందిరంబును మకరాక్షుని భవనంబును యజ్ఞశత్రు బ్రహ్మశత్రువుల సద్మంబును నరాంతకుని వేశ్మంబును కుంభుని నికేతనమును దురాత్ముండగు నికుంభుని యావాసంబును దహించెను. ౧౨-౧౬

మహాకీర్తిశాలియగు నాహనుమంతుండు ఉత్తమంబు లగు నాయా గృహంబులందు అధికంబుగా నారాక్షసులు సంపాదించి కూర్చి పెట్టుకొన్న మణిముక్తాప్రవాళాదిసంపదలం దహించెను. ౧౭

మహాపరాక్రమశాలియు మహాతేజశ్శాలియు నగు హనుమంతుండు అట్లు రాక్షసుల యందఱిగృహంబులందును నిప్పు ముట్టించి యంత రాక్షసేశ్వరుం డగురావణునిగృహంబునకుం బోయెను. ౧౮

అంతఁ బరాక్రమవంతుండగు నాహనుమంతుండు నానావిధమణులచే నలంకరింపఁబడినదియు మేరుమందరపర్వతములకు సాటివచ్చునదియు సమస్త మంగళద్రవ్యములతోడం గూడినదియు నుత్తమము నగు నాగృహమునకుఁ దన తోఁకలో వెలుంగుచున్న నిప్పుముట్టించి ప్రళయకాలమేఘముకరణి సింహనాదము చేసెను. ౧౯,౨౦

ఇంతకుము న్నిదివఱకు వాయువు నగ్నిహోత్రుండును రావణునకు భయంపడియున్న వారలైనను ఇప్పుడు దేవతలకు బలము హెచ్చుట వలంగి రావణభయంబు విడిచి యుద్ధఱుం గలయుటం జేసి యగ్నిహోత్రుండు మహావేగమును మహాబలమునుం బొంది ప్రవృద్ధుఁడై ప్రళయకాలాగ్ని చందమునం బ్రజ్వలించెను. ౨౧

వాయువు మండుచున్న యగ్నిహోత్రమును ఆయాగృహములపై వ్యాపించునట్లు చేయుచుండెను.

అభూచ్ఛ్వసనసంయోగాదతివేగో హుతాశనః. ౨౨

తాని కాఞ్చనజాలాని ముక్తామణిమయాని చ,
భవనాన్యవశీర్యన్త రత్నవన్తి మహాన్తి చ. ౨౩
తాని భగ్నవిమానాని నిపేతుర్వసుధాతలే,
భవనానీవ సిద్ధానామమ్బరాత్పుణ్యసఙ్క్షయే. ౨౪
సఞ్జజ్ఞే తుములశ్శబ్దో రాక్షసానాం ప్రధావతామ్,
స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియామ్. ౨౫
నూనమేషోఽగ్నిరాయాతః కపిరూపేణ హా ఇతి,

క్రన్దన్త్యస్సహసా పేతుస్స్తనన్ధయధరాః స్త్రియః. ౨౬
కాశ్చిదగ్నిపరీతేభ్యో హర్మ్యేభ్యో ముక్తమూర్ధజాః,
పతన్త్యో రేజిరేఽభ్రేభ్యస్సౌదామిన్య ఇవామ్బరాత్. ౨౭

వజ్రవిద్రుమవైడూర్యముక్తారజతసంహితాన్,
విచిత్రాన్భవనాద్ధాతూన్ స్యన్దమానాన్దదర్శ సః, ౨౮

నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం తృణానాం హరియూథపః,
నాగ్నేశ్చాపి విశస్తానాం రాక్షసానాం వసున్ధరా, ౨౯

క్వచిత్కింశుకసఙ్కాశాః క్వచిచ్ఛాల్మలిసన్నిభాః,
క్వచిత్కుఙ్కుమసఙ్కాశాః శిఖా వహ్నేశ్చకాశిరే. ౩౦

వాయువు తోడ్పడుటంజేసి యగ్నిహోత్రం బతివేగమున లంక యంతయు వ్యాపించెను. ౨౨

బంగారు కిటికీలు గలవియు ముక్తారత్నమయంబులును మణులతో నిండినవియును గొప్పవియు నగు సౌగృహంబులు దహింపబడి నేలంబడినవి.

అట్లు విఱిగిన మేడలు పుణ్యము నశించినపిదప సిద్ధుల విమానంబులు నేలఁబడునట్లు ఆకాశమునుండి నేలం గూలినవి. ౨౪

అంత రాక్షసులందఱుఁ దమతమ గృహంబులం గాపాడుకొనుటకై నిరుత్సాహులై పరమదీనులయి అయ్యో! ఇతండు సాక్షాదగ్నిహోత్రుండే వానరరూపమున నిచ్చటికి వచ్చినాఁడు. ఇది నిశ్చయము. అని యాక్రోశించుచుం బరుగెత్తిరి. ౨౫

పసిబిడ్డల నెత్తుకొనియున్న స్త్రీలు కొందఱు దహింపఁబడుచుండు మేడలపైనుండి రోదనంబుసేయుచుఁ గొప్పలువీడం దటాలున నేలంబడిరి.

అప్పు డట్లాకాశమునుండి పడుచున్న యాస్త్రీలు మేఘంబులనుండి పడు మెఱుపులుంబోలె వెలింగిరి. ౨౬

ఆహనుమంతుఁడు వజ్రములతోను ప్రవాళంబులతోను వైడూర్యంబులతోను ముత్తెములతోను ఇతరమణులతోనుం గూడినవియు నిప్పువేండ్రంబునకుఁ గరఁగి కాఱుచున్నవియుం నగు నానావిధములయిన బంగారుగృహములం జూచెను. ౨౭

అగ్నిహోత్రుఁడు ఎట్లు కట్టెలును గడ్డియుఁ నెంతయుండినను దృప్తిఁ బొందఁడో అట్లు హనుమంతుఁడు లంకకు నిప్పు నెంత ముట్టించినను దృప్తిఁ బొందఁ డయ్యెను. అట్లు రాక్షసుల పీనుఁగులు ఎన్నిపడినను భూమియుం దృప్తిఁబొందకుండినది. ౨౯

అప్పుడు అగ్నిహోత్రము దహింపఁబడు పదార్థముల స్వభావముచే నొక్కచో మోదుగుపువ్వులంబోలు జ్వాలలును ఒక్కచో బూరుగపువ్వుంబులవంటి మంటలును మఱియొక్కచోఁ గుంకుమపువ్వులతో సమానములగు కీలలునుం గల్గి ప్రకాశించెను. ౩౦

హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా,
లంకాపురం ప్రదగ్ధం తద్రుద్రేణ త్రిపురం యథా. 30
తతస్తులఙ్కాపురపర్వతాగ్రే సముత్థితో భీమపరాక్రమో௨గ్నిః,
ప్రసార్య చూడావలయం ప్రదీప్తో హనూమతా వేగవతా విసృష్టః.
యుగాన్తకాలానలతుల్యవేగ
స్సమారుతో௨గ్నిర్వవృధే దివిస్పృక్,
విధూమరశ్మిర్భవనేషు సక్తో
రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః. 33
[సతామత్యర్థతో వహ్నిర్లంకాం రాక్షససఙ్కులాం,
జ్వాలామాలాపరిక్షిప్తై రదహన్మారుతాత్మజః.
తేన శబ్దేన విత్రస్తా ధర్షితా స్తేన చాగ్నినా,
అభిపేతు స్తదా ఘోరా హనూమన్తం నిశాచరాః.
తం ప్రదీప్తైశ్చ శూలాగ్రైః ప్రాసైః ఖడ్గైః పరశ్వథైః,
హనూమన్తం మహావేగై రక్షిపన్నైరృతర్షభాః,
తే రాక్షసా భీమబలా నానాప్రహరణాన్వితాః,
నిహత్య చ స తాం స్తత్ర దివమేవోత్పపాత హ.
సచ విక్రమ్య సహసా సంక్రామంశ్చ గృహాద్గృహం,
లంకామాదీపయామాస వాయుపుత్రః ప్రతాపవాన్.
సలాంగూలోపసక్తాగ్నిః ముక్తో మృత్యుగృహాదివ,
లఙ్కాం పర్యదహాత్కృత్స్నాం ఖే గ్రహస్సంపతన్నివ.
తోరణేషు గవాక్షేషు రమ్యేషు శిఖరేషు చ,
తిష్ఠన్తి స్మ ప్రపశ్యంతి రాక్షసాః ప్లవగోత్తమమ్.
హుతాశనజ్వాలసమావృతా సా హతప్రవీరా హతసర్వశోభనా,
హనూమతః క్రోధబలాభిభూతా బభూవ కాలోపహతేవ లఙ్కా.

వేగవంతుండును, మహాపరాక్రమశాలియు నగు హనుమంతుఁడు రుద్రుండు త్రిపురమును దహించినట్లు లంకాపురంబును దహించెను. 31

అంత వేగవంతుండగు హనుమంతుం డుంచిన యగ్నిహోత్రము లంకాపట్టణం బంతయు జ్వాలలచే వ్యాపించి భయంకరాకారంబున మండెను. 32

అంత నాయగ్నిహోత్రము వాయువు తోడ్పడం బ్రళయకాలము నందలి యగ్నిహోత్రంబుపగిది నాకాశంబునంటి పొగలులేని మంటలతో నిండ్లన్నియు వ్యాపించి రాక్షసుల దేహములందలి (క్రొవ్వు) నేతిచే మఱియు వృద్ధిఁ బొందినది. 33

[ఇట్లాంజనేయుఁడును, వానికిఁ దోడై యగ్నియు రాక్షసులచేఁ గ్రిక్కిఱిసియున్న లంకను పెనుమంటలచేఁ గాల్చిరి. అట్లాలంక కాలుచుండ నాధ్వనికి పెక్కురక్కసు లుక్కుమీఱ నాంజనేయునిమీఁది కుఱికి వాఁడి కోలములు మున్నగు నాయుధములచే నాతనినిఁ గ్రమ్మిరి. అతఁడును వారి పోటుముట్టుల విఱిచి వారిం జావనడిచి మింటికెగసి చెలరేఁగి ఒకయింటినుండి మఱియొకయింటి కేఁగుచు పురమంతయుఁ గాల్చి విక్రమించెను. మండెడు తోఁకతోఁగూడి యాతఁడు యముని యింటినుండి పంపఁబడినవానివలెను ఆకసమునుండి జాఱి దొర్లుచున్న నక్షత్రమువలెను జూపరులకు వెఱపుఁ బుట్టించుచు నొక యిల్లైన మిగులకుండఁ గాల్చెను. రాక్షసవీరులందఱుఁ బెద్ద పెద్ద కోటకొమ్ములమీఁదను గోపురములమీఁదనుండి యాతని చెయ్దములఁ గాంచుచుండిరి. ఇట్లు వీరులందఱు మడిసి యందమంతయుఁ జెడి లంకాపట్టణము కాలముదీఱినట్లు చూపట్టెను. ప్రాణరక్షణమునకై నలుకెలంకులఁ బాఱి గంద్రగోళమొందు రాక్షసులతోను నెటుచూచిన మింటికెగయు మంటలతోను నిండిన లంకంజూచి హనుమంతుఁడు వేడుకపడుచుండెను. ఇప్పుడు లంక ప్రళయకాలమున మండినట్లు మండుచుండెను. ఇట్లు సర్వస్థలములయందు కాలిపోవుచున్న లంకలో నొందే నున్నతదేశమందుఁ గూర్చున్న యాంజనేయుఁడు కాలుచున్నతోఁకయుఁ దానును పట్టపగలింటి సూర్యునివిధమున మిడిసి వ్రాలుచుండెను.]

స సంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం సముజ్జ్వలజ్జ్వాలహుతాశ
నాఙ్కితాం, దదర్శ లంకాం హనుమాన్మహామనాః స్వయం
భువః కోపహతామివావనిమ్.
గృహాగ్ర్యశృంగాగ్ర్యతలేవిచిత్రే ప్రతిష్ఠితో వానరరాజసింహః,
ప్రదీప్తలాఙ్గూలకృతార్చిమాలీ వ్యరాజతాదిత్యఇవార్చిమాలీ]
ఆదిత్యకోటీసదృశస్సుతేజా లంకాం సమస్తాం పరివార్య తిష్ఠన్,
శబ్దైరనేకై రశనిప్రరూఢైర్భిన్దన్నివాణ్డం ప్రబభౌ మహాగ్నిః.
తత్రామ్బరాదగ్నిరతిప్రవృద్ధో రూక్షప్రభఃకింశుకపుష్పచూడః,
నిర్వాణధూమాకులరాజయశ్చ నీలోత్పలాభాః ప్రచకాశిరే
[భ్రాః.

వజ్రీ మహేన్ద్రస్త్రిదశేశ్వరో వా
సాక్షాద్యమో వా వరుణోఽనిలో వా,
రుద్రోఽగ్నిరర్కో ధనదశ్చ సోమో
న వానరోఽయం స్వయమేవ కాలః. 3౬

కిం బ్రహ్మణస్సర్వపితామహస్య సర్వస్య ధాతుశ్చతురాననస్య,
ఇహాఽగతో వానరరూపధారీ రక్షోపసంహారకరః ప్రకోపః. 3౭

కిం వైష్ణవం వా కపిరూపమేత్య రక్షోవినాశాయ పరంసు
తేజః, అనన్తమవ్యక్తమచిన్త్యమేకం స్వమాయయా సామ్ప్రత
మాగతం వా. 3౮

ఇత్యేవమూచుర్బహవో విశిష్టా రక్షోగణాస్తత్ర సమేత్య
సర్వే, సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం దగ్ధాం పురీంతాం
సహసా సమీక్ష్య. 3౯

ఆయగ్నిహోత్రము కోటిసూర్యులకాంతి గల్గి వెలుంగుచుఁ బిడుగులంబోని శబ్దంబు లనేకములు సేయుచు నీబ్రహ్మాండమునంతయుఁ బగులఁ గొట్టుపోల్కిం బ్రకాశించుచుండినది. ౩౪

అచ్చటఁ దీక్ష్ణంబగు కాంతిగల్గి మోదుగుపూలంబోలు మంటలతో నొప్పుచున్న యాయగ్నిహోత్రము ఆకాశమువఱకు వ్యాపించినది.

ఇండ్లు మండి చల్లారుచున్నను కలుగు పొగలు గప్పుకొనుటంజేసి యచ్చటి మేఘములు నల్లకలువలకాంతి గల్గి యొప్పుచుండినవి. ౩౫

ఇతఁడు వజ్రాయుధము దాల్చినవాఁడును వృత్రాసురుం జంపిన వాఁడును దేవేంద్రుఁడు నగునింద్రుఁడో లేక సాక్షాత్ యముఁడో లేక వరుణుఁడో వాయువో రుద్రుఁడో అగ్నియో సూర్యుఁడో కుబేరుఁడో చంద్రుఁడో తెలియలేదు. వానరుఁడుమాత్రము కాఁడు. సాక్షాత్ యముండే యయియుండును. ౩౬

సమస్తలోకములకును తాతయును సమస్తలోకములను ధరించియున్న వాఁడును నాలుగు మొగములు గలవాఁడు నగు బ్రహ్మదేవుండు రాక్షసుల నందఱను రూపుమాపవలెనని తలంపఁగా నాయనకోపము ఇట్లు వానరరూపము దాల్చి యిచ్చటికి వచ్చినదా యేమి? ౩౭

లేక పరిచ్ఛేదశూన్యంబును జక్షురాదీంద్రియముల కగోచరంబును మనంబునకైన నచింత్యంబు నద్వితీయంబు నగు వైష్ణవంబైన తేజస్సే యిట్లు రాక్షసుల నశింపఁ జేయుటకై తనమాయచే వానరరూపంబుఁ దాల్చి యిచ్చటికి వచ్చెనా యేమి? అని రాక్షసులు చెప్పుకొనిరి. ౩౮

ప్రాణిసమూహములతోను గృహంబులతోను వృక్షంబులతోను నిమిష మాత్రంబున దగ్ధమయిన లంకాపట్టణముం జూచి రాక్షసులందఱు గుంపులు చేరి యీప్రకారముగాఁ జెప్పుకొనిరి. ౩౯

[తతో మహాత్మా హనుమాన్మనస్వీ నిశాచరాణాం క్షతకృత్కృతార్థః, రామస్య నాథస్య జగత్త్రయాణాం శ్రీపాదమూలం మనసా జగామ.]

తతస్తు తం వానరవీరముఖ్యం మహాబలం మారుతతుల్యవేగం, మహామతిం వాయుసుతం వరిష్ఠం ప్రతుష్టువు ర్దేవగణాశ్చ సర్వే. ४८

భఙ్క్త్వా వనం మహాతేజా హత్వా రక్షాంసి సంయుగే,
దగ్ధ్వా లంకాపురీం రమ్యాం రరాజ స మహాకపిః. ४९

తత్ర దేవాస్సగన్ధర్వాస్సిద్ధాశ్చ పరమర్షయః,
దృష్ట్వా లంకాం ప్రదగ్ధాం తాం విస్మయం పరమం గతాః. ५०

తం దృష్ట్వా వానరశ్రేష్ఠం హనుమన్తం మహాకపిం,
కాలాగ్నిరితి సఞ్చిన్త్య సర్వభూతాని తత్రసుః. ५१

దేవాశ్చ సర్వే మునిపుఙ్గవాశ్చ గన్ధర్వవిద్యాధరనాగయక్షాః, భూతాని సర్వాణి మహాన్తి తత్ర జగ్ముః పరాం ప్రీతిమతుల్యరూపామ్. ५२

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుఃపఞ్చాశస్సర్గః.

## పఞ్చపఞ్చాశస్సర్గః

లంకాం సమస్తాం సందీప్య లాంగూలాగ్నిం మహాబలః,
నిర్వాపయామాస తదా సముద్రే హరిసత్తమః. ౧

సందీప్యమానాం విధ్వస్తాం త్రస్తరక్షోగణాం పురీం,
అవేక్ష్య హనుమాన్లంకాం చిన్తయామాస వానరః. ౨

తస్యాభూత్సుమహాంస్త్రాసః కుత్సా చాఽత్మన్యజాయత,

అంత దేవతలందఱు వానరవీరశ్రేష్ఠుండును మహాబలుండును వాయుదేవునకుంబోలె వేగంబు గలవాఁడును మహాబుద్ధిశాలియు నుత్తముఁడును వాయుదేవునికుమారుండు నగు హానుమంతుం బ్రస్తుతించిరి. ౪౮

మహాతేజశ్శాలియగు హానుమంతుఁడు అశోకవనంబు విఱిచి యుద్ధంబున రాక్షసులం జంపి రమ్యంబగు లంకాపురియంతయుం దహించి యొప్పుచుండెను. ౪౯

అప్పుడు దేవతలును గంధర్వులును సిద్ధులును మహర్షులును ఆలంకాపట్టణంబంతయుం దహింపఁబడియుండుటంజూచి పరమాశ్చర్యంబు నొందిరి.

భూతంబులన్నియుం వానరోత్తముఁడగు హనుమంతుంజూచి ప్రళయకాలాగ్నిహోత్రుఁడని తలంచి భయంబునొందినవి. ౫౦

దేవతలును మునిశ్రేష్ఠులును గంధర్వులును విద్యాధరులును సర్పములును యక్షులును సమస్తప్రాణులును లంకాపట్టణము దహింపఁబడుటవలన మితిలేని సంతోషము నొందిరి. ౫౧

ఇది యేఁబదినాలుగవ సర్గము.

## ఏఁబదియైదవ సర్గము

మహాబలశాలియు వానరోత్తముఁడు నగుహానుమంతుఁడు లంకయంతయుం దహించినపిమ్మట తోఁకను సముద్రములోముంచి చల్లార్చెను. ౧

హానుమంతుఁ డంత నగ్నిహోత్రంబుచే దహింపఁబడిన యాలంకాపట్టణం బంతయుం ధ్వంసంబయి యారాక్షసులందఱు భయంబునొందియుండుటం జూచి యిట్లని చింతించెను. ౨

ఆహానుమంతునకు మనంబున మహాభయంబు గలిగినది. తన్ను మిక్కిలి నిందించుకొనెను.

లంకాం ప్రదహతా కర్మ కింస్విత్కృతమిదం మయా. 3
ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోపముత్థితం.
నిరున్ధన్తి మహాత్మానో దీప్తమగ్నిమివామ్భసా. ౪

క్రుద్ధః పాపం నకుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి,
క్రుద్ధః పరుషయా వాచా నరస్సాధూనధిక్షిపేత్. ౫

వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్,
నా కార్యమస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్. ౬

యస్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి,
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే. ౭
ధిగస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమం,
అచిన్తయిత్వా తాం సీతామగ్నిదం స్వామిఘాతుకమ్. ౮

యది దగ్ధా త్వియం లంకా నూనమార్యాఽపి జానకీ,
దగ్ధా తేన మయా భర్తుర్హతం కార్యమజానతా. ౯

యదర్థ మయ మారమ్భస్తత్కార్య మవసాదితం,
మయా హి దహతా లంకాం న సీతా పరిరక్షితా. ౧౦

ఈషత్కార్యమిదం కార్యం కృతమాసీన్న సంశయః,
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః. ౧౧

నే నీలంకాపట్టణము దహించినానే ఎంతచెడ్డకార్యము చేసినాను! ౩

ఎవ్వరు కోపంబు వచ్చినప్పుడు జలముచే మండుచున్న నిప్పును జల్లార్పునట్లు ఆకోపమును బుద్ధిచే నిరోధించుకొందురో అట్టిమహాత్ములగు పురుషశ్రేష్ఠులు పుణ్యవంతులు. ౪

కోపమునొందినవాఁ డెవ్వఁడు పాపముసేయకుండును? కోపంబునొందినవాఁడు గురువులనుంగూడఁ జంపును. కోపంబునొందినవాఁడు పరుషవాక్యంబున సత్పురుషులం దిరస్కరించును. ౫

కోపమునొందినవాఁడు "ఇది చెప్పఁదగినమాట ఇది చెప్పఁదగనిమాట" యని యెఱుంగఁడు. క్రుద్ధునకుఁ జేయఁగూడనికార్య మేదియును లేదు. అనఁగూడనిమాట యేదియును లేదు. ౬

ఎవ్వండు సర్పము జీర్ణమయిన కుబుసమును విడుచునట్లు తనకుంగలిగిన కోపంబును ఓపికచే నణఁచుకొనునో అతండె పురుషుం డనంబడును. ౭

నేను సీతయున్నదని తలంపక లంకకు నిప్పు ముట్టించినాను గావున నేను స్వామిద్రోహిని, దుర్బుద్ధిని, సిగ్గులేనివాఁడను, పాపిష్ఠుఁడను. నేను కాలిపోయెదఁ గాక. ౮

ఈలంకయంతయు దహింపఁబడినది. ఇప్పుడు పూజ్యురాలగు సీతయు దహింపఁబడియుండును నేని నే నజ్ఞానినై ప్రభుకార్యమునంతయుఁ జెఱిచినవాఁడ నగుచున్నాను నిశ్చయము. ౯

ఏకార్యముకొఱకు ఇంత మహాప్రయత్నము చేయఁబడినదో అట్టికార్యమును జెఱిచినాను. నేను లంకను దహించునప్పుడు సీతాదేవిని రక్షింపనైతిని గదా! ౧౦

సముద్రము దాఁటుటయుం సీతను వెదకిచూచుటయుం రామునకుఁ జెల్పుటయుం మొదలుగాఁగల యీగొప్పకార్యమును అంతయును సాధించి యింక రామునకుఁ జెల్పుటయె మిగిలినదిగాఁ జేయఁబడినది. ఇందు సందియము లేదు. అయితేఇప్పుడు నేను క్రుద్ధుండనై యీకార్యమునకు మూలభూతమయిన సీతాదేవికే నాశము గల్గించినాను. ౧౧

వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే,
లంకాయాం కశ్చిదుద్దేశస్సర్వా భస్మీకృతా పురీ. ౧౨

యది తద్విహతం కార్యం మమ ప్రజ్ఞావిపర్యయాత్,
ఇహైవ ప్రాణసన్న్యాసో మమాపి హ్యద్య రోచతే. ౧౩
కిమగ్నౌ నిపతామ్యద్య ఆహోస్విద్బడబాముఖే,
శరీరమాహో సత్త్వానాం దద్మి సాగరవాసినామ్. ౧౪

కథం హి జీవతా శక్యో మయా ద్రష్టుం హరీశ్వరః,
తౌ వా పురుషశార్దూలౌ కార్యసర్వస్వఘాతినా. ౧౫

మయా ఖలు తదేవేదం రోషదోషాత్ప్రదర్శితం,
ప్రథితం త్రిషు లోకేషు కపిత్వమనవస్థితమ్. ౧౬

ధిగస్తు రాజసం భావమనీశమనవస్థితం,
ఈశ్వరేణాపి యద్రాగాన్మయా సీతా న రక్షితా. ౧౭

వినష్టాయాం తు సీతాయాం తావుభౌ వినశిష్యతః,
తయోర్వినాశే సుగ్రీవస్సబన్ధుర్వినశిష్యతి. ౧౮

ఏతదేవ వచశ్శ్రుత్వా భరతో భ్రాతృవత్సలః,
ధర్మాత్మా సహశత్రుఘ్నః కథం శక్ష్యతి జీవితుమ్. ౧౯
ఇక్ష్వాకువంశే ధర్మిష్ఠే గతే నాశమసంశయం,
భవిష్యన్తి ప్రజాస్సర్వాశ్శోకసన్తాపపీడితాః. ౨౦
తదహం భాగ్యరహితో లుప్తధర్మార్థసంగ్రహః,
రోషదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః. ౨౧

సీతాదేవి నిశ్చయముగానే నశించియుండును. లంకయందు ఒక్క ప్రదేశమయినను దగ్ధము గాకుండునది యగపడలేదు. పట్టణంబంతయుం దగ్ధమయియున్నది. ౧౨

నా బుద్ధిహీనత్వమువలన సీత నశించియే యుండునేని నేనును ఇప్పుడిచ్చటనే ప్రాణంబుల విడుచుట యుక్తమని తోఁచుచున్నది. ౧౩

నేనిప్పుడు ప్రాణంబులవిడుచుటకు నిప్పులోఁ దుముకుదునా! లేక పాతాళంబునం బడుదునా? లేక సముద్రంబులోపడి యందునివసించు సత్త్వంబులకు నాదేహము నాహారంబుగా నొసంగుదునా ? ౧౪

నే నిట్లు కార్యమునంతయుం జెఱిపి జీవించియుండియుం వానరేశ్వరుండగు సుగ్రీవు నెట్లు చూడఁగలను? పురుషశ్రేష్ఠులగు నారామలక్ష్మణులనైనను ఎట్లు చూడఁగలను ? ౧౫

ముల్లోకంబులందును బ్రసిద్ధమయిన కోఁతిస్వభావమగు నాచాంచల్యమునే యిప్పుడు నేను కోపంబుచే లంకను దహించి యంకఱకుం జూప్పినవాఁడనైతిని. ౧౬

నేను రక్షింప సమర్థుండనైనను ఇప్పుడు కోపమువలన సీతాదేవినిరక్షింపనైతిని గావున నలిస్వతంత్రమును జపలమునగు రాజసస్వభావము ఉపేక్షింపఁబడుఁగాక. ౧౭

సీతాదేవి నాశమునొందుట తెలిసినంతనే యారామలక్ష్మణు లిద్దఱును నాశమునొందఁగలరు. అంత వారలిద్దఱును నశించినపిమ్మట సుగ్రీవుండు సమస్తబంధువులతోడ నాశమునొందును. ౧౮

ఈమాటను విన్నంతనే భ్రాతృవత్సలుండును ధర్మాత్ముండు నగు భరతుండును శత్రుఘ్నుండును నశింపఁగలరు. ౧౯

ఇట్లు పరమధార్మికంబగు నిక్ష్వాకువంశంబంతయుం నశింపఁగానే జనులందఱు దుఃఖంబుచేతను సంతాపముచేతనుం బీడితులు కాఁగలరు. ౨౦

అట్లగుటంజేసి నేను నిర్భాగ్యుండను. ధర్మార్థంబులు రెండునులేనివాఁడను. పాపస్వభావము గలవాఁడను. లోకంబుల కన్నిటికి వినాశము దెచ్చువాఁడను. ఇది స్పష్టము. అని హనుమంతుండు చింతించెను. ౨౧

ఇతి చిన్తయతస్తస్య నిమిత్తాన్యుపపేదిరే,
పూర్వమప్యుపలబ్ధాని సాక్షాత్పునరచిన్తయత్. ౨౨

అథవా చారుసర్వాఙ్గీ రక్షితా స్వేన తేజసా,
న నశిష్యతి కల్యాణీ నాగ్నిరగ్నౌ ప్రవర్తతే. ౨3

నహి ధర్మాత్మనస్తస్య భార్యామమితతేజసః,
స్వచారిత్రాభిగుప్తాం తాం స్ప్రష్టుమర్హతి పావకః. ౨౪

నూనం రామప్రభావేన వైదేహ్యాస్సుకృతేన చ,
యన్మాం దహనకర్మాయం నాదహద్ధవ్యవాహనః. ౨౫

త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతా చ యా,
రామస్య చ మనః కాన్తా సా కథం వినశిష్యతి. ౨౬
యద్వా దహనకర్మాయం సర్వత్ర ప్రభురవ్యయః,
న మే దహతి లాఙ్గూలం కథమార్యాం ప్రధక్ష్యతి. ౨౭

పునశ్చాచిన్తయత్తత్ర హనూమాన్విస్మితస్తదా,
హిరణ్యనాభస్య గిరేర్జలమధ్యే ప్రదర్శనమ్. ౨౮
తపసా సత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి,
అపి సా నిర్దహేదగ్నిం న తామగ్నిః ప్రధక్ష్యతి. ౨౯

స తథా చిన్తయంస్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహం,
శుశ్రావ హనుమాన్వాక్యం చారణానాం మహాత్మనామ్. 3౦

హనుమంతుం డట్లు చింతించుచుండ నిదివఱ కతనికిఁ గొంచెముగాఁ దోఁచియున్న శుభనిమిత్తములు చక్కఁగాఁ దెలియునట్లు మిక్కుటముగాఁ గలిగినవి. అంత నతండు మరల నిట్లని యాలోచించెను. ౨౨

అటుగాదేని మంగళరూపిణియగు నా సీతాదేవి యెంతమాత్రము నాశమునొందదు. తన తేజస్సుచేతనే రక్షింపఁబడియుండును. అగ్నిహోత్రము అగ్నిహోత్రము నెట్లు దహించును? ౨౩

ధర్మాత్ముండును గొలందిలేని తేజంబుగలవాఁడు నగు రామునిభార్యయుఁ దనపాతివ్రత్యమహిమచే రక్షింపఁబడినదియు నగు సీతాదేవిని అగ్నిహోత్రుండు స్పృశింపనైనం జాలఁడు. ౨౪

దహించుటయె స్వభావముగాఁగల యీ యగ్నిహోత్రుండు నన్ను దహింపకుండుటయు రాముని ప్రభావంబునను, సీతాదేవి పుణ్యమహిమంబునను అయినదిగాని వేఱుగాదు. ౨౫

భరత లక్ష్మణ శత్రుఘ్నులకు ముగ్వురికిని దేవతయు రామునకు మనఃప్రియయు నగుసీతాదేవియు నెట్లు నశించును? ౨౬

అటుగాదేని దహనస్వభావుండును ఎచ్చటను అడ్డములేనివాఁడును నాశరహితుండు నగు నీయగ్నిహోత్రుండు నాతోఁకనే దహింపలేదే. ఇంకఁ బూజ్యురాలగు సీతాదేవి నెట్లు దహించును! అని హనుమంతుండు చింతించెను. ౨౭

అంత నచ్చట హనుమంతుండు మరలఁ బరమాశ్చర్యంబునొంది సముద్రమధ్యంబునఁ దనకు మైనాకపర్వతం బగపడుటం దలంచెను. ౨౮

సీతాదేవి తన తపఃప్రభావంబునను సత్యబలంబునను పాతివ్రత్యమహిమంబునను అగ్నిహోత్రమునుంగూడ దహించును. అగ్నిహోత్రుం డాబిడ నెంతమాత్రము దహింపఁజాలఁడు అని హనుమంతుండు చింతించెను. ౨౯

ఆహనుమంతుండు అట్లు సీతాదేవి ధర్మప్రభావమునుగుఱించి చింతించుచు మహాత్ములగు చారణులు చెప్పుకొనుమాటలను వినెను. ౩౦

అహో ఖలు కృతం కర్మ దుష్కరం హి హనూమతా,
అగ్నిం విసృజతాఽభీక్ష్ణం భీమం రాక్షసవేశ్మని. ౩౧

ప్రపలాయితరక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా,
జనకోలాహలాధ్మాతా క్రన్దన్తీ వాద్రికన్దరే. ౩౨

దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా,
జానకీ న చ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః. ౩౩
[ఇతి శుశ్రావ హనుమాన్ వాచం తామమృతోపమాం,
బభూవ చాస్య మనసో హర్షస్తత్కాలసంభవః.]

స నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ హనుమానభవత్ప్రీతమానసః. ౩౪

తతః కపిః ప్రాప్తమనోరథార్థ
స్తామక్షతాం రాజసుతాం విదిత్వా,
ప్రత్యక్షతస్తాం పునరేవ దృష్ట్వా
ప్రతిప్రయాణాయ మతిం చకార. ౩౫

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చపఞ్చాశస్సర్గః.

---

## షట్పఞ్చాశస్సర్గః

తతస్తు శింశుపామూలే జానకీం పర్యుపస్థితాం,
అభివాద్యాబ్రవీద్దిష్ట్యా పశ్యామి త్వామిహాక్షతామ్. ౧

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునఃపునః,
భర్తృస్నేహాన్వితం వాక్యం హనుమన్తమభాషత. ౨

హనుమంతుండు రాక్షసుల యిండ్లయందు భయంకరాకారంబగు నగ్ని హోత్రంబు దరికొల్పి మఱియెవ్వరికిని జేయనలవిగాని కార్యముం జేసినాఁడు. ఆశ్చర్యము ! ౩౧

రాక్షసులును స్త్రీలును బాలురును వృద్ధులును భయంబునం బరుగెత్తు చుండ జనుల కోలాహలధ్వనులం బర్వతగుహలు పూరితంబులయి యుండుటం జేసి యాలంకయంతయు నేడ్చుచున్నట్లున్నది. ౩౨

ఈపట్టణంబంతయుఁ గోటబురుజులతోను ప్రాకారంబులతోను బహిర్ద్వారంబులతోను దహింపఁబడినది. సీతమాత్రము దహింపఁబడలేదు. ఇట్టి యాశ్చర్యమును మే మిదివఱకెప్పుడును జూడలేదు. అని చారణులు చెప్పుకొనిరి. [ఆంజనేయుఁ డమృతమునంబోలు వారిపలుకు విని యావేళకుఁ దగినట్లు పరమామోదముం జెందెను.] ౩౩

ఆహనుమంతుండు ఇదివఱకుఁ జెన్కుమార్లు సఫలములయిన శుభనిమిత్తములచేతను రామప్రభావాదులగు గొప్పకారణంబులచేతను జారణులు చెప్పుకొనుమాటలచేతను సీతకు నాశము గలుగలేదని నమ్మి సంతోషించెను. ౩౪

అంత హనుమంతుండు ఈడేఱినకోర్కులు గలవాఁడై రాచకుమార్తె యగు సీతాదేవి నాశము నొందకున్నదని తెలిసికొని మరల నాసీతం బ్రత్యక్షంబుగాఁ జూచి రామునొద్దకుఁ బోఁగోరెను. ౩౫

ఇది ఏఁబదియైదవ సర్గము.

## ఏఁబదియాఱవ సర్గము

అంత హనుమంతుండు శింశుపావృక్షమూలంబునున్న సీతాదేవి యొద్దకుఁ బోయి యాబిడకు నమస్కరించి "నాభాగ్యవశంబున నిప్పుడు ఏ యపాయంబును బొందక క్షేమంబుగా నున్న నిన్నుం జూచుచున్నాను." అని చెప్పెను. ౧

అంత నాసీతాదేవి పయనమయివచ్చిన హనుమంతుని మాటిమాటికిం జూచుచుఁ బెనిమిటియందలిస్నేహంబున మరల నతనితో నొకమాటం జెప్పెను.

[యది త్వం మన్యసే తాత వస్తైకాహమిహానఘ,
క్వచిత్సుసంవృతే దేశే విశ్రాన్త శ్శ్వోగమిష్యసి.
మమ చైవాల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్తవ వానర,
శోకస్యాస్యాప్రమేయస్య ముహూర్తం స్యాదపి క్షయః.
గతే హి హరిశార్దూల పునస్సంప్రాప్తయే త్వయి,
ప్రాణేష్వపి న విశ్వాసో మమ వానరపుంగవ.
అదర్శనం చ తే వీర భూయో మాం దారయిష్యతి,
దుఃఖాద్దుఃఖతరం ప్రాప్తాం దుర్మనశ్శోకకర్శితామ్.
అయం చ వీర సందేహ స్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాత్సు సహాయేషు హర్యృక్షేషు మహాబలః.
కథం ను ఖలు దుష్పారం సంతరిష్యన్తి సాగరం,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ,
త్రయాణామేవ భూతానాం సాగరస్యాతిలఙ్ఘనే,
శక్తిస్స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా.
తదత్ర కార్యనిర్బన్ధే సముత్పన్నే దురాసదే,
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిశారదః]
కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే బలోదయః. 3

శరైస్తు సఙ్కులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్స్థ స్తత్తస్య సదృశం భవేత్. ४

తద్యథా తస్య విక్రాన్తమనురూపం మహాత్మనః,
భవత్యాహవశూరస్య తథా త్వముపపాదయ. ౫

[నాయనా ఆంజనేయా! నీకిష్టమేని యుండెందేని గుప్తదేశమున నేఁడుండి రేపు పోయెదవుగాక. నీ వింకను కొంచెమునే పుండువేని నాకును కొంచెము దుఃఖము శాంతించును. నీవు పోవుచున్నావు గదా? మరల నీవు వచ్చుదాఁక బ్రతికియుందునో లేనో ఇంత యుపకారముజేసిన నిన్ను మరల చూడఁగల్గుదునో లేనో యని నాకుఁ జాల వ్యసనముగా నున్నది. ఇదిగాక మఱియొకమాట. అబ్బాయీ! ఎంతబలములున్నను ఈ క్రోఁతులుగానీ ఈ యెలుఁగుబంట్లుగానీ మన రామలక్ష్మణులుగానీ యీసముద్రము నెట్లు దాఁటఁ గలరు? చెప్పు, సముద్రము దాఁటుటకు నీవుగానీ మీయయ్య (వాయువు) గానీ గరుత్మంతుఁడుగానీ సమర్థులేగాక యితరు లెట్లు దాఁటెదరోయి బిడ్డా? హనుమంతుఁడా! యిందుల కేమి సమాధానము చెప్పెదవు? ఓగుబాగు తెలిసినవాఁడవు గదా యని యడిగినాను.]

శత్రువీరులం జంపునట్టి హనుమంతుండా! ఈరాక్షసుల నందఱను జయించి నన్ను రామునొద్దం జేర్చుటకు నీ వొక్కండవె చాలుదువు. నీబలము మిక్కిలి యధికమైనది. ౩

శత్రుసైన్యంబులఁ జంపునట్టి రాముండే యిచ్చటికి వచ్చి బాణంబుల నీ లంకనంతయుం నిండించి నన్ను గొనిపోవునేని యదియ యతనికిం దగి యుండును. ౪

అందువలన మహాత్ముండును యుద్ధంబునందు భయములేనివాఁడును నగు నారాముఁడు తనకుఁ దగులాగునఁ బరాక్రమించునట్లు నీవే ఘటింపవలెను అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పెను. ౫

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితం,
నిశమ్య హనుమాం స్తస్యా వాక్యముత్తరమబ్రవీత్.
[దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాం వరః,
సుగ్రీవస్సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః.
సవానరసహస్రాణాం కోటీభిరభిసంవృతః,
క్షిప్రమేష్యతి వైదేహి సుగ్రీవః ప్లవగాధిపః.
తౌ చ వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ,
ఆగమ్య నగరీం లఙ్కాం సాయకైర్విధమిష్యతః.
సగణం రాక్షసం హత్వా న చిరాద్రఘునన్దనః,
త్వామాదాయ వరారోహే స్వాం పురీం ప్రతియాస్యతి.
సమాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ,
క్షిప్రం ద్రక్ష్యసి రామేణ నిహతం రావణం రణే.
నిహతే రాక్షసేన్ద్రే చ సపుత్రామాత్యబాన్ధవే,
త్వం సమేష్యసి రామేణ శశాఙ్కేనేవ రోహిణీ]
క్షిప్రమేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరైర్వృతః,
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి. ౭

ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్మారుతాత్మజః,
గమనాయ మతిం కృత్వా వైదేహీమభ్యవాదయత్. ౮
[రాక్షసాన్ ప్రవరాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః,
సమాశ్వాస్య చ వైదేహీం దర్శయిత్వా పరం బలం,
నగరీమాకులాం కృత్వా వంచయిత్వా చ రావణం,
దర్శయిత్వా బలం ఘోరం వైదేహీమభివాద్య చ.
ప్రతిగన్తుం మనశ్చక్రే పునర్మధ్యేనసాగరమ్.]
తతస్స కపిశార్దూలస్స్వామిసన్దర్శనోత్సుకః,

హనుమంతుండు అధికార్థంబు గలదియుం వినయసహితంబును యుక్త కారణంబులతోఁ గూడినదియునగు సీతాదేవి మాటను విని యందుల కుత్తర మిట్లని చెప్పెను. ౬

[అమ్మా జానకీ! మహాసత్త్వుఁడును కోఁతులు ఎలుఁగులు వీని మహా సైన్యములకు నాథుఁడు నగుసుగ్రీవుం డెట్లైనను నిన్ను రామునితోఁ జేర్చుటకు పట్టుపట్టినాఁడు. ఎంతోకాలము గడవదు. వేగముగానే సుగ్రీవుఁడు మహావానరసేనతో వచ్చును. రామలక్ష్మణులును వేగమే వచ్చి లంకను బాణములలో ముంచి తేల్చెదరు. వీరపత్నీ! తూర్ణముగానే లంక పొంకమణఁచి రాక్షసులఁ జంపి రాముఁడు నిన్ను తనయూరికిఁ దీసికొనిపోఁగలడు. నీకు మేలు రానున్నది. తల్లీ! కొంతకాల మోర్చుకొనుము. రావణుఁడు జచ్చుట కెన్నోరోజులు లేవు. సపుత్రమిత్రబాంధవముగా వాఁడు జచ్చినవెంటనే చంద్రునితో రోహిణి కలసికొన్నట్లు నీవు రామునితోఁ గలసికొందువు.]

ఎవ్వఁడు యుద్ధంబున శత్రువులను జయించి నీదుఃఖంబు దీర్చునో అట్టిరాముఁడు వానరోత్తములను ఎలుఁగుగొడ్డులనుం గూడి శీఘ్రముగా రాఁగలండు. అని హనుమంతుఁడు సీతతోఁ జెప్పెను. ౭

వాయుదేవుని కుమారుఁడగు హనుమంతుఁడు ఇట్లు సీతాదేవి నాశ్వాసించి యంత రామునొద్దకుఁ బోఁగోరి సీతాదేవికి నమస్కారంబుఁజేసెను. ౮

[ఇట్లెల్లరాక్షసులం జంపి తనపేరు వాడి సీతనూఱడించి మగఁటిమి నెఱపి లంకను నేలకుఁ గోలకుఁ దెచ్చి, రావణు నవమానించి భీమబలముఁ జూపి సీతకు మ్రొక్కి యాతఁడు సముద్రము దాఁటి తనకొలువునకుఁ బోవ నుద్యమించెను.] అంత శత్రువులం జంపువాఁడును వానరశ్రేష్ఠుండునగు హనుమంతుఁడు తనస్వామిని రాముం జూడఁగోరినవాఁడై యరిష్టంబను పర్వతము నారోహించెను. ౯

ఆరురోహ గిరిశ్రేష్ఠమరిష్టమరిమర్దనః. ౯
తుఙ్గపద్మకజుష్టాభిర్నీలాభిర్వనరాజిభిః,
సోత్తరీయమివామ్భోదైశ్శృఙ్గాన్తరవిలమ్బిభిః. ౧౦
బోధ్యమానమివ ప్రీత్యా దివాకరకరైశ్శుభైః,
ఉన్మిషన్తమివోద్ధూతైర్లోచనైరివ ధాతుభిః. ౧౧
తోయౌఘనిస్స్వనైర్మన్ద్రైః ప్రాధీతమివ పర్వతం,
ప్రగీతమివ విస్పష్టైర్నానాప్రస్రవణస్వనైః. ౧౨
దేవదారుభిరత్యుచ్చైరూర్ధ్వబాహుమివ స్థితం,
ప్రపాతజలనిర్ఘోషైః ప్రాక్రుష్టమివ సర్వతః. ౧౩
వేపమానమివ శ్యామైః కమ్పమానైశ్శరద్వనైః,
వేణుభిర్మారుతోద్ధూతైః కూజన్తమివ కీచకైః. ౧౪
నిశ్శ్వసన్తమివామర్షాద్ఘోరైరాశీవిషోత్తమైః,
నీహారకృతగమ్భీరైర్ధ్యాయన్తమివ గహ్వరైః. ౧౫
మేఘపాదనిభైః పాదైః ప్రక్రాన్తమివ సర్వతః,
జృమ్భమాణమివాఽకాశే శిఖరైరభ్రమాలిభిః. ౧౬
కూటైశ్చ బహుధాకీర్ణైశ్శోభితం బహుకన్దరైః,
సాలతాలాశ్వకర్ణైశ్చ వంశైశ్చ బహుభిర్వృతమ్. ౧౭
లతావితానైర్వితతైః పుష్పవద్భిరలఙ్కృతం,
నానామృగగణాకీర్ణం ధాతునిష్యన్దభూషితమ్. ౧౮
బహుప్రస్రవణోపేతం శిలాసఞ్చయసఙ్కటం,
మహర్షి యక్షగన్ధర్వకిన్నరోరగసేవితమ్. ౧౯
లతాపాదపసఙ్ఘాతం సింహాధ్యుషితకన్దరం,
వ్యాఘ్రసఙ్ఘసమాకీర్ణం స్వాదుమూలఫలద్రుమమ్. ౨౦

ఉన్నతంబులగు పద్మకవృక్షంబులతోఁ గూడిన వనపంక్తులచే వస్త్రము గట్టుకొన్నట్లు శిఖరంబునడుమ వ్రేలుకాడు మేఘంబులచే నుత్తరీయంబులు దాల్చినట్లు చూపట్టుదాని ఉద్గతంబులగు ధాతువులు నేత్రంబులుంబోలెఁ గ్రాలుచుండుటంజేసి సూర్యుఁడు హస్తంబులచేతంబోలెఁ గిరణంబులచేత మేలుకొలుపఁ గండ్లుదెఱచి చూచుచున్న పోల్కిఁ గానవచ్చుదాని గంభీరంబులగు జలప్రవాహధ్వానంబులచే నధ్యయనంబుసేయుపగిదిం దోఁచుదాని విస్పష్టములగు సెలయేఱుల ధ్వనులవలన సంగీతంబుగావించుకరణిం గన్పట్టుదాని నత్యున్నతంబులగు దేవదారువృక్షంబు లుండుటచే నూర్ధ్వబాహుండై తపము సల్పు మహామునిభంగి భాసిల్లుదానిఁ బ్రపాతంబులంబడు జలంబులధ్వనులచే నంతటను ఆక్రోశించుచున్నట్లున్నదాని శరదృతువునందు జనియించు వనములు గాలికిం దూలుచుండుటచే హనుమంతునివలన భయంబున గడగడ వడంకువడువునం గనుపట్టుదాని వాయువుచేఁ గొట్టఁబడిన కీచకంబులను వెదుళ్లు ధ్వనించుటచేఁ గూయుచున్నట్లున్నదాని భయంకరంబులగు సర్పంబులు నిట్టూర్పులు విడుచుచుండుటంజేసి హనుమంతునిపైఁ గోపంబున నిట్టూర్పులు విడుచుచున్న విధంబునం జూపట్టుదాని గంభీరములగు గుహాలన్నియుం మంచుచేఁ గప్పఁబడి యుండుటంజేసి సమస్తేంద్రియంబుల నిరోధించి ధ్యానంబు సేయు భాతిం గానవచ్చుదాని మేఘములకుఁ బాదము లనందగు ప్రత్యంతపర్వతములచే నడచుచున్నట్లగపడుదాని నాకాశమునం దత్యున్నతంబులై మేఘసంఘంబులతోఁగూడిన శిఖరములతో నొప్పియుండుటవలన నావులింతలువిడుచుచున్నట్లు దర్శనీయంబగుదాని హనుమంతుని పాదాహతిం బరిపరివిధముల నాకీర్ణములయిన పెక్కుగుహాలుగల శిఖరంబులతోఁ గూడినదియు సాలవృక్షముతోను అశ్వకర్ణతరువులతోను వెదుళ్లతోనుం గూడినదియును బుష్పవంతములగు లతాసమూహముల రమణీయం బయినదియుం నానావిధమృగంబులు గలదియుం నచ్ఛటచ్ఛటం గాఱుచుండు ధాతువులచే నలంకృతం బయినదియుఁ బెక్కు సెలయేళ్లు గలదియుం నధికముగా ఱాళ్లుండుటచే సంకటస్థలంబైనదియు మహర్షులచేతను యక్షులచేతను గంధర్వులచేతను గిన్నరులచేతను సర్పంబులచేతను సేవింపఁబడినదియు వృక్షలతాసమూహసమేతంబులును సింహాధిష్ఠితంబు లగు

తమారురోహ హనుమాన్ పర్వతం పవనాత్మజః,
రామదర్శనశీఘ్రేణ ప్రహర్షేణాభిచోదితః. ౨౧

తేన పాదతలాక్రాన్తా రమ్యేషు గిరిసానుషు,
సఘోషాస్సమశీర్యన్త శిలాశ్చూర్ణీకృతాస్తతః. ౨౨
స తమారుహ్య శైలేన్ద్రం వ్యవర్ధత మహాకపిః,
దక్షిణాదుత్తరం పారం ప్రార్థయన్ లవణామ్భసః. ౨౩
అధిరుహ్య తతో వీరః పర్వతం పవనాత్మజః,
దదర్శ సాగరం భీమం మీనోరగనిషేవితమ్. ౨౪

స మారుత ఇవాఽఽకాశం మారుతస్యాఽఽత్మసమ్భవః,
ప్రపేదే హరిశార్దూలో దక్షిణాదుత్తరాం దిశమ్. ౨౫

స తదా పీడితస్తేన కపినా పర్వతోత్తమః,
రరాస సహ తైర్భూతైః ప్రవిశన్వసుధాతలమ్. ౨౬

కమ్పమానైశ్చ శిఖరైః పతద్భిరపి చ ద్రుమైః,
తస్యోరువేగోన్మథితాః పాదపాః పుష్పశాలినః. ౨౭
నిపేతుర్భూతలే రుగ్ణాశ్శక్రాయుధహతా ఇవ,
కన్దరాన్తరసంస్థానాం పీడితానాం మహౌజసామ్. ౨౮

సింహానాం నినదో భీమో నభో భిన్దన్ స శుశ్రువే,
త్రస్తవ్యావృత్తవసనా వ్యాకులీకృతభూషణాః. ౨౯
విద్యాధర్యస్సముత్పేతుః సహసా ధరణీధరాత్,

గుహాలుగలదియుఁ వ్యాఘ్రసమూహంబులతోఁ గూడినదియుఁ రుచ్యమూలఫలంబులతోఁగూడిన వృక్షంబులు గలదియునగు నరిష్టపర్వతమును వాయుదేవుని కుమారుండగు హనుమంతుండు రామదర్శనోత్సుక్యంబు మనంబునం బెనంగొన నారోహించెను. ౧౦-౨౧

అంత నాహనుమంతుండు పాదంబులం ద్రొక్కఁగానే రమ్యంబులగు కొండ నెత్తంబులందలిఱాళ్లు మహాధ్వనిగుదురఁ జూర్ణమయి రాలినవి. ౨౨

ఆహనుమంతుఁ డాయరిష్టపర్వతంబు నారోహించినపిదప సముద్రుని యుత్తరపుగట్టు జేరం గోరి మేను బెంచెను. ౨౩

పరాక్రమవంతుండును వాయుదేవుని కుమారుండు నగుహనుమంతుండు ఆయరిష్టపర్వతము నారోహించినంతనే మీనసర్పంబులచేత సేవింపఁబడినదై భయంకరంబై పొలుచు సముద్రముం జూచెను. ౨౪

వాయుదేవునిపుత్త్రుండును వానరశ్రేష్ఠుండు నగు నాహనుమంతుండు సముద్రముదక్షిణపుగట్టుననుండి యుత్తరపుగట్టును జేరుటకై వాయుదేవుండుం బోలె నాకాశంబున కెగిరెను. ౨౫

అప్పుడు పర్వతశ్రేష్ఠం బగునాయరిష్టపర్వతము హనుమంతునిచేఁ బీడింపఁబడి మహాధ్వనిగదుర నందున్నసమస్తజంతువులతోను పడంకుచున్న శిఖరంబులతోను విఱిగియున్న వృక్షంబులతోనుంగూడ నేలకు సమముగాఁ గూలినది. ౨౬

ఆహనుమంతునియూరువేగంబునఁ బుష్పవంతములగు వృక్షంబులు వజ్రాయుధంబు వ్రేటునంబోలె విఱిగి నేలంబడినవి. ౨౭

ఆపర్వతగుహాలలో నున్న మహాపరాక్రమంబుగల సింహములు హనుమంతుండు పర్వతముపైఁ బాదముంచుటచేఁ బీడింపఁబడి యాకాశము విఱిగి పడునో యనునట్లు భయంకరముగా నఱచెను. ౨౮

అప్పుడు విద్యాధరస్త్రీలు భయమున వస్త్రములు జాఱి భూషణములు యథాస్థానంబులు దప్పి వ్యాకులంబులయి వ్రేలుకాడఁ దటాలున నాయరిష్టపర్వతంబు విడిచి యాకాశంబున కుద్గమించిరి. ౨౯

అతిప్రమాణా బలినో దీప్తజిహ్వా మహావిషాః. ౩౦
నిపీడితశిరోగ్రీవా వ్యచేష్టన్త మహాహయః,

కిన్నరోరగగన్ధర్వయక్షవిద్యాధరా స్తదా. ౩౧
పీడితం తం నగవరం త్యక్త్వా గగనమాస్థితాః,

స చ భూమిధరశ్శ్రీమాన్బలినా తేన పీడితః. ౩౨
స వృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలం,

దశయోజనవిస్తారస్త్రింశద్యోజనముచ్ఛ్రితః. ౩౩
ధరణ్యాం సమతాం యాతః స బభూవ ధరాధరః,
స లిలఙ్ఘయిషుర్భీమం సలీలం లవణార్ణవమ్. ౩౪
కల్లోలాస్ఫాలవేలాన్తముత్పపాత నభో హరిః,

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షట్పఞ్చాశస్సర్గః.

## సప్తపఞ్చాశస్సర్గః

[ఆప్లుత్య చ మహావేగః పక్షవానివ పర్వతః]
స చన్ద్రకుముదం రమ్యం సార్కకారణ్డవం శుభం,
తిష్యశ్రవణకాదమ్బమభ్రశైవాలశాద్వలమ్. ౧
పునర్వసుమహామీనం లోహితాఙ్గమహాగ్రహం,
ఐరావతమహాద్వీపం స్వాతీహంసవిలోలితమ్. ౨
వాతసఙ్ఘాతజాతోర్మి చన్ద్రాంశుశిశిరామ్బుమత్,
భుజఙ్గయక్షగన్ధర్వప్రబుద్ధకమలోత్పలమ్. ౩
హనుమాన్మారుతగతిర్మహానౌరివ సాగరం,
అపారమపరిశ్రాన్తః పుప్లువే గగనార్ణవమ్. ౪

మహాకాయంబులును బలవంతంబులును మండుచున్న నాలుకలు గల వియు మహావిషంబులు నగు మహాసర్పంబులు, తలలును మెడలును బీడింపఁ బడుటచే నాపర్వతంబుననుండి వెడలినవి. ३०

అప్పుడు కిన్నరులును సర్పంబులును గంధర్వులును యక్షులును విద్యాధరులును హనుమంతునిచేఁ బీడింపఁబడిన యారిష్టపర్వతముం బరిత్యజించి యాకాశంబు నొందిరి. ३१

శ్రీమంతంబును వృక్షములతోఁ గూడిన శిఖరంబులతో నొప్పుచున్న దియు నగునారిష్టపర్వతము బలవంతుండగు హనుమంతుండు పాదంబు లూఁదుటచే నేలకు సమంబయినది. ३२

బదియోజనంబుల వెడల్పును ముప్పదియోజనంబుల యౌన్నత్యంబునుం గల యారిష్టపర్వతము నేలకు సమముగాఁ గూలినది. ३३

ఆహనుమంతుండు తీరంబుల మహాతరంగంబులు గలిగి భయంకరంబై యొప్పుచున్న సముద్రమును దాఁటఁగోరినవాఁడై యాకాశంబున కెగిరెను.

ఇది యేఁబదియాఱవసర్గము.

---

## ఏఁబదియేడవ సర్గము

[అంత ఱెక్కలు గలకొండవలె మహావేగముతో నెగిరి] చంద్రుండు తెల్లకలువగా సూర్యుండు నీరుకోడిగాఁ బుష్యశ్రవణనక్షత్రంబులు కలహంస లుగా మేఘంబులు పాచియును, దీరంబునందలి పచ్చికభూములుగాఁ బున ర్వసునక్షత్రము మహామీనంబుగా నంగారకుండు పెద్దమొసలిగా నైరావతంబు మహాద్వీపంబుగా స్వాతీనక్షత్రంబు హంసపక్షిగా గాలిచే గలుగు నలలవంటి చంద్రకిరణములు చల్లనీళ్లుగా నయ్యైవర్ణములనొప్పు సర్పములును యక్షులును గంధర్వులును వికసించినపద్మోత్పలములుగా రెండవసముద్రము భంగి భాసిలు చున్న యాకాశమును వాయుంవేగుండగు హనుమంతుఁ డెంతమాత్ర మలసట లేక పెద్దయోడ సముద్రమునుంబోలె నొంచెను. ౧-४

గ్రసమాన ఇవాకాశం తారాధిపమివోల్లిఖన్,
హరన్నివ సనక్షత్రం గగనం సార్కమణ్డలమ్. ౫
మారుతస్యాత్మజశ్శ్రీమాన్కపిర్వ్యోమచరో మహాన్,
[అపారమపరిశ్రాన్తశ్చామ్బుధిం సమగాహత]
హనుమాన్మేఘజాలాని వికర్షన్నివ గచ్ఛతి. ౬
పాణ్డురారుణవర్ణాని నీలమాఞ్జిష్ఠకాని చ,
హరితారుణవర్ణాని మహాభ్రాణి చకాశిరే. ౭

ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునఃపునః,
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చన్ద్రమా ఇవ లక్ష్యతే. ౮

వివిధాభ్రఘనాపన్నగోచరో ధవళామ్బరః,
దృశ్యాదృశ్యతనుర్వీరస్తదా చన్ద్రాయతేఽమ్బరే. ౯

తార్క్ష్యాయమాణో గగనే బభాసే వాయునన్దనః,
దారయన్మేఘబృన్దాని నిష్పతంశ్చ పునఃపునః. ౧౦
నదన్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః,

ప్రవరాన్రాక్షసాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః. ౧౧
ఆకులాం నగరీం కృత్వా వ్యథయిత్వా చ రావణం,
అర్దయిత్వా బలం ఘోరం వైదేహీమభివాద్య చ. ౧౨

ఆజగామ మహాతేజాః పునర్మధ్యేన సాగరం,
పర్వతేన్ద్రం సునాభం చ సముపస్పృశ్య వీర్యవాన్. ౧౩
జ్యాముక్త ఇవ నారాచో మహావేగోఽభ్యుపాగతః,

వాయుదేవుని కుమారుఁడును శ్రీమంతుఁడు నగుహనుమంతుఁడు ఆకాశమును మ్రింగువాఁడువోలె చంద్రు నొరయువాఁడువలె నక్షత్రములతోను సూర్యమండలముతోను ఆకాశమునంతయుం హరించువానిభంగి [పారములేని సముద్రముమీఁదుగా] నలయికలేక పాఱుచు మేఘసమూహముల నాకర్షించుచు వాని కైవడిం జూపట్టుచు నాకాశమునం బోయెను. ౫,౬

మహామేఘములు హనుమంతునికాంతిసంపర్కమునం జేసి తెల్లనివిగాను ఎఱ్ఱనివిగాను నల్లనివిగాను బసుపువన్నెగలవిగాను బచ్చనివిగాను నలుపు గలిసిన యెఱుపువన్నెగలవిగాను బ్రకాశించినవి. ౭

ఆహనుమంతుఁడు మాటిమాటికి మేఘములం బ్రవేశించుచు మరల బయలువెడలుచు మేఘములచేఁ గప్పఁబడినవాఁడును, మరల విడివడినవాఁడు నగు చంద్రునిపోల్కిఁ గానవచ్చుచుండెను. ౮

అప్పుడు తెల్లనివస్త్రములు గట్టుకొనియున్న పరాక్రమశాలియగుహనుమంతుఁడు మేఘసమూహములం బోవుచుండుటం జేసి కొంతసేపు దృశ్యుండై కొంతదడ వదృశ్యుండై చంద్రుండువలె నుండెను. ౯

వాయుదేవుని కుమారుఁడగు హనుమంతుఁడు మాటిమాటికి మేఘసమూహముల దారిచేసికొని వానిం బ్రవేశించుచు బయలువెడలుచు మేఘగర్జనములవంటి సింహనాదములు సేయుచు గరుత్మంతుఁడుంబోలెఁ బ్రకాశించెను. ౧౦

మహాపరాక్రమశాలి యగు హనుమంతుఁడు ఉత్తములగు రాక్షసులం జంపి తనపేరుం బ్రచురపఱిచి పట్టణమునంతయుం నల్లకల్లోలము గావించి రావణునకుఁ బెద్దదుఃఖము గలుగఁజేసి భయంకరంబగు సైన్యముం జంపి సీతాదేవికి నమస్కారము సల్పి మరల సముద్రము దాఁట నారంభించెను. ౧౧,౧౨

పరాక్రమవంతుండగు హనుమంతుండు పర్వతశ్రేష్ఠంబగు మైనాకమును వీడ్కొని యల్లెత్రాటివలన విడువఁబడిన బాణముపగిది నతివేగమునం బోయెను. ౧౩

స కించిదనుసంప్రాప్తః సమాలోక్య మహాగిరిమ్. ౧౪
మహేన్ద్రం మేఘసఙ్కాశం ననాద హరిపుఙ్గవః,

స పూరయామాస కపిర్దిశో దశ సమన్తతః. ౧౫
నదన్నాదేన మహతా మేఘస్వనమహాస్వనః,
స తం దేశమనుప్రాప్తః సుహృద్దర్శనలాలసః. ౧౬
ననాద హరిశార్దూలో లాంగూలం చాప్యకమ్పయత్,

తస్య నానద్యమానస్య సుపర్ణచరితే పథి. ౧౭
ఫలతీవాస్య ఘోషేణ గగనం సార్కమణ్డలం,

యే తు తత్రోత్తరే తీరే సముద్రస్య మహాబలాః. ౧౮
పూర్వం సంవిష్ఠితాశ్శూరా వాయుపుత్రదిదృక్షవః,
మహతో వాతనున్నస్య తోయదస్యేవ గర్జితమ్. ౧౯
శుశ్రువుస్తే తదా ఘోషమూరువేగం హనూమతః,

తే దీనమనసస్సర్వే శుశ్రువుః కాననౌకసః. ౨౦
వానరేన్ద్రస్య నిర్ఘోషం పర్జన్యనినదోపమం,
నిశమ్య నదతో నాదం వానరాస్తే సమన్తతః. ౨౧
బభూవురుత్సుకాస్సర్వే సుహృద్దర్శనకాఙ్క్షిణః,

జామ్బవాన్ స హరిశ్రేష్ఠః ప్రీతిసంహృష్టమానసః. ౨౨

ఉపామన్త్ర్య హరీన్ సర్వానిదం వచనమబ్రవీత్,
సర్వథా కృతకార్యోఽసౌ హనుమాన్నాత్ర సంశయః. ౨౩

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు కొంచెము సమీపమునొంది మేఘసమానమగు మహేంద్రపర్వతముఁజూచి సంతోషమున సింహనాదము గావించెను. ౧౪

మేఘగర్జనమువంటి మహాధ్వనిగలహనుమంతుఁడు అట్లు సింహనాదము గావించి మహాధ్వనిచే దిక్కు లన్నియు నిండునట్లు చేసెను. ౧౫

అంత వానరోత్తముఁడగు హనుమంతుఁడు అంగదాదివానరు లున్నస్థలమునకు సమీపంబయిన ప్రదేశమునొంది సుహృద్దర్శనోత్సుకుండై వాలము నాడించుచు సింహనాదము గావించెను. ౧౬

గరుత్మంతుని సంచారస్థానంబగు నాకాశమార్గమునం బ్రచండసింహనాదములు సేయుచున్న యాహనుమంతునిధ్వనికి సూర్యమండలముతోఁగూడ నాకాశము పగులునట్లుండినది. ౧౭

అచ్చట సముద్రము నుత్తరతీరముననున్న బహుబలశాలులును యుద్ధమునందు భయములేనివారలును హనుమంతుఁ డెప్పుడువచ్చునో యని యెదురుచూచుచున్నవారలు నగు నాయంగదాదివానరులు వాయుప్రేరితం బగు మహామేఘము గర్జాధ్వనివలెనున్న హనుమంతుని సింహనాదమును ఊరువేగమును వినిరి. ౧౮,౧౯

ఏమి విందుమో యని దుఃఖము నొందియున్న ఆయంగదాది వానరులందఱును మేఘగర్జనమువంటి హనుమంతుని సింహనాదమును వినిరి. ౨౦

ఆయంగదాదివానరు లందఱును అట్లు సింహనాదములు సేయుచున్న హనుమంతుని కంఠము విని స్నేహితుండగు హనుమంతుం జూచుటయం దుత్సుకులయి యుండిరి. ౨౧

వానరశ్రేష్ఠుండగు నాజాంబవంతుం డప్పుడు పరమసంతోషమునొంది వానరుల నందఱిం బిలిచి యిట్లని చెప్పెను. ౨౨

ఈహనుమంతుం డన్నివిధములం గృతకృత్యుండై వచ్చుచున్నాఁడు. ఇందుకు సందియము లేదు. ఇతండు కృతకృత్యుండు కాఁడేని యితని కంఠధ్వని యింత గంభీరముగా నుండదు అని జాంబవంతుండు వానరులకుం జెప్పెను.

న హ్యస్యాకృతకార్యస్య నాద ఏవంవిధో భవేత్,
తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః. ౨౪

నిశమ్య హరయో హృష్టాః సముత్పేతు స్తత స్తతః,
తే నగాగ్రాన్నగాగ్రాణి శిఖరాచ్ఛిఖరాణి చ. ౨౫

ప్రహృష్టా స్సమపద్యన్త హనూమన్తం దిదృక్షవః,
తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖాస్సువిష్ఠితాః. ౨౬
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యన్త వానరాః,
గిరిగహ్వరసంలీనో యథా గర్జతి మారుతః. ౨౭
ఏవం జగర్జ బలవాన్ హనుమాన్మారుతాత్మజః,
తమభ్రఘనసఙ్కాశమాపతన్తం మహాకపిమ్. ౨౮
దృష్ట్వా తే వానరాస్సర్వే తస్థుః ప్రాఞ్జలయ స్తదా,
తత స్తు వేగవాం స్తస్య గిరేర్గిరినిభః కపిః. ౨౯
నిపపాత మహేన్ద్రస్య శిఖరే పాదపాకులే,
హర్షేణాపూర్యమాణోఽసౌ రమ్యే పర్వతనిర్ఝరే. 30
ఛిన్నపక్ష ఇవాఽఽకాశాత్పపాత ధరణీధరః,
తత స్తే ప్రీతమనసః సర్వే వానరపుఙ్గవాః. 3౧
హనుమన్తం మహాత్మానం పరివార్యోపతస్థిరే,
పరివార్య చ తే సర్వే పరాం ప్రీతిముపాగతాః. 3౨
ప్రహృష్టవదనాస్సర్వే తమరోగముపాగతం,
ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలాని చ. 33
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజం,
[వినేదుర్ముదితాః కేచిత్కేచిత్కిలికిలా స్తథా,

వానరులు మహాపరాక్రమశాలియగు నాహనుమంతుని బొబ్బారు వేగధ్వనిని సింహనాదమును విని సంతోషమునొంది యచ్చటచ్చట గంతులు వేయసాగిరి. ౨౪

ఆవానరులు పరమసంతోషమునొంది హనుమంతుని జూచుటకై చెట్టు మీఁదనుండి చెట్లమీఁదికిని, పర్వతశిఖరముననుండి పర్వతశిఖరములమీఁదికిని ఎక్కిరి. ౨౫

ఆవానరులు సంతోషమున వృక్షాగ్రములందుఁ గొమ్మలం బట్టుకొని కూర్చుండి దూరమున మిత్రులు వచ్చునప్పుడు జనులు వారలను శీఘ్రంబుగా రమ్మనుటకై తమవస్త్రముల నాడించినట్లు హనుమంతుని శీఘ్రముగా రమ్మని చిన్నకొమ్మల నాడించిరి. ౨౬

వాయువు పర్వతగుహయందుఁ జేరి గర్జించునట్లు వాయుదేవుని కుమారుండగు బలవంతుండయిన హనుమంతుండు గర్జించెను. ౨౭

ఆ వానరులందఱు నప్పుడు మేఘసమూహంబు బోలె వచ్చుచున్న యాహనుమంతుం జూచి చేమోడ్పులు గీలించి నిలిచియుండిరి. ౨౮

అంత వేగవంతుండును బర్వతాకారుండునగుహనుమంతుండు పెక్కు వృక్షముల నిండియున్న యామహేంద్రపర్వతశిఖరముపై వ్రాలెను. ౨౯

హనుమంతుండు సుహృద్దర్శనమునఁ బరమసంతోషంబునొంది రమ్యంబగు సెలయేటిగట్టున ఛిన్నపక్షం బగుపర్వతంబుకైవడి నాకాశమున నుండి వ్రాలెను. ౩౦

అంతనావానరోత్తములందఱు పరమసంతోషంబునొంది మహాత్ముండగు హనుమంతుం బరివేష్టించి యుండిరి. ౩౧

అట్లు పరివేష్టించియుం నాయంగదాది వానరులందఱును బరమసంతోషము నొందియుండిరి. ౩౨

ఆవానరులందఱు క్షేమముగవచ్చినవానరశ్రేష్ఠుండును వాయుపుత్రుండు నగుహనుమంతుంజూచి మిక్కిలి సంతోషమునొంది మూలములను ఫలములనుం దెచ్చి కానుకలు సమర్పించి యతనింబూజించిరి. [మఱియుఁ గొందఱు ఆనందముచే కిలికిలాశబ్ద మొనర్చిరి. కొందఱు చెట్లకొమ్మలను వంచియూఁగసాగిరి ]

హృష్టాః పాదపశాఖాశ్చ ఆనిన్యుర్వానరర్షభాః]
హనుమాంస్తు గురూన్వృద్ధాఞ్జామ్బవత్ప్రముఖాంస్తదా. ౩౪
కుమారమఙ్గదం చైవ సోఽవన్దత మహాకపిః,
స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః. ౩౫

దృష్టా సీతేతి విక్రాన్తస్సంక్షేపేణ న్యవేదయత్,
నిషసాద చ హస్తేన గృహీత్వా వాలినస్సుతమ్. ౩౬
రమణీయే వనోద్దేశే మహేన్ద్రస్య గిరేస్తదా,
హనుమానబ్రవీద్ధృష్టస్తదా తాన్వానరర్షభాన్. ౩౭
అశోకవనికాసంస్థా దృష్టా సా జనకాత్మజా,
రక్ష్యమాణా సుఘోరాభీ రాక్షసీభిరనిన్దితా. ౩౮
ఏకవేణీధరా బాలా రామదర్శనలాలసా,
ఉపవాసపరిశ్రాన్తా జటిలా మలినా కృశా. ౩౯

తతో దృష్టేతి వచనం మహార్థమమృతోపమం,
నిశమ్య మారుతేస్సర్వే ముదితా వానరాభవన్. ౪౦
క్ష్వేళన్త్యన్యే నదన్త్యన్యే గర్జన్త్యన్యే మహాబలాః,
చక్రుః కిలికిలామన్యే ప్రతిగర్జన్తి చాపరే. ౪౧
కేచిదుచ్ఛ్రితలాంగూలాః ప్రహృష్టాః కపికుఞ్జరాః,
అఞ్చితాయతదీర్ఘాణి లాంగూలాని ప్రవివ్యధుః. ౪౨
అపరే చ హనూమన్తం వానరా వారణోపమం,
ఆప్లుత్య గిరిశృఙ్గేభ్యః సంస్పృశన్తి స్మ హర్షితాః. ౪౩
ఉక్తవాక్యం హనూమన్త మఙ్గదస్తమథాబ్రవీత్,
సర్వేషాం హరివీరాణాం మధ్యే వచనముత్తమమ్. ౪౪

హనుమంతుఁడును జాంబవంతుఁడు మున్నగు గురువులకును వృద్ధులకును యువరాజగు నంగదునకును నమస్కారంబుఁ జేసెను. ౩౮

పరాక్రమశాలియుఁ బూజ్యుండు నగుహనుమంతుఁడు ఆజాంబవదంగదులచేఁ బూజింపఁబడినవాఁడై వానరులచేఁ బ్రసాదితుండై "చూచితిని సీతను" అని నిస్సంశయముగాఁ దేటపడ సంక్షేపమునం జెప్పెను. ౩౯

ఆహనుమంతుఁడు వాలిపుత్త్రుండగు అంగదుని కౌఁగిలించుకొని మహేంద్ర పర్వతమునందు సుందరంబగు నొక్కవన ప్రదేశంబునందుఁ గూర్చుండెను.

అప్పుడు హనుమంతుండు సంతోషంబునొంది వానరశ్రేష్ఠులగు నా యంగదాదులం జూచి యిట్లని చెప్పెను. ౩౭

అశోకవనమున భయంకరాకారలగు రాక్షసస్త్రీలచే రక్షింపఁబడినదై యనిందితయై జడగట్టినతలవెండ్రుకలుగలదై రామదర్శనలాలసయయి యుపవాసములం గృశించి జడలు ధరించి మలినాంగియయియున్న జనకాత్మజయగు సీతాదేవిం జూచితిని అని హనుమంతుండు అంగదాదివానరులకుం జెప్పెను.

అంత "సీతాదేవిం జూచితిని" అను నధికార్థంబగు నమృతంబువంటి హనుమంతునివచనము విన్నంతనే వానరులందఱు పరమసంతోషంబునొందిరి.

బలవంతులగు నావానరులు సంతోషమునఁ గొందఱు సింహనాదములు గావించిరి. కొందఱు పెద్దగా కేకలువైచిరి. కొందఱు వృషభములవలె గర్జించిరి.

కొందఱు వానరజాతికి సహజమయిన కిలికిలాధ్వనిం జేసిరి. మఱికొందఱు గర్జించువారలకు మాఱుపలికిరి. ౪౧

కొందఱు వానరోత్తములు సంతోషమున బలిసినవియు దీర్ఘములయు నవియు సుందరములునగు తమతోఁకలం బైకెత్తి నేలంగొట్టిరి. ౪౨

మఱికొందఱు వానరులు సంతోషమునఁ బర్వతశిఖరములనుండి దుమికి వినుంగువలెనున్న హనుమంతుని స్పృశించిరి. ౪౩

అంత నంగదుండు వానరవీరులందఱినడుమ సీతంజూచితి నని చెప్పి యూరకున్నహనుమంతుని జూచి యుత్తమంబగు నీమాటం జెప్పెను. ౪౪

సత్త్వే వీర్యే న తే కశ్చిత్సమో వానర విద్యతే,
యదవప్లుత్య విస్తీర్ణం సాగరం పునరాగతః. ౪౫
[జీవితస్య ప్రదాతా నస్త్వమేకో వానరోత్తమ,
త్వత్ప్రసాదాత్సమేష్యామస్సిద్ధార్థా రాఘవేణ హ.]
అహో స్వామిని తే భక్తిరహో వీర్యమహో ధృతిః,
దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ. ౪౬

దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్స్థశ్శోకం సీతావియోగజం,
తతోఽఙ్గదం హనూమన్తం జామ్బవన్తం చ వానరాః. ౪౭
పరివార్య ప్రముదితా భేజిరే విపులాశ్శిలాః,
[ఉపవిష్టా గిరేస్తస్య శిలాసు విపులాసు చ]
శ్రోతుకామాస్సముద్రస్య లఙ్ఘనం వానరోత్తమాః. ౪౮
దర్శనం చాపి లఙ్కాయాస్సీతాయా రావణస్య చ,
తస్థుః ప్రాఞ్జలయస్సర్వే హనుమద్వదనోన్ముఖాః. ౪౯

తస్థౌ తత్రాఙ్గదశ్శ్రీమాన్వానరైర్బహుభిర్వృతః,
ఉపాస్యమానో విబుధైర్దివి దేవపతిర్యథా. ౫౦

హనూమతా కీర్తిమతా యశస్వినా
తథాఙ్గదేనాఙ్గదబద్ధబాహునా,
ముదా తదాఽధ్యాసితమున్నతమ్మహా
న్మహీధరాగ్రం జ్వలితం శ్రియాఽభవత్. ౫౧

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తపఞ్చాశస్సర్గః.

హనుమంతుఁడా! శతయోజనములు విస్తీర్ణంబగు నీసముద్రము దాఁటి పోయి మరల దాఁటివచ్చినావు. కావున బలమునందుఁగానీ పరాక్రమము నందుఁ గానీ నీకు సరియగువాఁడెవ్వఁడును లేఁడు. [అయ్యా! మాయెల్లర ప్రాణములు నీయొక్కనిమూలమున నిలచినవి. నీపుణ్యమున కృతార్థులమై మనమందఱము రాముని గలిసికోఁగంటిమి.] ౪౫

నీకుండు రాజభక్తి మఱియెవ్వరికిని లేదు. నీపరాక్రమమును ధైర్యమును జూడ నాశ్చర్యము గలుగుచున్నది. మాభాగ్యవశమున నీవు పతివ్రత యగు రామునిభార్యను సీతాదేవిం జూచినావు. ౪౬

మాభాగ్యవశమున నింక రాముఁడు సీతావిరహదుఃఖములేక సుఖముగా నుండఁగలఁడు. అని యంగదుండు హనుమంతునితోఁ జెప్పెను. ౪౭

అంత వానరు లందఱుఁ బరమసంతుష్టులై యంగద హనుమ జ్జాంబవంతుల ముచ్చుట్టుం బరివేష్టించి విశాలములగు శిలలపైఁ గూర్చుండిరి.

ఆవానరశ్రేష్ఠులందఱు హనుమంతుండు సముద్రముదాఁటుటయు లంకానగరంబుఁ జూచుటయు సీతాదేవిని సందర్శించుటయు రావణుంగాంచుటయు నీవృత్తాంతములను వినం గోరినవారలై చేమోడ్చు గీలించి హనుమంతుని మొగము జూచుచు నుండిరి. ౪౮,౪౯

అచ్చట శ్రీమంతుండగు నంగదుండు లెక్కలేనివానరులచేఁబరివేష్టింపఁబడి స్వర్గమునందు దేవతలచే సేవింపఁబడుచున్న దేవేంద్రుండుంబోలెఁ బ్రకాశించుచుండెను. ౫౦

అప్పుడు మిక్కిలి యున్నతమును విశాలమునగు నామహేంద్రపర్వత శిఖరము మహాకీర్తిశాలి యగుహనుమంతునిచేతను గీర్తిమంతుండును బాహాపురులు ధరించినవాఁడు నగు నంగదునిచేతను అధిష్ఠింపఁబడియుండుటంజేసి మహాతేజమునం దేజరిల్లుచుండినది. ౫౧

ఇది యేఁబదియేడవ సర్గము.

## అష్టపఞ్చాశస్సర్గః

తత స్తస్య గిరేశ్శృఙ్గే మహేన్ద్రస్య మహాబలాః,
హనుమత్ప్రముఖాః ప్రీతిం హరయో జగ్మురుత్తమామ్. ౧
తం తతః ప్రీతిసంహృష్టః ప్రీతిమన్తం మహాకపిం,
జామ్బవాన్కార్యవృత్తాన్తమపృచ్ఛదనిలాత్మజమ్. ౨

కథం దృష్టా త్వయా దేవీ కథం వా తత్ర వర్తతే,
తస్యాం వా స కథం వృత్తః క్రూరకర్మా దశాననః. ౩

తత్త్వతస్సర్వమేతన్నః ప్రబ్రూహి త్వం మహాకపే,
[సంమార్గితా కథం దేవీ కించ సా ప్రత్యభాషత]
శ్రుతార్థాశ్చిన్తయిష్యామో భూయః కార్యవినిశ్చయమ్. ౪

యశ్చార్థస్తత్ర వక్తవ్యో గతైరస్మాభిరాత్మవాన్,
రక్షితవ్యం చ యత్తత్ర తద్భవాన్వ్యాకరోతు నః. ౫

స నియుక్తస్తతస్తేన సంప్రహృష్టతనూరుహః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత. ౬

ప్రత్యక్షమేవ భవతాం మహేన్ద్రాగ్రాత్ఖమాప్లుతః,
ఉదధేర్దక్షిణం పారం కాఙ్క్షమాణస్సమాహితః. ౭
గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూపమివాభవత్,
కాఞ్చనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్. ౮
స్థితం పన్థానమావృత్య మేనే విఘ్నం చ తం నగం,
ఉపసంగమ్య తం దివ్యం కాఞ్చనం నగసత్తమమ్. ౯
కృతా మే మనసా బుద్ధిర్భేత్తవ్యోఽయం మయేతి చ,

## ఏఁబదియెనిమిదవ సర్గము

అంత మహాబలశాలు రగు హనుమంతుండు మున్నగువానరులు మహేంద్రపర్వతముం జేరి పరమసంతోషము నొందిరి. ౧

అంత జాంబవంతుండు సంతోషమున మేనం బులకలు వొడమఁ బరమ సంతుష్టుండగు వాయుపుత్రు హనుమంతుం జూచి సీతఁజూచి వచ్చిన వృత్తాంతము నడిగెను. ౨

నీవు సీతాదేవి నెట్లు జూచినావు? ఆబిడ యచ్చట నెట్లున్నది? అతి క్రూరుండగు నారావణుండు ఆబిడ విషయమయి యెట్లు నడుచుకొను చున్నాఁడు? ౩

హనుమంతుఁడా! ఈసమాచారమునంతయుం మాకు యథార్థముగాఁ జెప్పుము. [నీ వామె నెట్లు వెదకి కనుఁగొంటివి. ఆమె నీతో నేమి చెప్పినది?] వృత్తాంతమంతయుం విని యాపైఁ జేయవలసిన కార్యమును నిశ్చయించు కొందము. ౪

మనము రామునొద్దకుఁ బోయినప్పుడు ఏసంగతిం జెప్పవలయునో దేని దాఁచవలయునో దానినంతయుం నీవు బుద్ధిమంతుఁడవు కావున వివరముగా మాకుం జెప్పుము. అని జాంబవంతుండు హనుమంతు నడిగెను. ౫

అంత హనుమంతుండు అట్లు జాంబవంతుండు ప్రశ్నసేయఁగాఁ బుల కాంకితదేహుండై సాష్టాంగముగ సీతాదేవికి నమస్కరించి యిట్లని చెప్పం దొడంగెను. ౬

నేను సమాహితుండనై సముద్రము దక్షిణపుగట్టుఁ జేరఁగోరి మహేంద్ర పర్వతశిఖరమునుండి యాకాశము కెగురుట మీరందఱును జూచినదే. ౭

నేను బోవుచుండఁగానే పరమరమణీయమును దివ్యము నగు నొక కాంచనశిఖరము విఘ్నముసేయునది నాకడ్డము వచ్చినది. ౮

ఆపర్వతము మార్గము నడ్డగించుకొని యుండినది కావున నేను అది నాకు విఘ్నముసేయవచ్చినట్లు తలంచినాను. ౯

దివ్యమును స్వర్ణమయము నగు నాపర్వతమునొంది నేను "ఈపర్వత మును బగులఁగొట్టవలయును" అని తలంచితిని. ౧౦

ప్రహితం చ మయా తస్య లాంగూలేన మహాగిరేః. ౧౦
శిఖరం సూర్యసఙ్కాశం వ్యశీర్యత సహస్రధా,
వ్యవసాయం చ తం బుద్ధ్వా స హోవాచ మహాగిరిః. ౧౧
పుత్రేతి మధురాం వాణీం మనః ప్రహ్లాదయన్నివ,

పితృవ్యం చాపి మాం విద్ధి సఖాయం మాతరిశ్వనః. ౧౨
మైనాకమితి విఖ్యాతం నివసన్తం మహోదధౌ,
పక్షవన్తః పురా పుత్ర బభూవుః పర్వతోత్తమాః. ౧౩
ఛన్దతః పృథివీం చేరుర్బాధమానాస్సమన్తతః,

శ్రుత్వా నగానాం చరితం మహేన్ద్రః పాకశాసనః. ౧౪
చిచ్ఛేద భగవాన్పక్షాన్వజ్రేణైషాం సహస్రశః,

అహం తు మోక్షితస్తస్మాత్తవ పిత్రా మహాత్మనా. ౧౫
మారుతేన తదా వత్స ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే,

రామస్య చ మయా సాహ్యే వర్తితవ్యమరిన్దమ. ౧౬
రామో ధర్మభృతాం శ్రేష్ఠో మహేన్ద్రసమవిక్రమః,

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య మైనాకస్య మహాత్మనః. ౧౭
కార్యమావేద్య తు గిరేరుద్యతం చ మనో మమ,
తేన చాహమనుజ్ఞాతో మైనాకేన మహాత్మనా. ౧౮

అంత సూర్యసంకాశంబగు నాపర్వతశిఖరమును నేను వాలమునం గొట్టఁగా నది వేయిపలెయలుగాఁ బగిలినది. ౧౦

అపర్వత మంత నేను దన్నుఁ బగులఁగొట్ట యత్నించుచున్నానని తెలిసి కొని నన్ను "వత్సా" యని మధురముగాఁ బిలిచి శాసనమునకు సంతోషము నొసఁగుచు నిట్లనెను. ౧౧

నేను నీతండ్రి వాయుదేవునకు మిత్రుండనుగావున నీకుఁ బినతండ్రిని. సముద్రములో నున్నాను. మైనాకుం డనుపేరు గలవాఁడనని యెఱుంగుము.

కుమారుఁడా! మున్ను పర్వతములన్నియు ఱెక్కలు కలిగియుండినవి. అప్పు డవి స్వేచ్ఛగా భూమియంతయుఁ దిరుగుచు సమస్తభూతములను బాధించుచుండినవి. ౧౩

అంత భగవంతుఁడును బాకాసురుం జంపినవాఁడు నగు దేవేంద్రుఁడు పర్వతములుసేయు దుశ్చేష్టను విని వానిఱెక్కల నన్నింటిని వజ్రాయుధముచే ఛేదించెను. ౧౪

బిడ్డఁడవగు హనుమంతుఁడా! అప్పుడు మహాత్ముఁడగు నీతండ్రి వాయుదేవుఁడు నన్నుమాత్రము ఈమహాసముద్రములోఁ బడవైచి దేవేంద్రుని బారిం బడకుండ రక్షించినాఁడు. ౧౫

శత్రువుల నడంగఁ ద్రొక్కువాఁడవగు హనుమంతుఁడా! ఇందువలన నేను వాయువువలన మహోపకారము నొందినవాఁడను గాన ఆతనికుమారుండ వగు నీకు సాహాయ్యము చేయవలసినవాఁడగుట స్పష్టముగదా. మఱియుం రాముండు ధార్మికులలో నుత్తముఁడు. దేవేంద్రునివలెఁ బరాక్రమముగల వాఁడును గావుననే నతనికి సాహాయ్యముసేయవలసినవాఁడవే. నీ వతనిదూతవు కాఁబట్టి ఈరెండుసంబంధములను నేను నీకు సాహాయ్యము సేయవలసిన వాఁడనగుచున్నాను అని మైనాకుండు నాతోఁ జెప్పెను. ౧౬

మహాత్ముఁడగు నామైనాకుఁ డిట్లు చెప్పఁగానే నే నతనికిఁగా వచ్చిన కార్యంబుఁదెలిపి యూహైఁబోవుట కుద్యుక్తుండనైతిని. ౧౭

మహాత్ముండగు నామైనాకుండును నాకుఁ బోమ్మని యనుజ్ఞనొసంగెను.

స చాప్యన్తర్హితశ్శైలో మానుషేణ వపుష్మతా,
శరీరేణ మహాశైలః శైలేన చ మహోదధౌ. ౧౯

ఉత్తమం జవమాస్థాయ శేషం పన్థానమాస్థితః,
తతోఽహం సుచిరం కాలం వేగేనాభ్యగమం పథి. ౨౦
తతః పశ్యామ్యహం దేవీం సురసాం నాగమాతరం,
సముద్రమధ్యే సా దేవీ వచనం మామభాషత. ౨౧
మమ భక్షః ప్రదిష్టస్త్వమమరైర్హరిసత్తమ,
అతస్త్వాం భక్షయిష్యామి విహితస్త్వం చిరస్య మే. ౨౨

ఏవముక్తస్సురసయా ప్రాఞ్జలిః ప్రణతః స్థితః,
వివర్ణవదనో భూత్వా వాక్యం చేదముదీరయమ్. ౨౩
రామో దాశరథిశ్శ్రీమాన్ ప్రవిష్టో దణ్డకావనం,
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ పరన్తపః. ౨౪

తస్య సీతా హృతా భార్యా రావణేన దురాత్మనా,
తస్యాస్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్. ౨౫

కర్తుమర్హసి రామస్య సాహాయ్యం విషయే సతీ,

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్. ౨౬
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే,

ఏవముక్తా మయా సా తు సురసా కామరూపిణీ. ౨౭
అబ్రవీన్నాతివర్తేత కశ్చిదేష వరో మమ,

అంత నామైనాకపర్వతముతో మాటలాడుటకై ధరించిన పురుషాకారం బగుమానుషరూపంబును మఱుఁగుపఱిచి కేవలపర్వతాకారంబున సముద్రముపై నుండెను. ౧౯

అంత నేను మహావేగం బవలంబించి శేషించిన మార్గంబును దాటుటకై వేగంబునఁ జాలసేపు పోవుచుంటిని. ౨౦

అంత నేను సర్పమాతయగు సురసాదేవిం జూచినాను. ఆసురసాదేవి సముద్రమధ్యంబున నన్నుఁ జూచి యిట్లని చెప్పినది. ౨౧

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! దేవతలు నాకు నిన్ను ఆహారముగా నిచ్చిరి. కావున నిన్ను నేను భక్షించెదను. నీవు నాకు బహుకాలంబునకు దొరకినావు. అని సురస నాతోఁ జెప్పినది. ౨౨

నేను సురసాదేవిమాటను విని చేమోడ్పుగేలించి నమస్కరించి ముఖంబున వైవర్ణ్యంబుగదుర నాబిడ కిట్లంటిని. ౨౩

శ్రీమంతుఁడును శత్రువులం దపింపఁజేయుఁవాఁడును దశరథపుత్త్రుండు నగు రాముండును ఆతని తమ్ముండు లక్ష్మణుండును భార్య సీతయును దండకారణ్యంబుఁ బ్రవేశించిరి. ౨౪

రామునిభార్యయగు సీతను దురాత్ముండగు రావణుం డపహరించెను.

నేను నిప్పుడు రామునియాజ్ఞవలన ఆసీతాదేవియొద్దకుఁ బోవుచున్నాను. ౨౫

నీవు రామునిరాజ్యమున నివసించుచున్నావు. కావున రామునకు సాహాయ్యము సేయవలసినదానవే యగుచున్నావు.

అట్లు నీవు రామునకుఁ సాహాయ్యముసేయ నొడంబడవేని నేను బోయి సీతంజూచి యాబిడవృత్తాంతమును రామునకుఁ జెప్పి. యంత మరల వచ్చి నీనోరు ప్రవేశించెదను. ఆమాట సత్యము. నీవు సందేహింపవలదు. అని నేను సురసతోఁ జెప్పినాను. ౨౬

నే నిట్లు చెప్పఁగాఁ గామరూపిణియగు నాసురస అందుల కియ్యకొనక “నాచేఁ బట్టుకొనఁబడినవాఁ డెవ్వఁడును న న్నతిక్రమించి పోఁజాలఁడు. అట్లు నాకు వరంబున్నది” అని చెప్పినది. ౨౭

ఏవముక్తస్సురసయా దశయోజనమాయతః. ౨౮
తతోఽర్ధగుణవిస్తారో బభూవాహం క్షణేన తు,
మత్ప్రమాణానురూపం చ వ్యాదితం చ ముఖం తయా. ౨౯
తద్దృష్ట్వా వ్యాదితం చాస్యం హ్రస్వం హ్యకరవం వపుః,
తస్మిన్ముహూర్తే చ పునర్బభూవాఙ్గుష్ఠమాత్రకః. ౩౦
అభిపత్యాశు తద్వక్త్రం నిర్గతోఽహం తతః క్షణాత్,

అబ్రవీత్సురసా దేవీ స్వేన రూపేణ మాం పునః. ౩౧
అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖం,
సమానయ చ వైదేహీం రాఘవేణ మహాత్మనా. ౩౨
సుఖీ భవ మహాబాహో ప్రీతాఽస్మి తవ వానర,

తతోఽహం సాధు సాధ్వీతి సర్వభూతైః ప్రశంసితః. ౩౩

తతోఽన్తరిక్షం విపులం ప్లుతోఽహం గరుడో యథా,
ఛాయా మే నిగృహీతా చ న చ పశ్యామి కించన. ౩౪

సోఽహం విగతవేగస్తు దిశో దశ విలోకయన్,
న కించిత్తత్ర పశ్యామి యేన మేఽపహృతా గతిః. ౩౫
తతో మే బుద్ధిరుత్పన్నా కిన్నామ గగనే మమ,
ఈదృశో విఘ్న ఉత్పన్నో రూపం యత్ర న దృశ్యతే. ౩౬
అధోభాగేన మే దృష్టిశ్శోచతా పాతితా మయా,
తతోఽద్రాక్షమహం భీమాం రాక్షసీం సలిలేశయామ్. ౩౭
ప్రహస్య చ మహానాదముక్తోఽహం భీమయా తయా,
అవస్థిత మసంభ్రాన్త మిదం వాక్య మశోభనమ్. ౩౮

అప్పుడు పదియోజనములు నిడుపుగల నేను సురస యామాటం జెప్పఁగానే క్షణములోఁ బదునైదుయోజనములు నిడుపుగలవాఁడ నైతిని. ౨౮

ఆసురసయుం నాదేహప్రమాణమునకుం దగునట్టు నోరుఁ దెఱచినది.

నేను అట్లు సురస నోరుదెఱచుటంజూచి యాకాలముననే నాదేహమును మిక్కిలి చిన్నది చేసికొని ఒకయంగుళమంతటి దేహముగలవాఁడ నైతిని.

అంత నేను శీఘ్రింబుగా నాసురస నోటిలోఁ బ్రవేశించి క్షణములో మరల వెడలి వచ్చితిని. ౩౦

అంత సురసాదేవి తనయొప్పటిరూపము ధరించి నన్నుఁ జూచి యిట్లని చెప్పినది. ౩౧

సౌమ్యుండవు వానరశ్రేష్ఠుండవు నగుహనుమంతుఁడా! నీవు సుఖము గాఁబోయి కార్యసిద్ధిం బొందుము. సీతను రామునితోడం జేర్పుము. ౩౨

మహాబాహుండవగు వానరుఁడా! నీవు సుఖము నొందుదువుగాక! నీయందు నాకుఁ బ్రీతి కల్గినది అని సురసాదేవి నాతోఁ జెప్పినది.

అంత సమస్త భూతములును "లెస్స లెస్స" యని నన్నుఁ బ్రస్తుతించినవి. ౩౩

అంత మరల నేను గరుత్మంతుండుంబోలె నాకాశమున నుద్గమించితిని.

అంత దేనిచేతనో నా ఛాయ పట్టుకొనఁబడినది. నాకేదియుం గనఁబడ లేదు. ౩౪

వేగంబంతయుం నిలిచినంతనె నేను దిక్కులన్నియు వెదకినను నాఛాయను బట్టుకొనినదియేదో అది నాకగపడనే లేదు. ౩౫

అంత నాకాకాశమునం దిట్టివిఘ్నము నాకెట్లు గలిగినది? విఘ్నముచేయునది యేదో దానిరూపమును నాకగపడలేదే అని నేను చింతించితి. ౩౬

నేనంత దుఃఖించుచుఁ గ్రింద జలముతట్టు చూచినాను. అచ్చట జలంబుల భయంకరాకారయగు నొకరాక్షసస్త్రీ నా కగపడినది. ౩౭

అంత భయంకరాకారయగు నారాక్షసి నన్నుఁ జూచి మహాధ్వని గల్గునట్లు నవ్వి యెంతమాత్రము దొట్రుపాటునులేక దృఢముగా నమంగళంబగు నీమాటం జెప్పినది. ౩౮

క్వాసి గన్తా మహాకాయ క్షుధితాయా మమేప్సితః,
భక్షః ప్రీణయ మే దేహం చిరమాహారవర్జితమ్. ౩౯

బాఢమిత్యేవ తాం వాణీం ప్రత్యగృహ్ణామహం తతః,

ఆస్యప్రమాణాదధికం తస్యాః కాయమపూరయమ్. ౪౦

తస్యాశ్చాస్యం మహద్భీమం వర్ధతే మమ భక్షణే,
న చ మాం సాధు బుబుధే మమ వా నికృతం కృతమ్. ౪౧
తతోఽహం విపులం రూపం సంక్షిప్య నిమిషాన్తరాత్,
తస్యా హృదయ మాదాయ ప్రపతామి నభస్థ్సలమ్. ౪౨

సా విసృష్టభుజా భీమా పపాత లవణామ్భసి,
మయా పర్వతసఙ్కాశా నికృత్తహృదయా సతీ. ౪౩
శృణోమి ఖగతానాం చ సిద్ధానాం చారణైస్సహ,
రాక్షసీ సింహికా భీమా క్షిప్రం హనుమతా హతా. ౪౪
తాం హత్వా పునరేవాహం కృత్యమాత్యయికం స్మరన్,
గత్వా చాహం మహాధ్వానం పశ్యామి నగమణ్డితమ్. ౪౫
దక్షిణం తీరముదధేర్లఙ్కా యత్ర చ సా పురీ,

అస్తం దినకరే యాతే రక్షసాం నిలయం పురమ్. ౪౬
ప్రవిష్టోఽహమవిజ్ఞాతో రక్షోభిర్భీమవిక్రమైః,

తత్ర ప్రవిశతశ్చాపి కల్పాన్తఘనసన్నిభా. ౪౭

పెద్దదేహముగలవాఁడా! నీ వెచ్చటికిఁ బోవుచున్నావు? నే నాఁకలి గొనియున్నాను. నా కాహారము గావలయును. బహుకాలముగా నాహారము లేని నాకుఁ దృప్తిగావింపుము. అని యారాక్షసి నాతోఁ జెప్పినది. ౩౯

నేను "మంచి"దని యొప్పుకొని యంత నారాక్షసినోటికన్న నెచ్చుగా నాదేహంబును బెంచితిని.

భయంబును బెద్దదియునగు నారాక్షసినోరును నన్ను భక్షించునిమిత్త మయి నాదేహముకన్న నెచ్చుగా వృద్ధిఁబొందినది. ౪౦

ఆరాక్షసస్త్రీ నేను కామరూపిననిగాని, నేను గావలెనని యట్టివికృత రూపముఁ దాల్చితిననిగాని యెంతమాత్రము తెలిసికొనదయ్యె. ౪౧

అంత నేను ఒక్కనిమిషంబున నా పెద్దరూపమును జిన్నదిచేసికొని ఆరాక్షసి కడుపులోనికింజొచ్చి గుండెకాయం బెఱికికొని యాకాశంబున కుద్గమించితిని. ౪౨

నేను దానిగుండెకాయం బెఱికినంతనె భయంకరయుఁ బర్వతాకార యునగు నారాక్షసస్త్రీ చేతులు వ్రేలాడవేసి సముద్రంబునం బడినది. ౪౩

హనుమంతుండు ఒక్కనిమిషంబున భయంకరయగు సింహికం జంపెనని ఆకాశమునందున్న సిద్ధులును చారణులును జెప్పుకొనఁగా వింటిని. ౪౪

అట్లు నేను సింహికం జంపి "యెట్టికార్యమును జేసితిని"అని దుష్కరం బగు నాకార్యమునే తలంచుకొనుచు బహుదూరంబు పోయి లంకాపట్టణం బెచ్చటనున్నదో అట్టి నానావృక్షమండితంబగు సముద్రంబు దక్షిణతీరంబుఁ జూచితిని. ౪౫

సూర్యుఁ డస్తమించినపిదప నేను భయంకరంబగు పరాక్రమంబుగల రాక్షసులకుఁ దెలియకుండునట్లు రాక్షసనివాసస్థానంబయిన లంకాపురిం బ్రవే శించినాను. ౪౬

నే నట్లు ప్రవేశించుచుండఁగానే ప్రళయకాలమునందలి మేఘంబు వంటి యాకారంబుగల యొకానొకస్త్రీ గట్టిగానవ్వుచు నాముందఱ నిలిచినది.

అట్టహాసం విముఞ్చన్తీ నారీ కాప్యుత్థితా పురః,
జిఘాంసన్తీం తతస్తాం తు జ్వలదగ్నిశిరోరుహామ్. ౪౮
సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య సుభైరవాం,
ప్రదోషకాలే ప్రవిశం భీతయాఽహం తయోదితః. ౪౯
అహం లఙ్కాపురీ వీర నిర్జితా విక్రమేణ తే,
యస్మాత్తస్మాద్విజేతాసి సర్వరక్షాంస్యశేషతః. ౫౦

తత్రాహం సర్వరాత్రం తు విచిన్వఞ్జనకాత్మజాం,
రావణాన్తఃపురగతో న చాపశ్యం సుమధ్యమామ్, ౫౧

తతస్సీతామపశ్యంస్తు రావణస్య నివేశనే,

శోకసాగరమాసాద్య న పారముపలక్షయే. ౫౨
శోచతా చ మయా దృష్టం ప్రాకారేణ సమావృతం,
కాఞ్చనేన వికృష్టేన గృహోపవనముత్తమమ్. ౫౩

స ప్రాకారమవప్లుత్య పశ్యామి బహుపాదపం,
అశోకవనికామధ్యే శింశుపాపాదపో మహాన్. ౫౪
తమారుహ్య చ పశ్యామి కాఞ్చనం కదలీవనం,
అదూరే శింశుపావృక్షాత్పశ్యామి వరవర్ణినీమ్. ౫౫
శ్యామాం కమలపత్రాక్షీముపవాసకృశాననాం,
తదేకవాసస్సంవీతాం రజోధ్వస్తశిరోరుహామ్. ౫౬
శోకసన్తాపదీనాఙ్గీం సీతాం భర్తృహితే స్థితాం,
రాక్షసీభిర్విరూపాభిః క్రూరాభిరభిసంవృతామ్. ౫౭
మాంసశోణితభక్షాభిర్వ్యాఘ్రీభిర్హరిణీమివ,

అంత మండుచున్న యగ్నిహోత్రమువంటి తలవెండ్రుకలు గలదియు భయంకరాకారయు నన్నుఁ జంపం గోరివచ్చినదియు నగు నారాక్షసిని ఎడమచేతి పిడికిలిపోటునం జొక్కించి సాయంకాలంబున లంకాపురంబుఁ బ్రవేశించినాను. ౪౯

ఆరాక్షసి యంత భయంబునొంది నన్నుఁ జూచి యిట్లని చెప్పినది.

పరాక్రమశాలివగు హనుమంతుఁడా! నేను లంకాపురిని. నీవు నన్ను బరాక్రమంబున జయించినావు కావున నింక లంకలో సమస్తరాక్షసులను జయింపఁగలవు. అని యారాక్షసి నాతోఁ జెప్పెను. ౫౦

నేనారాత్రి యంతయు లంకయందు సీతను వెదకినను రావణునియంతఃపురంబునకుఁబోయి వెదకినను సుందరమయిన నడుముగల సీతాదేవి నాకగపడ లేదు. ౫౧

అంత నేను రావణునింట సీతంగానక పారంబులేని దుఃఖసముద్రంబున మునింగితిని.

నే నట్లు దుఃఖించుచును గాంచనమయంబు నతిదీర్ఘంబునగు ప్రాకారమునం బరివేష్టింపఁబడిన యుత్తమం బగుగృహోద్యానవనంబుఁ గాంచితిని.

అంత నేనాప్రాకారము దాఁటి పెక్కువృక్షంబులుగల యాయుద్యానవనముం జూచితిని. ౫౩

ఆయశోకవనంబు నడుమ నొక్క పెద్దశింశుపావృక్షంబున్నది. నేను దాని నారోహించి కాంచనమయం బగునరఁటిచెట్లసమూహముం గంటిని.

అంత నాశింశుపావృక్షంబునకు సమీపంబున నుష్ణకాలంబున సుఖశీతలంబును శీతకాలంబున సుఖోష్ణంబు నగుదేహము గలిగి భర్తయం దధికానురాగముగలయుత్తమవనితయు యౌవనమధ్యస్థయు తామరపూఱేకులుంబోలె విశాలసుందరంబులగు నేత్రంబులుగలదియు నుపవాసంబులం గృశించినముఖము గలదియు మున్ను రావణుం డెత్తుకొనిపోవునప్పుడు మనము చూచితిమే ఆదే వస్త్రంబును గట్టుకొనియున్నదియు దుమ్ముచేనిండిన తలవెండ్రుకలు గలదియు దుఃఖసంతాపంబులం బరితపించుచున్నదియుఁ బతిహితంబ కోరుచున్నదియు

సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః. ౫౮
ఏకవేణీధరా దీనా భర్తృచిన్తాపరాయణా,
భూమిశయ్యా వివర్ణాఙ్గీ పద్మినీవ హిమాగమే. ౫౯
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథంచిన్మృగశాబాక్షీ తూర్ణమాసాదితా మయా. ౬౦

తాం దృష్ట్వా తాదృశీం నారీం రామపత్నీం యశస్వినీం,
తత్రైవ శింశుపావృక్షే పశ్యన్నహమవస్థితః. ౬౧
తతో హలహలాశబ్దం కాఞ్చీనూపురమిశ్రితం,
శృణోమ్యధికగమ్భీరం రావణస్య నివేశనే. ౬౨
తతోఽహం పరమోద్విగ్నః స్వం రూపం ప్రతిసంహరన్,
అహం తు శింశుపావృక్షే పక్షీవ గహనే స్థితః. ౬౩

తతో రావణదారాశ్చ రావణశ్చ మహాబలః,
తం దేశం సమనుప్రాప్తా యత్ర సీతాఽభవత్ స్థితా. ౬౪
తం దృష్ట్వాథ వరారోహా సీతా రక్షోగణేశ్వరం,
సఙ్కుచ్యోరూ స్తనౌ పీనౌ బాహుభ్యాం పరిరభ్య చ. ౬౫

విత్రస్తాం పరమోద్విగ్నాం వీక్షమాణాం తతస్తతః,
త్రాణం కించిదపశ్యన్తీం వేపమానాం తపస్వినీమ్. ౬౬
తామువాచ దశగ్రీవస్సీతాం పరమదుఃఖితాం,
అవాక్శిరాః ప్రపతితో బహుమన్యస్వ మామితి. ౬౭

వికృతాకారలును నిర్దయలును మాంసమును నెత్తురును భక్షించువారలునగు రాక్షసస్త్రీలచేఁ బెద్దపులులచే లేడివలెఁ బరివేష్టింపఁబడియున్నదియు నగుసీతాదేవిం జూచినాను. ౧౭-౧౮

రాక్షసస్త్రీలనడుమ వారలచే బెదరింపఁబడుచు నొక్కటే జడఁగాఁ గట్టిన తలవెండ్రుకలుగలిగి దైన్యమునొంది యెల్లప్పుడు భర్తను ధ్యానించుచు నేలంబరుండుటచే వైవర్ణ్యమునొందినదేహంబుగలది కావున హేమంతర్తువందుఁ గమలసమూహముంబోలెఁ జూపట్టుచున్నదై రావణునియందు మనముఁ జేర్పక యతనినిర్బంధమునంజేసి ప్రాణములు విడువంగోరియున్నదాని జింక పిల్లకుంబోలె విశాలసుందర చంచలనేత్రములుగలదాని సీతాదేవిని అతిప్రయాసమునం జూచితిని. ౧౯-౨౦

నేను అట్టి యుత్తమవనితయుఁ బరమపతివ్రతయు నగు రామభార్యను సీతాదేవింజూచి యట్టె చూచుచు శింశుపావృక్షముమీఁదనే యుంటిని. ౨౧

అంత రావణునిగృహమునుండి మిక్కిలి గంభీరంబగు కాంచీనూపురములధ్వనులతోఁ గలసిన హాలహాల యనుశబ్దం బొకటి వినవచ్చినది. ౨౨

అంత నేను మిగులభయమునొంది నాదేహము మఱియుం జిన్నచేసికొని యాకులచే నిండియుండిన శింశుపావృక్షమునఁ బక్షివలె నెవ్వరికిం దెలియ కుండున ట్లుంటిని. ౨౩

అంత రావణునిభార్యలును మహాబలశాలియగురావణుండును సీతాదేవి యుండు స్థలమునకు వచ్చిరి. ౨౪

అంత నుత్తమములగుపిఱుఁదులుగల యాసీతాదేవి మహాబలుం డగు నారావణుం జూచి తొడలు ముడుచుకొని పీనములగు స్తనములను జేతులతోఁ గట్టుకొని నిశ్చలయయి యుండినది. ౨౫

రావణుండు మిక్కిలి భయమును దిగులునొందినదై దిక్కులంజూచుచు నెచ్చటను రక్షకుంగానక గడగడవడంకుచున్నదాని శోచనీయయగుదానిఁ బరమ దుఃఖితయగు నాసీతాదేవింజూచి తలవాంచి నమస్కరించి "నన్ను గౌరవించి చూడుము" అని ప్రార్థించెను. ౨౬-౨౭

యది చేత్త్వం తు దర్పాన్మాం నాభినన్దసి గర్వితే,
ద్వౌ మాసావన్తరం సీతే పాస్యామి రుధిరం తవ. ౧౮

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య రావణస్య దురాత్మనః,
ఉవాచ పరమక్రుద్ధా సీతా వచనముత్తమమ్. ౧౯
రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః,
ఇక్ష్వాకుకులనాథస్య స్నుషాం దశరథస్య చ. ౨౦

అవాచ్యం వదతో జిహ్వా కథం న పతితా తవ,
కించిద్వీర్యం తవానార్య యో మాం భర్తురసన్నిధౌ. ౨౧

అపహృత్యాఽఽగతః పాప తేనాదృష్టో మహాత్మనా,
న త్వం రామస్య సదృశో దాస్యేఽప్యస్య న యుజ్యసే. ౨౨
యజ్ఞీయస్సత్యవాదీ చ రణశ్లాఘీ చ రాఘవః,
జానక్యా పరుషం వాక్యమేవముక్తో దశాననః. ౨3
జజ్వాల సహసా కోపాచ్చితాస్థ ఇవ పావకః,
వివృత్య నయనే క్రూరే ముష్టిముద్యమ్య దక్షిణమ్. ౨౪
మైథిలీం హన్తుమారబ్ధః స్త్రీభిర్హాహాకృతం తదా,

స్త్రీణాం మధ్యాత్సముత్పత్య తస్య భార్యా దురాత్మనః. ౨౫
వరా మన్దోదరీ నామ తయా సం(చ)ప్రతిషేధితః,

ఉక్తశ్చ మధురాం వాణీం తయా స మదనార్దితః. ౨౬

సీతయా తవ కిం కార్యం మహేన్ద్రసమవిక్రమ,
[మయా సహ రమస్వాద్య మద్విశిష్టా న జానకీ]

గర్వమునొందియున్నట్టి సీతా! నీవుమాత్రము గర్వమున నన్ను గౌర
వింపక యుందువేని యింకరెండుమాసము లవధియున్నది. అటుపిమ్మట నిన్ను
జంపి నీనెత్తురుం ద్రాగెదను. అని రావణుండు సీతాదేవితోఁ జెప్పెను. ౧౮

సీతాదేవి దురాత్ముండగు రావణునిమాటను విని పరమకోపమునొంది
యుత్తమంబగు నీమాటను చెప్పెను. ౧౯

రాక్షసాధముండవగురావణుఁడా! అమితపరాక్రమశాలి యగురాముని
భార్యను ఇక్ష్వాకుకులనాథుండగు దశరథునికోడలనగు నన్నునరానిమాట లాడి
నావే. నీనాలుక వీడి నేలంబడదేల ? ౨౦

దుష్టుండవు పాపిష్ఠుండవగు రావణుఁడా! నీవు నాభర్తయగురాముఁడు
సమీపమున లేనప్పుడు నన్నుపహరించి యతనికండ్లంబడకుండునట్లు దొంగవై
వచ్చినావు. కావున నీపరాక్రమము మిక్కిలి స్వల్పము. ౨౧

నీవు రామునకు సరికావు. అతనికి దాసుండగుటకైనను నీకు యోగ్యత
లేదు. రాముఁడు పెక్కుయాగములు చేయువాఁడు సత్యవాదియు యుద్ధ
ప్రియుండును అని సీతాదేవి రావణునితోఁ జెప్పెను. ౨౨

ఇట్లు సీతాదేవి చెప్పిన పరుషంబగు వచనంబును విని రావణుండు తక్ష
ణంబునఁ జితియందలి యగ్నిహోత్రునిభంగిఁ గోపమునం బ్రజ్వరిల్లెను. ౨౩

అంత నారావణుండు భయంకరంబులగు నేత్రంబులం దెఱచి దక్షిణ
హస్తంబున ముష్టి నలవరించి సీతాదేవిం జంపఁబోయెను. దానింజూచి యచ్చటి
స్త్రీలు హాహాకారంబులు గావించిరి. ౨౪

దురాత్ముండగు నారావణుని యుత్తమభార్య మందోదరియను పేరు
గలది యొక్కతె యందుండినది. ఆబిడ స్త్రీల నడుమనుండి వచ్చి యతని
సీతం జంపవలదని నిషేధించినది. ౨౫

ఆమందోదరి మన్మథపీడితుండగు నారావణునకు మధురంబగు నీమాటను
కూడఁ జెప్పినది. ౨౬

మహేంద్రునకుంబోలెఁ బరాక్రమంబుగలవాఁడగు రావణుఁడా! నీకు
సీతతో నేమిప్రయోజనము ?

దేవగన్ధర్వకన్యాభిర్యక్షకన్యాభిరేవ చ. ౭౭
సార్ధం ప్రభోరమస్వేహ సీతయా కిం కరిష్యసి,

తతస్తాభిస్సమేతాభిర్నారీభిస్స మహాబలః. ౭౮
ప్రసాద్య సహసా నీతో భవనం స్వం నిశాచరః,
యాతే తస్మిన్ దశగ్రీవే రాక్షస్యో వికృతాననాః. ౭౯
సీతాం నిర్భర్త్సయామాసుర్వాక్యైః క్రూరైస్సుదారుణైః,
తృణవద్భాషితం తాసాం గణయామాస జానకీ. ౮౦

గర్జితం చ తదా తాసాం సీతాం ప్రాప్య నిరర్థకం,
వృథాగర్జితనిశ్చేష్టా రాక్షస్యః పిశితాశనాః. ౮౧

రావణాయ శశంసుస్తాస్సీతాధ్యవసితం మహత్,
తతస్తాస్సహితాస్సర్వా విహతాశా నిరుద్యమాః. ౮౨

పరిక్షిప్య సమన్తాత్తాం నిద్రావశముపాగతాః,
తాసు చైవ ప్రసుప్తాసు సీతా భర్తృహితే రతా. ౮౩
విలప్య కరుణం దీనా ప్రశుశోచ సుదుఃఖితా,
తాసాం మధ్యాత్సముత్థాయ త్రిజటా వాక్యమబ్రవీత్. ౮౪
ఆత్మానం ఖాదత క్షిప్రం న సీతా వినశిష్యతి.
జనకస్యాత్మజా సాధ్వీ స్నుషా దశరథస్య చ. ౮౫
స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః,
రక్షసాం చ వినాశాయ భర్తురస్యా జయాయ చ. ౮౬
అలమస్మాత్పరిత్రాతుం రాఘవాద్రాక్షసీగణం,
అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచతే. ౮౭

ప్రభుండవగు రావణుండా! దేవకన్యలను గంధర్వకన్యలను యక్షకన్యలనుంగూడి యథేష్టంబుగాఁ గ్రీడింపుము. ఈసీతతో నీకేమి కార్యమున్నది? అని యామండోదరి రావణునకుం జెప్పినది. ౭౮

అంత నాస్త్రీలందఱుఁ జేరి శీఘ్రంబున మహాబలుండగు నారావణునిఁ బ్రసన్నుఁగావించి గృహంబునకుఁ దీసుకొనిపోయిరి. ౭౯

ఆరావణుండు పోయినపిమ్మట వికృతంబు లగుముఖములు గల రాక్షసస్త్రీలు పరుషంబులును భయంకరంబులు నగుమాటలచే సీతాదేవిని బెదరించిరి.

సీతాదేవి యారాక్షసస్త్రీలమాటలం దృణీకరించెను. ఆరాక్షసస్త్రీ లెంత గర్జించినను ఆమాటలన్నియుం సీతావిషయమయి నిష్ప్రయోజనంబు లయినవి. ౮౦

మాంసమే యాహారముగాఁగల యారాక్షసస్త్రీలు తమగర్జనలు వ్యర్థము లగుటంబట్టి నిశ్చేష్టలయి రావణునియొద్దకుఁ బోయి సీతాదేవి యభిప్రాయమంతయుం జెప్పిరి. ౮౧

అంత నారాక్షసస్త్రీ లందఱును నిరాశలై సీతాదేవిని వశీకరించు ప్రయత్నంబును విడిచి సీతాదేవిం జుట్టుకొనియుండి కొంతసేపునకు నిద్రాధీనలయిరి. ౮౨

ఆరాక్షసస్త్రీలు నిద్రపోయినపిమ్మట మహాపతివ్రతయగు సీతాదేవి పరమదుఃఖంబు నొంది దీనయయి విలపించుచు దుఃఖించుచుండినది. ౮౩

అందుఁ ద్రిజట యను రాక్షసియొక్కతె ఆరాక్షసస్త్రీలనడుమనుండి నిద్రపోయి లేచి యీమాటం జెప్పినది. ౮౪

సీతను భక్షింపవలదు. శీఘ్రముగా నన్ను భక్షింపుఁడు. జనకమహారాజు కొమార్తెయుం దశరథుని కోడలును బరమపతివ్రతయుం నగుసీతాదేవి యెంతమాత్రము నాశము నొందదు. ౮౫

ఇప్పుడు రాక్షసవినాశంబును శ్రీరామజయంబును సూచించునట్టి మహాభయంకరంబగు స్వప్నం బొకటి నాకుఁ గలిగినది. ౮౬

రామునివలనం జావకుండ మనలనందఱిం గాపాడుటకు ఈసీతాదేవి యొక్కతయే చాలును. కావున మన మీసీతాదేవిం బ్రార్థింతము. ఇదియే యిప్పటికిఁ జేయఁదగు కార్యమని నాకుఁ దోఁచుచున్నది. ౮౭

యస్యా హ్యేవంవిధస్స్వప్నో దుఃఖితాయాః ప్రదృశ్యతే,
సా దుఃఖై ర్వివిధై ర్ముక్తా సుఖమాప్నోత్యనుత్తమమ్. ౭౭
ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా,
[అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్.]

తతస్సా హ్రీమతీ బాలా భర్తుర్విజయహర్షితా. ౭౮
అవోచద్యది తత్తథ్యం భవేయం శరణం హి వః,

తాం చాహం తాదృశీం దృష్ట్వా సీతాయా దారుణాం దశామ్.
చింతయామాస విక్రాన్తో న చ మే నిర్వృతం మనః,

సంభాషణార్థం చ మయా జానక్యాశ్చిన్తితో విధిః. ౮౧
ఇక్ష్వాకూణాం హి వంశస్తు తతో మమ పురస్కృతః,
శ్రుత్వా తు గదితాం వాచం రాజర్షిగణపూజితామ్. ౮౨
ప్రత్యభాషత మాం దేవీ బాష్పైః పిహితలోచనా,
కస్త్వం కేన కథం చేహ ప్రాప్తో వానరపుఙ్గవ. ౮౩
కా చ రామేణ తే ప్రీతి స్తన్మే శంసితుమర్హసి,

తస్యాస్తద్వచనం శ్రుత్వా హ్యహమప్యబ్రువం వచః, ౮౪
దేవి రామస్య భర్తుస్తే సహాయో భీమవిక్రమః,
సుగ్రీవో నామ విక్రాన్తో వానరేన్ద్రో మహాబలః. ౮౫

తస్య మాం విద్ధి భృత్యం త్వం హనుమన్తమిహాగతం,

ఎవ్వతెయేని దుఃఖమునొందియుండఁగా నిట్టిస్వప్నంబు గలుగునేని యూవిడ దుఃఖంబులన్నియుం బాసి యుత్తమంబగు సుఖంబునొందును. ౮౮

జనకమహారాజు కొమార్తెయగు సీతాదేవి మన మెన్ని యపరాధంబులు గావించినను నమస్కారముచేసి ప్రార్థింతుమేని మనయెడలం బ్రసన్న యగును. [మనల నందఱను రక్షింప నీమె సమర్థురాలు] అని త్రిజట రాక్షస స్త్రీలకుం జెప్పినది.

అంత బాలయగుసీతాదేవి తనభర్తకు జయంబు గల్గునను మాటవిని సంతోషంబును, సిగ్గునుబొంది యూరాక్షసస్త్రీలం జూచి త్రిజట చెప్పినది సత్యమగునేని నేను మిమ్ముల రక్షించెదను. అని చెప్పెను. ౮౯

నేను సీతాదేవికిం గల్గిన యనిర్వాచ్యంబగు నాదుర్దశంజూచి దుఃఖాక్రాంతుండనై చింతనొందితిని. నామనసునకు నెంతమాత్రము సుఖంబు గలుగలేదు. ౯౦

నేను సీతతో సంభాషించుటకు నొకయుపాయంబు నాలోచించితిని. అట్లు మొదట నిక్ష్వాకువంశంబు నభివర్ణించి చెప్పితిని. ౯౧

సీతాదేవి నేను జెప్పిన యుత్తమంబగు మాటలు విని కన్నీళ్లు గాఱ నన్ను జూచి యిట్లని చెప్పెను. ౯౨

వానరశ్రేష్ఠుఁడవగు హనుమంతుఁడా! నీవెవ్వఁడవు? ఎందుచేత నిచ్చటికి వచ్చినావు? సముద్రం బెట్లు తరించితివి? నీకు రామునితో స్నేహంబెట్లు కలిగినది? దీనినంతయుం నాకు సవిస్తరముగాఁ జెప్పుము అని సీతాదేవి నాతోఁ జెప్పినది. ౯౩

సీతాదేవి చెప్పినమాట విని నేను ఈమాటం జెప్పితిని. ౯౪

సీతాదేవీ! నీపెనిమిటియగు రామునకు స్నేహితుఁడును భయంకరంబగు పరాక్రమంబు గలవాఁడును మహాబలుఁడు నగుసుగ్రీవుఁ డను వానరరాజొకఁడు గలఁడు. ౯౫

నేను ఆసుగ్రీవునిభృత్యుఁడననియుం హనుమంతుఁ డనుపేరుగలవాఁడ ననియుం దెలియుగుము.

భర్త్రాహం ప్రేషితస్తుభ్యం రామేణాక్లిష్టకర్మణా. ౯౬

ఇదం చ పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథిస్స్వయం,
అఙ్గులీయ మభిజ్ఞాన మదాత్తుభ్యం యశస్విని. ౯౭

తదిచ్ఛామి త్వయాఽఽజ్ఞప్తం దేవి కిం కరవాణ్యహం,
రామలక్ష్మణయోః పార్శ్వం నయామి త్వాం కిము త్తరమ్. ౯౮

ఏతచ్ఛ్రుత్వా విదిత్వా చ సీతా జనకనన్దినీ,
ఆహ రావణముత్సాద్య రాఘవో మాం నయత్వితి. ౯౯
ప్రణమ్య శిరసా దేవీమహమార్యామనిన్దితాం,
రాఘవస్య మనోహ్లాదమభిజ్ఞానమయాచిషమ్. ౧౦౦

అథ మామబ్రవీత్సీతా గృహ్యతామయము త్తమః,
మణిర్యేన మహాబాహూ రామస్త్వాం బహుమన్యతే. ౧౦౧
ఇత్యుక్త్వా తు వరారోహా మణిప్రవరమద్భుతం,
ప్రాయచ్ఛత్పరమోద్విగ్నా వాచా మాం సందిదేశహ. ౧౦౨

తత స్తస్యై ప్రణమ్యాహం రాజపుత్ర్యై సమాహితః,
ప్రదక్షిణం పరిక్రామ మిహాభ్యుద్గతమానసః. ౧౦౩
ఉక్తోఽహం పునరేవేదం నిశ్చిత్య మనసా తయా,
[జ్ఞాత్వా సంప్రస్థితం సీతా మాముపాచ తపస్వినీ]

హనుమన్మమ వృత్తాన్తం వక్తుమర్హసి రాఘవే. ౧౦౪
యథా శ్రుత్వైవ న చిరాత్తావుభౌ రామలక్ష్మణౌ,
సుగ్రీవసహితౌ వీరావుపేయాతాం తథా కురు. ౧౦౫

అక్లిష్టకర్ముం డగు నీపెనిమిటి రాముఁడు నన్ను నీకొఱ కిచ్చుటకుఁ బంపినాఁడు. ౯౭

అధిక మగు కీర్తివహించిన దానవగు సీతాదేవీ! పురుషశ్రేష్ఠుండును శ్రీమంతుండు నగురాముఁడు తానైయే నీకు గుఱుతుగా నీయాయంగుళీయకంబు నిచ్చినాఁడు. ౯౮

సీతాదేవీ! అందువలన నీయాజ్ఞఁ గోరెదను. నే నేమి చేయవలయును? నిన్ను రామలక్ష్మణుల యొద్దకుం గొనిపోయెదను. దీనికేమి చెప్పెదవు? అని సీతాదేవితోఁ జెప్పితిని. ౯౯

జనకమహారాజు కొమార్తెయగు సీతాదేవి నామాటను విని యాలోచించి "రాముఁడే రావణుంజంపి నన్నుఁ గొనిపోవలయును" అని చెప్పినది.

అంత నేను బూజ్యురాలును అనిందితయునగు నాసీతాదేవికి సాష్టాంగ నమస్కారము కావించు రాముని మనంబునకు సంతోషంబు గలిగించునట్టి గుఱుతొకటి యిమ్మని ప్రార్థించితిని. ౧౦౦

అంత సీతాదేవి "నీ వీమణిం దీసికొనుము. దీనింజూచి మహాబాహుం డగు రాముఁడు నిన్ను బహుమానించును" అని నాతోఁ జెప్పినది. ౧౦౧

పరమదుఃఖితయు నుత్తమంబులగు పిఱుఁదులుగలదియు నగుసీతాదేవి ఈయాశ్చర్యకరంబగు కాంతిగల మణిశ్రేష్ఠంబు నొసంగి మఱియుం గొన్ని వృత్తాంతరూపంబులగు గుఱుతులం జెప్పినది. ౧౦౨

అంత నేను హెచ్చరికనొంది యిచ్చటికి శీఘ్రముగా రావలయునని తలంచి రాచకొమార్తెయగు సీతాదేవికి నమస్కరించి ప్రదక్షిణంబు చేసితిని.

మరల సీతాదేవి మనంబున నాలోచించి నన్నుం జూచి యిట్లని చెప్పినది. [నేను ప్రయాణోన్ముఖుఁడనుకాఁగానే యది తెలిసికొని సీత యిట్లు చెప్పెను.]

ఆంజనేయా! నీవు నాకష్టానిష్టములనన్నియుం రామునకుం జెప్పవలయును.

నావృత్తాంతమును విన్నంతనే పరాక్రమవంతులగు నారామలక్ష్మణులిదఱును సుగ్రీవుండును శీఘ్రంబున నిచ్చటికి వచ్చునట్లు నీవు చేయవలయును.

యద్యన్యథా భవేదేతద్ద్వౌ మాసౌ జీవితం మమ,
న మాం ద్రక్ష్యతి కాకుత్స్థో మ్రియే సాహమనాథవత్. ౧౦౬

తచ్ఛ్రుత్వా కరుణం వాక్యం క్రోధో మామభ్యవర్తత,
ఉత్తరం చ మయా దృష్టం కార్యశేషమనన్తరమ్. ౧౦౭

తతోఽవర్ధత మే కాయ స్తదా పర్వతసన్నిభః,
యుద్ధకాఙ్క్షీ వనం తచ్చ వినాశయితుమారభే. ౧౦౮
తద్భగ్నం వనషణ్డం తు భ్రాన్తత్రస్తమృగద్విజం,
ప్రతిబుద్ధా నిరీక్షన్తే రాక్షస్యో వికృతాననాః. ౧౦౯

మాం చ దృష్ట్వా వనే తస్మిన్ సమాగమ్య తతస్తతః,
తాస్సమభ్యాగతాః క్షిప్రం రావణాయాచచక్షిరే. ౧౧౦

రాజన్వనమిదం దుర్గం తవ భగ్నం దురాత్మనా,
వానరేణ హ్యవిజ్ఞాయ తవ వీర్యం మహాబల. ౧౧౧

దుర్బుద్ధేస్తస్య రాజేన్ద్ర తవ విప్రియకారిణః,
వధమాజ్ఞాపయ క్షిప్రం యథాసౌ విలయం వ్రజేత్. ౧౧౨

తచ్ఛ్రుత్వా రాక్షసేన్ద్రేణ విసృష్టా భృశదుర్జయాః,
రాక్షసాః కిఙ్కరా నామ రావణస్య మనోఽనుగాః. ౧౧౩
తేషామశీతిసాహస్రం శూలముద్గరపాణినాం,
మయా తస్మిన్వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్. ౧౧౪

అట్లు వారలు రాకుందురేని ఇంక రెండుమాసములే నేను బ్రతికి యుందును. అటుపిమ్మట ననాథవలె మరణంబు నొందెదను. అంత రాముఁడు వచ్చియుఁ గార్యములేదు. అని సీతాదేవి నాతోఁ జెప్పినది. ౧౦౭

దుఃఖకరంబగు నామాటను విన్నంతనె నాకుఁ గోపంబు వచ్చినది.

అంత నేను ఆపైఁ జేయవలసిన కార్యంబు నాలోచించి నిశ్చయించితిని.

అంత నే నప్పుడు నాదేహమును బర్వతాకారంబుగాఁ బెంచితిని.

నేను యుద్ధంబు సేయఁగోరి రావణునకుఁ గోపంబు గలిగించుటకై యశోకవనంబంతయుం నాశము నొందించితిని. ౧౦౮

వికృతంబులగు ముఖంబులుగల యారాక్షసస్త్రీలు వనంబు విఱుచు శబ్దంబునకు మేల్కాని ఆయశోకవనంబంతయుం విఱువంబడి బెదరిపఱచు మృగపక్షులతోఁ గూడియుండుటం జూచిరి. ౧౦౯

ఆరాక్షసస్త్రీలు అయశోకవనముననున్న నన్నుం జూచి నే నీవనంబు నంతయు విఱిచినవాఁడనని తెలిసికొని యందఱు నొక్కటియై శీఘ్రంబునం బోయి యిట్లని రావణునకుం జెప్పిరి. ౧౧౦

మహాబలుండవు రాక్షసరాజవగు రావణుఁడా ! దురాత్ముఁడగు నొక వానరుఁడు నీపరాక్రమంబు నెఱుంగనివాఁడు కావున దుష్ప్రవేశంబగు నీ యశోకవనమును విఱిచినాఁడు. ౧౧౧

రాజశ్రేష్ఠుండవగు రావణుఁడా ! దుర్బుద్ధియుం నీకు విరోధంబుగావించినవాఁడు నగు నావానరుఁడు నాశంబునొందునట్లు శీఘ్రంబుగా నతనిం జంప నాజ్ఞాపింపుము. అని యారాక్షసస్త్రీలు రావణునకుం జెప్పిరి. ౧౧౨

ఆమాటను విని రాక్షసేశ్వరుండగు రావణుండు మిక్కిలి దుర్జయులును దనకు వశవర్తులు నగుకింకరు లనంబడు రాక్షసులం బంపెను. ౧౧౩

నే నంత శూలంబులను ముద్గరంబులను జేతులందాల్చియున్న యాకింకరుల నెనుబదివేలమందినిగూడ నాయశోకవనసమీపంబున నుండుపరిఘముచేఁ జంపితిని. ౧౧౪

తేషాం తు హతశేషా యే తే గత్వా లఘువిక్రమాః,
నిహతం చ మహత్సైన్యం రావణాయాచచక్షిరే. ౧౧౫

తతో మే బుద్ధిరుత్పన్నా చైత్యప్రాసాదమాక్రమం,

తత్రస్థాన్రాక్షసాన్హత్వా శతం స్తమ్భేన వై పునః. ౧౧౬
లలామభూతో లఙ్కాయాస్స వై విధ్వంసితో మయా,
తతః ప్రహస్తస్య సుతం జంబుమాలినమాదిశత్. ౧౧౭
రాక్షసైర్బహుభిస్సార్ధం ఘోరరూపైర్భయానకైః,
తం మహాబలసంపన్నం రాక్షసం రణకోవిదమ్. ౧౧౮
పరిఘేణాతిఘోరేణ సూదయామి సహానుగం,

తచ్ఛ్రుత్వా రాక్షసేంద్రస్తు మంత్రిపుత్రాన్ మహాబలాన్.
పదాతిబలసమ్పన్నాన్ ప్రేషయామాస రావణః,

పరిఘేణైవ తాన్ సర్వాన్నయామి యమసాదనమ్. ౧౨౦
మన్త్రిపుత్రాన్హతాంచ్ఛ్రుత్వా సమరేష్వలఘువిక్రమాన్,
పఞ్చ సేనాగ్రగాంచ్ఛూరాన్ ప్రేషయామాస రావణః. ౧౨౧
తానహం సహసైన్యాన్వై సర్వానేవాభ్యసూదయం,
తతః పునర్దశగ్రీవః పుత్రమక్షం మహాబలమ్. ౧౨౨

బహుభీ రాక్షసైస్సార్ధం ప్రేషయామాస రావణః,

తం తు మన్దోదరీపుత్రం కుమారం రణపణ్డితమ్. ౧౨౩
సహసా ఖం సముత్క్రాన్తం పాదయోశ్చ గృహీతవాన్,

ఆకింకరులలో హతశేషులగు రాక్షసులు శీఘ్రమున రావణునొద్దకుం బాఱిపోయి సైన్యంబంతయుం నా వానరునిచేఁ జంపఁబడినదని రావణునకుం జెప్పిరి. ౧౧౫

అంత నాశోకబుద్ధిపుట్టినది. అంత నచ్చటనుండు చైత్యప్రాసాదము మీఁదికి దుమికితిని.

నేను అచ్చటనుండు స్తంభంబునుందీసి యందుండిన రాక్షసుల నూర్వురం జంపి లంకాపట్టణంబున కంతయుం నలంకారభూతమయిన యా చైత్యప్రాసాదమునుంగూడ నాశంబు నొందించితిని. ౧౧౬

అంత నారావణుండు ప్రహస్తపుత్రుండగు జంబుమాలిని భయంకరాకారులగు పెక్కురాక్షసులతోఁ గూడ నాపైకిఁ బంపెను. ౧౧౭

నేను మహాబలుండును యుద్ధంబునం బండితుండు నగు నా జంబుమాలిని అతనితోఁ గూడ వచ్చిన రాక్షససైన్యమును భయంకరాకారంబగు నాపరిఘంబుచేతనే చంపితిని. ౧౧౮

రాక్షసేశ్వరుండగు రావణుండు ఆ జంబుమాలి చంపఁబడుటను విని మహాబలశాలురగు మంత్రిపుత్రులను బదాతిసైన్యంబుతోఁ గూర్చి నాపైకిఁ బంపెను. ౧౧౯

నే నంత నా పరిఘంబుచేతనే ఆమంత్రిపుత్రులనందఱను యము నొద్దకుఁ బంపితిని. ౧౨౦

రావణుండు యుద్ధమున శత్రువున కెంతమాత్రము నవకాశమియ్యక పరాక్రమించువారలగు నా మంత్రిపుత్రులు నాచేఁ జంపఁబడిరని విని శూరులగు సేనానాయకుల నయిదుగురం బంపెను. ౧౨౧

నే నంత సేనానాయకుల నైదుగురను వారల సేనలతోఁగూడం జంపి వేసితిని.

అంత దశకంఠుండగు రావణుండు మరల మహాబలుండగు తనకొడుకు నక్షకుమారుని పెక్కురాక్షసులతోఁగూడ నాపైకిఁ బంపెను. ౧౨౨

మందోదరీపుత్రుండును బాలుండును యుద్ధపండితుండు నగు నాయక్షకుమారుండు తటాలున నాకాశంబున కుద్గమింపఁగానే నే నతని పాదములఁ బట్టుకొంటిని. ౧౨౩

చర్మాసినం శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్. ౧౨౪
త మక్షమాగతం భగ్నం నిశమ్య స దశాననః,

తత ఇన్ద్రజితం నామ ద్వితీయం రావణస్సుతమ్. ౧౨౫
వ్యాదిదేశ సుసంక్రుద్ధో బలినం యుద్ధదుర్మదం,

తచ్చాప్యహం బలం సర్వం తం చ రాక్షసపుఙ్గవమ్. ౧౨౬
నష్టౌజసం రణే కృత్వా పరం హర్షముపాగమం,

మహతాపి మహాబాహుః ప్రత్యయేన మహాబలః. ౧౨౭
ప్రేషితో రావణేనైవ సహ వీరైర్మదోత్కటైః,

సోఽవిషహ్యం హి మాం బుద్ధ్వా స్వం బలం చావమర్దితమ్.
బ్రాహ్మేణాస్త్రేణ స తు మాం ప్రాబధ్నాచ్చాతివేగితః,
రజ్జుభిశ్చాభిబధ్నన్తి తతో మాం తత్ర రాక్షసాః. ౧౨౯
రావణస్య సమీపం చ గృహీత్వా మాముపానయన్,
దృష్ట్వా సంభాషితశ్చాహం రావణేన దురాత్మనా. ౧౩౦
పృష్టశ్చ లఙ్కాగమనం రాక్షసానాం చ తం వధం,

తత్సర్వం చ మయా తత్ర సీతార్థమితి జల్పితమ్. ౧౩౧
అస్యాహం దర్శనాకాఙ్క్షీ ప్రాప్తస్త్వద్భవనం విభో.

మారుతస్యౌరసః పుత్రో వానరో హనుమానహమ్. ౧౩౨

రామదూతం చ మాం విద్ధి సుగ్రీవసచివం కపిం,

అట్లు డాలును గత్తియుంగొని యాకాశంబున నుద్గమించిన యా యక్షకుమారుని పాదములుపట్టి నూఱుమాఱులు గిరగిరం ద్రిప్పి నేలం బడవైచి చేతులుఁ గాళ్లు మున్నగునవి కానరాకుండఁ బొడిపొడిగాఁ జేసితిని. ౧౨౪

అంత నక్షకుమారుండు చచ్చుటను విని దశముఖుండగు రావణుండు పరమకోపంబునొంది మరల బలవంతుండును యుద్ధోన్మత్తుండు నగు నింద్రజిత్తను కొడుకును నాపైకిఁ బంపెను. ౧౨౫

నేను అతనితోఁగూడ వచ్చిన సైన్యమునంతయుఁ జంపి రాక్షసశ్రేష్ఠుం డగు నా యింద్రజిత్తును యుద్ధంబున హతంబుఁ గావించి పరమసంతోషంబు నొందినాఁడను. ౧౨౬

రావణుండు మహాబాహుండును మహాబలశాలియు నగు నింద్రజిత్తు ఎట్టయినను వానరుం జంపునని దృఢవిశ్వాసంబున నా యింద్రజిత్తును వీర్యమత్తు లగు రాక్షసవీరులతోఁగూడ నాపైకిఁ బంపెనుగదా! ౧౨౭

ఆయింద్రజిత్తు నేనజేయుండ నగుటయుఁ దనబలంబు నశించుటయుం దెలిసి మహావేగంబున బ్రహ్మాస్త్రంబు వేసి నన్ను బంధించెను. ౧౨౮

అంత నప్పుడు రాక్షసులు నన్నుఁ బగ్గములచే దేహమంతయుబంధించిరి.

అంత నా రాక్షసులు నన్ను రావణునియొద్దకుఁ దీసికొనిపోయిరి.

దురాత్ముండగు రావణుండు నన్నుచూచి నాతో సంభాషణంబుఁ జేసినాఁడు. ౧౩౦

రావణుండు "నీవు లంక కేల వచ్చినావు? రాక్షసులనేలచంపినావు?" అని నన్నడిగినాఁడు.

అచ్చట నేను ఇదంతయుం సీతాదేవికొఱకై చేసితినని చెప్పినాను.

రాక్షసరాజవగు రావణుఁడా! నే నీసీతాదేవిం జూడఁగోరియే నీ పట్టణంబగు లంకకు వచ్చినాను.

నేను వాయుదేవుని కుమారుండను. వానరజాతిని. నాపేరు హనుమంతుండని యందురు. ౧౩౧

నేను సుగ్రీవుని యమాత్యుండనియుం రాముని దూతననియుం నెఱుంగుము.

సోఽహం దూత్యేన రామస్య త్వత్సకాశమిహాగతః. ౧౩౩

సుగ్రీవశ్చ మహాతేజాస్స త్వాం కుశలమబ్రవీత్,
[శ్రుణుతోఽపి సమాదేశం యదహం ప్రబ్రవీమి తే,
రాక్షసేశ హరీశస్త్వాం వాక్యమాహ సమాహితమ్.]
ధర్మార్థకామసహితం హితం పథ్యమువాచ చ. ౧౩౪

వసతో ఋశ్యమూకే మే పర్వతే విపులద్రుమే,
రాఘవో రణవిక్రాన్తో మిత్రత్వం సముపాగతః. ౧౩౫
తేన మే కథితం రాజ్ఞా భార్యా మే రక్షసా హృతా,
తత్ర సాహాయ్యమస్మాకం కార్యం సర్వాత్మనా త్వయా. ౧౩౬
మయా చ కథితం తస్మై వాలినశ్చ వధం ప్రతి,
తత్ర సాహాయ్యహేతోర్మే సమయం కర్తుమర్హసి. ౧౩౭

వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ మహాప్రభుః,
చక్రేఽగ్నిసాక్షికం సఖ్యం రాఘవస్సహలక్ష్మణః. ౧౩౮
తేన వాలినముత్పాట్య శరేణైకేన సంయుగే,
వానరాణాం మహారాజః కృతస్స ప్లవతాం ప్రభుః. ౧౩౯
తస్య సాహాయ్యమస్మాభిః కార్యం సర్వాత్మనా త్విహ,
తేన ప్రస్థాపితస్తుభ్యం సమీప మిహ ధర్మతః. ౧౪౦
క్షిప్రమానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ,
యావన్న హరయో వీరా విధమన్తి బలం తవ. ౧౪౧
వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా,
దేవతానాం సకాశం చ యే గచ్ఛన్తి నిమన్త్రితాః. ౧౪౨

నేను రాముండు సందేశంబుఁ జెప్పి పంపఁగా దానిం జెల్పుటకై ఇచ్చుటకై నీయొద్దకు వచ్చినాను. ౧౩౩

మహాపరాక్రమశాలియగు సుగ్రీవుండు నీకు క్షేమమును జెప్ప మన్నాఁడు. [సుగ్రీవుఁడు నీకొకమాటను జెప్పుమన్నాఁడు. నెమ్మదితో దానిని వినుము.]

మఱియుం ధర్మార్థకామంబుల మూఁడింటిని కలిగించునదియుం హితంబును మేలొనరించునదియుం నగు నీమాటను నీకుఁ జెప్పుమనెను. ౧౩౪

అధికవృక్షంబులుగల ఋశ్యమూకపర్వతంబునందు నేను నివసించియుండఁగా యుద్ధవిశారదుండగు రామునకును నాకును స్నేహము గలిగినది.

"నాభార్యను రాక్షసుఁ డొకఁ డపహరించినాఁడు. వాని వధించి నా భార్యను దీసికొని వచ్చుటయందు నీవు సమస్తవిధంబులను మాకు సహాయ్యంబు సేయవలయును" అని రాముండు న న్నడిగెను. ౧౩౬

అంత నేను ఆరామునకు, నాకును వాలికినింగల విరోధంబుఁ జెప్పి వాలింజంపు విషయమయి నీవు నాకు సాహాయ్యంబుఁ జేసెదనని ప్రతిజ్ఞ సేయవలయుఁనని యడిగితిని. ౧౩౭

అంత మహారాజగు రాముండు లక్ష్మణునితోడంగూడ వాలిచే రాజ్యము నపహరించి తఱిమికొట్టఁబడిననాతో నగ్నిసాక్షికముగా స్నేహముచేసెను.

అంత రాముండు యుద్ధమున వాలి నొక్క బాణంబునం జంపి వానరశ్రేష్ఠుండనగు నన్ను వానరులకు రాజునుగాఁ జేసెను. ౧౩౯

ఈవిషయమున మేము రామున కవశ్యము సాహాయ్యము సేయవలయును. కావున ధర్మంబు ననుసరించి నీదగ్గఱ కీదూతం బంపినాను. ౧౪౦

పరాక్రమవంతులగు వానరులు నీపట్టణముమీఁది కెత్తివచ్చి నీసైన్యముఁ జంపుటకుమున్నె నీవు శీఘ్రముగా సీతం దెచ్చి రామున కొసంగుము. ౧౪౧

సాహాయ్యార్థ మాహూతులయిపోయి దేవతలకుంగూడ సాహాయ్యము చేసి జయము గొనునట్టి వానరవీరుల ప్రభావముఁ దెలియనివాఁ డెవ్వఁడు? నీకునుం దెలియును. ౧౪౨

ఇతి వానరరాజ స్త్వామాహేత్యభిహితో మయా,

మామైక్షత తతః క్రుద్ధశ్చక్షుషా ప్రదహన్నివ. ౧౪౩

తేన వధ్యోఽహమాజ్ఞప్తో రక్షసా రౌద్రకర్మణా,
మత్ప్రభావమవిజ్ఞాయ రావణేన దురాత్మనా. ౧౪౪
తతో విభీషణో నామ తస్య భ్రాతా మహామతిః,

తేన రాక్షసరాజోఽసౌ యాచితో మమ కారణాత్. ౧౪౫

నైవం రాక్షసశార్దూల త్యజ్యతామేష నిశ్చయః,

రాజశాస్త్రవ్యపేతో హి మార్గస్సంసేవ్యతే త్వయా. ౧౪౬

దూతవధ్యా న దృష్టా హి రాజశాస్త్రేషు రాక్షస,

దూతేన వేదితవ్యం చ యథార్థం హితవాదినా. ౧౪౭

సుమహత్యపరాధేఽపి దూతస్యాతులవిక్రమ,
విరూపకరణం దృష్టం న వధోఽస్తీతి శాస్త్రతః. ౧౪౮

విభీషణేనైవముక్తో రావణస్సందిదేశ తాన్,
రాక్షసానేతదేవాస్య లాఙ్గూలం దహ్యతామితి. ౧౪౯
తతస్తస్య వచశ్శ్రుత్వా మమ పుచ్ఛం సమన్తతః,
వేష్టితం శణవల్కైశ్చ జీర్ణైః కార్పాసజైః పటైః. ౧౫౦

ఇట్లు నీతోఁ జెప్పుమని వానరరాజగు సుగ్రీవుండు చెప్పినాఁడు అని నే నారావణునకుం జెప్పితిని.

అంత నా రావణుండు కోపంబునొంది నేత్రముల కెఱ్ఱదనము గదురఁ నన్ను దహించునట్లు చుఱచుఱం జూచెను. ౧౪౩

భయంకరములగు కార్యములు చేయువాఁడును దురాత్ముండు నగు నా రావణుండు అంత ప్రభావము నెఱుంగక నన్ను వధింప నాజ్ఞాపించెను. ౧౪౪

అచ్చట రావణునితమ్ముఁడు మహాబుద్ధిశాలి విభీషణుండనువాఁ డొకం డుండెను.

ఆవిభీషణుండు నానిమిత్తమయి రాక్షసరాజగు రావణు నిట్లని ప్రార్థించి నాఁడు. ౧౪౫

రాక్షసశ్రేష్ఠుండవగు రావణుఁడా ! ఇట్టిదెంతమాత్రము చేయరాదు. ఈనిశ్చయంబును వదలుము.

నీ విప్పుడు చేయఁదలంచినది రాజధర్మశాస్త్రమునకు విరుద్ధము. కావున నిట్లు చేయరాదు. ౧౪౬

రాక్షసుండవగు రావణుఁడా ! రాజధర్మశాస్త్రంబులం దెచ్చటను దూతం జంపవచ్చునని చెప్పియుండలేదు.

హితవాదియగు దూత తనప్రభువు చెప్పి పంపిన మాటలను యథార్థ ముగా నవశ్యము చెప్పవలసినది. ౧౪౭

సరిలేని పరాక్రమము గలవాఁడవగు రావణుఁడా ! దూత యెట్టియప రాధము కావించినను ఆతని కంగవికారములు చేయవచ్చుంగాని యతనిం జంపఁగూడదని శాస్త్రంబులఁ జెప్పఁబడుచున్నది. అని విభీషణుండు రావణుం బ్రార్థించినాఁడు. ౧౪౮

విభీషణుండు చెప్పినమాటను విని రావణుండు ఇతనితోఁకను దహించి వేయుండు. అని యారాక్షసుల కాజ్ఞాపించెను. ౧౪౯

అంత రావణునిమాటను విని రాక్షసులు జనపనారచీరలను జిలిఁగిన గుడ్డపేలికలనుం దెచ్చి నాతోఁకకంతటనుం జుట్టిరి. ౧౫౦

రాక్షసాస్సిద్ధసన్నాహాస్తతస్తే చణ్డవిక్రమాః,
తదాఽదహ్యన్త మే పుచ్ఛం నిఘ్నన్తః కాష్ఠముష్టిభిః. ౧౫౧
బద్ధస్య బహుభిః పాశైర్యన్త్రితస్య చ రాక్షసైః,
[న మే పీడా భవేత్కాచిద్దిదృక్షోర్నగరీం దివా]

తతస్తే రాక్షసాశ్శూరా బద్ధం మామగ్నిసంవృతమ్. ౧౫౨
అఘోషయన్రాజమార్గే నగరద్వారమాగతాః,

తతోఽహం సుమహద్రూపం సంక్షిప్య పునరాత్మనః. ౧౫౩
విమోచయిత్వా తం బన్ధం ప్రకృతిస్థః స్థితః పునః,

ఆయసం పరిఘం గృహ్య తాని రక్షాంస్యసూదయమ్. ౧౫౪
తతస్తన్నగరద్వారం వేగేనాప్లుతవానహం,
పుచ్ఛేన చ ప్రదీప్తేన తాం పురీం సాట్టగోపురామ్. ౧౫౫
దహామ్యహమసంభ్రాన్తో యుగాన్తాగ్నిరివ ప్రజాః,
[తతో మే హ్యభవత్త్రాసో లఙ్కాం దగ్ధాం సమీక్ష్య తు]
వినష్టా జానకీ వ్యక్తం న హ్యదగ్ధః ప్రదృశ్యతే. ౧౫౬
లఙ్కాయాం కశ్చిదుద్దేశస్సర్వా భస్మీకృతా పురీ,

దహతా చ మయా లఙ్కాం దగ్ధా సీతా న సంశయః. ౧౫౭

రామస్య హి మహత్కార్యం మయేదం వితథీకృతం,
ఇతి శోకసమావిష్టశ్చిన్తామహముపాగతః. ౧౫౮
అథాహం వాచమశ్రౌషం చారణానాం శుభాక్షరాం,
జానకీ న చ దగ్ధేతి విస్మయోదన్తభాషిణామ్. ౧౫౯

అంత నప్పుడు భయంకరపరాక్రములగు నారాక్షసులు సన్నద్ధులై పెక్కు పగ్గంబుల బంధింపఁబడియుఁ బెక్కురాక్షసులచేఁ బట్టుకొనఁబడి యున్న నన్నుఁ గొయ్యలచేఁ గొట్టుచుఁ బిడికిళ్లం బొడుచుచు నాతోఁకను నిప్పు ముట్టించిరి. [కాని నగరదర్శనకుతూహలినైన నాకది నొవ్వొదవింప దయ్యెను.] ౧౫౧

అంత శూరులగు నా రాక్షసులు నన్నుఁ దీసికొని పట్టణద్వారంబునకు వచ్చి యచ్చట రాజమార్గమున నేను బంధింపఁబడుటయుం నాతోఁకకు నిప్పు ముట్టించుటయు నందఱకుం దెలియునట్లుగ గట్టిగా నఱచి చెప్పిరి. ౧౫౨

అంత నేను నా పెద్దయాకారమును మిక్కిలియుఁ జిన్నదిగాఁజేసికొని యాబంధంబుల వదలించుకొని మరల నెప్పటియట్లు, పర్వతాకారుండనై యచ్చటనుండు నొక్కయినుపగుదియందీసి యా రాక్షసులం జంపితిని.

అంత నేను వేగమున నాపట్టణద్వారముమీఁదికి దుమికితిని. ౧౫౪

అంతఁ బ్రళయకాలాగ్నిహోత్రుండు ప్రజల దహించునట్లు నేను అసంభ్రాంతుండనై మండిపడుచున్న లాంగూలంబులచే బురుజులతోను బహిర్ద్వారంబులతోఁగూడిన యా లంకాపట్టణంబు నంతయుం దహించితిని. [లంక కాలఁగానే నాకొక భయము కల్గినది.] ౧౫౫

అయ్యో! సీతాదేవి నిప్పులోఁబడి నశించినదేమో? లంకయందు ఒక్కప్రదేశమయినను దహింపఁబడకుండలేదే? పట్టణంబంతయు నీఱయినదే సీతకేమి గల్గినదో? ౧౫౬

నేను లంకాపట్టణమును దహించుచు సీతాదేవింగూడ దహించి యుందును. ఇందు సంశయముండదు. ౧౫౭

గొప్పదగు రాముని కార్యంబునంతయుం నేఁ జెఱచితిని.

ఇట్లు నేను దుఃఖాక్రాంతుండనై చింతనొందితిని. ౧౫౮

అంత నేను ఆకాశమున "సీతాదేవి దహింపఁబడలే"దని యాశ్చర్యమునం జారణులు చెప్పుకొను మంగళకరంబగు మాటను వింటిని. ౧౫౯

తతో మే బుద్ధిరుత్పన్నా శ్రుత్వా తామద్భుతాం గిరం,

అదగ్ధా జానకీత్యేవం నిమిత్తైశ్చోపలక్షితా. ౧౬౦

దీప్యమానే తు లాఙ్గూలే న మాం దహతి పావకః,
హృదయం చ ప్రహృష్టం మే వాతాస్సురభిగన్ధినః. ౧౬౧

తైర్నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః,
ఋషివాక్యైశ్చ సిద్ధార్థైరభవం హృష్టమానసః. ౧౬౨

పునర్దృష్ట్వా చ వైదేహీం విసృష్టశ్చ తయా పునః,
తతః పర్వతమాసాద్య తత్రారిష్టమహం పునః. ౧౬౩

ప్రతిప్లవనమారేభే యుష్మద్దర్శనకాఙ్క్షయా,
తతః పవనచన్ద్రార్కసిద్ధగన్ధర్వసేవితమ్. ౧౬౪

పన్థానమహమాక్రమ్య భవతో దృష్టవానిహ,
రాఘవస్య ప్రభావేన భవతాం చైవ తేజసా. ౧౬౫
సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వమనుష్ఠితం,
ఏతత్సర్వం మయా తత్ర యథావదుపపాదితమ్. ౧౬౬
అత్ర యన్న కృతం శేషం తత్సర్వం క్రియతామితి.

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - అష్టపఞ్చాశస్సర్గః

ఆశ్చర్యకరంబగు సాచారణులమాటను విన్నపిమ్మట నాకు సీతాదేవి దహింపలేదని తెలిసినది.

శుభనిమిత్తంబులచేతనుం గూడ సీతాదేవి దహింపఁబడలేదని తెలిసి కొంటిని. ౧౯౦

నాతోఁక మండుచున్నను అగ్నిహోత్రము నన్ను ఎంతమాత్రము దహింపకున్నది. మఱియుం నామనను సంతుష్టం బైయున్నది. వాయువు సుగంధియై వీచుచున్నది. ౧౯౧

పెక్కుమాఱులు సఫలంబులయిన యాశుభనిమిత్తంబులచేతను అట్లు తప్పక ఫలమునొసంగునట్టి నేత్రస్ఫురణాదికరనిమిత్తములచేతను సత్యములగు చారణవాక్యములచేతను దుఃఖంబు విడిచి నేను సంతోషంబు నొందితిని.

అంత నేను మరల సీతాదేవింజూచి యామెదయనుజ్ఞ నొందితిని.

అంత నేను అలంకయందుండు నరిష్టపర్వతంబు నెక్కి మిమ్ముఁ జూడఁ గోరి మరల సముద్రంబు దాఁటితిని. ౧౯౩

అట్లు వాయువుచేతను జంద్రసూర్యులచేతను సిద్ధులచేతను గంధర్వుల చేతను సేవింపఁ బడుచుండునట్టి యాకాశమార్గంబున వచ్చి యిచ్చటనుండు మిమ్ములం జూచితిని. ౧౯౪

శ్రీరాముని ప్రభావంబువలనను మీ యనుగ్రహబలంబునను నేను సుగ్రీవుని కార్యంబునంతయుం జేసితిని. ౧౯౫

ఆచ్చట ఈకార్యంబులనంతయుం నేను యథాయుక్తముగనే చేసితిని. ఇంక నిప్పు డేమి చేయవలసియున్నదో దానినంతయుం జేయవలయునని కోరెదను. అని హనుమంతుండు వానరులకుం జెప్పెను. ౧౯౬

యేఁబదియెనిమిదవ సర్గము.

---

## ఏ కో న ష ష్టి త మ స్స ర్గః

ఏతదాఖ్యాయ తత్సర్వం హనుమాన్మారుతాత్మజః,
భూయస్సముపచక్రామ వచనం వక్తుముత్తరమ్. ౧
సఫలో రాఘవోద్యోగస్సుగ్రీవస్య చ సంభ్రమః,
శీలమాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః. ౨
[ఆర్యాయాస్సదృశం శీలం సీతాయాః ప్లవగర్షభాః]

తపసా నిర్దహేల్లోకాన్క్రుద్ధో వా నిర్దహేదపి,
సర్వథాతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః. ౩
తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్,

న తదగ్నిశిఖా కుర్యాత్సంస్పృష్టా పాణినా సతీ. ౪
జనకస్యాత్మజా కుర్యాద్యత్క్రోధకలుషీకృతా,

జామ్బవత్ప్రముఖాన్ సర్వాననుజ్ఞాప్య మహాహరీన్. ౫
అస్మిన్నేవం గతే కార్యే భవతాం చ నివేదితే,
న్యాయ్యం స్మ సహ వైదేహ్యా ద్రష్టుం తౌ పార్థివాత్మజౌ. ౬

అహమేకోఽపి పర్యాప్తస్సరాక్షసగణాం పురీం,
తాం లఙ్కాం తరసా హన్తుం రావణం చ మహాబలమ్. ౭

కిం పునస్సహితో వీరైర్బలవద్భిః కృతాత్మభిః,
కృతాస్త్రైః ప్లవగైశ్శూరైర్భవద్భిర్విజయైషిభిః. ౮

## ఏఁబదితొమ్మిదవ సర్గము

వాయుఁదేవుని కుమారుండగు హనుమంతుండు తాను సీతం జూచిన వృత్తాంతమంతయుఁ జెప్పి మరల నామైమాటను జెప్ప నారంభించెను. ౧

సీతాదేవి మహాపతివ్రతగా నున్నది గావున రామునిప్రయత్నమును సుగ్రీవునియుత్సాహమును సఫలములగును. ఆమెనైజమును జూచినది మొదలు నామనస్సు ఆసీతాదేవియం దధికభక్తినొందియున్నది. [వానరోత్తములారా! సీతకు రూపమునకుఁ దగిన యుత్తమశీలముకూడ నున్నదయ్యా!] ౨

రాక్షసేశ్వరుండగు రావణుండు తపస్సుచే సమస్తలోకములను దహింపఁ గలండు. అన్నివిధంబులను అతండు మహాతపస్వి. ౩

కావుననే యీరావణుండు మహాపతివ్రతయగు సీతాదేవిం దాఁకినను మహాతపస్వి యగుటంజేసి నాశము నొందకున్నాఁడు.

పతివ్రతయగు సీతాదేవిని దాఁకినచో నాబిడ కుపితయయి దహించునట్లు అగ్నిజ్వాలయుంగూడ దహింపఁజాలదు. అట్లే తనభర్తచేతనే రావణుం జంపించవలయునని వీరపత్నిధర్మం బవలంబించి రావణుమీఁదఁ గోపింపకుండుటచేతనే రావణుండు జీవించియున్నాఁడు గాని వేఱుగాదు. ౪

ఇదివఱకుఁ జేసినకార్యమును మీకుఁ జెప్పి జాంబవంతుఁడు మున్నగు మిమ్ముల నొప్పించి మీతోఁగూడ మరల నచ్చటికిఁ బోదమని తలఁచి వచ్చితిని. సీతాదేవిం దీసికొని యాబిడతోఁగూడ రాజపుత్రులగు రామలక్ష్మణులం జూచుట యుత్తమని నాయభిప్రాయము. ౫,౬.

నే నొక్కండనైనను లంకయందలి రాక్షసుల నందఱను మహాబలుండగు రావణుని వేగంబునం జంపఁజాలుదును. ౭

ఇంక పరాక్రమవంతులును బలవంతులును బుద్ధిమంతులును నస్త్రములు దెలిసినవారలును శూరులును జయముఁ గోరువారలు నగు మీతోఁ గూడి యుండఁగా నేను లంకలోని రాక్షసులను, రావణుని జంపఁగలనని చెప్పనేల?

అహం తు రావణం యుద్ధే ససైన్యం స పురస్సరం,
సహపుత్త్రం వధిష్యామి సహోదరయుతం యుధి. ౯
బ్రాహ్మమైన్ద్రంచ రౌద్రం చ వాయవ్యం వారుణం తథా,
యది శక్రజితోఽస్త్రాణి దుర్నిరీక్షాణి సంయుగే. ౧౦
తాన్యహం విధమిష్యామి హనిష్యామి చ రాక్షసాన్,
భవతామభ్యనుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి తమ్. ౧౧

మయాతులా విసృష్టా హి శైలవృష్టిర్నిరన్తరా,
దేవానపి రణే హన్యాత్కిం పున స్తాన్నిశాచరాన్. ౧౨
[భవతా మననుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి మాం]
సాగరోఽప్యతియాద్వేలాం మన్దరః ప్రచలేదపి,
న జామ్బవన్తం సమరే కమ్పయేదరివాహినీ. ౧౩

సర్వరాక్షససఙ్ఘానాం రాక్షసా యే చ పూర్వకాః,
అలమేకో వినాశాయ వీరో వాలిసుతః కపిః. ౧౪
పనసస్యోరువేగేన నీలస్య చ మహాత్మనః,
మన్దరోఽప్యవశీర్యేత కిం పునర్యుధి రాక్షసాః. ౧౫
సదేవాసురయక్షేషు గన్ధర్వోరగపక్షిషు,
మైన్దస్య ప్రతియోద్ధారం శంసత ద్వివిదస్య వా. ౧౬

అశ్విపుత్త్రౌ మహాభాగావేతౌ ప్లవగసత్తమౌ,
ఏతయోః ప్రతియోద్ధారం న పశ్యామి రణాజిరే. ౧౭
పితామహవరోత్సేకాత్పరమం దర్పమాస్థితౌ,
అమృతప్రాశనావేతౌ సర్వవానరసత్తమౌ. ౧౮

న్నే నొక్కఁడనె రావణుని నతని సైన్యములను అనుచరులను గొడుకులను దోఁబుట్టువులను అందఱను యుద్ధమున జంపెదను. ౯

ఇంద్రజిత్తు యుద్ధమునఁ దేఱిచూడ నలవిగానట్టు బ్రహ్మాస్త్రమునుగానీ ఐంద్రాస్త్రమునుగానీ రౌద్రాస్త్రమునుగాని వాయవ్యాస్త్రమునుగానీ వారుణాస్త్రమునుగానీ ప్రయోగించినను నే నాయస్త్రము లన్నింటిని గొట్టివేసి రాక్షసులం జంపెదను. ౧౦

మీరు అనుజ్ఞయొసంగినచోఁ బరాక్రమమున నాయింద్రజిత్తునుగూడ జయింపఁగలను. ౧౧

యుద్ధమున నేను కురిపించినట్టి సాంద్రంబగు శైలవర్షముచే నమృతము ద్రావియున్న దేవతలైనను బ్రాణములు విడుతురు. ఇంక నీ రాక్షసులు చత్తురని చెప్పనేల? [కాని మీ ప్రోద్బలములేనిదే నా విక్రమము పాఱదు.]

ఒకవేళ సముద్రము చెలియలికట్ట నతిక్రమించినను అతిక్రమించును మందరపర్వతంబైనను జలనము నొందును. జాంబవంతుండు మాత్రము శత్రుసైన్యములకు వెనుదీయఁడు. ౧౩

రాక్షససైన్యముల నన్నింటిని వారలలో ముఖ్యులగు వారలనందఱిపుం జంపుటకు వీరుండగు వాలికుమారుం డంగదుం డొకండె చాలును. ౧౪

మహాబలశాలులగు పనస నీలుల యూరువేగమున మందరపర్వతంబైనను నశించును. ఇంక నీరాక్షసులు వధింపఁబడుదురని చెప్పనేల? ౧౫

దేవతలయందుఁగానీ యసురులయందుఁగానీ యక్షులయందుఁగానీ గంధర్వులయందుఁగానీ సర్పములయందుఁగానీ పక్షులయందుఁగానీ మైంద ద్వివిదులతో సరిగాఁ బోరువాఁ డెవ్వఁడు? వచింపుఁడు. ౧౬

వానరశ్రేష్ఠులగు నీ మైందద్వివిదులు అశ్వినీదేవతలకుఁ బుట్టినవారలు. మహాభాగులు యుద్ధభూమియందు వీరలతో సరిగాఁ బోరువారలెవ్వరును లేరు.

ఈ మైందద్వివిదు లిద్దఱును బ్రహ్మదేవుని వరంబునొంది యతిగర్వితులయి యున్నవారు. మఱియుం నమృతముం గూడ భుజించి యున్నవారు. వానరులందఱిలోను శ్రేష్ఠులం. ౧౭

అశ్వినోర్మాననార్థం హి సర్వలోకపితామహః,
సర్వావధ్యత్వమతులమనయోర్దత్తవాన్పురా. ౧౯

వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూం,
సురాణామమృతం వీరౌ పీతవన్తౌ ప్లవఙ్గమౌ. ౨౦
ఏతావేవ హి సంక్రుద్ధౌ సవాజిరథకుఞ్జరాం,
లఙ్కాం నాశయితుం శక్తౌ సర్వే తిష్ఠన్తు వానరాః. ౨౧

మయైవ నిహతా లఙ్కా దగ్ధా భస్మీకృతా పునః,
రాజమార్గేషు సర్వత్ర నామ విశ్రావితం మయా. ౨౨
జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః,
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః. ౨౩
అహం కోసలరాజస్య దాసః పవనసమ్భవః,
హనుమానితి సర్వత్ర నామ విశ్రావితం మయా. ౨౪

అశోకవనికామధ్యే రావణస్య దురాత్మనః,
అధస్తాచ్ఛింశుపావృక్షే సాధ్వీ కరుణమాస్థితా. ౨౫
రాక్షసీభిః పరివృతా శోకసన్తాపకర్శితా,
మేఘలేఖాపరివృతా చన్ద్రలేఖేవ నిష్ప్రభా. ౨౬

అచిన్తయన్తీ వైదేహీ రావణం బలదర్పితం,
పతివ్రతా చ సుశ్రోణీ అవష్టబ్ధా చ జానకీ. ౨౭
అనురక్తా హి వైదేహీ రామం సర్వాత్మనా శుభా,
అనన్యచిత్తా రామే చ పౌలోమీవ పురన్దరే. ౨౮

బ్రహ్మదేవుండు మున్ను మైందద్వివిదుల తండ్రులగు నశ్వినీదేవతలకు సంతోషంబు గల్గుటకై ఈమైందద్వివిదులకు ఎవ్వరిచేతనైనం జంపుట కలవి గాకుండునట్లు వరం బొసంగెను. ౧౯

పరాక్రమవంతులగు నీమైందద్వివిదులు అట్లు వరగర్వంబున మదించి యెదురులేక గొప్పసేనలం జించి చెండాడి దేవతలయమృతంబుఁ ద్రావినారు.

వానరుల నందఱ నట్లుండ నిమ్ము. ఈమైందద్వివిదు లిద్దఱే కుపితులయి రావణసైన్యంబుల నన్నింటిఁ జంపి లంకాపురినంతయు నాశంబు నొందింపం జాలుదురు. ౨౧

నేనే లంకాపట్టణంబంతయు దహించి బూడిదగాఁ జేసితిని. రాజమార్గంబులం దంతటను పేరు అందఱికిఁ దెలియునట్లు చాటించినాను. ౨౨

మహాబలుండగు రాముఁడు సర్వోత్కృష్టుఁడై యున్నాఁడు. మహాబలుఁడగు లక్ష్మణుఁడును సర్వోత్కృష్టుఁడై యున్నాఁడు. వానరరాజును, రామునిచేఁ గాపాడఁబడుచున్నవాఁడు నగుసుగ్రీవుండును సర్వోత్కృష్టుఁడై యున్నాఁడు. నేను గోసలదేశరాజగు రామునకు దాసుఁడను, వాయుపుత్రుఁడను, హనుమంతుండను పేరుగలవాఁడను. అని లంకయం దంతటను పేరు చాటించితిని. ౨౩, ౨౪

పతివ్రతయగు సీతాదేవి దురాత్ముఁడగు రావణుని యశోకవనంబున శింశుపావృక్షంబుక్రింద రాక్షసస్త్రీలనడుమ దుఃఖసంతాపంబులం బొక్కుచుఁ గృశించి మేఘావృతంబగు చంద్రరేఖవలెఁ గాంతిహీనయై బలగర్వితుండగు రావణుని మనసునసైనం దలంపక రాముని ధ్యానింపుచు నుండుటం జూడఁగా మిక్కిలి దుఃఖము గలుగుచున్నది. ౨౫, ౨౬

పతివ్రతయు సుందరములగు పిఱుఁదులు గలది నగుసీతాదేవి రావణునిచే నెంత నిర్బంధింపఁబడినను మనసునంతయు నేకరీతిగా రామునందె చేర్చి యతనియందె యనురాగము గల్గియున్నది. మఱియు నహుషుఁ డెంత నిర్బంధించినను శచీదేవి యతనిపై మనసు నుంచనట్లు రావణుం డెంతనిర్బం

తదేకవాససంవీతా రజోధ్వస్తా తథైవ చ,
శోకసన్తాపదీనాఙ్గీ సీతా భర్తృహితే రతా. ౨౯
సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః,
రాక్షసీభిర్విరూపాభిర్దృష్టా హి ప్రమదావనే. ౩౦
ఏకవేణీధరా దీనా భర్తృచిన్తాపరాయణా,
అధశ్శయ్యా వివర్ణాఙ్గీ పద్మినీవ హిమాగమే. ౩౧
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా,
కథంచిన్మృగశాబాక్షీ విశ్వాసముపపాదితా. ౩౨
తతస్సంభాషితా చైవ సర్వమర్థం చ దర్శితా,
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా. ౩౩

నియతస్సముదాచారో భక్తిర్భర్తరి చోత్తమా,

యన్న హన్తి దశగ్రీవం స మహాత్మా కృతాగసమ్. ౩౪

నిమిత్తమాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి,

సా ప్రకృత్యైవ తన్వఙ్గీ తద్వియోగాచ్చ కర్శితా. ౩౫
ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా,

ఏవమాస్తే మహాభాగా సీతా శోకపరాయణా. ౩౬

ధించినను సీతాదేవి యతనిపై నెంతమాత్రము మనసునుంచక యితరంబు విడిచి మనంబున రాముని ధ్యానింపుచున్నది. ౨౭, ౨౮

సీతాదేవి యొక్కవస్త్రమునే విడువక కట్టుకొని దేహమంతయుం దుమ్ము నిండఁ బరమదుఃఖితయయి భర్తృహితంబుఁ గోరుచున్నది. ౨౯

సీతాదేవి రావణుని యశోకవనంబున రాక్షసస్త్రీలనడుమ వికృతాకారలగు రాక్షసస్త్రీలచే బెదరింపఁబడుచు నొక్కటే జడగాఁగట్టిన తలవెంట్రుకలతో దైన్యంబునొంది మనసునఁ బెనిమిటి యగురామునే ధ్యానించుచు పద్మినివలెఁ గాంతిహీనయయి రావణునియందు మనంబుచేర్చక మరణంబునొంద నిశ్చయించియుండునప్పుడు నేను చూచితినిగదా. ౩౦, ౩౧

జింకపిల్లకుంబోలె నేత్రంబులుగల యాసీతాదేవికి అతిప్రయాసమున 'నేను రాముండు పంపఁగా వచ్చినదూత' నని చెప్పి నమ్మకంబు కలిగించినాను.

అంత నే నాబిడతో మాటలాడి సమాచారంబంతయుఁ జెప్పితిని. ఆబిడ రామునకు సుగ్రీవునకును స్నేహంబు గలుగుటను విని సంతోషంబు నొందినది. ౩౩

సీతయందు సదాచారము నిత్యముగా నున్నది. భర్తయం దుత్తమమయిన భక్తి గలదు.

రావణుండు మహాపరాధము గావించినను సీతాదేవి యతనిం జంపివేయకున్నది. కావున నారావణుండు మహానుభావుఁడు. ౩౪

ఆరావణుని తపస్సంతయుం సీతాదేవిని నిర్బంధించుటచేతనే నశించియున్నను ఇంక నతనిజంప రాముండు నిమిత్తమాత్రముగా నుండవలసినదే కాని యొంతమాత్రము కష్టములేదు.

స్వభావంబుననే కృశాంగియగు నాసీతాదేవి యారామవియోగంబున మఱియుం గృశయయి పాడ్యమినాఁడు చదువుచాని విద్య క్షీణించునట్లు కృశించియున్నది. ౩౫

మహాభాగురాలగు సీతాదేవి యీప్రకారము పరమదుఃఖితయయి యున్నది. ౩౬

యదత్ర ప్రతికర్తవ్యం తత్సర్వముపపద్యతామ్. 3౬౪

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకోనషష్టితమస్సర్గః.

## షష్టితమస్సర్గః.

తస్య తద్వచనం శ్రుత్వా వాలిసూనురభాషత,
[అహమేకో హి పర్యాప్తః సరాక్షసగణాం పురీం,
తాం లఙ్కాం తరసా హన్తుం రావణం చ మహాబలమ్.
కింపునస్సహితైర్వీరైర్బలవద్భిః కృతాత్మభిః,
కృతాస్త్రైః ప్లవగైశ్శక్తైర్భవద్భిర్విజయైషిభిః.
వాయుసూనోర్బలేనైవ దగ్ధా లఙ్కేతి నశ్శ్రుతం]
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః. ౧
సమీపం గన్తుమస్మాభీ రాఘవస్య మహాత్మనః,
దృష్టా దేవీ న చాఽఽనీతా ఇతి తత్ర నివేదనమ్. ౨
అయుక్తమివ పశ్యామి భవద్భిః ఖ్యాతవిక్రమైః,

న హి నః ప్లవనే కశ్చిన్నాపి కశ్చిత్పరాక్రమే. 3
తుల్యస్సామరదైత్యేషు లోకేషు హరిసత్తమాః,
[జిత్వా లఙ్కాం సరక్షోఘాం హత్వా తం రావణం రణే,
సీతామాదాయ గచ్ఛామస్సిద్ధార్థా హృష్టమానసాః]
తేష్వేవం హతవీరేషు రాక్షసేషు హనూమతా. ౪
కిమన్యదత్ర కర్తవ్యం గృహీత్వా యామ జానకీం,
[రామలక్ష్మణయోర్మధ్యే న్యస్యామ జనకాత్మజాం,
కిం వ్యలీకైస్తు తాన్ సర్వాన్ వానరాన్వానరర్షభాన్.
వయమేవ హి గత్వా తాన్హత్వా రాక్షసపుంగవాన్,

ఇఁక దీనికి ఏమి ప్రతీకారంబు సేయవలయునో దాని నంతయుఁ జేయుండు. అని హనుమంతుండు వానరులకుం జెప్పెను.

ఇది యేఁబదితొమ్మిదవ సర్గము.

## ఆ రు వ ద వ స ర్గ ము

ఆహనుమంతుని మాటను విని వాలికుమారుం డగునంగదుండు ఇట్లని చెప్పెను. [రావణుం జంపి లంకను పాడొనర్చు టనఁగా నెంతపని? అందుకు నేన చాలుదును. ఇఁక మీయందఱితోఁ గలసి పోయితినేని చెప్పవలసినదేమి? ఒక యాంజనేయుఁడే లంకనంతయుఁ గాల్చివచ్చెఁగదా?

వానరులారా! మనము సీతాదేవిం జూచియుం నాబిడను దీసికొనక మహాత్ముండగు రామునొద్దకుఁ బోవుటమాత్రము యుక్తముకాదు. ౧

మీరలు మహాపరాక్రమశాలురని వినుతికెక్కి యిప్పుడు సీతాదేవిం జూచితిమిగాని యిచ్చటికిఁ దీసికొనిరాలేదు. అని రామసన్నిధానంబునం జెప్పుట యుక్తముకాదని నాకుం దోఁచుచున్నది. ౨

వానరశ్రేష్ఠులారా! దేవతలయందుఁ గాని దైత్యులయందుఁ గాని యట్లు సమస్తలోకంబులందుఁగాని ఆకాశగమనంబునందుఁ బరాక్రమంబునం గాని మనకు సమానుం డెవ్వండును లేఁడు. [కావున లంకను వశముచేసికొని రావణునిఁ గూల్చి సీతను దీసికొని కార్యము నెఱవేర్చుకొని సంతోషములో రాము నొద్దకుఁ బోదము.] 3

ఇట్లు హనుమంతుండు ఆరాక్షసులలో వీరులగువారినందఱిం జంపిన వెనుక మనకింకేమి చేయవలసియున్నది. సీతాదేవిని దీసికొనిపోవుదము. [సీతను గొనిపోయి రామలక్ష్మణులచెంతఁ జేర్చుదము. ఎందుకయ్యా వేయిశంకలు? మనమే వెళ్ళి రాక్షసులతో రావణుంటఁ జంపి రామలక్ష్మణసుగ్రీవులను తక్కిన వానరప్రవరులను చూడవలసినదేకాని వేఱుకాదు] అని యంగదుండు చెప్పెను.

రాఘవం ద్రష్టుమర్హామః సుగ్రీవం సహలక్ష్మణమ్]
తమేవం కృతసఙ్కల్పం జామ్బవాన్హరిసత్తమః. ౫
ఉవాచ పరమప్రీతో వాక్యమర్థవదర్థవిత్,
[నైషా బుద్ధిర్మహాబుద్ధే యద్బ్రవీషి మహాకపే,
విచేతుం వయమాజ్ఞప్తా దక్షిణాం దిశముత్తమామ్.
నానేతుం కపిరాజేన నైవ రామేణ ధీమతా,
కథంచిన్నిర్జితాం సీతామస్మాభిర్నాభిరోచయేత్,
రాఘవో నృపశార్దూలః కులం వ్యపదిశన్ స్వకం,
ప్రతిజ్ఞాయ స్వయం రాజా సీతావిజయమగ్రతః,
సర్వేషాం కపిముఖ్యానాం కథం మిథ్యా కరిష్యతి,
విఫలం కర్మ చ కృతం భవేత్తుష్టిర్న రస్య చ
వృథా చ దర్శితం వీర్యం భవేద్వానరపుంగవాః,
తస్మాద్గచ్ఛామ వై సర్వే యత్ర రామస్సలక్ష్మణః,
సుగ్రీవశ్చ మహాతేజాః కార్యస్యాస్య నివేదనే]

న తావదేషా మతిరక్షమా నో యథా భవాన్పశ్యతి రాజపుత్ర, యథా తు రామస్య మతిర్నివిష్టా తథా భవాన్పశ్యతు కార్యసిద్ధిమ్.

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షష్టితమస్సర్గః

---

## ఏకషష్టితమస్సర్గః

తతో జామ్బవతో వాక్యమగృహ్ణన్త వనౌకసః,
అఙ్గదప్రముఖా వీరా హనుమాంశ్చ మహాకపిః. ౧
ప్రీతిమన్తస్తతస్సర్వే వాయుపుత్రపురస్సరాః,
మహేంద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః. ౨

కార్యోపాయంబుల నెఱింగినవాఁడును వానరశ్రేష్ఠుండు నగు జాంబవంతుండు అంగదుని మాటను విని పరమసంతుష్టుండై యధికార్థంబగు నీమాటం జెప్పెను. ౫

[అంగదా ! నీవన్నది సరిగాదు. రాముఁడుగాని సుగ్రీవుఁడుగాని మన తో సీతను వెదకుఁ డని చెప్పిరేకాని తీసుకొనిరమ్మనలేదు. కావున చెప్పనిపని చేయుట మనకుఁ దగదు. అదిగాక రాముండు సీతాపహారినిఁ జంపి సీతను దేకున్న నే రాఘవుఁడఁ గానని విందుకొలువులోఁ బ్రతినపట్టెను. సత్యప్రతిజ్ఞుఁ డైన యారాజపుత్త్రుఁడు మాట వ్యర్థముచేసికొనునా? మన మిప్పుడు సీతను గొనిపోవుదుమేని మనచూపినకార్యమువ్యర్థమగును. రామునకును అంత తృప్తిగా నుండదు. కావున మన కీగొడవయేల! మేము సీతం జూచితిమని పోయి చెప్పుదము రండు.]

రాజపుత్త్రుండవగు నంగదుఁడా! నీ వాలోచించినది మాకును యుక్తము గానే తోఁచుచున్నది. మనము సమర్థులమయినను రామాజ్ఞ ననుసరించియే కదా ప్రవర్తింపవలయును. కావున నతం డెట్లాజ్ఞాపించెనో ఆప్రకారము కార్యసిద్ధియగునట్లు సేయుము. అని జాంబవంతుండు అంగదునకుఁ జెప్పెను.

ఇది యఱువదవ సర్గము.

## అఱువదియొకటవ సర్గము

అంత నంగదుండు మున్నగు వీరవానరులును హనుమంతుండును ఇతర వానరులును జాంబవంతుండు చెప్పినమాటకు సమ్మతించిరి. ౧

అంతఁ బరమసంతుష్టులును మేరుమందరాకారులును మత్తంబులగు మహాగజంబులంబోలె నున్నవారలును మహాకాయులును మహాబలశాలులును ఆకాశంబు నాచ్ఛాదించుపగిదిం జూపట్టుచు సర్వభూతనమస్కృతుండు మహా

మేరుమందరసంకాశా మత్తా ఇవ మహాగజాః,
ఛాదయంత ఇవాకాశం మహాకాయా మహాబలాః. ౩
సభాజ్యమానం భూతైస్తమాత్మవంతం మహాబలం,
హనుమంతం మహావేగం వహంత ఇవ దృష్టిభిః. ౪
రాఘవే చార్థనిర్వృత్తిం కర్తుం చ పరమం యశః,
సమాధాయ సమృద్ధార్థాః కర్మసిద్ధిభిరున్నతాః. ౫
ప్రియాఖ్యానోన్ముఖాస్సర్వే సర్వే యుద్ధాభినందినః,
సర్వే రామప్రతీకారే నిశ్చితార్థా మనస్వినః. ౬
ప్లవమానాః ఖమాప్లుత్య తతస్తే కాననౌకసః,
నందనోపమమాసేదుర్వనం ద్రుమలతాయుతమ్. ౭

యత్తన్మధువనం నామ సుగ్రీవస్యాభిరక్షితం,
అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్. ౮
యద్రక్షతి మహావీర్యస్సదా దధిముఖః కపిః,
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః. ౯
తే తద్వనముపాగమ్య బభూవుః పరమోత్కటాః,
వానరా వానరేంద్రస్య మనఃకాంతతమం మహత్. ౧౦
తతస్తే వానరా హృష్టా దృష్ట్వా మధువనం మహత్,
కుమారమభ్యయాచంత మధూని మధుపింగళాః. ౧౧
తతః కుమారస్తాన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాన్ కపీన్,
అనుమాన్య దదౌ తేషాం నిసర్గం మధుభక్షణే. ౧౨
[తే విసృష్టాః కుమారేణ ధీమతా వాలిసూనునా,
హరయస్సముపద్యన్త ద్రుమాన్మధుకరాకులాన్.
భక్షయంతస్సుగంధీని మూలాని చ ఫలాని చ,

ధైర్యశాలియును మహాబలశాలియును మహావేగుండగు హనుమంతు ననిమేష దృష్టిం జూచుచు రామకార్యంబు సాధించి పరమంబగు యశస్సును సంపాదింపఁ దలంపు గొనియున్నవారలును కృతార్థులును కార్యసిద్ధి గలిగియుండుటం జేసి యితరవానరులకన్న నధికులును అందఱు రామునకు సీతాదర్శనప్రియవార్తం జెప్ప నహమహమికచే నభిముఖులై అందఱును యుద్ధకాంక్షులై అందఱు రామునకుఁ బ్రత్యుపకారంబు సేయ నిశ్చయించియున్నవారలును మంచి మనస్సు గలవారలు నగు హనుమంతుండు మొదలగు నావానరశ్రేష్ఠులందఱు మహేంద్రపర్వతము విడిచి శ్రీరామసుగ్రీవసన్నిధికిం బోవ సమకట్టి యాకాశంబున కుద్గమించిరి. ౫-౬

అంత నావానరులు అట్లు ఆకాశమార్గంబునం బోవుచు శాఖామృగంబులతోను లతలతోనుం గూడి దేవలోకంబునందలి నందనవనంబుతోఁ బోటీ సేయందగి యొప్పుచున్న మధువనంబుఁ జేరిరి. ౭

ఏది సుగ్రీవునియాజ్ఞచే సమస్తభూతంబులకును జేరిచూడ నలవిగాక యతిమనోహరంబై యుండునో ఏది మహాపరాక్రమశాలియు వానరశ్రేష్ఠుండునగు సుగ్రీవుని మనుష్యుఁ డతని మేనమామ మహాపరాక్రమశాలి దధిముఖుం డను వానరునిచే నెల్లప్పుడు నేమఱక రక్షింపఁబడుచుండునో అట్టి వానరాధీశ్వరుండగు సుగ్రీవునకుఁ బ్రియతమంబగు మధువనమును బొంది ఆయంగదాదివానరులు మధువుఁ ద్రావం బరమౌత్సుకులయిరి. ౮-౧౦

అంతఁ దేనియకుంబోలెఁ బింగళవర్ణంబుగల యావానరులు మధువనంబును జూచి సంతుష్టులై యువరాజగు నంగదునియొద్దకుం బోయి "మాకుఁ దేనియ నిప్పింపవలయును" అని ప్రార్థించిరి. ౧౧

అంత నంగదుండు అందు వృద్ధులగు జాంబవంతుండు మొదలగువారలతోఁ జెప్పి వారలయనుమతిం దీసికొని యావానరులకు మధువుఁ ద్రావ ననుజ్ఞ నొసంగెను. [అంగదుఁ డాజ్ఞయీయఁగానే వానరు లందఱు చెట్లెక్కి తేనెలు గ్రోలి మూలఫలములఁ దిని చాలఁ దనిసి మదించిరి.]

జగ్ముః ప్రహర్షం తే సర్వే బభూవుశ్చ మదోత్కటాః]
తతశ్చానుమతాస్సర్వే సంప్రహృష్టా వనౌకసః
ముదితాః ప్రేరితాశ్చాపి ప్రనృత్యంతోఽభవం స్తతః. ౧౩

గాయంతి కేచిత్ప్రణమంతి కేచిన్నృత్యంతి కేచి త్ప్రహ
సంతి కేచిత్, పతంతి కేచి ద్విచరంతి కేచిత్ ప్లవంతి కేచి త్ప్రల
పంతి కేచిత్. ౧౪

పరస్పరం కేచిదుపాశ్రయంతే పరస్పరం కేచిదుపాక్రమంతే,
పరస్పరం కేచిదుపబ్రువంతే పరస్పరం కేచిదుపారమంతే. ౧౫

ద్రుమాద్ద్రుమం కేచిదభిద్రవంతే క్షితౌ నగాగ్రాన్నిపతంతి
కేచిత్, మహీతలాత్కేచి దుదీర్ణవేగా మహాద్రుమా గ్రాణ్యభి
సంపతంతి. [ధావన్తి కేచి త్పుపతన్తి కేచిన్మహాబలా వానర
యూథముఖ్యాః] ౧౬

గాయంత మన్యః ప్రహస న్నుపైతి హసంత మన్యః ప్రహ
సన్నుపైతి, రుదంత మన్యః ప్రరుద న్నుపైతి నుదంత మన్యః
ప్రణుద న్నుపైతి. ౧౭

సమాకులం తత్కపిసైన్యమాసీన్మధుప్రపానోత్కటసత్త్వ
చేష్టం, న చాత్ర కశ్చి న్న బభూవ మత్తో న చాత్ర కశ్చిన్న
బభూవ తృప్తః. ౧౮

తతో వనం తత్పరిభక్ష్యమాణం ద్రుమాంశ్చ విధ్వంసిత

సీతాదర్శనంబునను బరమసంతుష్టులయి యున్న యావానరులు అంగదుండు మధువుం ద్రావ ననుమతి యొసంగినంత మఱియుం బ్రహృష్టులయి యతండు "ఊఁ! త్రాగుఁడు. యథేష్టంబుగాఁ ద్రాగుఁడు" అని ప్రేరేపింప సంతోషంబుఁ బట్టఁజాలక నర్తనంబు సేయసాగిరి. ౧౩

ఆవానరులు సంతోషంబుఁ బట్టఁజాలక పిచ్చెత్తినట్లు కొందఱు గానము చేసిరి. కొందఱు నేలకుఁ దలక్రిందుగా వంగిరి. కొందఱు నృత్యంబు గావించిరి. కొందఱు పకపక నవ్విరి. కొందఱు నేలంబడిరి. కొందఱు దూరము పరుగెత్తిరి. కొందఱు ఎగిరిరి. కొందఱు కేకలు వేసిరి. ౧౪

కొందరు ఒండొరుల నాశ్రయించిరి. కొంద ఱొండొరులం బట్టుకొనిరి. కొందఱు ఒండొరులతో రహస్యంబులు చెప్పుకొనిరి. కొందఱు ఒక్కగుమిగాఁ జేరి విహరించిరి. ౧౫

కొందఱు ఒక్కవృక్షమునుండి మఱియొకవృక్షమునకుఁ బరుగెత్తిరి. కొందఱు వృక్షాగ్రంబుననుండి నేలకు దుమికిరి. కొందఱు మహావేగులయి నేలనుండి గొప్పవృక్షంబులకొనలపై కెగిరిరి. ౧౬

ఒక్కఁడు గానము సేయుచుండఁగా మఱియొకండు పకపక నవ్వుచు నతనిపైఁ బడెను. ఒక్కఁడు నవ్వుచుండఁగా మఱియొక్కఁడు మఱియు నధికముగా నవ్వుచు నతనిపైఁ బడెను. ఒక్కండు వ్యాజంబున రోదనంబు సేయుచుండఁగా మఱియొక్కఁ డతని ద్రోయుచు నతనిపైఁ బడెను. అటొక్కఁడు మఱియొకనిం ద్రోయుచుండఁగా ఇంక నొక్కండు కేకలు వేయుచు నతనిపైఁ బడెను. ౧౭

ఆ వానరులందఱును విపరీతముగా దేనియలం ద్రావుటచే మత్తతనొంది నానావిధచేష్టలం జేయుచుండిరి. అందొక్కండైనను మత్తత నొందనివాఁడు లేఁడు. ఒక్కండైనను యథేష్టంబుగా మధుపానంబుఁ జేసి తృప్తినొందనివాఁడు లేఁడు. ౧౮

అంత మధువనంబును రక్షించుచుండు సుగ్రీవుని మాతులుఁడు దధిముఖుండను వానరుఁడు వానరులందఱు ఆవనమునందలి మధువునంతయుఁ

పత్రపుష్పాణ్, సమీక్ష్య కోపాద్దధివక్త్రనామా నివారయా
మాస కపిః కపీం స్తాన్. ౧౯
స్తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో వనస్యగోప్తాహరివీరవృద్ధః,
చకారభూయో మతిముగ్రతేజా వనస్యరక్షాంప్రతివానరేభ్యః.

ఉవాచ కాంశ్చి త్పరుషాణి ధృష్ట మసక్త మన్యాంశ్చ తలై
ర్జఘాన, సమేత్య కైశ్చి త్కలహం చకార తథైవ సామ్నోప
జగామ కాంశ్చిత్. ౨౧
స తైర్మదాత్సంపరివార్య వాక్యైర్బలాచ్చ తేన ప్రతివార్య
మాణైః, ప్రధర్షిత స్త్యక్తభయైస్సమేత్య ప్రకృష్యతే చాప్యన
వేక్ష్య దోషమ్. ౨౨

నఖైస్తుదంతో దశనై ర్దశంత స్తలైశ్చ పాదైశ్చ సమాప
యంతః, మదా త్కపిం తం కపయస్సమగ్రా మహావనం నిర్వి
షయం చ చక్రుః. ౨౩

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ఏకషష్టితమస్సర్గః.

## ద్విషష్టితమస్సర్గః

తానువాచ హరిశ్రేష్ఠో హనుమాన్వానరర్షభః,
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః. ౧

అహమావారయిష్యామి యుష్మాకం పరిపంథినః,

శ్రుత్వా హనుమతో వాక్యం హరీణాం ప్రవరోఽంగదః. ౨

ద్రావుటయుఁ వృక్షముల పత్త్రపుష్పంబులన్నియుఁ నాశము నొందించుటయుఁ జూచి కోపంబు నొంది యావానరుల వనంబు విడిచి పొమ్మని నివారించెను.

మధువనరక్షకుండును వృద్ధుండును భయంకరప్రభావుండు నగు నాదధిముఖుం డంత మత్తులగు నావానరులు తన్ను సరకుసేయక తిరస్కరించుటం జూచి యామధువనంబును వానరులవలనం జెడకుండ రక్షించుటకై మరలం బ్రయత్నంబు చేసెను. ౨౦

ఆదధిముఖుండు కొందఱియొద్దకుఁ బోయి పరుషవాక్యంబుల వలదని చెప్పెను. కొందఱను తలప్రహారంబులం బ్రహరించెను. కొందఱితో జగడమాడెను. కొందఱ మంచిమాటలతోఁ బ్రార్థించెను. ౨౧

అట్లాదధిముఖుం డావానరులను నివారింప వార లెంతమాత్రము భయంబులేక మదంబున నందఱు నొక్కటిగాఁజేరి యాదధిముఖుంబరివేష్టించి మాటలం దిరస్కరించియు నతండు ప్రభుండ యయినను దోషంబు దలంపక యతని నలుప్రక్కలం బీడించిరి. ౨౨

వానరులందఱు మదంబున నాదధిముఖుని గోళ్లంగీఱుచు దంతంబులం గఱచుచుఁ దలంబులచేతను బాదంబులచేతను జావమోఁదుచును నామధువనంబు నందలి తేనియ మొదలగు భోగద్రవ్యంబు లన్నిఁటిని గాఁజేసిరి. ౨౩

ఇది యఱువదియొకటవ సర్గము.

---

## అఱువదిరెండవ సర్గము

వానరశ్రేష్ఠుండగు హనుమంతుండు ఆవానరులంజూచి యిట్లనిచెప్పెను.

వానరులారా! మీరలు మనంబున భయం బుంచుకొనక తేనియలం గ్రోలుఁడు.

మిమ్ములను ద్రాఁగనీక యడ్డమువచ్చువారలను నేను వారించుచుండెదను. అని హనుమంతుండు వానరులకుం జెప్పెను.

హనుమంతుండు చెప్పినది విని వానరశ్రేష్ఠుండగు నంగదుండు ప్రసన్న

ప్రత్యువాచ ప్రసన్నాత్మా పిబంతు హరయో మధు,
అవశ్యం కృతకార్యస్య వాక్యం హనుమతో మయా. 3
అకార్యమపి కర్తవ్యం కిమంగ పునరీదృశం,
అంగదస్య ముఖాచ్ఛ్రుత్వా వచనం వానరర్షభాః. ౪

సాధుసాధ్వితి సంహృష్టా వానరాః ప్రత్యపూజయన్,
పూజయిత్వాంగదం సర్వే వానరా వానరర్షభమ్. ౫
జగ్ముర్మధువనం యత్ర నదీవేగ ఇవ ద్రుమం,
తే ప్రవిష్టా మధువనం పాలానాక్రమ్య వీర్యతః. ౬

అతిసర్గాచ్చ పటవో దృష్ట్వా శ్రుత్వా చ మైథిలీం,
పపుస్సర్వే మధు తదా రసవత్ఫలమాదదుః. ౭
ఉత్పత్యచ తతస్సర్వే వనపాలాన్ సమాగతాన్,
తాడయంతి స్మ శతశస్సక్తాన్మధువనే తదా. ౮

మధూని ద్రోణమాత్రాణి బాహుభిః పరిగృహ్య తే,
పిబంతి సహితాస్సర్వే నిఘ్నంతి స్మ తథాపరే. ౯
కేచిత్పీత్వాఽపవిధ్యంతి మధూని మధుపింగళాః,
మధూచ్ఛిష్టేన కేచిచ్చ జఘ్నురన్యోన్యముత్కటాః. ౧౦

అపరే వృక్షమూలేతు శాఖాం గృహ్య వ్యవస్థితాః,
అత్యర్థం చ మదగ్లానాః పర్ణాన్యాస్తీర్య శేరతే. ౧౧
ఉన్మత్తభూతాః ప్లవగా మధుమత్తాశ్చ హృష్టవత్,
క్షిపంతి చ తదాన్యోన్యం స్ఖలంతి చ తథాఽపరే. ౧౨

హృదయుండై "వానరులు యథేష్టంబుగాఁ దేనియలం గ్రోలుదురుగాక ! కృతకృత్యుండగు హనుమంతుండు ఇప్పుడు ఆకార్య మగుదానిం జేయుమని చెప్పినను నేను దాని నవశ్యము చేయవలసినవాఁడను. ఇఁక నిట్టి సత్కార్యమును జెప్పినప్పుడు చెప్పనేల?" అని యానతిచ్చెను. ౨,౩

ఆవానరోత్తములు అంగదుని నోటనుండి వచ్చినమాటనువిని పరమ సంతుష్టులయి యంగదునిసాధువాక్యంబులం గొనియాడిరి. ౪

వానరులందఱు అట్లు వానరశ్రేష్ఠుండగు నంగదుని గొనియాడి నదీవేగంబు వృక్షముపైకి వచ్చి వృక్షముం బడద్రోయునట్లు మధువనంబును నశింపఁజేయుటకై యచ్చటికిఁ బోయిరి. ౫

పరాక్రమముచేతను అంగదుని యనుజ్ఞవలనను సీతాదేవిం జూచియు వినియు నుండుటవలనను ఇనుమడించిన బలముగల యావానరులందఱు మధువనంబు జొచ్చి యచ్చటి కావలివారలం బట్టి కట్టివేసి మధువునంతయుఁ గ్రోలిరి. రుచ్యంబులగు ఫలంబులను భక్షించిరి. ౬,౭

అట్లు వానరులందఱును యథేష్టంబుగాఁ ద్రావియుం భక్షించియుం లేచి తమపైకి నివారింపవచ్చిన వనరక్షకులంబట్టి నానావిధంబులం గొట్టిరి. ౮

అట్లు వానరులందఱు నొక్కటిగాఁజేరి కొందఱు తూమెడు తేనియగల పటలంబులం జేతులంబట్టుకొని త్రాఁగుచుండిరి. మఱికొందఱు విరోధులం బ్రహరించుచుండిరి. ౯

తేనియకుంబోలె గోరోచనపు వన్నెగల కొందఱు తేనియలం ద్రావి తెట్టెలం బాఱవైచిరి. కొంద ఱామైనముం దీసికొని మత్తులై పడుచులేచుచుం బోయిరి. ౧౦

ఇతరులగు వానరులు మదంబునఁ బోవంజాలక ఆచెట్లుకొమ్మనే పట్టుకొనియుండి యంతకంతకు మదం బతిశయింప వృక్షపత్త్రంబులు పఱచుకొని నేలం బరుండిరి. ౧౧

వానరులు మధుపానంబున మత్తులై పిచ్చెత్తినట్లు సంతోషంబునొందినవారై కొందఱు ఒకరినొకరు పడఁద్రోసిరి. మఱికొందఱు నడవంజాలక తడబడుచుండిరి. ౧౨

కేచిత్క్ష్వేళాం ప్రకుర్వంతి కేచిత్కూజంతి హృష్టవత్,
హరయో మధునా మత్తాః కేచిత్సుప్తా మహీతలే. ౧౩

కృత్వా కేచి ద్ధసంత్యన్యే కేచి త్కుర్వంతి చేతరత్,
కృత్వా కేచిద్వదంత్యన్యే కేచిద్బుధ్యంతి చేతరత్. ౧౪

యేఽప్యత్ర మధుపాలాస్స్యుః ప్రేష్యా దధిముఖస్య తు,
తేఽపి తైర్వానరై ర్భీమైః ప్రతిషిద్ధా దిశో గతాః. ౧౫

జానుభిస్తు ప్రకృష్టాశ్చ దేవమార్గం ప్రదర్శితాః,
అబ్రువన్ పరమోద్విగ్నా గత్వా దధిముఖం వచః. ౧౬

హనూమతా దత్తవరైర్హతం మధువనం బలాత్,
వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః. ౧౭

తతో దధిముఖః క్రుద్ధో వనప స్తత్ర వానరః,
హతం మధువనం శ్రుత్వా సాంత్వయామాస తాన్ హరీన్. ౧౮

ఇహాగచ్ఛత గచ్ఛామో వానరాన్ బలదర్పితాన్,
బలేన వారయిష్యామో మధు భక్షయతో వయమ్. ౧౯

శ్రుత్వా దధిముఖస్యేదం వచనం వానరర్షభాః,
పునర్వీరా మధువనం తేనైవ సహసా యయుః. ౨౦

వానరులు మధుమత్తులయి కొందఱు వీరరసంబొప్ప సింహనాదంబు గావించిరి. కొందఱు సంతోషంబు నొందినట్లు కూయుచుండిరి. కొందఱు నేలం బడి నిదురించిరి. ౧౩

మఱికొందరు చేయఁగూడని గ్రామ్యకార్యం బొక్కటిచేసి తమలోఁ దాము నవ్వుకొనిరి. ఇతరులు కొందఱు మఱియొక్క గ్రామ్యకార్యం బొనర్చిరి. మఱికొందఱు అట్టిగ్రామ్యంబుఁ గావించి తాముచేసినది యితరులకుం జెప్పు కొనిరి. ఇతరులు మఱియొక్కదానిఁ జేయందలంచిరి. ౧౪

ఈ మధువనంబునందు దధిముఖాజ్ఞానువర్తులగు మధురక్షకులందఱు భయంకరాకారులగు నావానరులచే బాధింపఁబడినవారలై దిక్కులకుం బాఱిరి. ౧౫

మఱియు నీవానరులు మధువనరక్షకులగు వానరులను మోఁకాళ్లను బట్టి యెత్తి యపానద్వారంబును ముఖంబునొద్దకుఁ జేర్చి యిట్లు పీడింపఁగా వారలు పరమదుఃఖితులయి దధిముఖునొద్దకు వచ్చి యిట్లని చెప్పిరి. ౧౬

“హనుమంతునివలన వరంబునొంది వానరులు మధువనంబు నంతయు నశింపఁజేసిరి. అంతియకాక మమ్ములను మోఁకాళ్లంబట్టి లేవనెత్తి మాయపాన ద్వారంబు ముఖంబునొద్దకుఁ జేరునట్లుచేసి యిట్లు నానావిధంబులం బీడించిరి.” అని మధురక్షకులగు వానరులు దధిముఖునితోఁ జెప్పిరి. ౧౭

అంత నామధువనంబును బాలించునట్టి దధిముఖుండు మధువనంబు నంతయుం నశింపఁజేయుటను విని కోపంబునొంది తన భటులగు వానరులను మంచి మాటల నాశ్వాసించెను. ౧౮

“మీర లిటు రండు. మనమందఱమును బోయి బలగర్వితులయి మధు వంతయుఁ ద్రావుచున్న వానరులం బ్రహరించి బలంబున నివారింతము.” అని దధిముఖుండు భటులకుం జెప్పెను. ౧౯

పరాక్రమవంతులగు నావానరశ్రేష్ఠులు దధిముఖుండు చెప్పిన యా మాటను విని మరల నతనింగూడి వేగంబున మధువనంబుఁ బ్రవేశించిరి. ౨౦

మధ్యే చైషాం దధిముఖః ప్రగృహ్య తరసా తరుం,
సమభ్యధావద్వేగేన తే చ సర్వే ప్లవంగమాః. ౨౧
తే శిలాః పాదపాంశ్చాపి పర్వతాంశ్చాపి వానరాః,
గృహీత్వాభ్యగమన్ క్రుద్ధా యత్ర తే కపికుంజరాః. ౨౨
తే స్వామివచనం వీరా హృదయేష్వవసజ్య తత్,
త్వరయా హ్యభ్యధావంత సాలతాలశిలాయుధాః. ౨౩
వృక్షస్థాంశ్చ తలస్థాంశ్చ వానరాన్ బలదర్పితాన్,
అభ్యక్రామంస్తతో వీరాః పాలాస్తత్ర సహస్రశః. ౨౪
[బలాన్నివారయన్తశ్చ ఆసేదుర్హరయో హరీన్,
సందష్టోష్ఠపుటక్రుద్ధాభర్త్సయన్తో ముహుర్ముహుః]
అథ దృష్ట్వా దధిముఖం క్రుద్ధం వానరపుంగవాః,
అభ్యధావంత వేగేన హనుమత్ప్రముఖాస్తదా. ౨౫
తం సవృక్షం మహాబాహుం ఆపతంతం మహాబలం,
ఆర్యకం ప్రాహరత్తత్ర బాహుభ్యాం కుపితోఽంగదః. ౨౬
మదాంధశ్చ న వేదైనమార్యకోఽయం మమేతి సః,
అథైనం నిష్పిపేషాశు వేగవద్వసుధాతలే. ౨౭
స భగ్నబాహూరుభుజో విహ్వలశ్శోణితోక్షితః,
ముమోహ సహసా వీరో ముహూర్తం కపికుంజరః. ౨౮

స సమాశ్వస్య సహసా సంక్రుద్ధో రాజమాతులః,
వానరాన్వారయామాస దండేన మధుమోహితాన్. ౨౯

స కథంచి ద్విముక్తస్తైర్వానరైర్వానరర్షభః,
ఉవాచైకాంతమాశ్రిత్య భృత్యాన్ స్వాన్ సముపాగతాన్.

దధిముఖుండును బలంబున నొక్కవృక్షంబుఁ బెకలించి దానిబట్టుకొని యావానరులనడుమ నతివేగంబున బరుగెత్తెను. ఆవానరులును వెంబడించిరి.

ఆవానరులు మహాకోపంబు నొంది ఱాళ్లను వృక్షములను బర్వతంబులును జేకొని వానరశ్రేష్ఠులగు నంగదాదు లున్నచోటికిం బరుగెత్తిరి. ౨౨

పరాక్రమశాలు లగు నావానరులును తమప్రభుండగు దధిముఖుని యాజ్ఞను మనంబున నుంచుకొని సాలవృక్షంబులను దాలవృక్షంబులను శిలలును ఆయుధంబులుగాఁ గొని వేగంబునం బరుగెత్తిరి. ౨౩

అంతఁ బరాక్రమవంతులగు మధురక్షకులయిన వానరులు వేనవేలుగా బలదర్పితులగు నంగదాదివానరులపైఁబడి వృక్షంబులపైనున్న వారలను గ్రిందనున్నవారలను అందఱ నొక్కపెట్ట నాక్రమించిరి. [బెట్టిదముగా వారించుచు పెదవులు గొఱికికొనుచు బెదరించుచువచ్చి తాఁకిరి.] ౨౪

అంత హనుమంతుఁడు మొదలుగాఁగల వానరశ్రేష్ఠులందఱును దధిముఖుఁడు కోపించి వచ్చుటం జూచి వేగంబున నతని నెదుర్కొనిరి. ౨౫

అంత నంగదుఁడు కుపితుఁడై మహాబాహుఁడును మహాబలుఁడును వృక్షంబు చేతం గొనివచ్చుచున్నవాఁడు నగుదధిముఖుని రెండుచేతులతోనుం బ్రహరించెను. ౨౬

అంత నంగదుఁడు మదాంధుఁడై యున్నవాఁడు గావున "ఇతఁడు నా తాత" యని యెఱుంగక యతని నేలంబడఁద్రోసి చక్కఁగాఁ గ్రుమ్మెను.

పరాక్రమవంతుఁడును వానరశ్రేష్ఠుఁడు నగు నాదధిముఖుఁ డంతఁ జేతులయందును తొడలయందును మూఁపులయందును నొప్పి దగుల నవయవంబుల స్వాధీనత దప్పి కొంతసేపు మూర్ఛిల్లియుండెను. ౨౮

వానరరాజగు సుగ్రీవుని మేనమామ యగునాదధిముఖుఁ డంత శ్రమంబున మూర్ఛదేఱి క్రుద్ధుఁడై తేనెఁ ద్రావుటచే దేహంబు దెలియకున్న వానరులను దండమునం దఱిమెను. ౨౯

వానరశ్రేష్ఠుఁడగు నాదధిముఖుఁడు అట్లతిప్రయాసంబున నావానరుల వలనం దప్పించుకొని యేకాంతప్రదేశంబునొంది యచ్చట వెనుదగిలివచ్చిన తన భృత్యులం జూచి యిట్లని చెప్పెను. ౩౦

ఏతే తిష్ఠంతు గచ్ఛామో భర్తా నో యత్ర వానరః,
సుగ్రీవో విపులగ్రీవ స్సహ రామేణ తిష్ఠతి. 30

సర్వం చైవాంగదే దోషం శ్రావయిష్యామి పార్థివే,
అమర్షీ వచనం శ్రుత్వా ఘాతయిష్యామి వానరాన్. 32

ఇష్టం మధువనం హ్యేతత్సుగ్రీవస్య మహాత్మనః,
పితృపైతామహం దివ్యం దేవైరపి దురాసదమ్. 33

స వానరానిమాన్ సర్వాన్ మధులుబ్ధాన్ గతాయుషః,
ఘాతయిష్యతి దండేన సుగ్రీవస్ససుహృజ్జనాన్. 34
వధ్యా హ్యేతే దురాత్మానో నృపాజ్ఞాపరిభావినః,
అమర్షప్రభవో రోషస్సఫలో నో భవిష్యతి. 35

ఏవముక్త్వా దధిముఖో వనపాలాన్మహాబలః,
జగామ సహసోత్పత్య వనపాలైస్సమన్వితః. 36
నిమేషాంతరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః,
సహస్రాంశుసుతో ధీమాన్ సుగ్రీవో యత్ర వానరః. 37
రామం చ లక్ష్మణం చైవ దృష్ట్వా సుగ్రీవమేవ చ,
సమప్రతిష్ఠాం జగతీమాకాశా న్నిపపాత హ. 38
సన్నిపత్య మహావీర్యస్సర్వైస్తైః పరివారితః,
హరిర్దధిముఖః పాలైః పాలానాం పరమేశ్వరః. 39
స దీనవదనో భూత్వా కృత్వా శిరసి చాంజలిం,
సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ ప్రత్యపీడయత్. 40

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - ద్విషష్టితమస్సర్గః.

"ఈయుంగదాదు లిట్లు పడియుండుడుగాక. మన ప్రభుండును విశాలకంఠుండు నగు సుగ్రీవుండును రాముండును ఎచ్చట నుందురో అచ్చటికిం బోవుదము. ౩౧

వానరరాజగు సుగ్రీవుని సమీపంబున "దోషం బంతయు నంగదునిదే" యని చెప్పెదను. అంత నధికకోపముఁడగు సుగ్రీవుఁడు కోపమునొంది యీవానరుల నందఱం జంపించును. ౩౨

తండ్రితాతలనుండి వచ్చినదియు దివ్యంబును దేవతలకైనం జొరనలవిగానిదియునగు నీమధువనంబు మహాత్ముఁడగు సుగ్రీవునకు మిక్కిలి ప్రియమయినది గదా! ౩౩

ఆసుగ్రీవుఁడు తేనెయం దాసగొనియున్నవారలును ఆసన్నమృత్యువులు నగు నీవానరుల కందఱకును వీరలస్నేహితులకును మరణశిక్ష విధించును.

దుష్టబుద్ధులగు వీరలు రాజాజ్ఞఁ దిరస్కరించుటవలన వీరలు వధింపఁదగినవారలే యగుచున్నారు. కావున వానరరాజగు సుగ్రీవుఁడు వీరల నవశ్యము వధించును. అట్లు మనకోపమును సఫలంబు గాఁగలదు." అని దధిముఖుండు తనభృత్యులకుం జెప్పెను. ౩౪

మహాబలశాలియగు నాదధిముఖుం డట్లు మధువనరక్షకులకుం జెప్పి, వారలతోఁగూడ నాకాశంబున కుద్గమించి, శీఘ్రంబునం బోయెను. ౩౫

ఆదధిముఖుఁడు, బుద్ధిమంతుండును సూర్యకుమారుండు నగుసుగ్రీవుండుండుచోటికి ఒకనిమిషంబునఁ బోయి చేరెను. ౩౬

ఆదధిముఖుండు రామలక్ష్మణ సుగ్రీవులం జూచి యంత నాకాశంబున నుండి మిట్టపల్లములేని సమభూమికి వ్రాలెను. ౩౭

మహాపరాక్రమశాలియు మధువనరక్షకుల కందఱకును ప్రభుండు నగుచు దధిముఖుండు తనభృత్యు లందఱిచేతను బరివేష్టింపఁబడినవాఁడై దీనవదనుండై శిరంబునం జేమోడ్పు గీలించి తనశిరంబు మంగళకరంబులగు సుగ్రీవునిపాదంబులు సోఁకం బ్రణామంబు గావించెను. ౩౯,౪౦

ఇది యఱువదిరెండవ సర్గము.

## త్రిషష్టితమస్సర్గః

తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః,
దృష్ట్వైవోద్విగ్నహృదయో వాక్యమేతదువాచహ. ౧
ఉత్తిష్ఠోత్తిష్ఠ కస్మాత్త్వం పాదయోః పతితో మమ,
అభయం తే భవేద్వీర సర్వమేవాభిధీయతామ్. ౨
[కిం సంభ్రమాద్ధితం కృత్స్నం బ్రూహి యద్వక్తుమర్హసి,
కచ్చిన్మధువనే స్వస్తి శ్రోతుమిచ్ఛామి వానర.]
స తు విశ్వాసితస్తేన సుగ్రీవేణ మహాత్మనా,
ఉత్థాయ సుమహాప్రాజ్ఞో వాక్యం దధిముఖోఽబ్రవీత్. ౩
నైవర్క్ష రజసా రాజన్న త్వయా నాపి వాలినా,
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః. ౪
[నవారయమహం సర్వాన్ సహైభిర్వనచారిభిః,
అచిన్తయిత్వా మాం హృష్టా భక్షయన్తి పిబన్తి చ]
ఏభిః ప్రధర్షితాశ్చైవ వానరావనరక్షిభిః,
మధూన్యచింతయిత్వేమాన్భక్షయంతి పిబంతి చ. ౫
శిష్టమత్రాపవిధ్యంతి భక్షయంతి తథాపరే,
నివార్యమాణాస్తే సర్వే భ్రువౌ వై దర్శయంతి హి. ౬
ఇమే హి సంరబ్ధతరాస్తథా తైస్సంప్రధర్షితాః,
వారయంతో వనాత్తస్మాత్క్రుద్ధైర్వానరపుంగవైః. ౭

తత స్తైర్బహుభిర్వీరై ర్వానరై ర్వానరర్షభః,
సంరక్తనయనైః క్రోధాద్ధరయః ప్రవిచాలితాః. ౮

పాణిభిర్నిహతాః కేచిత్కేచిజ్జానుభిరాహతాః,
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః. ౯

## అఱువదిమూఁడవ సర్గము

అంత వానరశ్రేష్ఠుండగు సుగ్రీవుండు అట్లు తనకు సాష్టాంగంబుగ నమస్కరించిన దధిముఖుం జూచినంతనె ఇతం డేందుకు వచ్చెనని మహా భయంబు నొంది యీమాటం జెప్పెను. ౧

“పరాక్రమశాలివగు దధిముఖుఁడా! లెమ్ము లెమ్ము. నీవు నాపాదంబులం బడితివేల? నీ కభయం బొసంగెదను. జరిగినసమాచారంబు నంతయుఁ జెప్పుము. [తొందరయేల? ఉన్నసమాచారము చెప్పుము. మధువనములో నెట్టి యల్లరులును లేవు కదా!] ౨

మహాపండితుం డగునాదధిముఖుండు మహాత్ముండగు నాసుగ్రీవుం డభయం బొసంగుటవలన విశ్వాసంబునొంది లేచి యిట్లని చెప్పెను. ౩

“వానరరాజవగు సుగ్రీవుఁడా! నీతండ్రి ఋక్షరజునికాలంబునం గాని నీకాలంబునంగాని యిదివఱ కెప్పుడును ఎవ్వరికిని జొరనలవిగాకుండిన మధువనంబును నేఁటికాలంబునకు అంగదాదివానరులు వచ్చి అంతయుం పీటిఁ బుచ్చిరి. [నే నీకావలివారితోఁ గలసి యడ్డగించినను నన్ను సరకుగొనక మధువును భక్షించుచున్నారు.] ౪

ఆవానరులు మధువనరక్షకులగు వీరలు పోయి బెదరించినను వీరలను సరకుసేయక యథేష్టముగాఁ దేనియలఁ ద్రాఁగుచున్నారు. ౫

కొందఱు యథేష్టముగాఁ ద్రావి మిగత నేలం బాఱఁ బోసెదరు. మఱి కొందఱు త్రావెదరు. ఈరక్షకులు బెదరించినచోఁ గనుబొమలం జూపెదరు. ౬

వనరక్షకులగు వీరలు సంరంభంబున “వనమునుండి పొం” డని వారలను వారింపఁగా వానరశ్రేష్ఠులు వెక్కిరించి వీరలను బెదరించిరి. ౭

వానరశ్రేష్ఠుఁడ వగు సుగ్రీవుఁడా! అనేకులును బరాక్రమవంతులగు నావానరులు కోపంబునఁ గన్నుల నెఱ్ఱఁదనంబు గదుర వనరక్షకులగు నీవానరుల నందఱం దరిమిరి. ౮

ఆవానరులు వనరక్షకులం గొందఱ మోఁకాళ్లం బ్రహరించి లేవనెత్తి తలక్రిందుగాఁ బశ్చిమద్వారంబుఁ జూచునట్లు గావించిరి. ౯

ఏవమేతే హతాశ్శూరా స్త్వయి తిష్ఠతి భర్తరి,
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే. ౧౦

ఏవం విజ్ఞాప్యమానం తం సుగ్రీవం వానరర్షభం,
అపృచ్ఛత్తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా. ౧౧

కిమయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః,
కం చార్థమభినిర్దిశ్య దుఃఖితో వాక్యమబ్రవీత్, ౧౨

ఏవముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా,
లక్ష్మణం ప్రత్యువాచేదం వాక్యం వాక్యవిశారదః. ౧౩
ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దధిముఖః కపిః,
అంగదప్రముఖైర్వీరైర్భక్షితం మధు వానరైః. ౧౪

విచిత్య దక్షిణామాశామాగతైర్హరిపుంగవైః,
నైషామకృతకృత్యానామీదృశస్స్యాదుపక్రమః. ౧౫
ఆగతైశ్చ ప్రమథితం యథా మధువనం హి తైః,
ధర్షితం చ వనం కృత్స్నముపయుక్తం చ వానరైః. ౧౬
వనం యదాఽభిపన్నాస్తే సాధితం కర్మ వానరైః,
[వారయన్తో భృశం ప్రాప్తాః పాలా జానుభిరాహతాః,
తథా న గణితశ్చాయం కపిర్దధిముఖో బలీ.
కపిర్మమ వనస్యాయమస్మాభిస్థాపితస్స్వయమ్.]
దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా. ౧౭
న హ్యన్యస్సాధనే హేతుః కర్మణోఽస్య హనూమతః,

ప్రభుండవగు నీ వుండఁగానే అయంగదాదివానరు లిట్టు వీరులగు వీరలం బ్రహరించి మధువనంబునందలి మధువునంతయుఁ ద్రావుచున్నారు. అని దధిముఖుండు సుగ్రీవునితోఁ జెప్పఁజొచ్చెను. ౧౦

ఇట్టు దధిముఖుండు వానరశ్రేష్ఠుండగు సుగ్రీవునితో విన్నవించు కొనుటం జూచి మహాపండితుండును శత్రువీరులం జంపువాఁడు నగులక్ష్మణుండు ఆ దధిముఖుంగూర్చి సుగ్రీవు నిట్లని పృచ్ఛించెను. ౧౧

"వానరరాజగు సుగ్రీవుఁడా! వనపాలకుండగు నీవానరుం డిచ్చటి కేల వచ్చినాఁడు? మఱియు నెందుకు దుఃఖితుండయ్యె? ఇప్పు డిచ్చట నేమి చెప్పుచున్నాఁడు?" అని లక్ష్మణుండు సుగ్రీవు నడిగెను. ౧౨

మాటలు చెప్పుటయందుఁ బండితుండగు సుగ్రీవుండు మహాపరాక్రమశాలియగు లక్ష్మణుండు చెప్పినది విని యతనిం జూచి యిట్లని బదులుచెప్పెను.

"పూజ్యుండవగు లక్ష్మణుఁడా! దక్షిణదిక్కును వెదకి వచ్చినట్టి పరాక్రమవంతులును వానరోత్తములునగు నంగదాదివానరులు మధువనంబునందలి మధువునంతయుఁ ద్రావిరి" అని వీరుండగు దధిముఖుండు చెప్పుచున్నాఁడు.

ఈయంగదాది వానరులు వచ్చుచునే మధువనంబు ప్రవేశించి దాని నంతయు నాక్రమించియు దాని విఱిచియు నందలి తేనియనంతయుఁ ద్రావినారే. వీరలు కృతకృత్యులు గాకుండినచో నిట్టి కార్యంబు సేయ సాహసింపఁ జాలరు. ౧౩, ౧౪

ఆవానరులు ధైర్యమున మధువనంబుఁ బ్రవేశించుటవలన వారలు కార్యంబును సాధించియే వచ్చిరని స్పష్టమగుచున్నది. [తేనెలు ద్రాఁగుచు నీవానరు లడ్డపెట్టఁగా వీరిని జావ మోఁదిరి. అట్లే యీదధిముఖునిఁ గూడ లెక్కపెట్టరైరి. ఈదధిముఖుఁడు మాచే వనపాలనముపై సునియుక్తుఁడు.]

వారలు సీతాదేవిం జూచి వచ్చిరి. ఇతరుం డెవ్వండును జూచియుండఁడు. హనుమంతుండే సీతాదేవిం జూచియుండును. ౧౫

హనుమంతుండు దక్క నింక నెవ్వండును ఈకార్యంబును సాధింపం జాలఁడు.

కార్యసిద్ధిర్మతి శ్చైవ తస్మిన్వానరపుంగవే. ౧౮
వ్యవసాయశ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితం,

జాంబవాన్యత్ర నేతా స్యాదంగదశ్చ మహాబలః. ౧౯
హనుమాంశ్చాప్యధిష్ఠాతా న తస్య గతిరన్యథా,

అంగదప్రముఖైర్వీరై ర్హతం మధువనం కిల. ౨౦

వారయంతశ్చ సహితా స్తథా జానుభిరాహతాః,
ఏతదర్థమయం ప్రాప్తో వక్తుం మధురవాగిహ. ౨౧
నామ్నా దధిముఖో నామ హరిః ప్రఖ్యాతవిక్రమః,
దృష్టా సీతా మహాబాహో సౌమిత్రే పశ్య తత్త్వతః. ౨౨

అభిగమ్య తథా సర్వే పిబంతి మధు వానరాః,

న చాప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ. ౨౩
వనం దత్తవరం దివ్యం ధర్షయేయుర్వనౌకసః,

తతః ప్రహృష్టో ధర్మాత్మా లక్ష్మణస్సహరాఘవః. ౨౪

శ్రుత్వా కర్ణసుఖాం వాణీం సుగ్రీవవదనాచ్చ్యుతాం,
ప్రాహృష్యత భృశం రామో లక్ష్మణశ్చ మహాబలః. ౨౫
శ్రుత్వా దధిముఖస్యేదం సుగ్రీవస్తు ప్రహృష్య చ,
వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత. ౨౬

కార్యసాధనసామర్థ్యంబును బుద్ధియు నుత్సాహంబును పరాక్రమం
బును విద్యయు ఇవన్నియు వానరశ్రేష్ఠుండగు నాహనుమంతునందు నెలకొని
యున్నవి. ౧౮

ఏకార్యంబునందు జాంబవంతుఁడును మహాబలుండగు నంగదుఁడును
నాయకులయియుందురో మఱియు హనుమంతుండు తోడ్పడియుండునో
ఆకార్యంబు తప్పక సిద్ధించునేకాని వేఱువిధము కానేరదు. ౧౯

అంగదుఁడు మొదలగు వానరవీరులు వచ్చి మధువనంబునంతయుఁ
జెఱిచిరి. ౨౦

అప్పుడు వనపాలకులందఱు నొక్కటయి పోయి వారలను వారింపఁగా
వారలు వీరలనందఱ నానావిధంబులం బ్రహరించిరి. ౨౧

మధురముగా మాటలాడువాఁడును మహాపరాక్రమశాలియు నగుదధిము
ఖుండను నీవానరుండును ఈసమాచారంబునే చెప్పుటకై యిచ్చటికి వచ్చినాఁడు.

మహాబాహుండవగు లక్ష్మణుఁడా! వానరులు సీతం జూచియుందురు.
నీవును యథార్థంబుగా నాలోచింపుము. ౨౨

కావుననే యీవానరులందఱును నిర్భయంబుగా మధువనంబుఁ జొచ్చి
యథేష్టంబుగాఁ దేనియలం ద్రావుచున్నారు.

బుద్ధియందును బరాక్రమంబునందును బ్రఖ్యాతులగు నావానరులు
సీతం జూడకయే వచ్చియుండినచో "బ్రహ్మదేవునిచే నాతండ్రి కొసంగంబడి
నదియు దివ్యంబునగు మధువనంబు నెంతమాత్రము బ్రవేశింపరు" అని సుగ్రీ
వుండు లక్ష్మణునితోఁ జెప్పెను. ౨౩

అంత ధర్మాత్ముండగు లక్ష్మణుండును రాముండును సంతోషంబు
నొందిరి. ౨౪

సుగ్రీవునినోటనుండి వెడలిన కర్ణసుఖావహంబగు నామాటను విని
రాముండును మహాబలుండగు లక్ష్మణుండును మిక్కిలి సంతోషించిరి. ౨౫

సుందరమగు కంఠముగల యాసుగ్రీవుండు దధిముఖుండు చెప్పినది
విని సంతోషించి వనపాలకుండగు నాదధిముఖుం జూచి యిట్లని బదులు
చెప్పెను. ౨౬

ప్రీతోఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః,
మర్షితం మర్షణీయం చ చేష్టితం కృతకర్మణామ్. ౨౭

[గచ్ఛ శీఘ్రం మధువనం సంరక్షస్వ త్వమేవ హి,
శీఘ్రం ప్రేషయ సర్వాంస్తాన్ హనుమత్ప్రముఖాన్కపీన్.]
ఇచ్ఛామి శీఘ్రం హనుమత్ప్రధానాన్ శాఖామృగాం స్తాన్
మృగరాజదర్పాన్, ద్రష్టుం కృతార్థాన్ సహ రాఘవాభ్యాం
శ్రోతుం చ సీతాధిగమే ప్రయత్నమ్. ౨౮

ప్రీతిస్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ కుమారౌ దృష్ట్వా సిద్ధార్థౌ
వానరాణాం చ రాజా, అంగైస్సంహృష్టైః కర్మసిద్ధిం విదిత్వా
బాహ్వోరాసన్నాంసోఽతిమాత్రం ననంద. ౨౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - త్రిషష్టితమస్సర్గః.

## చతుష్షష్టితమస్సర్గః

సుగ్రీవేణైవముక్తస్తు హృష్టో దధిముఖః కపిః,
రాఘవం లక్ష్మణం చైవ సుగ్రీవం చాభ్యవాదయత్. ౧

స ప్రణమ్య చ సుగ్రీవం రాఘవౌ చ మహాబలౌ,
వానరైస్సహితైశ్శూరైర్దివమేవోత్పపాత హ. ౨

స యథైవాఽగతః పూర్వం తథైవ త్వరితం గతః,
నిపత్య గగనాద్భూమౌ తద్వనం ప్రవివేశ హ. 3
స ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్,
విమదానుత్థితాన్ సర్వాన్ మేహమానాన్మధూదకమ్. ౪

"కృతకృత్యులగు వానరులు మధువనంబు నందలి మధువునంతయుం ద్రాగినందుకు నేను సంతసించితిని. వారలు కృతకృత్యులు కాఁబట్టి వారల చేష్టను నేను క్షమింపవలసినది. కావున క్షమించితిని. [కావున వేగముగాఁ బోయి నీకొలువులో నీ వుండుము. వారితోఁ దగవుపెట్టుకొనకుము. హనుమంతుండు మున్నగు వానరులందఱను నేను రమ్మనినట్లు చెప్పుము.]

కృతార్థులును సింహంబునకుంబోలె గర్వంబు గలవారలు నగు హనుమంతుండు మున్నగు వానరులం జూచుటకును సీతాదేవిం జూచుటకై వారలు చేసిన ప్రయత్నంబు వినుటకును నేనును రామలక్ష్మణులును కోరుచున్నాము" అని సుగ్రీవుండు దధిముఖునితోఁ జెప్పెను. ౨౩

సిద్ధార్థులమయితి మని సంతోషమున వికసించిన నేత్రంబులతో నొప్పుచు దేహంబంతయుం గగుర్పాటునొందియున్న రామలక్ష్మణులం జూచి వానరరాజగు సుగ్రీవుండు సంతోషంబునం దనయవయవంబులందు గనుపడు శుభనిమిత్తంబులచేఁ గార్యసిద్ధి హస్తగతంబయినదని మిక్కిలి సంతసించెను.

ఇది యఱువదిమూఁడవ సర్గము

## అఱువదినాలవ సర్గము

దధిముఖుండు సుగ్రీవుండు చెప్పినది విని సంతోషంబు నొంది రామునకును లక్ష్మణునకును సుగ్రీవునకును నమస్కారంబు గావించెను. ౧

ఆదధిముఖుం డట్లు సుగ్రీవునకును మహాబలశాలులగు రామలక్ష్మణులకును నమస్కారంబు గావించి శూరులగు వనపాలురు వెంబడింప నాకాశంబున కుద్గమించెను. ౨

ఆదధిముఖుండు మున్నెట్లు వచ్చినాఁడో అట్లు శీఘ్రంబునం బోయి యంత నాకాశంబుననుండి నేలకు వ్రాలి యామధువనంబుఁ బ్రవేశించెను. ౩

ఆదధిముఖుండు అట్లు మధువనంబుఁ బ్రవేశించి యచ్చటఁ ద్రాగి మధువు జీర్ణించుటవలనఁ గైపువిడిచి లేచి తేనెయు నీళ్లను గలసినమూత్రంబు విడుచుచున్న యంగదాదివానరశ్రేష్ఠులం జూచెను. ౪

స తానుపాగమద్వీరో బద్ధ్వా కరపుటాంజలిం,
ఉవాచ వచనం శ్లక్ష్ణమిదం హృష్టవదంగదమ్. ౫

సౌమ్య రోషో న కర్తవ్యో యదేభిరభివారితః,
అజ్ఞానాద్రక్షిభిః క్రోధాద్భవంతః ప్రతిషేధితాః. ౬
[శ్రాన్తో దూరాదనుప్రాప్తో భక్షయస్వ స్వకం మధు]

యువరాజస్త్వమీశశ్చ వనస్యాస్య మహాబల,
మౌర్ఖ్యాత్పూర్వం కృతో దోషస్తం భవాన్ క్షన్తుమర్హతి.
[యథైవ హి పితా తేఽభూత్పూర్వం హరిగణేశ్వరః,
తథా త్వమపి సుగ్రీవో నాన్యస్తు హరిసత్తమ.]
ఆఖ్యాతం హి మయా గత్వా పితృవ్యస్య తవానఘ,
ఇహోపయాతం సర్వేషామేతేషాం వనచారిణామ్. ౮
స త్వదాగమనం శ్రుత్వా సహైభిర్హరియూథపైః,
ప్రహృష్టో న తు రుష్టోఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్. ౯
ప్రహృష్టో మాం పితృవ్యస్తే సుగ్రీవో వానరేశ్వరః,
శీఘ్రం ప్రేషయ సర్వాంస్తానితి హోవాచ పార్థివః. ౧౦

శ్రుత్వా దధిముఖస్యేదం వచనం శ్లక్ష్ణమంగదః,
అబ్రవీత్తాన్ హరిశ్రేష్ఠో వాక్యం వాక్యవిశారదః. ౧౧

శంకే శ్రుతోఽయం వృత్తాంతో రామేణ హరియూథపాః,
[అయం చ హర్షాదాఖ్యాతి తేన జానామి హేతునా]
తత్ క్షమం నేహ నస్స్థాతుం కృతే కార్యే పరంతపాః. ౧౨

పరాక్రమవంతుండగు నాదధిముఖుండు ఆవానరులయొద్దకుఁ బోయి దొప్పవంటి యంజలి బంధించి యంగదుఁ జూచి సంతోషంబున మధురంబగు నీమాటం జెప్పెను. ౫

శాంతుండవగు నంగదుఁడా! వీరలు నివారించిరని నీవు కోపంబు సేయవలదు. ఈవనపాలురు అజ్ఞానంబువలన నట్లు కోపంబున మి మ్మడ్డగించినారు. [చాలదూరమునుండి బడలి వచ్చినావు. నీసొమ్మగు నీమధువును యథేచ్ఛగాఁ గ్రోలుము.] ౬

మహాబలుండవగు నంగదుఁడా! నీవు యువరాజవు గావున నీమధువనంబునకుఁ బ్రభుండవయితివి. అజ్ఞానంబువలన మున్నపరాధంబుచేసితిమి. నీవు దాని క్షమింపవలయును. [ఈవనమునకు నీవానరులకు నీతండ్రియెట్లు ప్రభువో అట్లే నీవును మాపిన్నతండ్రియు నయి యున్నారు.] ౭

పాపరహితుండవగు నంగదుఁడా! నేను బోయి నీపిన్నతండ్రి సుగ్రీవునకు నీ వీవానరుల యందఱితో నిచ్చటికి వచ్చియుండుట చెప్పితిని. ౮

నేను, నీ వీవానరుల యందఱితోడం గూడవచ్చుటయు మధువనంబు నంతయుఁ జెఱచుటయుఁ జెప్పఁగా విని యాసుగ్రీవుఁడు సంతోషము నొందెను గాని యొంతమాత్రము కోపము నొందఁ డయ్యె. ౯

వానరాధీశ్వరుఁడగు నీపినతండ్రి సుగ్రీవుఁడు అట్లు పరమసంతోషమునొంది "ఆయంగదుఁడు మున్నగువానరులను శీఘ్రమునం బంపుము" అని యాజ్ఞాపించెను. ౧౦

మాటలు చెప్పుటయందుఁ బండితుండును వానరోత్తముండు నగునంగదుఁడు ప్రియంబగు నీదధిముఖుని మాటను విని యావానరులఁ జూచి యిట్లని చెప్పెను. ౧౧

శత్రువులఁ దపింపఁజేయునట్టి వానరశ్రేష్ఠులారా! మన మిచ్చటికి వచ్చియున్నసంగతి రామునకుఁ దెలిసినదని తోఁచుచున్నది. [ఈదధిముఖుఁడు సంతోషముగాఁ జెప్పుచున్నందున నేను గ్రహించినాను.] కావునఁ గార్యంబు సాధించినవెనుక మన మిచ్చట నుండుట యుక్తముకాదు. ౧౨

పీత్వా మధు యథాకామం విశ్రాంతా వనచారిణః,
కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర మే గురుః. ౧౩

సర్వే యథా మాం వక్ష్యంతి సమేత్య హరియూథపాః,
తథాఽస్మి కర్తా కర్తవ్యే భవద్భిః పరవానహమ్. ౧౪

నాజ్ఞాపయితుమీశోఽహం యువరాజోఽస్మి యద్యపి,
అయుక్తం కృతకర్మాణో యూయం ధర్షయితుం మయా. ౧౫

బ్రువతశ్చాంగదస్యైవం శ్రుత్వా వచనమవ్యయం,
ప్రహృష్టమనసో వాక్యమిదమూచుర్వనౌకసః. ౧౬
ఏవం వక్ష్యతి కో రాజన్ ప్రభుస్సన్ వానరర్షభ,
ఐశ్వర్యమదమత్తో హి సర్వోఽహమితి మన్యతే. ౧౭

తవ చేదం సుసదృశం వాక్యం నాన్యస్య కస్యచిత్,
సన్నతిర్హి తవాఖ్యాతి భవిష్యచ్ఛుభయోగ్యతామ్. ౧౮

సర్వే వయమపి ప్రాప్తాస్తత్ర గంతుం కృతక్షణాః,
స యత్ర హరివీరాణాం సుగ్రీవః పతిరవ్యయః. ౧౯
త్వయా హ్యనుక్తైర్హరిభిర్నైవ శక్యం పదాత్పదం,
క్వచిద్గంతుం హరిశ్రేష్ఠ బ్రూమస్సత్యమిదం తు తే. ౨౦

ఏవం తు వదతాం తేషామంగదః ప్రత్యువాచ హ,

బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖముత్పేతుర్మహాబలాః. ౨౧
ఉత్పతంతమనూత్పేతుస్సర్వే తే హరియూథపాః,

వానరులందఱు యథేష్టముగా మధువుఁ ద్రావి యలసటఁ దీర్చుకొన్నారు. ఇఁట నిచ్చటఁ జేయవలసిన దేమున్నది? నాపినతండ్రి సుగ్రీవునొద్దకుఁ బోవలసినదే. ౧౩

వానరశ్రేష్ఠులందఱు వచ్చి యెట్లు చెప్పుదురో అట్లే నేను జేయవలసినవాఁడను. ఇప్పుడు నేను మీరలు చెప్పునట్లు చేయవలసినవాఁడనేకాని స్వతంత్రుండను గాను. ౧౪

నేను యువరాజునైనను ఇప్పుడు మి మ్మాజ్ఞాపింప సమర్థుఁడఁ గాను. కార్యముసాధించి వచ్చియున్న మిమ్ముల నే నాజ్ఞాపించుట యుక్తము గాదు అని అంగదుండు వానరులకుఁ జెప్పెను. ౧౫

అంత వానరులు అంగదుఁడు చెప్పిన వెలలేనిమాటను విని పరమసంతోషమునొంది యంగదుం జూచి యిట్లని చెప్పిరి. ౧౬

మాకుఁ బ్రభుండవు వానరశ్రేష్ఠుండవగు నంగదుఁడా! రాజయినవాఁ డెవ్వఁ డిట్లు చెప్పును? అందఱును బ్రభుత్వముచే దేహముతెలియక యహంకరించి యుందురే కాని యిట్లు వినయము గలిగియుండరు. ౧౭

ఇట్లు చెప్పుట నీకే తగునుగాని మఱియెవ్వనికిని దగదు. నీవినయంబు వలననే నీ కింక గొప్పమంగళంబు గలుగు ననియు నందుకు నీవు దగినవాఁడ వనియుఁ దెలియుచున్నది. ౧౮

మేమందఱమును వానరవీరులకుం బ్రభుండును నాశరహితుండు నగు నాసుగ్రీవునియొద్దకుఁ బోవుటకైయే సిద్ధసన్నాహులమయి వచ్చినాము. ౧౯

వానరశ్రేష్ఠుండవగు నంగదుఁడా! నీయాజ్ఞలేక వానరులకు ఎచ్చటికిని నొక్కయడుగైనను బోవ నలవిగాదు. ఇది సత్యము, నీకుఁ జెప్పినాము. అని యీవానరు లంగదునితో విన్నవించుకొనిరి. ౨౦

ఆవానరు లిట్లు చెప్పినమాటను విని యంగదుఁడు "మంచిది పోదము" అని చెప్పెను. ఇట్లు మాటలాడుకొని మహాబలశాలులగు నావానరులు ఆకాశమున కుద్గమించిరి.

ఆయంగదుఁ డాకాశమున కుద్గమింపఁగానే యీవానరశ్రేష్ఠులంద

కృత్వాకాశం నిరాకాశం యన్త్రోత్క్షిప్తా ఇవాచలాః.
[అఙ్గదం పురతః కృత్వా హనూమన్తం చ వానరమ్.]

తేఽంబరం సహసోత్పత్య వేగవంతః ప్లవంగమాః,
వినదంతో మహానాదం ఘనా వాతేరితా యథా. ౨౩

అంగదే హ్యననుప్రాప్తే సుగ్రీవో వానరాధిపః,
ఉవాచ శోకోపహతం రామం కమలలోచనమ్. ౨౪

సమాశ్వసిహి భద్రం తే దృష్టా దేవీ న సంశయః,
నాగంతుమిహ శక్యం తైరతీతే సమయే హి నః. ౨౫
[అంగదస్య ప్రహర్షాచ్చ జానామి శుభదర్శన]
న మత్సకాశమాగచ్ఛేత్కృత్యే హి వినిపాతితే,
యువరాజో మహాబాహుః ప్లవతాం ప్రవరోఽంగదః. ౨౬
యద్యప్యకృతకృత్యానామీదృశస్స్యాదుపక్రమః,
భవేత్స దీనవదనో భ్రాంతవిప్లుతమానసః. ౨౭

పితృపైతామహం చైతత్పూర్వకైరభిరక్షితం,
న మే మధువనం హన్యాదహృష్టః ప్లవగేశ్వరః. ౨౮

కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత,

దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా. ౨౯
న హ్యన్యః కర్మణో హేతుస్సాధనేఽస్య హనూమతః,

లను ఆకాశమునంతయుం నిరవకాశముగాఁ జేయుచు యంత్రంబుల నెగురఁ గొట్టఁబడిన పర్వతములుంబోలె నతనివెంటనే యాకాశమున కుద్గమించిరి. [వారు అంగదుని హనుమంతుని మున్నిడుకొని పోవుచుండిరి.] ౨౨

వేగవంతులగు నావానరులు వేగమున నాకాశమున కుద్గమించి మహావాయుప్రేరితములగు మేఘములుంబోలె మహాధ్వని గలుగునట్లు గర్జించుచుఁ బోయిరి. ౨౩

అంగదుఁడు వచ్చుటకుమున్న వానరేశ్వరుఁడగు సుగ్రీవుఁడు దుఃఖితుండును గమలములవంటి కండ్లుగలవాఁడు నగు రాముం జూచి యిట్లని చెప్పెను. ౨౪

నీ విఁక దుఃఖింపకుము. నీకు మంగళమగుఁగాక. వారలు సీతాదేవిం జూచి వచ్చినారు. సంశయము లేదు. వారలు సీతం జూడకుందురేని నేను జెప్పినయవధి దాఁటిపోయిన వెనుక నిచ్చటికి రాఁజాలరు. [అంగదునిహర్ష చిహ్నములఁ జూచి నేను కనుఁగొన్నాను.] ౨౫

కార్యము చెడియుండునేని మహాబాహుఁడును వానరశ్రేష్ఠుఁడును యువరాజునగు నంగదుఁడు నాయొద్ద కెంతమాత్రము రాఁడు. ౨౬

ఒకవేళ నావానరులు కార్యము సాధింపనివారలైయే యిచ్చటికి వచ్చినను అప్పటి కంగదుఁడు దీనవదనుఁడును భ్రాంతియుఁ జలనము నొందిన మనసు గలవాఁడునుగా నుండును. ౨౭

వానరేశ్వరుఁడగు నంగదుఁడు అట్లు సంతోషము నొందకుండునేని తండ్రి తాతలనాఁటనుండి జాగ్రత్తతో రక్షింపఁబడుచుండిన నామధువనంబు నెంతమాత్రము నశింపఁజేయఁడు. ౨౮

మంచి వ్రతము లాచరించునట్టి రాముఁడా! సీతసమాచారము తెలిసినది కావున ఇఁక నీవు క్షేమముఁ నొందఁగలవు. కాఁబట్టి యిప్పుడు కౌసల్య మంచి కొడుకుగలదైనది. నీవు దుఃఖము విడువుము.

సీతాదేవిం జూచివచ్చిరి. ఇందు సంశయములేదు. అందు హనుమంతుఁడే చూచియుండునుగాని యిఁక నెవ్వఁడును జూచియుండఁడు. హనుమంతుఁడుదక్క మఱియెవ్వఁడును ఈకార్యమును సాధింపఁజాలఁడు. ౨౯

హనూమతి హి సిద్ధిశ్చ మతిశ్చ మతిసత్తమ. ౩౦
వ్యవసాయశ్చ వీర్యం చ సూర్యే తేజ ఇవ ధ్రువం,

జాంబవాన్యత్ర నేతా స్యాదంగదశ్చ బలేశ్వరః. ౩౧
హనుమాంశ్చాప్యధిష్ఠాతా న తస్య గతిరన్యథా,

మాభూశ్చింతాసమాయుక్తస్సంప్రత్యమితవిక్రమః. ౩౨
[యథా హి దర్పితోదగ్రాః సంగతాః కాననౌకసః,
నైషామకృతకార్యాణామీదృశస్స్యాదుపక్రమః.
వనభంగేన జానామి మధూనాం భక్షణేన చ,]
తతః కిలకిలాశబ్దం శుశ్రావాసన్నమంబరే,
హనుమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్. ౩౩

కిష్కింధాముపయాతానాం సిద్ధిం కథయతామివ,
తతశ్శ్రుత్వా నినాదం తం కపీనాం కపిసత్తమః. ౩౪

ఆయతాంచితలాంగూలస్సోఽభవద్ధృష్టమానసః,
ఆజగ్ముస్తేఽపి హరయో రామదర్శనకాంక్షిణః. ౩౫
అంగదం పురతః కృత్వా హనూమంతం చ వానరం,
తేఽంగదప్రముఖా వీరాః ప్రహృష్టాశ్చ ముదాన్వితాః. ౩౬
నిపేతుర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ,
హనుమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః. ౩౭
నియతామక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్,
[దృష్టా దేవీతి హనుమద్వదనాదమృతోపమం,
ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః.]

బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడవగు రామఁడా! సూర్యునియందుఁ గాంతి యుండునట్లు కార్యసిద్ధియు బుద్ధియు నుత్సాహమును పరాక్రమమును హనుమంతునందు స్థిరముగా నున్నవి. ౩౦

ఏ కార్యమునందు జాంబవంతుఁడు నాయకుఁడును అంగదుఁడు సేనాధిపతియుఁగా నుండునో మఱియు హనుమంతుఁడును దోడ్పడియుండునో అట్టి కార్యము తప్పక సిద్ధించును గాని వేఱువిధంబుగాదు. ౩౧

అమితపరాక్రమశాలియగు రామఁడా! నీ వింక దుఃఖింపవలదు. అని రామునితోఁ జెప్పెను. [ఈవానరులు దర్పితులై వనము పాఁడుజేసి తేనెను ద్రావు టింకమునుబట్టి తప్పక సీతజాడ తెలిసివచ్చిరని నిశ్చయించుచున్నాను.]

అంత నావానరులు కిష్కింధకు సమీపముగా వచ్చి హనుమంతుని సాహసంబునకు గర్వించియున్నవారలు గావునఁ గార్యసిద్ధి యయినదని యందఱకుం దెలియునట్లు సింహనాదంబులు సేయఁగా నాకాశంబుననుండి యాధ్వని సుగ్రీవునకు వినవచ్చెను. ౩౩

వానరశ్రేష్ఠుండగు నాసుగ్రీవుండు వానరుల సింహనాదంబు విని పరమసంతుష్టుండై వాలంబు నిడుపుగాఁ జేసికొని యాడించుకొనుచు నుండెను. ౩౪

రామదర్శనంబుఁ గోరుచున్న యావానరులును అంగదుని హనుమంతుని మున్నిడుకొని వచ్చిరి. ౩౫

పరాక్రమవంతులగు నంగదుఁడు మొదలుగాఁగల యావానరులు అంత వానరరాజగు సుగ్రీవుండును రాముండు నుండుచోట వాలిరి. ౩౬

అంత మహాబాహుండగు హనుమంతుఁడు సాష్టాంగముగా నమస్కరించి సీతాదేవిపాతివ్రత్యనియమంబునం దేజరిల్లుచు క్షేమంబుగ నున్నదని రామునకుం జెప్పెను. [హనుమంతుని నోటినుండి 'చూచితి సీతను' అను నమృతప్రాయమైనమాటను విని రాముఁడును లక్ష్మణుఁడును చాల ముదమందిరి.] ౩౭

నిశ్చితార్థ స్తత స్తస్మిన్ సుగ్రీవః పవనాత్మజే. ౩౮
లక్ష్మణః ప్రీతిమాన్ప్రీతం బహుమానాదవైక్షత,

ప్రీత్యా చ రమమాణోఽథ రాఘవః పరవీరహా,
బహుమానేన మహతా హనుమంతమవైక్షత. ౩౯

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - చతుష్షష్టితమస్సర్గః

---

## ప ఞ్చ ష ష్టి త మ స్స ర్గః.

తతః ప్రస్రవణం శైలం తే గత్వా చిత్రకాననం,
ప్రణమ్య శిరసా రామం లక్ష్మణం చ మహాబలమ్. ౧
యువరాజం పురస్కృత్య సుగ్రీవమభివాద్య చ,
ప్రవృత్తిమథ సీతాయాః ప్రవక్తుముపచక్రముః. ౨
రావణాంతఃపురే రోధం రాక్షసీభిశ్చ తర్జనం,
రామే సమనురాగం చ యశ్చాయం సమయః కృతః. ౩
ఏతదాఖ్యాంతి తే సర్వే హరయో రామసన్నిధౌ.

వైదేహీమక్షతాం శ్రుత్వా రామస్తూత్తరమబ్రవీత్. ౪

క్వ సీతా వర్తతే దేవీ కథం చ మయి వర్తతే,
ఏతన్మే సర్వమాఖ్యాత వైదేహీం ప్రతి వానరాః. ౫

రామస్య గదితం శ్రుత్వా హరయో రామసన్నిధౌ,
చోదయంతి హనూమంతం సీతావృత్తాంతకోవిదమ్. ౬

అంత వాయుదేవుని కుమారుండగు నాహనుమంతుఁడే తప్పక కార్యము సాధించియుండు నని నిశ్చయించియున్న సుగ్రీవుండును లక్ష్మణుండును సంతోషంబు నొంది సంతసించియున్న యాహనుమంతుని బహుమాన దృష్టిం జూచిరి. ౩౮

అంత శత్రువీరులం జంపునట్టిరాముఁడు పరమసంతోషంబు నొంది పరమబహుమానంబున నాహనుమంతుని జూచెను. ౩౯

ఇది యఱువదినాలుగవ సర్గము.

---

## అఱువదియైదవ సర్గము

అట్లు ఆవానరులు చిత్రములగు నరణ్యములుగల ప్రస్రవణపర్వతంబుఁ జేరి సాష్టాంగముగా రామలక్ష్మణులకు నమస్కరించి సుగ్రీవునకు మ్రొక్కి యంత యువరాజగు నంగదుం బురస్కరించుకొని సీతావృత్తాంతముఁ జెప్ప నారంభించిరి. ౧, ౨

వానరులందఱును సీతాదేవి రావణుని యంతఃపురమునందు నిర్బంధమున నుండుటయుం బాబిడను రాక్షసస్త్రీలు బెదరించుటయుం బాబిడకు రాముని యందుఁగల యనురాగమును రావణుండు సీతకుఁ బెట్టిన యవధియును ఈ సమాచారంబంతయు రామునకుం జెప్పిరి. ౩

రాముండు సీతాదేవి నాశమునొందక క్షేమముగా నున్నదని విని వానరులం జూచి యిట్లని చెప్పెను. ౪

వానరులారా! సీతాదేవి యెచ్చట నున్నది? నావిషయమయి యాబిడ మన స్సెట్లున్నది? ఈసమాచారమునంతయు నాకు మీరు చెప్పవలయును. అని రాముండు వానరుల నడిగెను. ౫

వానరులు రాముండు చెప్పినమాటను విని రామసమీపంబున సీతా వృత్తాంతముఁ జక్కఁగా తెలిసిన హనుమంతునిం జెప్పుమనిరి. ౬

శ్రుత్వా తు వచనం తేషాం హనుమాన్మారుతాత్మజః,
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి. ౭
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సీతాయా దర్శనం యథా,
[తం మణిం కాంచనం దివ్యం దీప్యమానం స్వతేజసా,
దత్త్వా రామాయ హనుమాం స్తతః ప్రాఞ్జలిరబ్రవీత్.]
సముద్రం లంఘయిత్వాహం శతయోజనమాయతమ్. ౮
అగచ్ఛం జానకీం సీతాం మార్గమాణో దిదృక్షయా,
తత్ర లంకేతి నగరీ రావణస్య దురాత్మనః. ౯
దక్షిణస్య సముద్రస్య తీరే వసతి దక్షిణే,
తత్ర దృష్టా మయా సీతా రావణాంతఃపురే సతీ. ౧౦

సన్న్యస్య త్వయి జీవంతీ రామా రామమనోరథం,
దృష్టా మే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః. ౧౧
రాక్షసీభిర్విరూపాభీ రక్షితా ప్రమదావనే,
దుఃఖమాసాద్యతే దేవీ తథాఽదుఃఖోచితా సతీ. ౧౨
రావణాంతఃపురే రుద్ధా రాక్షసీభిస్సురక్షితా,
ఏకవేణీధరా దీనా త్వయి చింతాపరాయణా. ౧౩
అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే,
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా. ౧౪
దేవీ కథంచిత్కాకుత్స్థ త్వన్మనా మార్గితా మయా,

ఇక్ష్వాకువంశవిఖ్యాతిం శనైః కీర్తయతానఘ. ౧౫
సా మయా నరశార్దూల విశ్వాసముపపాదితా,

ఆవానరులు చెప్పినమాటను విని మాటలయందుఁ బండితుండును వాయుదేవుని కుమారుండు నగు హనుమంతుఁడు సీతాదేవికిని ఆబిడయుండు దిక్కునకును సాష్టాంగముగా నమస్కరించి [ఆమె యిచ్చినమణిని రామునకు సమర్పించి] తాను సీతాదేవిం జూచిన విధముం జెప్పెను. ౭

నేను నూఱుయోజనముల యాయామంబుగల సముద్రము దాఁటి సీతాదేవిం జూడఁగోరి వెదకుచుఁ బోతిని. ౮

అచ్చట దక్షిణసముద్రంబు దక్షిణపుగట్టునందు దురాత్ముం డగు రావణుని పట్టణము లంక యనునది యొక్కటి గలదు. ౯

రాముఁడా ! అచ్చట రావణాంతఃపురమునందుఁ బతివ్రతయుఁ సుందరాంగియు నీయందు మనం బుంచి జీవంబుతో నున్నదియు నగుసీతాదేవిం జూచితిని. ౧౦

అచ్చట నంతఃపురవనమున రాక్షసస్త్రీలనడుమఁ గావలియున్న రాక్షసస్త్రీలచే మాటిమాటికి బెదరింపఁబడుచున్న సీతాదేవిం జూచితిని. ౧౧

దుఃఖం బనుభవింప నెంతమాత్రము తగనిదియుఁ బతివ్రతయుఁ నగు సీతాదేవి యట్టు నానావిధదుఃఖంబులం బొందుచున్నది. ౧౨

రాముఁడా ! రావణాంతఃపురమున రాక్షసస్త్రీలచే రక్షింపఁబడుచు నొక్కటే జడగాఁ గట్టిన తలవెంట్రుకలు గల్గి దీనయయి నీయందే మనసు నుంచి నిన్నే ధ్యానించుచు నేలఁబరుండుటచేఁ జెల్లఁబాఱిన దేహముగలది గావున హేమంతఋతువునందలి తామరకొలఁకుఁబోలెఁ గాంతిహీన యయి రావణునందు మనస్సు సేర్పక యతనినిర్బంధమునకు మరణము నొంద నిశ్చయించి యున్న సీతాదేవిని అతిప్రయాసమునఁ జూచితిని. ౧౩, ౧౪

పాపరహితుఁడవును పురుషశ్రేష్ఠుఁడవు నగురాముఁడా ! నేను మెల్లఁగా నిక్ష్వాకువంశవృత్తాంతముఁ జెప్పి యాబిడకు నాయందు నమ్మకము గలిగించుకొంటిని. ౧౫

తత స్సంభాషితా దేవీ సర్వమర్థం చ దర్శితా. ౧౬
రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా,

నియతస్సముదాచారో భక్తిశ్చాస్యాస్తథా త్వయి. ౧౭

ఏవం మయా మహాభాగా దృష్టా జనకనందినీ,
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ. ౧౮

అభిజ్ఞానం చ మే దత్తం యథావృత్తం తవాంతికే,
చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ. ౧౯
విజ్ఞాప్యశ్చ నరవ్యాఘ్రో రామో వాయుసుత త్వయా,
అఖిలేనేహ యద్దృష్టమితి మామాహ జానకీ. ౨౦

అయం చాస్మై ప్రదాతవ్యో యత్నాత్సుపరిరక్షితః,
బ్రువతా వచనాన్యేవం సుగ్రీవస్యోపశృణ్వతః. ౨౧
ఏష చూడామణిశ్శ్రీమాన్ మయా సుపరిరక్షితః,
మనశ్శిలాయాస్తిలకో గండపార్శ్వే నివేశితః. ౨౨
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి,

ఏష నిర్యాతితశ్శ్రీమాన్మయా తే వారిసంభవః. ౨౩
ఏతం దృష్ట్వా ప్రమోదిష్యే వ్యసనే త్వామివానఘ,

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ. ౨౪
ఊర్ధ్వం మాసాన్న జీవేయం రక్షసాం వశమాగతా,

అంత నేను సీతాదేవితో మాటలాడి సమాచారమునంతయుఁ జెప్పితిని.

ఆసీతాదేవి నీకునుఁ సుగ్రీవునకు గల స్నేహమును విని సంతోషము నొందినది. ౧౬

ఆసీతాదేవి పాతివ్రత్యమును ఆబిడకు నీయందుఁగల భక్తియును ఎంతమాత్రము తఱుఁగకున్నది. ౧౭

పురుషశ్రేష్ఠుఁడవగు రాముఁడా! ఇట్లు నేను మహాభాగురాలును భయంకరముగా నాహారము విడిచి నీయందు భక్తిగలిగి యున్నదియు నగు సీతాదేవిం జూచితిని. ౧౮

మహాపండితుఁడవగు రాముఁడా! చిత్రకూటపర్వతమున నీయొద్ద జరిగిన యొక కాకివృత్తాంతమును నాకు గుఱుతుగాఁ జెప్పినది. ౧౯

"వాయుకుమారుండవగు హనుమంతుఁడా! నీ విచ్చటఁ జూచినదిచూచి నట్టుగా సమాచారమునంతయుఁ బురుషశ్రేష్ఠుండగు రామునియొద్ద విన్నపింపవలయు" అని సీతాదేవి నాతోఁ జెప్పినది. ౨౦

నీవు, సుగ్రీవుఁడు వినుచుండఁగా నేనిప్పుడు చెప్పుమాటలుచెప్పి యింతవఱకు మహాయత్నమునఁ గాపాడిన యాచూడామణిని రామున కొసఁగుము.

శ్రీమంతమగు నీచూడామణిని నేను మహాప్రయత్నమునఁ గాపాడితిని.

ఒకనాఁడు నాబొట్టు కరఁగి కనుపడకుండఁగా నీవు మణిశిలను బొట్టుగాఁజేసి నానుదుటం బ్రతిఫలించి బొట్టుగాఁ గనుపట్టుచుండునట్లు నాయెదుట నుండిన గుండ్రాయిపై నుంచినావు. దానిం దలఁచుకొనుము. ౨౨

పాపరహితుండవగురామా! సముద్రమునందుఁ బుట్టినయాచూడామణిని నీకొఱకుఁ బంపితిని. ఈదుఃఖంబునందుఁ నిన్నుఁ జూచినట్లు దీనిం జూచి సంతోషించుచుంటిని. ౨౩

దశరథకుమారుండ వగు రాముఁడా! ఇంక నొక నెలవఱకు జీవించి యుండెదను. ఈరాక్షసులనడుమం జిక్కి యింక నొకమాసమునకుఁ బై జీవింపంజాలను. అని సుగ్రీవుఁడు వినుచుండ రామునితోఁ జెప్పి యీచూడామణి నిమ్ము అని సీతాదేవి నాతోఁ జెప్పినది. ౨౪

ఇతి మామబ్రవీత్సీతా కృశాంగీ ధర్మచారిణీ. ౨౫
రావణాంతఃపురే రుద్ధా మృగీవోత్ఫుల్లలోచనా,

ఏతదేవ మయాఖ్యాతం సర్వం రాఘవ యద్యథా. ౨౬

సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతాం,

తౌ జాతాశ్వాసౌ రాజపుత్త్రౌ విదిత్వా
తచ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ,
దేవ్యా చాఖ్యాతం సర్వమేవానుపూర్వ్యా
ద్వాచా సంపూర్ణం వాయుపుత్త్రశ్శశంస. ౨౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - పఞ్చషష్టితమస్సర్గః.

---

## షట్షష్టితమస్సర్గః

ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః,
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః. ౧

తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవశ్శోకకర్శితః,
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవమిదమబ్రవీత్. ౨

యథైవ ధేనుస్స్రవతి స్నేహాద్వత్సస్య వత్సలా,
తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్. ౩
మణిరత్నమిదం దత్తం వైదేహ్యాశ్శ్వశురేణ మే,

కృశించినదేహముగలదియుఁ ధర్మంబు వదలకున్నదియుఁ రావణునియంతః పురమున నిరోధింపఁబడియున్నదియు లేడివలె భయాతిశయమున వికసించిన నేత్రములుగలదియుఁ నగు సీతాదేవి నాతో నిట్లు చెప్పినది. ౨౭

రాముఁడా! సీతాదేవి నాతో నేమేమి చెప్పినదో దానినంతయుఁ నీకుఁ జెప్పివేసితిని. ౨౮

ఎట్లయినను సముద్రము దాఁటు నుపాయము నాలోచింపుఁడు. అని హనుమంతుండు రామునితోఁ జెప్పెను.

ఇట్లు వాయుదేవుని కుమారుండగు హనుమంతుఁడు రాచకొమరులగు రామలక్ష్మణులు కొంత యూఱట నొందియుండుటం దెలిసికొని, సీతయొసంగిన చూడామణిని రామున కొసంగి యాబిడ చెప్పిపంపిన సమాచారము నంతయుఁ గ్రమముగా రామునకుం జెప్పెను. ౨౯

ఇది యఱువదియైదవ సర్గము.

---

## అఱువదియాఱవ సర్గము

దశరథుని కుమారుండగు రాముండు హనుమంతుఁడు చెప్పినది విని యాచూడామణిని ఱొమ్ముపై నుంచుకొని లక్ష్మణునితోఁ గూడ రోదనముఁ జేసెను.

మణులలోనుత్తమంబగు నాచూడామణిం జూచినంతనే రాముఁడు పరమదుఃఖముఁ నొంది కన్నులనిండఁ గన్నీళ్లుగాఱ సుగ్రీవుం జూచి యిట్లని చెప్పెను. ౨

దూడయం దధికప్రీతిగలయావు, దూడయందలి స్నేహమున స్రవించు నట్లు నామనసు ఈచూడామణిం జూచి స్రవించుచున్నది. ౩

మణిశ్రేష్ఠమగు నీచూడామణిని నామామయగు జనకమహారాజు సీతాదేవి కొసంగెను.

వధూకాలే యథాబద్ధమధికం మూర్ధ్ని శోభతే. ౪

అయం హి జలసంభూతో మణిస్సజ్జనపూజితః,
యజ్ఞే పరమతుష్టేన దత్తశ్శక్రేణ ధీమతా. ౫

ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనం,
అద్యాస్మ్యవగతస్సౌమ్య వైదేహస్య తథా విభోః. ౬
అయంహి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మే మణిః,
అస్యాద్య దర్శనేనాహం ప్రాప్తాం తామివ చింతయే. ౭

కిమాహ సీతా వైదేహీ బ్రూహి సౌమ్య పునఃపునః,
పిపాసుమివ తోయేన సించంతీ వాక్యవారిణా. ౮

ఇతస్తు కిం దుఃఖతరం యదిమం వారిసంభవం,
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీమాగతాం వినా. ౯
చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి,

క్షణం సౌమ్య న జీవేయం వినా తామసితేక్షణామ్. ౧౦

నయ మామపి తం దేశం యత్ర దృష్టా మమ ప్రియా,
న తిష్ఠేయం క్షణమపి ప్రవృత్తిముపలభ్య చ. ౧౧
కథం సా మమ సుశ్రోణీ భీరు భీరుస్సతీ సదా,
భయావహానాం ఘోరాణాం మధ్యే తిష్ఠతి రక్షసామ్. ౧౨

వివాహకాలమున నధికప్రకాశము గలుగునట్లు దానిం దలయందు బంధించిరి. ౪

మున్ను బుద్ధిమంతుఁడగు నింద్రుఁడు, జనకమహారాజు యాగము సేయఁగా దానికి సంతోషించి జలంబునం బుట్టినదియుఁ బెద్దలచేఁ బూజింపఁ బడినదియు నగు నీచూడామణిని ఆయన కొసంగెను. ౫

సౌమ్యుండవగు సుగ్రీవుఁడా! ఇప్పుడు నాకు ఈచూడామణిం జూడఁగా నాతండ్రి దశరథమహారాజును, జనకమహారాజునుం జూచినట్లున్నది. ౬

ఈచూడామణి నాప్రియురాలిశిరంబునం బ్రకాశించుచుండునది. కావున నిప్పుడు నాకు దీనింజూచుటచే నాప్రియురాలిం జూచినట్లున్నది. అని రాముండు సుగ్రీవునితోఁ జెప్పెను. ౭

సౌమ్యుండవగు హనుమంతుఁడా! సీతాదేవి దప్పిగొన్నవాని జలంబు చేతంబోలె నన్ను వాక్యజలంబులం దడుపుచు ఇంకను ఏమిచెప్పినది? అని రాముఁడు హనుమంతునితోఁ జెప్పెను. ౮

లక్ష్మణుఁడా! సీతం జూడక సీతధరించు నీచూడామణిని జూచు చున్నానే? దీనికన్న నింక నాకు దుఃఖము గలిగించునది యేమి? ౯

సీత యింక మాసమువఱకు నన్ను విడిచి బ్రతికియుండునేని ఆ! అది బహుకాలమువఱకు బ్రతికియుండునట్లె?

తిన్ననివాఁడవగు లక్ష్మణుఁడా! నే నింక నల్లనికండ్లుగల యాసీతను విడిచి క్షణంబయినను బ్రతికియుండఁజాలను. అని రాముఁడు లక్ష్మణునితోఁ జెప్పెను. ౧౦

నన్ను సీతయున్నచోటికిఁ దీసికొనిపొమ్ము. ఆబిడవృత్తాంతంబు దెలిసిన వెనుక నే నింక క్షణంబైనను ఇచ్చోట నుండను. ౧౧

సుందరంబులగు పిఱుఁదులు గలదియుఁ మిక్కిలియుఁ భయపడు స్వభావంబు గలదియు నగు నాభార్య సీత భయంకరాకారులు నుగ్రులు నగురాక్షసులనడుమ నెట్లప్పుడు నెట్లున్నది? ౧౨

శారద స్తిమిరోన్ముక్తో నూనం చన్ద్ర ఇవాంబుదైః,
ఆవృతం వదనం తస్యా న విరాజతి రాక్షసైః. ౧౩

కిమాహ సీతా హనుమం స్తత్త్వతః కథయాద్య మే,
ఏతేన ఖలు జీవిష్యే భేషజేనాతురో యథా. ౧౪

మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ,
మద్విహీనా వరారోహా హనుమన్ కథయస్వ మే. ౧౫
[దుఃఖాద్దుఃఖతరం ప్రాప్య కథం జీవతి జానకీ]

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - షట్షష్టితమస్సర్గః.

---

## సప్తషష్టితమస్సర్గః

ఏవముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా,
సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే. ౧
ఇదముక్తవతీ దేవీ జానకీ పురుషర్షభ,
పూర్వవృత్తమభిజ్ఞానం చిత్రకూటే యథాతథమ్. ౨

సుఖసుప్తా త్వయా సార్ధం జానకీ పూర్వముత్థితా,
వాయసస్సహసోత్పత్య విరరాద స్తనాన్తరే. 3

పర్యాయేణ చ సుప్త స్త్వం దేవ్యంకే భరతాగ్రజ,
పునశ్చ కిల పక్షీ స దేవ్యా జనయతి వ్యథామ్. ౪

ఎంతమాత్రము చీఁకటిలేని శరదృతువునందలి చంద్రుఁడు మేఘంబులచేఁ గప్పఁబడినచోఁ బ్రకాశింపకుండునట్లు సీతముఖంబు రాక్షసులచేఁ గప్పఁబడినదగుటంజేసి యెంతమాత్రము ప్రకాశింపదు. ఇది నిశ్చయము. ౧౩

హనుమంతుఁడా! సీత యేమి చెప్పినది? నా కిప్పుడు యథార్థముగాఁ జెప్పుము. రోగి మందుచే జీవించునట్లు నేను సీతచెప్పినమాటలను నీవు చెప్పఁగా వినుచు జీవించియుందును. ౧౪

హనుమంతుఁడా! సుందరియు మధురంబులగు మాటలు చెప్పునదియు సుందరంబులగు పిఱుఁదులు గలదియు నగు నాభార్య సీతాదేవి నన్ను విడచి పరమదుఃఖితయయి నీతో నేమి చెప్పినది? నాకుఁ జెప్పుము. అని రాముండు హనుమంతు నడిగెను.

ఇది యఱువదియాఱవ సర్గము.

---

## అఱువదియేడవ సర్గము

హనుమంతుఁడు మహాత్ముఁడగు రాముఁడు చెప్పినది విని సీతాదేవి చెప్పినదంతయుం రామునకుం జెప్ప నారంభించెను. ౧

పురుషశ్రేష్ఠుండవగు రాముఁడా! సీతాదేవి చిత్రకూటపర్వతంబున జరిగిన వృత్తాంతమును జరిగినది జరిగినట్టుగా నీప్రకారము నాకుఁ గుఱుతుగాఁ జెప్పెను. ౨

సీతాదేవి యాచిత్రకూటపర్వతంబున నీతోఁగూడఁ బరుండి సుఖంబుగా నిదురించుచుండి ముందు తాను నిద్రలేచినది. అప్పుడు కాకంబొకటి వేగంబున వచ్చి యాబిడ స్తనంబులపై గీఱెను. ౩

భరతుని యన్నయగు రాముఁడా! ఆసీతాదేవి నిద్రలేచినపిమ్మట నీవు ఆబిడతొడపైఁ బరుండి నిదురించితివి. మరల నాకాకము సీతాదేవిని బాధింప నారంభించినది. ౪

పునః పునరుపాగమ్య విదదార భృశం కిల,

తత స్త్వం బోధిత స్తస్యా శ్శోణితేన సముత్థితః. ౫
వాయసేన చ తేనైవ సతతం బాధ్యమానయా,
బోధితః కిల దేవ్యా త్వం సుఖసుప్తః పరంతప. ౬

తాం తు దృష్ట్వా మహాబాహో దారితాం చ స్తనాంతరే,
ఆశీవిష ఇవ క్రుద్ధో నిశ్వసన్నభ్యభాషథాః. ౭

నఖాగ్రైః కేన తే భీరు దారితం తు స్తనాంతరం,
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా. ౮

నిరీక్షమాణ స్సహసా వాయసం సమవైక్షథాః,
నఖై స్సరుధిరై స్తీక్ష్ణైస్తామేవాభిముఖం స్థితమ్. ౯
సుతః కిల స శక్రస్య వాయసః పతతాం వరః,
ధరాంతరచర శ్శీఘ్రం పవనస్య గతౌ సమః. ౧౦
తత స్తస్మిన్మహాబాహో కోపసంవర్తితేక్షణః,
వాయసే త్వం కృథాః క్రూరాం మతిం మతిమతాం వర. ౧౧
స దర్భం సంస్తరా ద్గృహ్య బ్రహ్మాస్త్రేణ హ్యయోజయః,
ప్రదీప్త ఇవ కాలాగ్ని ర్జజ్వాలాభిముఖః ఖగమ్. ౧౨

క్షిప్తవాం స్త్వం ప్రదీప్తం హి దర్భం తం వాయసం ప్రతి,
తత స్తు వాయసం దీప్త స్సదర్భోఽనుజగామ హ. ౧౩
స పిత్రా చ పరిత్యక్త స్సురైశ్చ సమహర్షిభిః,
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య త్రాతారం నాధిగచ్ఛతి. ౧౪

ఆ కాకము మాటిమాటికి సీతాదేవి పైకి వచ్చి యాబిడ స్తనంబుల గీఱుచుండెను. ౪

అంత నాబిడ నెత్తురుచేఁ దడుపఁబడుచుండిన నిన్ను నిద్ర లేపినది. ౫

శత్రువులం దపింపఁజేయునట్టి రామఁడా ! అంత సీతాదేవి యా కాకముచే విడువక బాధింపఁబడుచు నాబాధకును దాళలేక సుఖంబుగా నిదురించుచున్న నిన్ను నిద్ర లేపినది. ౬

మహాబాహుఁడవగు రామఁడా ! నీవు స్తనంబులపై గీఱఁబడియున్న యాసీతం జూచినంతనే సర్పముంబోలెఁ గోపంబునొంది నిట్టూర్పులు పుచ్చుచు నిట్లని చెప్పితివి. ౭

భయపడు స్వభావముగలసీతా ! ఎవ్వండు నఖాగ్రంబున నీస్తనంబులను గీఱెను ? ఎవ్వండు కోపించియున్న యయిదుతలలపాముతో నాట లాడెను? అని నీవు సీతతోఁ జెప్పితివి. ౮

అంత శీఘ్రంబున నాలుగుప్రక్కలం జూచి యాబిడకెదురుగానే నెత్తురుదగిలినవియుఁ దీక్ష్ణములయినవియు నగుగోళ్లతోనున్న కాకింజూచితివి.

పక్షులలో శ్రేష్ఠమయినయాకాకి ఇంద్రునికొడుకు; పర్వతప్రదేశములం దిరుగుచుండును. శీఘ్రగమనంబున వాయువునకు సరివచ్చునది. ౧౦

మహాబాహుండవు బుద్ధిమంతులలో శ్రేష్ఠుండవునగు రామఁడా! అంత నీవు మహాకోపంబునొంది ఆకాకిపై నతిభయంకరంబగు బుద్ధిం జేసితివి. ౧౧

అంత నీవు దర్భాసనంబుననుండి యొకదర్భను దీసి దానిని బ్రహ్మాస్త్రమంత్రంబున నభిమంత్రించితివి.

అంత నాదర్భ యాకాకి కెదురై ప్రళయకాలాగ్నిహోత్రంబువలె జ్వలించినది. ౧౨

నీవు మండుచున్న యాదర్భను కాకిపై వేసితివి. అంత నాదర్భ జ్వలించుచు నాకాకిపై కదలినది. ౧౩

ఆకాకము మూఁడులోకంబులుం దిరిగినను దండ్రియయిన యింద్రుఁడును దాని రక్షింపఁజాలఁడయ్యె. అట్లు దేవతలు మహర్షులును దానిని రక్షింపం జాలరైరి. అట్లు ఎచ్చటికిం బోయినను దానికి రక్షకుఁడు దొరకఁడయ్యె. ౧౪

పునరేవాగత స్త్రస్త స్త్వత్సకాశ మరిందమ,

స తం నిపతితం భూమౌ శరణ్యశ్శరణాగతమ్. ౧౫
వధార్హమపి కాకుత్ స్థ కృపయా పర్యపాలయః,

మోఘ మస్త్రం న శక్యం తు కర్తు మిత్యేవ రాఘవ. ౧౬
భవాం స్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణం,
రామ త్వాం స నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ. ౧౭
విసృష్టస్తు తదా కాకః ప్రతిపేదే స్వమాలయం,
ఏవ మస్త్రవిదాం శ్రేష్ఠ స్సత్త్వవా ఞ్ఛీలవానపి. ౧౮
కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః,

న నాగా నాపి గంధర్వా నా సురా న మరుద్గణాః. ౧౯
న చ సర్వే రణే శక్తా రామం ప్రతి సమాసితుం,
తస్య వీర్యవతః కశ్చి ద్యద్య స్తి మయి సంభ్రమః. ౨౦
క్షిప్రం సునిశితై ర్బాణై ర్హన్యతాం యుధి రావణః,

భ్రాతు రాదేశ మాజ్ఞాయ లక్ష్మణో వా పరంతపః. ౨౧
స కిమర్థం నరవరో న మాం రక్షతి రాఘవః.

శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ. ౨౨
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మా ముపేక్షతః,

మమైవ దుష్కృతం కించి న్మహద స్తి న సంశయః. ౨౩
సమర్థౌ సహితౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ,

శత్రువుల నడంగఁ ద్రొక్కినట్టి రాముఁడా! ఆకాకి మిక్కిలి భయపడి మరల నీయొద్దకే వచ్చినది.

రాముఁడా! అట్టిశరణ్యుండవగు నీవు నీముందట భయంబునంగావవే యని వేఁడంబడినదియు శరణాగతంబునగు నాకాకము అపరాధి కావున వధార్హమయినను దానిం గాపాడితివి. ౧౫

రాముఁడా! బ్రహ్మాస్త్రము వ్యర్థముసేయ నలవిగాదనియే నీవు ఆకాకి కుడికన్ను గొట్టివేసితివి. ౧౬

రాముఁడా! అప్పుడు నీవు దాని విడిచినపిమ్మట నాకాకి నీకును దశరథమహారాజునకును నమస్కరించి తనస్థానంబునకుఁ బోయినది. ౧౭

ఇట్లు అస్త్రవేత్తలలో నుత్తముఁడును బలవంతుఁడును సత్త్వభావంబు గలవాఁడు నగురాముఁడు రాక్షసులపై నస్త్రంబును బ్రయోగింపఁడేల ? ౧౮

సర్పంబులుగానీ గంధర్వులుగానీ యసురులుగానీ దేవతలుగానీ యెవ్వరును యుద్ధంబున రామునియెదుట నిలువంజాలరు. ౧౯

మహాపరాక్రమశాలియగు నారామునకుఁ గొంచెమేనియుం నాయందుత్సాహం బుండునేని శీఘ్రంబుగాఁ దీక్ష్ణంబులగు బాణంబులు ప్రయోగించి యుద్ధంబున రావణుని జంపుఁగాక. ౨౦

శత్రువులఁ దపింపఁ జేయువాఁడును పురుషశ్రేష్ఠుండును రఘువంశంబునం బుట్టినవాఁడు నగులక్ష్మణుండైనను అన్నయనుజ్ఞ నొంది వచ్చి నన్ను రక్షింపకున్నాఁడేమి ? ౨౧

సమర్థులును పురుషశ్రేష్ఠులును వాయ్వగ్నులకుంబోలెఁ దేజముగలవారలును దేవతలకుంగూడ నెదిరింప నలవిగానివారలు నగు నారామలక్ష్మణులు నన్నేల యుపేక్షించియున్నారు ? ౨౨

సమర్థులును శత్రువులఁ దపింపఁజేయంగలవారలు నగునారామలక్ష్మణు లొక్కటిగానుండి నన్నుఁ జూడకున్నారే! యిందువలన నేనే యేమైనను గొప్పపాపమును జేసియున్నట్లున్నది. ఇందుకు సంశయములేదు. అని సీతాదేవి నాలోఁ జెప్పినది. ౨౩

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్. ౨౪
పున రప్యహ మార్యాం తా మిదం వచన మబ్రువం,
త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే. ౨౫
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే,

కథంచి ద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్. ౨౬
అస్మిన్ముహూర్తే దుఃఖానామంతం ద్రక్ష్యసి భామిని,

తావుభౌ నరశార్దూలౌ రాజపుత్రావనిందితౌ. ౨౭
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః.

హత్వా చ సమరే రౌద్రం రావణం సహబాంధవమ్. ౨౮
రాఘవ స్త్వాం వరారోహే స్వాం పురీం నయతే ధ్రువం,

యత్తు రామో విజానీయా దభిజ్ఞాన మనిందితే. ౨౯
ప్రీతిసంజననం తస్య ప్రదాతుం త్వ మిహార్హసి,

సాభివీక్ష్య దిశస్సర్వా వేణ్యుద్గ్రథిత ముత్తమమ్. ౩౦
ముక్త్వా వస్త్రాద్దదౌ మహ్యం మణి మేతం మహాబల,

ప్రతిగృహ్య మణిం దివ్యం తవ హేతో రఘూద్వహ. ౩౧
శిరసా తాం ప్రణమ్యార్యా మహ మాగమనే త్వరే,

గమనే చ కృతోత్సాహ మవేక్ష్య వరవర్ణినీ. ౩౨
వివర్ధమానం చ హి మా మువాచ జనకాత్మజా,

సీతాదేవి దుఃఖకరముగాఁ గన్నులనిండఁ గన్నీళ్లు గాఱం జెప్పినమాటను విని నేను పూజ్యురాలగు నాసీతాదేవిం జూచి మరల నిట్లని చెప్పితిని. ౨౪

సీతాదేవీ! నేను నీకొఱకు సత్యముపై శపథముచేసి చెప్పుచున్నాను. నీదుఃఖమున రాముం డేకార్యంబునం దుత్సాహంబు లేకున్నాఁడు. రాముఁడు దుఃఖంబు నొందఁగానే లక్ష్మణుఁడును దుఃఖంబు నొందును. ౨౫

సీతాదేవీ! అతిప్రయాసంబున నిన్నుం జూడఁగంటిని. ఇప్పుడు సంతోషింపవలయునుగాని దుఃఖింపరాదు. ఇంక శీఘ్రంబుగానే నీదుఃఖంబులన్నియు నశించును. ౨౬

పురుషశ్రేష్ఠులును నిందింపఁబడనివారలును నిన్నుఁ జూడఁ గోరియుండువారలు నగు రాజకుమారులయిన రామలక్ష్మణు లిద్దఱును లంకాపట్టణం బంతయుం భస్మంబు గావింతురు. ౨౭

సుందరములగు పిఱుఁదులుఁగల సీతాదేవీ! రాముఁడు భయంకరుండగు రావణుని యుద్ధంబునం జంపి నిన్నుఁ దనపట్టణంబునకుఁ గొనిపోవును. ఇది నిశ్చయము. ౨౮

నిందింపఁబడనట్టి సీతాదేవీ! రాముఁడు దేని నెఱుంగునో మఱియు నేది యతనికి సంతోషంబు గలిగించునో అట్టిగుఱుతును నీవు నా కిప్పుడు ఇయ్యవలయును అని సీతాదేవితోఁ జెప్పితిని. ౨౯

మహాబలుండవగు రాముఁడా! అంత సీతాదేవి దిక్కులన్నియుఁ జూచుచుఁ దనజడలో ధరింపఁదగినదియు నుత్తమంబునగు నీచూడామణిని చెఱఁగుననుండి విప్పి నాచేతి కిచ్చినది. ౩౦

రాముఁడా! నే నట్లు నీకొఱకై దివ్యంబగు చూడామణిం దీసికొని పూజ్యురాలగు సీతాదేవికి సాష్టాంగంబుగా నమస్కరించి త్వరగా మరలి రాఁదలంచితిని. ౩౧

ఉష్ణకాలంబున సుఖశీతంబును శీతకాలంబున సుఖోష్ణంబునగుదేహము గల్గి పెనిమిటియం దధికప్రేమగల యుత్తమస్త్రీయగు జనకమహారాజు కొమార్తె యయిన సీతాదేవి, ప్రయాణోన్ముఖుండనై మేనుఁ బెంచుచున్ననన్నుం జూచి యిట్లని చెప్పినది. ౩౨

అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పసందిగ్ధభాషిణీ. 33
మమోత్పతనసంభ్రాంతా శోకవేగసమాహతా,
[మా మువాచ తత స్సీతా సభాగ్యోఽసి మహాకపే,
యద్ద్రక్ష్యసి మహాబాహుం రామం కమలలోచనమ్.
లక్ష్మణం చ మహాబాహుం దేవరం మే యశస్వినం,
సీతయాప్యేవముక్తోఽహ మబ్రువం మైథిలీం తథా.
పృష్ఠ మారోహ మే దేవి క్షిప్రం జనకనన్దిని,
యావ త్తే దర్శయామ్యద్య ససుగ్రీవం సలక్ష్మణమ్.
రాఘవం చ మహాభాగే భర్తార మసితేక్షణే,
సాఽబ్రవీ న్మాం తతో దేవీ నైష ధర్మో మహాకపే.
య త్తే పృష్ఠం సిషేవేఽహం స్వవశా హరిపుంగవం,
పురా చ యదహం వీర స్పృష్టా గాత్రేషు రక్షసా.
తత్రాహం కిం కరిష్యామి కాలేనోపనిపీడితా,
గచ్ఛ త్వం కపిశార్దూల యత్ర తౌ నృపతేస్సుతౌ,
ఇత్యేవం సా సమాభాష్య భూయస్సందేష్టుమాస్థితా,]
హనుమన్ సింహసంకాశావుభౌ తౌ రామలక్ష్మణౌ. 34
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయం,
యథా చ స మహాబాహు ర్మాం తారయతి రాఘవః. 35
అస్మాద్దుఃఖాంబుసంరోధా త్త్వం సమాధాతు మర్హసి,
ఇమం చ తీవ్రం మమ శోకవేగం రక్షోభిరేభిః పరిభర్త్సనం చ, బ్రూయాస్తు రామస్య గతస్సమీపం శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర. 36
ఏత త్తవార్యా నృపరాజసింహా సీతా వచః ప్రాహ విషాద

అప్పుడు సీతాదేవి కండ్లనిండఁ గన్నీళ్లుగాఱ దీనయయి మాటలు తడఁబడ నే నెక్కడఁ బోయెదనో యని భయపడి పరమదుఃఖితయయి యుండినది. ౩౩

[అంతఁ బ్రయాణోన్ముఖుఁడనైన నన్ను జూచి సీతమ్మ వానరోత్తమా! నీవు చాల పుణ్యవంతుఁడవు. మహాబాహుఁడగు రాముని నామఱఁది లక్ష్మణుని జూడఁగల్గితివి; అని పలికెను. అంత నేను అమ్మా! నావీఁపుపై నెక్కుదవేని ఇప్పుడే క్షణములోఁ దీసికొనిపోయి రామలక్ష్మణులను వానరరాజగు సుగ్రీవుని జూపెదను. అనఁగానే నాయనా! నేను పరపురుషు నంటుదానను గాను. కావున నీపై స్వతంత్రముగా నెక్కి రానొల్లను. అది ధర్మము కాదు. రావణునిచేతఁ బడినప్పుడుమాత్ర మిఁక వేఱువిధిలేదు; గావున కాలమునకుఁ గట్టువడితిని. నీవొక్కఁడవే పోయి యారాచకొమారులకు నాయథాస్థితి నెఱిఁగింపుము.]

హనుమంతుఁడా! సింహసమానులగు నారామలక్ష్మణుల కిద్దఱకును సుగ్రీవునకును అతనిమంత్రులకును అందఱకును ఆరోగ్యంబుఁ జెప్పుము. ౩౪

మహాబాహుండగు రాముండు న న్నీదుఃఖసముద్రమునుండి కడ తేర్చునట్లు నీవుపోయి ప్రయత్నము సేయవలయును. ౩౫

వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీవు రామునియొద్దకుఁ బోయి నంతనే తీక్ష్ణంబయిన యీనాదుఃఖంబును, రాక్షసులు నన్ను బెదరించుటయుం నీవు రామునకుఁ జెప్పవలయును. అని సీతాదేవి నాతోఁ జెప్పినది. ౩౬

రాజరాజశ్రేష్ఠుఁడవగు రాముఁడా! పూజ్యురాలగు సీతాదేవి యీ ప్రకారంబు నీకుం జెప్పుమని దుఃఖంబునం జెప్పెను. నేను జెప్పినగుఱుతుల

పూర్వమ్, ఏతచ్చ బుద్ధ్వా గదితం మయా త్వం శ్రద్ధత్స్వ
సీతాం కుశలాం సమగ్రామ్. ౩౭

ఇతి శ్రీమత్సున్దరకాణ్డే - సప్తషష్టితమస్సర్గః.

---

## అష్టషష్టితమస్సర్గః

అథాహముత్తరం దేవ్యా పునరుక్తస్ససంభ్రమః,
తవ స్నేహాన్నరవ్యాఘ్ర సౌహార్దాదనుమాన్య వై. ౧

ఏవం బహువిధం వాచ్యో రామో దాశరథిస్త్వయా,
యథా మామాప్నుయాచ్ఛీఘ్రం హత్వా రావణమాహవే.
యది వా మన్యసే వీర వసైకాహ మరిందమ,
కస్మింశ్చిత్సంవృతే దేశే విశ్రాంతశ్శ్వో గమిష్యసి. ౩

మమ చాప్యల్పభాగ్యాయాస్సాన్నిధ్యాత్తవ వీర్యవన్,
అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యాద్విమోక్షణమ్. ౪

గతే హి త్వయి విక్రాంతే పునరాగమనాయ వై,
ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః. ౫
తవాదర్శనజశ్శోకో భూయో మాం పరితాపయేత్,
దుఃఖాద్దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీమ్. ౬

అయం చ వీర సందేహస్తిష్ఠతీవ మమాగ్రతః,
సుమహాంస్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర. ౭
కథం ను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిం,
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ. ౮

నాలోచించి నేను జెప్పినట్లు సీత యన్నివిధంబులను క్షేమంబుగా నున్న దని
నమ్ముము.

ఇది యఱువదియేడవ సర్గము.

## అఱువదియెనిమిదవ సర్గము

పురుషశ్రేష్ఠుండవగు రామునా! అంత సీతాదేవి నీకు నాయం
దెచ్చుగా స్నేహం బుండుటవలనను నేను యథార్థంబుగా సాహాయ్యంబు
చేయుదునను నమ్మకంబువలనను బ్రయాణంబునకై త్వరపడుచున్న నన్నుం
జూచి యింకఁ జేయవలసినకార్యముంగూర్చి యిట్లని చెప్పెను. ౧

దశరథునిపుత్రుండగు రాముండు యుద్ధంబున రావణుం జంపి నన్ను
శీఘ్రంబుగాఁ బొందునట్లు నీవు నానావిధంబులుగా నతనికిఁ జెప్పవలయును.

శత్రువుల నడంగఁద్రొక్కునట్టి పరాక్రమవంతుఁడవగు హనుమం
తుఁడా! నీ కిచ్చయుండునేని యిచ్చో నొకదిన ముండుము. ఎచ్చటనేని
యొకరహస్యప్రదేశంబున విశ్రమించి రేపు పోఁగలవు. ౩

పరాక్రమవంతుఁడవగు హనుమంతుఁడా! అట్లు నీ విచ్చట నొకదినం
బుండువేని నీసహవాసమువలన మందభాగ్యురాల నగు నాకును గొంచెము
సేపు దుఃఖశాంతియగును. ౪

పరాక్రమశాలివగు నీవు పునరాగమనంబునకై పోఁగానే నాప్రాణం
బులు పోయినను బోవును. ఇందుకు సందియము లేదు. ౫

మొదలే రామవియోగదుఃఖంబునొంది పరితపించుచు దీనురాలనై
యీరాక్షసులచే బాధింపఁబడుచున్న నే నింక నిన్నుం జూడకుండునేని
మఱియుం దుఃఖంబు నొందుదును. ౬

పరాక్రమశాలివి వానరశ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! నీసహాయు
లగు ఋక్షవానరుల విషయమై నా కొక గొప్పసందేహం బున్నది. ౭

ఋక్షవానరులు దాఁటఁగూడని యీమహాసముద్రంబు నెట్లు దాఁటు
దురు? రాజపుత్రులగు రామలక్ష్మణులయినను ఎట్లు దాఁటఁగలరు? ౮

త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే,
శక్తిస్స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా. ౯
తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే,
కిం పశ్యసి సమాధానం బ్రూహి కార్యవిదాంవర. ౧౦

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే,
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే బలోదయః. ౧౧
బలైస్సమగ్రైర్యది మాం హత్వా రావణమాహవే,
విజయీ స్వాం పురీం రామో నయేత్తత్స్యాద్యశస్కరమ్.

యథాఽహం తస్య వీరస్య వనాదుపధినా హృతా,
రక్షసా తద్భయాదేవ తథా నార్హతి రాఘవః. ౧౩

బలైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః,
మాం నయేద్యది కాకుత్స్థస్తత్తస్య సదృశం భవేత్. ౧౪
తద్యథా తస్య విక్రాంత మనురూపం మహాత్మనః,
భవత్యాహవశూరస్య తథా త్వ ముపపాదయ. ౧౫
తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితం,
నిశమ్యాహం తతశ్శేషం వాక్యముత్తరమబ్రువమ్. ౧౬
దేవి హర్యృక్షసైన్యానామీశ్వరః ప్లవతాంవరః,
సుగ్రీవస్సత్త్వసంపన్నస్తవార్థే కృతనిశ్చయః. ౧౭
తస్య విక్రమసంపన్నాస్సత్త్వవంతో మహాబలాః,
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయస్స్థితాః. ౧౮
ఏషాం నోపరి నాధస్తాన్న తిర్యక్సజ్జతే గతిః,
న చ కర్మసు సీదంతి మహత్స్వమితతేజసః. ౧౯

గరుత్మంతునకును, నీకును, వాయువునకును మీముగ్వురకే యీ సముద్రము దాఁటుటకు శక్తియున్నది గాని మఱి యెవ్వరికిని లేదు. ౯

పరాక్రమశాలివి, కార్యంబుఁ దెలిసినవారలలోఁ శ్రేష్ఠుండవగు హనుమంతుఁడా! అట్టు అసాధ్యంబగు కార్యంబును సాధించుటకు నీ వేమి యుపాయం బూహించియున్నావు? చెప్పుము. ౧౦

శత్రువీరులం జంపునట్టి హనుమంతుఁడా! నీకార్యసాధనశక్తి యద్భుతంబయినది. కావున నీకార్యంబు సాధించుటకు నీవొక్కండవె చాలుదువు.

రాముఁడు వానరసైన్యములతోఁ గూడ వచ్చి యుద్ధంబున రావణుం జంపి జయంబునొంది నన్నుఁ దనపట్టణంబునకుం గొనిపోవు నేని యది నాకును ఆతనికిఁ గీర్తికరంబగును. ౧౨

రావణుఁడు పరాక్రమవంతుఁడగు రామునిభార్య నగు నన్ను వనంబున నుండి రామభయంబునఁ గపటంబుగా నపహరించుకొనివచ్చినట్టు రాముండు నన్ను రహస్యముగాఁ దీసికొనిపోవుట యెంతమాత్రము యుక్తముకాదు. ౧౩

శత్రుసైన్యంబులం జంపునట్టి రాముఁడు లంకయంతయు సైన్యంబుల నిండించి నన్నుఁ గొనిపోవునేని యది యతనికి సదృశంబుగా నుండును. ౧౪

అందువలన మహాపరాక్రమశాలియు యుద్ధప్రియుఁడు నగు నా రాముఁడు తనపరాక్రమంబున కనురూపంబుగాఁ బరాక్రమించునట్లు నీవొనగూర్పవలయును. ౧౫

అధికార్థమును యుక్తియుక్తంబును వినయోపపన్నంబు నగు నా మాటను విని నేను ఇట్లని బదులు చెప్పితిని. ౧౬

సీతాదేవీ! ఋక్షవానరాధీశ్వరుండును వానరశ్రేష్ఠుండును బలవంతుండు నగుసుగ్రీవుండు నీకార్యంబు సాధింప నిశ్చయించియున్నాఁడు. ౧౭

పరాక్రమవంతులును శక్తిమంతులును బలవంతులు మనసునకుంబోలె వేగముగలవారలు నగువానరు లనేకులు ఆసుగ్రీవుని చేతిక్రిందనున్నారు. ౧౮

ఆవానరులు ఆకాశమార్గంబునఁ గాని పాతాళమార్గంబునఁ గాని తిర్యఙ్మార్గంబునంగాని యడ్డములేక సంచరింపఁగలరు. మఱియు నెట్టిగొప్ప కార్యంబునైనను ఎంతమాత్రము శ్రమలేక చేయంగలరు. ౧౯

అసకృత్తై ర్మహాభాగై ర్వానరై ర్బలదర్పితైః,
ప్రదక్షిణీకృతా భూమిర్వాయుమార్గానుసారిభిః. ౨౦
మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః,
మత్తః ప్రత్యవరః కశ్చి న్నాస్తి సుగ్రీవసన్నిధౌ. ౨౧

అహం తావదిహ ప్రాప్తః కిం పున స్తే మహాబలాః,
నహి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్య న్తే హీతరే జనాః. ౨౨

తదలం పరితాపేన దేవి మన్యుర్వ్యపైతు తే,
ఏకోత్పాతేన వై లంకామేష్యంతి హరియూథపాః. ౨౩
మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యావివోదితౌ.
త్వత్సకాశం మహాభాగే నృసింహావాగమిష్యతః. ౨౪
అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవం,
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వారముపస్థితమ్. ౨౫
నఖదంష్ట్రాయుధాన్ వీరాన్ సింహశార్దూలవిక్రమాన్,
వానరాన్వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్. ౨౬
శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు,
నర్దతాం కపిముఖ్యానామచిరాచ్ఛ్రోష్యసి స్వనమ్. ౨౭

నివృత్తవనవాసం చ త్వయా సార్ధమరిందమం,
అభిషిక్తమయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్. ౨౮
తతో మయా వాగ్భిరదీనభాషిణా శివాభిరిష్టాభిరభిప్రసాదితా,
జగామ శాంతిం మమ మైథిలాత్మజా తవాపి శోకేన సదాభిపీడితా

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే సున్దరకాణ్డే
అష్టషష్టితమస్సర్గః, సమాప్తశ్చాయం సున్దరకాణ్డః.

మహాభాగులును బలదర్పితులు నగునావానరులు ఆకాశంబున సంచరించుచు భూమికంతయుఁ బలుమాఱులు ప్రదక్షిణంబు గావించిరి. ౨౦

అచ్చట సుగ్రీవుని యొద్దనుండు వానరులందుఁ గొందఱు నాకన్న నధికులును గొందఱు నాకు సమానులుగా నున్నారు. ఒక్కఁడైనను నాకుఁ దక్కువయినవాఁడు లేఁడు. ౨౧

నేనే యిచ్చటికి వచ్చినానే యింక బలవంతులగు నా వానరులు రాఁగలరని చెప్పనేల? ఎచ్చటికైన బంపవలసి యున్నప్పుడు ఉత్తములం బంపరు. తక్కువయినవారలనె పంపుదురు. ౨౨

సీతాదేవీ! నీవు పరితపింపవలదు. దుఃఖంబు విడువుము. వానరు లిచ్చటికి ఒక్కయొగురున వచ్చి చేరుదురు. ౨౩

మహాభాగురాల వగుసీతాదేవీ! పురుషశ్రేష్ఠులగు నారామలక్ష్మణులును నావీఁపుపై నెక్కి చంద్రసూర్యు లుదయించినట్లు నీయొద్దకు రాఁగలరు.

శత్రువులఁజంపువాఁడును సింహసమానుండు నగురాముని ధనుర్ధరుండై లంకాద్వారంబుననున్న లక్ష్మణుని నీవు శీఘ్రంబునం జూడఁగలవు. ౨౪

నఖదంతంబులే యాయుధంబులుగాఁ గలవారలును సింహశార్దూలంబులకుంబోలెఁబరాక్రమంబుగలవారలునుగజేంద్రంబుల కాంతివంటికాంతిగలవారలునగునావానరులు శీఘ్రంబుగా లంకయందుఁజేరియుండుటం జూడఁగలవు.

ఇంక శీఘ్రంబుగనే లంకామలయంబునందలి సానువులయందు సింహనాదంబులు సేయుచున్న మేఘాకారులును పర్వతాకారులునగు వానరుల ధ్వనులు నీకు వినవచ్చును. ౨౫

ఇంక శీఘ్రంబుగానే వనవాసవ్రతంబు నెఱవేర్చుకొని నీతోఁగూడ నయోధ్యయందుఁ బట్టాభిషిక్తుఁడైయున్న శత్రుహంతయగురాముం జూడఁగలవు. అని సీతాదేవికిం జెప్పితి. ౨౬

అంత నీవు సీతావియోగంబున మిక్కిలి దుఃఖంబు నొందియున్నావని నావలననివిని సీతాదేవి మిక్కిలి దుఃఖపడఁగా నేను దుఃఖంబు పోవునట్లు ప్రియకరంబులగు మంచిమాటలంజెప్పి యాబిడదుఃఖంబుఁ బోఁగొట్టితిని! ౨౭

ఇది యఱువదియెనిమిదవ సర్గము.

సుందరకాండము సమాప్తము.

# ద్వాదశోపనిషత్తులు

## ఆంధ్ర వచనము

బ్రహ్మశ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రుల వారిచే ఆంధ్రీకృతము

వేదవ్యాసమహామునిచే ఋగ్యజుస్సామాథర్వములను నాలుగు వేదము లందుగల జ్ఞానకాండమును ఉపనిషత్తులను పేర ప్రత్యేకముగా విభజింపబడి 108 ఉపనిషత్తులుగా వ్యవహరింపబడుచున్నప్పటికిని యింకను పెక్కు ఉపనిషత్తులు ప్రచారమునందున్నవి.

పైన చెప్పిన 108 ఉపనిషత్తులలో మిక్కిలి ప్రసిద్ధములైనవి దశోపనిషత్తులు. అవి ఏవనగా: 1. ఈశ, 2. కేన, 3. కఠ, 4. ప్రశ్న, 5. ముండక, 6. మాండూక్య, 7. తైత్తిరీయ, 8. ఐతరేయ, 9. ఛాందోగ్య, 10. బృహదారణ్యకము.

ప్రస్థానత్రయ మనఁబడు ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీతలు అను నీమూడింటికిని భాష్యములను రచియించిన శ్రీమదాదిశంకరాచార్యస్వాములవారు "శ్వేతాశ్వతరోపనిషత్తు, నృసింహతాపిన్యుపనిషత్తు" అను నీరెంటికిని భాష్యమును రచియించి యున్నారు.

సకల జనులకు వేదాంత విద్యయందు అభిరుచి కలుగజేయు వలెనను తలంపుతో ఆదిశంకరులవారి భాష్యముననుసరించి దశోపనిషత్తులతోబాటు శ్వేతాశ్వతరోపనిషత్తు, నృసింహతాపిన్యుపనిషత్తులకు సైతము సుబోధకముగు విధముగా ఆంధ్ర వచనమున వావిళ్ల రామస్వామి శాస్త్రులవారు రచన గావించిన యీ గ్రంథ తొలి ముద్రణ 1921 సం॥లో గావింపబడి తదుపరి మూడు పర్యాయములు పునర్ముద్రణ గావింపబడినది.

మహనీయులచే కొనియాడబడిన యీ గ్రంథము అలభ్యమైనందునను, అనేకులు యీ గ్రంథ ప్రతులకై ఆసక్తి కనబరచినందున యీ గ్రంథము మరల పునర్ముద్రింపబడినది.

పుటలు - 8+328 ధర రూ.120/- పోస్టేజీ ప్రత్యేకము